# PŌTANA BHĀGAVATAṂ - ALAṄKĀRA ŚILPAṂ

DOCTOR OF PHILOSOPHY


*Researcher*

**GOTTE SRINIVASA RAO**

*Supervisor*

**Dr. PILLALAMARRI RAMULU**

DEPARTMENT OF TELUGU
SCHOOL OF HUMANITIES
UNIVERSITY OF HYDERABAD
HYDERABAD


JULY 2004

# పోతన భాగవతం - అలంకార శిల్పం

1102

పరిశోధకుడు

**గొట్టె శ్రీనివాసరావు**

పర్యవేక్షకులు

**డా. పిల్లలమర్రి రాములు**

**పి హెచ్.డి. పట్టం కొరకు హైదరాబాద్ విశ్వవిద్యాలయం**

**తెలుగు విభాగానికి సమర్పించిన**

**సిద్ధాంత వ్యాసం**

**జులై 2004**

Department of Telugu,
School of Humanities,
University of Hyderabad,
Hyderabad - 500 046.

Date : 28th July 2004

# DECLARATION

This is to certify that I, GOTTE SRINIVASA RAO have carried out this research work embodied in the present dissertation for the full period prescribed under Ph.D. Ordinances of the University. My topic for the Ph.D. programme is "PŌTANA BHĀGAVATAṂ - ALAṄKĀRA ŚILPAṂ". I declare to the best of my knowledge that no part of the dissertation was earlier submitted for the award of any research degree of any University or Institution.

G. Srinivasa Rao

**GOTTE SRINIVASA RAO**
Regn. No.99HTPH01

Head
Department of Telugu

HEAD
Department of Telugu
University of Hyderabad
Hyderabad-500 046.

Dr. Pillalamarri Ramulu
Supervisor

Probal D. 3.8.04

Dean
School of Humanities
University of Hyderabad.

DEAN
SCHOOL OF HUMANITIES
UNIVERSITY OF HYDERABAD
HYDERABAD-500 046

# కృతజ్ఞతలు


'పోతన భాగవతం - అలంకారశిల్పం' అనే అంశంపై పరిశోధన చేయుటకు అంగీకరించిన హైదరాబాదు విశ్వవిద్యాలయం తెలుగుశాఖకు,

పరిశోధనకు విలువైన సలహాలిచ్చిన పర్యవేక్షకులు - ఆచార్య రవ్వా శ్రీహరిగారికి, డా॥ పిల్లలమఱ్ఱి రాములు గారికి,

తెలుగుపై నాకు ఆసక్తి పెరుగుటకు కారకులైన తెలుగుశాఖ అధ్యాపకవర్గం - ఆచార్య పరిమి రామనరసింహం గారికి, ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం గారికి, ఆచార్య కె.కె. రంగనాథాచార్యులు గారికి, ఆచార్య ఎమ్. వీరభద్రయ్య గారికి, డా॥ ఎన్. శ్రీరామరాజు గారికి, డా॥ శరత్ జ్యోత్స్నారాణి గారికి, డా॥ జి. అరుణకుమారి గారికి,

నేను పెద్ద చదువులు చదవడానికి అన్ని విధాలా సహకరించిన - తల్లిదండ్రులు జానమ్మ, రామకృష్ణయ్యలకు, అక్కయ్యలు - నాగరత్నం, లక్ష్మీనరసమ్మ, నాగమ్మ, చెల్లెళ్ళు - లలిత, అరుణ, రమణ, తమ్ముడు - మధు, కుమారుడు రాధాకృష్ణ లకు,

నా పరిశోధనా కార్యమున సర్వవిధాలా శ్రమించిన నా హృదయేశ్వరి, అర్ధాంగి జ్యోత్స్నాదేవికి,

నా పరిశోధన కార్యానికి సహకరించిన ప్రమీలాదేవి, మల్లేశ్ గారు, అనురాధ, ప్రసన్న, ప్రసాద్ లకు

నా పరిశోధన కార్యానికి సహాయమందించిన అందరికి -

**నా హృదయపూర్వక కృతజ్ఞతలు**

# అంకితం

# శ్రీరాధాకృష్ణులకు

## సంకేత పదసూచి

| | |
|---|---|
| భాగ. 10. పూర్వ - 108 ... | శ్రీమహాభాగవతము దశమ స్కంధము పూర్వ భాగములోని 108వ పద్యం. |
| భాగ. 5 - ప్ర - 66 | శ్రీమహాభాగవతము పంచమ స్కంధము ప్రథమాశ్వాసం లోని 66వ పద్యం. |

# విషయ సూచిక


| | పుట |
|---|---|
| **1. ఉపోద్ఘాతం** | **1-4** |
| 1.0 | 1 |
| 1.1 ప్రస్తావన | 1 |
| 1.2 శ్రీమహాభాగవతం - పరిచయం | 1 |
| 1.3 పరిశోధన పరిధి | 3 |
| 1.4 పరిశోధన లక్ష్యం | 4 |
| **2 భారతీయాలంకార దర్శనం** | **5-34** |
| 2.0 | 5 |
| 2.1 భారతీయాలంకారికులు: అలంకార శాస్త్రములు | 5 |
| 2.2 కావ్యప్రయోజనాలు | 6 |
| 2.3 రసానందానుభూతి | 6 |
| 2.4 రసనిష్పన్న కార్యమున కవిపాత్ర | 8 |
| 2.5 రసనిష్పన్న కారక కవితాద్రవ్యములు : విశ్లేషణ | 8 |
| 2.5.0 కావ్య స్వరూపం | 8 |
| 2.5.1 రసం | 9 |
| 2.5.2 ఇతివృత్తము | 10 |
| 2.5.3 శబ్దము | 10 |
| 2.5.3.1 శబ్దాలంకారాలు | 11 |
| 2.5.3.2 గుణాలు | 11 |
| 2.5.3.3 రీతులు | 12 |
| 2.5.3.4 శయ్య | 12 |
| 2.5.4 అర్థము | 12 |
| 2.5.4.1 పాకము | 12 |
| 2.5.4.2 అర్థవృత్తులు | 13 |
| 2.5.4.3 అనుమానము | 13 |
| 2.5.4.4 ఔచిత్యము | 13 |
| 2.5.4.5 వాచ్య, లక్ష్య, వ్యంగ్యములు | 14 |
| 2.5.4.6 వక్రోక్తి | 14 |
| 2.5.4.7 అర్థాలంకారములు | 14 |
| 2.5.5 కవితాద్రవ్యములు | 15 |
| 2.5.6 మౌలిక కవితా ద్రవ్యములు | 15 |
| 2.5.6.1 రసోపస్కారముగా మార్పులు చేసిన ఇతివృత్తము | 15 |

2.5.6.2 శబ్దము (నాదగుణము) 15
2.5.6.3 శబ్దార్థద్వయము 15
2.5.6.4 అర్థము 16
2.5.6.5 ఉపమాన ప్రాతినిధ్యము 16
2.5.7 కవికర్మ : రసోదయము (పట్టిక) 17
2.6 అలంకారములు 18
2.6.0 18
2.6.1 అలంకార సిద్ధాంత పరిణామం : పూర్వరంగం 18
2.6.2 అలంకార సంప్రదాయం 19
2.6.3 అలంకారాల స్థానం 21
2.6.4 అలంకారాలు : వ్యుత్పత్తి 22
2.6.5 అలంకారాలు : నిర్వచనాలు 23
2.6.6 అలంకార తత్త్వ వివేచన 23
2.6.6.1 శబ్దాలంకార తత్త్వవివేచన 24
2.6.6.2 శబ్దార్థాలంకార తత్త్వవివేచన 24
2.6.6.3 అర్థాలంకార తత్త్వవివేచన 25
2.6.7 అలంకార ప్రయోజనాలు 25
2.6.8 అలంకారాలు - ఇతర కవితా ద్రవ్యాలు - సామ్యభేదాలు 25
2.6.9 సకల కావ్య విలువల రత్నాకరం అలంకారం 27
2.6.10 అలంకారౌచిత్యం 27
2.6.11 అలంకార శిల్పం 28
2.6.12 బీజభూతాలంకారులు 28
2.6.13 అలంకారాల సంఖ్య - వర్గీకరణ 29
**3 శబ్దాలంకార శిల్పం** **35-54**
3.0 35
3.1 శబ్దాలంకారాలు - నిర్వచనాలు 35
3.2 శబ్దాలంకారాలు - తప్పనిసరి నిబంధనలు 35
3.3 శబ్దాలంకారాలు - లాక్షణికుల చిన్నచూపు 35
3.4 శబ్దాలంకారాలు - రస నిష్పన్నత 36
3.5 శబ్దాలంకారాల ప్రయోజనాలు 36
3.6 శబ్దాలంకారాల పరిధి - అతివ్యాప్తి, అవ్యాప్తి 36
3.6.1 శబ్దాలంకారాల అన్నింటి పరిధి - అతివ్యాప్తి, అవ్యాప్తి 36
3.6.2 ఒక్కొక్క శబ్దాలంకారం పరిధి - అతివ్యాప్తి, అవ్యాప్తి 37
3.7 శబ్దాలంకారాలు ఏర్పడే పద్ధతులు 40
3.8 శబ్దాలంకారాల లక్షణాలు 40

3.9 శబ్దాలంకారాల వర్గీకరణ 42
3.10 శబ్దాలంకారాలు - పోతన భాగవతంతో అన్వయం 42
3.10.1 విరూపాక్షరావృత్తి (శ్రుత్యనుప్రాస) 42
3.10.2 స్వరావృత్తి 44
3.10.3 వ్యంజనావృత్తి (వృత్త్యనుప్రాస, ఛేకానుప్రాస) 44
3.10.4 అక్షరావృత్తి (వృత్యనుప్రాస, చిత్రాలంకారము) 47
3.10.5 పదాంశావృత్తి (ఛేక, యమకం) 49
**4 శబ్దార్థాలంకార శిల్పం** **55-72**
4.0 55
4.1 శబ్దార్థాలంకారం - నిర్వచనం 55
4.2 శబ్దార్థాలంకారాలు - రసనిష్పన్నత 55
4.3 శబ్దార్థాలంకారాల ప్రయోజనాలు 55
4.4 శబ్దార్థాలంకారాల పరిధి - అతివ్యాప్తి, అవ్యాప్తి 55
4.4.1 శబ్దార్థాలంకారాల అన్నింటి పరిధి - అతివ్యాప్తి, అవ్యాప్తి 55
4.4.2 ఒక్కొక్క శబ్దార్థాలంకారం పరిధి -అతివ్యాప్తి, అవ్యాప్తి 56
4.5 శబ్దార్థాలంకారాలు ఏర్పడే పద్ధతులు 57
4.6 శబ్దార్థాలంకారాల వర్గీకరణ 58
4.7 శబ్దార్థాలంకారాలు - పోతన భాగవతంతో అన్వయం 58
4.7.1 పదాంశపదావృత్తి 58
4.7.2 పదావృత్తి - సమానార్థకం - భిన్నార్థకం 59
4.7.3 శ్లేష 63
4.7.4 కాకువు 65
4.7.5 ప్రహేళిక 66
4.7.6 పునరుక్తవదాభాస 67
4.7.7 నిరుక్తి 67
4.7.8 పదబంధంలోని పదావృత్తి 68
4.7.9 పదసంబంధావృత్తి 69
4.7.10 వాక్యావృత్తి 70
**5 అర్థాలంకార శిల్పం** **73-175**
5.0 73
5.1 అర్థాలంకారాలు - నిర్వచనాలు 73
5.2 అర్థాలంకారాలకు లాక్షణికులు పెద్దపీట వేయుట 73
5.3 అర్థాలంకారాలు - నిబంధనలు 73
5.4 అర్థాలంకారాలు - రసనిష్పన్నత 74
5.5 అర్థాలంకార తత్త్వవివేచన 74

5.6 అర్థాలంకారాల ప్రయోజనాలు 74
5.7 అర్థాలంకారాల పరిధి - విశ్లేషణ 74
5.8 అర్థాలంకారాల వర్గీకరణ - సమీక్ష 74
5.9 అర్థాలంకారాలు - పోతన భాగవతంతో సమన్వయం 76
1. ఉపమ 76
2. అసమ 94
3. ఉత్ప్రేక్ష 95
4. సందేహ 101
5. భ్రాంతిమత్ 103
6. రూపకం 105
7. పరిణామ 113
8. అపహ్నుతి 114
9. మీలిత 116
10. ఉల్లేఖ 117
11 వ్యతిరేక 118
12. ప్రతీప 119
13. అర్థాంతరన్యాస 121
14. ఉభయన్యాస 123
15. అర్థాపత్తి 124
16. తుల్యయోగిత 126
17. దీపక 128
18. దృష్టాంత 130
19. నిదర్శన 132
20. ప్రతివస్తూపమ 134
21. అతిశయోక్తి 136
22. అత్యుక్తి 138
23. ఉదాత్త 139
24. సార 140
25. మాలాదీపకం 141
26. వ్యాజస్తుతి 141
27. వ్యాజనింద 143
28. ఆక్షేప 145
29. పర్యాయ 146
30. సమాసోక్తి 147
31. ముద్ర 149
32. లేశ 149

33. పరికర 150

34. పరికరాంకుర 151

35. కావ్యలింగ 152

36. విశేషోక్తి 153

37. విభావన 155

38. విషమ 156

39. సమ 157

40. కారణమాల 158

41. అసంభవ 159

42. సముచ్చయ 159

43. విచిత్ర 160

44. అనుకూల 161

45. అనుజ్ఞ 162

46. పరివృత్తి 162

47. స్వభావోక్తి / జాతి 163

48. సహోక్తి 166

49. వినోక్తి 167

50. అధిక 168

51. ఏకావళి 169

52. యథాసంఖ్య/క్రమ 170

53. సంభావన 172

54. ఆశీస్సు 172

55. అభావ 173

56. విరోధాభాస / విరోధ 174

**6 మిశ్రాలంకార శిల్పం 176-180**

6.1 మిశ్రాలంకారాలు - స్థానం 176

6.2 మిశ్రాలంకారాల సంఖ్య 176

6.3 మిశ్రాలంకారాలు - నిర్వచం 176

6.4 మిశ్రాలంకారాలు - వర్గీకరణ 176

6.5 మిశ్రాలంకారాలు - విశ్లేషణ 176

6.6 మిశ్రాలంకారాల నిర్మాణం 177

6.7 మిశ్రాలంకారాలు - పోతన భాగవతంతో అన్వయం 177

1. ఉపమ - రూపక 177

2. ఉపమ - ఉత్ప్రేక్ష 177

3 ఉపమ - సార 178

4. ఉపమ - క్రమ 178
5. ఉపమ - వినోక్తి - కాకువు - అభావ 178
6. ఉపమ - శ్లేష - ప్రతీప - ముక్తపదగ్రస్తం 179
7. రూపక - ఉత్ప్రేక్ష 179
8. రూపక - శ్లేష 179
9. రూపక - అర్థాంతర న్యాస 180

**7. గంగన భాగవత భాగం - అలంకార శిల్పం 181-185**

7.0 181
7.1 శబ్దాలంకారాలు 181
1. అక్షరావృత్త (అంత్యప్రాస) 181
2. యమకము 181
7.2 అర్థాలంకారాలు 181
1. ఉపమ 181
2. ఉత్ప్రేక్ష 182
3. రూపకం 182
4. అర్థాంతరన్యాస 182
5. అర్థాపత్తి 182
6. స్వభావోక్తి 183
7. దీపకం 183
8. సార 184
9. యథాసంఖ్య/క్రమ 184
10. విభావన 184
11. అపహ్నుతి 184

**8. సింగన భాగవత భాగం - అలంకార శిల్పం 186-191**

8.0 186
8.1 శబ్దాలంకారాలు 186
1. వృత్త్యనుప్రాస 186
8.2 శబ్దార్థాలంకారాలు 186
1. పదాంశ - పదావృత్తి (యమకం) 186
2. వ్యవధాన - సమానార్థక - పదావృత్తి 186
3. వ్యవధాన - భిన్నార్థక - పదావృత్తి 187
4. అవ్యవధాన - భిన్నార్థక - పదావృత్తి 187
5. అవ్యవధాన - సమానార్థక - పదావృత్తి (ముక్తపదగ్రస్తం) 187
8.3 అర్థాలంకారాలు 187
1. ఉపమ 187

2. ఉత్ప్రేక్ష 188
3. రూపకం 189
4. స్వభావోక్తి 189
5. అతిశయోక్తి 190
6. అర్థాంతరన్యాస 190
7. దీపక 190
8. నిదర్శన 190
9. సహోక్తి 191
10. సార 191

**9 నారయ భాగవత భాగం - అలంకార శిల్పం 192-194**

9.0 192
9.1 శబ్దాలంకారాలు 192
1. వృత్త్యనుప్రాస (అంత్యప్రాస) 192
9.2 శబ్దాలంకారాలు 192
1. పదాంశావృత్తి (యమకం) 192
9.3 అర్థాలంకారాలు 192
1. ఉపమ 192
2. రూపకం 193
3. స్వభావోక్తి 193
4. సార 193
5. సంభావన 194
6. అర్థాపత్తి 194

**సింహావలోకనం 195**

**ఉపయుక్త గ్రంథసూచి** 196-198

# I

# ఉపోద్ఘాతం

**1.0** **శ్రీ** కైవల్య పదము చేరుటకునై చింతించువారికోసం భాగవత రూపమున అమృతాన్ని అందించిన మహాభక్తకవీశ్వరుడు పోతన. వీరి కాలం స్థూలంగా 15వ శతాబ్దం. వీరి జన్మస్థలం విషయంలో పండితులలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. వీరి జన్మస్థలం 'బమ్మెర' అని కొందరు, 'ఒంటిమిట్ట' అని కొందరు అభిప్రాయపడ్డారు. 'ఒంటిమిట్ట' అని వాదించే వారిలో కొందరు వరంగల్లు జిల్లాలోని ఒంటిమిట్ట అని, కొందరు కడప జిల్లాలోని ఒంటిమిట్ట అని వాదిస్తారు. పరిశోధకుల్లో చాలాకాలం వాదోపవాదాలు జరిగాక 'బమ్మెర'ను అతడి జన్మస్థలంగా అంగీకరించారు. ఈ బమ్మెర అనే గ్రామం నేటి వరంగల్ జిల్లాలోని జనగామకు సమీపంలో ఉంది. పోతనగారి జన్మస్థలం బమ్మెర అయినా నివాసస్థలం ఏకశిలా నగరం (వరంగల్). జన్మస్థలమైన బమ్మెర వీరికి ఇంటి పేరుగా మారింది. పోతన కౌండిన్యసగోత్రుడు, ఆపస్తంబసూత్రుడు, తండ్రి కేసన, తల్లి లక్కమాంబ అని భాగవత ప్రారంభంలో గ్రంథకర్తృ వంశవర్ణనలో చెప్పబడింది (భాగ. 1-22). పోతన ఒక పేదరైతు. ఇతని బిరుదు 'సహజ పండితుడు'. ఇతని కులగురువు ఇవటూరి సోమనారాధ్యుడు (చూ. భాగ. పీఠిక:13). ఇతడు ఋషి, ద్రష్ట, స్రష్ట. ఇతడు మూడవ సింగభూపాలుని (1405-1475) ఆస్థానంలో కొంత కాలం ఉన్నట్లుగా తెలుస్తుంది. కవిసార్వభౌముడైన శ్రీనాథునికి పోతన సమకాలికుడే గాక దగ్గరి బంధువు అనే అభిప్రాయం లోకంలో ప్రచలితంగా ఉంది.

పోతన కృతులు- 1) నారాయణ శతకం, 2) వీరభద్రవిజయం, 3) భోగినీదండకం, 4) శ్రీమహాభాగవతం.

నేను ప్రస్తుతం పరిశోధనకు ఎన్నుకున్న గ్రంథం శ్రీమహాభాగవతం.

## 1.1. ప్రస్తావన

నాకు చిన్ననాటి నుండే పోతన గారంటే ఏదో తెలియని అభిమానం. సాక్షాత్తు సీతాసమేతుడైన శ్రీరాముడే ప్రత్యక్షమై భాగవతాన్ని వ్రాయమంటే వ్రాశాడని, అలవైకుంఠ పురంబులో.... పద్యం శ్రీరాముడే స్వయంగా వ్రాశాడని, పేదరికంలో మ్రగ్గుతున్నా, సింగభూపాలుని శాసనాన్ని కూడా ధిక్కరించి, భాగవతాన్ని భగవంతునికే అంకితమిచ్చాడని, సరస్వతీ సాక్షాత్కారం కూడా అతనికి కలిగిందని, సింగభూపాలుని సైన్యం భాగవతాన్ని బలవంతంగా తీసుకొని పోవడానికి వస్తే ఆంజనేయుడే ఆసైన్యాన్ని త్రిప్పికొట్టాడని, ఆనోటా ఈనోటా విన్నప్పటినుండి నాకు భాగవతం పై తెలియని ఆసక్తి ఏదో కలుగసాగింది. విద్యాగంధం లేనివారి నోట కూడా ఎన్నో భాగవత పద్యాలు పాడబడటం దానికి బలాన్నిచ్చింది. ఆ ఆసక్తి పోతన భాగవతంపై పరిశోధన చేయడానికి దారి తీసింది. అందునా భగవత్సాక్షాత్కారం చెందిన ఋషి అయిన కవి ఆవిష్కరించే ఉపమానాల సౌందర్యాన్ని దర్శించి విమర్శించేందుకు **"పోతన భాగవతం -అలంకారశిల్పం"** అనే అంశంపై పరిశోధన చేయాలన్న సంకల్పఫలమే ఈ సిద్ధాంత వ్యాసం.

## 1.2 శ్రీమహాభాగవతం-పరిచయం

బమ్మెర పోతన గారిచే చంపూ రూపమున ఆంధ్రంలో రచింపబడ్డ గ్రంథరాజం శ్రీమహాభాగవతం. దీనికి మూలం - సంస్కృతంలో వేదవ్యాసునిచే రచింపబడిన 18000 శ్లోకాలు గల శ్రీభాగవత పురాణం. పోతన భాగవతాన్ని 1476 వ సంవత్సరంలో వ్రాయుటకు ఉపక్రమించి 1480 వ సంవత్సరానికి పూర్తిచేశాడని తెలుస్తుంది. (శ్రీరామమూర్తి: 2). పోతన భాగవతాన్ని ఏకశిలా నగరంలోనే రాశాడు (భాగ. 1-21). భాగవతంలో 12 స్కంధాలు ఉన్నాయి. వీటిలో 1, 2, 3, 4, 7, 8, 9, 10 (మొత్తం 8 స్కంధాలు) పోతన ప్రణీతాలు. పోతన భాగవత భాగంలో మొత్తం గద్యపద్యాలు 7,914 కలవు. బొప్పరాజు గంగన 349 గద్యపద్యాలతో పంచమ స్కంధాన్ని, ఏల్చూరి సింగన 529 గద్యపద్యాలతో షష్ఠమ స్కంధాన్ని, వెలిగందల నారయ 178 గద్యపద్యాలతో (125+53) ఏకాదశ, ద్వాదశ స్కంధాలను రచించారు. వెరసి భాగవతంలోని గద్యపద్యాల సంఖ్య 8970. అంటే భాగవతం నలుగురి చేతుల మీదుగా పూర్తి అయింది. పోతనగారే పూర్తి భాగవతం వ్రాశాక, శిథిలమైన స్కంధాలను గంగన, సింగన, నారయ పూరించారని కొందరి వాదన కాగా, పోతనగారే తన శిష్యుల క్షేమం కోరి వారిచేత భాగవతం రచింప చేశాడని కొందరి భావన.

భాగవతం పురాణ ప్రక్రియకు చెందింది. పురాణమంటే "పురాభవమితి పురాణమ్" (శబ్దకల్పద్రుమము). "పురానవం భవతి పురాణం" (వాస్కనిరుక్తము) (చూ. సుబ్రమణ్యం:6) వ్యాసునిచే రచింపబడ్డ అష్టాదశ పురాణాల్లోని భాగవత పురాణం విష్ణుకథలను తెలిపే భాగవతమా? లేక దేవీ భాగవతమా? అనే విషయంలో పండితులలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. అయితే

'సత్యం పరంధీమహి' అను గాయత్రీ ప్రారంభం, వృత్రాసురవధ, దేనిలో చెప్పబడతాయో అది అష్టాదశ పురాణాల్లోనిదని చెప్పవచ్చు. ఈ విషయం పోతన భాగవత ప్రారంభంలో చెప్పాడు (భాగ. 1-33). కావున విష్ణు లీలలు గల ఈ భాగవతమే అష్టాదశ పురాణాల్లోనిది. 'పురాణం పంచలక్షణం' అన్నట్లు భాగవతానికి పంచలక్షణాలు, మరికొందరు చెప్పినట్లు దశలక్షణాలు కూడా ఈ భాగవతానికి వర్తిస్తాయి.

**పురాణం - పంచలక్షణాలు**

పురాణం పంచలక్షణంగా అమరకోశంలో ప్రస్తావితమైంది.

"సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశోమన్వంతరాణి చ
వంశాను చరితం చేతి పురాణం పంచలక్షణమ్" (చూ. జయరామశాస్త్రి: 2)

1) సర్గము = సృష్టి, 2) ప్రతిసర్గం = ప్రళయం, 3) వంశం = దేవదానవుల వంశాలు, 4) మన్వంతరాలు = 14 మంది మనువుల చరిత్రలు, 5) వంశానుచరితం = సూర్య చంద్రవంశాల చరితం అనే ఐదు లక్షణాలు కలది పురాణం.

**పురాణం - దశలక్షణాలు**

1) సర్గము = మహదహంకార తన్మాత్రేంద్రియ పంచమహాభూతసృష్టి.
2) విసర్గము = విరాట్పురుషుని నుండి చరాచర ప్రాణులు జనించుట.
3) స్థానము = భగవంతుడు ప్రాణుల మర్యాదను పాలించి అవతారాలెత్తి జగత్తును పాలించుట.
4) పోషణము = భగవంతుడు తన భక్తులను అనుగ్రహించుట.
5) ఊతులు = కర్మవాసనలు, కర్మలచే వృద్ధిపొందు పుణ్యాపాపవాసనలు.
6) మన్వంతరములు = 14 మనువుల చరిత్రలు వారనుష్ఠించిన ధర్మాలు,
7) ఈశాను కథలు = శ్రీహరి అవతారాలు, తద్భక్తుల చరిత్రలు సూర్యచంద్ర వంశజులగు రాజుల చరిత్రలు.
8) విరోధము = మహావిష్ణువు తన శక్తులతో కూడి యోగనిద్రను పొందుట. దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేయుట.
9) ముక్తి = అవిద్యోపాధి రూపమును త్యజించి స్వస్వరూపమున బ్రహ్మముగా ఉండు స్థితి.
10) ఆశ్రయము = సృష్టి స్థితి లయములు ఎవరి వలన కలిగినవో అతడు ఆశ్రయం. అంటే, అందరికి పరబ్రహ్మమే ఆశ్రయం. (జయరామశాస్త్రి:3) ఈ దశలక్షణాలు శ్రీమహాభాగవతంలో ఉన్నవి.

నవవిధ భక్తి మార్గాలు సోదాహరణంగా భాగవతంలో వివరింపబడ్డాయి. (చూ. భారతి మాసపత్రిక 1989. జనవరి - ఫిబ్రవరి)

పోతన భాగవతం వ్రాయడం తన పూర్వ జన్మ సహస్రసంచిత తపః ఫలంగా చెప్పుకున్నారు. ఇతడు శ్రీమన్నారాయణ కథా ప్రపంచ విరచనా కుతూహలుడై, ఒక రోజు పున్నమిరాత్రి, గంగ (గోదావరి)లో స్నానం చేసి, ఇసుక తిన్నెలపై కూర్చొని మహేశ్వరధ్యానం చేస్తుండగా సీతాసమేతుడైన శ్రీరాముడు ప్రత్యక్షమై 'మన్నామాంకితంబుగా శ్రీమహాభాగవతంబుఁ దెనుగు సేయుము నీకు భవ బంధంబులు దెగునని' (భాగ. 1-15) చెప్పాడు. ఆ ఆనందంలో రాముడు పలికిస్తే పలికాడు పోతన. పోతన స్కంధాది, స్కంధాంత పద్యాలు శ్రీరాముని పరంగా చెప్పినా, భాగవతాన్ని అంకితమిచ్చే షష్ఠ్యంత పద్యాలు, భాగవత ప్రథమ స్కంధ ప్రథమ పద్యం మాత్రం శ్రీకృష్ణుని పరంగానే చెప్పాడు. అంటే భాగవతాన్ని శ్రీకృష్ణునికి అంకిత మిచ్చాడన్నమాట. దీన్నిబట్టి పోతన దృష్టిలో శివునికి, రామునికి, కృష్ణునికి భేదంలేదని తెలుస్తుంది.

పోతన తన కవితా లక్షణాలను ఎక్కడా ప్రస్తావించలేదు. కానీ 'ఉభయకావ్యకరణ దక్షుండనై' (భాగ. 1. 10) అనీ,

*కొందఱికిఁ దెనుఁగు గుణమగుఁ*
*గొందఱికిని సంస్కృతంబు గుణమగు రెండున్*
*గొందఱికి గుణములగు నే*
*నందఱి మెప్పింతుఁ గృతుల నయ్యైయెడలన్* (భాగ. 1-18)

అని చెప్పాడు. తెలుగు, సంస్కృతం ఇష్టపడే వారందరినీ మెప్పిస్తానని మాత్రం చెప్పాడు.

"కావ్యప్రయోజనము జగద్ధితమని, దానిని సమగ్రతా మార్గమున సాధించుటకు ప్రకృష్టోపకారకమైన సాధనము

ఉభయకావ్యమే అనియు, అట్టి కావ్యరచనకు ఉభయకవి లక్షణ విశిష్టుడైన కవిమాత్రమే సమర్థుడని పోతన తాత్పర్యం." (సంపత్కుమారాచార్య: 64)

నన్నయ, తిక్కనాది కవులు భాగవతం తెనిగించకపోవడం, తన పూర్వ పుణ్యఫలం అంటారు పోతన. (చూ. భాగ. 1-19)

పోతన "ధారాశుద్ధి, నిర్దుష్టత, మాధుర్యము వగైరా గుణాలనుబట్టి చూస్తే యీ కవి సర్వధా నన్నయకు మించుతాడు గాని తగ్గడు" (వెంకటశాస్త్రి: 50) "పోతన్న సంస్కృతధారలో తిక్కన్న, యెఱ్ఱన్నగార్లకు మించుతాడు" (వెంకటశాస్త్రి: 51)

సృష్టిలోని లోకాలలో భూలోకమొక్కటే కర్మానుష్ఠాన లోకం. మిగిలినవి కర్మఫలానుభవ లోకాలు. భూలోకంలో మానవునిగా పుట్టటం శ్రేయస్కరం. మిగిలిన ప్రాణులకు భగవంతున్ని తెలుసుకొనే శక్తిలేదు. మానవులలో ముముక్షత్వం కలవారు శ్రేష్ఠులు. అలా కలిగినవారికి మోక్షమార్గాలు ప్రధానంగా నాలుగు ఉన్నాయి. అవి 1) కర్మయోగం, 2) రాజయోగం (ధ్యానయోగం), 3) జ్ఞానయోగం, 4) భక్తియోగం. వీటిలో సులభమైనది, మధురమైనది భక్తియోగం. భక్తిని చాటిచెప్పే గ్రంథాలు మనకు చాలా ఉన్నాయి. కాని, దాన్ని మధురమైన నారాయణ కథలతో మేళవించి చెప్పినది - భాగవతమే. కావున భాగవతం సర్వోత్కృష్టమైనది. నవవిధ భక్తివిధానాలు కథల రూపంలో వివరించబడ్డాయి.

వేదాలు విభజించి, బ్రహ్మసూత్రాలు రచించి, పురాణాలు, భారతం వ్రాసిన వ్యాసుని మనోవేదనను ఏ శాస్త్రం తొలగించలేనపుడు, అతని చింతను తొలగించినది - భాగవతమే. పరమహంస, నిర్వికల్పసమాధిప్రియుడైన శుకమహర్షి గానం చేయడాన్నిబట్టి, ఏడు రోజులలో పరీక్షితునికి మోక్షం ఇవ్వటాన్ని బట్టి ఆధునికులైన శ్రీకృష్ణచైతన్యులు, శ్రీరామకృష్ణ పరమహంసలాంటి వారు చదివి దివ్యానందం పొందటాన్నిబట్టి భాగవత విశిష్టత ఎంత మహనీయమైనదో తెలుస్తుంది.

భాగవతం పోతనచేత - వస్తు అలంకార రసధ్వని యుక్తంగా, శబ్ద, శబ్దార్థ, అర్థ, మిశ్రాలంకారయుక్తంగా, సమస్త కవితా లక్షణ భరితంగా కదళీ పాకంలో రచించబడినది. పోతనగారి కావ్యగత లక్షణాలన్నీ పాఠకుని హృదయంలో భక్తిరసాన్ని ఉద్భవింపజేయుటకే ప్రయోగింపబడ్డాయి.

పోతన రచించిన భాగవతం - ఆచార్య రాయప్రోలు సుబ్బారావు అధ్యక్షతన దివాకర్ల వెంకటావధాని వంటి పలువురు పండితులచే పరిష్కృతమై, తెలుగు విశ్వవిద్యాలయం వారిచే బహు పాఠాంతర పరిష్కార విపుల పీఠికా సహితంగా 'శ్రీమహాభాగవతము' అనే పేరుతో ప్రచురించబడింది. మొదటి ముద్రణ 1964 లో వెలువడగా, ఈ పరిశోధనకు ఎన్నుకున్న ప్రతి 1994 నాటి ఏడవ ముద్రణ. 'శ్రీమహాభాగవతము'ను పీఠిక, 1, 2, 3, 4, 5, 6 స్కంధాలను మొదటి సంపుటంగాను, 7, 8, 9, 10 (పూర్వ, ఉత్తర) 11, 12 స్కంధాలను రెండవ సంపుటంగాను వెలువరిచారు.

### 1.3 పరిశోధన పరిధి

'పోతన భాగవతము - అలంకారశిల్పం' అనేది ఈ పిహెచ్.డి. సిద్ధాంత వ్యాస శీర్షిక.

నేను సమీక్షించేది - 'పోతన భాగవతము' అంటే

1) పోతన నాలుగు కృతులలో కేవలం భాగవతం మాత్రమే అని,

2) పోతనేతర కవులు వ్రాసిన భాగవతాలను సమీక్షించుటలేదని.

3) వ్యాసభాగవతంలోని ఉపమానాలతో, అలంకారాలతో సంబంధం లేకుండా (తులనాత్మక అధ్యయనం కాకుండా) సమీక్షిస్తున్నానని అర్థం.

ఈ సిద్ధాంత పరిధిలోని అంశాలు:

1) భారతీయాలంకారాలను సమీక్షించి, లాక్షణికుల దృష్టిలో కావ్యసౌందర్యానికి అలంకారాల తోడ్పాటు, ఇతర కవితా ద్రవ్యాలకు, అలంకారాలకు ఉన్న సంబంధం.

2) శబ్దాలంకారాల లక్షణ చర్చ చేస్తూ వాటిని పోతన భాగవతంతో అన్వయించడం.

3) శబ్దార్థ (ఉభయ) అలంకారాల లక్షణచర్చ చేస్తూ వాటిని పోతన భాగవతంతో అన్వయించడం.

4) అర్థాలంకారాల లక్షణ చర్చ చేస్తూ వాటిని పోతన భాగవతంతో అన్వయించడం.

5) మిశ్రాలంకారాల లక్షణ చర్చ చేస్తూ వాటిని పోతన భాగవతంతో అన్వయించడం.

6) గంగన పంచమ స్కంధంలోని అలంకారాలను సమీక్షించడం.

7) సింగన షష్ఠమ స్కంధంలోని అలంకారాలను సమీక్షించడం.

8) నారయ ఏకాదశ, ద్వాదశ స్కంధంలోని అలంకారాలను సమీక్షించడం.

## 1.4 పరిశోధన లక్ష్యం

అలంకారాల లక్షణ చర్చ చేస్తూ, వాటిని భాగవతానికి అన్వయిస్తూనే, ఆయా అలంకారాలు, కథా సందర్భానికి ఎంత సౌందర్యాన్ని చేకూర్చాయో, పాఠకునిలో ఎలా రసోద్భవానికి, ప్రత్యేకించి భక్తి రసోద్భవానికి కారణమయ్యాయో అనుశీలిస్తాను.

ఏ సందర్భంలో ఏ అలంకారాన్ని ఎన్నుకున్నాడో, ఏ ఉపమానాన్ని ఎన్నుకున్నాడో, ఆ అలంకారం, ఆ ఉపమానం వలన ఆ నిర్దిష్ట కథా సందర్భం రక్తి కట్టిన తీరు, అది రసోద్భవానికి కారణమైన విధానం కూలంకషంగా చర్చించడమైనది. ఈ సిద్ధాంత వ్యాస శీర్షిక లోని 'అలంకార శిల్పం' అంటే అర్థమిదే.

# ౨

# భారతీయాలంకార దర్శనం

శ్రీమదాంధ్ర మహాభాగవతంలో భక్తకవీశ్వరుడైన పోతన ప్రయోగించిన అలంకారాలను సమీక్షించుటకు ముందు భారతీయాలంకారాల సింహావలోకనం.

**2.0.** భారతీయ అలంకార శాస్త్రాలలో సాధారణంగా కావ్యహేతువులు, కావ్యస్వభావం, రకాలు, నాయక, నాయిక లక్షణాలు, కావ్యాత్మ, రసం, ధ్వని అలంకారాలు, నాటక లక్షణాలు మొ॥ చర్చనీయాంశాలు. వీటిలో కొన్నిటిని గాని, అన్నిటిని గాని వివరించుట కలదు.

## 2.1 భారతీయాలంకారికులు : అలంకారశాస్త్రాలు

ప్రపంచ సాహిత్యంలో అలంకారాలను కూలంకషంగా ఆవిష్కరించి, వ్యాఖ్యానించి, విమర్శించిన ఘనత భారతీయులదే. భరతుడు మొదలుకొని జగన్నాథ పండితరాయల వరకూ అలంకారాల లోతు తరచి చూచిన ఆలంకారికులు ఎందరో ఉన్నారు. తెలుగులో వెలువడ్డ స్వతంత్ర అలంకార శాస్త్రాలు స్వల్పం. అవి కూడా సంస్కృతాలంకార గ్రంథాలకు అనుకరణలే. అయితే తెలుగులో సంస్కృతాలంకార గ్రంథాలకు వ్యాఖ్యానాలు, అనువాదాలు మిక్కిలిగానే వెలువడ్డాయి.

అలంకారాలను రచించిన ప్రసిద్ధ భారతీయాలంకారికులను, వారి కాలం, వారి అలంకార శాస్త్రగ్రంథాలను క్రింది విధంగా పేర్కొనవచ్చు. (వీరి కాలం విషయంలో విమర్శకులలో ఏకాభిప్రాయం లేదు.)

| ఆలంకారికుడు | కాలం | అలంకారశాస్త్రం |
|---|---|---|
| 1. భరతుడు | క్రీ.పూ.600-700 సం॥లు. | నాట్యశాస్త్రము |
| 2. విష్ణుధర్మోత్తర పురాణ కర్త | - | విష్ణుధర్మోత్తర పురాణం |
| 3. అగ్నిపురాణకర్త | - | అగ్నిపురాణం |
| 4. భట్టి | | భట్టికావ్యము |
| 5. భామహుడు | క్రీ.శ. 7 వ శతాబ్దం | కావ్యాలంకారః |
| 6. దండి | క్రీ.శ. 7 వ శతాబ్దం | కావ్యాదర్శః |
| 7. ఉద్భటుడు | క్రీ.శ. 779-813 | కావ్యాలంకారసంగ్రహం |
| 8. వామనుడు | క్రీ.శ. 779-813 | కావ్యాలంకార సూత్రవృత్తి |
| 9. రుద్రభట్టు (రుద్రటుడు) | క్రీ.శ. 8,9 శతాబ్దం | కావ్యాలంకారః |
| 10. భోజుడు | క్రీ.శ. 1010-1055 | సరస్వతీకంఠాభరణం |
| 11. కుంతకుడు | క్రీ.శ. 950-1050 | వక్రోక్తిజీవితమ్ |
| 12. మమ్మటుడు | క్రీ.శ. 1010-1101 | కావ్యప్రకాశము |
| 13. రుయ్యకుడు | క్రీ.శ. 1135-1150 | అలంకారసర్వస్వము |
| 14. వాగ్భటుడు-I | | కావ్యానుశాసనం |
| 15. మహేంద్రుడు | | కావ్యానుశాసనము |
| 16. జయదేవుడు | క్రీ.శ. 1200-1250 | చంద్రాలోకము |
| 17. విద్యానాథుడు | క్రీ.శ. 14వ శ. ప్ర.భాగం | ప్రతాపరుద్రయశోభూషణమ్ |
| 18. విద్యాధరుడు | క్రీ.శ. 14 వ శ. | ఏకావళి |
| 19. విశ్వనాథుడు | క్రీ.శ. 1300-1380 | సాహిత్యదర్పణం |
| 20. వాగ్భటుడు-I | | వాగ్భటాలంకారం |
| 21. వారణాసిధర్మసూరి | క్రీ.శ. 1400-1425 | సాహిత్యరత్నాకరము |
| 22. అప్పయదీక్షితుడు | క్రీ.శ. 1554-1626 | కువలయానందము |

| | |
|---|---|
| 23. జగన్నాథ పండితరాయలు క్రీ.శ. 17వ శ. | రసగంగాధరము |
| 24. విశ్వేశ్వరుడు | అలంకారకౌస్తుభము |
| | అలంకారముక్తావళి |

**ఆంధ్రాలంకారగ్రంథాలు**

| | |
|---|---|
| 1. విన్నకోట పెద్దన | కావ్యాలంకార చూడామణి |
| 2. రామరాజభూషణుడు | కావ్యాలంకారసంగ్రహం |
| 3. చర్ల గణపతిశాస్త్రి | సాహిత్యసౌందర్యదర్శనము |

## 2.2 కావ్యప్రయోజనాలు

భామహుడు చతుర్విధ పురుషార్థాలే కావ్యప్రయోజనమన్నాడు.

"ధర్మార్థకామ మోక్షేషు వైచక్షణ్యం కళాసు చ
కరోతి కీర్తిం ప్రీతించ సాధు కావ్య నిషేవణం" (చూ. సూర్యనారాయణ శాస్త్రి: 116)

మమ్మటుడు కావ్యప్రయోజనమును క్రింది విధంగా చెప్పాడు.

"కావ్యం యశసేఽర్థకృతే వ్యవహారవిదే శివేతరక్షతయే
సద్యః పరనిర్వృతయే కాన్తా సమ్మితతయోపదేశయుజే" (చూ. మమ్మటుడు: 3)

అలంకారికులు చెప్పిన కావ్యప్రయోజనములను క్రింది విధంగా క్రోడీకరించవచ్చు.

1. కావ్యం (కవికర్మ) ఉక్తిప్రధానం, కాంతాసమ్మితం.
2. ఇతివృత్తం ఆస్వాద్యమానమొనర్పబడి ఉంటుంది. కావున గ్రహించుట సులభం, ఆనందదాయకం.
3. ధర్మార్థ కామమోక్షములందు ప్రీతి ఏర్పడును.
4. కళా మర్మం (కవితామర్మం) తెలియును.
5. కళల యందు ఆసక్తి పెరుగును.
6. దుఃఖ శమనం కలుగును.
7. అమంగళ పరిహారం కలుగును.
8. యశస్సు కలుగును.
9. సంపదలు కలుగును.
10. విషయపరిజ్ఞానం కలుగును.
11. వ్యవహార దక్షత ఏర్పడును.
12. వాస్తవ జీవితమున పొందలేని వాటిని (కావ్యపఠనము వలన) పొందినట్లు అనుభూతి కలుగును.
13. వ్యుత్పత్తి కలుగును.
14. క్రొత్తకవులకు మార్గదర్శకమగును.
15. ఉపదేశము (కాంతవలె మనస్సు నొప్పించకుండా కర్తవ్యోపదేశము) చేయును.
16. ఆనందము (రసానందము) కలిగించును.
17. లౌకికానంద స్థితి నుండి బ్రహ్మానంద స్థితి నందుటకు వారధి వలె రసానందానుభవము ఉపకరించును.
18. దుస్సంస్కారములు నశించును.
19. సత్సంస్కారములు కలుగును.
20. (సత్సంస్కార ఫలముగా) మరణానంతరము ఉత్తమగతి కలుగును.

## 2.3 రసానందానుభూతి

కావ్య ప్రయోజనాలలో అత్యంత ప్రధానమైనవి రెండు అవి - 1. ఉపదేశం, 2. రసానందం.

ఉపదేశము ఇతివృత్తం వలన కలుగుతుంది. ఇది ప్రత్యక్షంగా లోకక్షేమానికి ఉపకరిస్తుంది. రసానందం పరోక్షంగా (పాఠకునికి సత్సంస్కారం కలిగించుట ద్వారా) లోకక్షేమానికి ఉపకరించును. రసం కావ్యగతం కాదు. కావ్యాత్మ అంతకంటే కాదు. రసము సహృదయనిష్ఠం. జీవులు పొందే ఆనందానుభూతి మూడు రకాలుగా ఉంటుంది. అవి 1) ఆత్మానందానుభూతి, 2) రసానందానుభూతి, 3) భౌతికానందాను భూతి.

మనిషి ఆత్మ, ప్రకృతిల సంయుక్తరూపం. ఆత్మ ప్రకృతికి అతీతమైనది. దీనిలో ఎలాంటి మార్పులు జరుగవు. ఇది సాక్షిగా ఉంటుంది. ఆత్మ స్వయంగా ఆనంద చిద్ఘనం. సమస్త సూక్ష్మ, స్థూల ఉపాధి వాసనా క్షయానంతరం కలుగునది. ఈ ఆత్మానందం ఇక్కడ ఆస్వాదింపబడేది, ఆస్వాదించే వ్యక్తి అనే భేదం లేని స్థితి. ఆనందమే తానైనస్థితి. ఇది యోగీశ్వరులు, పరమహంసలు పొందిన స్థితి.

ప్రకృతి ఆత్మసమక్షంలో మాత్రమే తన కార్యకలాపాలను కొనసాగిస్తుంది. ప్రకృతి స్వయం చైతన్యరూపం కాకపోవడమే దానికి కారణం. ఈ ప్రకృతి సూక్ష్మ శరీరం, స్థూల శరీరంగా ఉంటుంది. మనస్సు, బుద్ధి, అహంకారాలనే సూక్ష్మశరీరం అంటారు. స్థూల శరీరం పంచభూతాల నిర్మితం. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలను గ్రహించుటకు సమర్థమైన శ్రవణ, త్వక్, నేత్ర, జిహ్వా, ఘ్రాణాలనే పంచ జ్ఞానేంద్రియ యుక్తం. ఈ జ్ఞానేంద్రియ పంచకం విషయ గ్రహణ సమర్థమే కాని విషయానుభవ సమర్థం కాదు. జ్ఞానేంద్రియాలు గ్రహించిన విషయాలకు అనుగుణమైన ప్రతి స్పందనలు, ప్రతిచర్యలు ఆనంద, విషాదాలు ఉద్భవించటం అనుభవంలోకి రావటం ఈ సూక్ష్మశరీరం లోనే. ఆలంకారికుల వ్యవహారంలో 'హృదయం' అనేది దీనినే. రసానందానుభూతి, భౌతికానందానుభూతి కలిగేది ఈ హృదయం (సూక్ష్మ శరీరం) లోనే.

పూర్వజన్మ సంస్కారములు వాసనా రూపంలో ఈ సూక్ష్మ శరీరంతో బాటే కొనిరాబడతాయి. ఈ పూర్వ జన్మ వాసనలు సుప్తావస్థలో ఉంటాయి. స్థూలశరీరంలో గల పంచేంద్రియాల సహాయంతో కావ్యపఠనం ద్వారా గ్రహించిన విభిన్న విషయాలు సూక్ష్మ శరీరంలో గల ఆయా వాసనలను జాగృతమొనర్చుతాయి. జాగృతమొనర్చబడిన ఈ పూర్వజన్మ సంస్కారాలే సూక్ష్మశరీరంలో రసానందానుభవ రూపంలో వ్యక్తమవుతాయి.

ఆస్వాద్యమాన ఇతివృత్తం గల కావ్యంలో వీరత్వాన్ని ప్రకటించే సన్నివేశాలు వర్ణించునపుడు పాఠకుని హృదయ ఫలకంపై వీరోచిత కార్యచిత్రణం రూపుకడుతుంది. తద్వారా సూక్ష్మశరీరంలో వీరత్వానికి సంబంధించిన పూర్వజన్మ సంస్కారాలు జాగృతమై వీరరసానంద రూపంలో అనుభవంలోకి వస్తుంది. పాఠకునిలో వీరత్వానికి సంబంధించిన సంస్కారం లేని పక్షాన ఎంతటి వీరత్వ ప్రకటిత కావ్య పఠనమైననూ అతనిలో వీరరసం ఉద్భవింపజేయలేదు. ఇట్లే శృంగార, భక్తి మొ॥ అన్ని రసముల విషయమునూ, ఈ పూర్వ సంస్కారమంతా, ప్రస్తుత కార్యకలాపాల ఫలితంగా మార్పు చెందుతాయి. సత్కార్యాల ఫలితంగా, సత్సంస్కారం, దుష్కార్యాల ఫలితంగా దుస్సంస్కారం ఏర్పడతాయి. ఈ సంస్కారం తర్వాతి రసానందానుభవాన్ని నిర్ణయించును. సత్సంస్కారం క్రమంగా వాసనా క్షయానికి దారితీసి, బ్రహ్మానందానికి బాటలు వేస్తుంది. అట్లే దుస్సంస్కారం క్రమంగా రాక్షసత్వానికి దారితీస్తుంది. క్రింది పట్టిక ద్వారా దీనిని సులభంగా గ్రహించవచ్చు.



## 2.4 రసనిష్పన్న కార్యంలో కవిపాత్ర

రసం కావ్యగతం కాదు, సహృదయ నిష్ఠం. రసం సహృదయ నిష్ఠమైనపుడు ఇక కావ్యం వలన ప్రయోజనమేముంది? కవి కర్మకు ఇంత ప్రాముఖ్యత నివ్వవలసిన అవసరం ఏముంది? అనే ప్రశ్నలు ఉదయిస్తాయి. ఆలోచిస్తే కవికర్మ ఔన్నత్యం తెలుస్తుంది. కవికర్మ ప్రత్యేకతను ఒక్క మాటలో చెప్పవలసివస్తే అది కవితా ద్రవ్యాలను వాడి ఇతివృత్తాన్ని ఆస్వాద్యమానమొనర్చటమే. ఆస్వాద్యమాన ఇతివృత్తం పాఠకునిలోని సుప్తావస్థలో ఉన్న సంస్కారాలని జాగృతం చేసి రసానందానుభూతికి తోడ్పడును.

## 2.5 రసనిష్పన్న కారక కవితాద్రవ్యాలు : విశ్లేషణ

అలంకారాల సూక్ష్మ నిర్మాణం, రస నిష్పన్న కార్యంలో దానిపాత్ర, ఇతర కావ్యగతాంశాలకు, అలంకారాలకు ఉన్న సామ్యభేదాలను తెలుసుకొనుటకు రస నిష్పన్న కారక కవితా ద్రవ్యాలు ఏవో? ఏవి కావో? వేటి పాత్ర ఎంతవరకూ ఉందో తెలుసుకోవలసి ఉంది.

కవిపాత్ర అంతా కవితా ద్రవ్యాలను వాడి ఇతివృత్తాన్ని ఆస్వాద్యమాన మొనర్చటమే అని చెప్పుకున్నాం. కవితా ద్రవ్యాలు కావ్యగతాలు అయితే ఆ కవితా ద్రవ్యాలు ఏవి? అనే విషయంలో ఆలంకారికులలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. మహాకవి సృజనలో భాగమై, రచనాగతమై, ఇతివృత్తాన్ని ఆస్వాద్యమానం చేస్తూ పాఠకుని రసానందానుభూతికి కారణమయ్యే ప్రతి అంశాన్ని '**కవితాద్రవ్యము**' అని చెప్పవచ్చు.

### 2.5.0 కావ్యస్వరూపం

కావ్యాన్ని కన్యతో పోల్చారు మన ఆలంకారికులు. భరతుడు నాట్యశాస్త్రంలో కావ్యశరీరం ఇతివృత్తం, దాని సౌందర్య హేతువు రసం అన్నాడు. (ఇతివృత్తంతు నాట్యస్య పరికీర్తితం - భరతుడు. చూ. సూర్యనారాయణశాస్త్రి: 93)

అగ్నిపురాణకర్త - "సంక్షేపాద్వాక్యమిష్టార్థవ్యవచ్ఛిన్నా పదావళీ
కావ్యం స్ఫుటదలంకారం గుణవద్దోషవర్జితమ్" అన్నాడు. (చూ. నరసింహారావు: 34)

భామహుడు - "శబ్దార్థౌసహితౌకావ్యం" (భామహుడు: 8) అన్నాడు.

దండి - "శరీరం తావదిష్టార్థవ్యవచ్ఛిన్నాపదావళీ" (దండి: 5) అన్నాడు. రమణీయార్థ భూషిత పదసమూహం కావ్యం అని, శరీరం యొక్క బాహ్యసౌందర్యాన్ని పెంచేవి ఈ అలంకారాలని, అంతస్సౌందర్యాన్ని పెంచేవి గుణాలని అభిప్రాయపడ్డాడు. (దండి: 51)

వామనుని అభిప్రాయం ప్రకారం కావ్యానికి శబ్దార్థాలే శరీరం, కావ్యాత్మ రీతి, రీతి గుణాలచే ఏర్పడుతుంది. అలంకారాలు కావ్య సౌందర్యాన్ని వృద్ధిచేస్తాయి. ఆత్మలేనపుడు శరీరానికి ఎట్టి అలంకారాలైనా సౌందర్య హేతులు కాజాలనట్లు రీతి లేకుంటే అలంకారాలు శోభించవు.

ఆనందవర్ధనుడు చారుత్వాతిశయ విశిష్టార్థ ప్రకాశకమగు శబ్దవిశేషమే కావ్యం అను అభిప్రాయాన్ని (పరోక్షంగా) వెలిబుచ్చాడు. ఇతని ప్రకారం కావ్యశరీరానికి ఆత్మ ధ్వని. ఇది వస్తుధ్వని, అలంకారధ్వని, రసధ్వని అని మూడు రకాలు. ఈ మూడింటిలో రసధ్వని శ్రేష్ఠం. అయినా మిగిలిన రెండు అధమాలు కావు. ధ్వని లేనపుడు అలంకారాలు శోభాహేతువులు కాజాలవు. అంటే ధ్వన్యుపస్కారములగు అలంకారాలే శోభాహేతువులు. ఇంకనూ, అలంకారాలు శరీరధర్మాలు, అవి లేకున్ననూ రసం ఉండవచ్చు. గుణాలు ఆత్మ ధర్మాలు కావున గుణాలు లేనిచో రసం ఉండదని చెప్పారు.

అభినవ గుప్తుడు రసం చేతనే కావ్యం మొత్తం జీవిస్తుంది; రసశూన్యమైన కావ్యం ఉండదు; నిజానికి రసమే కావ్యానికి ఆత్మ; వస్త్వలంకార ధ్వనులు సర్వథా రస పర్యవసాయులే అని చెప్పాడు. మమ్మటాదులు చెప్పిన కొన్ని నిర్వచనాలు క్రింద ఇవ్వడం జరిగింది.

"అదోషౌశబ్దార్థౌ సగుణావనలంకృతీ పునః క్వాపి" (మమ్మటుడు: 8)

భోజుడు - "నిర్దోషం గుణవత్ కావ్యమలంకారైరలంకృతమ్
రసాన్వితం కవి కుర్వన్ కీర్తింప్రీతించ విన్దతి" (భోజుడు 1982: 2)

దీనిని బట్టి, "నిర్దోషం గుణవత్ అలంకారైః అలంకృతమ్
రసాన్వితం కావ్యం" అనేది భోజ సమ్మతమైన కావ్యలక్షణం.

హేమచంద్రుడు - "అదోషౌ సగుణౌ సాऽలంకారౌ శబ్దార్థౌ కావ్యమ్" (చూ. మమ్మటుడు. ప్రస్తావన: 19)

'వాగ్భటుడు - "గుణాలంకార రీతి రసోపేతః సాధుశబ్దార్థసందర్భః కావ్యం"

పీయూషవర్షుడు - "నిర్దోషం గుణాలంకార రీతిమత్ వాక్యం కావ్యం"

శౌద్ధోదని - "రసాదిమత్ వాక్యం కావ్యం"

విశ్వనాథుడు - "వాక్యం రసాత్మకం కావ్యం"

జగన్నాథుడు - "రమణీయార్థప్రతిపాదక శబ్దః కావ్యం" ' (చూ. మమ్మటుడు. ప్రస్తావన: 20)

కుంతకుడు - "వక్రోక్తిః కావ్యజీవితమ్" (చూ. కావ్యాలోకం: 9)

క్షేమేంద్రుడు - "అలంకారాస్త్వలంకారా గుణాయేవగుణాస్సదా
ఔచిత్యం రససిద్ధస్య స్థిరం కావ్యస్య జీవితం" (క్షేమేంద్రుడు: 20)

కేశవమిశ్రుడు - "అలంకార యుక్తం సుఖవిశేషసాధనం వా కావ్యం"

పై నిర్వచనాలను బట్టి కావ్యగత కవితా ద్రవ్యాలు ఏవి అనే విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి అని తెలుస్తుంది.

కావ్య శరీరాన్ని చెబుతూ ఆలంకారికులు తెలిపిన దానిని బట్టి పాఠకుడు ఆనందాన్ని అనుభవించుటకు కావ్యంలో ఉండదగినవి - 1. రసం, 2. ఇతివృత్తం, 3. శబ్దం, 4. శబ్దాలంకారాలు, 5. గుణాలు, 6. రీతులు, 7. శయ్య, 8. అర్థం, 9. పాకం, 10. అర్థవృత్తులు, 11. అనుమానం, 12. ఔచిత్యం, 13. శబ్దవృత్తులు (అభిధ, లక్షణ, వ్యంజనాలు), 14. వక్రోక్తి, 15. అర్థాలంకారాలు.

వీటిలో ఏవి కావ్యగతాంశాలో? ఏవి కావో? తెలుసుకోవాలంటే వాటి స్వరూపాన్ని కూలంకషంగా చర్చించవలసిందే.

### 2.5.1 రసం

భరతుని అభిప్రాయం ప్రకారం రసహీనమైంది ఏ అర్థాన్నీ ప్రవర్తింపదు. (నహి రసాదృతే కశ్చిదర్థః ప్రవర్తతే. భరతుడు: 92). ఇతడు ఇతివృత్తం కావ్యశరీరమనీ, దాని సౌందర్యహేతువు రసమనీ పేర్కొన్నాడు. అంటే ఇతివృత్తం ఆస్వాద్యమానం అవుటకు కారణం రసం అని ఇతని భావం.

వాగ్భటుడు చెప్పిన కావ్య లక్షణం (గుణాలంకారరీతి రసోపేతః సాధు శబ్దార్థ సందర్భః కావ్యం) లోనూ, శౌద్ధోదని చెప్పినట్లు (రసాదిమత్ వాక్యం కావ్యం) గానూ, విశ్వనాథుడు చెప్పిన (వాక్యం రసాత్మకం కావ్యం) విధంగానూ, కేశవమిత్రుడు (రసాలంకార యుక్తం సుఖవిశేషసాధనం వా కావ్యం) చెప్పినట్లూ కావ్యంలో రసం ఉండవలెననే భావం ప్రకటితమౌతుంది.

సుప్రసిద్ధ ఆలంకారికులలో రస విషయమై ఉన్న ఈ భిన్నాభిప్రాయాలను, సంక్లిష్టతను, చిక్కుముడులను క్రింది విధంగా పరిష్కరించుకోవచ్చు. (సహృదయ పాఠకుడు రసానందానుభవం పొందు విధానం కొరకు చూ. ఇదే. 2.3.)

రసానుభవ వ్యాపారాన్ని మనం చాలా జాగ్రత్తగా అర్థం చేసుకోవలసి ఉంది. రసం కావ్యగతం కాదు. సహృదయ హృదయనిష్ఠం. ఈ విషయం రసవిషయమై ఉన్న విభిన్న భావాలను సరిగా అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తుంది. ఒక కావ్యంలో ఫలానా రసం ఉంటుంది అనటం కన్నా, ఆ కావ్యాన్ని పఠించుట వలన తత్సంబంధమైన రసం పాఠకుని హృదయంలో ఉద్భవిస్తుంది అనుట సముచితం, సార్థకం. ఉదాహరణకు భాగవతంలో భక్తిరసం ఉంది, అనడంకన్నా భాగవతం పఠనం వలన పాఠకుని హృదయంలోని సుప్తావస్థలోని భక్తి సంబంధమైన సంస్కారాలు (వాసనలు) జాగృతమై, భక్తిరసానందానుభూతి కలిగించును అనడం యుక్తి యుక్తం.

భరతుడు చెప్పినట్లు రసం సౌందర్యహేతువు కాజాలదు. ఎందుకంటే కావ్య సౌందర్యమే రసనిష్పన్నానికి దారితీయును. రసం అసలు కావ్యగతం కాదు కావున సౌందర్యహేతువు కావడానికి అవకాశమే లేదు. అయితే ఇతర కవితా ద్రవ్యాలు రసోన్ముఖంగా ప్రయోగింపబడాలని ఈతని అభిప్రాయం కావచ్చు.

అభినవ గుప్తుడు "రసేనైవ సర్వం జీవతి కావ్యమ్, నహిరసశూన్యం కావ్యం కించిదస్తి
రసఏవ వస్తుతః ఆత్మా, వస్త్వలంకార ధ్వనీతు సర్వథారసం పర్యవస్యేతే" (చూ. రామనరసింహం: 72)

రసమే కావ్యానికి జీవం. రసం లేనిదే ఇంకేమీ లేదు. రసమే కావ్యానికి ఆత్మ. వస్తు, అలంకారధ్వనులు రసపర్యవసాయులు, అని చెప్పుటలో అతని ఆత్మగత భావాన్ని క్రిందివిధంగా అర్థం చేసుకోవచ్చు.

కావ్యంలో ప్రతి సన్నివేశం పాఠకునిలో హృదయగత అచేతన సంస్కారాలను జాగృతం చేసి రసోద్భవానికి కారణం కావాలి. అట్లుకాని పక్షంలో అది కావ్యమే కాదని అతని అభిప్రాయం. "రసమే కావ్యానికి ఆత్మ" అన్నాడు ఇతడు. నిజానికి రసం కావ్యానికి ఆత్మ అయ్యే అవకాశమే లేదు. ఎందుకంటే రసం కావ్యగతాంశమే కానప్పుడు కావ్యాత్మ అవటానికి వీలులేదు. అయితే అభినవ గుప్తుని అభిప్రాయం తప్పు అనడంకన్నా రస నిష్పన్న కారక ద్రవ్యములు కావ్యానికి అత్యంత ప్రధానమని ఇతని మనోభావమని చెప్పవచ్చు. వస్తుధ్వని, అలంకారధ్వని, రసం నందే పర్యవసిస్తాయంటే దాని భావం - వస్తుధ్వని. అలంకారధ్వని పాఠకునిలో రసోత్పన్నతకు కారణం అవుతుందనే. అదే విధంగా "వాక్యం రసాత్మకం కావ్యం" అన్న విశ్వనాథుని మాటలను క్రింది విధంగా అర్థం చేసుకోవచ్చు.

వాక్యం రసాత్మకం కాదు. కానీ పాఠకునిలో రసానందాన్ని కలిగించుటకు కారణమైనప్పుడు ఆ వాక్యం కావ్యం అవుతుంది. కుంతకుడు చెప్పిన ప్రబంధ వక్రత (రసాంతర కల్పన) అంటే మూలకథ వలన కలిగే రసానికి భిన్నమైన రసాన్ని పాఠకునిలో కలిగించుటకు కావలసిన కవితా ద్రవ్యాలని కవి గర్భీకరించవలెనని చెప్పటమే. ఇది కుంతకుని ఉద్దేశ్యం. అలాగే ఇతర అలంకారికుల నిర్వచనాలను అర్థం చేసుకోవచ్చు. నందికేశ్వరుని ఉపజ్ఞగా చెబుతూ భరతుడు లేవనెత్తిన రససిద్ధాంతాన్ని పునరుద్ధరించిన పండితుడు ఆనందవర్ధనుడు. రసం కావ్యగతం కాదని సహృదయ నిష్ఠమని (ధ్వని కావ్యగతమని) ముక్తకంఠంగా చెప్పినది ఇతడే. అభినవ గుప్తుడు మరింత విపులంగా రసమీమాంస గావించాడు.

పై చర్చ వలన 'రసం' కవిసృజనలో భాగం కాదు. కావున కవితా ద్రవ్యం కాదు. 'రసం' కవితా ద్రవ్యాల ఫలం.

### 2.5.2 ఇతివృత్తం

కవితాద్రవ్యాలన్నీ, ఆస్వాద్యమానం చేసేది ఇతివృత్తము (మూలకథ)నే. అయితే మూల కథకు కవితా ద్రవ్యాలు జోడించి ఆస్వాద్యమానం చేయబడ్డ తర్వాత అది పాఠకునిలో రసానందోద్భవానికి కారణం అవుతుంది. అసలు ఇతివృత్తమే లేకుంటే కవితా ద్రవ్యాలు దేనికి చేర్చాలి? కావున " ఇతివృత్తంతు కావ్యస్య శరీరం పరికీర్తితమ్" అనే భరతుని అభిప్రాయం అన్ని విధాలా సత్యమేనని చెప్పవచ్చు. శబ్దార్థాలంకారాదులు కావ్య శరీరానికి శోభ కూర్చేవే కాని కావ్యశరీరం కాబోవు. శబ్దార్థాలంకారాది కవితా ద్రవ్యాలకు ఆలంబనమైనది ఇతివృత్తమే.

మూల ఇతివృత్తం (రామాదుల చరిత రసోపస్కారక మైనప్పటికీ) కవికర్మలో భాగం కాదు కావున అది కవితా ద్రవ్యం కాదు. అయితే కవితన ప్రతిభ చేత కథా సన్నివేశాన్ని మార్చునపుడు (తొలగించుట, మార్చుట, అదనంగా చేర్చుట) అది కవికర్మలో భాగమవుతుంది. అప్పుడా సన్నివేశం అటు కావ్యశరీరం, ఇటు కావ్యశోభాహేతువైన కవితాద్రవ్యం రెండూ అవుతుంది.

ఈ సన్నివేశ కల్పనే కుంతకుడు 'ప్రకరణ వక్రత' అన్నాడు. ఈ సన్నివేశ కల్పన వలన మూలకథ వలన కలుగు రసానికి భిన్నమగు రసాన్ని కల్పించవచ్చు. దీనినే ప్రబంధ వక్రత అన్నాడు కుంతకుడు. పలువురు ఆలంకారికులు శబ్దార్థాలను కావ్య శరీరంగా భావించిరి. సూక్ష్మంగా వివరిస్తే అవి కవితా ద్రవ్యాలే కాని కావ్య శరీరం కాదని తెలుస్తుంది. అయితే శబ్దం (పదం) ద్వారా పాఠకునికి తెలియవచ్చే ఇతివృత్తమే కావ్య శరీరమని చెప్పవచ్చు.

### 2.5.3 శబ్దం

కావ్యం వలన కలుగు సమస్త అంశాలకు మూల కందం శబ్దం. ఈ శబ్దం నేరుగా గాని, పరంపరగా గాని కావ్యశరీరం, కవితా ద్రవ్యాలు మొ॥ వాటిని స్ఫురింప జేస్తుంది. 'శబ్దం' వలన ఈ కిందివి ఏర్పడును

1. శ్రవణ సుభగత - ఇది రెండు రకాలుగా ఏర్పడుతుంది. అవి. 1. లయాత్మకత (ఛందస్సు) వలన, 2. వర్ణసంయోజనం వలన. వర్ణాలకు నాదగుణం ఉండటం వలన, వర్ణసంయోజనం వలన శ్రవణ సుభగత ఏర్పడుతుంది. రస నిష్పన్నానికి ఈ నాదగుణం యొక్క పాత్ర ఎంతో విశిష్టమైనది. సాహిత్యంలో సంగీతాన్ని గర్భీకరించడం అనే విశిష్ట ప్రక్రియ ఇక్కడ జరుగుతుంది.

వేర్వేరు వర్ణాలు (హల్లులు) వివిధ నిష్పత్తులలో వివిధ పద్ధతులలో సంయోజనం చెందుట ద్వారా విభిన్నమైన నాదాలు ఏర్పడతాయి. చలన చిత్రాలలో కథాసన్నివేశాలకు అనుగుణంగా వచ్చు నేపథ్య సంగీతంవలె కావ్యం కూడా కథాసన్నివేశాన్ని రక్తికట్టించుటకు ఈ వర్ణ సంయోజనం వలన కలిగే నాదం ఎంతో దోహదపడుతుంది.

ఈ వర్ణసంయోజనం వలన కలుగు నాదం ఏకదేశంగా ఉంటూ కథా సన్నివేశాన్ని రక్తికట్టిస్తూనే పూర్తి కావ్యాన్నిహృదయంగమం చేస్తుంది. కావున శబ్దం కవితా ద్రవ్యమే. ఈ వర్ణ సంయోజనం వల్లనే (అర్థంతో సంబంధం లేని)

శబ్దాలంకారాలు, గుణాలు (గుణములతో ఏర్పడు) రీతులు, శయ్య, కుంతకుడు చెప్పిన వర్ణవిన్యాస వక్రతలు ఏర్పడును. తరచి చూస్తే వర్ణ సంయోజనం వలన ఏర్పడే శ్రవణ సుభగమైన ఈ నాదానికే (వ్యస్తంగానో, సమస్తంగానో) శబ్దాలంకారాలు, గుణాలు, రీతులు, శయ్య, వర్ణ విన్యాస వక్రత అని అలంకారికులు వేర్వేరు పేర్లు పెట్టారని తెలుస్తుంది.

### 2.5.3.1 శబ్దాలంకారాలు

ఆలంకారికులు, అలంకారాలనే విస్తృత యవనిక పై అన్ని రకాల కావ్యగతాంశాల (కవితా ద్రవ్యాల)ను ఇమిడ్చే ప్రయత్నంలో శబ్దం వల్ల కలిగే నాదగుణం వలన ఏర్పడే ఆస్వాదనీయ లక్షణాన్ని శబ్దాలంకారంగా చెప్పారు. ఇది కవి కర్మలో భాగమై రసానందాన్ని కలిగించును కావున శబ్దాలంకారం కవితా ద్రవ్యమే. (దీనిని గూర్చి విపుల చర్చ శబ్దాలంకారాల అధ్యాయంలో ఉంటుంది.)

### 2.5.3.2 గుణాలు

గుణాలు కవితా ద్రవ్యములా? కావా? కవితా ద్రవ్యములే అయితే అన్ని గుణాలా? లేక కొన్ని గుణాలా? అనే చర్చకు ముందు మన అలంకారికులు గుణాల గురించి ఏం చెప్పారో చూద్దాం.

భరతుడు నాట్యశాస్త్రంలో 'దోషాల విపర్యాలే గుణాలు' అన్నాడు. అగ్నిపురాణ కారుడు కావ్యానికి అధిక శోభ కలిగించేవి గుణాలే అన్నాడు. దండి విశిష్ట పద రచనకు గుణాలు ప్రాణం అన్నాడు. వామనుడు కావ్యశోభాకర ధర్మాలు గుణాలన్నాడు. మమ్మటుడు శౌర్యాదులు ఆత్మకులాగే రసానికి ఉత్కర్ష కలిగిస్తూ స్థిరములై ఉండేవి గుణాలన్నాడు. జగన్నాథుడు సామాన్యుని చిత్తంలో కలిగే ద్రుత, దీప్తి, వికాసాలే క్రమంగా మాధుర్యౌజః ప్రసాద గుణాలగునన్నాడు.

గుణాల సంఖ్య విషయంలో కూడా భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. భరతుడు పది గుణాలని చెప్పి వాటిలో మాధుర్యౌజః ప్రసాదాలు అనే మూడు ముఖ్యమని చెప్పాడు. అగ్నిపురాణ కారుడు శబ్ద, అర్థ, ఉభయ గుణాలుగా విభజించి మొత్తం పందొమ్మిది చెప్పారు. దండి పది గుణాలే చెప్పాడు. వామనుడు దండి చెప్పిన పది గుణాలనే శబ్ద, అర్థ భేదాలతో ఇరువది చేశాడు.

"గుణాలు ప్రధానంగా పదసంఘటనాధర్మాలు, అందుచేత శబ్ద గుణాలు మాత్రమే అంగీకరించాలి. కాని అర్థ గుణాలు కూడా అంగీకరించడం అయుక్తం" అని విద్యానాథుడు అభిప్రాయపడ్డాడు. (వ్యా. పుల్లెల శ్రీరామచంద్రుడు. మమ్మటుడు. ప్రస్తావన: 29)

విద్యానాథుడు 24 గుణాలు చెప్పగా, భోజుడు శబ్దగుణాలు 24, అర్థగుణాలు 24, వైశేషిక గుణాలు 24 చెప్పాడు.

భామహ, ఆనందవర్ధన, మమ్మట, జగన్నాథులు అంగీకరించినవి మాధుర్యౌజః ప్రసాదములనే మూడింటినే. గుణాల నిర్వచనాలను పరిశీలిస్తే..

<u>మాధుర్యం</u> :- పృథక్ పదత్వం మాధుర్యం. దీర్ఘ సమాసాలు లేని విడివిడి పదాల కూర్పు మాధుర్యం.

<u>ఓజస్సు</u> :- గాఢబంధత్వం ఓజః. నిబిడమైన పదరచనన ఓజస్సు.

<u>ప్రసాదం</u> :- బంధ శైథిల్యం ప్రసాదః. శిథిల బంధం ప్రసాదం.

పై వాటిని బట్టి గుణాలు అంటే పదాల మధ్య బంధానికి చెందినవని చెప్పవచ్చు.

వామనుడు వివిధ కవితాంశాలను గుణములందే అంతర్భవింపజేయటం గమనించవచ్చు. ఆలంకారికులు గుణస్వభావ నిర్ణయం, వాటిని నిర్వచించిన విధానం, వాటి సంఖ్యానిర్ణయాలలో భిన్నాభిప్రాయాలు ఉండటాన్ని బట్టి గుణాల పరిధిని నిర్ణయించడం కష్టం. వామనుడు మరియు భోజుని నిర్వచనాలను పరిశీలిస్తే గుణాలు కేవలం సమాస బంధ నిర్మాణ సంబంధమైనవనీ భావింపవచ్చు. అప్పుడు గుణాల పరిధి అత్యంత స్వల్పమైనదిగా చెప్పవచ్చు. అటువంటప్పుడు గుణాలను కావ్యాత్మగా చెప్పడం పొసగదు. వామన, భోజుల నిర్వచనాలను పరిశీలిస్తే మాత్రం కావ్యాత్మగా ఉండవలసిన లక్షణాలు గుణాలలో కొన్నింటికి ఉన్నట్లుగా చెప్పవచ్చు. అయితే ఏవిధంగా చూసినా గుణాలు కవితా ద్రవ్యాలే అనుటలో విప్రపత్తిలేదు. ఎందుకంటే సమాస బంధం కూడా రసోత్పన్నతకు కారణమగును.

అయితే మన ఆలంకారికులలో చాలామంది అలంకారాల కన్నా గుణాలు ప్రధానమైనవని చెప్పడం వింత. 'అలంకారాలు' మనిషి ధరించే బాహ్య అలంకారాల వంటివని, 'గుణాలు' మనిషి అంతర ధర్మాలైన గుణాలవంటివని శబ్దసామ్యం వల్ల పొరపాటుగా భావించడమే దీనికి కారణం.

### 2.5.3.3 రీతులు

భామహునికి పూర్వం 'వైదర్భి, గౌఢి' అనే రెండు రీతులే ప్రచారంలో ఉండేవి. వామనుడు 'పాంచాలి'ని అదనంగా చేర్చాడు. రుద్రటుడు 'లాటీయము' అనే నాల్గవ రీతిని చేర్చాడు. భోజుడు ఈ నాల్గింటితోపాటు 'మాగధి', 'అవంతి' అనే రెంటిని కలిపి మొత్తం ఆరు రీతులను చెప్పాడు.

దేశ భేదాన్ని బట్టి రీతులలో భేదం ఏర్పడును. అంతే కాకుండా (ఒకే ప్రాంతమైనా) ఏ ఇద్దరు కవుల రీతి ఒకేరకంగా ఉండదు. రీతులు పదాశ్రయాలు. 'విశిష్ట పదరచనా రీతి' అని వామనుడు వ్రాక్రుచ్చాడు. గుణాలను కలిగి ఉండటమే విశిష్టత. ఆనందవర్ధనుడు ఈ రీతులనే 'సంఘటన' అని చెప్పి, వీటిని రసోన్ముఖంగా ప్రయోగించాలని చెప్పాడు.

'రీతిరాత్మాకావ్యస్య' (1-2-5.) అని వామనుడు రీతినే కావ్యాత్మ అన్నాడు. ఆనందవర్ధనుడు దీనిని అంగీకరించలేదు. "గుణాలు ఉండటం వల్ల కావ్యత్వం లభించదు. అందుచేత రీతి కావ్యాత్మ కాదు." (వ్యా. పుల్లెల శ్రీరామచంద్రుడు. మమ్మటుడు: 511) రీతులకు ఆలంకారికులు ఇచ్చిన నిర్వచనాలను పరికిస్తే ఈ విషయం తెలుస్తుంది.

వైదర్భీరీతి :- బంధపారుష్యం గాని, శబ్దకాఠిన్యం గాని, దీర్ఘసమాసాలు గాని లేనిది, వీణాస్వర మనోహరమైనది వైదర్భీ.

గౌడీరీతి :- బంధపారుష్యం, శబ్దకాఠిన్యం, దీర్ఘసమాసాలు కలది.

పాంచాలిరీతి :- కొంత మృదు రచన, కొంత పరుష రచన కలది పాంచాలి.

అర్థచమత్కారాలతో గాని, భావ రమణీయకతతోగాని సంబంధం లేకుండా బంధ పారుష్య, అపారుష్య, శబ్దకాఠిన్య, మృదుత్వ, దీర్ఘసమాస, సమాస రహిత లక్షణాలు గల కవితాంశాన్ని 'కావ్యాత్మ' అనుట న్యాయసమ్మతం కాదు. కావున రీతిని కావ్యాత్మ అనుట పొసగదు. గుణాల వల్లనే రీతులు ఏర్పడుతున్నవి. కనుక ఈ రెండు అభిన్నములు. కావ్యగతమైన శబ్దసంయోజనం పాఠకుని హృదయాన్ని రసోన్ముఖంగా నడిపించగలదు. ఈ శబ్దసంయోజనం వల్ల కలిగే ఒక అవ్యాజమైన ధార ఈ రసోన్ముఖ వ్యాపార నిర్వహణ చేస్తుంది. కావున రీతిని కావ్యానందానుభూతికి పరోక్షంగా సహకరించే అనేక కావ్యగత ప్రాథమిక కవితాంశాలలో ఒకటిగా చెప్పుకోవచ్చు. అంటే రీతులు కవితా ద్రవ్యాలే.

### 2.5.3.4 శయ్య

శయ్యను విద్యానాథుడొక్కడే పేర్కొన్నాడు. దండి, వామన, మమ్మట, విశ్వనాథ, జగన్నాథాదులు శయ్యను వేరుగా చెప్పలేదు. విశ్వనాథుడు దీనిని రీతులందే అంతర్భవింప జేశాడు. శయ్య అంటే సముచిత శబ్దాల కూర్పు. పరివృత్తి సహింపని పదాల కూర్పు. శయ్య శబ్దవిన్యాస సంబంధి. ఇది కేవలం శబ్దాలంకారాలు, గుణాలు, రీతుల కంటే పూర్తిగా భిన్నం కాదు. వర్ణవిన్యాసం చేత నాదమాధుర్యమునుప్పతిల జేయుటయే దీని పని కావున శయ్య కవితా ద్రవ్యమే అయినప్పటికీ ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. పై చర్చ వలన కేవల శబ్దాలంకారాలు, గుణాలు, రీతులు, శయ్య ఒకటేనని తెలుస్తుంది.

### 2.5.4 అర్థం

శబ్దం వలన కలిగేదీ, రసానందానుభూతికి ప్రత్యక్షకారణమైనదీ అర్థం. కావ్య పఠనం వలన పాఠకుడు కథా సన్నివేశాన్ని తన మనః ఫలకంపై చిత్రించుకొనుటకు మూల కారణమైనది. ఈ అర్థానికి సంబంధించిన కవితా ద్రవ్యాలను ఆలంకారికులు అనేక కోణాల నుండి దర్శించిరి. వాటిని కింది విధంగా చర్చించవచ్చు.

### 2.5.4.1 పాకం

కావ్యం ప్రసన్నమగుటకు కవి గర్భీకరించిన అర్థం పాఠకునికి హృదయగతం కావాలి. అప్పుడే రసానందానుభూతికి మార్గం సుగమం అవుతుంది. ఈ ప్రక్రియ ఎంత సులభంగా అవుతుందనే విషయాన్ని ఆలంకారిక పరిభాషలో 'పాకం' అంటారు. ఇది మూడు రకాలు.

1. ద్రాక్షాపాకం :- కావ్యార్థం సులభంగా బోధపడునట్లు చేయు రచన యొక్క స్వభావం.
2. కదళీపాకం :- కావ్యార్థం ఇంచుక ఆలోచించిన తరువాత బోధపడునట్లు చేయు రచన యొక్క స్వభావం.
3. నారికేళపాకం :- కావ్యార్థం అత్యంత క్లిష్టంగా ఉండి, ఎంతో ఆలోచించిన తరువాత బోధపడునట్లు చేయు రచన యొక్క స్వభావం.

పాకం కవితా ద్రవ్యమా? కాదా? అనే విషయాన్ని జాగ్రత్తగా ఆలోచించవలసి ఉంది. ఇది కవి కావ్యంలో నిక్షిప్తీకరించే ఒకానొక కవితా ద్రవ్యం కాదు. కాని ఇతర కవితా ద్రవ్యాలు ఆస్వాద్యమానం అగునట్లు (ద్రాక్ష, కదళీ) గాని క్లిష్టతరం అగునట్లు (నారికేళ) గాని చేసే ఒకానొక కావ్యలక్షణమని చెప్పవచ్చు.

కావ్యాన్ని సంక్లిష్ట పరచకుండా తగు జాగ్రత్త తీసుకోవలసిన బాధ్యత కవిది. అది ఔచిత్యంలో భాగం. భావం మరింత తేటతెల్లంగా కాకుండా, సంక్లిష్టంగా కాకుండా స్పష్టాస్పష్టంగా ఉండేలా కవి పాటించవలసిన ఔచిత్య విశేషమే పాకం.

### 2.5.4.2 అర్థవృత్తులు

కావ్యంలో నాయకాదులు చేయు రసోచిత వ్యాపారమే వృత్తి. (అభినవ గుప్తుడు అన్నట్లు "రసోచిత శ్చేష్టా విశేషోవృత్తి". వ్యా. సూర్యనారాయణశాస్త్రి. రామరాజభూషణుడు: 170) ఇది నటనా శ్రేయమై నేరుగా రసోపస్కారకం అగును. ఈ వృత్తులు అంగికాభినయ రూపాలు.

కైశికి, ఆరభటి, సాత్వతి, భారతి అని అర్థవృత్తులు నాలుగు. అయితే వీటి విషయంలో ఆలంకారికులకు భిన్నాభిప్రాయాలు కలవు. వీటిలోని 'భారతి'ని భరతుడు వాక్ వ్యాపారమని చెప్పాడు. అంటే శబ్దవృత్తి అన్నమాట. ప్రకాశవర్షుడు 'లలిత'ను అదనంగా చెప్పాడు. ఇది మిశ్రవృత్తి అని కొందరి భావన. 'భారతీవృత్తి యే కైశికి, ఆరభటి, సాత్వతి వృత్తులుగా మారిందని భావించుట సమంజసం. (రామరాజభూషణుడు: 170) అని సూర్యనారాయణ శాస్త్రిగారు కావ్యాలంకార సంగ్రహం వ్యాఖ్యలో అభిప్రాయపడ్డాడు.

అర్థవృత్తుల నిర్వచనాలను పరిశీలిస్తే

1. కైశికి :- అత్యంత సుకుమారార్థ సందర్భం గల, వృత్తగీత సముపేత, శృంగార కరుణ రస ప్రయోజ్య లాస్యాంగం కైశికి.
2. ఆరభటి :- అత్యుద్ధతార్థ సందర్భం గల, రౌద్ర బీభత్స రస ప్రయోజ్య తాండవాంగం ఆరభటి.
3. సాత్వతి :- ఈషత్ ప్రౌఢార్థ సందర్భం గల, వీర, భయానకరస ప్రయోజ్య సాత్వికాభినయ భూయిష్టమైనది సాత్వతి.
4. భారతి :- ఈషత్ మృద్వర్థ సందర్భం గల, శాంత, అద్భుతరస ప్రయోజ్య వాచికాభినయ ప్రధానమైనది భారతి.

దృశ్యకావ్యాలలో నటుల అంగికాభినయ దర్శనం చేత ప్రేక్షకుని హృదయంలో రామాది అనుకార్యులకు, నటులకు అభేదం స్ఫురించుట చేత రసవ్యాపారం కొనసాగుటకు దోహదమగును.

ఈ అర్థప్రవవృత్తులు కవితా ద్రవ్యాలా? కావా? అనే విషయాన్ని విశ్లేషిస్తే క్రింది విషయం బోధపడుతుంది.

దృశ్యకావ్యంలో అనుకర్తల అభినయం స్వయంగా చూస్తాడు ప్రేక్షకుడు. అదే శ్రవ్యకావ్యంలో అయితే పాఠకుడు తన మనఃఫలకంపై కల్పించుకుంటాడు. ఇలా పాఠకుడు ఇతివృత్తంలోని సన్నివేశాలను తన మనఃఫలకంపై చిత్రించుకొనుటకు తగిన హావభావ చేష్టావిశేషవర్ణనలు కవి చేస్తున్నప్పుడు ఇలా చేయడం వలన ఇతివృత్తం మరింత ఆస్వాద్యమానమవుతుంది. కావున అర్థవృత్తులు కవితా ద్రవ్యములే. శ్రవ్యకావ్యంలో వాటినే 'వర్ణనలు' అంటున్నాం.

### 2.5.4.3 అనుమానం

మహిమభట్టు 'వ్యక్తివివేకము'లో అర్థం 1. వాచ్యం, 2. అనుమేయం అని రెండు రకాలని చెప్పాడు. ఇతడు వాచ్యం ఆధారంగా చేసుకొని అనుమానింపబడు అర్థాంతరం అనుమేయం అన్నాడు. వాచ్యార్థాన్ని మించి మరొక అర్థం స్ఫురింప జేసే శక్తి 'అనుమానం'అని ఇతని అభిప్రాయం. ఈ అనుమానంలోనే ఇతడు, ఆనందవర్ధనుడు చెప్పిన లక్షణ, వ్యంజనాలను అంతర్గతమొనర్చాడు.

ఆవిధంగా చూస్తే ఏ కవితా ద్రవ్యాన్ని ఆనందవర్ధనుడు లక్షణ, వ్యంజనాలుగా గుర్తించాడో, దానినే మహిమభట్టు అనుమానం అని చెప్పాడని అనుటలో సందేహం లేదు. కావున 'అనుమానం' కవితా ద్రవ్యమే. దండి ఉక్తులన్నీ స్వభావోక్తులు, వక్రోక్తులు అని చెప్పడం. (దండి: 218)

### 2.5.4.4 ఔచిత్యం

పాఠకుని రసానందస్థితికి కొనిపోవునట్లు మహాకవి కావ్యరచన చేయవలెను. రసభంగం కాకుండా జాగ్రత్తపడవలెను. రసభంగమైతే కావ్యప్రధాన ప్రయోజనమే దెబ్బతింటుంది. రసభంగం కలిగిందీ అంటే అక్కడ అనౌచిత్యమేదో వాటిల్లినదని అర్థం. రసభంగం కలుగకుండా కవి చేయు కావ్య నిర్మాణ కార్య రహస్యమే ఔచిత్యం. కవి చేయవలసినది ఔచిత్య సంరక్షణ.

ఇది రచనాగతం. తత్ఫలితం పాఠకుని అవిచ్ఛిన్న రసాస్వాదనం.

"ఔచిత్యస్య చమత్కార కారిణశ్చారు చర్వణే
రస జీవిత భూతస్య విచారం కురుతేఽధునా" (క్షేమేంద్రుడు: 2)

ఔచిత్యం ఉన్నపుడే ఇతర కావ్యలక్షణాల వలన చమత్కారం కలుగునని, ఔచిత్యం లేనపుడు మిగిలినవి ఎన్ని ఉన్నా వృథాయేననీ, ఔచిత్యమొక్కటే స్థిరమైనదనీ, క్షేమేంద్రుని అభిప్రాయం.

దీనినిబట్టి ఔచిత్యం కవితా ద్రవ్యమా? కాదా? అని విచారిస్తే ఔచిత్యం అనేది కవి ప్రత్యేకించి సృజించే ఒకానొక కవితాంశం కాదు. ఔచిత్యం అనే ఒక కవితాంశం ఉండదు. అది కావ్య నిర్మాణ కార్యంలో ప్రతి సూక్ష్మాంశం దగ్గర రసభంగ హేతువులైన వాటిని కాకుండా జాగ్రత్త పడవలసిన ఒకానొక కవికర్మ. ఇది 27 రకాలుగా ఉంటుందని క్షేమేంద్రుడు విపుల చర్చ చేశాడు.

కావున ఔచిత్యం అనేది కవితా ద్రవ్యం కాదు. ఆచార్య పుల్లెల రామచంద్రుడి మాటలు ఈ అభిప్రాయాన్నే బలపరుస్తున్నాయి. "... ఈ ఔచిత్య సిద్ధాంతానికి అలంకార, ధ్వని సిద్ధాంతాలవలె స్వతంత్ర ప్రతిపత్తి ఇవ్వవలసిన పనిలేదు.." (క్షేమేంద్రుడు. అవతరణిక: IX )

**2.5.4.5 వాచ్య, లక్ష్య, వ్యంగ్యాలు**

శబ్దానికి అర్థాన్నివ్వగల శక్తి మూడు రకాలుగా ఉంటుంది. అవి 1. అభిధ, 2. లక్షణ, 3. వ్యంజన. అవి ఇచ్చే అర్థాలు క్రమంగా 1. వాచ్య, 2. లక్ష్య, 3. వ్యంగ్యము (ధ్వని)లు.

1. వాచ్యం :- సంకేతితార్థమే వాచ్యం. ఇది సాధారణార్థం ఇస్తున్నప్పటికీ, ఆ సాధారణ అర్థమే కావ్య సందర్భంలో మనోహరత్వాన్ని కలిగిస్తే అది కవితా ద్రవ్యమే అవుతుంది. స్వభావోక్తి అలంకార రహస్యమిదే. కావ్యసందర్భానికి మనోహరత్వాన్ని కలిగించకపోతే అది కవితాద్రవ్యం కాదు.

2. లక్ష్యం :- ముఖ్యార్థమునకు బాధ కలిగినపుడు రూఢిని బట్టి గాని, ప్రయోజనాన్నిబట్టి గాని చెప్పుకొనే సమీపార్థం - లక్ష్యం.

లక్ష్యం కవితా ద్రవ్యమే. ఎందుకంటే ఇది సంకేతితార్థానికి సమీపార్థమే అయినప్పటికీ, సంకేతితార్థాన్ని మించిన వక్రత్వం, చారుత్వం దీనియందు కలుగుట మనం చూస్తున్నాం కదా!

3. వ్యంగ్యం (ధ్వని) :- వాచ్యార్థం తెలిసిన తరువాత పాఠకుని స్థాయిని అనుసరించి, ఒక్కొక్క రకంగా స్ఫురించే (వాచ్యార్థానికి అతీతమైన) రమణీయార్థమునే వ్యంగ్యం (ధ్వని) అంటారు.

కావ్యానికి అత్యంత ప్రధానమైనది, పాఠకునికి ప్రత్యక్షంగా రసానందాన్ని కలిగించునది, కావ్యాత్మగా చెప్పబడినదీ అయిన ధ్వని కవితా ద్రవ్యం అనుటలో ఎలాంటి సందేహం లేదని ఖండితంగా చెప్పవచ్చు.

**2.5.4.6 వక్రోక్తి**

వాఙ్మయం అంతటినీ స్వభావోక్తులు, వక్రోక్తులు అని రెండుగా దండి విభజించాడు. (దండి: 218) నిజానికిది చాలా చక్కని విభజన. ఆనందవర్ధనుడు చెప్పిన వాచ్యం స్వభావోక్తియే. లక్ష్య, వ్యంగ్యములు రెండూ వక్రోక్తులే. ఈ చొప్పున ఇద్దరి వర్గీకరణ స్థూలంగా ఒకటే.

కుంతకుడు వక్రోక్తిని ప్రామాణికంగా సిద్ధాంతీకరిస్తూ అవి ఆరు విధాలుగా ఉంటుందని చెప్పాడు. అవి - 1. వర్ణవిన్యాస వక్రత, 2. పదపూర్వార్థ వక్రత, 3. పదపరార్థ (ప్రత్యయ) వక్రత, 4. వాక్య వక్రత, 5. ప్రకరణ వక్రత, 6. ప్రబంధ వక్రత.

వక్రోక్తి అనే విస్తృత అవనిపై అన్ని రకాల కవితా ద్రవ్యాలను ఇమడ్చడం చూస్తే కుంతకుని వ్యూహరచన ఎంత మహోన్నతమో తెలుస్తుంది. 'వక్రత' అంటే రమణీయార్థమే కాబట్టి వక్రోక్తి కవితాద్రవ్యమేనని చెప్పుట నిర్వివాదాంశం.

**2.5.4.7 అర్థాలంకారాలు**

వక్రోక్తి, ధ్వనుల మాదిరిగానే అన్ని రకాల కవితా ద్రవ్యాలని తనలో ఇముడ్చుకొన్నది అర్థాలంకారం. మహాకవి దర్శన గాఢతను తెలియజేసే ఉపమాన ప్రాతినిధ్యం కలిగి ఉంటూ సన్నివేశాన్ని రూపుకట్టించుటకు, రమణీయార్థాన్ని స్ఫురింపజేయుటకు సమర్థమైనది కావటం వలన అర్థాలంకారం కవితా ద్రవ్యమనుటలో ఎలాంటి సందేహం లేదు. (అర్థాలంకారాల గూర్చి విపుల చర్చ తరువాత ఉంటుంది.)

### 2.5.5 కవితా ద్రవ్యాలు

మహాకవి సృజనలో భాగమై, రచనాగతమై ఇతివృత్తాన్ని ఆస్వాద్యమానం చేస్తూ పాఠకుని రసానందానుభూతికి కారణమయ్యే ప్రతి అంశం కూడా కవితా ద్రవ్యమనే చెప్పవచ్చు. ఈ చర్చ ద్వారా మన అలంకారికులు చెప్పిన కావ్యగత అంశాలలో ఏవి కవితా ద్రవ్యాలో? ఏవి కావో? తెలిసింది. ఇదే విషయాన్ని కింది విధంగా చెప్పవచ్చు.

కవితా ద్రవ్యాలుగా చెప్పుకోదగ్గవి -

1. రసోన్ముఖంగా మార్పు చేసిన ఇతివృత్తం, 2. శబ్దాలంకారాలు, 3. గుణాలు, 4. రీతులు, 5. శయ్య, 6. అర్థవృత్తులు, 7. అనుమానం, 8. వాచ్య, లక్ష్య, వ్యంగ్యం (ధ్వని), 9. వక్రోక్తి, 10. అర్థాలంకారాలు.

కవితా ద్రవ్యాలు కానివి - 1. రసం, 2. పాకం, 3. ఔచిత్యం, 4. మూలకథ.

### 2.5.6 మౌలిక కవితా ద్రవ్యాలు

అలంకార శాస్త్రాలలో కావ్యగతాంశాల తత్త్వాన్ని గూర్చిన అనేక చిక్కుముడులను విప్పుటకు, మౌలిక (మూల) కవితా ద్రవ్య వివేచన బాగా ఉపకరిస్తుంది.

భరతుని నుండి నేటి వరకూ గల ఆలంకారికుల అలంకార శాస్త్రగ్రంథాలను పరిశీలిస్తే ఒక విషయం తేటతెల్లం అవుతుంది. అది- ఒక మౌలిక కవిత్వ లక్షణాన్ని వేర్వేరు దృక్కోణాల నుండి విశ్లేషించి, వేర్వేరు పరిభాషలతో చెప్పి వాటిని పునరావృతం చేశారని తెలుస్తుంది. అంటే వేర్వేరని చెప్పిన అనేక కవితాంశాలు నిజానికి ఒక్కటే. ఈ కవితా ద్రవ్యాలన్నిటికీ మౌలిక కవితా ద్రవ్యాలు ఏవి అని వివేచింప వలసి ఉంది. ఇంతకు ముందు చేసిన విపుల చర్చను ఆధారంగా చేసుకొని మౌలిక ద్రవ్యాలను కింది విధంగా పేర్కొనవచ్చు.

#### 2.5.6.1 రసోపస్కారకంగా మార్పులు చేసిన ఇతివృత్తం

మూలకథలో రసోపస్కారకంగా మార్పులు చేయబడిన ఇతివృత్తం కవి సృజనలో భాగమై ఆనందానుభూతికి కారణం అవుతుంది కావున ఇది కవితా ద్రవ్యమౌతుంది. దీనినే కుంతకుడు ప్రకరణ వక్రత (సన్నివేశ కల్పన), ప్రబంధ వక్రత, (నిర్దిష్ట రసోన్ముఖంగా కథను నడిపించుట)గా చెప్పాడు.

#### 2.5.6.2 శబ్దం (నాదగుణం)

శ్రవ్యకావ్య పఠనం వలన అర్థంతో సంబంధం లేకుండానే పాఠకున్ని మైమరిపించేది - రచనలోని లయాత్మకత మరియు నాదగుణం. లయాత్మకత అచ్చుల హ్రస్వదీర్ఘాలమేళవింపు వలన ఏర్పడేది. ఇది ప్రధానంగా స్వరప్రధానమైనది. దీనిని ఛందశ్శాస్త్రం వివరిస్తుంది.

నాదగుణం వర్ణాల (ప్రత్యేకించి హల్లుల) అమరిక వలన కలుగుతుంది. వర్ణాల క్రమం, అవి పునారావృతం అయ్యేతీరు వలన ఈ నాదగుణం ఏర్పడుతుంది. ఒకటి, రెండు, లేదా బహు వర్ణాలు, ద్విత్వ, సంయుక్త, బిందు పూర్వక వర్ణాల క్రమాన్నిబట్టి ఈ నాదగుణం ఏర్పడుతుంది. ఇది తాళ సంబంధమైనది.

ఈ వర్ణ సంయోజనం వలన ఏర్పడే శ్రవణ సుభగమైన నాదగుణానికే ఆలంకారికులు వేర్వేరు పరిభాషలతో, వివిధ కోణాల నుండి, వివిధ రకాల సూక్ష్మ వర్గీకరణతో చెప్పారు. అవి - 1. కేవల శబ్దాలంకారాలు, 2. గుణాలు, 3. రీతులు, 4. శయ్య, 5. వర్ణ విన్యాస వక్రత, 6. అర్థవృత్తులలోని భారతీయ వృత్తి, 7. మిశ్రాలంకారాలు (రెండు శబ్దాలంకారాలు కలవడం వలన ఏర్పడేవి).

బాగా వివేచిస్తే ఇవన్నీ వేర్వేరు కాదనీ, ఒకటేనని వాటి నిర్వచనాల సారాంశాన్ని కూలంకషంగా పరికిస్తే మనకు తేటతెల్లమవుతుంది. (వీటి చర్చ ముందే చేయడం జరిగింది.) కావున వీటన్నింటి బదులుగా ఒక్క 'శబ్దం'ను మౌలిక (మూల) కవితా ద్రవ్యంగా భావిస్తే సరిపోతుంది.

#### 2.5.6.3 శబ్దార్థ ద్వయం

కేవల శబ్దాలను, కేవల అర్థాలను కాకుండా శబ్దార్థాలను రెంటినీ ఏకకాలంలో పరిగణనలోనికి తీసుకోవడం వలన ఏర్పడే కవితా ద్రవ్యమిది. వీటిని ఆలంకారికులు శబ్దాలంకారాలలోను (యమక, ఛేక, లాట, అనుప్రాసలు), మిశ్రాలంకారాలలోనూ (ఒక

శబ్దాలంకారం, ఒక అర్థాలంకారం తిలతండుల న్యాయంలో గాని, క్షీరన్యాయంగా గాని కలవడం వలన ఏర్పడేవి) చేర్చడం జరిగింది. కావున శబ్దార్థద్వయం ఒక మౌలిక కవితా ద్రవ్యం.

### 2.5.6.4 అర్థం

కావ్యం యొక్క ప్రధాన ప్రయోజనం నెరవేరేది 'అర్థం' అనబడే ఒకానొక కవితా ద్రవ్యం ద్వారానే. ఈ 'అర్థం' నే ఆలంకారికులు పలుపేర్లతో (విభిన్నములని భావిస్తూ) చెప్పడం జరిగింది. అవి - 1. వాచ్యార్థం, 2. లక్ష్యార్థం, 3. వ్యంగ్యార్థం (ధ్వని), 4. వక్రోక్తి (పద పూర్వార్థ, ప్రత్యయ వక్రతలు), 5. అనుమానం, 6. (రమణీయార్థం స్ఫురింపచేసే కొన్ని) అర్థాలంకారాలు.

పై వాటి తత్త్వాన్ని అర్థం చేసుకొంటే నిజానికి అవి అన్నీ భిన్నమైనవి కావని ఒకటేనని తెలుస్తుంది. 'అర్థం' అనే ఒక కవితా ద్రవ్యాన్నే ఇన్ని విధాలుగా చెప్పారని తెలుస్తుంది. కావున 'అర్థం' ఒక మౌలిక కవితా ద్రవ్యం.

### 2.5.6.5 ఉపమాన ప్రాతినిధ్యం

మహాకవి ఒక వస్తువును వర్ణించునప్పుడు, తత్సామ్యమైన మరొక వస్తువును దర్శిస్తాడు. ఆ మరొక వస్తువే ఉపమానం. ఇట్టి దర్శనమున్నపుడే అతడు కవి అనిపించుకుంటాడు. ఈ ఉపమాన దర్శనమే, సన్నివేశాన్ని రక్తి కట్టించుటకు మూల కందమవుతుంది. కావున ఉపమాన ప్రాతినిధ్యం అనేది ఒక ప్రధాన కవితాద్రవ్యం. ఈ అంశాన్ని కేంద్రంగా చేసుకొని అర్థాలంకారాల చర్చ చేశారు అలంకారికులు. ఉపమాన ప్రాతినిధ్యం కలవిగా చెప్పుకొనేవి - 1. అర్థాలంకారాలు, (ఉపమానంతో సంబంధం కలవి.) 2. వాక్య వక్రత, 3. మిశ్రాలంకారాలు (రెండు అర్థాలంకారాలు కలవడం వలన ఏర్పడేవి), 4. ప్రతీకలు, 5. భావచిత్రాలు.

పైన చెప్పిన వాటిలో శబ్దం, శబ్దార్థద్వయం, అర్థం, ఉపమాన ప్రాధాన్యం అనే కవితాద్రవ్యాలు అయిన శబ్ద, శబ్దార్థ అలంకారాల గూర్చిన విపుల సిద్ధాంత చర్చ మరియు వాటిని పోతన భాగవతానికి అన్వయించడం ఈ పరిశోధన పరిధిలోకి వస్తుంది. ఇంతవరకూ జరిగిన చర్చను తరువాత పుటలోని పట్టిక ద్వారా తెలుసుకోవచ్చు.

## 2.5.7. కవికర్మ : రసోదయం (పట్టిక)



## 2.6. అలంకారాలు

**2.6.0.** అలంకారాలను పోతన భాగవతానికి అన్వయించే ముందు అలంకారాల స్వరూపస్వభావాలను గూర్చి కొంత చర్చింపబడుతుంది.

### 2.6.1. అలంకార సిద్ధాంత పరిణామం : పూర్వరంగం

అలంకారాలు శాస్త్రీయంగా సిద్ధాంతీకరించబడింది భరతుని (క్రీ.పూ. 6వ శ.) నుండి అయినప్పటికీ మానవ మేధలోని వాటి స్పృహ మానవ ఆవిర్భావ కాలం నుండి ఉన్నదని చెప్పవచ్చు. ఒక వస్తువుని గురించి తెలియజేయడానికి సామ్యధర్మం గల మరొక వస్తువును సూచించడం అనేది భాష కూడా ఏర్పడక ముందే ఉండేదని ఊహించవచ్చు. మానవుడు ఊహ కలిగినప్పటి నుండి తనకు నచ్చిన రూపాన్ని, వస్తువుని మరింత మనోహరంగా చిత్రించుకోవడం సహజం.

భాష ఏర్పడిన తర్వాత ఆ ఆలంకారిక భావాలు వ్యక్త రూపాన్ని సంతరించు కొన్నాయి. నేటికీ మనం నిత్య వ్యవహారంలో విద్యాగంధం లేని వారు సహితం 'ఆమె లక్ష్మీదేవిలా ఉంది', 'వాడు వట్టి దున్నపోతు', 'ఈ వెన్నెల పిండి ఆరబోసినట్లుంది', 'అతనిది వెన్నలాంటి మనస్సు' అంటూ ఆలంకారికంగా మాట్లాడుకోవడం చూస్తుంటాం.

లభించినంతలో అతి ప్రాచీనమైనవి అయిన వేదాలలో చక్కని అలంకారాలు ఎన్నింటినో గమనించవచ్చు.

ఉదా. "ద్వా సుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే

తయోరేకం పిప్పలం స్వాద్వత్త్యనశ్నన్నన్యో అభిచాకశీతి"(ఋగ్వేదం. 1-164-20. చూ. దండి. తొలిపలుకులు:4)

(ఒకే వృక్షం పై ఉండే రెండు పక్షులలో ఒకటి తీపి, చేదు ఫలాలను భక్షిస్తుండగా, వేరొకటి ఏమీ తినకుండా ప్రకాశిస్తూ ఉంది.) ఆత్మ, పరమాత్మల స్వభావం, వాటి మధ్యగల తేడా చక్కగా ఉపమానం ద్వారా చెప్పడం జరిగింది.

"సికతా ఇవ సంయన్తి రశ్మిభిః సముదీరితాః

అస్మల్లోకాదముష్మా ఋషి ఖిరదాత్ ప్రశ్నిభిః" (తైత్తరీయారణ్యకం. 1-27-5. చూ. నరసింహారావు: 5)

(జీవుల సంసార బంధమనేది - ఇసుక రేణువులు గాలిలో ఎగిరిపోతూ ఒక దానితో ఒకటి కలసి, మరల విడిపోవునట్లు ఉంటుంది.)

సంసారబంధం ఎంత తాత్కాలికమో చక్కని ఉపమానం ద్వారా సూచించడం జరిగింది. వేదాల తరువాత చెప్పుకోదగిన వాటిలో రామాయణ, భారత, భాగవతాదులలో, కాళిదాసాదుల కావ్యాలలోను అలంకారాలు పరిపుష్టి పొందినవి.

లక్ష్యం పుట్టిన తరువాతనే లక్షణం పుడుతుంది. ఈ మాట అలంకారాల విషయంలో కూడా వాస్తవమే. అలంకార శాస్త్రానికే 'సాహిత్య విద్య', 'సాహిత్య శాస్త్రం', 'కావ్యశాస్త్రం' అనే పేర్లు ఉన్నాయి. అలంకార శాస్త్రంలో కేవలం అలంకారాలనే కాకుండా కావ్యలక్షణాలు, రసం, ధ్వని మొదలైనవి కూడా చర్చించటం కలదు. అలంకారాల ప్రాచీన ప్రయోగం వేదాలందు కనిపించినా, అలంకార లక్షణ భావన ప్రాచీన నిఘంటువులలో, వ్యాకరణ శాస్త్రాలలో అస్పష్టంగా చెప్పబడుట చూడవచ్చు.

'ఉపమా' శబ్దం మొదటగా ఋగ్వేదంలో (1-31-15 మరియు 5-34-9. చూ. నరసింహారావు: 23) కనబడుతోంది. సాయణుడు దీనికి ఉపమానం, దృష్టాంతం అనే అర్థాలు చెప్పాడు. అయితే ఇది అలంకార దృష్టితో చేసినది కాదు. యాస్కుడు 'అలంకార' శబ్దాన్ని అలంకార పరిభాషగా గాక 'అలంకరిష్ణు' (అలంకరించేది) అనే అర్థంలో నిరుక్తంలో ప్రయోగించాడు. ఉపమార్థ నిపాతములను వివరిస్తూ ఇవ, యథా, న, చిత్, ను, ఆ - అను ఆరు ఔపమ్య బోధక శబ్దానుబంధములు చూపడం జరిగింది. యాస్కుడు కర్మోపమా, భూతోపమా, రూపోపమా, సిద్ధోపమా, లుప్తోపమాలను చెప్పాడు. ఈ సందర్భంలో గార్గ్యుని ఉపమా నిర్వచనాన్నే యాస్కుడు ఉటంకించాడు. దీన్ని దుర్గాచార్యుడు ఇట్లు వివరించాడు.

"ఏవం అతత్ తత్ స్వరూపేణ గుణేన గుణా సామాన్యా-

దుపమీయతే ఇతిఏవం గార్గ్యాచార్యోమన్యతే" ఇదే సాహిత్యోపమకు తొలి పరిగణనం. (చూ. నరసింహారావు: 24)

పాణిని ఉపమా సూత్రాలను ఏబది సూత్రాలలో వ్యాకరణ దృష్టితో వివరించాడు. ఇతడు ఉపమాన, ఉపమిత, సామాన్య, ఉపమ, ఔపమ్య, ఉపమార్థ, సాదృశ్య శబ్దాల వంటి వాటిని పేర్కొన్నాడు. కృత్, తద్ధిత, సమాసాంత రూపాలపై ఉపమా ప్రభావాన్ని తెలిపాడు. కాత్యాయనుడు పాణినిని అనుసరించి శబ్ద రూపాలపై ఔపమ్య ప్రభావాన్ని తెలిపాడు. ఫిట్ సూత్రంలో శాంతనవుడు కూడా కొంత వివరణ చేశాడు. మహాభాష్యంలో పతంజలి పాణిని ప్రయోగించిన 'ఉపమ' శబ్దాన్ని నిర్వచించి ఉదాహరణలతో వివరించాడు. కావ్య శాస్త్రం నుండి భాషాతత్త్వ పరిశీలనా ఫలంగా రూపెత్తినది. అలంకార శాస్త్రానికి వ్యాకరణమే

పితృస్థానీయం.

'వేదాంత సూత్రంలో 'రూపక' శబ్ద ప్రయోగం ఉంది (1-4-1). బాదరాయణుడు 'శారీరక సూత్రము'లో రూపకాన్ని అంగీకరించెనని అప్పయ దీక్షితుడు చిత్రమీమాంస లోను ఉదాహరించాడు. ఛాందోగ్యోపనిషత్తులో ప్రసిద్ధమైన విద్యావిభాగ వివరణంలో ఆరు అంగాలలో కావ్య విద్య చేర్చబడలేదు. ఆపస్తంభం లోను ఆరు మాత్రమే. యాజ్ఞవల్క్యంలో 14, విష్ణుపురాణంలో 18, విద్యాంగాలు చెప్పబడినవి. అయినా కావ్య శాస్త్ర ప్రసక్తి లేకపోవుట దీని అర్వాచీనతను సూచిస్తుంది. లలిత విస్తరంలో కావ్య కరణ గ్రంథం, నాట్యం పేర్కొన బడినవి. శుక్రనీతి కంటే ముందు వరకును అలంకార శాస్త్రం అను మాట లేదు. అర్థ, కామ, శిల్ప శాస్త్రాల వంటి 32 శాస్త్రాలలో అలంకార శాస్త్రం శుక్రనీతిలో చేర్చబడింది.

అశ్వఘోషుని బుద్ధచరితంలో ఉపమ, ఉత్ప్రేక్ష రూపకములవంటి సామాన్య అలంకారాలే గాక, యథాసంఖ్య, అప్రస్తుత ప్రశంస వంటి విశేష అలంకారాలు పేర్కొనబడ్డాయి. క్రీ.శ. 2వ శతాబ్దం నాటి గిర్నార్ శాసనంలో 'స్ఫుట, లఘు, మధుర, చిత్ర, కాంత, శబ్ద సమయోదారాలంకృత గద్యపద్యాల ప్రశంస గలదు.

సుబంధుడు ప్రతిపదంలో శ్లేషను పోషింతునని 'వాసవదత్త' కృతి కూర్చాడు. ఉత్ప్రేక్షను ఆక్షేపంలో అతడు పేర్కొన్నాడు. బాణుడు సమ, జాతి, దీపక, శ్లేషలను పేర్కొనెను.' (చూ. నరసింహారావు: 25)

ఈ విధంగా అలంకారికుల గురించి భరతుని కంటే ముందు వరకూ స్పష్టాస్పష్ట భావాలు ఉండెనని తెలుస్తున్నది.

### 2.6.2 అలంకార సంప్రదాయం

రస మీమాంసను భరతుడు నందికేశ్వరుని ఉపజ్ఞగా పేర్కొన్ననూ అతని రచన అలభ్యం. క్రీ.పూ. 6వ శ. నాటి అలంకార శాస్త్రం ఒక స్పష్ట రూపాన్ని పొందింది. భరతుని నాట్యశాస్త్రం వెలయుట దీనికి కారణం.

**భరతుడు** నాలుగు అలంకారాలను చెప్పుటను బట్టి అలంకారాలను గూర్చిన సూక్ష్మ వివేచన, వాటి సంఖ్య అంతగా అభివృద్ధి చెందకుండానైనా ఉండాలి. ఒక వేళ అభివృద్ధి అయినా భరతుడు రూపకానికి(దృశ్యకావ్యానికి) కావలసినవని భావించిన వాటిని (నాలుగు) మాత్రమే చెప్పి ఉండాలి. ఏమైనా అలంకారాలను కావ్య సామగ్రిగా మొదట పేర్కొన్నది భరతుడే. భరతుడు అలంకారాలను గూర్చి ఇలా చెబుతాడు.

"అలంకారైర్గుణై శ్చైవ బహు భిర్యదలంకృతమ్

భూషణైరివ విన్యస్తై తద్భూషణమితి స్మృతమ్" (చూ. నరసింహారావు: 9) సముచితంగా కూర్చబడిన కటకాద్యాభరణాల వలె నానావిధ గుణాలంకారాలచే కావ్యంలో కలుగు అలంకారం 'విభూషణ' మన దగునని భావం.

భరతుడు 36 కావ్య'లక్షణా'లను చెప్పాడు. (కాని ఉదాహరణలు ఇవ్వలేదు.) అనంతర ఆలంకారికులలో చాలా మంది వీటిని స్వీకరించలేదు. కొందరు వీటిలో కొన్నిటిని అలంకారాలలో ఇమిడ్చారు. సింగ భూపాలుడు 'లక్షణా'లను 'భూషణా'లనే పేరుతో వ్యవహరించాడు. శారదా తనయుడు 'భూషణా'లని ఆదిలో చెప్పి, అంతంలో 'అలంకారాల'న్నాడు. విశ్వనాథాదులు 'నాట్యాలంకారా'లన్నారు. భోజుడు 64 లక్షణాలను చెప్పాడు. తరువాత కాలంలో 'లక్షణా'లు మరుగునపడి 'అలంకారాలు' ప్రసిద్ధికెక్కినాయి. (చూ. భరతుడు: 460-461)

**భామహుడు** అలంకారాలకు సిద్ధాంత ప్రతిపత్తి కలిగించి అవి శ్రవ్యకావ్యానికి తప్పనిసరి అని పేర్కొంటూ, వాటికి మహోన్నత స్థానం ఇచ్చిన వారిలో ప్రథమ గణ్యుడు. ఇతడు 36 అలంకారాలను చెప్పుటను బట్టి ఇతని వివేచన విశిష్టత తెలియవస్తుంది. ఇతడు చేసిన అలంకార తత్త్వ వివేచన, అలంకార నిర్ణయం మొదలగునవి తర్వాతి లాక్షణికులకు మార్గదర్శకమైనవి.

భరతుని రససిద్ధాంతానికి ధీటుగా అలంకార సిద్ధాంతాన్ని వ్యాప్తిలోకి తెచ్చింది భామహుడే.

"రూపకాదిరలంకారస్తస్యాన్యైర్బహుధోదితః

న కాంతమపి నిర్భూషం విభాతి వనితాననమ్" (భామహుడు: 6)

కావ్యానికి రూపకం మొదలగు అలంకారాలు ఇతరులచే అనేక విధాలుగా చెప్పబడ్డాయి. స్త్రీముఖం సుందరమైనదైనను అలంకార రహితమైనచో ప్రకాశింపదు. అని అలంకారాల ఆవశ్యకతను, అనివార్యతను నొక్కిచెప్పాడు.

రూపకాద్యలంకారాలను బాహ్యలక్షణాలనేవారిని ఇతడు తిరస్కరించాడు.

"రూపకాదిమలంకారం బాహ్యమాచక్షతే పరే

సుపాం తిఙాం చ వ్యుత్పత్తిం వాచాం వాంఛాన్త్యలం కృతిం

తదేత దాహుః సౌశబ్ద్యం నార్థవ్యుత్పరీదృశీ" (భామహుడు: 6)

శబ్దాలంకారాలు, అర్థాలంకారాలు రెండూ అంగీకారాలే అని ఇతని అభిప్రాయం.

శబ్దాభిధేయాలంకార భేదాదిష్టం ద్వయన్తు నః" (భామహుడు: 7)

ఇతడు కవితాభివ్యక్తికి జీవ లక్షణంగా వక్రోక్తిని చెప్పాడు. "వక్రాభిధేయ శబ్దోక్తి రిష్టావాచామలంకృతిః" (భామహుడు: 17). వక్రములగు అర్థలయొక్కయు, శబ్దలయొక్కయు కూర్పు వాక్కులకు (కావ్యములకు) అలంకారంగా అంగీకరింప బడునని, అలంకారం ప్రధానమని చెప్పినది ఇతడే. ఆ వక్రత ఉన్నపుడే అలంకారం రమణీయతను సంతరించుకొంటుందని చెప్పాడు. లోకవ్యవహార భిన్నంగా తగిన శబ్దార్థ యోజనం కలిగించునది వక్రోక్తి అని భావించాడు.

"యుక్తం వక్ర స్వభావోక్త్యా సర్వమేవై తదిష్యతే" (భామహుడు: 14) అంటూ సర్వానికి వక్రత అనివార్యమని చెప్పడం వలననే, వక్రత లేని జాతి (స్వభావోక్తి), హేతు, సూక్ష్మ, లేశాలంకారాలను ఇతడు అంగీకరించలేదు.

"నిమిత్తతో వచోయత్తు లోకాతిక్రాన్త గోచరమ్

మన్యన్తేzతిశయోక్తిం తామలంకార తయా యథా" (భామహుడు: 64)

వక్రోక్తి వలె, అతిశయోక్తిని కూడా విస్తృతార్థంలో ఇతడు గ్రహించాడు. అతిశయోక్తిని ఒకవైపు అలంకారంగా చెప్తూనే, వక్రోక్తివలె విపులార్థాన్ని కూడా ప్రతిపాదించారు.

"ఇత్యేవమాతి రుదితా గుణాతిశయ యోగతః

సర్వైవాతిశయోక్తిస్తు తర్క యోత్తాం యథాగమమ్" (భామహుడు: 65)

ఇలా అనేక విధాలుగా గుణాతిశయంతో సంబంధం ఉండుటచే అన్ని విధాలా అతిశయోక్తియు ఏర్పడునని చెప్పబడినది. దాన్ని శాస్త్రానుసారంగా ఊహించు కొనవలెను అని చెప్పాడు.

"సైషా సర్వైవ వక్రోక్తి రనయార్థో విభావ్యతే

యత్నోzస్యాంక వినా కార్యః కోzలంకారోzనయావినా" (భామహుడు: 66)

ఈ అతిశయోక్తి అంతా వక్రోక్తియే. ఈ వక్రోక్తి (లోకోత్తర గుణ వర్ణనం) చేత అర్థం సంస్కరింపబడుతుంది. అందంగా ఉండునట్లు చేయబడుతుంది. అందుచేత కవి దీని విషయంలో ప్రయత్నం చేయాలి. ఈ వక్రోక్తి లేకున్నచో ఇంక అలంకారమేమున్నదంటూ అలంకారానికి వక్రోక్తి/అతిశయోక్తి తప్పనిసరి అని అది లేకుండా అలంకారం ఉండదని కంఠోక్తిగా చెప్పాడు. ఇక్కడ వక్రోక్తికి, అతిశయోక్తికి అభేదం చెప్పడం గమనార్హం. భామహుడు పర్యాయోక్త్యాదులలో ధ్వన్యర్థాన్ని, రసవదలంకారాలలో రస భావాలని అంతర్భవింపజేశాడు. భామహుడు శబ్దజాలాన్ని విశిష్టార్థ వ్యవచ్ఛిన్నంగా కూర్చుటనే వక్రోక్తిగా భావించి సర్వాలంకారాలందుండు వైచిత్రికి దాన్ని సామాన్య సంకేతంగా గుర్తించాడు.

దండి వాఙ్మయ ప్రపంచమంతటిని స్వభావోక్తి, వక్రోక్తి అని ద్విధా విభజింపదగునని చెప్పాడు.

"శ్లేషః సర్వాసు పుష్ణాతి ప్రాయో వక్రోక్తిషు శ్రియమ్

భిన్నం ద్విధా స్వభావోక్తిర్వక్రోక్తిశ్చేతి వాఙ్మయమ్" (దండి: 218)

అలంకారాలు గ్రామ్యతాదోషదుష్టం కానప్పుడే రసపుష్టిని కలిగించునని చెప్పాడు.

"కామం సర్వోzప్యలంకారోరసమర్థే నిషించతు

తథాప్య గ్రామ్య తై వైనం భారం వహతి భూయసా" (దండి: 32)

అగ్ని పురాణ కర్త -

"సంక్షేపాద్వాక్య మిష్టార్థ వ్యవచ్ఛిన్నా పదావళీ

కావ్యం స్ఫుటదలంకారం గుణవద్దోషవర్జితమ్" (అగ్నిపురాణం. చూ. నరసింహారావు: 34)

అంటాడు. ఇష్టార్థ వ్యవచ్ఛిన్నమైన పదసమూహమే కావ్యమని చెప్పి, దానికి అలంకారాలు కూడా ఆవశ్యకమని చెప్పాడు. దండి కూడా ఈ విధంగా భావించాడు.

"తైః శరీరంచ కావ్యానామలంకారాశ్చ దర్శితాః

శరీరం తావదిష్టార్థవ్యవచ్ఛిన్నాపదావళీ" (దండి: 5)

వామనుడు కూడా అలంకారాల ప్రాధాన్యతను చెప్పాడు.

"కావ్య శబ్దోzయం గుణాలంకార సంస్కృతయో

శబ్దార్థయోర్వ్రర్తతే" (చూ. నరసింహారావు: 34)

"గుణాలంకార యుక్తార్థౌ కావ్యమ్ (చూ. నరసింహారావు: 34)

"కావ్యం గ్రాహ్యమలంకారాత్" (చూ. నరసింహారావు: 34)

అలంకారాన్ని అందరివలె సంకుచితార్థంలో కాకుండా, విస్తృతార్థంలో గ్రహించడం వామనుని ప్రత్యేకత. ఇతడు "సౌందర్యమలంకారః" (వామనుడు: 7) అని కావ్యసౌందర్యమే అలంకారమని నిర్వచించారు. విశేషమేమంటే - సౌందర్యాన్ని కలిగించే సమస్త కవితాంశములనే కాక, ఆ కలిగే సౌందర్యం కూడా అలంకారమేనని ఈతని భావన. కార్యం, తత్ఫలం రెండూ అలంకారమే అనుట ద్వారా వామనుడు అలంకారమును విస్తృత యవనికగా తీసుకున్నాడని చెప్పవచ్చు.

భామహుని తరువాత అలంకార సంప్రదాయాన్ని బలోపేతం చేసినవారు - ఉద్భటుడు, రుద్రటుడు, రుయ్యకుడు.

**మమ్మటుడు** కావ్యసామగ్రిలో అలంకారాలను కూడా పరిగణించాడు.

"తదదోషౌ శబ్దార్థావనలంకృతీ పునః క్వాపి" (మమ్మటుడు: 8)

మమ్మటాదులు కొందరు అలంకారాలను కేవలం శరీరంపై ధరించే బాహ్య ఆభరణాల వంటివని భావించారు అవి ఆత్మకు ఉత్కర్ష కలిగిస్తాయని చెప్పారు.

"ఉపకుర్వంతి తం సంతం యోऽఙ్గద్వారేణజాతుచిత్

హారాది వదలంకారాస్తేऽను ప్రాసోపమాదయః" (మమ్మటుడు: 504)

హారాదులు శరీరాంగాలకు ఉత్కర్షను కలిగించడం ద్వారా శరీరికి (ఆత్మకు) ఉత్కర్షను కలిగించినట్లుగానే, అలంకారాలు శబ్దాలు, అర్థాలు అనే అంగాలకు ఉత్కర్షను కలిగించడం ద్వారా కావ్యాత్మ అయిన రసానికి ఉత్కర్ష కలిగిస్తాయి. ఎక్కడైతే రసం ఉండదో అక్కడ అలంకారాలు చెప్పే విధానంలో కొంత వైచిత్ర్యం కల్పించడంలోనే పర్యవసానం చెందుతాయి. కొన్నిచోట్ల రసం ఉన్నా ఒక్కొక్కప్పుడు అక్కడ ఉన్న అలంకారాలు రసానికి ఉపకారకాలు కాకపోవచ్చు అని మమ్మటుడు అభిప్రాయ పడినాడు. అలంకారాలు రసోపస్కారకం కావచ్చు, కాకపోవచ్చునని ఇతని భావన. మమ్మటుడు గుణాలు రసధర్మాలనీ, అలంకారాలు చంచల వృత్తులని చెప్పాడు. (మమ్మటుడు: 509). "మమ్మటుడు అతిశయోక్తియే సర్వలంకార బీజభూతమని అభిప్రాయపడెను" (చూ. వేంకటావధాని: 169).

**జయదేవుడు** కావ్యానికి అలంకారాలు అనివార్యమని వాటి ప్రాముఖ్యతని తెలియజెప్పాడు.

"అంగీకరోతి యఃకావ్యం శబ్దార్థావనలంకృతీ

అసౌన మన్యతేకస్మాదనుష్ణమనవలంకృతీ" (జయదేవుడు)

అనలంకృతాలైన శబ్దార్థాలను కావ్యంగా అంగీకరించినవాడు అగ్నిని చల్లనైనదని భావించకుండా ఎలా ఉంటాడని ప్రశ్నించాడు.

**కుంతకుడు** - అలంకార్యాలగు శబ్ద, అర్థాలు, అలంకారాలు ఇవి మూడునూ కలిసిన సమష్టిరూపమే కావ్యం (కుంతకుడు: 24) అని చెప్పడం అలంకారాలు లేనిదే అది కావ్యం కాదని చెప్పినట్లైంది.

ఇలా చాలామంది ఆలంకారికులు కావ్యానికి అలంకారాలు అనివార్యం అని చెప్పారు.

**రుయ్యకుడు** "తదేవమలంకారా ఏవ కావ్యే ప్రధానమితి ప్రాచ్యానాంమతమ్" అంటూ రుయ్యకుడు అలంకారాలు అత్యంత ప్రధానమని చెప్పాడు. (చూ. నరసింహారావు: 37)

**జగన్నాథుడు** చెప్పిన "రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యమ్" అనే వాక్యంలోని 'రమణీయార్థం'లో అలంకార స్పర్శలేకపోలేదు.

ధ్వని సిద్ధాంతం ఆవిర్భవించిన తర్వాత అలంకారాలకు ధ్వని వాహకంగా ఉన్నతస్థానం లభించింది. ఆనందవర్ధనుడు వస్తు, రస, అలంకారాలకు ధ్వని పరంగా సమాన స్థాయిని కల్పించాడు. కావున అలంకారాలకు 'కావ్యాత్మ' స్థాయి లభించింది. అప్పటి నుండి అలంకారం నిరాఘాటంగా కావ్యసామ్రాజ్యాన్ని ఏలుటను గూర్చి అభ్యంతరం చెప్పేవారు అరుదైనారు. అంతేగాక కొన్ని ధ్వని భేదాలలో ఆనందవర్ధనుడు అలంకారాలను ఇముడ్చటనుబట్టి అలంకారాలు ధ్వని కంటే పూర్తిగా వేరుకాదని తెలుస్తుంది.

### 2.6.3 అలంకారాల స్థానం

వివిధ కావ్యగత అంశాలలో ఒకటైన 'అలంకారా'నికి ఆలంకారికులిచ్చిన స్థానాన్ని ఐదు రకాలుగా చెప్పవచ్చు.

1. భరతాది ఆలంకారికులు ఎందరో అలంకారాలను చిన్నచూపు చూశారని చెప్పవచ్చు. వీరి ప్రకారం అలంకారాలు కేవలం శరీరానికి గల బాహ్య ఆభరణాల వంటివి. శరీరం, ఆభరణాలు వేర్వేరు అయినట్లే అలంకారాలు కూడా కావ్యశరీరానికి భిన్నం. శరీరం నుండి ఆభరణాలను తొలిగించుటకు, ధరించుటకు వీలయినట్లు అలంకారాలను కావ్యశరీరం నుండి తొలగించుట, కూర్చుట సులభం. అలంకారాలు ప్రాణం ఉన్నపుడే శోభిస్తాయని, మృతదేహానికి శోభనీయాలు కానట్లు అలంకారాలు కూడా కావ్యాత్మ అయిన ధ్వని ఉన్నపుడే శోభనిస్తాయి, ధ్వని లేనపుడు శోభనీయాలు కావు. అలంకారాలు లేకున్నా శరీరానికి ఏహాని లేనట్లుగానే, అలంకారాలు లేకున్నా కావ్యత్వం చెడదు.

నాదమాధుర్యాన్నేగాక, అర్థరామణీయకతను, ఉపమాన ప్రాతినిధ్యాన్ని కలిగిన అలంకారాలను ఇంత చిన్నచూపు చూడడం భావ్యం కాదు.

2. మమ్మటాదుల ప్రకారం అలంకారాలు బాహ్య ఆభరణాలు వంటివే. అయినప్పటికీ ఆభరణాలు శరీరం ద్వారా శరీరికి (ఆత్మకు)కూడా ఉత్కర్ష కలిగించినట్లు, అవి శబ్దాలు, అర్థాలు అనే కావ్యాంగాలకు ఉత్కర్షను కలిగించడం ద్వారా కావ్యాత్మ అయిన రసానికి ఉత్కర్షను కలిగిస్తాయి.

అలంకారాలకు, కావ్యాత్మకు ఒక విధమైన సంబంధాన్ని తెలియజెప్పటం ద్వారా అలంకారాల స్థానాన్ని గ్రహించుటలో మరొకమెట్టు ఎక్కినారని చెప్పవచ్చు.

3. ఉద్భటాదుల ప్రకారం అలంకారాలు కావ్యశరీరంతో (కేయూరాద్యలంకాల వలె సంయోగ సంబంధంతో కాకుండా) శౌర్యాదులవలే సమవాయ సంబంధం కలిగి ఉన్నాయి. వీరు అలంకారాల స్థానాన్ని చక్కగా గుర్తించారని చెప్పవచ్చు.

4. ఆనందవర్ధన, అభినవగుప్తుల ప్రకారం 'అర్థరమణీయకతను బట్టి అలంకారాలు కావ్యాత్మ అయిన ధ్వని స్థాయి నందుకొనును' (బి. రుక్మిణి: 21) అట్టి వాటిని అలంకారధ్వనులుగా పేర్కొనవచ్చు. వీరు అలంకారికులకు ధ్వనితో సమానస్థాయి నిచ్చి, కావ్యాత్మగా అలంకాలను కూడా చెప్పవచ్చు అన్నారు.

5. వామనుని ప్రకారం కావ్య సౌందర్యమే అలంకారం (సౌందర్యమలంకారః. వామనుడు:7) కావ్యశరీరానికి సౌందర్యాన్ని కలిగించే వివిధ కవితాంశాలలో ఒకటిగా మాత్రమే కాకుండా, వాటిద్వారా కలిగే కావ్యసౌందర్యం కూడా అలంకారమే. వామనుడు అలంకార శాస్త్రంలో అలంకారాలకు ఇచ్చిన స్థానం మహోన్నతమని తెలుస్తుంది.

అలంకారాలు అనేక కవితా ద్రవ్యాల సమాహారం కాబట్టి, వాటిని కావ్యాత్మగా భావించినా, కావ్యసౌందర్యం కలిగించే వాటిగా భావించినా అది సత్యమే. అయితే ఒక విషయం గుర్తుంచుకోవాలి. లక్షణం ఆధారంగా అలంకారానికి విలువకట్టడం సముచితం కాదు. కవి ప్రయోగించినపుడు కథా సందర్భానికి ఆ అలంకారం ఎంత రామణీయకతను సంతరించిపెడుతుంది అనే దాన్నిబట్టి అలంకారం విలువ నిర్ణయించ వలసి ఉంటుంది.

### 2.6.4 అలంకారాలు : వ్యుత్పత్తి

'అలంకారః' అనే పదం ఎలా ఉద్భవించిందో చూద్దాం.

'అలం' అనగా భూషణం. 'అలం' అనే ధాతువుకు 'కృ' ప్రత్యయం చేరి (అలం+కృ) వృద్ధిచే 'అలం+కార్' అయింది. దీనిని 'ఘఞ' ప్రత్యయం చేరడం వలన 'అలంకారః' అనే పదం ఏర్పడింది.

అలం + కృ + ఘఞ = అలం + కార్ + ఘఞ = అలంకారః

'ఘఞ' ప్రత్యయం భావార్థంలో చేరితే 'అలంకరణమ్ అలంకారః' అవుతుంది. (అలంకరించడం వలన వచ్చే సౌందర్యమే అలంకారం.) 'ఘఞ' ప్రత్యయం కరణార్థంలో చేరితే 'అలంక్రియతే అనేన ఇత్యలంకారః' ((కావ్యం) దేనిచేతనైతే అలంకరింపబడుతుందో అంటే దేనివల్ల సౌందర్యం కలుగుతుందో అది అలంకారం.)

'అలంకరోతీత్యలంకారః' ((కావ్యాన్ని) అలంకరించునది కావున అలంకారం)

"అలంభూషణ పర్యాప్తిశక్తి వారణ వాచకమ్" అని అమరకోశం చెబుతుంది. అలంకరణ అనగా - భూషణకరణం, పర్యాప్తి కరణము, శక్తికరణము, వారణకరణము అనే అర్థాలు కలవు. ఇచట సందర్భాన్ని బట్టి 'భూషణం' అనే అర్థం గ్రహింపదగును.

గ్రీకు భాషలో aurum అంటే బంగారం

alam - aurum రూపాంతర పదాలు కావున aurum నుండి alam ఏర్పడి ఉండవచ్చు. ఋగ్వేదంలో 'అలంకృతిః' అనే పదం 'అరం కృతిః' గా ప్రయుక్తమవటం ఈ భావానికి ఉపబలకంగా ఉంది.

"కాతే అస్త్వరంకృతిః సూక్తైః" (ఋగ్వేదం. 7-29-3. చూ. నరసింహారావు: 9)

**2.6.5 అలంకారం : నిర్వచనాలు**

అలంకారాన్ని గురించి భారతీయాలంకారికులు పలువిధాలుగా నిర్వచించారు. వాటిని క్రింది విధంగా చెప్పవచ్చు.

"అలంకృతి రలంకారః కరణ వ్యుత్పత్త్యాపునః
అలంకారశబ్దోయముపమాదిషు వర్తతే" (వామనుడు:7)

దేనిచేత (కావ్యం) అలంకరించ బడుతుందో అది అలంకారం. కరణార్థంలో ఇది ఉపమాది అలంకారాలకు వర్తిస్తుంది. విద్యానాథుడు "అలంక్రియతేऽనేనేతి చారుత్వ హేతు రలంకారః" అన్నాడు. (చూ. జయకృష్ణబాపూజి: 145) అలంకరింపబడునది, చారుత్వహేతువు అయినది - అలంకారం.

విద్యానాథుడు ".. హారాది వదలంకారాస్తత్రస్యురుపమాదయః" అన్నాడు. (చూ. జయకృష్ణ బాపూజి: 145)

"కావ్యశోభకరాన్ ధర్మానలం కారాన్ప్రచక్షతే" (దండి: 51)

(కావ్యానికి శోభను కలిగించు ధర్మాలను అలంకారాలుగా చెబుతారు.)

రుద్రటుడు "యోహేతుః కావ్య శోభాయాస్సోऽలంకారః ప్రకీర్త్యతే" అన్నాడు. (చూ. జయకృష్ణ బాపూజి: 145)

కావ్యానికి శోభను కలిగించేవి అలంకారాలు.

వామనుడు "కావ్యాశోభాయాః కర్తారో ధర్మ గుణాః
తదతిశయ హేతువస్తలంకారాః" అన్నాడు. (చూ. జయకృష్ణ బాపూజి: 145)

కావ్యానికి శోభను కలిగించేవి గుణములు. కాగా ఆశోభను అతిశయింప జేసేవి అలంకారాలవుతాయి.

"ఉపకుర్వన్తి తం సన్తం యేऽఙ్గ ద్వారేణ జాతుచిత్
హారాది వదలంకారాస్తేऽను ప్రాసోపమాదయః" (మమ్మటుడు: 504)

ఏది అంగిగా ఉన్న రసాన్ని ఒక్కొక్కప్పుడు అంగాలైన శబ్దార్థాల ద్వారా హారాదులవలె ఉత్కర్షకల దానినిగా చేస్తాయో అట్టి అనుప్రాస, ఉపమ మొదలైనవి అలంకారాలు.

విశ్వనాథుడు

"శబ్దార్థయోరస్థిరాయో ధర్మాశోభాతిశాయినః
రసోదీనుపకుర్వంతోऽలంకారాస్తేऽంగదాదివత్" అన్నాడు. (చూ. జయకృష్ణ బాపూజి: 145)

అస్థిరాలైన శబ్దార్థధర్మాలగు అలంకారాలు కావ్యసౌందర్య సంపదను పెంపొందింప జేయునవై హారకేయూరాదులు దేహాన్ని భూషించే విధంగా రసాదులను పోషించుచున్నాయి.

విద్యానాథుడు "పరంపరగా రసము నలంకరించునది అలంకారం" (విద్యానాథుడు: 404) అన్నాడు.

విశ్వేశ్వరుడు

"ఏకదేశ గతాస్సర్వ శరీరం కటకాదివత్
అలంకుర్వంతి యే కావ్యం తేऽలంకార తయామతాః" అన్నాడు. (చూ. జయకృష్ణ బాపూజి: 145)

ఏకాదేశ గతాలగు కటకాదులు శరీరాన్ని అంతటినీ అలంకరించునట్లు ఒక చోట ఉండి కావ్య సామస్త్యాన్ని అలంకరించేవి అలంకారాలే. పై నిర్వచనాలను పరిశీలిస్తే - అలంకారాలను కేవలం బాహ్య ఆభరణాల వంటివని పేర్కొనడం జరిగింది. అంతేగాక, శబ్దార్థాలను (కావ్య శరీరాన్ని) అలంకరిస్తూ దానికి శోభను కూర్చేవిగా కొందరు భావిస్తే, వాటి ద్వారా కలిగే (అలంకరింపబడే) వస్తువు కూడా అలంకారమని కొందరు భావించారు. అయితే వామనాదులు అలంకారాలను విస్తృతార్థంలో గ్రహించుట చూడవచ్చు. 'సౌందర్యమలంకారః' (సౌందర్యమే అలంకారం) (వామనుడు:7)

వివిధ కావ్యగతాంశాల ద్వారా కలిగే సౌందర్యాన్నే అలంకారం అనుట వామనుని విశాలదృష్టిని తెలుపుతుంది. 'వైచిత్ర్యం చాలంకారః' (మమ్మటుడు: 589) వైచిత్ర్యమే అలంకారమని మమ్మటుడు భావించాడు. అట్లే 'అలంకారోహి విచ్ఛిత్తిః' (విచ్ఛిత్తియే అలంకారం) అని భావించిన వారు ఉన్నారు.

**2.6.6 అలంకార తత్త్వవివేచన**

ఆలంకారికులు - కావ్యగత వివిధాంశాల స్వరూప స్వభావాలు, కావ్య నిర్మాణంలో వాటి స్థానాన్ని చెప్పేటప్పుడు ఒక విధమైన అభిప్రాయాన్ని ఆయా కవితాంశాలను నిర్వచించేటపుడు వేరొక అభిప్రాయాన్ని వెలిబుచ్చడం జరిగింది. ఉదాహరణకు గుణాలు కావ్యకన్యకు ఆత్మధర్మములైన గుణాలు అనీ అవి విడదీసి చూచుటకు వీలు కాదని చెప్తూ వాటిని నిర్వచించేటప్పుడు మాత్రం, పరుష, సరళాక్షర సంయోజనం, సమాసబంధశైథిల్య, పారుష్యాలను ఆధారం చేసుకొన్నారు. కావున ఇది పొరపాటు.

అలంకారాల విషయంలో కూడా పెక్కురు ఆలంకారికులు పొరపాటుగా అభిప్రాయపడ్డారు. అదేమంటే అలంకారం కావ్యకన్యకు కేవలం బాహ్యమున ధరించు అలంకారాల వంటివే కాని, ఆత్మధర్మములు కావని చెప్పి అలంకారాలను నిర్వచించునపుడు మాత్రం వాటిలో ఎన్నింటికో రమణీయార్థము (వ్యంగ్యము/ధ్వని)ను కూడా తమలో ఇముడ్చుకొనునంతటి విస్తృత పరిధిని ఇచ్చారు. ఇట్లు పరస్పర భిన్నములైన అభిప్రాయాలు చెప్పడం చూడవచ్చు.

నేటి వరకూ ఆలంకారికులు, అలంకారాల సంఖ్యను పెంచుతూ వాటిలో సూక్ష్మవిభజన చేస్తూ వాటిని నిర్వచించిన తీరును బట్టి అలంకారాల తత్త్వాన్ని క్రింది విధంగా వివేచించవచ్చు.

1. శబ్దం ద్వారా కలిగే నాదగుణం
2. శబ్దార్థాల ద్వారా ఏక కాలంలో కలిగే నాదగుణం మరియు అర్థరామణీయకత.
3. అర్థరామణీయకత
4. సాదృశ్యవస్తు దర్శనం వలన కలిగే ఉపమాన ప్రాతినిధ్యం.

### 2.6.6.1 శబ్దాలంకార తత్త్వ వివేచన

సముచిత సందర్భోచిత వర్ణసంయోజనాన్నే శబ్దాలంకారంగా చెప్పవచ్చు. శబ్ద పరివృత్తిని సహింపనివి శబ్దాలంకారాలు. కావ్య పఠన సమయంలో పాఠకుడు అర్థయోజనం వలన హృదయంలో కథాసన్నివేశాలను దర్శిస్తున్నపుడు దానితో పాటు వర్ణసంయోజనం వలన కలిగే ధ్వనులు నేపథ్య సంగీతం వలె ఉపకరిస్తాయి. చలన చిత్రాన్ని చూస్తున్నప్పుడు వినిపించే నేపథ్యసంగీతం వంటిదే ఇది. ఈ సంగీతం సందర్భాన్ని బట్టి హృదయం ద్రవీకరించడానికి పాఠకునిలో ఉత్సాహాన్ని రేకెత్తించడానికి పాఠకుని ముమ్ముందుకు నడిపించడానికి ఉపకరిస్తుంది.

శబ్దం భావోద్రేక ప్రేరకమై ఉంటుంది. "శబ్దశ్రవణ మాత్రమున చిత్తోల్లాసం కలిగించునవి శబ్దాలంకారాలు" (నరసింహారావు: 62) మంచి సంగీతం ఉన్న చలన చిత్రానికి, ఎలాంటి నేపథ్య సంగీతం లేని చలన చిత్రానికి ఉన్న భేదాన్ని పరికిస్తే శబ్దాలంకాల వలన కావ్యానికి కలిగే ప్రయోజనం అర్థమవుతుంది.

ఉదాహరణకు వీర, రౌద్ర రసోద్భవ కారక ఘట్టాలలో పరుషాక్షర వర్ణావృత్తి, యుద్ధరంగంలో వినిపించే శబ్దాలవంటివి వినిపించడం ద్వారా పాఠకునిలో ఆ యుద్ధ సన్నివేశం చూస్తూ ఆ శబ్దాలు వింటున్న అనుభూతి కలుగుతుందన్నమాట. అంటే audio మరియు video రెండూ అనుభవానికి వస్తున్నాయన్నమాట. ఇది శబ్దాలంకారాల ప్రత్యేకత.

ఈ వర్ణసంయోజనం (హల్లుల సముచిత పునరావృత్తి) ఒకే విధంగా కాకుండా విభిన్న పద్ధతుల్లో ఉండడం వల్ల సంగీతంలో వేరువేరు స్వరాలు, వేరేవేరు రాగాలు వింటున్నట్లుగా ఉంటుంది. కాబట్టి ఇవి మరింత రసరమ్యంగా ఉంటూ పాఠకునికి విసుగు కల్గించకుండా ఉంటుంది. ఇదంతా హల్లుల ఆవృత్తి వలన ఏర్పడేది. కాబట్టి అర్థం స్ఫురించడం కన్నా ముందుగానే శబ్దసంగీతం అనుభవం లోనికి వస్తుంది. అంటే అర్థాన్ని శబ్దం dominate చేస్తుంది. శ్రీశ్రీ మహాప్రస్థానంలోని ఉద్యమ ఆవేశాన్ని, విజృంభణను శబ్దాలంకార విరహితంగా ఊహించలేం.

శబ్దాల ద్వారా కలిగే మరొక అంశం 'లయాత్మకత'. అచ్చుల హ్రస్వ దీర్ఘాల కూర్పు వలన ఇది ఏర్పడుతుంది. దనివల్ల పాఠకుడు పఠనంలో వేగాన్ని సాధించడమే గాక, ఒక విధమైన ప్రవాహంలో పడి అవిచ్ఛిన్నంగా సాగిపోతూ ఉంటాడు. ఇది ఛందోపరమైన విశేషం.

### 2.6.6.2 శబ్దార్థాలంకారాల తత్త్వవివేచన

శబ్దాలంకారాలలో అర్థం కన్నా ముందు అనుభవంలోకి వచ్చేది శబ్దం యొక్క నాదగుణం. కాగా శబ్దార్థాలంకారాలలో శబ్దం వలన కలిగే నాదగుణం మరియు అర్థరామణీయకత ఏక కాలంలో అనుభవంలోకి వస్తాయి. ఇక్కడ శబ్దార్థాలు రెండూ సమప్రాధాన్యతను సంతరించుకుంటాయి. ఏ ఒక్కటీ మిగిలినదానిపై ఆధిపత్యం వహించదు. పాఠకుని హృదయంలో ఏక

కాలంలో కథా సన్నివేశ చిత్రణ మరియు శబ్దం వలన కలిగే నాద మాధుర్యం అనుభవానికొస్తాయి. ఇది శబ్దార్థాలంకారాల ప్రత్యేకత.

**2.6.6.3 అర్థాలంకారాల తత్త్వవివేచన**

మహాకవి ప్రతిభాపాటవాలన్నిటికి అతని దర్శనశక్తి మూలం. ఆ లోకాతి క్రాంతగోచర శక్తి వలననే సృజనం, సజీవమూ, శక్తివంతమూ అవుతుంది. కథా ఘట్టాన్ని వర్ణించునప్పుడు దానితో సామ్యమున్న మరొకవస్తువును కవి అంతర్నేత్రంతో దర్శిస్తాడు. కవితా కుసుమాలకు ఆ (మరొక) వస్తువే మూల కందమవుతుంది. ఈ అన్యవస్తు ప్రాతినిథ్యం కవిత్వం వాచ్యానికి దిగజారకుండా కాపాడుతుంది.

ఒక వస్తువును వర్ణించునపుడు దాని లక్షణాలన్నీ వాచ్యం చేయకుండా ఉపమానం ద్వారా స్ఫురింపజేయడం అనేది ఈ అర్థాలంకారాల వలన వీలవుతుంది. మన ఆలంకారికులు చెప్పిన అర్థాలంకారాలన్నిటి నిర్వచనాలను పరిశీలిస్తే ఒక ఉపమాన ప్రాతినిథ్యమే కాకుండా రమణీయార్థం, వ్యంగ్యార్థ స్ఫురణ, నిందవ్యాజమున స్తుతి, స్తుతివ్యాజమున నింద, ప్రస్తుత వర్ణనచే అప్రస్తుతవస్తు స్ఫురణ, అప్రస్తుత వర్ణనచే ప్రస్తుతవస్తు స్ఫురణ మొదలగు అనేక అంశాలు దానిలో ఇమిడి ఉండడమే కాకుండా ఉపమేయం లేకుండా కేవలం ఉపమానం చెప్పడం వంటి వాటి వలన ప్రతీక (symbol) ను కూడా అర్థాలంకారం తనలో ఇముడ్చుకొన్నట్లయింది.

ఇంత మహత్తరమై, విస్తృత పరిధి గల అలంకారాలను కేవలం బాహ్య ఆభరణాలవంటివనడం సబబు కాదు.

సాయంకాలం అస్తమించే సూర్యుడు ఒక్కొక్క కవికి ఒక్కొక్క విధంగా గోచరించవచ్చు. అంటే ఆ సూర్యబింబాన్ని చూసినప్పుడు ఒక్కొక్కరికి ఒక్కొక్క భావం గుర్తుకువస్తుంది. అంతే కాదు ఆ భావానుగుణంగా మరొక వస్తువు, దృశ్యం, సంఘటన హృదయ పలకం మీద స్ఫురిస్తుంది. అది కవి దర్శన గాఢతను తెలియ జేస్తుంది. కవి కర్మకు చేవ ఇదే. ఒకరికి ఆ సూర్యబింబం గులాబిగా గోచరించవచ్చు. ఒకరికి ప్రియురాలి పెదవులుగా గోచరించవచ్చు. మరొకరికి రక్తసిక్తమైన అమాయకుని మృతశరీరంగా స్ఫురింపవచ్చు. కవి కథా సన్నివేశానికి తగిన ఉపమానాన్ని దర్శించి, ప్రదర్శిస్తే అది పాఠకుని హృదయ కవాటాన్ని తెరచి భావాలను జాగృతం చేసి అతిలోకానందాన్ని ఇస్తుంది.

కవితా ప్రదర్శనకు మూల హేతువు కవిదర్శనం. ప్రత్యేకించి సామ్యవస్తు దర్శనం. తత్‌దర్శన ఫలం ఉపమానం. ఆ ఉపమానం ద్వారా ఉపమేయం యొక్క స్వరూప స్వభావాలను పరోక్షంగాను, రమ్యంగానూ పాఠకునికి బోధించినట్లు అవుతుంది.

ఇట్లు సామ్య వస్తు దర్శనం లేని కవి, కవి కాడు. అట్టి రచన కావ్యం కాదు. కావున అలంకారాలు కావ్యానికి అత్యంత ఆవశ్యకమైనవని చెప్పవచ్చు. అలంకారాలు కావ్యానికి తప్పనిసరి కాదని, వాటి అవసరం లేదని, ఆనుషంగికమని లాక్షణికులు ఎందరు చెప్పినను అలంకార విరహిత కావ్యం లేకుండుటను బట్టి అలంకారాలు కావ్యానికి అనివార్యమని చెప్పవచ్చు.

**2.6.7 అలంకార ప్రయోజనాలు**

అలంకారాల ప్రయోజనాలను క్రింది విధంగా చెప్పవచ్చు.

1. మధురమైన నాదగుణం (శబ్దాలంకారాల వలన ఏర్పడేది) శ్రవణానందం కలుగ జేయును.
2. శబ్ద/అర్థ చమత్కారం తలలూపింప జేస్తుంది.
3. శబ్దాలంకారాలు ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని కలుగజేస్తాయి.
4. వక్రతకు పరాకాష్ట రూపమైన ఉపమానం ప్రతిపాదింపబడుతుంది.
5. పాఠకుడు ఎన్నడూ చూడని వస్తువును, (ఉపమేయాన్ని) ఉపమానం ద్వారా ఊహించుకొనవచ్చు.
6. నిగూఢమైన తాత్త్విక విషయాలు ఉపమానం ద్వారా సులభంగా అవగాహన అవుతాయి.
7. వ్యంగ్యార్థాన్ని స్ఫురింపజేయు అలంకారాలు, పాఠకులు ఒక్కొక్కరు, ఒక్కొక్క రీతిగా భావించుకొని ఆనందం పొందేందుకు వీలవుతుంది.
8. కావ్య ప్రయోజనమైన రసానందానుభూతి అలంకారాల వలన సులభసాధ్యం.

**2.6.8 అలంకారాలు - ఇతర కవితాద్రవ్యాలు : సామ్యభేదాలు**

కావ్యానికి చారుత్వాన్ని కలిగించే కవితా ద్రవ్యాలు విభిన్నాంగాలుగా వ్యక్తమవుతాయి. ఈ భిన్నాంగాలను పరస్పరం

పూర్తిగా విడదీసి చూడడం వీలుకాదు. ఎందుకంటే కొన్ని సామ్య లక్షణాలుంటాయి కాబట్టి. అలాగని అన్నీ ఒకే విధమైన లక్షణాలు కలిగినవనలేము. ఎందుకంటే వాటిలో భేదాలు కూడా ఉంటాయి కాబట్టి. అలంకారాలకు వివిధ కవితాంశాలకు మధ్యగల సామ్యభేదాలు పరిశీలించడం ద్వారా అలంకారాల నిర్మాణం మరింత స్పష్టంగా తెలుస్తుంది.

**2.6.8.1 అలంకారాలు : గుణాలు**

గుణాలు కేవలం సరళ, పరుషాక్షర సంయోజనం, సమాసబంధ శైథిల్య, నిబిడత్వానికి సంబంధించినవి. ఈ లక్షణం కేవలం శబ్దాలంకారమందే ఇమిడి పోవును. అలంకారం విస్తృత పరిధి కలది. కాగా గుణాల పరిధి స్వల్పం. అయితే శబ్దాల బిగింపు వలన కలిగే 'ధార' గుణాలకు ప్రత్యేకం.

**2.6.8.2 అలంకారాలు : రీతులు**

రీతులు గుణాల వలననే ఏర్పడతాయి. కావున గుణాల లక్షణమే రీతులకు కూడా వర్తిస్తుంది.

**2.6.8.3 అలంకారాలు : శయ్య**

అక్షరాల కూర్పునే శయ్య అంటారు. ఒడిదుడుకులు లేకుండా అవసరాన్ని బట్టి సరళాక్షరాలనో, పరుషాక్షరాలనో తగిన విధంగా కూర్చడం శబ్దాలంకారాలలో లక్షణమే కాబట్టి 'శయ్య' అలంకారాలలో భాగమే.

**2.6.8.4 అలంకారాలు : ఉపనాగరికాది శబ్దవృత్తులు**

"వృత్తి అనగా నియతములైన వర్ణములందుండు రస విషయక వ్యాపారము" (వేంకటావధాని: 153) అంటే రసోచిత వర్ణ సంయోజనం. అంటే ఇది అనుప్రాస లక్షణమే. కావున ఉపనాగరికాది శబ్దవృత్తులు అలంకారాలలో భాగమే.

**2.6.8.5 అలంకారాలు : అర్థవృత్తులు**

నాయికా నాయకులు రసోచితంగా చేయు వ్యాపారం అర్థవృత్తి. ఇది నటనాశ్రయం. అంగికాభినయ రూపం. కావున ఇది అలంకారాలకు సంబంధం లేని విషయం. అయితే మనోహరమైన నాయికా నాయకుల చేష్టాగత వర్ణనలు (స్వభావోక్తులు) అర్థవృత్తులకు పూర్తిగా భిన్నమని చెప్పలేము.

**2.6.8.6 అలంకారం : పాకం**

పాఠకుడు కావ్యాన్ని అర్థం చేసుకోవడానికి తగినట్లు అర్థాన్ని శబ్దంలో నిబంధించుట పాకం. ఇది అలంకారం కంటే పూర్తిగా భిన్నమైనది.

**2.6.8.7 అలంకారం : వాచ్యం**

వాచ్యార్థమెప్పుడూ అలంకారం కాదని భామహాదులు వివరించినప్పటికీ ఎందరో లాక్షణికులు మనోహరంగా, కథా సన్నివేశానికి అనుగుణంగా వర్ణన చేసినపుడు అది స్వభావోక్తి అలంకారం అవుతుందని చెప్పారు. అంటే వాచ్యార్థం అంతా అలంకారంగా మారదు. కాని అది మనోహరమైన కథకు సౌందర్యాన్ని చేకూర్చితే అలంకార పరిధిలోనికి వస్తుంది.

**2.6.8.8 అలంకారం : లక్ష్యం**

ముఖ్యార్థానికి బాధ కలిగినపుడు, రూఢిని బట్టిగాని, ప్రయోజనాన్ని బట్టిగాని చెప్పుకొనే ముఖ్యార్థానికి సమీపంలో ఉన్న మరొక అర్థమే లక్ష్యం. లక్ష్యార్థం ఒక తరంగమైతే, అలంకారం ఒక మహానది. లక్ష్యార్థం అలంకారంలో అంతర్భాగమే.

**2.6.8.9 అలంకారం : ధ్వని**

వాచ్యార్థం తెలిసిన తరువాత ఒక్కొక్క పాఠకునికి ఒక్కొక్క రకంగా స్ఫురించే (వాచ్యార్థాన్ని మించిన) రమణీయార్థాన్ని

ధ్వని అంటారు.

ఆనందవర్ధనుడు ధ్వనిలోని కొన్ని ఉపభాగాలలో అలంకారాలనే చేర్చడాన్ని బట్టి, అలంకారాల నుండి ధ్వనిని పూర్తిగా విడమరచలేమని తెలుస్తుంది. అంతేగాక ఆనందవర్ధనుడు ధ్వని మూడు రకాలుగా ఉంటుందని చెప్తూ వాటిలో అలంకార ధ్వని ఒకటని చెప్పడాన్ని బట్టి ఈ రెండు పరస్పరం భిన్నమైనవి కావని తెలుస్తుంది. అయితే రమణీయర్థాన్ని వేర్వేరు దృక్పథాల నుండి చూడడం వలననే ఈ భేదం ఏర్పడింది. అయితే ఉపమాన ప్రాతినిధ్యం అలంకారాల ప్రత్యేకత.

**2.6.8.10 అలంకారం : వక్రోక్తి**

ప్రసిద్ధాభిధాన వ్యతిరేకతయే వక్రత. అలంకారాలలో శబ్దాలంకారాలను, అర్థాలంకారాలలో స్వభావోక్తి వంటి రెండు, మూడు అలంకారాలను మినహాయిస్తే మిగిలిన అన్ని అలంకారాలు వక్రోక్తులే. కుంతకుడు వక్రోక్తిని ఆరు భాగాలుగా వింగడించి వాటిలో శబ్దాలంకారాలను 'వర్ణవిన్యాస వక్రత'లోనూ, అర్థాలంకారాలను 'వాక్య వక్రత'లోనూ చేర్చడాన్ని బట్టి వక్రోక్తి అనే విస్తృత యవనికలో అలంకారాలు ఒక భాగమని తెలుస్తుంది.

**2.6.8.11 అలంకారం : సౌందర్యం**

అలంకారం వల్లగాని ఇతర కవితాద్రవ్యాల వల్లగాని కలిగే చారుత్వమే సౌందర్యం. అలంకారం, సౌందర్యం అనేవి - ఒకటి కార్యం (సాధన), మరొకటి తత్ఫలం (సాధ్యం). అయితే వామనుడు 'సౌందర్యమే అలంకారం' అన్నాడు. అలా అనుటకన్నా అలంకారం వలన కలిగే రామణీయకత సౌందర్యం అనుట సముచితం. రెండూ రచనా (కావ్య) గతములే.

**2.6.8.12 అలంకారం : రసం**

అలంకారం రచనా గతము. రసం సహృదయ హృదయ నిష్ఠం. కావ్య పఠన సమయంలో అలంకారాలు పాఠకునిలో సుప్తావస్థలో ఉన్న సంస్కారాలను జాగృతం చేసి, రసానందానుభూతికి కారణం అవుతాయి. కావున అలంకారం, రసం విభిన్నాంశాలు. అయితే రసం అలంకారాలపై ప్రభావం చూపదు. కాని అలంకారాలు రసం పై ప్రభావం చూపుతాయి.

**2.6.9 సకల కావ్య విలువల రత్నాకరము : అలంకారము**

ఇంతవరకూ అలంకారాలపై చేసిన చర్చ ఆధారంగాఅనేక కవితా ద్రవ్యముల లక్షణాలు అలంకారాలలోనే ఇమిడి ఉండడం (అరుదుగా కొన్నిటిని మినహాయిస్తే) పరమాద్భుతమైన విషయం.

శబ్దాలంకారాలలో (వర్ణసంయోగంలో) గుణ, రీతి, శయ్య, భారతీవృత్తి, ఉపనాగరికాది శబ్దవృత్తులు, వర్ణవిన్యాస వక్రతలుగా చెప్పినవన్నీ ఇమిడి ఉన్నాయి. ధ్వని, వక్రోక్తి వంటివి కూడా సమాసోక్తి, పర్యాయోక్తి, ఆక్షేప, వ్యాజస్తుతి, పరికర, అప్రస్తుతప్రశంస, వ్యాజోక్తి వంటి అనేక అలంకారాలలో భాగంగా ఉన్నాయనే చెప్పవచ్చు. ఉపమానం కలిగి ఉండడం అలంకారాల ప్రత్యేకత. ఈ విధంగా చూస్తే అనేక కావ్యగత కవితా ద్రవ్యాలుగా మనం చెప్పుకుంటున్నవన్నీ కూడా ఒక్క 'అలంకారం' అనే విస్తృత పరిధిలోనికే (దాదాపుగా) వస్తాయి.

**2.6.10 అలంకారౌచిత్యం**

ఔచిత్యం అనేది ఒక ప్రత్యేక కవితాద్రవ్యం కాదు. కాని ఔచిత్యాన్ని పాటించకుండా చేసిన రచన కావ్యమేకాదు. ఔచిత్యమనేది కావ్యనిర్మాణంలో, పాఠకుని రసోన్ముఖంగా చేయుటకు కవి పాటించ వలసిన నియమం (తీసుకోవలసిన జాగ్రత్త). అనౌచిత్యమంటే రసభంగకరంగా కావ్యాన్ని నిర్మించుటయే. ఔచిత్యం అంటే రసోచితంగా కావ్యాన్ని నిర్మించుటయే. అలంకార విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తయే అలంకారౌచిత్యం. అంటే ఏ సందర్భంలో ఏ ఉపమానాన్ని వాడాలి, ఏ అలంకారాన్ని స్వీకరించాలి, ఏది వాడకూడదు. అనే నియమాలను గ్రహించడమే అలంకారౌచిత్యం.

క్షేమేంద్రుడు 'ఔచిత్య విచార చర్చ'లో ఇదే అభిప్రాయాన్ని వ్యక్తీకరించడం గమనించవచ్చు.

' "అర్థౌచిత్యవతా సూక్తిరలంకారేణ శోభతే
పీనస్తనస్థితేనేవ హారేణ హరిణేక్షణా"

ప్రస్తుతార్థ స్యౌచిత్యేన ఉపమోత్ప్రేక్షా రూపకాది నాలంకారేణ సూక్తిశ్చకాస్తి, కామినీవ ఉచ్చమేచ చుమ్బినా రుచిర

ముక్తాకలాపేన. "హరిణేక్షణ పీనస్తనాభోగం మీద ఉన్న హారంతో ప్రకాశించినట్లు, సూక్తి అర్థానుగుణంగా కూర్చిన అలంకారంతో శోభించును."' (క్షేమేంద్రుడు: 22-23)

ప్రస్తుతమైన అర్థానికి ఉచితంగా ఉండే పద్ధతిలో కూర్చిన ఉపమ, ఉత్ప్రేక్ష, రూపకాద్యలంకారాలతో, ఉన్నత కుచ తటం మీద ఉన్న హారంతో కామిని వలె సూక్తి అందంగా ఉండును.

అలంకారాన్ని అలంకారం కొరకు కాకుండా రసానందానుభవ మహాయజ్ఞానికి ఒక సమిధగా ఉపయోగించాలి.

## 2.6.11 అలంకార శిల్పం

భరతుడు "అంగప్రత్యంగకానాం యః సన్నివేశోయథోచితమ్
సుస్నిగ్ధసంధి బంధః స్యాత్ తత్సౌందర్యమితీర్యతే" అన్నాడు. (చూ. నరసింహారావు. 51)

అని భరతుడు సౌందర్యాన్ని నిర్వచించాడు. అంగప్రత్యంగకాలు చక్కగా తగుపాళ్ళలో తగు రీతిలో సన్నివిష్టాలై ఉండాలి. అదే సౌందర్యం. భిన్నాంగాలని ఎట్లా అంగితో కూర్చిన వాని అనేకత్వం మాటుపడి అంగియందేకత్వం భాసిస్తుందో అలా కూర్చబడి ఉండడమే సౌందర్యం. ఇట్లా కావ్య నిర్మాణం చేయడమే శిల్పమందురు. కావ్యశిల్పరహస్యం సౌందర్యం. కావ్యశిల్పంలో అలంకార శిల్పం ఒకభాగం. "నేర్పుతో కూడిన అందమైన రూపమే శిల్పము. ఇది అలంకారగతమై అలంకార శిల్పమగును." (రుక్మిణి : 23)

శబ్దగతసౌందర్యం మొదలుకొని వ్యంగ్యం వరకూ అంతా వివిధ అంశాల సమ్మేళనంతో కూడిన నిర్మాణరూపం. ఇందులో అలంకారాలు వివిధ దశలలో అనుభూతి ప్రదములైన ధ్వన్యర్థప్రకాశానికి ఉపస్కారకాలై ఉండాలి అనుటలో విప్రపత్తిలేదు.

కావ్యశరీరాన్ని ఆనంద పార్యంతికంగా కర్తృకౌశలానికి పరిపూర్ణ కార్యస్థానంగా శోభాయమానంగా సుందరంగా, సుకరంగా నిర్మించడమే కావ్యశిల్పం. దీనిలో భాగంగా అలంకారాలను సువ్యవస్థీకరించడమే అలంకారశిల్పం. కావ్యపరితృ హృదయలగ్నమై తల ఊపింపజేయాలనటం చేత చమత్కారపరత్వం కావ్యశిల్పం. అలంకారాల వలన చమత్కారం కలిగించడం అలంకారశిల్ప ఫలం.

అలంకారాలను అతిగా వాడకూడదని కొందరి అభిప్రాయం. అట్లనుట సముచితం కాదు. ఎందుకంటే అలంకారాలను విరళంగా గాని, బహుళంగా గాని ప్రయోగించవచ్చును. కాని అవి రసప్రతీతిపరములై ఉండడం నియమం.

"... వస్త్వలంకారధ్వనీతు
సర్వధా రసం ప్రతి పర్యవస్యేతే" అని అభినవగుప్తుడు అన్నట్లు అలంకారాలు కూడా రసంలోనే పర్యవసిస్తాయి.

రసం చెడకుండా జాగ్రత్తపడడం ఔచిత్యం. కాగా ఔచిత్యంతో పాటు కథను మరింత రమణీయంగా తీర్చిదిద్దడం ద్వారా రసోద్భవానికి కారణమవడం శిల్పం.

శిల్పమనేది ఏదో ఒక అంశంలో కాకుండా అనేక అంశాలలో ఉంటుంది. శిల్పం వాక్యనిర్మాణం నుండి సంఘటనలను ఎన్నుకోవడం నుండి, పాత్ర చిత్రీకరణ నుండి, కథా ప్రారంభం నుండి ఉపసంహరణ వరకూ అన్నింటా వ్యాపించి ఉంటుంది.

కథా సందర్భానికి రమణీయత రావాలంటే ఏ అలంకారాన్ని ఎన్నుకోవాలి, ఎన్నుకున్న అలంకారంలో ఏ ఉపమానాన్ని ఎన్నుకోవాలి అనే విషయాలు అలంకార శిల్పంలో భాగమవుతాయి.

## 2.6.12 బీజభూతాలంకారాలు

భరతుడు నాలుగు అలంకారాలు చెప్పగా కువలయానందకారుడు 119 అలంకారాలు చెప్పాడు. ఎందరో ఆలంకారికులు వాటి సంఖ్యను విరివిగా పెంచారు. అయితే ఆదిలో ఉన్న ఆ అల్ప సంఖ్యాక అలంకారాలే సూక్ష్మ భేదాలతో ఎక్కువ సంఖ్యకు చేరాయనడానికి వీలులేదు. భరతుడు కొన్నింటిని గుర్తించగా తర్వాతి లాక్షణికులు లక్ష్యాలను కూలంకషంగా పరిశీలించి వాటిని తక్కువ సంఖ్యగల అలంకారాలలో ఇమడ్చలేక స్వతంత్ర అలంకారాలుగా చెప్పడం వలన వాటి సంఖ్య పెరిగిందని చెప్పవచ్చు. ఒకే అలంకారాన్ని కూడా మరింత లోతుగా విశ్లేషించడం మనం చూడవచ్చు.

ఈ అధిక సంఖ్యగల అలంకారాలలో కొన్ని మౌలిక లక్షణాలు ఉండడం సహజం. ఆ మౌలిక లక్షణాల ఆధారంగా వాటిని కొన్ని సమూహాలుగా విభజించే అవకాశం ఉంది. ఆ మౌలిక లక్షణం విస్పష్టంగా (ప్రధానంగా) ఉన్న అలంకారాన్ని బీజభూత అలంకారంగా గుర్తించడంలో తప్పులేదు. అయితే అలాంటిది ఒకటే ఉంటుందనడం కన్నా (స్వల్పసంఖ్యలో) కొన్ని ఉంటాయని మాత్రం చెప్పవచ్చు. ఎందుకంటే వాగ్వైచిత్రి అంతా ఒక్క అలంకారం వలన కలుగుట సాధ్యం కాదు. అయితే ఈ

బీజభూత అలంకారాల విషయంలో ఆలంకారికులలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి.

**1.** భామహుడు కావ్యాలంకారంలో 'వక్రోక్తి' అయితేనే అది అలంకారం అని అలాకాని స్వభావోక్తి, హేతు, సూక్ష్మ, లేశ అలంకారాలు అంగీకారం కావని చెప్పాడు. (భామహుడు: 66) ఇతని దృష్టిలో వక్రోక్తియే సర్వాలంకారాలకు బీజాలంకారం. అయితే ఇతని దృష్టిలో వక్రోక్తి, అతిశయోక్తికి భేధం లేదు. వక్రత (లేక) అతిశయత సౌందర్యానికి మూలమని ఇతని తీర్పు. 'కుంతకుడు వక్రోక్తిని కావ్యజీవితముగా చెప్పి అది అతిశయతా మహితమని భావించెను' (చూ. నరసింహారావు: 74)

**2.** అతిశయోక్తియే సర్వాలంకార మూలమని హేమచంద్రుడు, మమ్మటుడు అంగీకరించిరి. ఆనందవర్ధనుడు అన్ని అలంకారాలలో అతిశయోక్తిని చేర్పవచ్చునని తలచాడు. కవి భావనా శక్తిచేత ఏ అలంకారంలో అతిశయోక్తిని చొప్పించునో అది రమ్యతరమవుతుంది. అతిశయోక్తి లేని అలంకారాలు పేరుకు మాత్రం అలంకారాలని అభిప్రాయపడ్డాడు. అతిశయోక్తి అన్ని అలంకారాలలో అంతర్భవించి ఉండగలదు. కావున అది అలంకార సారభూతం అనబడుతుంది. అభినవగుప్తుడు అతిశయోక్తిని సర్వాలంకార సామాన్యరూపమని చెప్పాడు.

వస్తుస్థితిని మించి వర్ణించుట అన్ని అలంకారాలకు సామాన్యం కావున అది సర్వాలంకారాలకు బీజమని వీరి భావన.

**3.** 'ఉపమ'ను సర్వాలంకారాలకు బీజభూతాలంకారమని ఆలంకారికులు అనేకులు భావించారు. భరతుడు చెప్పిన అలంకారాలలో 'ఉపమ'ను మొదట చెప్పడం, వామనుని నుండి ఆలంకారికులందరూ మొదటగా ఉపమాలంకారాన్ని చెప్పడం ఉపమ ప్రాధాన్యాన్ని పెంచాయి.

అప్పయదీక్షితులు -

"ఉపమైకా శైలూషీ సంప్రాప్తా చిత్ర భూమికా భేదాన్

రంజయతి కావ్యరంగేనృత్యంతీ తద్విదాంచేతః" అన్నాడు. (చూ. నరసింహారావు: 77)

ఏకైక నర్తకి రంగస్థలం పై భిన్నభిన్న విచిత్ర భూమికలు దాల్చి వివిధ వేషధారిణియై అలరింపజేస్తూ నృత్యంచేయునట్లు ఒక్క ఉపమాలంకారమే కావ్యరంగంలో అనేకాలంకారాలుగా ఉద్భాసిస్తున్నదని చెప్పాడు. దండి ఉపమను 32 ఉప భేదాలుగా వింగడించి ఉదహరించడం - తరువాత ఆలంకారికులను మరింత సూక్ష్మంగా ఆలోచింపజేసింది. అయితే ఇతడు ఉపమలో భేదాలుగా చెప్పిన కొన్నింటిని (ఉపమేయోపమ, అనన్వయ, ప్రతీప, సందేహ, భ్రాంతి, ప్రతివస్తూపమ, ఉత్ప్రేక్ష) తరువాతి ఆలంకారికులు స్వతంత్ర అలంకారికులుగా చెప్పారు.

సాదృశ్యం అనేకాలంకారాలకు బీజమవడం, అది ఉపమలో అతి స్పష్టంగా ఉండడం వలన దీనిని బీజాలంకారంగా భావించారు.

రుయ్యకుడు -

"ఉపమైవ చ ప్రకార వైచిత్ర్యేణానేకాలంకార బీజభూతేతి

ప్రథమం నిర్దిష్టా" అని ఉపమాలంకార ప్రథమగణ్యతను నిరూపించాడు. (చూ. నరసింహారావు: 75)

రాజశేఖరుడు తన అలంకార శేఖరంలో

"అలంకార శిరోరత్నం సర్వస్వం కావ్య సంపదాం

ఉపమా కవి వంశస్య మాతైవేతి మతిర్మమ"అన్నాడు. (చూ. నరసింహారావు: 75)

ఉపమ స్వల్పభేదాలచేత వేర్వేరు అలంకారాలుగా మారడం దాని బీజత్వాన్ని దృఢపరుస్తుంది.

**4.** రుయ్యకుడు ఒక అలంకారాన్ని కాకుండా స్వభావోక్తి, ఉపమ, అతిశయోక్తి, శ్లేష - అనే నాలుగు అలంకారాలు మిగిలిన అన్ని అలంకారాలకు మూలమని భావించి అలంకారాలన్నింటిని 1. వాస్తవం, 2. ఔపమ్యం, 3. అతిశయం, 4. శ్లిష్టం అనే నాలుగు వర్గాలుగా చెప్పాడు.

### 2.6.13 అలంకారాల సంఖ్య : వర్గీకరణ

భరతుని నుండి నేటి వరకూ ఉన్న ఆలంకారికులు చెప్పిన అలంకారాల సంఖ్యలోనూ, వాటి వర్గీకరణలోనూ భేదం ఉంది. అలంకారాలను, శబ్దాలంకారాలు, అర్థాలంకారాలు అని విభజించడమే ఎక్కువమంది లాక్షణికులకు ఆమోదం. కొందరు ఉభయాలంకారాలను, మిశ్రాలంకారాలను కూడా చెప్పారు. అలంకారికులు చెప్పిన అలంకారాలను, వాటి సంఖ్య, వర్గీకరణను

క్రింది విధంగా చెప్పవచ్చు

**1. భరతుడు (1 + 3 = 4)**

భరతుడు నాట్యశాస్త్రం 16 వ అధ్యాయంలో మొదటిసారిగా 1. ఉపమ, 2. దీపకం, 3. రూపకం, 4. యమకం అనేవి అలంకారాలనే చెప్పాడు. శబ్దార్థ అలంకార విభజన ఇతడు చేయలేదు.

**2. విష్ణుధర్మోత్తర పురాణకర్త (2 + 17 = 19)**

విష్ణుధర్మోత్తర పురాణంలో తృతీయ ఖండంలో అలంకారాలు వివరించ బడ్డాయి. దీనిలో మొత్తం 19 అలంకారాలు పేర్కొనడం జరిగింది. వాటిలో 2 శబ్దాలంకారాలు, 17 అర్థాలంకారాలు చెప్పబడ్డాయి.

**3. అగ్నిపురాణకర్త (9 + 8 + 6 = 23)**

అగ్నిపురాణంలో 342, 343, 344 అధ్యాయాలలో అలంకారాలు వివరించబడ్డాయి. దీనిలో 9 శబ్ద, 8 అర్థ, 6 శబ్దార్థ అలంకారాలు మొత్తం 23 చెప్పబడ్డాయి.

**4. భామహుడు (2 + 34 = 36)**

భామహుడు 'కావ్యాలంకారం'లో ద్వితీయ, తృతీయ పరిచ్ఛేదాలలో అలంకారాలను పేర్కొన్నాడు. శబ్దార్థాలంకార భేదభావన మొదట భామహునిలో స్ఫురించినట్లు తెలియవస్తుంది. 'శబ్దాభిధేయాలంకార భేదాదిష్టంద్వయన్తునః' (భామహుడు: 7) (శబ్దాలంకారం, అర్థలంకారం అనుభేదం చేత రెండు విధాలైన అలంకారాలను మాకు అంగీకారమే.)

ఇతడు కొందరి దృష్టిలో 'స్వభావోక్తి' 'ఆశీస్సు'లు కూడా అలంకారాలే అనుడాన్ని బట్టి వీటిని తాను అలంకారాలుగా అంగీకరించలేదని తెలుస్తుంది. వక్రత లేకుంటే అది అలంకారమే కాదని ఇతని భావన. (భామహుడు: 66) వక్రత లేని కారణంగానే హేతువు, సూక్ష్మ, లేశం - అనే వాటిని అలంకారాలు కాదని నిష్కర్షగా చెప్పాడు. భామహుడు అలంకారాలను 4 వర్గాలుగా విభజించాడు. (ఏ లక్షణం ఆధారంగా వివరించాడో తెలియదు.) మొత్తం 38 అలంకారాలను తెలిపాడు. కాని స్వభావోక్తి, ఆశీస్సులను తాను అంగీకరించలేదు. కావున తాను అంగీకరించింది - మొత్తం 36 అలంకారాలే. వీటిలో 2 శబ్దాలంకారాలు, 34 అర్థాలంకారాలు చెప్పబడ్డాయి.

**5. దండి (4 + 35 = 39)**

దండి 'కావ్యాదర్శం'లో - ప్రథమ పరిచ్ఛేదంలో మాధుర్యగుణాన్ని వివరించే సందర్భంలో 'అనుప్రాస'ను వివరించాడు. ద్వితీయ పరిచ్ఛేదంలో 35 అర్థాలంకారాలను వివరించి, తృతీయ పరిచ్ఛేదంలో యమకం, చిత్రాలంకారం, ప్రహేళికలు అనే మూడు శబ్దాలంకారాలను పేరొన్నాడు. ద్వితీయ పరిచ్ఛేదంలో అర్థాలంకారాలను, తృతీయ పరిచ్ఛేదంలో శబ్దాలంకారాలను (సందర్భానుసారం 'అనుప్రాస'ను ప్రథమ పరిచ్ఛేదంలో) పేర్కొనుటను బట్టి శబ్దాలంకారాలను స్పష్టంగా వేర్పరిచినట్లయింది. ఇతడు 4 శబ్ద, 35 అర్థ (మొత్తం 39) అలంకారాలను పేర్కొనెను.

**6. ఉద్భటుడు (4 + 37 = 41)**

ఉద్భటుడు 'కావ్యాలంకార సంగ్రహం' లో మొత్తం 41 అలంకారాలను పేర్కొనడం జరిగింది. వీటిని ఆరు వర్గాలుగా విభజించాడు. ఉద్భటుడు మొదట 'పునరుక్తవదాభాస' (ఉభయాలంకారం)ను పేర్కొని తర్వాత మూడు శబ్దాలంకారాలను చెప్పి, తరువాత 37 అర్థాలంకారాలను చెప్పాడు. ఇతడు శబ్దాలంకారాలను (పునరుక్తవదాభాసమును శబ్దాలంకారంగా భావించాడేమో) మొదట చెప్పి, అర్థాలంకారాలను తరువాత చెప్పడాన్ని బట్టి శబ్దార్థా లంకార భేదభావన ఇతని మదిలో స్పష్టంగా ఉందని చెప్పవచ్చు.

**7. వామనుడు (2 + 29 = 31)**

వామనుడు 'కావ్యాలంకార సూత్రవృత్తి'లో మొత్తం 31 అలంకారాలను వివరించాడు. వాటిలో 2 శబ్ద, 29 అర్థ అలంకారాలు. మొదటగా శబ్దాలంకారాలు, అర్థాలంకారాలు అని వర్గీకరించింది వామనుడే. ఇతడు అర్థాలంకారాలను ఉపమ+ ఉపమా ప్రపంచం అని రెండు రకాలుగా విభజించాడు. (వామనుడు: 125)

**8. రుద్రటుడు**

రుద్రటుడు 'కావ్యాలంకారం'లో 3 శబ్దాలంకారాలు 68 అర్థాలంకారాలు (ఉపభేదాలతో) పేర్కొన్నాడు. అలంకారాలను శాస్త్రీయంగా వర్గీకరించిన వారిలో వీరు ముఖ్యులు. వైచిత్రి ఆధారంగా అర్థాలంకారాలు నాలుగేనని చెప్పి, మిగిలినవన్ని వాటి భేదాలే అని వివరించాడు. అవి. 1. వాస్తవం, 2. ఔపమ్యం, 3. అతిశయం, 4. శ్లేష.

<u>1. వాస్తవం:</u> ఏది అర్థానికి పుష్టి కలిగించి వస్తు స్వరూపాన్ని యథాతథంగా వర్ణిస్తే అది వాస్తవం. ఇదే స్వభావోక్తి. దీనిలో 23 భేదాలు సూచించాడు.

<u>2. ఔపమ్యం:</u> వస్తు స్వరూపం చక్కగా తెలుపుటకై దానితో సమానమైన వస్త్వంతరాన్ని చెప్పడం ఔపమ్యం. దీనిలో 21 భేదాలు సూచించాడు.

<u>3. అతిశయం:</u> ఎందులో అర్థం లోకవ్యవహారానికి వ్యతిరేకంగా లోకాతీతంగా వర్ణించబడుతుందో అది అతిశయం. దీనిలో 12 భేదాలు తెలిపాడు

<u>4. శ్లేష:</u> అనేకార్థాలుగల పదాలచేత ఏ వాక్యంలో నిశ్చయాలైన అనేకార్థాలు బోధించ బడునో అది శ్లేష. దీనిలో 12 భేదాలు చెప్పాడు.

శబ్దాలంకారాలు - 3

1. యమక, 2. శబ్దశ్లేష, 3. చిత్ర (ప్రహేళిక ను చిత్రాలంకార భేదాలలో ఒకటిగా చెప్పాడు.)

అర్థాలంకారాలు - 68

1. వాస్తవ మూలకాలు (23)

1. సహోక్తి, 2. సముచ్చయం, 3. జాతి, 4. యథాసంఖ్య, 5. భావ, 6. పర్యాయ, 7. విషయ, 8. అనుమాన, 9. దీపిక, 10. పరికర, 11. పరివృత్తి, 12. పరిసంఖ్య, 13. హేతు, 14 కారణమాల, 15. వ్యతిరేక, 16. అన్యోన్య, 17 ఉత్తర, 18. సార, 19. సూక్ష్మ, 20. లేశ, 21. అవసర, 22. మీలిత, 23. ఏకావళి.

2. ఔపమ్య మూలకాలు (21)

1. ఉపమ, 2. ఉత్ప్రేక్ష, 3. రూపక, 4. అపహ్నుతి, 5. సంశయ, 6. సమాసోక్తి, 7. మత, 8. ఉత్తర, 9. అన్యోక్తి, 10. ప్రతీప, 11. అర్థాంతరన్యాస, 12. ఉభయన్యాస, 13. భ్రాంతిమత్, 14. ఆక్షేప, 15. ప్రత్యనీక, 16. దృష్టాంత, 17. పూర్వ, 18 సహోక్తి, 19. సముచ్చయ, 20. సామ్య, 21. స్మరణ.

3. అతిశయ మూలకాలు (12)

1. పూర్వ, 2. విశేష, 3. ఉత్ప్రేక్ష, 4. విభావన, 5. తద్గుణ, 6. అధిక, 7. విరోధ, 8. విషయ, 9. అసంగతి, 10. పిహిత, 11. వ్యాఘాత, 12. అహేతు.

4. శ్లేషాలంకారాలు (12).

శుద్ధ శ్లేష మూలకాలు : 10

1. అవిశేష శ్లేష, 2. విరోధ శ్లేష, 3. అధిక శ్లేష, 4. వక్ర శ్లేష, 5. వ్యాజ శ్లేష, 6. ఉక్త శ్లేష, 7. అసంభవ శ్లేష, 8. అవయవ శ్లేష, 9. తత్త్వ శ్లేష, 10. విరోధాభాస శ్లేష.

సంకీర్ణ శ్లేష మూలకాలు - 2 రకాలు

**9. భోజుడు (24 + 24 + 24 = 72)**

భోజుడు 'సరస్వతీ కంఠాభరణము'లో ద్వితీయ పరిచ్ఛేదంలో 24 శబ్దాలంకారాలు, తృతీయ పరిచ్ఛేదంలో 24 అర్థాలంకారాలు, చతుర్థ పరిచ్ఛేదంలో 24 ఉభయాలంకారాల చొప్పునమొత్తం 72 అలంకారాలను చెప్పాడు. మరల ఈ అలంకారాలను తన సునిశిత దృష్టితో అనేక ఉపవిభాగాలుగా వివరించుట చూస్తే ఆశ్చర్యం వేస్తుంది.

**10. కుంతకుడు (6 + 20 = 26)**

కుంతకుడు తన 'వక్రోక్తి జీవితమ్'లో వక్రత (వైదగ్ధ్యభంగీభణితి) ఆరు రకాలుగా ఉంటుందని చెప్పాడు. అవి - 1. వర్ణ విన్యాస వక్రత, 2. పద పూర్వార్థ (ప్రాతిపదిక) వక్రత, 3. పదపరార్థ (ప్రత్యయ) వక్రత, 4. వాక్యవక్రత, 5. ప్రకరణ వక్రత, 6. ప్రబంధ వక్రత.

కుంతకుడు 'వర్ణవిన్యాస వక్రత'లో శబ్దాలంకారాలను, 'వాక్యవక్రత'లో అర్థాలంకారాలను చేర్చాడు. ద్వితీయోన్మేషంలో 'వర్ణవిన్యాస వక్రత' వివరిస్తూ, దీనిలో ఆరు శబ్దాలంకారాలను చేర్చాడు. అవి -

1. ఏక వర్ణ పునరావృత్తి, 2. ద్వివర్ణపునరావృత్తి, 3. బహువర్ణ పునరావృత్తి, 4. బిందుపూర్వక స్పర్శ వర్ణావృత్తి, 5. ద్విత్వవర్ణావృత్తి, 6. సంయుక్త వర్ణావృత్తి.

తృతీయోన్మేషంలో 'వాక్యవక్రత'వివరించాడు. కుంతకుడు - (అర్థ) అలంకారాలు అనంతంగా ఉంటాయన్నాడు. ఇతడు

1. రసవత్తు, 2. దీపకం, 3. సహోక్తి, అనే మూడింటిని పూర్వాలంకారికులకు భిన్నంగా, క్రొత్తగా నిర్వచించాడు.

- కుంతకుడు అంగీకరించని అర్థాలంకారాలు 8. అవి 1. అనన్వయం, 2. ఉపమేయోపమ, 3. నిదర్శనం, 4. సమాసోక్తి, 5. యథాసంఖ్యం, 6. హేతువు, 7. సూక్ష్మం, 8. లేశం.

- కుంతకుడు అంగీకరించిన అర్థాలంకారాలు - 20. అవి 1. రూపకం, 2. అప్రస్తుత ప్రశంస, 3. పర్యాయోక్తి, 4. వ్యాజస్తుతి, 5. ఉత్ప్రేక్ష, 6. అతిశయోక్తి, 7. ఉపమ, 8. శ్లేష, 9. వ్యతిరేకం, 10. దృష్టాంతం, 11. అర్థాంతరన్యాసం, 12. ఆక్షేపం, విభావన, 14. ససందేహం, 15. అపహ్నుతి, 16. సంసృష్టి, 17. సంకరం, 18. రసవత్తు, 19. దీపకం, 20. సహోక్తి.

**11 మమ్మటుడు (5 + 1 + 59 + 2 = 67)**

మమ్మటుడు 'కావ్యప్రకాశం' నవమ ఉల్లాసంలో 5 శబ్దాలంకారాలు చెప్పి, వాటి చివరన 'పునరుక్తవదాభాసము' చెప్పాడు. 'పునరుక్తవదాభాసము'ను శబ్దార్థ (ఉభయ) అలంకారంగా భావించి, శబ్దాలంకారాలకు, అర్థాలంకారాలకు నడుమ చేర్చడం కోసం ఇలా చేశాడు. దశమోల్లాసంలో 59 అర్థాలంకారాలను, రెండు మిశ్రాలంకారాలను చెప్పాడు.

**12 రుయ్యకుడు (6 + 75 = 81)**

అలంకారాలను అత్యంత కూలంకషంగా విశ్లేషించి వర్గీకరించిన వారిలో రుయ్యకుడు ఒకరు. ఇతడు శబ్దలంకారాలంటూ పేర్కొన్న ఆరింటిలో ఉభయాలంకారమైన 'పునరుక్తవదాభాసము' ఒకటి. ఇతడు 75 అర్థాలంకారాలను 10 వర్గాలుగా విభజించాడు. అవి,

**శబ్ద - 6**

1. పునరుక్తవదాభాస, 2. ఛేక, 3. వృత్తి, 4. యమకం, 5. లాట, 6. చిత్ర అలంకారాలు.

**అర్థ - 75 (20+5+3+11+4+2+8+7+13+2 = 75)**

I. సాదృశ్యవిచ్ఛిత్తి మూలకాలు (4+8+5+3 = 20)

1. భేదాభేద ప్రధానం - 1. ఉపమ, 2. అనన్వయ, 3. ఉపమేయోపమ, 4. స్మరణ.

2. అభేద ప్రధానం - 1. రూపక, 2. పరిణామ, 3. సందేహ, 4. భ్రాంతి, 5. ఉల్లేఖ, 6. అపహ్నుతి, 7. ఉత్ప్రేక్ష, 8. అతిశయోక్తి.

3. గమ్యౌపమ్యమూలకం - 1. తుల్యయోగిత, 2. దీపక, 3. ప్రతివస్తుపమ, 4. దృష్టాంత, 5. నిదర్శన.

4. భేదప్రధానం - 1. వ్యతిరేక, 2. సహోక్తి, 3. వినోక్తి.

II విశేషణ విచ్ఛిత్తి మూలకాలు (4+1 = 5)

1. సమాసోక్తి, 2. పరికరం, 3. శ్లేష, 4. అప్రస్తుత ప్రశంస, 5. అర్థాంతరన్యాస.

III గమ్యత్వ విచ్ఛిత్తి మూలకాలు (3)

1. పర్యాయోక్తి, 2. వ్యాజస్తుతి, 3. ఆక్షేపం.

IV విరోధవిచ్ఛిత్తి మూలకాలు (11)

1. విరోధ (విరోధాభాస), 2. విభావన, 3. విశేషోక్తి (అతిశయోక్తి), 4. అసంగతి, 5. విషమ, 6. సమ, 7. విచిత్ర, 8. అధిక, 9. అన్యోన్య, 10. విశేష, 11. వ్యాఘాత.

V . శృంఖలా విచ్ఛిత్తి మూలకాలు (4)

1. కారణమాల, 2. ఏకావళి, 3. మాలాదీపకం, 4. సారం (ఉదారం)

VI . తర్కన్యాయ విచ్ఛిత్తి మూలకాలు (2)

1. కావ్యలింగం, 2 అనుమానం.

VII . వాక్యన్యాయ విచ్ఛిత్తి మూలకాలు (8)

1. యథాసంఖ్యం, 2. పర్యాయం, 3. పరివృత్తి, 4. పరిసంఖ్య, 5. అర్థాపత్తి, 6. వికల్పం, 7. సముచ్చయం, 8. సమాధి.

VIII. లోకన్యాయ విచ్ఛిత్తి మూలకాలు (7)

1. ప్రత్యనీకం, 2. ప్రతీపం, 3. మీలితం, 4. సామాన్యం, 5. తద్గుణం, 6. అతద్గుణం, 7. ఉత్తర.

IX. గూఢార్థ ప్రతీతి పరకాలు (13)

1. సూక్ష్మం, 2. వ్యాజోక్తి, 3. వక్రోక్తి, 4. స్వభావోక్తి, 5. భావికం, 6. ఉదాత్తం, 7. రసవత్తు, 8. ప్రేయం, 9. ఊర్జస్వి,

10. సమాహితం, 11. భావోదయం, 12 భావసంధి, 13. భావశబలత.

X. మిశ్రితాలంకారాలు (2)

1. సంసృష్టి, 2. సంకరం.

**13. వాగ్భటుడు-1 (6 + 60 = 66)**

వాగ్భటుడు-1 తన 'కావ్యానుశాసనం'లో 6 శబ్దాలంకారాలను 60 అర్థాలంకారాలను పేర్కొన్నాడు. (చూ. అలంకార్ కోశ్)

**14 హేమచంద్రుడు (7 + 29 = 36)**

హేమచంద్రుడు తన 'కావ్యానుశాసనం'లో 7 శబ్ద, 29 అర్థ అలంకారాలను పేర్కొన్నాడు. (చూ. అలంకార్‌కోశ్)

**15 జయదేవుడు (8 + 87 = 95)**

జయదేవుడు 'చంద్రాలోకము'లో చతుర్థమయూఖంలో అలంకార స్వరూపనిరూపణం చేసి పంచమ మయూఖంలో అలంకార సామాన్య లక్షణ నిరూపణ చేసి, 8 శబ్దాలంకారాలు, 87 అర్థాలంకారాలు మొత్తం 95 అలంకారాలు చెప్పాడు. (తర్వాత కాలంలో తెలుగులో వచ్చిన చంద్రాలోకంలో శబ్దాలంకారాలు పూర్తిగా లోపించాయి. అర్థాలంకారాలు కూడా కొన్ని తొలగింపబడి, మరి కొన్ని అదనంగా చేర్చబడి మొత్తం 100 ప్రసిద్ధి వహించాయి.)

**16. విద్యానాథుడు (6 + 67 + 2 = 75)**

విద్యానాథుడు 'ప్రతాపరుద్ర యశోభూషణము'లో మొత్తం 75 అలంకారాలను చెప్పాడు. ఇతడు అలంకారాలను, శబ్ద, అర్థ, మిశ్ర అలంకారాలు అనే మూడు వర్గాలుగా విభజించాడు. ఇతడు 6 శబ్ద, 67 అర్థ, 2 మిశ్ర అలంకారాలను వివరించాడు. అర్థాలంకారాలను మరలా 1. భేదాభేదసాదృశ్య, 2. ఆరోపగర్భ, 3. అధ్యవసాయమూలక, 4. విరోధగర్భ, 5. గమ్యోపమ్య అనే 5 వర్గాలుగా విభజించాడు. అవి క్రింది విధంగా ఉన్నాయి.

శబ్ద - 6

1. ఛేకానుప్రాస, 2. వృత్త్యనుప్రాస, 3. యమకం, 4. పునరుక్తవదాభాస, 5. లాటానుప్రాస, 6. చిత్రాలంకారం.

అర్థ - 67

I. భేదాభేద సాదృశ్యాలు (4).

1. ఉపమ, 2. అనన్వయ, 3. ఉపమేయోపమ, 4. స్మరణ.

II. ఆరోప గర్భాలు (6)

1. రూపక, 2. పరిణామ, 3. సందేహ, 4. భ్రాంతిమత్, 5. అపహ్నుతి, 6. ఉల్లేఖ

III. అధ్యవసాయ మూలకాలు (13)

1. ఉత్ప్రేక్ష, 2. అతిశయోక్తి, 3. సహోక్తి, 4. వినోక్తి, 5. సమాసోక్తి, 6. వక్రోక్తి, 7. స్వభావోక్తి, 8. వ్యాజోక్తి, 9. మీలన, 10. సామాన్య, 11. తద్గుణ, 12. అతద్గుణ, 13. విరోధ.

IV. విరోధ గర్భాలు (9)

1. విశేష, 2. అధిక, 3. విభావన, 4. విశేషోక్తి, 5. అసంగతి, 6. విచిత్ర, 7. అన్యోన్య, 8. విషమ, 9. సమ.

V. గమ్యోపమ్యాలు (35)

1. తుల్యయోగిత, 2. దీపక, 3. ప్రతివస్తూపమ, 4. దృష్టాంత, 5. నిదర్శన, 6. వ్యతిరేక, 7. శ్లేష, 8. పరికర, 9. ఆక్షేప, 10. వ్యాజస్తుతి, 11. అప్రస్తుత ప్రశంస, 12. పర్యాయోక్త, 13. ప్రతీప, 14. అనుమాన, 15. కావ్యలింగ, 16. అర్థాంతరన్యాస, 17. యథాసంఖ్య, 18. అర్థాపత్తి, 19. పరిసంఖ్య, 20. ఉత్తర, 21. వికల్ప, 22. సముచ్చయ, 23. ద్వితీయ సముచ్చయ, 24. సమాధి, 25. భావిక, 26. ప్రత్యనీక, 27. వ్యాఘాత, 28. పర్యాయ, 29. సూక్ష్మ, 30. ఉదాత్త, 31. పరివృత్తి, 32. కారణమాల, 33. ఏకావళి, 34. మాలాదీపక, 35. సార.

మిశ్రాలంకారాలు (2)

1. సంసృష్టి, 2. సంకర.

**17. విద్యాధరుడు (4 + 70 = 74)**

విద్యాధరుడు 'ఏకావలి'లో సప్తమోన్మేషంలో 1. ఛేకాను ప్రాస, 2. వృత్త్యను ప్రాస, 3. యమకం, 4. లాటానుప్రాసం

అను నాలుగు శబ్దాలంకారాలను పేర్కొన్నాడు. ఇతడు 'చిత్రాలంకారము'ను వృత్త్యనుప్రాసలో భాగమని చెప్పాడు. (విద్యాధరుడు:245) అర్థాలంకారంగా చెప్పనే 'పునరుక్తవదాభాస'ను సప్తమోన్మేషంలోనే మొదట పేర్కొన్నాడు. అష్టమోన్మేషంలో 70 అర్థాలంకారాలను పేర్కొంటున్నట్లు చెప్పినా రెండవసారి చెప్పిన 'అతిశయోక్తి'ని మొదట చెప్పిన 'అతిశయోక్తి'లో ఉపభేదమని చెప్పటం చేత ఇతడు చెప్పిన మొత్తం అర్థాలంకారాలు 69 అని చెప్పాలి.

సంసృష్టి, సంకరాలను మిశ్రాలంకారాలని వివరణలో చెప్పినా, వాటితో కలిపే అర్థాలంకారాల సంఖ్యను చెప్పడం విచిత్రం. సప్తమోన్మేషంలో అర్థాలంకారంగా చెప్పిన 'పునరుక్తవదభాస'ను కలిపితే అర్థాలంకారాల సంఖ్య 70 అవుతుంది.

**18. విశ్వనాథుడు (7 + 77 = 84)**

విశ్వనాథుడు 'సాహిత్యదర్పణం'లో 7 శబ్దాలంకారాలు ('పునరుక్తవదాభాస'ను శబ్దాలంకారంగానే చెప్పాడు), 77 అర్థాలంకారాలు చెప్పాడు.

**19. వాగ్భటుడు -II (4 + 35 = 39)**

వాగ్భటుడు -II తన 'వాగ్భటాలంకారము'లో 4 శబ్ద, 35 అర్థాలంకారాలను పేర్కొన్నాడు.

**20. అప్పయ్యదీక్షితుడు (0 + 119 = 119)**

అప్పయ్యదీక్షితుడు తన 'కువలయానందం'లో శబ్దాలంకారాలను పూర్తిగా విడిచిపెట్టి, కేవలం అర్థాలంకారాలనే వివరించాడు. ఇతడు 119 అర్థాలంకారాలను వివరించాడు. మిశ్రాలంకారాలైన సంసృష్టి, సంకరాలను కూడా అర్థాలంకారాలలోనే వివరించాడు.

**21. జగన్నాథపండితుడు (0 + 70 = 70)**

జగన్నాథపండితుని 'రసగంగాధరము' పూర్తిగా లభించడంలేదు. లభించిన దానిలో శబ్దాలంకారాలు లేవు. కాని 70 అర్థాలంకారాలు చర్చించబడినాయి. జగన్నాథుడు ప్రతి అలంకారాన్ని అత్యంత సూక్ష్మ వివేచనతో లోతుగా విశ్లేషించి నిగ్గుతేల్చాడు.

**22. విన్నకోట పెద్దయ (12 + 36 = 48)**

విన్నకోట పెద్దయ రచించిన ఆంధ్రాలంకార గ్రంథమైన 'అలంకార చూడామణి'లో పంచమోల్లాసంలో 36 అర్థాలంకారాలు, షష్ఠోల్లాసంలో 12 శబ్దాలంకారాలు చెప్పబడినాయి. ఇతరులు అర్థాలంకారాలుగా గుర్తించిన - సంసృష్టి, సంకర, ఏకావలి, మాలాదీపకం, సారాలంకారాలను ఇతడు శబ్దాలంకారాలుగానే గుర్తించాడు.

**23. రామరాజభూషణుడు (7 + 70 + 2 = 79)**

రామారాజ భూషణుడు (భట్టుమూర్తి) తన "కావ్యలంకార సంగ్రహం" (నరసభూపాలీయము)లో చతుర్థాశ్వాసంలో 7 శబ్దాలంకారాలను అనుప్రాస భేదాలుగా చెప్పాడు. ఇతడు 'ముక్తపద గ్రస్తము'ను యమక భేదంగానే గుర్తించాడు. పంచమ ఆశ్వాసంలో 70 అర్థాలంకారాలు పేర్కొన్నాడు. మరియు సంసృష్టి సంకర అనే రెండు మిశ్రాలంకారాలను పేర్కొనెను.

**24. చర్ల గణపతిశాస్త్రి (2 + 80 + 2 = 84)**

చర్ల గణపతిశాస్త్రి తన 'సాహిత్యసౌందర్యదర్శనము' లోని 11 వ ప్రకరణమైన శబ్దాలంకార ప్రకణంలో 2 శబ్దాలంకారాలు, 12 ప్రకరణమైన అర్థాలంకార ప్రకరణంలో 80 అర్థాలంకారాలు, 2 మిశ్రాలంకారాలు పేర్కొనడం జరిగింది.

# 3

# శబ్దాలంకార శిల్పం

## 3.0

పోతనభాగవతంలోని పద్యాలు ప్రతి ఆంధ్రుని రసనాగ్రంపై లాస్యం చేయుటకు పోతన ప్రయోగించిన కవితాద్రవ్యాలలో శబ్దాలంకారాల పాత్ర అపరిమితమైంది.

## 3.1 శబ్దాలంకారాలు: నిర్వచనాలు

భారతీయాలంకారికులలో చాలామంది 'అలంకారాల'కు నిర్వచనాలు ఇచ్చారు కాని, శబ్దాలంకారాలకు ప్రత్యేకించి నిర్వచనాలు ఇవ్వలేదు.

వర్ణసంయోజనం వలన కలుగు చారుత్వాన్ని శబ్దాలంకారంగా పరిగణించవచ్చు.

మమ్మటుడు - 'శబ్దపరివృత్తిని సహింపనిచో శబ్దాలంకారము'. (చూ. రామరాజ భూషణుడు: 547) అన్నాడు. అంటేఒక పదం స్థానంలో అదే అర్థం ఉన్న వేరే పదాన్ని ఉంచినపుడు శ్రవణ సుభగత్వం దెబ్బతింటే అది శబ్దాలంకారం.

రుయ్యకుడు -'అర్థమునపేక్షింపక, శబ్దమాత్రము నపేక్షించిన శబ్దాలంకారము' అని చెప్పాడు. (చూ. రామరాజభూషణుడు: 547.) అంటే శబ్దాలంకారమంటే - శబ్ద పరివృత్తిని సహింపనిదై, చారుత్వం శబ్దాన్ని ఆశ్రయించి ఉన్నది. దీనినే మరో రకంగా చెబితే శ్రవణసుభగమైన వర్ణసంయోజనాన్నే శబ్దాలంకారంగా చెప్పవచ్చు.

## 3.2 శబ్దాలంకారాలు : తప్పనిసరి నిబంధనలు

దండి 'అలంకారములు గ్రామ్యతాదోషదుష్టము కారాదని అప్పుడే అవి-రసపరిపుష్టిని కలిగించునని' చెప్పాడు. (దండి: 32)

భోజుడు-'శబ్దాలంకారమైన అనుప్రాస కేవల శ్రవణ సుఖమునే కాక, రసపరిపోషకత్వమును కూడా లక్ష్యముగా పెట్టుకొనవలెను' (భోజుడు 1982:479) అన్నాడు. రసం కావ్యశ్రవణ ఫలం. అట్లు కానిచో ఏ కవితాద్రవ్యప్రయోగమైనా వృథాప్రయాసమే. కావున భోజుని అభిప్రాయం సముచితంగా ఉంది. శబ్దాలంకారాలను రసవిహీనంగా, విశృంఖలంగా ప్రయోగించరాదనీ చెబుతూ విద్యానాథుడు "రసభంగము కాని రీతిని కవులచ్చటచ్చట ఇట్టి చిత్రాలంకారములతో కావ్యమున కాహార్యశోభను గూర్తురు." (విద్యానాథుడు: 421) అని చెప్పాడు.

## 3.3 శబ్దాలంకారాలు : లాక్షణికుల చిన్నచూపు

రసానందం కలిగించుటలో కావ్యగత కవితా ద్రవ్యాలలోని అలంకారాలకు లాక్షణికులు ఇచ్చిన స్థానం 5 రకాలుగా ఉంది. (వివరాలకు చూ. ఇదే. 2.6.3.)

భరత, భామహాదులు అలంకారాలను చాలా చిన్నచూపు చూశారు. అయితే వాళ్ళు శబ్దాలంకారాలను దృష్టిలో ఉంచుకొని వాళ్ళ అభిప్రాయాలను చెప్పారని అనిపిస్తుంది. వీరు శబ్దాలంకారాలను కేవలం శరీరానికి ధరించే బాహ్య ఆభరణాల వంటివే అన్నారు.

భరతుడు - "అలంకారైర్గుణైశ్చైవ బహుభిర్యదలంకృతమ్
భూషణైరివ విన్యస్తైః తద్భూషణమితి స్మృతమ్" (చూ. నరసింహారావు: 9)

సముచితంగా కూర్చబడిన కటకాద్యాభరణాల విభూషణం అనవచ్చునని దీని భావం.

భామహుడు "న కాంతమపి నిర్భూషం విభాతి వనితాననమ్" (భామహుడు: 6)

(స్త్రీ ముఖం సుందరమైనదే అయినప్పటికీ అలంకారరహితమైనచో ప్రకాశింపదు.)

మమ్మటుడు - "ఉపకుర్వంతి తంసన్తం యేzఙ్గద్వారేణ జాతుచిత్
హారాది వదలంకారాస్తేzను ప్రాసోపమాదయః"(మమ్మటుడు: 504)

(ఏవి అంగిగా ఉన్నరసాన్ని ఒక్కొక్కప్పుడు అంగాలైన శబ్దార్థాల ద్వారా హారాదులవలె ఉత్కర్ష కలదానినిగా చేస్తాయో అనుప్రాస, ఉపమ మొదలైనవి అలంకారాలు.)

విద్యానాథుడు - ".. హారాదివదలంకారాస్తత్రస్యురుపమాదయః" అని చెప్పాడు. (చూ. జయకృష్ణబాపూజీ: 145) (ఉపమాద్యలంకారాలు హారాది భూషణాలు)

విశ్వనాథుడు - "శబ్దార్థయోరస్థిరాయే ధర్మాః శోభాతిశాయినః

రసాదీనుపకుర్వంతోऽలంకారాస్తేऽంగదాదివత్" (చూ. జయకృష్ణ బాపూజీ: 145) శబ్దార్థ ధర్మాలగు అలంకారాలు అస్థిరాలని, అవి హారాదుల వంటివని చెప్పాడు.

విశ్వేశ్వరుడు - "ఏకదేశగతాస్సర్వ శరీరం కటకాదివత్

అలంకుర్వంతియే కావ్యంతేऽలంకారతయామతాః" (చూ. జయకృష్ణబాపూజీ: 145)

(ఏకదేశగతాలగు కటకాదులు శరీరాన్ని అంతటినీ అలంకరించేలా ఒకచోట ఉండి కావ్య సామస్త్యాన్ని అలంకరించేవి అలంకారాలు.) పైన లాక్షణికులు పేర్కొన్నట్లు (శబ్ద) అలంకారాలను కేవలం శరీరానికి ధరించే బాహ్య ఆభరణాలవంటివి అనడం శోచనీయం.

కావ్యగతమైన ఏ కవితా ద్రవ్యం, పాఠకుని హృదయంలో రసోద్భవానికి కారణమవుతుందో అది మహోత్కృష్టమైనది. అలాంటివాటిలో ఒకటి శబ్దాలంకారం.

## 3.4 శబ్దాలంకారాలు : రసనిష్పన్నత

(శబ్ద) అలంకారాలను బాహ్య ఆభరణాల వంటివే అని లాక్షణికులు చిన్నచూపు చూడడం అర్థరహితమైంది. అలంకారం పరిధి చాలా విస్తృతమైంది. (చూ. ఇదే. 2.6.9.) ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పాఠకుని హృదయంలో రసోద్భవమగుటకు కారణమవటం శబ్దాలంకారాల మహోన్నత ప్రయోజనం. శబ్దాలంకారాలు రసోద్భవానికి కారణమగు విషయాన్ని లాక్షణికుల మాటల్లోనే చూడవచ్చు.

"రసాదులను అనుగమించే, రసాదులకు అనుకూలంగా ఉంటే ప్రకృష్టమైన న్యాసం, కూర్పు అనుప్రాస" (మమ్మటుడు: 533) 'హార నూపురాదుల వలె ఉండే అనుప్రాస, ఉపమ మొదలైన అలంకారాలు అంగాలగు శబ్దార్థాలకు ఉత్కర్షను కలిగించే ముఖ్యమైన రసాన్నే విలసిల్లజేస్తున్నాయి.' (మమ్మటుడు: 504)

"మధురం రసవద్వాచి వస్తున్యపి రసస్థితిః" (దండి: 26)

(రసం గల వాక్యం మధురం. శబ్దంలోను అర్థంలోను కూడా రసస్థితికి అవకాశం ఉన్నది.) " పరంపరగా రసము నలంకరించునది యలంకారము"(విద్యానాథుడు: 404) "రసానుగతమగు ప్రకృష్ట వర్ణమగు వర్ణవిన్యాము అనుప్రాసమననొప్పును" (విద్యానాథుడు: 410)"రసానుగతమగు ప్రకృష్టమగు వర్ణవిన్యాసము అనుప్రాసము." (రామరాజభూషణుడు: 548) "రసాదులను (అను) అనుసరించి (ప్ర) ప్రకృష్టముగా (= దగ్గరిగా) (ఆస) న్యాసము చేయుట అనుప్రాసమని వ్యుత్పత్తి" (గణపతిశాస్త్రి: 393).

పై మాటలను బట్టి శబ్దాలంకారాల విశిష్టత తెలుస్తుంది.

## 3.5 శబ్దాలంకారాల ప్రయోజనాలు

శబ్దాలంకారాల ప్రయోజనాలను సంక్షిప్తంగా ఈ క్రింది విధంగా చెప్పవచ్చు. (వివరాలకు. చూ. ఇదే. 2.5.6.2., 2.6.6.1.)

1. శబ్ద చమత్కారం పాఠకులను 'ఓహో' అనిపిస్తుంది.
2. మధురమైన నాదగుణం శ్రవణానందాన్ని కలిగించును.
3. సందర్భాన్ని బట్టి కథార్థానికి నేపథ్య సంగీతం వలె పనిచేస్తుంది.
4. పాఠకుని హృదయంలో రస నిష్పన్నగుటకు కారణమవుతుంది.
5. కథ సుదీర్ఘంగా నడుస్తున్నప్పుడు, ఉత్సాహాన్ని కలిగిస్తుంది.

## 3.6 శబ్దాలంకారాల పరిధి : అతివ్యాప్తి, అవ్యాప్తి

శబ్దాలంకారాల అన్నింటి పరిధి ఎంతవరకున్నది అనే విషయాలలోను, ఒక్కొక్క శబ్దాలంకారం యొక్క పరిధి ఎంతవరకూ అన్నది లాక్షణికులలో భిన్నాభిప్రాయలు ఉన్నాయి. ఈ భిన్నాభిప్రాయాల వలన ఏఏ లక్ష్యాలను శబ్దాలంకారాల పరిధిలో చేర్చాలి? ఏవి చేర్చకూడదు? శబ్దాలంకారాల పరిధిలో చేర్చాల్సి వస్తే, ఏ శబ్దాలంకారంగా నిర్ధారించాలి? అనే విషయంలో ఒక సందిగ్ధ పరిస్థితి ఏర్పడింది.

### 3.6.1 శబ్దాలంకారలన్నింటి పరిధి : అతివ్యాప్తి, అవ్యాప్తి

అలంకారాలను అగ్నిపురాణకర్త, భోజుడు శబ్ద, అర్థ, ఉభయ అలంకారాలుగా విభజించగా, మిగిలిన ప్రసిద్ధ భారతీయ

ఆలంకారికులు అందరు శబ్ద, అర్థ అలంకారాలుగా మాత్రమే చెప్పారు. (వీటితో పాటు మిశ్రాలంకారాలు కూడ ఉంటాయి.)

భోజుడు, అగ్నిపురాణకర్తలు చారుత్వం, శబ్దాన్ని ఆశ్రయిస్తే వాటిని శబ్దాలంకారాలలో చేర్చాలని, చారుత్వం శబ్దం మరియు అర్థాన్ని ఆశ్రయించి ఉంటే వాటిని శబ్దార్థ (ఉభయ) అలంకారాలలో చేర్చాలని, చారుత్వం అర్థాన్ని ఆశ్రయిస్తే వాటిని అర్థాలంకారాలలో చేర్చాలని చెప్పారు. శబ్ద, అర్థ అలంకారాల విభాగాలు రెండేసి చేసిన వారు- చారుత్వం శబ్దం మరియు అర్థం అనే రెంటిని ఆశ్రయించిన అలంకారాలను ఏ విభాగంలో చేర్చారు? అనే ఆశ్చర్యకరమైన విషయాలు చర్చిద్దాం.

శబ్దం మరియు అర్థం రెండింటి వలన ఏర్పడే (ఉభయాలంకారాలైన) ఏకావళి, పదానుప్రాస, భాషాసమ, మాలాదీపకం, లాటానుప్రాస, సార, శృంఖల న్యాయబంధం, శ్లేషలను కొందరు శబ్దాలంకారాలుగా పరిగణించారు. కేవల అర్థ ప్రధానమైన ఉక్తి, ద్వితీయోపమాన గోపనం, ప్రతిషేధ బంధం, ప్రహేళిక, భణితి, ముద్ర, యుక్తి, వక్రోక్తి, వాకోవాక్య, సారము మొదలగువాటిని కొందరు శబ్దాలంకారాలుగా పరిగణించారు. అర్థ ప్రధానమైన అతిశయం, అపహ్నుతి, అప్రస్తుత ప్రశంస, అర్థాంతర న్యాస, ఉత్ప్రేక్ష, ఉపమ, క్రమ, తుల్యయోగిత, దీపక, పరికర, పర్యాయ, భావిక, రూపక, లేశ, విశేష, సంశయ, సమాధి, సమాసోక్తి సముచ్చయ, సహోక్తి, ఆక్షేప, సామ్య అనే అలంకారాలను అందరూ అర్థాలంకారాలుగా పరిగణిస్తే భోజుడు మాత్రం వీటిని ఉభయాలంకారాలుగా పరిగణించుట విచిత్రం. పునరుక్తవదాభాసను కొందరు శబ్దాలంకారంగాను, కొందరు అర్థాలంకారంగాను, కొందరు ఉభయాలంకారంగాను పరిగణించారు. (వివరాలకు ఆయా అలంకారాల ప్రత్యేక వివరణ చూడండి.)

మమ్మటుని నిర్వచనం ప్రకారం 'శబ్దపరివృత్తిని సహించకపోతే అది శబ్దాలంకారం' (చూ. రామారాజభూషణుడు: 547). అంటే ఒక పదం స్థానంలో అదే అర్థం ఉన్న వేరే పదాన్ని ఉంచినపుడు శ్రవణసుభగత్వం దెబ్బతింటే అది శబ్దాలంకారం అని భావం.

రుయ్యకుడు 'అర్థమునపేక్షింపక శబ్దమాత్రము నాశ్రయించిన శబ్దాలంకార మనెను'(చూ. రామారాజభూషణుడు: 547). అంటే శబ్దాలంకారం శబ్దాన్నాశ్రయించినదై, శబ్ద పరివృత్తిని సహింపనిదై ఉండాలన్నది లాక్షణికులు నిర్ణయించిన పరిధి. అయితే శబ్దంతో పాటు అర్థం కూడా ఏక కాలంలో అలంకారత్వానికి కారణమైతే అటువంటివాటిని వేటిలో (శబ్ద, అర్థ, ఉభయ) చేర్చాలి? అన్నది సందిగ్ధానికి దారి తీసే అంశం. ఇటువంటి వాటిని లాక్షణికులు శబ్దాలంకారాలలోనే చేర్చారు. కారణం రుయ్యకుని నిర్వచనం ప్రకారం శబ్దమునాశ్రయించడం ముఖ్యలక్షణం కాబట్టి అర్థాన్నికూడా ఆశ్రయించినా ఆశ్రయించకపోయినా ఆ లక్ష్యాలు శబ్దాలంకార పరిధిలో ఇమిడి పోవటం. కావున లాటానుప్రాస వంటివి శబ్దార్థాలను రెంటిని ఆశ్రయించినప్పటికీ వాటిని శబ్దాలంకారాల లోనే చేర్చారు.

అలంకారత్వం శబ్దాన్ని ఆశ్రయించి, అర్థాన్ని ఆశ్రయించకపోతే వాటిని శబ్దాలంకారాలుగా, శబ్ద, అర్థములు రెంటినీ ఆశ్రయించిన వాటిని శబ్దార్థాలంకారాలు (ఉభయాలంకారాలు)గాను భావించడం శాస్త్రీయమనిపించుకుంటుంది. ఈ విధంగా చూస్తే లాటానుప్రాస, యమకంలోని చాలా రకాలు శబ్దాలంకారాలలో చేరవు. అట్లే పునరుక్తావదాభాస, ఏకావళి, నిరుక్తి, శ్లేషలు అర్థాలంకారాల పరిధిలో చేరవు. ఇవన్నీ శబ్దపరివృత్తిని సహించకపోవడం, శబ్ద, అర్థాలను రెంటినీ ఆశ్రయించడం వలన శబ్దార్థాలంకారాలలో చేరుతాయి. ఈ విధమైన అతివ్యాప్తి, అవ్యాప్తి దోషాలు వాటిల్లకుండా శబ్దాలంకారాలకు పరిధి నిర్ణయించకోవడం ద్వారా నిస్సందిగ్ధత, నిర్దిష్టత ఏర్పడుతుంది.

### 3.6.2 ఒక్కొక్క శబ్దాలంకారము పరిధి : అతివ్యాప్తి, అవ్యాప్తి

ఒక్కొక్క శబ్దాలంకారాన్ని సమీక్షిస్తే, వివిధ లాక్షణికులు ఇచ్చిన నిర్వచనాలలో భిన్నాభిప్రాయాలు, అతివ్యాప్తి, అవ్యాప్తులు ఉన్నాయని తెలుస్తుంది.

**అనుప్రాస**

అనుప్రాస శబ్దాలంకారం అన్నది అందరూ అంగీకరించినదే. దీని పరిధి ఎంత వరకూ అనే విషయంలోనే భిన్నాభిప్రాయాలు ఉన్నాయి.

భామహుడు - 'సమానరూప వర్ణముల ప్రయోగము అనుప్రాస'మన్నాడు. (భామహుడు: 30) దండి కూడా 'వర్ణావృత్తి అనుప్రాస'మని చెప్పాడు. (దండి: 28). దండి, భామహులు అనుప్రాసను వర్ణాలకు సంబంధించినదిగా చెప్పారు. వర్ణాలు అంటే కేవల హల్లులు, అక్షరాలు (కేవల అచ్చులు, స్వరసహిత వ్యంజనాలు) ఈ పరిధిలోనికి వస్తాయి. వామనుడు - అక్షరావృత్తినే కాకుండా,

సమానార్థకంగాని, భిన్నార్థకంగాని అయిన పదావృత్తిని కూడా అనుప్రాసగానే చెప్పాడు. (వామనుడు: 103). అక్షరావృత్తి అనడం ద్వారా కేవల హల్లులు ఈ అనుప్రాస పరిధిలోనికి రావు. ఇది అవ్యాప్తి దోషం. అర్థవంతమైన (సమానార్థ/ భిన్నార్థ) పదావృత్తిని కూడా అనుప్రాసలో చేర్చడం అతివ్యాప్తి దోషం, ఎందుకంటే అది శబ్దార్థాలంకార పరిధిలోనికి వస్తుంది.

మమ్మటుడు - 'రసానుకూలంగా వర్ణవిన్యాసముంటే అనుప్రాస' అని చెప్పడం శబ్దాలంకార ప్రయోజనాన్నికూడా దృష్టిలో పెట్టుకొని చెప్పింది. రసనిష్పన్నం కానిచో ఎంత చక్కగా వర్ణవిన్యాసం ఉన్ననూ అది శబ్దాలంకారం కాదని నిర్ణయించెను. అయితే మమ్మటుడు 'అర్థంలేని వర్ణాల ఆవృత్తి వర్ణానుప్రాస అనీ, అర్థం ఉన్న వర్ణాల ఆవృత్తి పదాను ప్రాస' (మమ్మటుడు: 533) అని అనుప్రాసను రెండు రకాలుగా వర్గీకరించాడు. అర్థం ఉండడం, ఉండకపోవడం అనే ఆలోచన చక్కగా ఉంది. అయితే అర్థం ఉన్న వర్ణాలను కూడా శబ్దాలంకారాలలో చేర్చడం అతివ్యాప్తి.

విద్యానాథుడు కూడా మమ్మటుని అభిప్రాయాన్నే అనుసరించాడు. (విద్యానాథుడు: 410). విద్యాధరుడు - శబ్దాలంకారాలను వ్యంజనమాత్ర పౌనరుక్త్యం, స్వరవ్యంజన పౌనరుక్త్యమనీ రెండురకాలుగా వర్గీకరించాడు (విద్యాధరుడు: 238). కానీ కేవల స్వరావృత్తిని చెప్పకపోవడం అవ్యాప్తి.

శ్రుత్యనుప్రాస

శ్రుత్యనుప్రాసను నిర్వచించడంలో లాక్షణికులలో భిన్నాభిప్రాయాలు లేవు. కాని, ఇది అనుప్రాసలో భాగమా? కాదా? అనుప్రాసకు, శ్రుత్యనుప్రాసకు ఉన్న సంబంధం ఎలాంటిది? అనే విషయాలు చర్చించాల్సి ఉంది. ఆలంకారికులందరూ శ్రుత్యనుప్రాసను, అనుప్రాసలో భాగమన్నారు. శ్రుత్యనుప్రాసకిచ్చిన నిర్వచనాలలో ఆలంకారికులలో ఏకాభిప్రాయం ఉంది. ఉదాహరణకు భోజుడు 'ఉత్పత్తి స్థానమును బట్టి సమానోచ్చారణములుగల మూర్ధన్య, తాలవ్య, దంత్య, ఔష్ఠ్య, కంఠ్యములు మొదలగు వాని వర్గముల వర్ణములు ఆవృత్తి యగుట శ్రుత్యనుప్రాస' అని చెప్పాడు. (భోజుడు. 1982: 479). అనుప్రాసలో సరూప వర్ణాలు ఉంటాయి. అంటే 'క'కారానికి 'క' కారమే సరూపమౌతుంది కాని, 'గ' కారం సరూపవర్ణం కాదు. అట్లే అచ్చులు విషయంలోను. అయితే శ్రుత్యనుప్రాసలో మాత్రం ఒకే స్థానంలో ఉండి వెలువడే ఏ వర్ణమైనా దీని పరిధిలోకి వస్తుంది. ఉదాహరణకు 'ట,డ,ణ,ళ' లు మూర్ధన్యాలు. కావున వీటిలో 'ట'కారానికి 'డ'గాని, 'ణ'గాని, 'ళ'గాని ఆవృతమైనా, అది శ్రుత్యనుప్రాసగా పరిగణింపబడుతుంది. కావున 'అనుప్రాస'లో 'శ్రుత్యనుప్రాస' ఒక భాగం అనుట దోషం. 'అనుప్రాస'కన్నా 'శ్రుత్యనుప్రాస' పరిధి విస్తృమైనది. కావున 'శ్రుత్యనుప్రాస'లో 'అనుప్రాస' ఒక భాగమని చెప్తే సముచితంగా ఉంటుంది.

వృత్త్యనుప్రాస

ఒక్క భోజుడి నిర్వచనాన్ని మినహాయిస్తే మిగిలిన ఆలంకారికులందరు వృత్త్యనుప్రాసకు ఇచ్చిన నిర్వచనాలలో ఏకాభిప్రాయం ఉందని స్థూలంగా చెప్పవచ్చు. 'వ్యంజనావృత్తి'నే వృత్త్యనుప్రాస అంటారు. కావున ఇది అనుప్రాస పరిధిలో ఇమిడిపోతుంది. అయితే భోజుడు మాత్రం 'స్వవర్గవర్ణావృత్తి'ని వృత్త్యనుప్రాస అన్నాడు (భోజుడు. 1982: 498). అంటే 'క'వర్గం 'చ'వర్గం మొ॥ వర్గాక్షరాల ఆవృత్తి అన్నమాట. అయితే ఈ విధమైన విభాగాన్ని వృత్త్యనుప్రాసగా కాకుండా అనుప్రాసలో మరొక భాగంగా పేర్కొంటే సముచితంగా ఉంటుంది.

ఛేకానుప్రాస

'ఛేకానుప్రాస'కు ఆలంకారికుల ఇచ్చిన నిర్వచనాలలో గల భిన్నాభిప్రాయాలు ఎంత గందరగోళానికి దారి తీస్తున్నాయో ఈ క్రింద చూడవచ్చు.

1. ఛేకానుప్రాసలో స్వరావృత్తి ఆనుషంగిము. (చూ. రామరాజభూషణుడు: 548). 'అనుషంగికము' అనేమాట, ఛేకానుప్రాసకు కచ్చితమైన పరిధిని నిర్ధారించలేని స్థితిని తెచ్చిపెడుతుంది. ఎందుకంటే స్వరసహిత వ్యంజనావృత్తిని ఆలంకారికులు 'యమకము'గా భావించారు. కావున లక్ష్యములోని వ్యంజనావృత్తి స్వరసహితమైనపుడు దాన్ని యమకముగా చెప్పవలెనా? లేక 'ఛేకానుప్రాసగా' చెప్పవలెనా? అనేది సందిగ్ధం. అయితేదానికి సన్నిధానం సూర్యనారాయణశాస్త్రి చక్కటి పరిష్కారం సూచించారు.

''స్వరవ్యంజన పౌనరుక్త్యమున్నచోట యమకమనియు గేవల వ్యంజనయుగ్మమున కావృత్తి యున్నచో ఛేకానుప్రాసమనియు జెప్పుటలెస్స'' (చూ. రామరాజభూషణుడు: 551) ఒక సమస్య తీరిపోయింది.

2. ఆవృత్తవర్ణాలు సమానార్థకాలు కావాలా? భిన్నార్థకాలు కావాలా? అనే విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. అయితే పైన చెప్పిన పరిష్కారం ద్వారా ఈ సందిగ్ధం కూడా తీరింది. ఎందుకంటే కేవల వ్యంజనాలకు అసలు అర్థాలు

ఉండవుకదా.

3. ఛేకానుప్రాసలో ఆవృత్త వర్ణాల సంఖ్య రెండా? అనేకమా? అనే విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి.

విద్యానాథుడు (విద్యానాథుడు:410), విద్యాధరుడు (విద్యాధరుడు: 238) రెండు వ్యంజనాల ఆవృత్తినే చెప్పగా, మమ్మటుడు 'అనేక వ్యంజనముల ఆవృత్తి' (మమ్మటుడు: 534) అనీ, విశ్వనాథుడు 'వ్యంజన సంఘమునకావృత్తి' (చూ. రామరాజభూషణుడు: 548) అని చెప్పారు. కావున ఛేకానుప్రాస పరిధిలోకి కేవలం రెండు వ్యంజనాల ఆవృత్తి గల లక్ష్యాలను మాత్రమే గ్రహించాలా? లేక అనేక వ్యంజనాల ఆవృత్తి గల లక్ష్యాలను కూడా గ్రహింపవచ్చా? అనేది తేలని విషయం. అయితే పై రెండు రకాల నియమాలు కూడా వృత్త్యనుప్రాసలో భాగమే కాబట్టి 'ఛేకానుప్రాస'ను ప్రత్యేకించి చెప్పవలసిన అవసరం లేదు.

4. వ్యంజనాలు క్రమము తప్పకుండా ఆవృత్తం కావాలా? క్రమం తప్పినా కూడా ఛేకానుప్రాస అవుతుందా? అనేది ప్రశ్న. సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి ఛేకానుప్రాసలో క్రమం తప్పకపాటించవలెనని చెప్పాడు. (చూ. రామరాజభూషణుడు: 548) క్రమం పాటించిననూ, పాటించకపోయినను అది వృత్త్యనుప్రాసలో భాగమే. కావున ఈ ప్రకారం కూడా ఛేకానుప్రాసను ప్రత్యేకించి చెప్పవలసిన అవసరం లేదు.

5. వర్ణములు ఒకసారి ఆవృత్తమైతేనే ఛేకానుప్రాసమా? లేక ఎన్నిమార్లు ఆవృత్తమైననూ ఛేకానుప్రాస అవుతుందా? అనేది నిర్ధారించుకోవలసి ఉంది.

మమ్మటుడు (మమ్మటుడు: 548) మరియు విద్యాధరుడు "ఒక పర్యాయము వ్యంజన యుగ్మమునకు ఆవృత్తి యున్నచో ఛేకానుప్రాస"మనెను (విద్యాధరుడు:238). విశ్వనాథుడు కూడా ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. (చూ. రామరాజభూషణుడు: 548). అయితే ఒకటికన్నా ఎక్కువ పర్యాయాలు వ్యంజన యుగ్మము ఆవృత్తమైన లక్ష్యమును ఛేకానుప్రాసలో చేర్చవచ్చా? చేర్చకూడదా? అనే ప్రశ్నకు లాక్షణికులలో సమాధానం లభించదు. ఎన్నిసార్లు వర్ణములు ఆవృత్తమైనా అది వృత్త్యనుప్రాసయే అవుతుంది. కావున ఛేకానుప్రాసను ప్రత్యేకించి చెప్పవలసిన అవసరం లేదు.

6. ఆవృత్త వ్యంజన యుగ్మము అవ్యవధానంగానే ఉండాలా? వ్యవధానంగా ఉంటే ఛేకానుప్రాస కాదా? అనే విషయాన్ని పరిశీలిస్తే - విద్యానాథుడు (విద్యానాథుడు: 410), రామరాజభూషణుడు (రామరాజ భూషణుడు: 547) అవ్యవధానంగా వ్యంజన యుగ్మం ఆవృత్తి కావాలని చెప్పిరి. లక్ష్యమునందు వ్యవధానంగా ఆవృతమైతే ఛేకానుప్రాసలో చేర్చాలా? వద్దా? అన్నది తేలని విషయం. అయితే ఏ విధంగానైనా అది 'వృత్త్యనుప్రాస'గానే పరిగణింపవచ్చు.

పైన చేసిన సమీక్ష ప్రకారం - స్వర సహిత వ్యంజనావృత్తి ఉంటే అది 'యమకం'లో ఒదిగిపోతుంది. ఆవృత్తి వర్ణములు కేవల వ్యంజనములే కాబట్టి, వృత్త్యనుప్రాస నిర్వచనం ప్రకారం - ఆవృత్త వ్యంజనములకు సంఖ్యానియమం లేదు (అంటే వర్ణములు రెండు కావచ్చు, అంతకన్నా ఎక్కువ కావచ్చు). క్రమంగా ఆవృతం కావాలనే నియమం లేదు (అంటే సక్రమమైనా, అక్రమమైనా). వ్యవధాన నియమం లేదు (అంటే వ్యవధానం ఉండవచ్చు, ఉండకపోవచ్చు). ఆవృతం ఇన్ని మార్లు కావాలనే నియమం లేదు (అంటే ఒక మారు ఆవృతం కావచ్చు, అనేకమార్లు ఆవృతం కావచ్చు). కావున 'ఛేకానుప్రాస' అనేది 'వృత్త్యనుప్రాస' పరిధిలో ఒదిగి పోతుంది. కావున ఛేకానుప్రాసను ప్రత్యేకించి చెప్పవలసిన అవసరం లేదు.

## చిత్రాలంకారము

చిత్రాలంకారం రెండు రకాలు. 1. గర్భకవిత్వం, 2. బంధకవిత్వం. గర్భకవిత్వం ఛందస్సుకు సంబంధించింది. కాగా బంధకవిత్వం అనుప్రాసకు సంబంధించింది. చిత్రాలంకారానికి ఆలంకారికులు ఇచ్చిన నిర్వచనాలలో ఏకాభిప్రాయం ఉంది. కాకపోతే ఇది అనుప్రాసలో భాగమా? లేక ప్రత్యేక శబ్దాలంకారమా? అనే విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. మమ్మటుడు, రుయ్యకుడు, భోజుడు, విద్యానాథుడు, విశ్వనాథుడు దీనిని ప్రత్యేక శబ్దాలంకారంగా చెప్పగా, వాగ్భటుడు-1, వాగ్భటుడు-2 అనుప్రాసలో భాగంగా చెప్పారు. చిత్రాలంకారంలో నిర్దిష్టస్థానాలలోని అక్షరాలు ఆవృత్తి కావడం ఉంటుంది. అయితే అక్షరావృత్తి అనుప్రాసలో భాగమే. కాని అది 'నిర్దిష్ట స్థానములలో ' అనేది అనుప్రాస లక్షణం కాదని చెప్పవచ్చు. అయితే అక్షరావృత్తి నిర్దిష్ట స్థానాలలో జరగడాన్ని అనుప్రాసలో ఒకవిభాగంగా మనం పరిగణిస్తే, శబ్దాలంకార వర్గీకరణలో ఒక సౌలభ్యాన్ని సాధించినట్లు అవుతుంది. చిత్రాలంకారంలో చాలా రకాలు భోజుడు ప్రదర్శించాడు. (వివరాలకు చూ. భోజుడు. 1982 : 587-663).

**యమకము**

యమకము యొక్క పరిధి చాలా విస్తృతమైనది. చాలా భాగం శబ్దం, అర్థం రెండు ప్రాధాన్యత గలది. కాబట్టి అది శబ్దార్థాలంకారమే. (వివరాలకు చూ. ఇదే శబ్దార్థాలంకార శిల్పం.) కాని అర్థరహితమైన పదాంశావృత్తి కూడా యమకము పరిధిలోనికి వస్తుంది. ఈ భాగం కేవల శబ్దసంబంధితము కావున దీనిని శబ్దాలంకారాలలో చర్చించడం సముచితంగా ఉంటుంది.

ప్రహేళిక

ప్రహేళికలో వర్ణములు, అర్థం పరిగణనలోనికి తీసుకుంటాం కాబట్టి దీన్ని శబ్దార్థాలంకారంగా భావించడం సముచితం.

పైన విశ్లేషించినట్లు - శబ్దాలంకారాల వర్గీకరణలో నిర్వచనాలలో ఉన్న అనిర్దిష్టత వల్ల కొన్ని ఏ శబ్దాలంకారాలలో చేర్చాలి అనే సంశయం ఏర్పడుతుంది. కావున శబ్దాలంకారాలను సమగ్రంగా పునర్వర్గీకరించు కోవలసి ఉంది. ఖచ్చితమైన పరిధులు, పరిమితులు నిర్ణయించుకోవలసి ఉంది. సమగ్ర శబ్దాలంకారాల వర్గీకరణకు ముందు పూర్వాలంకారికుల అభిప్రాయం ప్రకారం శబ్దాలంకారాల లక్షణాలను తెలుసుకుందాం.

## 3.7 శబ్దాలంకారాలు ఏర్పడే పద్ధతి

శబ్దాలంకారాలను చెప్పేటప్పుడు ఆలంకారికులు పాటించిన నియమాలను ఈ కింది విధంగా పేర్కొనవచ్చు.

1. వర్ణావృత్తి ఉంటుంది.
2. ఆవృత్తవర్ణముల సంఖ్య ఒకటి గాని, రెండు గాని అంతకంటే ఎక్కువగాని ఉండవచ్చు.
3. వర్ణములు విడివిడిగా గాని, జంటగా గాని, పదాంశము (పదంలోని కొంతభాగం)గా గాని, పదంగా గాని, పదబంధము (సమస్తపదము)గా గాని, పదసమూహంగా గాని, వాక్యంగా గాని, వాక్యసమూహంగా గాని ఉండవచ్చు.
4. ఆవృత్త వర్ణములు వ్యవధానంగా గాని, అవ్యవధానంగా గాని ఉండవచ్చు.
5. ఆవృత్త వర్ణములు కేవల స్వరములుగా గాని, కేవల వ్యంజనములుగా గాని, స్వరసహిత వ్యంజనములుగా గాని ఉండవచ్చు.
6. ఆవృత్త వర్ణములు ఏక హల్లుగల అక్షరాలుగా గాని, ద్విత్వాక్షరాలుగా గాని, సంయుక్తాక్షరాలుగా గాని ఉండవచ్చు.
7. ఆవృత్త వర్ణములు బిందుపూర్వకం కావచ్చు, కాకపోవచ్చు.
8. ఆవృత్త వర్ణములు సమాన రూపవర్ణములై ఉండవచ్చు లేదా సమాన ఉచ్చారణ కలిగినవి కావచ్చు.
9. ఆవృత్త వర్ణములు క్రమాన్ని పాటించవచ్చు, పాటించకపోవచ్చు.
10. ఆవృత్త వర్ణములు - వాక్యములో నిర్దిష్ట స్థానములలో రావచ్చు (ఆది, మధ్య, అంత్య), లేదా పద్యములలో నిర్దిష్ట సంఖ్యగల స్థానములలో రావచ్చు (బంధకవిత్వం).
11. ఆవృత్త వర్ణ సముదాయం అర్థరహితం కావచ్చు, అర్థవంతం కావచ్చు.
12. ఆవృత్త వర్ణ సముదాయం అర్థవంతమైతే అవి సమానార్థకాలు కావచ్చు, భిన్నార్థాలు కావచ్చు.
13. ఆవృత్త వర్ణ సముదాయం సమానార్థకమైనది అయితే తాత్పర్యభేదం ఉండవచ్చు, ఉండకపోవచ్చు.

ఈ నియమాలు విభిన్న కోణాల నుండి కలవడము వలన శబ్దాలంకారాలలో అనేక రకాలు ఏర్పడుచున్నవి.

## 3.8 శబ్దాలంకారాల లక్షణాలు

పూర్వ ఆలంకారికుల అభిప్రాయం ప్రకారం శబ్దాలంకారాల లక్షణాలను ఈ క్రింది విధంగా క్రోడీకరించవచ్చు.

**1. వృత్త్యనుప్రాస**

1. సమానరూప వ్యంజనావృత్తి తప్పనిసరి.
2. స్వరావృత్తి ఆనుషంగికము.
3. ఆవృతమయ్యే హల్లుల సంఖ్య ఒకటి కావచ్చు, అంతకంటే ఎక్కువ కావచ్చు.
4. ఆవృత్త వ్యంజనములు వ్యవధానంగా గాని, అవ్యవధానంగా గాని ఆవృతం కావచ్చు.
5. వ్యంజనములు క్రమంగా గాని, క్రమరహితంగా గాని ఆవృతం కావచ్చు.
6. ఆవృత్త వ్యంజనములు ప్రత్యేకార్థాన్ని ఇచ్చే విధంగా ఉండకూడదు.
7. ఆవృత్త వ్యంజనములు ఏకము (single)గా గాని, ద్విత్వంగా గాని, సంయుక్తంగా గాని ఉంటాయి.

8. ఆవృత్త వ్యంజనములు బిందు పూర్వకం కావచ్చు, కాకపోవచ్చు.

**2. శ్రుత్యనుప్రాస**

1. ఒకే ఉత్పత్తి స్థానం గల (ఒకే ఉచ్చారణ గల) వ్యంజనావృత్తి తప్పనిసరి.

(మిగిలినవి వృత్త్యనుప్రాస లక్షణాలే.)

**3. చిత్రాలంకారము**

1. అక్షర (స్వర, స్వర సహిత వ్యంజన) ఆవృత్తి ఉంటుంది.
2. అక్షర (స్వర, స్వర సహిత వ్యంజన) ఆవృతి నిర్దిష్టస్థానంలో ఉంటుంది.
3. అక్షర (స్వర, స్వర సహిత వ్యంజన) ఆవృతి ఒక్కొక్కబంధాన్ని బట్టి అవ్యవధానం లేక వ్యవధానం ఉంటుంది.

(2,3 లక్షణాల వలన పద్యాన్ని వివిధ ఆకృతులుగా ఏర్పరచడానికి వీలుంటుంది.)

**4. ఛేకానుప్రాస**

1. జంట హల్లుల ఆవృత్తి ఒకసారి ఉంటుంది.
2. స్వరావృత్తి అనుషంగికము.
3. ఆవృత్తమగు హల్లులు క్రమంగా ఉంటాయి.
4. ఆవృత్తమగు హల్లులు అవ్యవధానంగా ఉంటాయి.
5. ఆవృత్తమగు హల్లులు అర్థ రహితంగా గాని, భిన్నార్థకంగా గాని ఉంటాయి.
6. హల్లుల జంటలు రెండు సమానార్థకాలు కాకూడదు.

**5. ప్రహేళిక**

1. పదాలలోని కొన్ని అక్షరాలను తొలగించుట వలన గాని, కలుపుట వలన గాని, ఆ పదాలు అర్థవంతమవుతాయి.

**6. యమకము**

1. అక్షర, (స్వర, స్వరసహిత వ్యంజన) సముదాయ ఆవృత్తి ఉంటుంది.
2. ఆవృత్త అక్షర సముదాయం వ్యవధానంగా గాని, అవ్యవధానంగా గాని ఉండవచ్చు.
3. అక్షర సముదాయం ఒక మారు గాని, అంతకంటే ఎక్కువ మార్లు గాని ఆవృతం కావచ్చు.
4. అక్షర సముదాయం క్రమంగా ఆవృతమవుతుంది.
5. అక్షర సముదాయం వాక్యంలో నిర్దిష్ట స్థానంలో (ఆది, మధ్య, అంత్య) ఆవృతం కావచ్చు, కాకపోవచ్చు.
6. ఆవృత్త సముదాయం అర్థ రహితంగా గాని, అర్థవంతంగా గాని ఉండవచ్చు.
7. ఆవృత్త అక్షర సముదాయం అర్థవంతమైతే, తప్పకుండా భిన్నార్థకాలై ఉండాలి. (సమానార్థకాలు కాకూడదు.)

**7. లాటానుప్రాస**

1. పదావృత్తి ఉంటుంది.
2. ఆవృత్త పదములు అవ్యవధానంగా ఉంటాయి.
3. ఆవృత్త పదములు సమానార్థకాలై ఉంటాయి.
4. ఆవృత్త పదములు తాత్పర్య భేదం మాత్రం కలిగి ఉంటాయి.

**8. ముక్తపదగ్రస్తము**

1. వాక్యాంతములోని పదాన్ని, తరువాతి వాక్యాదిలో ప్రయోగించడం జరుగుతుంది.
2. ఆవృత్త పదాలు అవ్యవధానంగా వస్తాయి.
3. ఆవృత్త పదాలు అర్థరహితాలు గాని, భిన్నార్థకాలు గాని, సమానార్థకాలు గాని కావచ్చు.
4. ఆవృత్త పదాలు సమానార్థకాలైతే తాత్పర్యభేదం ఉండదు.

**9. పునరుక్తవదాభాసము**

1. శబ్దావృత్తి ఉండదు.
2. ప్రకృతార్థాన్ని గ్రహిస్తే అర్థావృత్తి కూడా ఉండదు.

3. శ్లేష వలన అర్థావృత్తి ఉన్నట్లుగా భాసిస్తుంది.

పై లక్షణాలను ఆధారంగా -

1. వృత్త్యనుప్రాస, చిత్రాలంకారం, ఛేకానుప్రాసలోని కొంతభాగం, యమకములోని కొంత భాగంను అనుప్రాస లో ఉపవిభాగాలుగా పరిగణించవచ్చు.

2. శ్రుత్యనుప్రాస పరిధి 'అనుప్రాస' పరిధికన్నా విస్తృతమైనది.

3. 'ఛేకానుప్రాస'లోని కొంతభాగం అనుప్రాసలో ఒదిగిపోగా, మిగిలినది యమకములో ఇమిడిపోతుంది. కావున ఛేకానుప్రాసను ప్రత్యేక శబ్దాలంకారంగా చెప్పవలసిన అవసరం లేదు.

4. 'యమకం'లోని చాలా ఉపవిభాగాలు, లాటానుప్రాస, ముక్తపదగ్రస్తం, ప్రహేళిక, పునరుక్తవదాభాస లలో శబ్దం మరియు అర్థం పరిగణనలోనికి తీసుకోబడతాయి. కాబట్టి వీటిని శబ్దార్థ (ఉభయ) అలంకారాలుగా పరిగణించడం శాస్త్రీయమనిపించు కొంటుంది.

### 3.9 శబ్దాలంకారాల సమగ్ర వర్గీకరణ

పూర్వాలంకారికులు శబ్దాలంకారాలని చెప్పిన వాటిలో కొన్ని శబ్దార్థ (ఉభయ) అలంకారాలు కావడం, కొన్ని పరస్పరం అతివ్యాప్తి చెందడం, కొన్ని లక్ష్యములకు కచ్చితమైన శబ్దాలంకారాలేమీ లేకపోవడం (అవ్యాప్తి) వంటి దోషాలు లేకుండా శబ్దాలంకారాల లక్షణాలను ఒక క్రమంలో, నిర్దిష్టమైన పరిధులతో పునర్వర్గీరించు కోవలసి ఉంది.

శబ్దాలంకారాలలో - కేవలం శబ్ద చమత్కారం ఉండి, అర్థవంతం కాని వాటినే స్వీకరించ వలసి ఉంటుంది. అటువంటివి

1. విరూప వర్ణావృత్తి (శ్రుత్యనుప్రాస)
2. స్వరావృత్తి
3. వ్యంజనావృత్తి (వృత్త్యనుప్రాస లక్షణాలు, ఛేకానుప్రాస లక్షణాలు కొంతవరకూ దీనిలో ఇమిడిపోతాయి.)
4. అక్షరావృత్తి (వృత్త్యనుప్రాస లక్షణాలు కొంతవరకు, చిత్రాలంకారాల లక్షణాలు ఇందులో ఒదిగిపోతాయి.)
5. పదాంశావృత్తి (ఛేక, యమక లక్షణాలు కొంతవరకూ దీనిలో ఒదిగిపోతాయి.)

### 3.10 శబ్దాలంకారాలు : పోతన భాగవతంతో అన్వయం

పైన తెలిపిన శబ్దాలంకారాలను పోతన భాగవతంతో అన్వయించి క్రింది విధంగా చూడవచ్చు.

#### 3.10.1 విరూప వర్ణావృత్తి (శ్రుత్యనుప్రాస)

విరూప వర్ణావృత్తిని లాక్షణికులు శ్రుత్యనుప్రాస అన్నారు. శ్రుత్యనుప్రాసను చెప్పిన లాక్షణికులందరూ దాన్ని అనుప్రాసలో భాగంగా చెప్పారు. శ్రుత్యనుప్రాస నిర్వచనాన్ని భోజుని మాటల్లో చూద్దాం.

'ఉత్పత్తి స్థానమును బట్టి సమానోచ్చారణములు గల మూర్ధన్య, తాలవ్య, దంత్య, ఔష్ఠ్య, కంఠ్యములు మొ॥ వాని వర్గముల వర్ణములు ఆవృత్తి అగుట శ్రుత్యనుప్రాస' చెప్పాడు (భోజుడు. 1982: 479). (అనుప్రాసకు, శ్రుత్యనుప్రాసకు గల భేదము తెలుసుకొనుటకు చూ. ఇదే 3.6.2.)

శ్రుత్యనుప్రాసలో సరూప వర్ణాలు ('క' కారానికి 'క' కారం సరూపం) కాకుండా, విరూప వర్ణాలు వస్తాయి. ఇవి ఏదో ఒక వర్గానికి, సమూహానికి చెందినవై ఉంటాయి. మూర్ధన్యములు (ట, ఠ, డ, ఢ, ణ, ళ) ఒక సమూహం. వీటిలోని వర్ణాలు ఆవృత్తమైతే అది శ్రుత్యనుప్రాస. అట్లాగే దంత్యాలు, తాలవ్యాలు కావచ్చు. అలాగే ఒక వర్గానికి చెందిన స్పర్శాలు (కచటతప లు), ఊష్మాలు వంటివి ఆవృతం కావచ్చు లేక మహా ప్రాణాలు ఆవృతమైనా, అది శ్రుత్యనుప్రాస పరిధిలోనికే వస్తాయి. శ్రీ మహాభాగవతంలో లక్ష్యాలు లభించినంత మేరకు వివరించడం జరుగుతుంది.

#### విరూపవర్ణావృత్తి : భాగవతంతో అన్వయం

శ్రీరామచంద్రుడు సీతాదేవిని తెచ్చుటకు సముద్రాన్ని దాటవలసి వస్తుంది. ఆ సముద్రం ఎలా ఉందో వర్ణించే పద్యం చూస్తే -

*ఆరాజేంద్రుడు గాంచె భూరి విధరత్నాగారమున్, మీన కుం*

*భీర గ్రాహ కఠోరమున్ విపుల గంభీరంబు నభ్రభ్రమ*

*ద్ఘోరాన్యోన్య విభిన్న భంగ భవ నిర్ఘోషచ్చటాంభఃకణ*

*ప్రారుద్ధాంబర పారమున్ లవణ పారావారమున్ జేరువన్* (భాగ. 9 - 278)

సముద్రం అతి గంభీరంగా ఉందనే విషయాన్ని స్ఫురింపజేయుటకు పోతనగారు వివిధ రకాల వర్ణాలను ప్రయోగించారు. ఈ పద్యంలోని విభిన్న వర్ణాలలో ఒక విధమైన ఏకత్వం ఉంది.

- ఈ పద్యంలో అన్నీ సంస్కృత పదాలు (తత్సమాలు) ప్రయోగించబడ్డాయి.
- ంద్రు, త్నా, గ్రా, భ్ర, ద్ఘో, న్యో, న్య, ర్ఘో ప్రా - వంటి అతి ఉచ్చారణా క్లిష్టమైన సంయుక్తాక్షరాలు ప్రయోగించబడ్డాయి.
- వీటిని బట్టి ఉవ్వెత్తున ఎగిసిపడే తరంగాలతో కూడిన సముద్రఘోష, దానిలో జంతువుల అల్లకల్లోల స్థితి స్ఫురింపబడుతుంది.
- అభ్రభ్రమద్ఘోరాన్యోన్య విభిన్న భంగ భవ నిర్ఘోషచ్చటాంభఃకణ ప్రారుద్ధాంబర పారమున్ - అనే దీర్ఘ సమాసం సముద్రం యొక్క నిడివిని (వెడల్పును) తెలియజేస్తుంది.

*హుంకార కంకణ క్రేంకార శింజినీ*
*టంకార నిర్ఘోష సంకులంబు*
*చండదోర్దండ భాస్వన్మండలాగ్ర ప్ర*
*కాండ ఖండిత రాజ మండలంబు*
*శూలాహతక్షతోద్వేల కీలాలక*
*ల్లోలకేళీ సమాలోకనంబు*
*శుంభ దున్మద కుంభ స్థలధ్వంస*
*సంభూత శౌర్యవిజృంభణంబు*
*గలుగు నుద్దామ భీమ సంగ్రామ కేళి ....* (భాగ. 10. ఉత్తర - 322)

పరమ శివునితో బాణాసురుడు అంటున్న మాటలివి. శివుని తనకు రక్షణగా ఉండమని కోరుతాడు బాణాసురుడు. శత్రువులపై రుద్రుడే పోరాడితే ఎలా ఉంటుందో వర్ణించి చెప్పే పద్యమిది.

సంస్కృత పద ప్రధానం, దీర్ఘ సమాసయుక్తమైన ఈ పద్యం రుద్రుని భయంకర యుద్ధదృశ్యాన్ని, శబ్దాల్ని ప్రత్యక్షంగా అనుభవిస్తున్నట్లు స్ఫురింపజేస్తుంది. మహాప్రాణాక్షరాల ఆవృత్తి ఆ యుద్ధాన్ని మరింత భయంకరంగా తోచేలా చేస్తుంది. ఇలాగే వీరభద్రుడు దక్షయజ్ఞం ధ్వంసం చేయునప్పటి బీభత్స దృశ్యాన్ని వర్ణించిన తీరు చూడండి.

*అభ్రంలిహోదభ్రవిభ్రమాభ్రభ్రమ*
*కృన్నీల దీర్ఘ శరీరమమరఁ*
*బ్రజ్వల జ్వలన దీప్త జ్వాలికా జాల*
*జాజ్వల్యమాన కేశములు మెఱయఁ*
*జండదిగ్వేదండ శుండాభదోర్దండ*
*సాహస్రధృతహేతి సంఘమొప్ప*
*వీక్షణ త్రయలోకవీక్షణ ద్యుతిలోక*
*వీక్షణ తతి దుర్నిరీక్షమగుచుఁ*
*గ్రకచ కఠిన కరాళ దంష్ట్రలు వెలుంగ*
*ఘన కపాలాస్థి వనమాలికలును దనర*
*నఖిల లోక భయంకరుఁడగుచు వీర*
*భద్రుఁడుదయించె మాఱటరుద్రుఁడగుచు* (భాగ. 4-108)

వీరభద్రుని భయంకర రూపం చేష్టలు దీనిలో వర్ణింపబడ్డాయి. మొదటి పాదంలో ఆవృత్తమైన 'భ్ర', రెండవ పాదంలో ఆవృత్తమైన జ్వ, జ్వ, జ్వా, జా అనే తాలవ్య, దంతోష్ఠ్యములచే ఏర్పడిన సంయుక్త అక్షరాలు, స్పర్శమైన 'క్', ఊష్మమైన 'ష్'ల కలయికచే ఏర్పడిన 'క్ష' ఆవృత్తి, దీర్ఘ సమాసములు వీరభద్రుని లోకభయం కరత్వాన్ని ఆవిష్కరించాయి. విభిన్న సంయుక్తాక్షర

ప్రయోగ ఫలితమిది.

### 3.10.2 స్వరావృత్తి

కవిత్వంలో కేవలం 'స్వరం' ఆవృత్తమైతే అది కూడా శబ్దాలంకారమౌతుంది. దీనిని ప్రత్యేకించి ఏ లాక్షణికులు పేర్కొనలేదు. కారణం లక్ష్యాలలో స్వరావృత్తి గల పద్యాలు స్వల్పమని కావచ్చు. అల్పమైనా, అధికమైనా ఒక అంశం ఉన్నపుడు దాన్ని పేర్కొనవలసి ఉంటుంది. లాక్షణికులు, వృత్త్యనుప్రాసలో కేవల వ్యంజనావృత్తిని, స్వర సహిత వ్యంజనావృత్తి (అక్షరావృత్తి)ని పేర్కొన్నారు. కాని కేవల స్వరావృత్తిని పేర్కొనలేదు.

ఏదో ఒకటి గాని, అంత ఎక్కువగాని కేవల స్వరాలు ఆవృత్తి అయితే (వ్యంజనావృత్తికి అతీతంగా) దానిని స్వరావృత్తి అంటాం. అంతే కాకుండా పద్యమంతా కేవల హ్రస్వాచ్చులు గాని, కేవల దీర్ఘాచ్చులు గాని రావడం కూడా స్వరావృత్తి పరిధిలోనికే వస్తుంది. శ్రీమహాభాగవతంలో లక్ష్యాలు లభించినంత మేరకు ఉదాహరణలలో స్వరావృత్తి సమన్వయింపబడుతుంది.

**స్వరావృత్తి : భాగవతంతో అన్వయం**

*ఓ కమలాప్త! యో వరద! యోప్రతిపక్ష విపక్షదూర! కు*
*య్యో! కవియోగి వంద్య! సుగుణోత్తమ! యో శరణాగతామరా*
*నోకహ! యో మునీశ్వర మనోహర! యో విపుల ప్రభావ రా*
*వే, కరుణింపవే, తలఁపవే శరణార్థిని నన్నుఁ గావవే* (భాగ. 8-92.)

మొసలి నోటికి చిక్కిన ఏనుగు, తన సర్వప్రయత్నాలన్నీ విఫలమైన తరువాత, తన ప్రాణాలన్నీ కూడగట్టుకొని, చివరి ప్రయత్నంగా భగవంతుని ప్రార్థిస్తుంది. ఆ మాటలలోని దీనత్వం 'ఓ' అనే స్వరం 8 మార్లు ఆవృత్తి కావడంలో ధ్వనిస్తుంది.

*ఒకనొకని చల్దికావడి*
*నొకఁడొక డడకించి దాఁచునొకఁడొకఁడది వే*
*ఱొకరొకరి మొఱఁగి కొని చన*
*నొకఁడొకఁడది తెచ్చి యిచ్చు నుర్వీనాథా!* (భాగ. 10. పూర్వ-454)

ఈ పద్యంలో 'అ', 'ఒ' అనే హ్రస్వ స్వరాలు పెక్కుమార్లు ఆవృత్తి అయినాయి. గోపబాలుర చిలిపి చేష్టలు, సరదాగా చేసే దొంగతనాల ఆవృత్తిని ఇవి స్ఫురింప జేస్తున్నాయి.

**అడిగెదనని కడు వడిఁజను**
**నడిగిన దనుమగుడ నుడుగఁడని నడయుడుగున్**
**వెడవెడ సిడిముడి తడఁబడ**
**నడుగిడు నడుగిడదు జడిమ నడుగిడు నెడలన్** (భాగ. 8-103)

ఈ పద్యంలో అన్నీ హ్రస్వాచ్చులు ఉండడం చూడవచ్చు. బహుశా లక్ష్మీ దేవి చిన్న చిన్న అడుగులను సూచించడానికి పోతనగారు ఇలా రచించారేమో. అట్లే ఇది లక్ష్మీదేవి సందిగ్ధావస్థను సూచిస్తోంది.

### 3.10.3 వ్యంజనావృత్తి (వృత్త్యనుప్రాసలో భాగం)

కేవల వ్యంజనముల ఆవృత్తినే వ్యంజనావృత్తి అంటాం. లాక్షణికులు అనుప్రాసను చెప్తూ దాన్లో భాగంగా వృత్త్యనుప్రాసను పేర్కొన్నారు. ఉదాహరణకు మమ్మటుని నిర్వచనాలు పరిశీలిస్తే - 1. వర్ణానుప్రాస, 2. పదానుప్రాస అని అనుప్రాసను రెండు రకాలుగా వర్గీకరించాడు.

1. వర్ణానుప్రాస:- 'అర్థంలేని వర్ణాలను మాత్రమే ఆవృత్తి చేస్తే వర్ణానుప్రాస' (మమ్మటుడు: 533.) ఈ వర్ణానుప్రాస ఛేకగతము, వృత్తిగతము అని రెండురకాలుగా చెప్పాడు.

(అ) ఛేకానుప్రాస:- 'అనేక వ్యంజనాలకు ఒక పర్యాయము ఆవృత్తి ఛేకానుప్రాస' (మమ్మటుడు: 534.)

(ఆ) వృత్త్యనుప్రాస:- 'ఒకటి లేదా అనేక వ్యంజనాలకు రెండుగాని అంతకంటే ఎక్కువ పర్యాయాల ఆవృత్తి వృత్త్యనుప్రాస' (మమ్మటుడు: 535.)

ముందుగా వృత్త్యనుప్రాసగా చెప్పబడుతున్న (నియమ రహిత) వ్యంజ నావృత్తికి భాగవతంతో లక్ష్యలక్షణ సమన్వయం చేయడం జరుగుతుంది. దాని తరువాత ఛేకానుప్రాస లక్షణానికి ఒదిగే వ్యంజనావృత్తికి ఉదాహరణలు ఈయబడును.

వృత్త్యనుప్రాసలో

1. ఒక వ్యంజనం గాని, అనేక వ్యంజనాలు గాని ఆవృతం కావచ్చు.
2. ఆవృత వ్యంజనాలు వ్యవధానంగా గాని, అవ్యవధానంగా గాని ఉండవచ్చు.
3. ఆవృత వ్యంజనాలు ఏకంగా (single) గాని, ద్విత్వంగా గాని, సంయుక్తంగా గాని, బిందు పూర్వకంగా గాని ఉండవచ్చు.

**వ్యంజనావృత్తి (వృత్త్యనుప్రాసలో భాగం): భాగవతంతో అన్వయం**

***అడిగెదనని కడువడి జను***
***నడిగిన దనుమగుడ నుడుగడని నడయుడుగున్***
***వెడవెడ సిడిముడి తడబడ***
***నడుగిడు నడుగిడదు జడిమ నడుగిడునెడలన్*** (భాగ. 8-103.)

గజేంద్రుని దీనాలాపాలకు వైకుంఠంలో రమావినోదియైన శ్రీమహావిష్ణువు లక్ష్మీదేవి పైట కొంగు కూడా విడువకుండా వేగంగా, ఏకాగ్రమనస్కుడై వస్తున్నాడు. పైటకొంగు విష్ణువు చేతిలో ఉన్న కారణంగా లక్ష్మీదేవి కూడా వెంట వస్తూనే ఉంది. లక్ష్మీదేవి వెనుక వైకుంఠంలోని అందరూ కంగారుగా వస్తుంటారు. విష్ణువు ఎందుకింతగా చుట్టూ ఉన్నవారిని పట్టించుకోకుండా వెళ్తున్నాడో ఎవరికీ తెలియదు.

ఈ చిన్న పద్యంలో 23 సార్లు 'డ' కారం, 14 మార్లు 'న'కారం ఆవృతమైనాయి.
లక్ష్మీదేవి పైటకొంగు చేతిలో పట్టుకొని విష్ణువు వడివడిగా లాగుతూ వెళ్తున్నాడు. విధిలేక లక్ష్మీదేవి వెంటవెళ్తుంది. లక్ష్మీదేవి మనస్సులో ఒక సందిగ్ధం డోలాయమాన మవుతుంది. దేనికోసం ఇంత వేగంగా వెళ్తున్నాడో తెలుసుకొందామని యోచిస్తోంది, మరల విష్ణువు స్థితిని చూచి చెప్పేలాగా లేడని కాస్త వెనక్కు తగ్గుతుంది. ఈ 'డ' కారావృత్తి వలన కలిగే ఆ శబ్దం తడబడుతూ, వేగంగా వెళ్తున్న లక్ష్మీదేవి అడుగుల చప్పుడును, కొప్పు (జడ) అటు ఇటు కొట్టుకోవడాన్ని, లక్ష్మీదేవి మదిలో అసలు విషయం ఏమిటో తెలుసుకోవాలనే ఆలోచన, మరల వద్దనుకొనే ఆలోచనల డోలాయమానస్థితిని ధ్వనింప జేస్తుంది. అలాగే ఈ పద్యంలో 'న'కారం వల్ల లక్ష్మీదేవి సౌకుమార్యం తెలుస్తుంది. అతి సుకుమారి అయిన ఆమె ఎంతగా ఇబ్బంది పడుతుందో ఈ 'న'కారావృత్తి వల్ల తెలుస్తుంది.

ఒక వర్ణం ఒక అర్థాన్ని ఎలా ఇవ్వగలుగుతోంది? 'డ' అనే వర్ణం అడుగుల శబ్దాన్ని ఎలా సూచిస్తుంది? దానికి ప్రమాణమేమిటి? అన్నప్రశ్నలకు సమాధానం లేదు. కాని, కథా ఘట్టాన్ని పాఠకుడు చదువుతూ/వింటూ ఉంటుంటే కథలోని దృశ్యానికి, ఈ వర్ణాలు నేపథ్య సంగీతం వలె ఉంటూ కథను రక్తికట్టిస్తుంటే ఆ వర్ణాల భావాన్ని కథా సందర్భానికి తగ్గట్లుగా మనం ఊహించుకోవలసి ఉంది.

ఒక వర్ణం ఒక సందర్భంలో ఒక భావానికి, మరొక సందర్భంలో మరొక భావానికి పోషకంగా ఉండవచ్చు. అట్లే భీముడు, జరాసంధుడు యుద్ధం చేయునప్పుడు

***బెడగడరు పెన్గదలు పొడిపొడిగఁ దాఁకఁ బెను***
***పిడుగులవనిందొరఁగ నుడుగణమురాలన్***
***మిడుఁగుఱులు చెదర నభమడలహరిదంతములు***
***వడఁక జడధుల్ గలఁగఁబుడమి చలియింపన్***
***వెడచఱువమొత్తియును దడఁబడఁగ నొత్తియును***
***నెడమగుడిలాఁచి తిరుగుడు వడుచు వ్రేయన్***
***వడవడవడంకుచును సుడివడక డాసి చల***
***ముడుగ కపుడొండొరులు వడిచెడక పోరన్*** (భాగ. 10. ఉత్తర-733.)

ఈ పద్యంలో 'డ్' అనే హల్లు 29 మార్లు, 'న్' అనే హల్లు 13 మార్లు, 'గ్' అనే హల్లు 13 మార్లు 'ర్' అనే హల్లు 10 మార్లు ఆవృత్తమైనాయి.

హల్లులు అనేక మార్లు అవృతం కావడం వల్ల ఈ పద్యం చదువునపుడు కలిగే శబ్దాలు, భీమ, జరాసంధుల గదా ఘాతాలను, యుద్ధ ప్రదేశంలో నెలకొన్న భయంకర వాతావరణాన్ని సూచిస్తున్నాయి.

ద్విత్వ వ్యంజనావృత్తి

*హల్లక బిసరుహ సరసీ*
*కల్లోలోత్ఫుల్ల యూథికా గిరి మల్లీ*
*మల్లీ మరువక కురవక*
*సల్లలితానిలము వలన సంతుష్టుండై* (భాగ. 9-601.)

దుష్యంతుడు వేటాడి అలసిపోయి, కణ్వ మహాముని ఆశ్రమ సమీపంలోని నదీ జలాలతో శుభ్రంగా కడుగుకొని ఆశ్రమం దిశగా వస్తుంటే సాధు జంతువులు, క్రూర జంతువులు అన్యోన్యతతో దర్శనమిస్తాయి. ఆశ్రమం సమీపిస్తున్న కొలదీ మనసున అహ్లాద పరుస్తాయి.

హల్లకములు (చెంగలువలు), బిసరుహములు (తామరపూలు), వికసించిన గిరిమల్లీ (కొండమల్లెలు), మల్లీ (మల్లెలు), మరువకములు (సువాసనగల వృక్షవిశేషం), కురవకము (ఎర్రగోరింటపూలు) వీటికితోడు సల్లలిత అనిలం (చల్లగాలి).

రాచవిషయాలతో విసుగెత్తిన దుష్యంతునికి ప్రకృతి సహజమైన, అనాఘ్రాత పుష్పాలు, కొండమల్లెలు, సరస్సులలోని కలువలు, తామరలు ఆహ్లాదాన్నిచ్చాయి. ఎందుకు? ప్రకృతిలో పుట్టిపెరిగిన శకుంతలను వరించబోతున్నాడు కదా! ఆ కొండమల్లెపూలు, కలువలు, తామరలు శకుంతలకు ప్రతీకలు. 'ల'కారం సౌకుమార్యానికి, ముగ్ధత్వానికి సూచకం. ద్విత్వ 'ల'కారం ద్విగుణీకృతమై కనిపించు శకుంతల ప్రకృతి సహజత్వాన్ని, సౌకుమార్యాన్ని, ముగ్ధత్వాన్ని తెలియజేస్తుంది.

సంయుక్త వ్యంజనావృత్తి

*రక్షకులు లేని ప్రజలనుపేక్షింపక రక్షింపఁ బుండరీకాక్షుడు సాక్షాత్కరించిన నారాయణుండు తేజో నిరూఢుండు గాక, యాదవులందు గూఢుండై ...* (భాగ.1-212.)

శరతల్పగతుడైన భీష్మాచార్యులు, పాండవులతో అంటున్నమాటలివి. 'క్ష' అనే సంయుక్తహల్లు ఈ గద్యంలో ఆవృతమైంది. దీనివల్ల మాయ ఎంత బలీయమైనదో, భీష్మాచార్యుని వంటి వారిని కూడా ఎన్ని క్లిష్టపరిస్థితులను ఎదుర్కొనేలా చేసిందో అర్థమవుతుంది.

బిందుపూర్వక వ్యంజనావృత్తి

*తదనంతరంబు ముఖారవింద మకరంద బిందు సందోహపరిష్యందమానానంద దిందిందిరయగు నయ్యిందిరాదేవి గోవింద కరారవింద సమాకృష్యమాణ సంవాద చేలాంచల యైపోవుచు...* (భాగ. 8-99.)

గజేంద్రుని దీనాలాపాలకు సర్వము మరచి విష్ణువు, లక్ష్మీదేవి పైట కొంగు చేత పట్టుకొని వెళ్తుండగా ఆమె కూడా విష్ణువు వెంట వెళుతుంది. విష్ణువు వేగంగా వెళ్తున్నాడు. అతి లలితము, సుందరమునైన శరీరంగల లక్ష్మీదేవి తప్పనిసరి పరిస్థితిలో పరుగులాంటి నడకతో వెళ్తుండగా ఆమె ముఖం పై చెమట బిందువులు వచ్చాయి.

పై వాక్యంలో బిందుపూర్వక 'ద'కారం ఆమె ముఖంపై బిందువులను తలపింప జేస్తున్నాయి. అంతేకాదు ఆ నడకలోని తడబాటు లో గల అందెల చప్పుడు ఈ బిందుపూర్వక 'ద'కారంలో వినిపించక మానవు.

సక్రమ-అవ్యవధాన-అనేక వ్యంజనావృత్తి (ఛేకానుప్రాస)

ఛేకానుప్రాసను గూర్చి సుదీర్ఘ, కూలంకష చర్చ ముందు చేయడం జరిగింది (వివరాలకు చూ. ఇదే. 3.6.2.)

ఛేకానుప్రాసలో స్వరావృత్తి 'ఆనుషంగికం' అనేమాట సందిగ్ధానికి దారితీస్తుంది. కావున స్వరావృత్తి లేనిచోట్ల (కేవల వ్యంజనావృత్తి గల చోట్ల) అంటే సక్రమ-అవ్యవధాన- అనేక వ్యంజనావృత్తిని ఛేకానుప్రాసగా భావిస్తే దానికి లక్ష్యాలు కింద ప్రదర్శింప బడుతున్నాయి.

ఛేకానుప్రాస

'అనేక వ్యంజనాలకు ఒక పర్యాయము ఆవృత్తి ఛేకానుప్రాస' (మమ్మటుడు: 534).

**సక్రమ-అవ్యవధాన-అనేక వ్యంజనావృత్తి (ఛేకానుప్రాస): భాగవతంతో అన్వయం**

***నతినుతులచేతనీ విభుఁ***
***డతనిఁ బ్రసన్నునిఁగఁజేయుమని మనువు దయా***
***మతిఁజెప్పి ధ్రువునిచే స***
***త్కృతుఁడై రయమొప్పఁజనియె ఋషియుక్తుండై*** (భాగ. 4-364)

ఈ పద్యం ప్రారంభంలో 'నతినుతులచేత' అనేచోట నతినుతులు న్+అ+త్+ఇ+న్+ఉ+త్+ఉ+లు న్, త్ అనే హల్లులు సక్రమంగా ఆవృతమైనాయి. ఛేకానుప్రాసలో స్వరావృత్తి ఆనుషంగికం. ఈ ఆనుషంగికం అనేమాట సందిగ్ధానికి దారి తీస్తుంది కావున స్వరావృత్తి లేనిచోటనే ఛేకానుప్రాసగా గుర్తిస్తే, పై పద్యం ఛేకానుప్రాసకు ఉదాహరణ అవుతుంది. 'నతినుతులు'లో స్వరాలు ఆవృత్తి కాలేదు. కేవల న్,త్ అనే జంట హల్లులు, సక్రమంలో ఆవృత్తి అయినాయి. స్వరవ్యవధానాన్ని ఇక్కడ వ్యవధానంగా భావించరాదు.

.......................................
***కమనీయ సిద్ధయోగ క్రియామయమయి***
***యనఘముముక్షుజనాశ్రయంబు***
................................. (భాగ. 4-137.)

పై వాక్యంలో 'క్రియామయమయియనఘ' అనే చోట మ్, య్ అనే రెండు హల్లులు ఆవృతమైనాయి. దీనిలో 'యామయమ' వరకు తీసుకుంటే య్, మ్ అనే జంట హల్లులు అవ్యవధానంగా ఆవృతమైనాయి అనవచ్చు. తేదా 'మయమయి' అనే వరకు తీసుకున్నా మ్, య్ అనే జంట హల్లులు అవ్యవధానంగా ఆవృత్తమైనాయి అని చెప్పవచ్చు.

**3.10.4 అక్షరావృత్తి (వృత్త్యనుప్రాసలో భాగం మరియు చిత్రాలంకారం)**

వృత్త్యనుప్రాసకు ఇచ్చిన నిర్వచనంలో కేవల వ్యంజనావృత్తిగాని, స్వర సహిత వ్యంజన (అక్షర) ఆవృత్తి గాని ఉండవచ్చు. అయితే కేవల వ్యంజనావృత్తిని ముందు సమన్వయించడం జరిగింది కావున ఇప్పుడు అక్షరావృత్తిని వివరించడం జరుగుతుంది.

అక్షరాలు ఒకటిగా గాని అనేకంగా గాని కావచ్చు. ఇవి వ్యవధానంగా గాని, అవ్యవధానంగా గాని, స్థాననియమ రహితంగా గాని, ఆది, అంత్య స్థాన సహితంగా గాని ఆవృతం కావచ్చు.

**స్థాన నియమరహిత - అక్షరావృత్తి**

***అయ్యవసరంబున నతుల తేజో విరాజితుండైన హిరణ్య కశిపుడు హిరణ్యగర్భ వరదాన గర్వంబునం దుర్వార పరిపంథి గర్వ నిర్వాపణఖర్వ భుజావిజృంభణంబున నఖిల లోక పాలాదుల జయించి ... హిరణ్యాక్షుండు ప్రతి దివసంబును జండ వేదండ శుండాదండ మండిత భుజాదండంబున గదాదండంబు ధరియించి ...*** (భాగ. 3-608)

హిరణ్యకశిపుండు గర్వంబునం దుర్వార పరిపంథి గర్వ నిర్వాపణఖర్వ భుజా విజృంభణంబు...

ఈ వాక్యంలో 'ర్వ' అనే సంయుక్తాక్షరం స్థాననియమ రహితంగా ఆవృతమైంది. లోకభీకరమైన హిరణ్యకశిపుని ప్రవర్తనా కాఠిన్యాన్ని తెలిపేలాగా ఈ సంయుక్తాక్షరం ప్రయోగింపబడింది. 'హిరణ్యాక్షుండు చండ వేదండ శుండాదండ మండిత భుజా దండంబున గదా దండంబు ధరియించి' - అన్నపుడు బిందు పూర్వక 'డ'అక్షరావృత్తి హిరణ్యాక్షుని రౌద్రమూర్తిని తెలియజేస్తుంది.

**ఆది - అక్షరావృత్తి**

***మందార మకరంద మాధుర్యమునఁదేలు***
***మధుపంబు వోవునే మదనములకు ...*** (భాగ. 7-150)

పోతన భాగవతంలో ఆణిముత్యం లాంటి పద్యమిది. దీనిలోని పదాలలో ఆద్యక్షరం 'మ'. ఈ 'మ' అనే ఆద్యక్షరం వలన పద్యాన్ని చదువుతున్నపుడు వింటున్నపుడు ఏదో తీయని హాయి మనసుకు అనుభవం లోనికి వస్తుంది. ఇదే పోతన గారి కవిత్వ సౌందర్య మాధుర్య రహస్యం. శ్రవణపేయమైన ఈ ఆద్యక్షరావృత్తి తెలుగు వారు ఎప్పటికీ ఈ పద్యాన్ని మరచిపోకుండా

చేసింది. పోతన గారి కవిత్వ తత్త్వాన్ని గూర్చి చెప్పవలసి వచ్చినపుడెల్ల మందార మకరందాలూరే కవిత్వమని చెప్పడం పరిపాటి.

**మామా వలువలు ముట్టకు**
**మామా కొనిపోకు పోకు మన్నింపుతగన్**
**మామానమేల కొనియెదు**
**మామానస హరణమేల మానుము కృష్ణా!** (భాగ. 10. పూర్వ-818)

తమ వస్త్రాలు అపహరించిన శ్రీకృష్ణునితో గోపికలు ఎవరికివారు తమకు శ్రీకృష్ణుని భర్తగా చేయమని ఒక నెలరోజులు కాత్యాయనీ వ్రతం చేశారు. ఒక రోజు ఉదయాన్నే లేచి గోపికలు పూర్తిగా వస్త్రాలు ఒడ్డున విడిచి యమునా నదిలో స్నానం చేయునపుడు శ్రీకృష్ణుడు వారి వస్త్రాలు అపహరించాడు. గోపికలు పైకి చీరలు అపహరించడం న్యాయం కాదని పలుకుతున్నా, మనస్సులో అది వారికి ఆనంద దాయకం, వారి కాత్యాయనీ వ్రత ఫలమిది.

మా-మా- వలువలు ముట్టకు అనునపుడు మావలువలు+ మావలువలు - మామా వలువలు. ఇక్కడ మా, మా అనే రెండక్షరాలు కలవడం వల్ల 'మామా' అనే ధ్వని ఏర్పడుతుంది. శ్రీకృష్ణుని 'మామా' అని పలుమార్లు పిలవడం వారికిష్టమైన పని. అందుకే ఈ పిలుపు.

రెండవ వాక్యంలో 'మామా' అని ప్రత్యక్షంగా పిలుస్తారు. కాగా మూడవ, నాలుగవ వాక్యాలలో మా- మానము, మా- మానసము అంటూ మరల మరల 'మామా' అనే ధ్వని వచ్చేలాగా పిలుస్తున్నారు. ముందే గోపికల వలువలు, దేహము, మానము, మానసము - అన్నీ కృష్ణార్పణమయ్యాయి. 'తిరిగి ఇవ్వమనడం' కేవలం పెదాల నుండి వచ్చే మాటలు. తిరిగి ఇవ్వకుండా ఉండాలనేదే వారి అంతరంగం.

**అంత్య - అక్షరావృత్తి (అంత్యప్రాస)**

*కనియె శుభోపేతుఁ గందర్పసంజాతు*
*మానిత దేహు నాజానుబాహు*
*మకరకుండల కర్ణు మహిత ప్రభాపూర్ణుఁ*
*జిర యశోల్లాసుఁ గౌశేయ వాసుఁ*
*గస్తూరికా లిప్తు ఘనకాంతి కుముదాప్తు*
*హార శోభిత వక్షునంబుజాక్షు*
*యదువంశ తిలకు మత్తాళినీలాలకు*
*నవ పుష్పచాపుఁ బూర్ణప్రతాపు*
*నభినవాకారు నక్షవిద్యావిహారు*
*మహిత గుణవృద్ధుమన్మథ మంత్రసిద్ధుఁ*
*గలిత పరిశుద్ధు నఖిల లోక ప్రసిద్ధు*
*జతురు ననిరుద్ధు నంగనాజననిరుద్ధు* (భాగ. 10. ఉత్తర-379)

శ్రీకృష్ణుని మనుమడైన అనిరుద్ధుని గుణాలను చెప్పే పద్యమిది. ఈ పద్యంలో ఒక వాక్యం చివరగల అక్షరం మరల తరువాత వాక్యాంతమున వస్తుంది. ఇలా రావడంలో ఒక అందం ఉంది. 'కనియె శుభోపేతుఁ గందర్ప సంజాతు' అంత్యాక్షరావృత్తి శ్రవణపేయంగా ఉంటుంది. ఇలాగే మిగిలిన వాక్యాలలోని అంత్యప్రాసను గమనించవచ్చు.

*దేవ! జగన్నాథ! దేవేంద్ర వందిత!*
*వితత చారిత్ర! సంతత పవిత్ర!*
*హాలాహలాహార! యహిరాజ కేయూర!*
*బాలేందు భూష! సద్భక్తపోష!*
*సర్వలోకాతీత! సద్గుణ సంఘాత!*
*పార్వతీ హృదయేశ! భవ వినాశ!*

*రజితాచలస్థాన! గజచర్మ పరిధాన!*

*సురవైరి విధ్వస్త! శూలహస్త!*

*లోకనాయక! సద్భక్తలోకవరద!*

*సురుచిరాకార! మునిజనస్తుతి విహార! ...* (భాగ. 10. ఉత్తర-320)

వాక్యాంతమున అక్షరము ఆవృత్తి చెందడం పై పద్యంలో చూడవచ్చు. వితత చారిత్ర! సంతత పవిత్ర అనీ, హాలాహలాహార! యహిరాజ కేయూర అని ప్రతి రెండు వాక్యాల చివర ఒక అక్షరం ఆవృత్తి చెందింది.

భగవంతుని స్తుతించే సందర్భాలలో ఈ అంత్యప్రాసవాడడం మనకవులకు ఒక అలవాటు. అంత్యప్రాసలో ఒక సుందరత్వం ఉందన్నమాట. బాణాసురుడు తనకు ప్రసన్నమైన శివుని స్తుతించే పద్యమిది. భగవంతుని మెప్పించుటకు అక్షర కుసుమాలు సమర్పించడం మన భక్తకవి పోతనకి అలవాటే.

*కనియెం దాపస పుంగవుండఖిల లోకఖ్యాత వర్ధిష్ణు శో*

*భన భాస్వత్పరిపూర్ణ యౌవన కళా భ్రాజిష్ణు యోగీంద్ర హృ*

*ద్వన జాతైక చరిష్ణుఁ గౌస్తుభ ముఖోద్యద్భూషణాలంకరి*

*ష్ణు నిలింపాహిత జిష్ణు విష్ణుఁ బ్రభవిష్ణుం గృష్ణు రోచిష్ణునిన్* (భాగ. 3-148.)

మైత్రేయుడు శ్రీకృష్ణుని స్తుతించే పద్యమిది. వాక్యాంతమున 'ష్ణు' అనే సంయుక్తాక్షరం ఆవృత్తి కావడం మైత్రేయుని ప్రేమోద్వేగాన్ని సూచిస్తుంది.

*ఇన్ని దెలియంగ నానతి యిచ్చినన్ను*

*నర్థి రక్షింపవే విమలాంతరంగ!*

*ఘన దయాపాంగ! హరిపాద కమల భృంగ!*

*మహిత గుణసంగ! పాపతమః పతంగ!* (భాగ. 3-10)

పరీక్షితుడు శుకయోగితో అంటున్న మాటలివి. దీనిలో బిందుపూర్వక 'గ' కారం ఆవృతమైంది. శుకుని మెప్పిస్తేనే పరీక్షితునికి భాగవత కథా శ్రవణం లభిస్తుంది. కావున శుకుని ఆనందపరచడం కోసం, శుకునిపై తనకున్న ప్రేమను చాటుకోవడం ఈ అంత్య అక్షరావృత్తి ఫలితాలు. శుకయోగితో పరీక్షితుడు పలికే మరొక పద్యం కూడా అంత్య అక్షరావృత్తికి ఉదాహరణ చూడండి.

*విని వెఱఁగంది పరీక్షి*

*న్మనుజవరేణ్యుండు విమలమతి నిస్తంద్రున్*

*మునికుల జలనిధి చంద్రున్*

*సునిశిత హరిభక్తి సాంద్రు శుకయోగీంద్రున్.* (భాగ. 3 - 8)

దీనిలో బిందుపూర్వక సంయుక్తాక్షరం ఆవృతమైంది.

**ఆది - అంత్య - అక్షరావృత్తి**

వాక్యాదిలో ఒక అక్షరం, వాక్యాంతంలో ఒక అక్షరం ఆవృతం కావడం ఆద్యంత్యాక్షరావృత్తిలో చూడవచ్చు

*నిరుపమ గుణజాలా! నిర్మలానందలోలా!*

*దురిత ఘన సమీరా! దుష్టదైత్య ప్రహారా!*

*శరధి మద విశోషా! చారుసద్భక్తపోషా!*

*సరసిజ దళనేత్రా! సజ్జనస్తోత్ర పాత్రా!* (భాగ. 2-288.)

ఈ పద్యం శ్రీరామున్ని స్తుతించేది. నిరుపమగుణజాలా! నిర్మలానందలోలా! అనే వాక్యాలలో ఆద్యక్షరాలు రెండు ఒకటే, అట్లే అంత్యాక్షరాలు రెండు ఒకటే. ఇలాగే మిగిలిన మూడు పాదాలకు అన్వయించుకోవచ్చు.

### 3.10.5 పదాంశావృత్తి (అక్షరగుచ్ఛావృత్తి) (ఛేక, యమకము)

పదంలోని కొంత భాగం - అంటే రెండుగాని, అంతకంటే ఎక్కువగాని అక్షరాల గుచ్ఛం ఆవృతమైతే అది పదాంశావృత్తి. ఆవృతపదాంశాలకు అర్థం ఉండదు.

ఛేకానుప్రాసలో జంట అక్షరాలు వెంట వెంటనే ఆవృతమౌతాయి. వాటిలో ఒకటి ఒకపదం లోనిదై, మరొకటి మరొక పదం లోనిదై ఉండాలి. అంటే ఇది పదాంశావృత్తి లోనికే వస్తుంది.

**యమకము**

'సమానమైన వర్ణములయొక్క జంటనుగానీ, సమూహమును (అధికమును) గానీ ఆవృత్తి చేయుట యమకము' (చూ. రామరాజభూషణుడు: 551)

(యమకమును గూర్చి దండి, విద్యానాథ, విద్యాధర, భోజాదులు విస్తృతంగా చర్చించారు. వివరాలకు ఆయా గ్రంథాలు చూడగలరు.)

యమకంలో పదంలోని కొంతభాగం ఆవృతం కావడం ఉంటుంది. ఆ కొంతభాగం రెండు గాని అంతకంటే ఎక్కువ అక్షరాల గుచ్ఛంగాని అయ్యింటుంది. రెండక్షరాల గుచ్ఛాన్నే లాక్షణికులు ఛేకానుప్రాసగా స్వీకరించారు. ఛేకలో స్వరావృత్తి ఆనుషంగికం. ఒకవేళ స్వర సహితంగా ఆవృతమైతే అది యమకంలో భాగమవుతుంది.

యమకంలోని ఆవృతమైన అక్షర గుచ్ఛం పదాంశంగానే కాక ఒక్కొక్కమారు ప్రత్యేక పదంగా కూడ ఉండవచ్చు. దానినే పదాంశ - పదావృత్తి అంటారు. పదం అర్థవంతమగుటచే పదాంశ - పదావృత్తిని శబ్దార్థాలంకారాలలో చర్చించడం జరుగుతుంది.

ప్రస్తుతం పదాంశావృత్తిని భాగవతంతో అన్వయించడం జరుగుతుంది. పదాంశం వ్యవధానంగాగాని, అవ్యవధానంగా గాని ఆవృతం కావచ్చు. అట్లాగే, స్థాన నియమరహితంగా గాని, ఆది, మధ్య, అంత్య స్థాన యుక్తంగా గాని ఆవృతం కావచ్చు.

**పదాంశావృత్తి : భాగవతంతో అన్వయం**

పదంలోని కొంతభాగం (అక్షర గుచ్ఛం) ఆవృతమైతే అటువంటి వాటిని పదాంశావృత్తిలో చర్చించడం జరుగుతుంది.

ఒక పదంలోని అక్షర గుచ్ఛం, మరొక/మరికొన్ని పదాలలోని అక్షర గుచ్ఛం సమానమైతే దానిని 'పదాంశావృత్తి' గా పరిగణించడం జరుగుతుంది. అక్షర గుచ్ఛం రెండు అక్షరాలుగా గాని, అంతకంటే ఎక్కువ అక్షరాలు కలదిగా గాని కావచ్చు. ఆవృత అక్షర గుచ్ఛం స్థాన నియమాన్ని (వాక్యాది/వాక్యాంత) పాటించవచ్చు, పాటించక పోవచ్చు.

స్థాననియమం కల చోట్ల పదంలోని మొదటి అక్షరాల గుచ్ఛం ఆవృతమైతే దాన్ని ఆదిస్థాన పదాంశ ఆవృత్తి అంటారు. దాన్నే ఆదిప్రాస అని, ఆదియమకమని అంటారు. వాక్యాంతంలో గల పదంలోని చివరి అక్షరాల గుచ్ఛం ఆవృతమైతే దాన్ని అంత్యస్థాన పదాంశావృత్తి అంటారు. దాన్నే అంత్యప్రాస అని, అంత్య యమకమనీ అంటారు.

పదం మధ్యలో గల అక్షర గుచ్ఛం కూడా ఆవృతం కావచ్చు. అలా ఆవృతమైతే దాన్ని మధ్యస్థాన పదాంశావృత్తి అంటారు. దీన్నే మధ్యప్రాస అని, మధ్యయమకం అనీ అంటారు. అయితే ఈ మధ్యయమకం చాలా అరుదు. అక్షర గుచ్ఛం వ్యవధానంగా గాని, అవ్యవధానంగా గాని ఆవృతం కావచ్చు.

పోతన గారు భాగవతంలో అసంఖ్యాకమైన పదాంశావృత్తి (యమక) అలంకారాలను ప్రయోగించారు. ప్రారంభ పద్యం ఇష్టదేవతా స్తుతి మొదలుకొని లెక్కకు మిక్కిలిగా ప్రయోగింపబడుటను బట్టి పోతనకు అత్యంత ప్రీతిపాత్రమైన శబ్ద అలంకారంగా యమకాన్ని చెప్పవచ్చు. పోతన గారి యమకాలలో (వ్యవధాన) అంత్యయమకాలే ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి.

అక్షర గుచ్ఛము యొక్క ఆవృత్తి గల ఈ అలంకారాలు పోతన భాగవత బృందావనంలో విరగబూసిన పూలగుత్తులని చెప్పవచ్చు.

**ఆది-వ్యవధాన-పదాంశావృత్తి**

***నూతన గరళస్తనియగు***
***పూతనఁ బురిటింటిలోనఁ బొత్తుల శిశువై***
***చేతనముల హరించి ప***
***రేతనగరమునకు పనిచెఁ గృష్ణుడు పెలుచన్.*** (భాగ. 2 - 175)

నూతన, పూతన, చేతనము, పరేతనగరము అనే పదాలలో 'తన' అనే అక్షర గుచ్ఛం (అక్షరద్వయం) ఆవృతమైంది. ఈ పదాలు వాక్యాదిలో వ్యవధానంతో ఉన్నాయి. కావున ఇది ఆదిస్థానగత వ్యవధానపదాంశావృత్తి. పదాంశం అంటే ఇక్కడ

పదంలోని కొంతభాగం.

కొత్తగా శ్రీకృష్ణుడు అవతరించాడు. శ్రీకృష్ణుని దుష్టసంహారకార్యానికి ఆరంభం పూతన. పూతన కృష్ణునికి విషపుపాలు ఇచ్చింది. కాని కృష్ణుడు మాత్రం ఆమెకు ఉత్తమలోకం ఇచ్చాడు.

పోతన గారికి సహజమైన ఈ యమక చమత్కారం పాఠకులలో ఆనందాన్ని, వేగాన్ని, ఉత్సాహాన్ని రేకెత్తిస్తుంది. నూతన, పూతన, చేతన ఇలా పదాలు వస్తుంటే ఒకరకమైన రిథమ్ పద్యార్థానికి నేపథ్యసంగీతంలా వినిపిస్తుంది. ఆవృత అక్షర గుచ్ఛం 'తన'కు ఏ అర్థం ఉండదు. నూతన, పూతన, చేతన వంటి పూర్తి పదాలే అర్థవంతం.

*లేదని యెవ్వరి నడుగను*
*రాదని చింతింపఁ బరులు రప్పించినచోఁ*
*గాదని యెద్దియు మానను*
*ఖేదము మోదమును లేక క్రీడింతు మదిన్* (భాగ. 7 - 439)

ప్రహ్లాదునితో అజగరముగా ప్రవర్తిస్తున్న ముని చెప్తున్న విషయమిది. వాక్యాది లోని పదాలలోని అక్షర గుచ్ఛం ఆవృత మగుట చూడవచ్చు. లేదని, రాదని, కాదని అనే పదాలలో 'దని' అనే అక్షరద్వయం ఆవృతమైంది. అట్లే ఖేదము, మోదము లలో 'దము' ఆవృతమైంది.

*అగ్రహమున నేఁజేసిన*
*నిగ్రహములు పరులతోడ నెఱినొకనాఁడున్*
*విగ్రహములనుచుఁ బలుకఁడ*
*నుగ్రహములుగాఁ దలంచు నొవ్వడు మదిలోన్* (భాగ. 7 - 204)

ప్రహ్లాదుని ప్రవర్తనను వర్ణించే పద్యమిది. ఇది కూడా ఆది-వ్యవధాన- పదాంశావృత్తికి ఉదాహరణ.

*ఓడితివో శత్రువులకు*
*నాడితివో సాధుదూషణాలాపంబుల్*
*గూడితివో పరసతులను*
*వీడితివో మానధనము వీరుల నడుమన్* (భాగ. 1 - 352)

శ్రీకృష్ణ నిర్యాణంతో ఏడుస్తూ హస్తినకు తిరిగి వచ్చిన అర్జునుని చూచి ధర్మరాజు కారణములు ఏమిటని అడుగుతున్న సందర్భంలోని పద్యమిది. అర్జును డంతటి వీరుడు ఏడ్వడం చూచి ధర్మరాజు తప్పేమైనా చేశాడేమో నని పలువిధములుగా భావించుకోవడం ధర్మరాజు ఉత్కంఠను తెలియజేస్తుంది.

**అంత్య-వ్యవధాన-పదాంశావృత్తి**

పోతన భాగవతంలో విరివిగా ప్రయోగింపబడిన అలంకారం అంత్యవ్యవధాన పదాంశావృత్తి. దీనినే అంత్యప్రాస అనీ, అంత్యయమకమనీ అంటారు. వాక్యాంతంలో గల అక్షర గుచ్ఛం ఆవృత్తికావడం దీనిలో ఉంటుంది. ఆవృత్త అక్షర గుచ్ఛానికి అర్థం ఉండదు.

*ఉరు సంసార పయోనిధి*
*తరణంబులు పాపపుంజదళనంబులు శ్రీ*
*కరణంబులు ముక్తి సమా*
*చరణంబులు బాల కృష్ణ సంస్మరణంబుల్* (భాగ. 10. పూర్వ-245)

పోతన గారు సహజ పండితుడు, సరస్వతీ సాక్షాత్కారం పొందినవాడు. మీదు మిక్కిలి శ్రీరాముడే ప్రత్యక్షమై వ్రాయమంటే భాగవతం వ్రాశాడు. పుంఖాను పుంఖాలుగా వస్తున్న శబ్దాలు పోతన గారి ఘంటంలో అంత్యయమకంగా రూపు దిద్దుకొన్నాయి. పై పద్యంలో -

- ఉరు సంసార పయోనిధి తరణంబులు
- పాప పుంజ దళనంబులు
- శ్రీకరణంబులు

- ముక్తి సమాచరణంబులు

- బాల కృష్ణ సంస్మరణంబుల్

తరణంబులు, దళనంబులు, శ్రీకరణంబులు, సమాచరణంబులు, సంస్మర ణంబులు అనే పదాలు అర్థవంతాలు చిన్ని కృష్ణుని నామస్మరణ మహామహిమో పేతము. కోటి కోట్ల జన్మలెత్తుతూ మోక్షం ఎరుగని వారికి సునాయసంగా మోక్షాన్నిచ్చేది, పాపపుంజాలను చీల్చేది, శుభాలనిచ్చేది, మోక్షదాయకమైనది. ఈ పదాలలోని ఆవృత అక్షర గుచ్ఛం 'రణంబులు' అనేది. ఇక్కడ ఈ అక్షర గుచ్ఛం అర్థరహితం.

ప్రజల హృదయంలో ఎప్పటికీ నిలిచిపోయేలా, ప్రజల నాలుకలపై ఎప్పటికీ నాట్యం చేసేలాగా ఈ అంత్యప్రాసలను/ అంత్యయమకాలను చెక్కారు పోతనగారు. సినిమా పాటలు ప్రజారంజకంగా ఉండడానికి కూడా ప్రధాన లక్షణం ఈ అంత్య ప్రాసయే.

*శ్రీకైవల్యపదంబుఁ జేరుటకునై చింతించెదన్ లోక ర*
*క్షైకారంభకు భక్తపాలన కళాసంరంభకున్ దానవో*
*ద్రేక స్తంభకుఁ గేళిలోల విలసద్దృగ్జాల సంభూత నా*
*నా కంజాత భవాండకుంభకు మహానందాంగనాడింభకున్* (భాగ. 1 - 1)

శ్రీమహాభాగవత ప్రారంభ పద్యంలోనే తన కత్యంత ఇష్టమైన అంత్య వ్యవధాన పదాంశావృత్తిని (అంత్య యమకాన్ని) ప్రదర్శించారు పోతనగారు.

పోతన గారు శ్రీకైవల్యపదాన్ని చేరడానికి చింతించినది -

- లోకరక్షైకారంభకున్
- భక్త పాలన కళాసంరంభకున్
- దానవోద్రేకస్తంభకున్
- కేళిలోల విలసత్ దృగ్జాల సంభూత నానాకంజాత భవాండకుంభకున్
- మహానందాంగనా డింభకున్

ఈ వాక్యాలలో వాక్యాంతమున బిందు పూర్వక 'భకున్' అనే అక్షర గుచ్ఛం వ్యవధాన యుక్తంగా ఆవృతమైంది. కావున ఇది అంత్య వ్యవధాన పదాంశావృత్తి. వాక్యాంతమున అక్షర గుచ్ఛం ఆవృత్తం కావడం వల్ల అది ఒక పాటలా వినిపిస్తుంది. ఆ మాధుర్యం, పదాల అర్థాలను రసరమ్యంగా భజింపజేస్తుంది.

*భూసురుడవు బుద్ధిదయా*
*భాసురుడవు శుద్ధ వీరభట సందోహా*
*గ్రేసరుడవు శిశుమారణ*
*మాసుర కృత్యంబు ధర్మమగునే తండ్రీ!* (భాగ. 1 - 160)

శిశువులైన ఉపపాండవులను ఐదుగురిని నిద్రలో ఉండగా చంపిన అశ్వత్థామను కట్టి ద్రౌపది వద్దకు తీసుకువస్తాడు అర్జునుడు. ద్రౌపది కోపంతో అతన్ని ఏమైనా చేస్తుందేమోననుకుంటారు అందరు. కానీ ద్రౌపది అనంత కరుణ మేళవించిన మాటలతో అతని శుభగుణాలను నొక్కి చెప్పడమే కాక 'తండ్రీ!' అని కూడా సంబోధిస్తుంది. ఈ 'సురుడవు' అనేఅక్షర గుచ్ఛ ఆవృత్తి ద్రౌపది కరుణను తెలియజేస్తుంది.

*శ్రీకరములు జనహృదయ వ*
*శీకరములు మందపవన శీర్ణమహాంభ*
*శ్శీకరములు హంసవిహా*
*రాకరములు నగరి కువలయాబ్జాకరముల్* (భాగ. 10. పూర్వ-1599)

ద్వారకా నగరంలోని సరస్సులను వర్ణించే పద్యమిది. శ్రీకరములు, వశీకరములు, శీకరములు, ఆకరములు అంటుంటేనే ఆ సరస్సు అందం, చందం, చల్లదనం అనుభవంలోనికి వచ్చినట్లౌతుంది. పోతన అలంకార శిల్పానికి ఇదొక మంచి ఉదాహరణ.

*భూషణములు వాణికి నఘ*
*పేషణములు మృత్యుచిత్త భీషణములు హృ*

*త్రోషణములు గల్యాణ*

*విశేషణములు హరిగుణోపచిత భాషణముల్* (భాగ. 1 - 44)

శ్రీహరి గుణనామ కీర్తనలు ఎన్ని విధాలుగా పనిచేస్తాయో చెప్పబడింది. ఈ పదాలు వింటుంటే, పాఠకునిలో ఒక రకమైన ఉత్సాహం ఉరకలువేస్తుంది. ఇవి హరిభజనలు, హరినామకీర్తనలు చేయడానికి ప్రేరణ అవుతాయి.

పోతన గారి అంత్య యమకాలు కోకొల్లలు. కొన్ని మాత్రం ఉదాహరించడం జరిగింది.

స్థాననియమరహిత-వ్యవధాన-పదాంశావృత్తి

*అని యిట్లు ధనంజయ సంప్రాపిత శర పంజరుండైన కురు కుంజరుని వచనంబులు వినయంబున నాకర్ణించి మునులందరు వినుచునుండ ధర్మనందనుండు ...* (భాగ. 1 - 214)

ఈ వచనంలో భీష్ముని గూర్చి - శరపంజరుడు కురుకుంజరుడు అనే మాటలు బిందు పూర్వక 'జరుడు' అనే పదాంశం ఆవృతమైంది. అయితే ఒక్కొక్క అక్షర గుచ్ఛం, ఒక్కొక్క వాక్యాదిలో గాని, వాక్యాంతంలో గాని రావడం వంటిది లేకుండా, అంటే స్థాన నియమం లేకుండా ఈ పదాంశం ఆవృతమైంది. కావున ఇది స్థాన నియమ రహిత పదాంశావృత్తికి ఉదాహరణ. 'జరుడు' అనే రెండు అక్షర గుచ్ఛాల నడుమ 'కురు' ఉండడం వ్యవధానం.

*... కుశలమే? బాణదనుజేంద్రు కూఁతుపతికి*

*హర్షమే? పార్థ! ముసలికి హలికి బలికి.* (భాగ. 1 - 345)

ఈ పద్య పాదంలో 'ముసలికి హలికి బలికి' అనే వాక్యంలో 'లికి' అనే అక్షర గుచ్ఛం మూడు పర్యాయాలు ఒకే చోట ఆవృతమైనది. కావున ఇది స్థాననియమ రహిత పదాంశావృత్తికి ఉదాహరణ. 'లికి' అనే మూడు అక్షర గుచ్ఛాలకు వ్యవధానం పాటింపబడింది. చూడండి, ముస - లికి - హ - లికి - బ - లికి.

*.. సంతసంబున గన్నీరు మున్నీరై పఱవ, నురః ఫలంబునం బులకంబులు కులకంబులై తిలకంబులొత్తఁ, గేలు మొగిడ్చి ...* (భాగ. 8 - 667)

వామనునిచేత పాతాళానికి తొక్కబడిన బలి ఆనందంతో ఉన్న సందర్భంలోని వాక్యమిది.

'ఉరఃఫలకంబునంబులకంబులు కులకంబులై తిలకంబులొత్తన్' ఈ వాక్యంలో 'లకంబులు' అనే అక్షర సమూహం ఆవృత్తమైంది. బలి పొందిన ఆనందాన్ని తెలియ జేసేలా ఉందిది.

అవ్యవధాన-పదాంశావృత్తి (ఛేకానుప్రాస)

ఒక పదంలోని చివరి అక్షరాల సమూహం, దాని తరువాత వెను వెంటనే వచ్చే పదంలోని మొదటి అక్షరాల సమూహం ఒకే రూపం కలిగి ఉంటే అది అవ్యవధాన పదాంశావృత్తి అంటారు. ఈ లక్షణం కలిగిన లక్ష్యాలను మన లాక్షణికులు ఛేకానుప్రాసకు ఉదాహరణలుగా నిచ్చారు.

*.. వికచ కల్హార దరదరవింద కైర*

*వప్రదీపిత బక చక్రవాక రాజ*

*హంస సారస కారండవాది జలవి*

*హంగ నినదాభిరామ పద్మాకరముల* (భాగ. 4 - 320)

ధ్రువుడు శ్రీవిష్ణు సాక్షాత్కారానంతరం తిరిగి తన పురమునకు వచ్చినప్పటి సందర్భంలోనిది ఈ పద్యం. ఈ పద్యం వికచ కల్హార దరదరవింద .. అనునపుడు 'దర' అనే అక్షర గుచ్ఛం, అవ్యవధానంతో ఆవృతమైంది. కావున ఇది అవ్యవధాన పదాంశావృత్తి.

దర + అరవింద అనేది సంధివశమున 'దరదరవింద' అయింది. అంటే చిన్న చిన్న తామరపూవులు అని అర్థం. వర్ణ విన్యాసములలో ఇది ఒక పద్ధతి.

*.. బ్రహ్మలకు నెల్ల సంభవ భవన మీవ ...* (భాగ. 8 - 503)

విష్ణువుని స్తుతించే పద్యమిది. దీనిలో 'బ్రహ్మలకునెల్ల సంభవ భవనమీవ' అనే వాక్యంలో సంభవ, భవనము అనే రెండు పదాలలో 'సంభవ' లోని చివరి అక్షర గుచ్ఛమైన 'భవ' అనేది 'భవనము'లోని మొదటి అక్షర గుచ్ఛమైన 'భవ' అనేది

అవ్యవధానంగా వచ్చాయి. కావున ఇది అవ్యవధాన పదాంశావృత్తి.

బలరాముడు కురువంశీయులపై కోపించినప్పటి వాక్యం చూడండి.

.. *అని క్రోధమాన మానసుండై యప్పుడు.* (భాగ. 10. ఉత్తర-582)

ఈ వాక్యంలో 'క్రోధమాన మానసుండై' అన్నప్పుడు 'మాన' అనే అక్షర గుచ్ఛం అవ్యవధానంగా ఆవృతమైంది.

ఇలాగే ఉష, అనిరుద్ధుల విషయంలో ఉష విరహంతో ఉన్నప్పటి వాక్యం కూడా చక్కని ఉదాహరణ. చూడండి -

.. *ఇట్లు విరహ వేదనా దూయమాన మానసనయై యుండె.* (భాగ. 10. ఉత్తర-331 )

ఈ విధంగా రస రమ్యంగా పోతన గారు భాగవత బృందావనంలో శబ్దాలంకార పారిజాతాలను విరగబూయించాడు.

# 4

# శబ్దార్థాలంకార శిల్పం

4.0 శ్రీమద్భాగవతంలోని శబ్దార్థాలంకారాలను సమీక్షించే ముందు శబ్దార్థాలంకార సైద్ధాంతిక భాగం విశ్లేషింపబడుతుంది.

### 4.1 శబ్దార్థాలంకారం: నిర్వచనం

చారుత్వం శబ్దం మరియు అర్థం వలన కలిగితే దానిని శబ్దార్థ (ఉభయ) అలంకారం అంటారు. ఈ భావన్నే భోజుడు

"శబ్దేభ్యోయః పదార్థేభ్య ఉపమాదిః ప్రతీయతే
విశిష్టోऽర్థః కవీనాం తా ఉభయాలంక్రియాః ప్రియాః" (భోజుడు 1984: 217)

అని చెప్పాడు. (శబ్దం వల్లను, (పదం యొక్క) అర్థాల వల్లను విశిష్టార్థాలైన ఉపమాదులు ప్రతీతాలగును.)

### 4.2 శబ్దార్థాలంకారాలు: రస నిష్పన్నత

ఏకారణముల వలన శబ్ద, అర్థాలంకారముల ద్వారా రసనిష్పన్నమగునో, ఆ రెండు రకాల కారణాల వల్ల ఉభయాలంకారాల ద్వారా రస నిష్పన్నమగును.(చూ. ఇదే 3.4, 5.4)

### 4.3 శబ్దార్థాలంకారాల ప్రయోజనం

శబ్ద, అర్థ అలంకారాల ప్రయోజనాలు దీనికి వర్తిస్తాయి. (చూ. ఇదే3.5, 5.6)

### 4.4. శబ్దార్థాలంకారాల పరిధి: అతివ్యాప్తి, అవ్యాప్తి

.......

#### 4.4.1. శబ్దార్థాలంకారములన్నింటి పరిధి: అతివ్యాప్తి, అవ్యాప్తి

అలంకారాలను - శబ్ద, అర్థ, శబ్దార్థ (ఉభయ) అలంకారాలని మూడు విభాగాలుగా చేసినవారు 1. అగ్నిపురాణకర్త, 2. భోజుడు. మిగిలిన ఆలంకారికులందరూ శబ్ద, అర్థ అలంకారాలనే రెండు విభాగాలే చేశారు. మమ్మటుడు శబ్ద, అర్థాలంకారాలుగా వర్గీకరించినప్పటికీ 'పునరుక్తవదాభాస'ను మాత్రం ఉభయాలంకారంగా చెప్పాడు.

అర్థబోధన సామర్థ్యం లేని వర్ణావృత్తి, పదాంశావృత్తిని 'శబ్దాలంకార శిల్పం' అనే అధ్యాయంలో చర్చించడం జరిగింది. పైన చెప్పిన నిర్వచనాన్ని బట్టి శబ్దార్థ అలంకారాలను క్రింది విధంగా చెప్పుకోవచ్చు.

1. శబ్దపరివృత్తిని సహించకపోవడం. (చారుత్వము శబ్దమునాశ్రయించడం.)
2. చారుత్వము అర్థమునాశ్రయించడం.
3. శబ్దావృత్తి ఉండవచ్చు, ఉండకపోవచ్చు.

అయితే శబ్దార్థ అలంకారాలలో శబ్దాలంకార లక్షణము, అర్థాలంకార లక్షణము రెండూ ఉంటాయి. పై లక్షణాల పరిధిలో ఒదిగిపోతే అవి శబ్దార్థాలంకారములవుతాయి. ఒదగకపోతే ఇతరాలంకారములగును.

భోజుడు శబ్దార్థాలంకారములుగా భావించిన 24 అలంకారాలలో 22 అర్థాలంకారాలే, ఎందుకంటే 'శబ్దము' అన్ని అలంకారాలలో తప్పనిసరిగా ఉంటుంది (అర్థాలంకారాలలో కూడా). అంతమాత్రాన వాటిని శబ్దాలంకారాలుగానో, శబ్దార్థాలంకారాలుగానో భావించరాదు. ఆ శబ్దం ఆ కథాసన్నివేశానికి శోభాహేతువు అవుతుందా? కావట్లేదా అనేదాన్ని బట్టే నిర్ణయించాల్సి ఉంది. భోజుడు చెప్పిన 24 ఉభయాలంకారాలలో 22 కేవలం అర్థాన్నాశ్రయించినవే. మిగిలినవి 1. సంసృష్టి, 2. శ్లేష. వీటిలో సంసృష్టి మిశ్రాలంకారము. శ్లేషమాత్రము శబ్దార్థాలంకారమే.

అగ్నిపురాణకర్త - అభివ్యక్తి, ఔచిత్య, కాంతి, ప్రశస్తి, యావదర్థత, సంక్షేపం అనే ఆరింటిని ఉభయాలంకారాలుగా చెప్పినప్పటికీ అవి - శబ్దం మరియు అర్థం చారుత్వ హేతువులు అయినవి కాకపోవడం వల్ల వాటిని శబ్దార్థాలంకారములుగా పరిగణింపరాదు.

ఆలంకారికులు-శబ్దాలంకారాలుగా పరిగణించినప్పటికీ, చారుత్వము శబ్దార్థముల నాశ్రయించుట వల్ల యమకము, భాషాసమ, లాటానుప్రాస, శ్లేష, పునరుక్తవదాభాస, ముక్తపదగ్రస్తములను శబ్దార్థాలంకారాలుగానే స్వీకరించాలి. (వివరాలకు. చూ.

ఇదే 4.4.2.) అలంకారికులు అర్థాలంకారాలుగా చెప్పినప్పటికీ శబ్ద, అర్థాలలో రమణీయత గల పునరుక్తవదాభాస, నిరుక్తి, శ్లేషలను శబ్దార్థాలంకారాలుగానే పరిగణించవలెను. (వివరాలకు చూ. ఇదే. 4.4.2.)

అతివ్యాప్తి, అవ్యాప్తి దోషములు వాటిల్లకుండా శబ్దార్థాలంకారముల నిర్దిష్టపరిధి లోనికి ఒదిగిపోయేవాటినే స్వీకరించాలి.

**4.4.2 ఒక్కొక్క శబ్దార్థాలంకారము పరిధి: అతివ్యాప్తి, అవ్యాప్తి**

ఒక్కొక్క శబ్దార్థాలంకారం పరిధిని కచ్చితంగా నిర్ణయించుటకు వాటి అతివ్యాప్తి, అవ్యాప్తి దోషాలను తొలిగించుకోవలసి ఉంది.

యమకము

శబ్దాలంకారాలను చెప్పిన అలంకారికులు అందరూ 'యమకము'ను చెప్పిన వారే. అలంకారికులలో శబ్ద, అర్థ అలంకారాలనే భేదం పొడచూపినప్పటి నుండి నేటి వరకూ అందరూ దీనిని శబ్దాలంకారంగా చెప్పారు. అయితే శబ్దావృత్తి ఉండడం, శబ్ద పరివృత్తిని సహింపకపోవడం అనే లక్షణాలు ఉంటే వాటిని శబ్దాలంకారాలుగా వారు పరిగణించారు కాబట్టి వాళ్ళ ఆలోచన ప్రకారం యమకము శబ్దాలంకారమే. కాని అర్థాన్ని కూడా దీనిలో పరిగణనలోనికి తీసుకుంటాం కాబట్టి. దీన్ని శబ్దార్థ (ఉభయ) అలంకారంగా పరిగణించడమే శాస్త్రీయం.

ఆవృత్తి రెండక్షరాలకు మాత్రమే ఉంటే దానిని లాక్షణికులు ఛేకానుప్రాసగా గుర్తించిరి. అయితే ఈ ఛేకానుప్రాసను ప్రత్యేక అలంకారంగా గుర్తింపపనిలేదు. ఆవృత్త వర్ణాలు రెండు స్వరసహితమైతే అది యమకములోనే ఒదిగిపోతుంది. రామజభూషణుడు 'వర్ణముల జంట ఆవృత్తమైతే యమక'మనెను. (రామరాజభూషణుడు: 551) 'రెండక్షరములకు మించని నిడివి గల గుచ్ఛము ఆవృత్తి యమకములో ఉండవచ్చు.' (భోజుడు. 1982: 426) వామనుడు 'ఒక్క అక్షరము ఆవృత్తి అయినను స్థాననియమముంటే యమక'మనెను. (వామనుడు: 91) కాని అక్షరము అర్థరహితం కాబట్టి యమకమనరాదు.

ముక్తపదగ్రస్తము

భరతుడు (భరతుడు: 453), రామరాజభూషణుడు (రామరాజ భూషణుడు: 533) ముక్తపదగ్రస్తమును యమకములో భాగమని చెప్పిరి. ఇది కొంతవరకూ నిజమే. వాక్యాంతమున విడిచిన పదమును వాక్యాదిలో గ్రహించుట - ముక్తపదగ్రస్తము. అయితే ఆవృత్తపదాలు సమానార్థకములు కావచ్చు, భిన్నార్థకములు కావచ్చు. ఒకటి అర్థరహితము, మరొకటి సార్థకము కావచ్చు. ఆవృత్త పదాలు సమానార్థకాలు అగుట యమక నియమము కాదు. కావున లక్ష్యములో పదాలు సమానార్థకాలు కాకపోతేనే అది యమకములో భాగము అవుతుంది. సమానార్థకాలైతే యమకములో భాగము కాదు.

భోజుడు (భోజుడు. 1982: 572) దీన్ని 'అనుప్రాస'లో భాగంగా చెప్పాడు. అర్థవంతమైన పదాల ఆవృత్తి కాబట్టి ఇది అనుప్రాస కాదు. ముక్తపదగ్రస్తము శబ్ద, అర్థావృత్తి గలది కాబట్టి శబ్దార్థాలంకారమే.

లాటానుప్రాస

భోజుడు (భోజుడు. 1982: 564), మమ్మటుడు (మమ్మటుడు: 536), రుయ్యకుడు (రుయ్యకుడు: 6) విద్యానాథుడు (విద్యానాథుడు: 413), విద్యాధరుడు (విద్యాధరుడు: 249), విన్నకోట పెద్దయ (పెద్దయ: 105), రామరాజభూషణుడు (రామరాజ భూషణుడు: 550), చర్లగణపతి శాస్త్రి (గణపతిశాస్త్రి: 394) మొదలగు వారందరూ 'శబ్ద మరియు అర్థముల పునరుక్తి గలది లాటానుప్రాస' అని ఒక ప్రక్క చెబుతూనే దీనిని ఉభయాలంకారంగా కాకుండా శబ్దాలంకారంగా పరిగణించారు. ఇది పొరపాటు. 'లాటానుప్రాస'గా అలంకారికులు చెప్పింది శబ్దార్థాలంకారమే.

శ్లేష

శ్లేషాలంకారమును విష్ణుధర్మోత్తర పురాణకర్త, భామహుడు, దండి, ఉద్భటుడు, వామనుడు, కుంతకుడు, రుయ్యకుడు, జయదేవుడు, విద్యానాథుడు, విద్యాధరుడు, వాగ్భటుడు-2, అప్పయ్యదీక్షితుడు, జగన్నాథపండితుడు, విన్నకోట పెద్దయ, రామరాజ భూషణుడు, చర్లగణపతి శాస్త్రి అర్థాలంకారముగా పేర్కొనగా, రుద్రటుడు, మమ్మటుడు, వాగ్భటుడు-1, విశ్వనాథుడు, హేమచంద్రుడు

దీనిని శబ్దాలంకారాలలో మరియు అర్థాలంకారాలలోను, భోజుడు శబ్దాలంకారాలలోను, శబ్దార్థాలం కారాలలోను పేర్కొన్నారు.

దీనిని బట్టి శ్లేషాలంకారమును శబ్ద, అర్థ, శబ్దార్థ అలంకారాలలో ఏ విభాగములో చేర్చాలా? అనే విషయంలో ఆలంకారికులకు భిన్నాభిప్రాయాలు ఉన్నట్లు తెలుస్తుంది.

శ్లేషలో శాబ్దికంగా వర్ణావృత్తి ఉండదు. కాని 'లక్ష్యము శబ్దావృత్తిని సహించేదైతే దాన్ని అర్థశ్లేష అని, సహించకపోతే శబ్దశ్లేష' అని మమ్మటుడు (మమ్మటుడు: 629) , విద్యాధరుడు (విద్యాధరుడు: 352), రామరాజభూషణుడు (రామరాజ భూషణుడు: 665) పేర్కొనిరి.

దీనిలో శబ్దపరివృత్తిని సహించకపోవడం అనే లక్షణముతో పాటు అర్థము కూడా పరిగణనలోనికి వస్తుంది. అర్థశ్లేషకు అవకాశం అత్యంత తక్కువ కావడం వలన శ్లేష అంటే స్థూలంగా శబ్దశ్లేష అని చెప్పవచ్చు.

నిరుక్తి

నిరుక్తిని చర్లగణపతిశాస్త్రి (గణపతిశాస్త్రి:762), అప్పయ్య దీక్షితుడు అర్థాలంకారంగా పేర్కొనిరి. "వ్యుత్పత్త్యర్థమును బట్టి నామములకు అన్వార్థకల్పనము నిరుక్తి" (గణపతిశాస్త్రి: 762). అన్వార్థ కల్పనము శ్లేషయే గాని వేరొకటి కాదు. కావున నిరుక్తి శ్లేషలో భాగమే అంటే శబ్దార్థాలంకారమే.

భాషాసమ

భాషాసమ అలంకారమును విశ్వనాథుడు శబ్దాలంకారంగా చెప్పాడు. ఇది నిజం కాదు. కాని రుద్రటుడు, భోజుడు, మమ్మటుడు, హేమచంద్రుడు మొదలగువారు దీనిని శబ్దశ్లేషలో ఒక భేదంగా స్వీకరించారు. ఇదే శాస్త్రీయము. (చూ. అలంకార్‌కోశ్). 'ఒక వాక్యము మరికొన్ని భాషల్లో కూడా సమానార్థాన్ని లేదా భిన్నార్థాన్నిచ్చినట్లైతే అది భాషాసమ' (చూ. అలంకార్‌కోశ్). ఇది శబ్ద పరివృత్తిసహము కాదు, అర్థము గణనలోనికి తీసుకోబడుట వలన ఇది శబ్దార్థాలంకారమే. శబ్దశ్లేషలో భాగమే.

పునరుక్తవదాభాస

పునరుక్తవదాభాసను రుయ్యకుడు (రుయ్యకుడు: 3), విద్యానాథుడు (విద్యానాథుడు: 412), రామరాజభూషణుడు (రామరాజ భూషణుడు: 555) శబ్దాలంకారంగాను, విద్యాధరుడు (విద్యాధరుడు: 235), అర్థాలంకారంగాను పేర్కొనిరి.

పునరుక్తవదాభాసలో శబ్దావృత్తి ఉండదు. అర్థావృత్తి కూడా ఉండదు, కాని అర్థావృత్తి ఉన్నట్లు భాసిస్తుంది. అది శ్లేష వలన కలుగుతుంది.

శ్లేష వలన కలిగే అర్థ చమత్కారములలో అర్థావృత్తి ఉన్నట్లుగా భాసింప చేయడం ఒకటి. అయితే ఇది శబ్దపరివృత్తిని సహింపదు. కావున శబ్దార్థాలంకారంగా భావించడం, అది శ్లేషలో భాగంగా చేర్చడం సముచితం.

## 4.5 శబ్దార్థాలంకారాలు ఏర్పడే పద్ధతులు

శబ్దార్థాలంకారాల నియమాలను ఈ క్రింది విధంగా చెప్పవచ్చు.

1. అక్షర సముదాయ (రెండు గాని అంతకన్నా ఎక్కువగాని) ఆవృత్తి ఉంటుంది. అరుదుగా ఆవృత్తి ఉండకపోవచ్చు.
2. ఆవృత్త అక్షర సముదాయం పదాంశం (పదములోని కొంత భాగం)గా గాని, పదంగా గాని, పదబంధం (పదసముదాయం) గా గాని, పద సమూహంగా గాని, వాక్యంగా గాని, వాక్యసమూహంగా గాని ఉండవచ్చు.
3. శ్లేష వలన 'ఆవృత్తి' శాబ్దికంగా ఉండవచ్చు, ఉండకపోవచ్చు.
4. ఆవృత్త అక్షర సముదాయాలలో కొన్ని అర్థరహితంగాను, కొన్ని సార్థకంగాను ఉంటాయి.
5. ఆవృత్త అక్షర సముదాయం సార్థకమైతే అవి సమానార్థకంగా గాని, భిన్నార్థకంగా గాని ఉండవచ్చు.
6. ఆవృత అక్షర సముదాయం సమానార్థకమైతే తాత్పర్యభేద సహితంగా గాని, తాత్పర్యభేద రహితంగా గాని ఉండవచ్చు.
7. ఆవృత్త అక్షర సముదాయం వ్యవధానంగా గాని, అవ్యవధానంగా గాని ఉండవచ్చు.
8. ఆవృత్త అక్షర సముదాయం ఆది, మధ్య, అంత్య స్థానములలో రావచ్చు, రాకపోవచ్చు.

9. అక్షర సముదాయం ఎన్నిమార్లైనా ఆవృత్తి కావచ్చు.

### 4.6 శబ్దార్థాలంకారాల వర్గీకరణ

శబ్దార్థాలంకారాలను ఒక క్రమంలోఇలా చెప్పుకోవచ్చు.

1. పదాంశ - పదావృత్తి (యమకము)
2. పదావృత్తి - సమానార్థకం (ముక్తపదగ్రస్త, లాటానుప్రాస దీనిలో ఒదుగుతాయి.)
   - భిన్నార్థకం (ముక్తపదగ్రస్తం దీనిలో ఒదుగుతుంది.)
3. శ్లేష
4. కాకువు
5. ప్రహేళిక
6. పునరుక్తవదాభాస
7. నిరుక్తి
8. పదబంధంలోని పదావృత్తి
9. పదబంధావృత్తి
10. వాక్యావృత్తి

### 4.7 శబ్దార్థాలంకారాలు : పోతన భాగవతంతో అన్వయం

శబ్దార్థాలంకారాల లక్షణచర్చ చేస్తూ వాటిని భాగవతంతో అన్వయించడం జరుగుతుంది.

#### 4.7.1 పదాంశ - పదావృత్తి

ఒక పదంలోని కొంత భాగం (పదాంశం), పూర్తిపదం సమరూపంగా ఉంటే అటువంటి అలంకారాలను 'పదాంశ-పదావృత్తి'లో చర్చించడం జరుగుతుంది. దీనిలో పదం అర్థవంతం, కాని పదాంశం అర్థవంతం కాదు. లాక్షణికులు దీన్ని యమకంలో భాగంగానే చెప్పారు.

**పదాంశ - పదావృత్తి : భాగవతంతో అన్వయం**

*హారికి నందగోకుల విహారికిఁ జక్రసమీర దైత్య సం*
*హారికి భక్త దుఃఖ పరిహారికి గోపనితంబినీ మనో*
*హారికి దుష్ట సంపదపహారికి ఘోష కుటీపయోఘృతా*
*హారికి బాలకగ్రహమహాసుర దుర్వనితా ప్రహారికిన్* (భాగ. 1 - 27)

శ్రీమద్భాగవతాన్ని చిన్ని కృష్ణునికి అంకితం ఇస్తూ చెప్పిన పద్యమిది. దీనిలో - హారికి (హారము ధరించిన శ్రీకృష్ణునికి) అనేది పూర్తి పదం. ఇది అర్థవంతం. కాగా విహారికి, సంహారికి, పరిహారికి, మనోహారికి, అపహారికి, ఆహారికి, ప్రహారికి అనే పదాలలోని 'హారికి' అనేది పదాంశం (అక్షరగుచ్ఛం). దీనికి ప్రత్యేకించి అర్థం లేదు.

శ్రీకృష్ణునికి సమర్పించే పారిజాత పుష్పగుచ్ఛాల్లాగా ఈ పదాంశాలు, పదం ఎంతో అందాన్నిస్తున్నాయి.

*లేమా! దనుజులఁ గెలువఁగ*
*లేమా నీవేల గణఁగి లేచితి విటురా*
*లే మాను మాన వేనిన్*
*లేమా విల్లందుకొనుము లీలంగేలన్* (భాగ. 10. ఉత్తర-172)

నరకాసురుని చంపే సందర్భంలో సత్యభామనుద్దేశించి శ్రీకృష్ణుడు పలికే మాటలివి. ఈ పద్యం ప్రారంభంలో గల 'లేమా' అనేది పదం. అంటే 'ఓ స్త్రీ' అని అర్థం. అట్లే 'లేమా విల్లందుకొనుము' అను వాక్యంలో కూడా 'లేమా' అనేది పదం.

అయితే 'దనుజుల గెలువగ లేమా' అనే వాక్యంలో 'లేమా' అనేది పదాంశం. 'ఇటు రాలే-మాను' అన్నపుడు 'లే' అనేది పదాంతాక్షరం. 'మా' అనే పదాది అక్షరం ఈ రెంటికి అవ్యవధానంచేత 'లేమా' అనే భ్రాంతిని కలిగిస్తున్నాయి ఈ అక్షరాలు.

అహంకారం, బింకం గల సత్యభామతో శ్రీకృష్ణుడు ఇలా చమత్కారంగా మాట్లాడినట్లు చెప్పడం పోతన గారి శిల్ప దృష్టికి నిదర్శనం.

*కరిఁదిగుచు మకరి సరసికిఁ*
*గరి దరికిని మకరిఁ దిగుచుఁ గరకరి బెరయన్*
*గరికి మకరి మకరికిఁ గరి*
*భరమన నిట్లుతల కుతల భటులదరిపడన్* (భాగ. 8 - 54)

భాగవతంలోని అందరి హృదయాలలో నిలిచే దృశ్యాలలో ఒకటి ఏనుగు, మొసలికి చిక్కిన దృశ్యం.

ఏనుగు-మొసలి పోరాటాన్ని వర్ణించే పద్యమిది. ఈ పద్యంలో 'కరి', 'మకరి' అనే పదాలు ఆవృతమయ్యాయి. 'కరి' అనేది ఏనుగు అనే అర్థమిచ్చేపదం. 'మకరి' లోని 'కరి' పదాంశం దీనికి అర్థంలేదు. కావున ఇది పదాంశపదావృత్తికి మంచి ఉదాహరణ. ఏనుగు, మొసలి బురద మడుగులో పోరాడితే కలిగే చప్పుడు, ఈ పదాల అల్లికలో వినబడుతుంది.

మరికొన్ని ఉదాహరణలు ఈ కింద ఇవ్వబడ్డాయి.

1. *శంకర! భక్తమానస వశంకర! దుష్టమదాసురేంద్ర నాశంకర* (భాగ. 10. ఉత్తర -315)
2. *బాణుడు ... నిర్దళితాసమబాణుడు* (భాగ. 10. ఉత్తర -312)
3. *పల్లవవైభవాస్పదములు పదములు... ..కంబుసౌందర్యమంగళము గళము.* (భాగ. 10. పూర్వ - 1710)

### 4.7.2 పదావృత్తి

ఒక పదం అనేకమార్లు అవృతం కావడాన్ని పదావృత్తి అంటారు. ఆవృత్త పదాలు వ్యవధానంగాగాని, అవ్యవధానంగాగాని, సమానార్థకంగా గాని, భిన్నార్థకంగా గాని, సమానార్థకమైతే తాత్పర్య భేద సహితంగా గాని, తాత్పర్యభేద రహితంగా గాని ఉండవచ్చు.
- సమానార్థక (తాత్పర్య భేదరహిత) అవ్యవధాన పదావృత్తి, ముక్తపదగ్రస్తంలో భాగం అవుతుంది.
- సమానార్థక (తాత్పర్య భేదసహిత) అవ్యవధాన పదావృత్తినే లాటానుప్రాస అంటారు. " ఎందొకానొక తాత్పర్య విశేషము దోచుచు శబ్దార్థములు పునరుక్తములగునో యది లాటానుప్రాసము" (విద్యానాథుడు: 413)

### సమానార్థక - వ్యవధాన - పదావృత్తి

*అమ్మలఁగన్న యమ్మముగురమ్మల మూలపుటమ్మ చాల పె*
*ద్దమ్మ సురారులమ్మ కడు పాఱడి పుచ్చిన యమ్మ తన్నులో*
*నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడి యమ్మ దుర్గమా*
*యమ్మ కృపాబ్ధి యీవుత మహత్త్వ కవిత్వ పటుత్వ సంపదల్* (భాగ. 1 - 8)

పోతన గారు శ్రీమహాభాగవతం ఆరంభంలో ఇష్టదైవతా స్తుతితో, జగన్మాతను ప్రార్థిస్తూ చెప్పిన పద్యమిది.

ఈ పద్యంలో 'అమ్మ'అనే పదం పెక్కు మార్లు ఆవృతమైంది. అమ్మ, అమ్మ అనడంలో పోతన గారికి జగన్మాతపై గల భక్తి, తపన, తన ముందున్న శ్రీమహాభాగవతనిర్మాణమనే మహత్కార్యం నిర్వహించగలనో లేదో అనే డోలాయమానస్థితి, సమస్త సందేహాలను, సంకటాలను తొలిగించి, అవిచ్ఛిన్న మధుర కవితా ధారను ప్రసాదించమని తపనతో జగన్మాతను వేడుకోవడం ద్యోతకమవుతున్నాయి. తనను నమ్మినవారిని కాపాడగల తల్లి జగన్మాత అని పోతనగారికి తెలుసు. అందుకే ఇంత హృదయ పూర్వకంగా ప్రార్థించడం.

*మనసారథి, మనసచివుడు,*
*మన వియ్యము, మనసఖుండు, మన బాంధవుడున్,*
*మన విభుడు, గురువు, దేవర*
*మనలను విడనాడి చనియె, మనుజాధీశా!* (భాగ. 1 - 356)

శ్రీకృష్ణుడు దేహత్యాగం చేసినపుడు ఆవిషయాన్ని, అర్జునుడు, ధర్మరాజుతో చెబుతున్న సందర్భంలోని పద్యమిది. ఈ

పద్యంలోని 'మన' అనే పదం సమానార్థకంగా ప్రయోగింపబడింది. మన సారథి, మనసచివుడు, మనవియ్యము, మన సఖుడు, మన బాంధవుడు, మన విభుడు, మన గురువు అనడంలో పాండవులతో మమేకమై, పాండవులను బాల్యం నుండి జీవిత చరమదశ వరకు అసంఖ్యాక విపత్కర పరిస్థితులలో రక్షించిన కృష్ణుడు, ఇపుడు దేహత్యాగం చేశాడనే విషయం పిడుగుపాటుగా తోచింది పాండవులకు. అర్జునుడు ఆ విపత్కరస్థితి నుండి తేరుకోలేక పెన్నిధిని కోల్పోయిన వానివలె ఏడుస్తూ చెబుతున్నాడు. 'మన' అనే పదం ఆవృత్తి కావడం వల్ల శ్రీకృష్ణార్జునుల సంబంధం, పరస్పర ప్రేమ అర్థమవుతున్నాయి.

### సమానార్థక (తాత్పర్య భేదరహిత) - అవ్యవధాన - పదావృత్తి (ముక్తపద గ్రస్తం)

*పాలిండ్లపై నున్న పయ్యెద జాఱించు*
*జాఱించి మెల్లనఁ జక్కనొత్తుఁ*
*దళుకు తళ్కను గండ ఫలకంబు లొలయించు*
*నొలయించి కెంగేల నుజ్జగించుఁ*
*గడు మెఱుంగులు వాఱు కడకన్నులల్లార్చు*
*నల్లారి ఱెప్పల నండగొలుపు*
*నవరని దరహాస చంద్రికఁ జిలకించుఁ*
*జిలకించి కెమ్మోవిఁ జిక్కు పఱచు...* (భాగ. 8 - 303)

క్షీరసాగర మథనంలో చివరగా అమృతం పుట్టగా, ఆ అమృత పాత్రను రాక్షసులు తీసుకొని పోతుండగా, వారి నుండి తిరిగి అమృతపాత్రను తీసుకొనుటకు, దాన్ని దేవతలకు అందించడానికి శ్రీమహావిష్ణువు మోహిని రూపాన్ని ధరిస్తాడు. ఆ మోహిని శృంగార చేష్టలను వర్ణించే పద్యమిది.

పాలిండ్లపై నున్న కొంగును జాఱించు జాఱించి మెల్లన చక్కనొత్తును. ఈ వాక్యంలో 'జాఱించు' అనే పదం వాక్యాంతంలో ఉన్నది, మరల తరువాతి వాక్యాదిలో ఆవృతమైంది. కాబట్టి ఆ రెండు పదాలు అవ్యవధానంగా కనిపిస్తున్నాయి. రెండు పదాల అర్థాలు ఒక్కటే. ఇలా వాక్యాంతమున విడిచిన పదం తరువాతి వాక్యాదిలో గ్రహింపబడింది. కావున ఇది ముక్తపదగ్రస్తం. ఇలాగే నాలుగు పాదాలలోనిది ముక్తపదగ్రస్తమే. పైట జాఱించడం, బుగ్గలు ఒలయించడం, కన్నులల్లార్చడం చిరునవ్వులు చిలికించడం వంటి ఈ శృంగార చేష్టలు రాక్షసులను మైమరపింపజేయుటకే.

శరద్రాత్రి శ్రీకృష్ణుడు వేణుగానం ఆలపిస్తుంటే గోపికలు,

*... గోవులకుం క్రేపుల విడువకయు, విడిచి విడిచియు యీడకయు, నీడి యీడియు యీడినపాలు కాఁపకయుఁ గాఁచి కాఁచియు, గాగిన పాలు డింపకుయు, డించి డించియు, డించిన పాలు బాలురకుం బోయకయుఁ బోసిపోసియుఁ బతులకుఁ బరిచర్యలు సేయకయుఁ జేసి చేసియు నశనంబులు గుడువకయుఁ గుడిచి కుడిచియుఁ గుసుమంబులు ముడువకయుఁ ముడిచి ముడిచియుఁ దొడవులు దొడగకయుఁ దొడిగి తొడిగియు గోష్ఠంబుల పట్టుల నుండకయు ....* (భాగ. 10. పూర్వ- 965.) గోవింద సందర్శనకు జనిరి.

గోపికలకు శ్రీకృష్ణునిపై గల ప్రేమ తీవ్రత ఈ మాటల ద్వారా తెలుస్తుంది. శ్రీకృష్ణుని వేణుగానం వినగానే గోపికలు ఉన్నఫళంగా శ్రీకృష్ణుని వద్దకు వచ్చేస్తారు. గోవులకు క్రేపులు విడువబోతుండగా వేణుగానం విన్న ఒక గోపిక, విడవడం మరచిపోయి శ్రీకృష్ణుని వద్దకు ఏకాగ్రమనస్కయై వస్తుంది. అట్లే ఒక గోపిక పొయ్యి మీద పాలు దించకుండా, ఒక గోపిక దింపిన పాలు పిల్లలకు పోయకుండా శ్రీకృష్ణుని వద్దకు వెళ్తున్నారు. అయస్కాంతానికి ఆకర్షింపబడ్డ ఇనుప ముక్కల్లాగా అప్రయత్నంగా వెళ్తున్నారు. దీనిని బట్టి గోపికలకు కృష్ణునిపై గల ప్రేమ అర్థమవుతుంది.

వాక్యాంతమున విడిచిన పదం, తరువాతి వాక్యాదిలో స్వీకరింపబడింది. కావున ఇది ముక్తపదగ్రస్తం. ఈ ముక్తపదగ్రస్తం ద్వారా గోపికల ఆతృత, ప్రేమ అర్థమవుతాయి.

### సమానార్థక (తాత్పర్యభేదసహిత) - అవ్యవధాన - పదావృత్తి (లాటానుప్రాస)

*కమలాక్షు నర్చించు కరములు కరములు*
*శ్రీనాథు వర్ణించు జిహ్వజిహ్వ*
*సురరక్షకునిఁజూచు చూడ్కులు చూడ్కులు*
*శేషశాయికి మ్రొక్కు శిరము శిరము*
*విష్ణునాకర్ణించు వీనులు వీనులు*
*మధువైరిఁ దవిలిన మనము మనము*
*భగవంతువలగొను పదములు పదములు*
*పురుషోత్తముని మీఁది బుద్ధి బుద్ధి*
*దేవదేవుని చింతించు దినము దినము*
*చక్రహస్తుని ప్రకటించు చదువు చదువు*
*కుంభినీధవుఁ జెప్పెడి గురుఁడు గురుఁడు*
*దండ్రి! హరిఁజేరు మనియెడి తండ్రి తండ్రి* (భాగ. 7-169)

ఆంధ్రులందరి జిహ్వలపై నాట్యం చేసే తీయని పోతన పద్యమిది. అంతే కాదు 'లాటానుప్రాస' అనగానే లాక్షణికుల దగ్గర నుండి విద్యార్థుల వరకు వెంటనే గుర్తుకు వచ్చేపద్యం కూడా ఇదే.

ప్రహ్లాదుని మనస్సులోని భావాలకు అమోఘ అభివ్యక్తీకరణ ఈ పద్యం. 'కమలాక్షు నర్చించు కరములు కరములు' శ్రీమన్నారాయణుని అర్చన చేసే కరములే కరములు. దీనిలో 'కరములు' అనే పదం అవ్యవధానంగా (వెంటనే) ఆవృతమైంది. 'కరములు కరములు' అన్నప్పుడు - ఈ రెండు పదాలు సమానార్థకాలే. 'చేతులు' అని ఈ రెండు పదాల అర్థాలు ఒకటే అయినా తాత్పర్యభేదం ఉంది. వాటిలో మొదటి 'కరములు' అన్న పదానికి 'సాధారణమైన చేతులు' అని అర్థం. రెండవ 'కరములు' అన్న పదానికి 'శ్రేష్ఠమైన చేతులు' అని అర్థం. విష్ణువును అర్చించే చేతులే శ్రేష్ఠమైన చేతులని పిండితార్థం. ఇలాగే మిగిలిన వాక్యాలను అన్వయించు కోవచ్చు. ఈ పద్యంలోని 12 వాక్యాలు లాటానుప్రాసకు చక్కని ఉదాహరణలు.

మానవ శరీరంలో ప్రతి అవయవం విష్ణువుతో సంబంధం కలిగి ఉన్నపుడే వాటికి సార్థకత. లేనిచో వృథా. మన జీవితంలో హరిని చింతించు రోజే వృథా కాని రోజు, మిగిలిన రోజులన్నీ వృథాయే. పొట్టకూటి చదువుల కన్న భగవంతుని చేర్చే చదువు శ్రేష్ఠమైనది. భగవంతుని లీలాగానం చేస్తూ భగవంతుని చేర్చే గురువే గురువు, హరిని చేరుమని చెప్పే తండ్రి తండ్రి అవుతాడే తప్ప, సంసారంలో దించే తండ్రి తండ్రి కాదని తెలుస్తుంది.

*హరిభజియించు హస్తములు హస్తములచ్యుతుఁగోరి మ్రొక్కు త*
*చ్ఛిరము శిరంబు చక్రధరుఁజేరిన చిత్తము చిత్తమిందిరా*
*వరుఁగను దృష్టి దృష్టి మురవైరి నుతించిన వాణివాణి య*
*క్షరు కథలాను కర్ణములు కర్ణములై విలసిల్లుఁబో భువిన్.* (భాగ. 10. ఉత్తర-959)

పరీక్షితుని నోట వెలువడ్డ పద్యమిది. ముందు ఉదాహృతమైన పద్యం వలెనే దీన్ని అన్వయించుకోవచ్చు.

లాటానుప్రాసలోని రెండు పదాలలోని రెండవ పదానికి శ్రేష్ఠతరమైన అర్థమే కాదు, నీచతరమైన అర్థం వచ్చినా కూడా (తాత్పర్యభేదం ఉంటుంది కావున) అది లాటానుప్రాసాలంకారమే.

*కంజాక్షునకుఁ గాని కాయంబు కాయమే?*
*పవన గుంభిత చర్మ భస్త్రిగాక*
*వైకుంఠుఁబొగడని వక్త్రంబు వక్త్రమే?*
*ఢమఢమ ధ్వనితోడి ఢక్కగాక*
*హరిపూజనము లేని హస్తంబు హస్తమే?*
*తరుశాఖ నిర్మిత దర్విగాక*
*కమలేశుఁజూడని కన్నులు కన్నులే?*
*తనుకుడ్యజాల రంధ్రములు గాక*
*చక్రి చింతలేని జన్మంబు జన్మమే?*

*తరళ సలిల బుద్బుదంబుగాక*
*విష్ణు భక్తిలేని విబుధుండు విబుధుఁడే?*
*పాదయుగముతోడి పశువుగాక* (భాగ. 7 - 170)

'కంజాక్షునకు గాని కాయంబు కాయమే? పవనగుంభిత చర్మభస్త్రిగాక' శ్రీవిష్ణు సేవలకు అంకితం కాని శరీరం కూడా ఒక శరీరమేనా? కేవలమది గాలి నింపిన తోలు తిత్తి. 'కాయంబు కాయమే' అను జంట పదాలలో మొదటి 'కాయము' అనే దానికి 'సాధారణ శరీరం' అని అర్థం. రెండవ 'కాయమే' అనే పదానికి 'నీచతరమైన శరీరం' అని అర్థం. ఇలా ఈ రెండు పదాలు సమానార్థకాలే అయినా తాత్పర్య భేదంతోను, అవ్యవధానంగా ఉన్నాయి కావున ఇది లాటానుప్రాస.

వైకుంఠుని కీర్తించని నోరు నోరేనా? ఢమఢమ అని శబ్దించే ఢక్క కదా! అంటారు పోతన. హరిని కీర్తించనపుడు ఆ నోరు నిరర్థకం. అందుకే పోతన గారు శ్రీహరి లీలలు నోరారా పాడుకున్నాడు భాగవత రూపంలో. ఈ పద్యంలోని ఆరు వాక్యాలు లాటాను ప్రాసకు ఉదాహరణలే.

## భిన్నార్థక-అవ్యవధాన-పదావృత్తి (ముక్తపదగ్రస్తం)

పరమేశ్వర జటాజూట నిర్గత గంగానది ప్రవాహాన్ని వర్ణించే సందర్భంలోని గద్యం భిన్నార్థక - అవ్యవధాన - పదావృత్తికి మంచి ఉదాహరణ.

*... మధ్యమలోక శ్రీకరంబైన, శ్రీకరంబు తెఱంగున విష్ణుపదంబు ముట్టి, విష్ణుపదంబు భాతి నుల్లసిత హంస రుచిరంబై, రుచిర పక్షంబు రీతి నతి శోభిత కువలయంబై, కువలయంబు దెన్నున బహుజీవనంబై, జీవితంబు లాగున సుమనో వికాస ప్రధానంబై, ప్రధాన పర్వంబు పోలుపున నేకచక్ర బక భీమ మహా భంగ సుభద్రార్జున చరితాభిరామంబై, రామ చిత్తంబు మెలుపునం దనవారిలో జొచ్చిన దోషా చరుల కభయ ప్రదాన చరణంబై....* (భాగ. 9-229).

శ్రీకరము, విష్ణుపదము, రుచిరము, కువలయము, జీవనము, అనే పదాలు అవ్యవధానంగా ఆవృత్తమైనాయి. ఆ పదాలు భిన్నార్థకాలు. శ్రీ కరము అనే పదానికి పూర్వ వాక్యంలో శుభప్రదం అని, ఉత్తర వాక్యంలో లక్ష్మీదేవి చేయి అనీ, విష్ణు పదము అనే పదానికి పూర్వ వాక్యంలో విష్ణువు యొక్క పాదం అనీ, ఉత్తర వాక్యంలో ఆకాశమని, రుచిరం అంటే పూర్వవాక్యంలో వెలుగు అనీ, ఉత్తర వాక్యంలో రుచిర పక్షం అంటే శుక్లపక్షం అనీ, కువలయము అంటే పూర్వ వాక్యంలో కలువపూలు అనీ, ఉత్తర వాక్యంలో భూమి (ప్రజలు) అనీ, జీవనము అంటే పూర్వవాక్యంలో జీవితం అనీ, ఉత్తర వాక్యంలో నీరు అనీ ఇలా అర్థం చెప్పుకోవలసి ఉంది.

ఇది ముక్తపదగ్రస్తమే. వాక్యాంతమున విడిచిన పదం అర్థం, మరల వాక్యాదిలో గ్రహించిన పదం అర్థం వేరు కావున ఇది భిన్నార్థక అవ్యవధాన పదావృత్తి.

## భిన్నార్థ - వ్యవధాన - పదావృత్తి

*పొగడఁదగు వానిఁ గానరే పొగడలార!*
*యీడెఱుంగని విభుఁజూపుఁ డీడెలార!*
*మొల్లమగు కీర్తి వాఁడేడి మొల్లలార!*
*శుక నిగదితునిఁ జెపుడు కింశుకములార!* (భాగ. 10. పూర్వ - 1015)

శరద్రాత్రిలో శ్రీకృష్ణుడు ఒక్కొక్క గోపికకు తాను ఒక్కొక్కడై కొంతసేపు క్రీడించిన తరువాత శ్రీకృష్ణుడు అందరి వద్ద కనుమరుగు కాగా గోపికలు శ్రీకృష్ణుని గూర్చి ప్రతి చెట్టును అడుగుతున్నారు.

ఈ పద్యంలో పొగడ, ఈడె, మొల్ల, శుకమను పదాలు వ్యవధానంతో అర్థభేదంతో ఆవృతమైనాయి. 'పొగడ దగిన కృష్ణుని చూశారా పొగడలారా!' పొగడుట అంటే కీర్తించుట. 'పొగడలు' అంటే మల్లె చెట్లు. ఓ మల్లెలారా! పొగడదగిన కృష్ణుని చూశారా అని అర్థం. 'యీడెఱుంగని విభుఁజూపుఁ డీడేలార' అన్నపుడు వయస్సుతో నిమిత్తం లేనివాని చూపండి ఈడేలారా! అని అర్థం. అట్లే మొల్లమగు (అధికమగు)కీర్తి కల వాడెక్కడ మొల్ల (చెట్లు)లారా! అనీ, మరియు శుకయోగీంద్ర వందితునిడు ఎక్కడున్నాడో చెప్పండి కింశుక వృక్షములారా! అని గోపికలు శ్రీకృష్ణునికై పిచ్చివాళ్ళులాగా వెదకుతున్నారు. దీన్నిబట్టి చెట్లు

సమాధానం చెప్పవనే విషయజ్ఞానం కూడా లేనంత ప్రేమ మత్తులో ఉన్నారని తెలుస్తుంది.

పొగడ చెట్ల దగ్గర పొగడ దగినవాడు ఉంటాడేమోనని, ఈడెల వద్ద ఈడెఱుగని వాడుంటాడని, మొల్లలవద్ద మొల్లమగు కీర్తి కలవాడు ఉంటాడని, కింశుకము చాటున శుకవందితుడుంటాడని నామ మాత్ర ఏకత్వముచే శ్రీ కృష్ణుని ఉనికిని గోపికలు ఊహించుకొంటున్నారు.

### 4.7.3 శ్లేష

శ్లేష అలంకారం విచిత్రమైనది. అనేక అలంకారాలతో కలసి ఉండడం దీని ప్రత్యేకత. ఉపమ, రూపకం వంటి పలు అర్థాలంకారాలతోను, భిన్నార్థక పదావృత్తి వంటి ఉభయాలంకారాలతోను శ్లేష కలసి ఉంటుంది.

'అర్థభేదంచేత వేరువేరైన, ఒకేసారి ఉచ్చరింపబడుతున్న శబ్దాలు శ్లిష్టములు అవుచున్నవి (కలియుచున్నవి) అనేది ఏది కలదో అది శ్లేష' (మమ్మటుడు: 551) శ్లేషలో ప్రధానంగా సభంగశ్లేష, అభంగశ్లేష అని రెండు రకాలు ఉంటాయి. (శ్లేషలో భోజుడిలాంటి లాక్షణికులు ఎన్నో భేదాలను చెప్పారు. వాటి కొరకు ఆయా గ్రంథాలను చూడగలరు.) శ్లేషను అర్థాలంకారాలలో కాకుండా, శబ్దార్థాలంకారాలలో చేర్చడం సముచితం. కారణం శ్లేషలోని చారుత్వం, శబ్దం మరియు అర్థం పై ఆధారపడి ఉంటుంది. అయితే ఇది శబ్దశ్లేషకే వర్తిస్తుంది. అర్థశ్లేషకు కాదు. మమ్మటుని ఈ క్రింది అభిప్రాయం చూడండి.

'..... అభంగ శ్లేష అయినా, సభంగ శ్లేష అయినా, రెండు కూడా శబ్దాన్నే ఆశ్రయించి ఉన్నాయి. అందుచేత రెండింటినీ శబ్దశ్లేష అనడమే యుక్తం. మొదటి దానిని అర్థ శ్లేష అనడం యుక్తం కాదు. శబ్దాలు మార్చినా కూడా ఎక్కడైతే శ్లేషత్వానికి భంగం వాటిల్లదో అక్కడనే అర్థశ్లేష అంగీకరించాలి.'' (మమ్మటుడు. 563-564.)

అర్థ శ్లేష చాలా అరుదు. మిగిలింది శబ్ద శ్లేష. శ్లేష అంటే స్థూలంగా శబ్ద శ్లేష. ఇతర అలంకారాలతో కలసి ఉండటం వల్ల ప్రాధాన్యతా వివక్షచే ఈ శబ్దశ్లేషను ఆయా అలంకారాలలోనూ, మిశ్రాలంకారాలలోను చర్చించడం జరుగుతుంది. అలా కాని కేవల శ్లేష ఈ శబ్దార్థాలంకారాల అధ్యాయంలో చర్చించడం జరుగుతుంది.

శ్లేషలో శబ్దావృత్తి ఉండవచ్చు లేక ఒకే శబ్దం (అవృత్తి లేకుండా) భిన్నార్థకంగా ఉండవచ్చు.

శ్లేషలో ప్రధాన విభాగాలు -

1. సభంగ శ్లేష: పద/పదబంధాలను వేర్వేరు విధాలుగా విరిచినపుడు అవి భిన్నార్థాల నిచ్చినచో అది సభంగ శ్లేష.
2. అభంగ శ్లేష: పద/పదబంధాలను విరువకుండానే అవి భిన్నార్థముల నిచ్చినచో అది అభంగ శ్లేష.

వాటిలో పద/పదబంధావృత్తి ఉంటుంది. అలాంటి ఆవృత్తి లేకుండానే భిన్నార్థముల నివ్వవచ్చు. ఉదాహరణలు చూస్తే బాగా అర్థమవుతాయి.

#### శ్లేష : భాగవతంతో అన్వయం

1. సభంగ శ్లేష

*ఇందిందిరాతి సుందరి*
*ఇందిందిర చికుర యున్నదిందింద శుభం*
*బిందిందువంశయను క్రియ*
*నిందీవర వీథిమ్రోసె నిందిందిరముల్* (భాగ. 9-603)

దుష్యంతుడు కణ్వమహాముని ఆశ్రమానికి వచ్చినపుడు అక్కడ ఉన్న శకుంతలను వర్ణించే పద్యమిది.

ఈ పద్యంలో 'ఇందిందిర' అనే పదం భిన్నార్థాలలో ప్రయోగింపబడింది. ఈ భిన్నార్థాలు సభంగము వల్ల ఏర్పడినవి. ఈ శ్లేషార్థాలు చూస్తే

ఇందు + ఇందిర + అతి సుందరి - చంద్రుడు, లక్ష్మీదేవి వలె అతి సుందరమైనది (శకుంతల).

ఇందిందిర చికుర - తుమ్మెద వంటి కేశములు గలది.

ఉన్నది + ఇందు + ఇంద - ఉన్నది ఇక్కడే ఇక్కడే.

శుభంబు + ఇందు + ఇందు వంశ - ఇక్కడ శుభమగును చంద్రవంశంలో పుట్టిన వాడా! (ఓ దుష్యంతా!)

అనుక్రియ - అన్నట్లుగా

ఇందీవర వీథి మ్రోసె ఇందిందిరముల్ - కలువల సమూహంపై ఝుంకారము చేసినవి తుమ్మెదలు.

చంద్రవంశ వృక్ష అభివృద్ధికి కారణభూతురాలైన శకుంతల ఇందే ఇందే ఉన్నదని తుమ్మెదలు దుష్యంతునితో చెబుతున్నట్లుగా చెప్పబడ్డ ఈ శ్లేష రమణీయం. భాగవతంలోగల ఈ పద్యం తరువాత గల పద్యం కూడా సభంగశ్లేషకు ఉదాహరణ.

***మా కందర్పుని శరములు***

***మా కందములగుట జేసి మాకందంబుల్***

***మా కందములను కైవడి***

***మా కందాగ్రములఁ బిక సమాజము నిలిచెన్*** (భాగ. 9-604)

మా + కందర్పుని శరములు - మా మన్మథుని బాణాలు

మా + కందములగుట జేసి - మాకు ప్రధాన మగుటజేసి

మా కందముల్ - మామిడి చెట్లు

మాకు + అందములు + అను కైవడి - మాకు అందాన్నిచ్చేవి అవుతాయి అన్నట్లుగా

మా కంద + అగ్రములన్ - మామిడి చెట్ల చివర

పిక సమాజము నిలిచెన్ - చిలుకల సమూహము నిలిచెను.

'మాకందము' అనే పదాన్ని వేర్వేరు రీతుల్లో విరుచుట వల్ల భిన్నార్థాలు ఏర్పడ్డాయి కావున ఇది సభంగశ్లేష.

2. అభంగశ్లేష

***ద్విజ రాజ వంశ వర్యుడు***

***ద్విజరాజ ముఖాంబుజోపదిష్ట వ్రతులై***

***ద్విజరాజత్వము నొందిరి***

***ద్విజరాజాదిక జనంబు దీవింపగన్*** (భాగ. 10. పూర్వ-1404)

బలరామ కృష్ణులు సాందీప మహర్షి వద్ద విద్యాభ్యాసము చేయు సందర్భంలోనిది ఈ పద్యం.

ద్విజరాజ వంశవర్యులు - బ్రాహ్మణ, క్షత్రియ వంశంలో పుట్టిన యాదవులు (బలరామకృష్ణులు) (బ్రాహ్మణ స్త్రీ అయిన దేవయానికి, క్షత్రియుడైన యయాతికి కుమారుడైన 'యదువు' సంతానం అయినవారు.)

ద్విజరాజ ముఖాంబుజోపదిష్టవ్రతులై - బ్రాహ్మణ శ్రేష్ఠుడైన సాందీప ముని ఉపదేశము స్వీకరించువారై

ద్విజరాజత్వము నొందిరి - రాజర్షులు (రాజులైన ఋషులు) అయ్యారు.

ద్విజరాజాదిక జనంబు దీవింపంగన్ - బ్రాహ్మణులు, రాజులు మొదలగు ప్రజలంతా దీవింపగా

'ద్విజరాజ' అనే పదబంధాన్ని విడగొట్టకుండానే భిన్నార్థాలు సంప్రాప్తమైనాయి కావున ఇది అభంగశ్లేష.

మరొక ఉదాహరణ

***భూత గణంబుల చేతనె***

***భూత గణంబులను మేఘపుంజంబుల ని***

***ర్ధూతముగఁ జేయు ననిలుని***

***ఖాతినిఁ జరియింపఁ జేసి పౌరుషమొప్పన్*** (భాగ. 4 -725)

ఈ పద్యంలోనిది అభంగ శ్లేషయే.

భూతగణంబుల చేతనే - పంచభూతములైన భూమి, నీరు, అగ్ని, వాయు, ఆకాశం వలన

భూతగణంబులను - ప్రాణులను

'భూతగణంబులు' అనే పదబంధం భంగం కాకుండనే (విడదీసి చూడకుండనే) భిన్నార్థాలు వచ్చాయి. కావున ఇది అభంగశ్లేష.

## శబ్దావృత్తి లేని శ్లేష

పోతన గారు భాగవత ప్రారంభ పద్యంలో ఇలా అంటాడు

*'.. మహానందాంగనా డింభకున్ '* (భాగ. 1-1)

ఇక్కడ మహా+నందాంగన+డింభకున్ (గొప్పదైన యశోదా దేవి కుమారుణ్ని).

అదే వాక్యాన్ని మరలా అన్వయించుకొంటే

మహా + ఆనంద + అంగన + డింభకున్ - బ్రహ్మానందం అనే స్త్రీ పుత్రుణ్ని అని చెప్పుకోవలసి ఉంది. దీనిలో ఆవృత్తి లేకుండనే భిన్నార్థాలు లభించాయి.

### 4.7.4 కాకువు

కాకువును ప్రత్యేకించి లాక్షణికులెవరూ నిర్వచించక పోయినా వారిచ్చిన లక్ష్యాలను బట్టి కాకువును క్రింది విధంగా చెప్పుకోవచ్చు.

పలికే తీరులోని వక్రత్వం వలన గాని, ఏదో ఒక అక్షరాన్ని ప్రత్యేకించి పలకడం వలనగాని రమణీయార్థము చేకూరుట కాకువు.

ఈ కాకువులో నిర్దిష్టమైన వాచ్యార్థమునకు మించిన వ్యంగ్యార్థము తోస్తుంది. ఒక్కొక్కమారు పదార్థానికి వ్యతిరేకార్థం కూడా వస్తుంది. కాకువులో చారుత్వం శబ్దవృత్తి వలన కలుగదు. దీనిలో చారుత్వం లోకుల ఉచ్చారణాతీరుపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణలు చూస్తే వివరంగా తెలుస్తుంది.

**కాకువు : భాగవతంతో అన్వయం**

*వీరెవ్వరు శ్రీకృష్ణులు*
*గారా! యెన్నడును వెన్నగానరఁట కదా*
*చోరత్వంబించుకయును*
*నేరరఁట ధరిత్రినిట్టి నియతులుఁ గలరే* (భాగ. 10. పూర్వ. 372)

కాకువుకు అతి చక్కని ఉదాహరణ ఈ పద్యం.

చిన్ని కృష్ణుడు యశోదాదేవి చనుబాలు త్రాగుచుండగా, పొయ్యిమీది పాలు పొంగిపోతుండగా, వాటిని దింపుటకు యశోద కృష్ణుని దించి వెళ్ళింది. దానికి కోపగించుకున్న కృష్ణుడు అక్కడే ఉన్న పెరుగు కుండను పగులగొట్టి, అందులోని వెన్నను తిన్నాడు. యశోదమ్మ వచ్చి చూసేసరికి పెరుగంతా నేలపాలై ఉంది. కోపం ఎక్కువకాగా యశోద అతన్ని కొట్టబోగా అతడు పరిగెత్తనారంభించగా, చాలాసేపు శ్రమించి చివరకు పట్టుకొన్నది. కొట్టుటకు చేతులు రాని యశోద చిన్ని కృష్ణుని రోటికి కట్టివేయనెంచి అతనితో ఇట్లనెను.

"వీరెవ్వరు శ్రీకృష్ణులు గారా యెన్నడును వెన్నగానరట కదా! చోరత్వంబించుకయును నేరరఁట. ధరిత్రినిట్టి నియతులుఁ గలరే!"

ఈ మాటలు అంటున్నప్పుడు యశోద ముఖకవళికలు ఎలా ఉండేవో ఒకసారి ఆ దృశ్యాన్ని ఊహించుకోవచ్చు. అంతేగాకా ఈ మాటలు ఎలా దీర్ఘంతీసి అంటుందో ఆ దీర్ఘంలో నిగూఢమైన వ్యంగ్యార్థమేమిటో మనకు స్ఫురింపకమానదు. అతడు శ్రీకృష్ణుడని తెలుసు అయినా వీరెవ్వరు శ్రీకృష్ణులు గారా అన్నపుడు 'వీరు', 'శ్రీకృష్ణులు' 'గారా' అనే బహువచన రూపాలు గౌరవార్థంలో పెద్దలకు వాడే మాటలు. కృష్ణుడు చిన్నవాడే అయినా గౌరవార్థ సూచక బహువచనాలు వాడడం కాకువు. కృష్ణుడు చిన్ననాటి నుండి వెన్నతినడం యశోదకు తెలుసు. అయినా ఎన్నడును వెన్నగానరటగదా! అనడం - మనం వ్యతిరేకార్థంలో తీసుకోవాలి. అదే కాకువు అర్థస్ఫురణ. 'చోరత్వంబించకయును నేరరఁట' - అనడంలో కూడా వ్యంగ్యభావన స్ఫురిస్తుంది. వ్రేపల్లె అంతా కృష్ణుని దొంగతనాలతో విసిగివేసారిపోతుంది. 'చోరత్వం ఏమి తెలియదఁట!' అనటం కాకువుతో కూడిన వ్యంగ్యార్థ స్ఫురణ. 'అఁట' అనడం కాకువును స్పష్టంగా సూచిస్తుంది. అట్లే 'ధరిత్రినిట్టినియతులుఁ గలరే' అనడంలో కూడా 'కాకువు' ఉంది. ఇలా ఈ పద్యమంతా కాకువులు ఉన్నాయి.

కవిత్వాభివ్యక్తీకరణ పద్ధతులలో ఒక సున్నితమైన, వ్యంగ్యార్థ ద్యోతకమైన, ప్రత్యేక అభివ్యక్తి ఈ కాకువు. ఈ కాకువు

పూర్తి వాక్యం ద్వారా గాని ఏదో ఒక అక్షరం ద్వారా లేక కేవలం అచ్చు ద్వారా గాని అభివ్యక్తం కావచ్చు. ఆంధ్ర సాహిత్యంలో అరుదైన కాకువులు గల పద్యాలలో ఇది ఒకటి.

ఆకస్మికంగా చిన్ని కృష్ణునిపై యశోదకు వచ్చిన కోపం చతుర్దశభువనమోహనుని, శతకోటి మన్మథలావణ్యుని చూస్తుంటే దండించడానికి చేతులురానితనం - వెరసి కాకువుతో కూడిన మాటలు.

భాగవతంలోని అనేక పద్యాలు/పద్యపాదాలు నిత్య జనజీవనంలో వాడుకమాటలై, సందర్భానుసారంగా వాడబడుతున్నాయి. వాటిలో ఈ పద్యమొకటి.

***ఆకన్నులు నా చన్నులు***
***నాకురులా పిఱుదు నడుము నా ముఖమాన***
***వ్యాకారముఁ గని వేల్పులు***
***చీకాకునఁ బడిరి కలఁగి శ్రీహరిదక్కన్*** (భాగ. 8 -278)

క్షీరసాగర మథనం జరుగునపుడు, దాని నుండి లక్ష్మీదేవి ఆవిర్భవించింది. జగదేక సౌందర్యవతి లక్ష్మీదేవి. ఆమె సౌందర్యాన్ని చూస్తూ దేవతలు పరమాశ్చర్యమగ్నులైనారు. ఆమెను గూర్చి దేవతలు ఇలా అనుకొంటున్నారు - ఆ కన్నులు, ఆ చన్నులు, ఆ కురులు, ఆ పిరుదులు, ఆ నడుము, ఆ ముఖం, ఆ నవ్యాకారం - అనడంలో 'ఆ' అనడంలో కాకువు ఉంది. 'ఆ కన్నులు'-అంటే అనంతసౌందర్యమైన ఆ కన్నులు అని అర్థం, 'ఆ చన్నులు' అంటే అతిపెద్ద పరిమాణంలో ఉన్న ఆ చన్నులు అనీ, అలాగే ఆ పిరుదులు, ఆ నడుము అంటే అతిపెద్దగా గుండ్రంగా ఉన్న పిరుదులు, అతి సన్ననైన ఆ నడుము అని, అట్లే ఆ ముఖము, ఆ నవ్యాకారము - చెక్కిన శిల్పంలా ఉండే ఆ దివ్యరూపం అని అర్థ౧. 'ఆ' అనడంలో దేవతలు విశాలనేత్రులై, విప్పారిన ముఖంతో, నిశ్చేష్టులై ఆశ్చర్యంలో మునిగినారన్న విషయం ఈ కాకువులో ద్యోతమవుతున్నది.

***ఆ తేరారథికుండు నా హయములా యస్త్రాసనంబా శర***
***వ్రాతంబన్యులఁ దొల్లిఁ జంపును, దుదిన్ వ్యర్థంబులైపోయె మ***
***చ్చేతోధీశుఁడు చక్రిలేమి భసితక్షిప్తాజ్యమాయావి మా***
***యాతంత్రోషర భూమి బీజముల మర్యాదన్నిమేషంబునన్*** (భాగ. 1-373)

అర్జునుడు ద్వారక నుండి హస్తినకు వచ్చి ధర్మరాజుతో శ్రీకృష్ణుని నిర్యాణానంతరం పూర్వం శ్రీకృష్ణుడు ఉన్నప్పటి స్థితిని తలుచుకుంటూ, కురుక్షేత్ర యుద్ధదృశ్యాలను గూర్చి చెబుతున్నాడు.

ఆ తేరు, ఆ రథికుడు, ఆ హయములు, ఆ కోదండంబులు, ఆ బాణములు - అనడంలో 'కాకువు' ఉంది. 'ఆ తేరు' అనడంలో కురుక్షేత్రయుద్ధరంగంలో వీరవిహారం చేసిన రథం, కృష్ణుని దేహత్యాగం చేసిన తరువాత ముందుకు పోవడం లేదు, ఆ రథికుడు అన్నపుడు కృష్ణుడు, రథం నడుపునపుడు గుర్రాలు వేగంతో వెళ్ళడం, ఇతరులు వేసిన బాణాలు తొలగిపోవడం, యుద్ధవ్యూహాలను ఛేదించడం- అవే ఇప్పుడు నిర్వీర్యం అవడం, పూర్వం అతిరథ, మహారథులైన శత్రువులను చీల్చి చెండాడిన అస్త్రాలు, కృష్ణనిర్యాణానంతరం అల్పులైన కొండజాతి వాళ్ళను కూడా ఏమి చేయలేకపోయినాయి. కాబట్టి ఆ తేరు, ఆ రథికుడు, ఆ హయములు ఆ యస్త్రాసనంబు, ఆ శరవ్రాతం - అనడంలో 'ఆ' - ఒకప్పటి వైభవాన్ని, ఇప్పటి దుర్బలత్వాన్ని తెలియజేస్తుంది. అందుకే అర్జునుడు, కృష్ణనిర్యాణానంతరం తలవంచుకోవలసి వచ్చింది. ఈ కాకువ ద్వారా అర్జునుని విజయానికి కృష్ణుని అంతర్గతశక్తి ఎలా కారణమో తెలుస్తుంది.

### 4.7.5 ప్రహేళిక

"ప్రహేళయతి సూచయతి భావం నతు స్వరూపార్థమితి ప్రహేళికా" (చూ. రామరాజభూషణుడు. 560)

అర్థస్వరూపమును తెలుపక భావమును మాత్రము సూచించునది ప్రహేళిక. ఇది సాధారణంగా క్రీడాగోష్ఠి వినోదములందు వాడబడును. ప్రహేళికలో ప్రయోగింపబడ్డ పదానికి కొన్ని అక్షరములు చేర్చడం వలన గానీ, పదం నుండి కొన్ని అక్షరాలు తీసివేయుట వలన గాని ఆ పదం అర్థవంతమైనచో ఆ అలంకారాన్ని ప్రహేళిక అంటారు. ప్రహేళికలో చారుత్వం శబ్ద, అర్థాలపై ఆధారపడి ఉంది. కావున దీన్ని ఉభయాలంకారాలలో చర్చించడం జరుగుతుంది.

**ప్రహేళిక : భాగవతంతో అన్వయం**

*హరిఁజింతింపక మత్తుఁడై విషయ చింతాయత్తుఁడై చిక్కి వా*
*సరముల్ ద్రొచ్చెడు వాఁడు కింకర గదా సంతాడితోరస్కుఁడై*
*ధరణీశోత్తమ! దండ భృన్నివసన ద్వారోపకంఠోగ్రవై*
*తరణీ వహ్ని శిఖా పరంపరలచే దగ్ధుండుగాకుండునే?* (భాగ. 2-24)

ఈ పద్యంలో హరిని చింతింపనివారు 'కింకర'గదాఘాతాలకు పాల్పడుతారనడం చూడవచ్చు. 'కింకరులు'అంటే సేవకులు. ఇక్కడ ఎవరికి సేవకులని అనుకోవాలి? తరువాత గల 'దండభృన్నివసన ద్వారోపకంఠోగ్రవైతరణీ వహ్ని శిఖా పరంపరలచే దగ్ధుండు గాకుండునే?' అనే వాక్యాని బట్టి 'కింకరులు' అంటే ప్రకృత సందర్భంలో 'యమకింకరులు' అని అన్వయం చేసుకోవాలి. 'కింకరులు' అనేదానికి 'యమ' అనే రెండక్షరాలను చేర్చితే వాక్యం సంపూర్ణం అవుతుంది. కావున ఇది ప్రహేళిక.

### 4.7.6 పునరుక్తవదాభాస

"ఎందు పైపైని చూడగానే అర్థము పునరుక్తమైనట్లు భాసిల్లి, వాక్యార్థాన్వయము సరిగాఁగాని యట్లు తోచి, కొంచెము లోనికి చూడజూడ సమన్వయము చక్కగా నగునో అట్టి యెడ పునరుక్తవదాభాసము" (విద్యానాథుడు: 412)

పునరుక్తవదాభాసలో చదవగానే, ఒక అర్థమిచ్చే పదాలు ఆవృతమైనట్లుగా అనిపిస్తాయి. సందర్భానుసారంగా వాటి అర్థాన్ని సమన్వయించుకొంటే, అర్థావృత్తిలేదని తెలుస్తుంది. అంటే అర్థావృత్తి కేవల ఆభాస అన్నమాట. పునరుక్తవదాభాసలో శబ్దావృత్తి ఉండదు. వివేచిస్తే అర్థావృత్తి కూడా ఉండదు. కాని, అర్థావృత్తి ఉందనిపించేలాగా శబ్దాల కూర్పు ఉంటుంది.

ఒకే అర్థాన్నిచ్చే పదాలు అనిపించేలాగా పదాల కూర్పు ఉండడం, మరియు అర్థ చారుత్వం పరిగణనలోనికి తీసుకున్నాం కాబట్టి ఇది శబ్దార్థాలంకారమే.

పునరుక్తవదాభాస : భాగవతంతో అన్వయం

*ఘనకుపితాత్ములై విలయకాల భయంకర హవ్యవాహలో*
*చనుగతి నుగ్రులై ధరణి చక్రము నిర్వసుధారుహంబుగా*
*ననయముఁ జేయబూనిన జనాధిప సూనుల మోముఁ దమ్ముల*
*న్నవల సమీరముల్ జననమంది కుజంబులఁగాల్చఁ జొచ్చినన్* (భాగ. 4-938)

ఈ పద్యంలో 1. సుధారుహము (నీటి నుండి పుట్టింది)=తామరపుష్పం, 2. సూనులు= పుష్పములు, 3. తమ్ములు=పూవులు, 4. ననలు= పూవులు.

సుధారుహము, సూనులు, తమ్ములు, ననలు అనే నాలుగు పదాలు పూవులు అనే ఒకే అర్థాన్నిస్తూ ఉన్నాయి. ఇలా ఒకే అర్థాన్నిచ్చే పదాలు పునరుక్తమైనట్లుగా అనిపిస్తున్నాయి. ఈ నాలుగు పదాలకు సందర్భానుసారమైన అర్థాన్ని పరికిస్తే 1. నిర్వసుధారుహంబు (నిః+వసుధారుహము)గా జేయబూనుట=ధరణిలో వృక్షజాతియే లేకుండా జేయడం. 2. జనాధిపసూనులు=రాజుయొక్క కుమారులు అని అర్థం. 3. మోము దమ్ములు=ముఖములనే తామరపూలు. 4. తమ్ముల నన్నల (తమ్ములన్+అనల) 'అనలము' అంటే అగ్ని అని అర్థం. ఈ విధంగా అర్థాన్ని వివేచిస్తే అర్థం పునరుక్తం కాలేదని తెలుస్తుంది. కావున ఇది పునరుక్తవదాభాస.

### 4.7.7 నిరుక్తి

"వ్యుత్పత్త్యర్థమును బట్టి నామములకు అన్వార్థ కల్పనము నిరుక్తి" (గణపతిశాస్త్రి: 762)

సందర్భోచితంగా, పదం యొక్క వ్యుత్పత్తిని బట్టి రమణీయార్థకల్పనము నిరుక్తిగా చెప్పవచ్చు.

నిరుక్తి: భాగవతంతో అన్వయం

***అర్థుల్ వేడరు దాతలుం జెడరు సర్వారంభముల్ పండుఁ బ్ర***
***త్యర్థుల్ లేరు మహోత్సవంబులను దేవ గారముల్ వొల్పుఁ బూ***
***ర్ణార్థుల్ విప్రులు వర్షముల్ గురియఁ గాలార్హంబులై ధాత్రికిన్***

*సార్థంబయ్యె వసుంధరాత్వమసురేంద్రాధీశు రాజ్యంబునన్* (భాగ. 8-459)

'వసుంధర' అంటే భూమి అని అర్థం. ఆపదం వ్యుత్పత్తిని చూస్తే వసువు (బంగారం)ను ధరించినది భూమి. బలి చక్రవర్తి పరిపాలనలో అర్థులు వేడరు, దాతలు చెడరు, అన్ని ప్రయత్నాలు సఫలమౌతాయి, ప్రత్యర్థులు లేరు, విప్రులు పూర్ణార్థులు, వర్షాలు సకాలంలో కురుస్తాయి. ఈ లక్షణాలు అన్నీ ఉండడం వలన భూమికి 'వసుంధరాత్వము' అనే పేరు సార్థకమైనది. ఇక్కడ వ్యుత్పత్త్యర్థము ద్వారా రమణీయార్థం వచ్చింది. కావున ఇది నిరుక్తి అలంకారము.

*కులమున్ రాజ్యము తేజమున్ నిలుపు మీ కుబ్జుండు విశ్వంభరుం*
*డలఁతిబోఁడు త్రివిక్రమస్ఫురణవాఁడై నిండు బ్రహ్మాండమున్*
*గలఁడే మాన్పనొకండు నా పలుకులాకర్ణింపు కర్ణంబులన్*
*వలదీ దానము గీనమున్ బనుపుమా వర్ణిన్ వదాన్యోత్తమా!* (భాగ. 8-585)

వామనునికి మూడు అడుగుల నేలను దానం చేయవద్దని, బలిచక్రవర్తితో శుక్రాచార్యులు చెప్పే మాటలివి.

వామనుని ఉద్దేశించి ఈ కుబ్జుడు 'విశ్వంభరుడు' అంటాడు. విష్ణువుకు ఎన్నో పర్యాపదాలుండగా ఇక్కడ 'విశ్వంభరుడు' అని వాడడం గమనార్హం. ఈ చిన్నవాడు సాక్షాత్తు విష్ణువు అని చెప్పడం ఇక్కడ సాధారణార్థం. విశ్వంభరుడు అనే పదానికి వ్యుత్పత్తి విశ్వాన్ని భరించువాడు, విశ్వాన్ని తనలో కలవాడు అని. బలిచక్రవర్తి దానం ఈయగానే, ముల్లోకాలను ఆక్రమిస్తాడని శుక్రాచార్యునికి ముందే తెలుసు. ఈ వామనుడు 'విశ్వంభరుడు' విశ్వాన్నంతా ఆక్రమింప సమర్థుడు. ఈ అర్థ స్ఫురణ వ్యుత్పత్తిచే ఏర్పడింది. కావున ఇది నిరుక్తి.

### 4.7.8 పదబంధంలోని పదం ఆవృత్తి

రెండు లేక అంతకంటే ఎక్కువ పదాలు కలిసి ఒక పదబంధంగా ఏర్పడ్డపుడు ఆ పదబంధాలలోని ఏదో ఒక పదం మాత్రమే ఆవృత్త మగుట దీనిలో చూడవచ్చు.

పదబంధంలోని పదం ఆవృత్తి : భాగతంతో అన్వయం

*మ్రింగెడి వాఁడు విభుండని*
*మ్రింగెడిదియు గరళమనియు మేలని ప్రజకున్*
*మ్రింగుమనె సర్వమంగళ*
*మంగళసూత్రంబునెంత మది నమ్మినదో* (భాగ. 8-241)

శివుడు విషం మ్రింగాడని చెప్పగానే పరీక్షితునకొక సందేహం వస్తుంది. శివుణ్ణి విషం త్రాగమని దేవతలంతా ప్రార్థించవచ్చు. కాని శివుడు విషం త్రాగటానికి భార్యయైన పార్వతీదేవి ఎలా ఒప్పుకుంది. అనేది ఆ సందేహం. దానికి సమాధానంగా శుకమహర్షి చెబుతూ ఈ పద్యాన్ని పార్వతీ దేవికి తన మంగళసూత్రం మీద అంతనమ్మకం ఉండబట్టే, ప్రజల మేలును కూడా కోరుకొని, పార్వతీదేవి శివుడు విషం త్రాగటానికి ఒప్పుకుంది.

ఈ పద్యంలో 'సర్వమంగళ మంగళ సూత్రంబు నెంతమది నమ్మినదో' అనే మాటలో 'సర్వమంగళ' అంటే సమస్తానికి శుభాలను ప్రసాదించేది (పార్వతి) అని అర్థం. మంగళసూత్రం అంటే శుభప్రదమైన దారం (తాళి). ఇక్కడ 'సర్వమంగళ' 'మంగళసూత్రం' అనే పదబంధాల లోని 'మంగళ' అనే పదం అవ్యవధానంగా ఆవృత్తమై, పార్వతీ దేవి పతిభక్తిని ప్రజానురక్తిని ద్విగుణీకృతం చేసింది.

*'.. వరము వేడెద నాకిమ్ము వనజనేత్ర!*
*భక్త సంఘాత ముఖపద్మ పద్మమిత్ర! ...'* (భాగ. 7-376)

శ్రీ నరసింహస్వామిని ప్రహ్లాదుడు ప్రార్థించే సందర్భంలోనిది ఈ పద్యం. దీనిలో 'భక్త సంఘాత ముఖపద్మ పద్మమిత్ర!' అన్నపుడు 'ముఖపద్మ' అనే పదబంధంలోను 'పద్మమిత్ర' అనే పదబంధంలోను గల 'పద్మ' అనే పదం ఆవృత్తమైంది. అదొక చమత్కారం.

*హరిసుతుఁ బరిచరుఁ గాఁ గొని*
*హరిసుతుఁ దునుమాడి పనిచె హరిపురమునకున్*

*హరివిభునకు హరిమధ్యను*

*హరిరాజ్యపదంబునిచ్చె హరివిక్రముడై* (భాగ. 2-165)

హరిసుతుడు - శివుని (హరించువాని) కుమారుడు (ఆంజనేయుడు)

హరిసుతుడు - ఇంద్రుని కుమారుడు (వాలి)

హరిపురం - ఇంద్రలోకం/స్వర్గలోకం

హరివిభుడు - వానర రాజు (సుగ్రీవుడు)

హరిమధ్య - సింహం వంటి నడుము గలది (సుగ్రీవుని భార్య)

హరిరాజ్య పదము - వానర సామ్రాజ్యము

హరివిక్రముడు - సింహపరాక్రముడు (శ్రీరాముడు)

ఈ పదబంధాలలోని 'హరి' అనే పదం ఏడు మార్లు ఆవృతమైంది. ఇక్కడ హరి అనే పదం వ్యవధానంతో భిన్నార్థకంగా ఆవృత్తమగుట గమనింపవచ్చు.

*గజనామధేయ పురమున*

*గజరిపు పీఠమున ఘనుడు గలిమర్దనుడున్*

*గజవైరి పరాక్రముఁడై*

*గజిబిజిలేకుండఁ దాల్చెఁ గౌరవ లక్ష్మిన్* (భాగ. 1-434)

పరీక్షితుని గూర్చి చెప్పిన పద్యమిది.

గజనామధేయ పురము - హస్తినపురము

గజరిపు పీఠము - సింహాసనము

గజవైరి - గజాసురుని చంపినవాడు (శివుడు)

పై పదబంధాలలోని 'గజ' అనే పదం సమానార్థకంగా వ్యవధానంతో ఆవృత్తమైంది.

*భువన మోహనుండు పురుషభూషణుఁడెవ్వఁ*

*డట్టి కృష్ణుఁడరిగె హర్మ్య శిఖర*

*రాజమానలగుచు రాజమార్గంబున*

*రాజముఖులు గుసుమ రాజిఁ గురియ* (భాగ. 1-255)

రాజమానలు - ప్రకాశించువారు

రాజమార్గము - రాచబాట

రాజముఖులు - చంద్రునివంటి ముఖము గల స్త్రీలు

ఇక్కడ పై పదబంధాలలోని 'రాజ' అనే పదం భిన్నార్థకంగా ఆవృతమైంది.

### 4.7.9 పదబంధావృత్తి

సమసించుటచే ఏర్పడ్డ పదబంధం (పూర్తిగా) ఆవృతమగుట పదబంధావృత్తి.

**పదబంధావృత్తి : భాగవతంతో అన్వయం**

*వారిజలోచనుఁ బాడుచు*

*వారిజ లోచనలు వారి వారికి వేడ్కన్*

*వారివిహారము సలిపిరి*

*వారి విహారములు జగతివారికి కలవే* (భాగ. 10. పూర్వ-813)

ఈ పద్యం గోపికలు జలక్రీడలాడుటను గురించి చెప్పబడ్డది.

వారిజలోచనుని - శ్రీకృష్ణుని

వారిజలోచనలు - గోపికలు

దీనిలో 'వారిజలోచన/నుడు' అనే పదబంధం ఆవృత్తమైంది. అల్లే

వారి విహారము - జలక్రీడ

వారి విహారము - గోపికల విహారం

ఇక్కడ 'వారి విహారము' అనే పదబంధం ఆవృత్తమైంది. శబ్దార్థవైచిత్రితో పద్యాలను చెక్కి పోతన మరింత అందాన్ని తెచ్చారనడానికి ఈ పద్యం చక్కని ఉదాహరణ.

*కలఁడందురు దీనులయెడఁ*
*గలఁడందురు పరమయోగి గణములపాలన్*
*గలఁడందురన్నిదిశలను*
*గలఁడు గలండనెడివాఁడు గలఁడోలేడో* (భాగ. 8-86)

గజేంద్రుడు మొసలికి చిక్కి తనను రక్షించమని దైవాన్ని ప్రార్థించినపుడు ఎంతకూ ఎవరూ రక్షించుటకు రాకపోవుటచే తనకు దేవుని ఉనికిపై సందేహం వస్తుంది. ఆ సందర్భంలోని పద్యమిది.

'కలఁడందురు' అనే పదబంధం మూడు మార్లు ఆవృత్తమైంది. ఈ పదబంధావృత్తి వల్ల తెలిసే విషయం ఏమంటే పూర్వం సుఖంగా ఉన్నపుడు ఏనుగుకు దేవుణ్ని గూర్చి ఎలాంటి అభిప్రాయము ఉన్నా అది అంత బలోపేతమైనది కాదు. కాని ప్రాణం పోవడానికి సిద్ధంగా ఉన్న సమయంలో కలిగిన సందేహం తీక్షణమైనది. ఆ సందేహ తీక్షణత 'కలఁడందురు' అనే పదబంధం మూడు మార్లు ఆవృత్తి కావడంలో ధ్వనిస్తుంది.

*అనయంబును నయ్యక్షుల*
*ఘనమాయనెఱింగి ముని నికాయము వరుసన్*
*మనుమనుమని మనుమనుమని*
*మనమునఁ దలఁపుచును దక్షమక్షంబునకున్* (భాగ. 4-347)

ఋషులు తమ మనస్సులో 'మనుమనుమని మనుమనుమని' తలచారు.

మనుమనుమని - మనువు యొక్క మనుమడిని

మనుమనుమని - మనుము + మనుము అని

మనస్సులో ఋషులు దీవించిన వైనం చెప్పబడింది. దీనిలో 'మనుమనుమని' అనే పదబంధం ఆవృత్తమైంది.

### 4.7.10 వాక్యావృత్తి

వాక్యంలోని కొంత భాగంగాని - పూర్తివాక్యంగాని ఆవృత్తి కావడం వాక్యావృత్తిలో చర్చింపబడుతుంది.

1. సమానార్థక - వాక్యావృత్తి

కొడకుకోసం హరిశ్చంద్రుడు వరుణునికై తపస్సు చేస్తాడు. వరుణుడు ప్రత్యక్షం కాగా హరిశ్చంద్రుడు కొడుకు కావాలని కోరుకుంటాడు. కొడుకు పుడితే వరుణునికి బలి ఇస్తానని అంటాడు. వరుణుడు అట్లేనని వరమిస్తాడు. హరిశ్చంద్రునికి కొడుకు పుట్టిన తరువాత వరుణుడు వస్తాడు.

*పురుటిలోపల వచ్చి పుత్రువేలుపుమన్నఁ*
*ఋరుడు వెళ్ళినగాని పొసఁగదనియెఁ*
*బలురాకమునువచ్చి బాలు వేలుపుమన్నఁ*
*బండ్లు లేకున్న నభావ్యుఁడనియెఁ*
*బండ్లురాఁజూచి డింభకుని వేలుపుమన్నఁ*
*బడిపండ్లురామి నభావ్యుఁడనియెఁ*
*బడిపండ్లు వొడిమినఁ గొడుకు వేలుపుమన్నఁ*
*బోరుల కొదవక పొసఁగదనియెఁ*
*దొడరి యిట్లు కొడుకుతోడి మోహంబున*

*బ్రొద్దుఁ గడుపుచుండె భూవరుండు*

*దండ్రి తలఁపు కొలఁదిఁ దనలోనఁ జింతించి*

*యింటనుండ కడవికేఁగెఁ గొడుకు* (భాగ. 9-195)

పుత్రునిపై వ్యామోహము వల్ల వరుణుడు ఎన్నిమార్లు వచ్చినా ఏదో ఒక సాకు చెప్పి పంపకపోవడం చూడవచ్చు. ఈ పద్యంలో వాక్యాలు అవ్యవధాంగా ఆవృతమయ్యాయి. ఆ వాక్యాలు సమానార్థకంగా ఉండడం చూడవచ్చు.

*తనుఁబాసి యొక్కింత తడవైన నిటమీద*

*నేలపై మేనులు నిలువ వనుము*

*నేలపై మేనులు నిలువకయుటమున్న*

*ధైర్యంబులొక్కటఁ దలఁగు ననుము*

*ధైర్యంబులొక్కటఁ దలఁగిన పిమ్మటఁ*

*జిత్తంబులిక్కడఁ జిక్క వనుము*

*చిత్తంబులిక్కడఁ జిక్కక వచ్చినఁ*

*బ్రాణంబులుండక పాయుననుము*

*ప్రాణములుపోవ మఱివచ్చి ప్రాణవిభుఁడు*

*ప్రాణి రక్షకుఁడగు తన్నుఁ బ్రాణులెల్లఁ*

*జేఱిదూఱంగ మఱియేమి సేయువాఁడు*

*వేగ విన్నపమొనరింపవే మహాత్మ* (భాగ. 10. పూర్వ-1478)

కాశీనగరంలో శ్రీకృష్ణుడు విద్యాభ్యాసం చేయునపుడు గోపికల వద్దకు తాను త్వరలోనే వస్తాననే విషయం తెల్పుటకు ఉద్ధవుని పంపిస్తాడు. ఆ తరువాత గోపికల వద్ద నుండి ఉద్ధవుడు తిరిగి శ్రీకృష్ణుని వద్దకు వెళ్ళినపుడు గోపికలు తమతమ అభిప్రాయాల్ని కృష్ణునికి చెప్పమని ఉద్ధవునితో చెబుతారు. ఆ మాటలు గోపికలకు శ్రీకృష్ణుని పై గల అపార ప్రేమను ఆవిష్కరిస్తున్నాయి. శ్రీకృష్ణుడు తిరిగిరావడం ఆలస్యం అయితే గోపికలు ప్రాణం వదుల్తామని చెప్పడం హృదయాన్ని ద్రవింపజేస్తుంది.

ఈ పద్యంలో అవ్యవధాన సమానార్థక వాక్యావృత్తిని చూడవచ్చు.

2. భిన్నార్థ - వాక్యావృత్తి

*మానినీ మన్మథు మాధవుఁ గానరే*

*సలలితోదారవత్సకములార!*

*సలలితోదార వత్సకవైరిఁ గానరే*

*సుందరోన్నత లతార్జునములార!*

*సుందరోన్నత లతార్జునభంజుఁ గానరే*

*ఘనతరలసదశోకంబులార!*

*ఘనతరలసదశోక స్ఫూర్తిఁ గానరే*

*నవ్యరుచిర కాంచనంబులార!*

*నవ్యరుచిర కాంచన కిరీటుఁ గానరే*

*గహన పదవి కురువకంబులార!*

*గహన పదవి కురువక నివాసిఁగానరే*

*గణికలార! చారుగణికలార!* (భాగ. 10. పూర్వ-1012)

గోపికలందరి వద్ద నుండి శ్రీకృష్ణుడు ఒక్కసారిగా మాయమవగా, గోపికలందరూ శ్రీకృష్ణునిపై గూర్చి ప్రతిచెట్టును, ప్రతివస్తువును అడుగుతున్న సందర్భంలోని పద్యమిది.

సలలితోదార వత్సకములారా! - సుకుమారమైన, ఉదార స్వభావం గల ఆవుదూడలారా!

సలలితోదార వత్సరవైరిన్ - సుకుమారమైన, ఉదారమైన, వృషభాసురుని శత్రువుని (శ్రీకృష్ణుని)

సుందరోన్నత లతార్జునములు - అందమైన, ఎత్తైన లతలు, అర్జున వృక్షములారా!

సుందరోన్నతలతార్జున భంజుడు - అందమైన, గొప్పవాడైన అర్జునునికి ఆనందాన్ని చేకూర్చువాడు.

ఘనతరలసత్ + అశోకములు - గొప్పవైన, ప్రకాశిస్తున్న అశోక వృక్షములు

ఘనతరలసత్ + అశోకస్ఫూర్తిని - గొప్పవాడైన, ప్రకాశిస్తున్న శోకంలేని వాడిని,

నవ్యరుచిర కాంచనములు - కొత్తకాంతులు గల బంగారం

నవ్యరుచిర కాంచన కిరీటుని - కొత్త కాంతులీనే బంగారు కిరీటం కలవానిని

గహన పదవి కురువకము - దట్టమైన అడవిలోని కురువకవృక్షము

గహన పదవి కురువక నివాసి - మోక్షస్థానమనే కురువక నివాసిని

చూశారా అని అడుగుతున్నారు. ఇలా వాక్యములు భిన్నార్థాలతో అవ్యవధానంగా ఆవృత్తమైనాయి. శబ్దసామ్యం వలన అదే లక్షణాలున్న కృష్ణుడు ఆయా వృక్షాదులకు తెలుసునేమోనని అడుగుతున్నారు గోపికలు. వారి ప్రేమోన్మత్తత అలాంటిది.

*హరితిగ్మగోశతంబుల*
*హరిదంతరమెల్లఁగప్పు నాకృతిఁ గడిమిన్*
*హరితిగ్మగోశతంబుల*
*హరిదంతరమెల్లఁ గప్పె నరిభీకరుడై* (భాగ. 10. పూర్వ. 1564)

శ్రీకృష్ణుడు జరాసంధునితో యుద్ధముచేయు సందర్భంలోనిది ఈ పద్యం. భిన్నార్థ వాక్యావృత్తి కలది.

పోతనగారి భాగవత భాగంలోని మొత్తం 7914 గద్యపద్యాలలో అక్కడక్కడ కొన్ని వాక్యాలు ఆవృతమగుట చూడవచ్చు. వీటిని బట్టి పోతనగారికి కొన్ని వాక్యాలపై మక్కువ ఎక్కువ అని, అందుకే అలాంటివి ఆవృతమైనాయని తెలుస్తుంది. అలాంటి వాక్యాలు -

1. *చిరశుభాకార యిందిరా చిత్తచోర* (భాగ. 3 - 422)
   *చిన్మయాకార నిత్య లక్ష్మీవిహార* (భాగ. 4 - 171)
   *చిరదయాకార యిందిరా చిత్తచోర* (భాగ. 4 - 203)
   *చిర శుభాకార నిత్య లక్ష్మీ విహార* (భాగ. 4 - 287)
   *చిర శుభాకారుడారాజశేఖరుండు* (భాగ. 4 - 567)

2. వినుత *గుణశీల మాటలు వేయునేల* (భాగ. 3 - 1025)
   *వినుత గుణశీల మాటలు వేయునేల* (భాగ. 4 - 491)
   *వినుత గుణశీల మాటలు వేయునేల* (భాగ. 7 - 150)
   *విమల మతులార మాటలు వేయునేల* (భాగ. 10 - ఉత్తర-1068)

3. *నయవిశారదుండు నారదుండు* (భాగ. 1 - 84)
   *నారదుండు వివేక విశారదుండు* (భాగ. 4 - 944)

4. *.. మాధవ గోవింద హరి ముకుంద* (భాగ. 4 - 171)
   *అవ్యయానంద గోవింద* (భాగ. 4 - 191)
   *అవ్యయానంద గోవింద హరిముకుంద* (భాగ. 4 - 287)
   *అవ్యయానంద గోవింద హరిముకుంద* (భాగ. 4 - 714)

5. *చారుతరమూర్తి యారాజ చక్రవర్తి* (భాగ. 4 - 459)
   *చారుతరమూర్తి యో పృథుచక్రవర్తి* (భాగ. 4 - 485)
   *చారుతరమూర్తి యో పృథుచక్రవర్తి* (భాగ. 4 - 534)

ఈ విధంగా పోతన భాగవతంలోని శబ్దార్థాలంకారాల రామణీయకతను దర్శించవచ్చు.

# 5

# అర్థాలంకార శిల్పం

5.0 శ్రీకృష్ణుని లీలామృతమహా సాగరంలో మునకలు వేసిన మహాద్రష్టయైన పోతన ఋషీశ్వరుడు శ్రీవేదవ్యాస భగవానుని భాగవతాన్ని హృదయంగమం చేసుకొని, స్వీయానుభవంతో సమ్మేళనమొనరించి, సృష్టించిన శ్రీమత్ భాగవత కవితా మహాప్రపంచంలోని రమణీయార్థ మాధుర్యాన్ని, ఉపమాన ప్రాతినిధ్య వైభవాన్ని, నానావిధ చమత్కార, సంపూర్ణ అర్థాలంకార రూప కవితాద్రవ్యమును చవిచూచుటకు ముందు అర్థాలంకార సిద్ధాంత భాగాన్ని విశ్లేషిద్దాం.

## 5.1 అర్థాలంకారాలు : నిర్వచనాలు

ఆలంకారికులు 'అలంకారం'నకు ఇచ్చిన నిర్వచనాలలో చాలా వరకు 'అర్థాలంకారాల'కే వర్తిస్తాయి. (అలంకారాల నిర్వచనాలు, సమగ్ర వివరణకు చూ. ఇదే. 2.6.5.)

ప్రత్యేకించి అర్థాలంకారాలకు భోజుడిచ్చిన నిర్వచనాన్ని చూద్దాం.

"అల మర్థమలంకర్తుం యద్వ్యుత్పత్త్యాది వర్త్మనా

జ్ఞేయా జాత్యాదయః ప్రాజ్ఞైస్తేఽర్థాలంకార సంజ్ఞయా"

వ్యుత్పత్తి మున్నగు మార్గం చేత అర్థాన్నలంకరించుటకు సమర్థాలైన జాతి మున్నగు వానిని ప్రాజ్ఞులు అర్థాలంకారాలుగా భావిస్తారని భోజుడు చెప్పాడు.

'వ్యుత్పత్త్యాది' శబ్దంలోని ఆది శబ్దం ద్వారా అర్థాలంకారంగా పరిగణించడానికి కొలమానాలు అనేకం ఉంటాయని సూచించడమైంది. ఉపమాన ప్రాతినిధ్యం, వ్యంగ్య/రమణీయ చమత్కార, అతిశయ అర్థద్యోతకమై, శబ్దపరివృత్తిని సహించే కవితా ద్రవ్యమును అర్థాలంకారం అని స్థూలంగా చెప్పవచ్చు. చారుత్వము అర్థాన్ని ఆశ్రయించి ఉంటే అట్టి అలంకారం అర్థాలంకారం.

## 5.2 అర్థాలంకారాలకు లాక్షణికులు పెద్దపీట వేయుట

సంఖ్యాపరంగాను, కవుల కావ్య ప్రయోగవిస్తృతిని బట్టి, శబ్ద, శబ్దార్థ అలంకారాలకన్నా అర్థాలంకారాలకే, కవులు, లాక్షణికులు పెద్దపీట వేశారని చెప్పవచ్చు.

ఇతర కవితా ద్రవ్యాలతో పోల్చి చూచినప్పుడు లాక్షణికులు 'ధ్వని'కి ప్రథమ స్థానాన్నిచ్చి నప్పటికీ, అలంకారానికి ధ్వనికి సమానస్థాయిని కల్పిస్తూ 'అలంకారధ్వని'ని ప్రతిపాదించారు. దీనిని బట్టి కావ్యశోభాకరధర్మాలలో 'అలంకారం' ఎంతటి మహనీయమైనదో గమనించవచ్చు. అంతేకాదు 'ధ్వని' పరిధి (ధ్వని - ఉపవిభాగాలు)ని, అర్థాలంకారాల పరిధి (అలంకారములు ఉపవిభాగాలు)ని పరిశీలిస్తే రెండూ చాలా వరకూ కలిసే ఉంటాయని చెప్పవచ్చు. అందువల్ల అర్థాలంకారాల పాత్ర అపరిహార్యం, అత్యంతరమణీయకమని చెప్పవచ్చు.

ఉపమాన ప్రాతినిధ్యం, వ్యంగ్యార్థస్ఫురణ అనే రెండు బలమైన లక్షణాలు ఉండడం వల్ల పాఠకుని రసానందానుభూతిని కలిగిస్తుంది. కావున అర్థాలంకారాలకు లాక్షణికులు పెద్దపీట వేయడం సమంజసమే.

## 5.3 అర్థాలంకారాలు నిబంధనలు (Conditions)

లక్ష్యమునకు లక్షణంతో సమన్వయం కుదిరినంత మాత్రానసే అది అలంకారం కాదు. కావ్యంలోని నిర్దిష్టకథాసందర్భానికి సౌందర్యాన్ని, చారుత్వాన్ని కలిగిస్తూ, ఆ నిర్దిష్ట సందర్భంలో ఆ కవితా ద్రవ్యం, పాఠకుని రసానందానుభూతికి కారణం కావాలి. అపుడే అది అలంకారమనిపించుకొంటుంది. "ఏ అలంకారము నందైనను చమత్కారముండవలెను. చమత్కారము లేనిచో అది దానికి చెప్పిన లక్షణము లన్నియుపట్టినను, అలంకారము కాజాలదు." (దండి: 53) అని చెప్పెను. పుల్లెల శ్రీరామచంద్రుడు "ఏది చేతోహారిగా ఉంటుందో అదే అలంకారం అవుతుంది." (మమ్మటుడు: 603)

## 5.4. అర్థాలంకారాలు : రసనిష్పన్నత

'అలంకారోజ్జ్వలత మార్గము. రసము గమ్యము.' అని ఎఱ్ఱనగారు చెప్పిరి. (చూ. నరసింహారావు: 92)

అలంకారం కావ్యగతం. రసం సహృదయనిష్ఠము. ఇతివృత్తానికి, అలంకారాది కవితా ద్రవ్యాలు కలియుట వలన, తత్పఠనంచే పాఠకుని హృదయగత (సుప్తావస్థలో ఉన్న) స్థాయీభావాలు అనుభవంలోనికి వస్తాయి. అలా రప్పించ గల్గినపుడే

అలంకారం, కావ్యాత్మస్థాయికి ఎదుగుతుంది. అయితే దానిని లక్ష్యాన్ని బట్టేగాని, లక్షణాన్ని బట్టి నిర్ధారించరాదు. అంటే ఫలనా అలంకారం రసానుభూతిని కలిగిస్తుంది అనడంకన్నా కావ్యంలో కవి ప్రయోగించిన లక్ష్యంలోని ఆ నిర్దిష్టఅలంకారం, ఆ కథాసన్నివేశానికి ఎంత చారుత్వాన్ని(సౌందర్యం) కలిగిస్తోంది అనే విషయాన్ని బట్టే అలంకారం ఎంతరస నిష్పన్నకారమో తెలుస్తుంది. అర్థాలంకారాలు రసోద్భవానికి ప్రత్యక్ష కారకాలను విషయాన్ని లాక్షణికులు ముక్తకంఠంగా అంగీకరించారు. ఉదాహరణకు కొందరి అభిప్రాయాలను ఈ విధంగా చూడవచ్చు.

"అలంకారాలన్నియు రసవంతములే" (కుంతకుడు: 293)

అలంకారములన్నీ రసోద్భవమునకు దారితీస్తాయని వీరి అభిప్రాయం.

"ఉపకుర్వంతి తం సన్తం యేzంగ ద్వారేణ జాతుచిత్
హారాది వదలంకారాzస్తేనుప్రాసోపమాదయః" (మమ్మటుడు: 504)

ఏవి అంగిగా ఉన్నరసాన్ని ఒక్కొక్కపుడు అంగాలైన శబ్దార్థాల ద్వారా హారాదులవలె ఉత్కర్ష కల దానినిగా చేస్తాయో అటువంటి అనుప్రాస, ఉపమ మొదలైనవి అలంకారాలు.

"పరంపరగా రసము నలంకరించునది యలంకారము" (విద్యానాథుడు: 404)

అలంకారం, ప్రత్యక్షంగాగాని, పరోక్షంగా గాని రసానుభూతి కలిగించునని వీరి అభిప్రాయం.

విశ్వనాథుడు - "శబ్దార్థయోరస్థిరాయే ధర్మాః శోభాతిశాయినః
రసాదీనుపకుర్వంతోzలంకారాస్తేzంగ దాదివత్" అని చెప్పాడు. (జంధ్యాల జయకృష్ణ బాపూజీ. 145)

అస్థిరాలైన శబ్దార్థాలగు అలంకారాలు కావ్యసౌందర్య సంపదను పెంపొందింప జేయునవై హారకేయూరాదులు దేహాన్ని భూషించునట్లు రసాదులను పోషిస్తున్నాయి. (చూ. ఇదే 2.6.6.3.)

### 5.5. అర్థాలంకార తత్త్వ వివేచన (చూ. ఇదే 2.6.6.3)

### 5.6 అర్థాలంకారాల ప్రయోజనాలు (చూ. ఇదే 2.6.7.)

### 5.7 అర్థాలంకారాలు : పరిధి విశ్లేషణ

ఏఏ అలంకారాలను అర్థాలంకారాల పరిధిలో చేర్చాలనే విషయంలో లాక్షణికులలో (అరుదుగా కొన్ని అలంకారాల విషయంలో తప్ప) చెప్పుకోదగ్గ భిన్నాభిప్రాయాలు లేవు.

ఉపమించడం, వ్యంగ్యం, అతిశయం, ఇతర కవిత్వ లక్షణాలు కేవల అర్థాన్నాశ్రయిస్తే అది అర్థాలంకారం. ఇది శబ్దపరివృత్తిని సహిస్తుంది. అంటే ఒక శబ్దం స్థానంలో అదే అర్థమున్న మరొక శబ్దాన్ని ప్రతిక్షేపిస్తే అర్థచమత్కారానికి భంగం వాటిల్లదు. ఈ నియమానికి లోబడినవన్నీ అర్థాలంకార పరిధిలోకి వస్తాయి. ఇవే లక్షణాలు అర్థముతో బాటు శబ్దాన్ని కూడా ఆశ్రయిస్తే (శబ్దావృత్తిని సహించకపోతే) అవి శబ్దార్థాలంకారాలుగా చెప్పవచ్చు.

శ్లేష, నిరుక్తి, భాషాసమ, పునరుక్తవదాభాస అలంకారాలలో శబ్దాలంకారాల, అర్థాలంకారాల లక్షణాలు ఉంటాయి. అయినా "ప్రాధాన్యేనవ్యపదేశాభవంతి" అనునట్లు ప్రాధాన్యతా దృష్టితో లాక్షణికులు వీటిని అర్థాలంకారాలలో చేర్చారు. అది ఒక పద్ధతి. అలా కాకుండా శబ్దార్థాలంకారాలలో చేర్చుట శాస్త్రీయం. (వివరాలకు చూ. ఇదే 4.4.2.)

భోజుడు ఉభయాలంకారాలుగా చెప్పిన 24 అలంకారాలలో 21 అలంకారాలు ఇతర లాక్షణికులందరిచే అర్థాలంకారాలుగా చెప్పబడినవే. భోజుడు ఉభయాలంకారాలుగా చెప్పినవాటిలో శ్లేష శబ్దపరివృత్తి సహంకాదు. కాబట్టి ఉభయాలంకారంగా చెప్పవచ్చు. 'క్రమాలంకారం'లో శబ్దావృత్తి అనుషంగికం కాబట్టి అది అర్థాలంకారంగాను, శబ్దార్థాలంకారం గాను ఉండే అవకాశం ఉంది. 'సంసృష్టి' మిశ్రాలంకారం.

ఇలాంటి కొన్ని విషయాలలో తప్ప అర్థాలంకారాల పరిధి విషయంలో లాక్షణికులలో ఏకాభిప్రాయం ఉంది.

### 5.8 అర్థాలంకారాల వర్గీకరణ : సమీక్ష

అర్థాలంకారాలను 'ఉపమ'తో ప్రారంభించి, ఏదో ఒక లక్షణ సామ్యంచే క్రమంగా ఒక్కొక్క దాన్ని చెప్పుకొంటూ పోయిన లాక్షణికుల సంఖ్య ఎక్కువ. అర్థాలంకారాలను కొన్ని ప్రధాన లక్షణాల ఆధారంగా కొన్ని సమూహాలుగా వర్గీకరించి వీలైతే వాటిని ఉపవిభాగాలుగా వర్గీకరించిన ఆలంకారికుల సంఖ్య చాలా తక్కువ.

భామహుడు - అలంకారాలను నాలుగు వర్గాలుగా విభజించాడు. కాని ఏ లక్షణం ఆధారంగా వీటిని వర్గీకరించాడో తెలియదు. ఏ ఒక్క వర్గంలోని అలంకారాలకు సమాన లక్షణాలు ఏవీ లేకపోవడం గమనించవచ్చు.

ఉద్భటుడు - అలంకారాలను 6 వర్గాలుగా విభజించి, మొదటి వర్గంలో శబ్దాలంకారాలను, మిగిలిన 5 వర్గాలలో అర్థాలంకారాలను చేర్చాడు.

వామనుడు - అర్థాలంకారాలను ఉపమ, ఉపమా ప్రపంచం అని రెండు రకాలుగా వర్గీకరించాడు. (వామనుడు. 125). 'అర్థాలంకారాలన్నీ ఉపమాగర్భములే యని వీరి అభిప్రాయము.'

అలంకారాలలో వ్యంగ్య ప్రధాన, ఇతరేతర చమత్కార సంబంధి అలంకారాలను మినహాయిస్తే - మిగిలిన చాలా అలంకారాలలో ఉపమేయ, ఉపమానములకు ఏదో ఒక విధమైన సామ్యం ఉంటుంది. ఆకారణంగా వీరు ఇలా వర్గీకరించారు.

రుద్రటుడు - శాస్త్రీయంగా అర్థాలంకారాలను వర్గీకరించిన వారిలో ఒకరు. అర్థాలంకారాలను 4 వర్గాలుగా విభజించి, ఒక్కొక్క వర్గలక్షణాలను నిర్వచించి, ఆ వర్గానికి చెందిన లక్షణాలుగల అర్థాలంకారాలను దానిలో చేర్చాడు. అవి 1. వాస్తవ, 2. ఔపమ్య, 3. అతిశయ, 4. శ్లేష మూలకములు. వాస్తవ మూలాలుగా 23, ఔపమ్య మూలకాలుగా 21, అతిశయ మూలకాలుగా 12 అలంకారాలను చెప్పిరి.

శ్లేషలో శబ్ద, అర్థ అలంకారాల లక్షణాలు రెండూ ఉన్నప్పటికీ ప్రాధాన్యతా దృష్టితో అర్థాలంకారాలలో చేర్చిరి.

రుయ్యకుడు - అర్థాలంకారాలను 10 వర్గాలుగా విభజించాడు.

1. సాదృశ్య విచ్ఛిత్తి (భేదాభేద, అభేద, గమ్యౌపమ్య, భేదప్రధానములు), 2. విశేషణ విచ్ఛిత్తి, 3. గమ్యత్వవిచ్ఛిత్తి, 4. విరోధవిచ్ఛిత్తి, 5. శృంఖలావిచ్ఛిత్తి, 6. తర్కన్యాయ విచ్ఛిత్తి, 7. వాక్యన్యాయ, 8. లోకన్యాయ, 9. గూఢార్థప్రతీతి మూలకములు మరియు 10. మిశ్రితాలంకారములు.

దీనిలో 10వ వర్గంలో మిశ్రాలంకారాలను చేర్చాడు. అనగా నికరంగా అర్థాలంకారాలను 9 వర్గాలలో చేర్చారన్నమాట.

విద్యానాథుడు - 5 వర్గాలుగా అలంకారాలను చెప్పాడు. అవి, 1. భేదాభేద సాదృశ్యములు, 2. ఆరోపగర్భములు, 3. అధ్యవసాయమూలకములు, 4. విరోధగర్భములు, 5. గమ్యౌపమ్యములు.

సన్నిధానం సూర్యనారాయణశాస్త్రి - అర్థాలంకారాలను 4 వర్గాలుగా విభజించారు. (చూ. రామరాజభూషణుడు. 563-564). వీరిప్రకారం -

1. ప్రతీయమానౌపమ్యములు:- సామ్యం వాచ్యంగా గాక వ్యంగ్యంగా ఉన్న అర్థాలంకారాలు ఈ వర్గంలో చేరుతాయి. ఇవి 16.
2. ప్రతీయమాన వస్తుకములు:- వస్తువు వ్యంగ్యంగా గోచరించునవి ఇందులో ఉంటాయి. ఇవి 10.
3. ప్రతీయమాన రసభావములు:- రసభావాలు వ్యంగ్యంగా గోచరించునవి. ఈ మార్గంలో చేరుతాయి. ఇవి 4.
4. అస్ఫుటప్రతీయమానౌపమ్యరసభావములు:- ఏ అంశమూ ప్రతీయమానం కానివి ఈ వర్గానికి చెందుతాయి. ఇవి 40.

అర్థాలంకారాలను వాటి సామ్య లక్షణాలను బట్టి కొన్ని సమూహాలుగా వర్గీకరించే అవకాశం ఉన్నప్పటికీ, కొన్ని ఏ వర్గంలోనూ చేర్చడానికి వీలు లేకుండా ఉంటాయి. నిజానికి ఏ ఒక్క అలంకారమూ, మరో అలంకారంతో పూర్తిగా ఏకీభవించదు. అయినా కొన్ని సామ్య లక్షణాల ఆధారంగా లాక్షణికులు కొన్ని వర్గాలుగా చెప్పారు. అయితే అరుదుగా కొన్ని అలంకారాలు వాటి కొన్ని లక్షణాల వలన ఒక వర్గంలోనూ, మరికొన్ని లక్షణాలవలన మరొక వర్గంలో చేరే అవకాశం ఉంది. ఈ కారణంగానే లాక్షణికులు కొన్ని అలంకారాలను వేర్వేరు వర్గాలలో చేర్చారని చెప్పవచ్చు.

ఈ సిద్ధాంత వ్యాసంలో అర్థాలంకారాలను ఈ క్రింది క్రమంలో పోతన భాగవతంతో అన్వయించబడం జరుగుతుంది. (లక్ష్యాలు లభించని అర్థాలంకారాల లక్షణ చర్చ కూడా చేయడం లేదని గమనించాలి.)

**1. ఉపమానంతో సబంధమున్న అలంకారాలు**

1. ఉపమ, 2. అసమ, 3. ఉత్రేక్ష, 4. సందేహ, 5. భ్రాంతిమత్, 6. రూపకం, 7. పరిణామ, 8. అపహ్నుతి, 9. మీలిత, 10ఉల్లేఖ, 11. వ్యతిరేక, 12. ప్రతీప, 13. అర్థాంతరన్యాస, 14. ఉభయన్యాస, 15. అర్థాపత్తి, 16. తుల్యయోగిత, 17. దీపక, 18. దృష్టాంత, 19. నిదర్శన, 20. ప్రతివస్తూపమ.

**2. అతిశయ మూలక అలంకారాలు**

21. అతిశయోక్తి, 22. అత్యుక్తి, 23. ఉదాత్త, 24. సార, 25. మాలాదీపక.

3. ధ్వని మూలక అలంకారాలు

**26.** వ్యాజస్తుతి, **27.** వ్యాజనింద, **28.** ఆక్షేప, **29.** పర్యాయోక్తి, **30.** సమాసోక్తి, **31.** ముద్ర, **32.** లేశ, **33.** పరికర, 34. పరకరాంకుం.

4. వాస్తవమూలక అలంకారాలు

1. కార్యకారణ మూలకాలు

**35.** కావ్యలింగ, **36.** విశేషోక్తి, **37.** విభావన, **38.** విషమ, **39.** సమ, **40.** కారణమాల, **41.** అసంభవ, **42.** సముచ్చయ, 43. విచిత్ర, **44.** అనుకూల.

2. గుణమార్పిడి

**45.** అనుజ్ఞ, **46.** పరివృత్తి.

3. వాస్తవమూలకములు

**47.** స్వభావోక్తి/జాతి, **48.** సహోక్తి, **49.** వినోక్తి.

4. ఆధార ఆధేయ సంబంధులు

**50.** అధిక.

5. ఇతరములు

**51.** ఏకావళి, **52.** యథాసంఖ్య/క్రమ, **53.** సంభావన, **54.** ఆశీస్సు, **55.** అభావ, **56.** విరోధాభాస.

**అర్థాలంకారాలు కానివి**

లాక్షణికులు అర్థాలంకారాలుగా చెప్పినప్పటికీ, అర్థాలంకారాలు కాని కొన్నింటిని ఈ క్రింద పేర్కొన్నాను.

ప్రేయ, భావ, భావశబలత, భావసంధి, భావోదయ, రసవత్ అలంకారాలను పలువురు ఆలంకారికులు అర్థాలంకారాలుగా చెప్పారు. ఆలంకారికుల నిర్వచనాల ప్రకారం ఇవి స్థాయీభావ, రసోత్థాన, పతనములు కలిగించునవి. అయితే స్థాయీభావ, రసములు పాఠక హృదయ సంబంధమైనవే కాని, రచనా సంబంధులు కావు. కావున పైన అలంకారాలుగా చెప్పినవి వాస్తవానికి అలంకారాలు కావు.

**5.9 అర్థాలంకారాలు: పోతన భాగవతంతో అన్వయం**

ఒక్కొక్క అర్థాలంకారము యొక్క లక్షణచర్చ చేస్తూ, పోతన భాగవతంతో సమన్వయం చేస్తూ, అర్థాలంకారాల ద్వారా పోతన నవరసాలను, ప్రత్యేకించి భక్తిరసాన్ని ఎంతమహనీయంగా పోషించాడో, ఒక్కొక్క సన్నివేశాన్ని ఎలా కళ్ళకు కట్టినట్లు చూపించాడో ఇక ముందు చూద్దాం.

తరువాత పేర్కొనబోయే అర్థాలంకారాలలో భాగవతంలో లక్ష్యాలు లభించని అలంకారాలకు లక్షణచర్చకూడా చేయడం లేదని గమనించవలెను.

## 1. ఉపమ (simile)

1.0 అలంకారాలను స్పృశించిన వారెవ్వరూ ఉపమను చెప్పకుండా ఉండలేదు. లాక్షణికులు దీనిని అర్థాలంకారంగానే చెప్పారు. కాని ఒక్క భోజుడు మాత్రం దీన్ని ఉభయాలంకారంగా చెప్పాడు. కాని అది వాస్తవం కాదు. అప్పయదీక్షితుడు చిత్రమీమాంసలో ఇలా అన్నాడు.

"ఉపమైకా శైలూషీ సంప్రాప్తా చిత్రభూమికా భేదాన్
రంజయతి కావ్యరంగే నృత్యంతీ తద్విదాం చేతః" (చూ. రామరాజభూషణుడు. 567)

ఒకే నర్తకి వివిధ వేషములు ధరించి నర్తించునట్లుఉపమాలంకారమే వివిధ అలంకారాలుగా మారుతుందని చెప్పబడింది.

అయితే ఉపమానప్రాతినిధ్యమున్న అలంకారాలకు కొంత ఉపమతో పోలిక ఉన్ననూ ఇతర అలంకారాలతో ఉపమకు సంబంధం ఉండదు.

**స్థానము**

ఉపమ సాదృశ్యమూలక - భేదాభేద అర్థాలంకారం.

**నిర్వచనాలు**

లాక్షణికులు పేర్కొన్న ఉపమ నిర్వచనాలలో కొన్నింటిని ఈ కింది విధగా చెప్పవచ్చు.

- "కార్యబంధములందు ఏదేని ఒక వస్తువును (ఉపమేయము) సాదృశ్యము (ఉపమానము)తో ఉపమించుట 'ఉపమ' అనబడును" (భరతుడు: 450-451)

- 'రెండు వస్తువుల మధ్యనున్న సాదృశ్యము స్పష్టముగ, చమత్కార జనగముగ ఉన్నచో ఉపమ' (దండి. 56)

రెండు వస్తువుల మధ్య ఉండే సాదృశ్యం అనునది చమత్కార జనకంగా ఉన్నప్పుడే అది ఉపమ అవుతుందనేది గమనార్హం.

"ఉపమానేనోపమేయస్య గుణ లేశతః సామ్యముపమా" (వామనుడు: 107)

ఉపమేయాన్ని ఉపమానంతో పోల్చుటకు ఏదో ఒక గుణమైన సామ్యమైనది ఉండవలెనని దీనినిబట్టి తెలుస్తుంది.

- "వివక్షితమగు స్వభావమందలి మనోహరత్వమును ప్రతిపాదించుటకై, ఒకానొక (ప్రకృత) వస్తువునకు మనోహరత్వోత్కర్షముతో కూడిన మరియొక వస్తువుతో సామ్యము వర్ణించుట ఉపమ" (కుంతకుడు: 350)

ఉపమేయం యొక్క స్వభావపు మనోహరత్వాన్ని ప్రతిపాదించుటకే ఉపమించుదురని దీనిని బట్టి తెలియుచున్నది.

- "సాధర్మ్యముపమా భేదే" (మమ్మటుడు: 579)

ఉపమానోపమేయాలకు భేదం ఉంటుండగా సమానమైన ధర్మం కలిగి ఉండడం ఉపమయని వీరిభావం. అంటే ఉపమానోపమేయాలు రెండూ వేర్వేరుగా ఉండాలనీ, అయినా ఏదో ఒక ధర్మంలో రెంటికీ సమానత్వం ఉండవలయునని మమ్మటుడు ప్రతిపాదించాడు. ఇదే అభిప్రాయాన్ని రుయ్యకుడు మరొక విధంగా ఇలా చెప్పాడు.

"ఉపమానో పమేయయోః సాధర్మ్యే
భేదాభేదతుల్యత్వే ఉపమా" (రుయ్యకుడు: 8)

ఉపమానోపమేయాలు భేదము, అభేదము అనే లక్షణాలు రెండూ కలిగి ఉండాలని సూచించాడు.

జయదేవుడు -

"ఉపమాయత్ర సాదృశ్య లక్ష్మీరుల్ల సతిద్వయోః" అని చెప్పాడు. (జయదేవుడు: 15)

ఏగుణం విషయంలో ఉపమానోపమేయాలకు సామ్యం ఉన్నదో ఆ గుణాన్ని సౌందర్య వంతంగా, సహృదయ రంజకంగా చెప్పినపుడు మాత్రమే అది ఉపమ అవుతుందని, కేవలము పోలికను స్పృశించినంత మాత్రాన అది ఉపమాలంకారము కాదని దీని ద్వారా చెప్పినట్లైనది.

విద్యానాథుడు తన ప్రతాపరుద్ర యశోభూషణంలో ఉపమను ఇలా నిర్వచించాడు.

"స్వతస్సిద్ధమై ఉపమేయముకన్నా వేఱై సహృదయ సమ్మతమైన అప్రకృతముతో ప్రకృతమునకు గుణ క్రియారూపా లగు ధర్మములలో దేనినిబట్టి యైనను పోలిక ఒకతూరి మాత్రమే వాచ్యమగునెడల ఉపమాలంకారము" (విద్యానాథుడు: 422)

విద్యానాథునిపై నిర్వచనం ద్వారా ఈ కింది విషయాలు బోధపడుతున్నాయి.

- ఉపమానం స్వతస్సిద్ధమై ఉండాలి. అంటే లోకప్రసిద్ధమై ఉండాలి కాని కవి కల్పితం కారాదు. ఉపమానం అనేది ఉపమేయం కన్నా వేరుగా ఉండాలి. అంటే రెండూ ఒకటే కారాదు.

- కవి ఒక నిర్దిష్టమైన ఉపమేయాన్ని, ఒక నిర్దిష్టమైన ఉపమానంతో పోల్చటాన్ని, పాఠక సహృదయుని హృదయం అంగీకరించగలగాలి.

- పోలిక అనేది గుణరూపంగాగాని, క్రియారూపంగా గాని, ఉండవచ్చు.

- పోలికను ఒకమారు మాత్రమే చెప్పాలి.

- సాదృశ్యమనేది వ్యంగ్యంగా కాక వాచ్యంగా చెప్పబడాలి.

అయితే పోలిక - మాలోపమ విషయంలో ఒకటికన్నా ఎక్కువమార్లు చెప్పబడును.

"విలసతి సతి సాధర్మ్యే స్యాదుపమానోపమేయయోరుపమా" (విద్యాధరుడు: 253)

ఉపమేయోపమానాల సమాన ధర్మమనేది విలసించునదిగా చక్కగా ఉండాలన్నది వీరు చెప్పిన అంశం.

"సాదృశ్యం సుందరం వాక్యార్థోపస్కార ముపమాలంకృతిః" అని జగన్నాథ పండితుడు (జగన్నాథ పండితుడు: 87) చెప్పాడు.

ఉపమానోపమేయాల ధర్మసాదృశ్యం సుందరంగా, వాక్యార్థోపస్కారకంగా ఉండాలని నిర్దేశించడమైనది. అంటే సాదృశ్యం కథా సందర్భానికి రమణీయతను కూర్చునదై, పాఠకునికి సౌందర్య దర్శనానుభూతి కలిగించునదై ఉండాలని చెప్పినట్లైనది. అయితే 'ఆ సౌందర్యము చమత్కృతిని కలిగిస్తుందని, చమత్కృతి ఆనంద విశేషమ'నీ చెప్పాడు జగన్నాథుడు.

"సౌందర్యంచ చమత్కృత్యాధాయకత్వమ్
చమత్కృతి రానంద విశేషః ..." (జగన్నాథ పండితుడు. 87)

## పారిభాషిక పదాలు

అర్థాలంకారాలలో తరచుగా వాడబడే కొన్ని పారిభాషిక పదాలను ఈ క్రింది విధంగా నిర్వచించుకోవచ్చు.

### ఉపమేయం

'వర్ణించ దలచిన వస్తువును ఉపమేయం' అంటారు. (సాహిత్య పదకోశము: 319)
ఉపమేయాన్నే వర్ణ్యము, ప్రస్తుతము, ప్రకృతము, విషయము, ప్రాకర్ణికము, ఆరోపము, ఆరోపవిషయము అని కూడా అంటారు.

'గుణక్రియాది సమాన ధర్మాలను దేని మీద ఆరోపిస్తామో అది ఉపమేయము' (మమ్మటుడు: 614)

'విషయము ఆదేయగుణము' (అనగా దీని యందు గుణముల నాధానింపవలయును) (విద్యాధరుడు: 294)

### ఉపమానం

'వర్ణించ దలచిన వస్తువునకు పోలికగా తెచ్చుకున్న మరొక వస్తువును ఉపమానం అంటారు' (సాహిత్య పదకోశం: 319)

'గుణక్రియాది సమాన ధర్మములు గల దేన్ని ఆరోపిస్తున్నామో అది ఉపమానం' (మమ్మటుడు: 614)

'గుణాధాత ఉపమానం' (విద్యాధరుడు: 294)

ఉపమానాన్నే అవర్ణ్యం, అప్రకృతం, విషయి, అప్రాకరణికము, ఆరోప్యము, ఆరోపవిషయి అని కూడా అంటారు.

### సమాన ధర్మం

'ఏ గుణాన్ని బట్టి ఉపమానోపమేయాలను పోల్చెదరో ఆ గుణానికే సమానధర్మమని పేరు' (సాహిత్య పదకోశము: 319) సమాన ధర్మమునే సాధర్మ్యం, సాదృశ్యం (పోలిక) అనే పేర్లతో కూడా పిలుస్తారు. 'సమానధర్మం గుణ, క్రియ, విశేషణ (శ్లిష్ట) శబ్దాలలో ఏదైన కావచ్చు.' (మమ్మటుడు: 580)

'సమానధర్మము సకృత్తుగా (ఒకమారు) నిర్దేశింపబడటం గాని, అసకృత్తుగా (ఒకటి కంటే ఎక్కువమార్లు) నిర్దేశింపబడటం గాని ఉండవచ్చు. సమానధర్మం అసకృత్తుగా నిర్దేశింపబడటం రెండు రకాలుగా ఉంటుంది. అవి 1. వస్తు ప్రతివస్తు భావము, 2. బింబ ప్రతిబింబ భావము' (విద్యానాథుడు: 452-453)

#### 1. వస్తుప్రతివస్తుభావము

'ఒక యర్థమునే రెండు శబ్దములతో చెప్పుట వస్తుప్రతివస్తుభావము.' (విద్యానాథుడు: 453)

#### 2. బింబప్రతిబింబభావము

"సదృశములగు రెండు వేర్వేఱర్థములను వేర్వేఱుగ చెప్పినచో అది బింబ ప్రతిబింబభావము" (విద్యానాథుడు: 553)

### ఉపమావాచకం

'ఉపమానగత ధర్మములను ఉపమేయమునకు సంబంధింపజేయునది ఉపమావాచకము.' (విద్యాధరుడు. 269) ఉపమావాచకం సాధారణంగా వాచ్యంగా ఉంటుంది. అయితే ఉపమాలంకారం వ్యంగ్యమైనపుడు వాచకపదం ప్రయోగింపబడదు.

## లాక్షణికుల వర్గీకరణ

లాక్షణికులు ఉపమను పలురకాలుగా వర్గీకరించారు. రుయ్యకుడు, విద్యానాథుడు, విద్యాధరుడు ఉపమను సాదృశ్యమూలక, భేదాభేద ప్రధానాలంకారంగా చెప్పారు. రామరాజ భూషణుడు ఉపమను అస్ఫుట ప్రతీయమానౌపమ్య రసభావాలైన అలంకారాలలో ఒకటిగా చెప్పాడు. (రామరాజభూషణుడు:564)

భరతుడు రెండు కోణాలలో ఉపమను వర్గీకరించెను.

I. ఉపమేయ, ఉపమానాల సంఖ్యననుసరించి ఉపమ 4 రకాలు.

1. ఒక ఉపమేయాన్ని ఒక ఉపమానంతో పోల్చుట.
2. అనేక ఉపమేయాలను ఒక ఉపమానంతో పోల్చుట.
3. ఒక ఉపమేయాన్ని అనేక ఉపమానాలతో పోల్చుట.
4. అనేక ఉపమేయాలను అనేక ఉపమానాలతో పోల్చుట.

II. స్వరూప భేదముచే ఉపమ 5 రకాలు.

1. ప్రశంసోపమ - దీనిలో ఉపమానం అతిశయ లేదా ప్రశంసాపూర్వకంగా ఉండును.
2. నిందోపమ - దీనిలో ఉపమానం నిందా పూర్వకంగా ఉంటుంది.
3. కల్పితోపమ - దీనిలో ఉపమానం కవి కల్పితం.
4. సాదృశ్యోపమ - ఒక ఉపమేయానికి కచ్చితంగా ఫలానా ఉపమానమే సరియగు ననుట.
5. కించిత్ సదృశోపమ - దీనిలో సాదృశ్యము సమాసములో ఇముడ్చబడును. కావున ఉపమా వాచకముండదు.

(భరతుడు: 451)

భామహుడు ఉపమను 1. శ్రౌతి, 2. సమాసగతలుప్త, 3. తద్ధితగత, 4. ప్రతివస్తు ఉపమలు అని నాలుగు రకాలుగా వర్గీకరించెను. (భామహుడు: 43-44)

దండి ఉపమలో 32 రకాలు తెలిపాడు. (దండి: 57-73) వీరు ఉపమలో భాగంగా చెప్పిన వాటిలో చాలా వాటిని అర్వాచీనులు ప్రత్యేకాలంకారాలుగా చెప్పారు.

వామనుడు అలంకారములన్నింటినీ ఉపమ మరియు ఉపమా ప్రపంచంగా విభజించాడు. (వామనుడు: 125). ఉపమను లౌకికోపమ, కల్పితోపమ (వామనుడు: 109) గాను, పదార్థవృత్తి, వాక్యార్థవృత్తి (వామనుడు: 111) గాను, పూర్ణోపమ, లుప్తోపమ గాను, స్తుతి, నిందోపమలుగాను చెప్పారు.

కుంతకుడు - ఇవాది ప్రతిపాద్య పదార్థోపమ
- ఆఖ్యాతపద ప్రతిపాద్యవాక్యోపమ
- ఇవాది ప్రతిపాద్య వాక్యోపమ
- ఆఖ్యాతపద ప్రతిపాద్యవాక్యోపమ
- సమాస ప్రతిపాద్యోపమ (కుంతుకుడు: 349-356) అని ఉపమలో రకాలను కొన్నింటిని చెప్పాడు. ఇది 'వ్యాకరణ శాస్త్రా'న్ననుసరించి చేసిన వర్గీకరణ. ఉపమ అర్థాలంకారము అంటే దీనిలోని చారుత్వము అర్థము నాశ్రయించి ఉంటుంది. కాని పదాంశాలనాధారం చేసుకొని ఉండదు. అయితే ప్రతి అర్థానికి ఆశ్రయం శబ్దమే అయినా, చారుత్వము శబ్ద సంయోజనము వలన కాకుండా, అర్థము వలన కలుగుతుంది. కాబట్టి వ్యాకరణ శాస్త్రం పరంగా ఉపమను విభజించరాదు.

మమ్మటుడు, జయదేవుడు, విద్యానాథుడు, విద్యాధరుడు వంటి ప్రముఖులు ఉపమను (కొన్నిసూక్ష్మ భేదాలు మినహాయిస్తే) ఈ కింది విధంగా వర్గీకరించారు.

ఉపమ 1. పూర్ణోపమ, 2. లుప్తోపమ అని రెండు రకాలు.

1. పూర్ణోపమ

'ఉపమేయ, ఉపమానము, సమాన ధర్మము, ఉపమావాచకము అనే నాలుగు అవయవములు వాచ్యంగా, స్పష్టంగా లక్ష్యములో చెప్పబడితే అది పూర్ణోపమ' (విద్యానాథుడు: 430)

2. లుప్తోపమ

'ఉపమేయ, ఉపమాన, సమానధర్మ, ఉపమావాచకము లనే నాలిగింటిలో ఒకటిగాని, రెండుగాని, మూడుగాని లోపిస్తే (చెప్పబడకపోతే ) అది లుప్తోపమ.' (విద్యానాథుడు:430)

1. పూర్ణోపమ

పూర్ణోపమ 1. శ్రౌతి, 2. ఆర్థి అని రెండు రకాలు.

1. శ్రౌతి- 'సాక్షాత్ సాదృశ్య ప్రతిపాదకములగు వలె, పోలె, మాడ్కి (ఇవ, వత్, వా, యథా) వంటి ఉపమావాచక శబ్దములు ప్రయోగించిన శ్రౌతి యగును. సాదృశ్య వాచక శబ్దము శ్రుతి మాత్రముననే తెలియునది శ్రౌతి.' (విద్యానాథుడు:430)

2. ఆర్థి - 'ధర్మి (ఉపమానం) ద్వారమున సాదృశ్యమున బోధించునట్టి సదృశ, నీకాశ, సంకాశాది శబ్దములు ప్రయోగించిన ఆర్థి అగును. సదృశాది శబ్దముల వలన మొదట సదృశమగు వ్యక్తియు, పిమ్మట ఆ వ్యక్తి ద్వారమున సాదృశ్యము తెలియవచ్చుట వలన ఇది అర్థ సాపేక్షము గాన ఆర్థి' (విద్యానాథుడు:430-431)

శ్రౌతి, ఆర్థి రెండు రకాలు ఒక్కొక్కటి వాక్యగత, సమాసగత, తద్ధిత గతములనే భేదములు కలిగి ఉండును. ఈ కారణంగా పూర్ణోపమ ఆరు రకాలు. 1. వాక్యగత పూర్ణశ్రౌతి, 2. సమాసగత పూర్ణశ్రౌతి, 3. తద్ధితగత పూర్ణ శ్రౌతి, 4. వాక్యగత పూర్ణ ఆర్థి, 5. సమాసగత పూర్ణ ఆర్థి, 6. తద్ధితగత పూర్ణ ఆర్థి.

2. లుప్తోపమ

లుప్తోపమ మూడు రకాలుగా ఉంటుంది. అవి 1. ఏకలుప్త, 2. ద్విలుప్త, 3. త్రిలుప్త ఉపమలు.

1. ఏకలుప్తోపమ

ఉపమాన, ధర్మ, ఉపమావాచకములలో ఏదో ఒకటి లోపించడం వలన ఏర్పడిన ఉపమను ఏకలుప్త ఉపమ అంటారు. దీనిలో ఉపమేయం లోపించడం ఉండదు. ఇది మూడు రకాలు. 1. ఉపమాన లుప్తోపమ, 2. ధర్మలుప్తోపమ, 3. వాచక లుప్తోపమ. మరల ఇవి వాక్య, సమాస, తద్ధిత గతములై పలు విధములగును.

2. ద్విలుప్తోపమ

ఉపమాన, ధర్మ, ఉపమా వాచకములలో ఏవేని రెండు లోపిస్తే దాన్నే ద్విలుప్తోపమ అంటారు. ఇది మూడు రకాలు. 1. ఉపమాన - ధర్మలుప్తోపమ, 2. ఉపమాన - వాచకలుప్తోపమ, 3. ధర్మ-వాచకలుప్తోపమ. ఇది కూడా వాక్య, సమాస, తద్ధిత గతములై పలువిధములగును.

3. త్రిలుప్తోపమ

ఉపమాన, ధర్మ, ఉపమావాచకములు మూడు లోపిస్తే దాన్ని త్రిలుప్తోపమ అంటారు.

ఇవి కాక మరి కొన్ని రకములుగా కూడా ఉపమ ఉండడం కలదు.

1. సర్వవస్తు విషయోపమ

'ఉపమేయ, ఉపమానాల అవయవి, అవయవములకన్నిటికిని సామ్యం నిరూపింపబడెనేని అది సర్వవస్తు విషయోపమ.' (విద్యానాథుడు:454)

2. ఏకదేశవర్తి ఉపమ

'ఉపమేయ ఉపమానముల అవయవి, అవయవములలోని ఏదేనొక అంశం చెప్పబడి, మరియొక అంశము గమ్యముగా ఉండెనేని అది ఏకదేశవర్తి ఉపమ.' (విద్యానాథుడు:454)

3. మాలోపమ

'ఒక ఉపమేయానికి ఒకటికి మించి ఉపమానాలు చెప్పడం మాలోపమ.' (మమ్మటుడు:604)

4. ఉపమా పరంపర

'ఉపమాలంకారాలను వరుసగా అనేకం వాడడాన్ని ఉపమ పరంపర అంటారు.

5. హీనోపమ/నీచోపమ

ఉపమేయం కన్నా ఉపమానం హీనంగా ఉంటే దాన్ని హీనోపమ అంటారు.

6. కల్పితోపమ

ఒక వస్తువుకు సహజంగాలేని లక్షణాన్ని కల్పించి (ఉన్నట్లుగా ఊహించుకొని) ఆ వస్తువును ఉపమానంగా గ్రహిస్తే

అటువంటి ఉపమను కల్పితోపమ అంటారు.

7. సదృశోపమ

ఒక ఉపమేయాన్ని పోల్చడానికి నిర్దిష్టమైన ఉపమానం మాత్రమే తగునంటే అది సద్రుశోపమ.

8. కించిత్ సదృశోపమ

సాదృశ్యం సమాసంలో ఇముడ్చబడితే కించిత్ సదృశోపమ.

9. రశనోపమ

'పూర్వవాక్యాలలో ఉపమేయంగా ఉన్నవి, ఉత్తర వాక్యాలలో ఉపమానాలుగా చెప్పబడితే దాన్ని రశనోపమ అంటారు.' (మమ్మటుడు:605)

## ఉపమ - ఇతర అలంకారాలతో సామ్యభేదాలు

ఉపమలోగల ఉపమాన ప్రాతినిధ్యం అనేక ఇతరాలంకారాలలో కూడా ఉంది. అయినా కొన్ని భిన్నలక్షణాల వలన ఇతర అలంకారాలు ప్రత్యేకంగా చెప్పబడ్డాయి.

ఉపమ-రూపకం

సాధారణంగా ఉపమ, రూపకాలలో ఉపమేయోపమానాలు రెండూ ఉండును. ఉపమలో ఉపమేయోపమానాలకు పోలిక ఉండగా రూపకంలో అభేదం ఉంటుంది.

ఉపమ- ఉత్ప్రేక్ష

ఉపమలో ఉపమానం సుప్రసిద్ధం కాగా ఉత్ప్రేక్షలో అప్రసిద్ధం, కవి కల్పితం అయి ఉంటుంది.

ఉపమ - తుల్యయోగిత, దీపక, ప్రతివస్తూపమ, దృష్టాంత, నిదర్శనములు

ఉపమలో సాదృశ్యం వాచ్యంగా శబ్దం చేత చెప్పబడుతుంది. కాగా తుల్యయోగిత, దీపకాదులలో సాదృశ్యం ప్రతీయమానమౌతుంది.

## ఉపమ - పోతన భాగవతంతో అన్వయం

వనమాలియై ఆంధ్రసాహిత్య బృందావనంలో పారిజాతాలు పూయించిన కవీశ్వరుడు బమ్మెర పోతన. శక్తివంతమైన విభిన్న కవిత్వాభివ్యక్తీకరణ పద్ధతులలో ఆలంకారిక అభివ్యక్తి ఒకటి. అలంకారాలన్నిటిలో సంఖ్యాపరంగాను, ఉపమానాల ఎన్నిక విషయంలో భారతీయ కవులందరూ - అగ్రతాంబూలమిచ్చింది ఉపమాలంకారానికే. అలాగే పోతన గారు కూడా తన భాగవతంలో (1-4, 7-10 స్కంధాలు) ఉపమకు అత్యంత ప్రాధాన్యమిచ్చారు. పోతన గారు మొత్తం 566 ఉపమలు ప్రయోగించారు. ఏ ఇతర అలంకారాన్ని విరివిగా వాడలేదు. సంఖ్యాపరంగా ఉపమాలంకారానికి ప్రథమస్థానం కాగా, ద్వితీయ స్థానం రూపకానిది. (265). వీటితో పోలిస్తే ఇతర అలంకారాలు తక్కువ సంఖ్యలో ఉన్నాయి.

భాగవతంలోని అలంకారాల్ని విశ్లేషించడంలో ఒక చిక్కు ఉంది. ఈ భాగవతమంతా కదళీపాకంతో నిర్వహింపబడటం వలన భాషాక్లిష్టత లేదనే చెప్పాలి. ఉన్నచిక్కల్లా భాగవతంలోని రమణీయార్థం యొక్క లోతుపాతులు తరచి చూడలేక పోవడం. కారణం ఇది మోక్షప్రధాన గ్రంథం.

"భాగవతం తెలిసి పలుకుట చిత్రంబు
చూలికైన తమ్మిచూలికైన" (భాగ. 1-19) అంటారు పోతనగారు. బ్రహ్మరుద్రాదులే భాగవతపులోతు తుది చూడలేరని అన్నారు. అయితే నిక్కమైన ప్రేమ, భక్తి ఉన్నవారు భాగవత మాధుర్యాన్ని చవిచూడవచ్చు. నిర్గుణ, నిర్వికల్ప సమాధిమగ్నులగు శుకుని వంటి పరమహంసలను కూడా సగుణ బ్రహ్మం వైపు, సాకార భగవల్లీలా కథనం వైపు ఆకర్షింప గలిగిందంచటే - భాగవతం మహిమ ఎలాంటిదో అంచనా వేయవలసి ఉంది. "భక్త్యాభాగవతం జ్ఞేయం నవ్యుత్పత్త్యా నటీకయా" అనే మాటల ననుసరించి శుష్కపాండిత్యం వల్ల వితండవాదం వల్లా భాగవతాన్ని అర్థం చేసుకోలేమని, భక్తిభావ పరవశులే భాగవతాన్ని అనుభవైక వేద్యం చేసుకుంటారని తెలుస్తుంది. కాబట్టి భాగవతాన్ని తర్కంతో కాకుండా భక్తిభావ దృక్పథంతోనే చూడవలసి ఉంది.

పోతనగారి ఉపమానాల ఎన్నిక అనితరసాధ్యం. ఈ సిద్ధాంతగ్రంథంలో అన్నిటిని విశ్లేషించుటకు వీలుకాదు. మచ్చునకు కొన్ని మాత్రం విశ్లేషించబడతాయి.

ఉపమాలంకాన్ని వివిధ అలంకారములు భిన్న దృక్పథాలతో వర్గీకరించిన కారణంగా - అన్ని దృక్పథాలలోని అన్ని సూక్ష్మవిభాగాలు కలుపుకుంటూ, ఒక క్రమపద్ధతిలో ఉండేలా ఈ క్రింది విధంగా చెప్పవచ్చు.

## పూర్ణోపమ - శ్రౌతి

సాధారణంగా 'ఉపమ' అనగానే - దీనిలో ఉపమేయం, ఉపమానం, సమానధర్మం, ఉపమావాచకం అనే నాలుగు అంశాలుంటాయి. దీనినే పూర్ణోపమ అంటారు. అందులోను శ్రౌతి ఉపమనే ఎక్కువగా ఉంటుంది. అంటే సమానధర్మం వాచ్యంగా, స్పష్టంగా చెప్పబడుతుంది. సాధారణంగా ఉపమ - ప్రశంసోపమగానే ఉంటుంది. అంటే ఉపమేయం కన్నా ఉపమానం గొప్పదై ఉంటుంది. దీనినే 'ప్రశంసోపమ' అంటారు. ఉపమలో సాధారణంగా ఒక ఉపమేయం, ఒక ఉపమానంగాని లేదా సమాన సంఖ్యలో ఉపమేయం, ఉపమానాలు ఉండటంగాని జరుగుతుంది. ఈ లక్షణాలు ఉన్న ఉపమను సాధారణ ఉపమ (కవుల ఉపమ ప్రయోగాలలో తరచుగా కనిపించేది.) గా చెప్పవచ్చు. ఉపమలోని మిగిలిన ఉపవిభాగాలు అరుదుగా (అసాధారణంగా) కనిపిస్తాయి.ఉపమలోని సమానధర్మం- రూప, గుణ, క్రియాది రూపాలలో ఉండవచ్చు.

శ్రీసీతారాముల కళ్యాణ ఘట్టంలో - శ్రీరాముడు.

*ఒక మున్నూఱు గదల్చి తెచ్చిన లలాటోగ్రాక్షు చాపంబు బా*
*లకరీంద్రంబు సులీలమై చెఱకుఁ గోలన్ ద్రుంచు చందంబునన్*
*సకలోర్వీశులు సూడగా విఱిచె దోశ్శక్తిన్ విదేహ క్ష్మా*
*పక గేహంబున సీతకై గుణమణి ప్రస్ఫీతకై లీలతోన్* (భాగ. 9 - 261)

అని పోతన గారు వర్ణించారు.

రామాయణమనగానే, మనకు స్ఫురించే మధుర ఘట్టాలలో సీతారామ కళ్యాణం ముఖ్యమైనది. జనక రాజర్షి సీతాదేవికి స్వయం వరం ప్రకటించగా, రాజకుమారులెందరో వచ్చారు. విశ్వామిత్రుని కోరిక మేరకు రామలక్ష్మణులు కూడా మిథిలా నగరానికి చేరుకున్నారు. స్వయం వర పరీక్షలో శివధనుస్సును ఎత్తి, ఎక్కుపెట్టిన వ్యక్తిని సీత వరిస్తుంది. జనకుడు ఈ పరీక్ష పెట్టడానికి ఒక కారణం ఉంది. అది - సీత చిన్నపిల్లగా ఉన్నపుడు తప్పిపడిన చేబంతిని తీసుకొనుటకు గాను ఆ శివధనస్సును ఎత్తడం.

మూడు వందల మంది కలసి శివధనుస్సుగల బండిని పూజామందిరం నుండి సభామంటపానికి త్రోసుకొని వచ్చారు. కొందరు దాన్ని చూడగానే తమ ప్రయత్నం మానుకొన్నారు. కొందరు ప్రయత్నించి భంగపడ్డారు. రావణుడు సైతం శివధనుస్సు నెత్తలేకపోయాడు. ఎన్నో అస్త్రశస్త్ర విద్యలలో నైపుణ్యం కలవారు కూడ దాన్ని ఎత్తడంలో విఫలం అయ్యారు. జనకుని మనసులో, 'ఈ శివధనుస్సునెక్కు పెట్టేవారు లేరేమోనని, సీతకు వివాహం కాదేమోనని' అనిపించింది. అంతలో విశ్వామిత్రుని సంజ్ఞమేరకు బాలరాముడు - అందరినీ ఆశ్చర్యంలో ముంచేలా ఒక్క చేతితో శివధనుస్సునెత్తి, నారీ సంధానం చేయగా అది విరిగింది. ఈ సందర్భంలో పోతనగారు ఎంత చక్కని ఉపమానం వాడారో చూడండి.

"............................................ *లలాటోగ్రాక్షు చాపంబు బా*
*ల కరీంద్రంబు సలీలమై చెఱకుఁ గోలన్ ద్రుంచు చందంబునన్*
*సకలోర్వీశులు సూడగా విరిచె దోశ్శక్తిన్*................................ "

శ్రీరామ చంద్రుణ్ణి - 'బాల కరీంద్రము' తో పోల్చారు. ఎంత చక్కని పోలిక! రాముని బలం, వర్ణం ఏనుగుతో పోల్చడానికి కారణమైనాయి. మిగిలిన వ్యక్తులు వ్యక్తులుగానే ఉన్నారు. కాని రాముడు వీరందరిలో ఏనుగు వలే అత్యంత బలాఢ్యుడని ఈ ఉపమానం సూచిస్తుంది. 'సామజవరగమనా' అంటూ త్యాగయ్య రాముని వర్ణిస్తాడు. అంటే రాముడు నడుస్తుంటే గున్న ఏనుగు నిండుగా, గంభీరంగా నడుస్తున్నట్లుంటుందట. రాముడు విశ్వామిత్రుని వద్ద నుండి, ధనుస్సుకడకు నడుస్తూ వెళ్తున్న దృశ్యం ధనుస్సు 'కరము'తో ఎత్తుతున్న దృశ్యం పోతనగారి హృదంలో ఏనుగు చెఱకుగడను పైకెత్తి, విరుస్తున్న దృశ్యాన్ని స్ఫురింపజేశాయి.

శ్యామవర్ణంలో ఉండడం, అత్యంత బలాన్ని కలిగి ఉండడం, నిండుగా నిధానంగా నడవడం, ఎంత పనినైనా సునాయాసంగా చెయ్యడం 'కరము' (చెయ్యి, తొండం)తో వస్తువును ఎత్తడం రామునికి, ఏనుగుకు సమానం. ఇంకొక సమాన లక్షణం కూడా ఉంది. పోతనగారు రాముణ్ణి - 'బాలకరీంద్రము' అన్నాడు. ఆ ఏనుగు ప్రౌఢవయస్సు గలది కాదు. బాలకరి (గున్నయేనుగు), ఇప్పటి వరకూ రాముడు ముగ్గురు తల్లుల ముద్దుల బిడ్డగా ఉన్నాడు. అతని ముఖంలో ముగ్ధత్వము, లేతదనం, పాలబుగ్గల

నైగనిగ్యం ఇంకా స్పష్టంగా కనిపిస్తుంది. విశ్వామిత్రుడు రామలక్ష్మణులను తన యాగరక్షణార్థం పంపమన్నపుడు - దశరథుడు ఈ పసిబాలుణ్ని ఎలా పంపను? అని అడిగినట్లు మనం రామాయణ కథలో చూస్తాం. భాగవత నవమ స్కంధంలోని రామకథ అత్యంత సంక్షిప్తంగా ఉంటుంది. కావున చిన్నచిన్న విశేషణాల ప్రయోగం ద్వారా విపులార్థాన్ని స్ఫురింపజేస్తూ పోతన గారు రామ కథను రాశారు. రాముడు 'బాలగజం' వంటి వాడేగాని ప్రౌఢ ఏనుగు వంటి వాడు కాడన్నమాట. దీనిద్వారా చూడడానికి వయస్సులో చిన్నవాడైనా, ఎందరో ప్రౌఢులు కూడ చేయలేని పనిని చేశాడని చెప్పినట్లైనది. అయితే పోతన గారి ఈ ఉపమా ప్రయోగంలో ఒక విచిత్రమున్నది. పరిమాణంలో చిన్నవాడైన రాముణ్ని అధిక పరిమాణంగల ఏనుగు తో పోల్చుతూ, ఏకకాలంలో పరిమాణంలోనూ, శక్తిలోనూ, గాంభీర్యంలోను అత్యంత గొప్పదైన శివధనుస్సును స్వల్పమైన చెఱుకు గడతో పోల్చడం చూచడవచ్చు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడు, జగన్మాత, అందరూ దేవతల, ఋషుల శక్తితో కూడిన ఆ ధనస్సుతో శివుడు త్రిపురాసురుల్ని సంహరిస్తాడు. అది మూడువందలమంది నెట్టగా సభామండపానికి కొనిరాబడినది. పోతనగారు దానిని ఇక్కడ 'లలాటోగ్రాక్షుచాపంబు' అంటాడు. 'శివుడు' అనే అర్థంలో ఎన్నో పర్యాయపదాలున్నా ఇక్కడ 'లలాట - ఉగ్ర - అక్షుడు' అంటాడు. అత్యంత ఉగ్రమైన మూడవకన్ను కలవాని ధనుస్సు అనడం ద్వారా ఆ ధనుస్సు ఎంత ఉగ్రమైనదో స్ఫురింపజేసినట్లయినది. అంతటి ధనుస్సును చెఱకు గడతో పోల్చడమేమిటి అనుకోవచ్చు. అక్కడే పోతన రుచిరార్థ హృదయం అవగతం అవుతుంది. ఇతరులకు శివధనుస్సు భయంకరమైనదే, అది పెద్దదే. అన్యులు గుణసంధానం చేయుటకు అసాధ్యమైనదే కావచ్చు. కాని అది శ్రీరాముడికి మాత్రం చిన్నదే. రాముని బలం ముందు అది స్వల్పమైనది. అది శ్రీరాముడు సాక్షాత్తు నారాయణుడని చెప్పినట్లయినది. రాముడు నారాయణుడు కాబట్టే లోకభీకరమైన శివధనుస్సు, అతని ముందు ఏనుగుకు చెఱుకుగడ వలె బలహీనమై తోచింది. శివధనుస్సును చెఱుకుగడతో పోల్చడం రాముని ఔన్నత్యాన్ని ప్రకటించడానికే కాని, శివధనుస్సును కించపరచడానికి కాదు.

ఈ పద్యంలో మరొక అంశం ఏమంటే ఏనుగు చెఱుకుగడను విరవడంలో విశేషప్రయోజనం ఏమీ ఉండదు, క్షుద్బాధ తీర్చుకోవడం తప్ప. కాని రాముడు శివధనుస్సు విరవడంలో ఒక విశిష్టప్రయోజనం ఉన్నది. అది ఎవరికోసం 'సీతకై', సీతహృదయం దోచుకొనుటకై, జనకుని సందేహం తీర్చుటకై, లోకకళ్యాణానికై. తన దైవాంశను తెలుసుకొనే శక్తిగలవారికి తెలపడానికై.

ఇంత చిన్న అలంకారంలో - పోతనగారు ఇన్ని రమణీయార్థాలను నిక్షిప్తం చేశాడన్నమాట. ఈ పద్యంలో ఉపమేయాలు- రాముడు (ముందు పద్యంలో చెప్పబడింది.), శివధనుస్సు. ఉపమానం బాలకరీంద్రము, చెఱుకుగడ. సమానధర్మం విరచుట. ఉపమావాచకం - చందంబునన్: ఈ నాలుగు అంశాలు ఉండటం వలన ఇది పూర్ణోపమ. సమానధర్మం 'విరచుట/త్రుంచుట' అని చెప్పుట వలన 'చందంబునన్' అనే ఉపమావాచక పద ప్రయోగం ద్వారా ఇది పూర్ణోపమలోని 'శ్రౌతి ఉపమ' కు చెందును. దీనిలోని ఉపమాన పదాల ప్రయోగం (ఏనుగ, చెఱుకుగడ) ద్వారా శ్రీరాముని ఔన్నత్యం స్ఫురింపజేయబడింది కావున ఇది - ప్రశంసోపమగా చెప్పవచ్చు. ఇంకా ఉపమేయాల సంఖ్య (రాముడు, శివధనుస్సు), ఉపమానాల సంఖ్య (ఏనుగు, చెఱుకుగడ) సమానం. ఉపమ రూప, గుణ క్రియలలో ఏ ఒక్కదాని, రెండింటి లేదా మూడింటి ఉత్కర్షనైనా ప్రతిపాదించవచ్చు. పై పద్యంలో రూపం (రాముని రూపం, ఏనుగు రూపం), గుణం (రాముని బలం, ఏనుగు బలం), క్రియ (ధనస్సును విరచుట, చెఱుకు గడను విరచుట) మూడింటి ఉత్కర్షను స్ఫురింపజేసేలా ఉంటుంది.

ఉపమలో ప్రకృత కథా దృశ్యం ఒకటి ఉంటుంది. ఆ దృశ్యం వల్ల కవి హృదయంలో మరింత మనోహరమైన, ప్రకృత దృశ్యంతో పోలికలున్న, మరొక దృశ్యం దృగ్గోచరమవుతుంది. ఈ పోలికలోనే రమణీతయ దాగి ఉంది. ఏ ఇతర కవితాంశానికి (గుణ, వక్రోక్తి, ధ్వని) లేని, కొన్ని అర్థాలంకారాలకు మాత్రమే ఉన్న ప్రత్యేక లక్షణం - ఉపమాన ప్రాతినిధ్యం. ఈ ఉపమానాల ఎన్నిక లోనే కవి 'ద్రష్ట' అని గుర్తింపబడతాడు.

ఇలాంటి పోలికనే, మధురలో - శ్రీకృష్ణుడు - కంసుడు ఏర్పాటు చేసిన ధనుస్సును విరిచే సందర్భంలోను చెప్పారు పోతన గారు.

*"బంధుల్ మేలన వామహస్తమునఁ జాపంబెత్తి మౌర్వీలతా*
*సంధానంబొనరించి కొంచెపుఁ దెగన్ శబ్దించుచున్ ధీరతా*
*సింధుండా హరిదాని ఖండితముగాజేసెన్ జనుల్ చూడఁగా*
*గంధేభంబు రసాల దండము నొగిన్ ఖండించు చందంబునన్"* (భాగ. 10. పూర్వ - 1282)

రాముడు ధనుస్సు విరుచుటను భాగవతం నవమ స్కంధంలో ఏనుగు చెఱుకుగడను విరుచుటతో పోల్చి, మరల దశమ

స్కంధంలో కృష్ణుడు ధనుస్సును విరుచుటను పోల్చాడు. ఏనుగు చెఱుకు గడను విరుచుటతోనే ..... రెండు పోలికలున్న సందర్భాలలో పోతన మదిలో కనిపించిన అప్రకృత దృశ్యం ఒకటేనన్నమాట. అదే ఏనుగు చెఱుకుగడను సునాయాసంగా విరచుట. దీన్ని బట్టి రామకృష్ణులకు పోతనగారు భేదం పాటించలేదని తెలుస్తుంది.

*"చలమున బుద్ధిమంతులగు సాధులు నా హృదయంబు లీలదోం*
*గిలిగొని పోవుచుండుదు రకిల్బిష భక్తిలతావయంబుల*
*న్నిలువగఁ బట్టి కట్టుదురు నేరుపుతో మదకుంభికైవడిన్*
*వలలకు చిక్కి భక్తజనవత్సలతన్ జనుచుందుఁదాపసా!"* (భాగ. 9 - 117)

భక్తుని బలమంతా భగవంతుని ఒక బలహీనతపై ఆధారపడి ఉంది. అది భక్తి ఎక్కడుంటే అక్కడ తాను వివశుడైపోవటం, భక్తికి లోబడిపోవటం. ఈ విషయాన్ని పోతనగారు చక్కగా ఉపమించారు. ఎంతో బలము గల ఏనుగు, తేలికైన వలలకు చిక్కినట్లు, భక్తునిపై ఉన్న వాత్సల్యం వలన అతని భక్తికి అనంత శక్తి స్వరూపుడైన భగవంతుడు కట్టుబడిపోతాడు.

పోతనగారి అలంకార శిల్పం ఇక్కడ చక్కగా ద్యోతకం అవుతుంది. ఈ ఉపమను ప్రయోగించిన సందర్భం చూస్తే అది ఎంత ఔచితీమంతంగా ఉందో తెలుస్తుంది.

ఒక సంవత్సరంపాటు ద్వాదశీవ్రతం చేసిన అంబరీషుడు, వ్రతం చివర, కార్తీక మాసంలో మూడు రాత్రులు ఉపవసించి, వచ్చిన బ్రాహ్మణాదులందరికీ భోజనం పెట్టి, తాను తినబోయే లోపల దూర్వాస మహర్షి అక్కడికి వచ్చాడు. అతన్ని భోజనానికి పిలువగా స్నానం చేస్తానని నదికి వెళ్ళి, ఎంతకూ తిరిగి రావటం లేదు. ద్వాదశియందు పారాయణ చేసి అంబరీషుడు భుజిస్తేనే వ్రతం సమాప్తి అయినట్లు. దానికి ఇంక ఒక్క ముహూర్తమే ఉంది. దూర్వాసునికి పెట్టకుండా తినడం మంచిది కాదు. తినకపోతే చేసిన వ్రతమంతా వృథా అవుతుంది. అప్పుడు బ్రాహ్మణులు 'కుడువకుండాఁ గాదు గుడుచుటయును గాదు సలిల భక్షణంబు సమ్మతంబు' అని సలహా ఇచ్చారు. రాజు అట్లే చేశాడు. ఇది తిరిగి వచ్చిన దూర్వాసునికి కోపం తెప్పించింది. జటను పెరికి దాని నుండి 'కృత్య' అనే భయంకర ఆకృతిని సృజించెను. దాన్ని అంబరీషునిపై ప్రయోగించాడు. అప్పుడు తనను చంపుటకు వస్తున్న 'కృత్య' నుండి కాపాడమని అంబరీషుడు శ్రీమహావిష్ణువుని కోరలేదు. కాని విష్ణువే తన చక్రాయుధాన్ని పంపించాడు. ఇక్కడే భగవంతుని, భక్తజనవాత్సల్యం తెలుస్తుంది. చక్రాయుధం 'కృత్య'ను చంపి దుర్వాసుని వెంటబడింది. తనను రక్షించుకొనుటకు బ్రహ్మ, రుద్రులను బ్రతిమాలాడు. వారు తమ అశక్తతను వెలిబుచ్చారు. విష్ణువు వద్దకే వెళ్ళాడు విష్ణువు అన్నాడు. 'నేను భక్తికి కట్టుబడతాను' అని. ఈ సందర్భంలో ప్రయోగించాడు ఈ ఉపమ. ఏనుగు వలలకు చిక్కునట్లు తాను భక్తికి చిక్కుతాను అని, ఎంత సందర్భోచితంగా ఉంది ఇది. చక్రాన్ని మరల్చుటకు తాను అశక్తుడనని, తన శక్తి అంతా భక్తునిలోనేనని, తిరిగి అంబరీషుణ్ణే ఆశ్రయించమంటాడు. అంబరీషుని ప్రార్థనమేరకు చక్రాయుధం తిరిగి వెనక్కువెళ్తుంది. అంటే త్రిమూర్తులు చేయలేని పని, వారి అనుగ్రహంతో భక్తుడు చేశాడన్నమాట. ఇదే సందర్భంలో మరొక ఉపమ ప్రయోగించారు పోతన.

*"భక్తుఁడెందుఁ జనినఁ బఱతెంతువెనువెంట*
*గోవు వెంటఁ దగులు కోడెభంగి"* (భాగ. 9 -118)

భక్తుడెక్కడికి వెళ్తే భగవంతుడక్కడికి వెళ్తాడు. ఎలా? గోవు వెంట కోడె వెళ్ళినట్లు ఎంత చక్కని లోకవ్యవహారంలోని ఉపమానం. కోడె వ్యామోహంతో మంచి చెడులు ఆలోచించకుండా తాను ఎక్కడికి వెళ్తున్నదో తెలియకుండా, గోవు ఎక్కడికి వెళ్తే అక్కడికి వెళ్తుంది. అట్లే భగవంతుడు కూడా ఏమీ ఆలోచించకుండా భక్తుని వెంట వెళ్తుంటాడు. భక్తులపై గల వాత్సల్యం వలన. కోడెకు గోవుపై గల వ్యామోహ తీవ్రత ఇక్కడ ప్రధానం. విష్ణువుకు గల వాత్సల్య తీవ్రతనే ఇక్కడ గమనించాలి.

ఒక సంఘటనను పూర్వపు మరొక సంఘటనతో ఊహించడం కూడా భాగవతంలో చూడవచ్చు.

*"ఆ శౌరికిఁ దెరువొసగెఁ బ్ర*
*కాశోద్ధత తుంగభంగ కలిత ధరాశా*
*కాశయగు యమునమును సీ*
*తేశునకుఁ బయోధి త్రోవయిచ్చిన భంగిన్"* (భాగ. 10. పూర్వ - 143)

అప్పుడే పుట్టిన శ్రీకృష్ణున్ని వసుదేవుడు మధుర నుండి వ్రేపల్లెకు చేర్చునపుడు యమునా నది దాట వలసి వచ్చింది. ఆ యమున శ్రీకృష్ణునికోసం త్రోవ ఇచ్చింది. ఇది ద్వాపరయుగం. ఇది ఎలా ఉందంటే పూర్వం త్రేతాయుగంలో శ్రీరాముని

కోసం సముద్రం త్రోవ ఇచ్చినట్లుగా ఉంది. శ్రీరామావతార ప్రధానోద్దేశమైన దానవ సంహార కార్యమహాయజ్ఞంలో సముద్రం రామునికి సహకరించింది. ఈ ఘట్టం వంటిదే శ్రీకృష్ణుడు మధుర నుండి వ్రేపల్లె చేరడం. కృష్ణుడు దానవ సంహార కార్యానికి మొటి రంగంగా వ్రేపల్లెను ఎంచుకొన్నాడు. ఈ కార్యానికి సహకరించింది యమున. భిన్న కాలాలలో జరిగిన సమరూప సంఘటనలలో ఒకటి ప్రకృత దృశ్యం కాగా, మరొక దాన్నిఅప్రకృత దృశ్యంగా ఉపమించారు పోతనగారు. రామకృష్ణుల అభేదాన్ని మధ్యమధ్య పరోక్షంగా స్ఫురింపజేయడం భాగవతంలో చూస్తాం.

పోతన సామాన్య జన జీవనానికి దగ్గరిగా ఉన్న చక్కని ఉపమానాలను ఎన్నుకుంటారనడానికి క్రింది పద్యం మంచి ఉదాహరణ.

*కనిసాంబ ప్రముఖాది యోధవరులుత్కంఠాత్ములై మీద కే*
*తను నగ్గించి సువర్ణ పుంఖ నిశితాస్త్రశ్రేణి సంధించి సా*
*ల్వుని సైన్యావళి మస్తముల్ వెరవు లావున్ మీఱుగా నొక్కయె*
*త్తున వే్రతుంచిరి తాటిపండ్లు ధరఁ దోఁద్రోరాల్చు చందంబునన్* (భాగ. 10. ఉత్తర - 877)

ద్వారకా నగరంపై దండెత్తిన సాల్వుని సైన్యాన్ని, సాంబుడు మొదలైన యాదవ వీరులు ఎదుర్కొన్నారు. నిశితాస్త్ర శ్రేణితో యాదవ వీరులు సాల్వుని తరపు యోధుల తలలను అసంఖ్యాకంగా ఖండించి వేశారు. దాన్ని గుత్తులకొలది తాడి పండ్లను సులువుగా రాల్చుతూ, నేలబడవేయుటతో ఉపమించారు పోతనగారు. శత్రువీరుల శిరచ్ఛేదనం అతికష్టం కాని, యాదవవీరులకది సులభమని, తాటిపండ్లను నేల రాల్చుటవంటిదేనని చెప్పే ఈ ఉపమానం యాదవుల అమిత బలాన్ని, యుద్ధనైపుణ్యాన్ని తెలియజేస్తుంది. జుట్టుతో ధూళి దుసరితమైన తలలు నల్లగాను, గుండ్రంగాను ఉన్నట్లే, తాటిపండ్లుకూడా నల్లగా, గుండ్రంగా ఉండడం కూడా ఉపమించుటకు మరొక కారణం. పల్లెటూరి రైతైన పోతన ఇలాంటి ఉపమానాలు ప్రయోగించుట సహజమే.

*గోవింద సందర్శన కుతూహలలై, ధరణీసుర సుందరులు సంభ్రమానందంబులు సందడింప, భక్ష్య, భోజ్య, లేహ్య, చోష్య, పానీయ భేదంబులం గలిగి సంస్కార సంపన్నంబులయిన యన్నంబులు కుంభంబుల నిండుకొని సంరంభంబుల సముద్రంబులకు నడచు నదుల తెఱంగున ...... చనిరి.* (భాగ. 10. పూర్వ-856)

ఎలాంటి వ్యక్తులను, వస్తువులను ఎలాంటి వాటితో పోల్చి చెప్పితే ఆసందర్భం, భాగవత హృదయం రమణీయతను సంతరించుకొంటుందో బాగా తెలిసిన వారు పోతనగారు. శ్రీకృష్ణుని కొరకు వెళ్తున్న మహర్షి పత్నులను పోల్చుటకు ఎంత చక్కని ఉపమానాన్ని ఎన్నుకొన్నారో చూస్తే పోతనగారి అలంకార శిల్పం ఎంత పరిపక్వమైనదో తెలుస్తుంది.

బాలకృష్ణుడు గోపబాలురతో కలసి గోవులను మేపుటకు అడవికి వెళ్ళాడు. మధ్యాహ్నం అయింది. కొందరు గోపబాలురను సమీప ఆశ్రయాలలోని ఋషుల వద్దకు వెళ్ళి తాను తెమ్మన్నట్లుగా చెప్పి భోజనాది ఆహార పదార్థాలను అడిగి తీసుకు రమ్మని పంపించాడు. తాము తపస్వులమన్న గర్వంతో, శ్రీకృష్ణుడు పరమాత్మ అన్న విషయాన్ని గ్రహించలేక ఆహార పదార్థాలు పంపుటకు నిరాకరించగా, గోపబాలురా విషయాన్ని శ్రీకృష్ణునికి విన్నవించారు. ఈ సారి కృష్ణుడు ఋషి పత్నులను అడిగి తీసుకురమ్మని చెప్పగా, అది తెలుసుకొని, ఋషిపత్నులు పరమానంద భరితలై రకరకాల వంటకములు వండి స్వయంగా వాటిని తీసుకొని కృష్ణునికడకు వస్తున్నవారిని పోతన గారు సముద్రంబులకు నడుచు నదుల తెఱంగున ఉన్నట్లు ఉపమించెను. ఎంత లోతైన అర్థమున్న పోలిక యిది. ఎక్కడో పర్వత శ్రేణుల్లో పుట్టిన నదులు ఎన్నో కిలోమీటర్ల దూరం ప్రవర్తిస్తూ, మార్గమధ్యంలో అనేక ఉపనదులను తనలో లీనం చేసుకొంటూ, అనేక మంచి, చెడు వస్తువులను తనలో కలుపుకుంటూ, ఎన్నో ప్రాంతాలను సస్యశ్యామలం చేస్తూ, ఎందరికో జీవనాధారం అవుతూ చివరిగా సముద్రంలో కలుస్తాయి. అంతటితో నదుల గమనం పూర్తిఅయి గమ్యం చేరినట్లు. ఎన్నో వేల జన్మలనెత్తుతూ, పుణ్యపాప కర్మలను ఆచరిస్తూ వచ్చిన జీవాత్మలు పరమాత్మను చేరడంతో వాటి చివరి గమ్యాన్ని చేరి మోక్షాన్ని పొందుతాయి. అట్టి జీవాత్మలే ఋషిపత్నులు. ఎందరికో ఎన్నోరకాల సేవలు చేశారు. ఎందరికో భోజనాదులు వండి పెట్టారు. కాని కృష్ణునికి ఆహారం పెట్టడం ఇంతకాలం చేసిన కర్మలకు సాఫల్యం, తమకు పునర్జన్మలేని గమ్యానికి చేరుకోవడం. కాబట్టి పోతన వారు కృష్ణుని వద్దకు సముద్రంబులకు నడుచు నదుల వలె వెళ్తున్నారని ఉపమించారు. పరిమితత్వం నుండి అనంతత్వానికి చేరుకోవడం ఇందులోని పరమార్థం. అందుకే శ్రీకృష్ణుని సముద్రం వలెను, ఋషిపత్నులను నదుల వలెను పోల్చారు.

*ధరియించి యమ్మునీంద్రుని*

*తరుణీగర్భంబు వలన దనుజారి శమీ*

*తరు కోటరమున వైశ్వా,*

*నరుడుదయించిన విధంబునన్ జనియించెన్.* (భాగ. 3 - 829)

దేవహూతి గర్భమున శ్రీమహావిష్ణువు కపిలాచార్యునిగా అవతరించే సంర్భంలో చెప్పిన పద్యమిది. ఐతే ఇక్కడ విష్ణువును అగ్నితో పోల్చడం జరిగింది. అరణ్యాలలో గాలికి చెట్లకొమ్మలు రాసుకొని అగ్ని పుట్టి ఆ అరణ్యాన్నంతటిని దహించవచ్చు. అయితే చెట్ల కొమ్మల్లో అగ్ని ఉండడం కనిపించదు. కొమ్మలు రాసుకొన్న తరువాతనే వాటిలోని అగ్ని అభివ్యక్తమవుతుంది. ఇక్కడ ఋషిపత్ని అయిన దేవహూతి గర్భంలో కపిలాచార్యుడుదయించడాన్ని పై విధంగా పోల్చడం పోతనగారు అలంకార శిల్పానికి మచ్చుతునక. కపిలుడు పుట్టి, ఎన్నో వేల సంవత్సరాలు తపస్సు చేసిన ఋషులకు కూడా తెలియనంతటి లోతైన జ్ఞానాన్ని తల్లికి ఉపదేశిస్తాడు. కపిలుడు జ్ఞానస్వరూపుడు. అట్టివాడు తన గర్భంలోనే ఉండడమనేది శమీ తరువులో అగ్ని గుప్తంగా ఉండడం వంటిదని పోతనగారు పోల్చారు. జ్ఞానిఐన కపిలుని అగ్నిగాను కపిలుని కన్న దేవహూతిని శమీ తరువు గాను పోల్చడం విశిష్టమైనది. అగ్ని పుట్టి తాను పుట్టిన చెట్టును మిగిలిన అరణ్యాన్నంతా దహించినట్లు జ్ఞాన స్వరూపుడైన కపిలుడు పుట్టి తల్లియొక్క అజ్ఞానాన్ని దహించివేశాడు.

..... *సింహ పరాక్రమంబున, విక్రమించి పోరునెడ హిరణ్యాక్షుండు సవ్యామండలి భ్రమణంబును బరివేష్టించినం బుండరీకాక్షుండు దక్షిణమండల భ్రమణంబునం దేవగిరి విపక్షువక్షం బశనిసంకాశంబగు గదా దండంబునం బగిల్చిన, వాడు దెప్పిఱి తెలివొంది దనుజ పరిపంథి ఫాలంబు నొంచిన, నమ్మేటి వీరులు శోణిత సిక్తాంగులై పుష్పితాశోకంబులన్ బురుణింపుచుం బాయుచు డాయుచు వ్రేయుచు ఱోయుచు నొండొరుల రుధిరంబు లాఘ్రాణింపుచు దిరస్కార పరిహాసోక్తు లిచ్చుచు బోరు సమయంబున ....* (భాగ. 3 - 661)

శ్రీమహావిష్ణువు హిరణ్యాక్షుడు పరస్పరం ఆయుధాలతో భయంకరంగా యుద్ధం చేస్తున్నప్పుడు గాయాలతో, రక్తంతో నిండిన శరీరాలతో ఉన్నవారిని ఎర్రటి పూలతో విరబూసిన అశోక వృక్షాల వలె ఉన్నారనడం పోతన గారు ద్రష్ట అనడానికి చక్కని ఉదాహరణ.

*గజవిభుడుద్ధతిన్ననటి కంబులన్విదళించు లీలఁజి*

*త్తజుఁడు ప్రసూనసాయక వితానము చేత మదీయ చిత్తమున్*

*గజిబిజి చేసి పెన్ వగలఁ గాఱియవెట్టఁగ నాథ! నీ పదాం*

*బుజములఁ గాన వచ్చితిఁ బ్రభుత్వ మెలర్పఁగ నన్నుఁ గావవే!* (భాగ. 3 - 451)

రాక్షసుల జననానికి కారణమైన సందర్భం చెప్తూ పోతనగారు దితి మనస్సులో చెలరేగిన కామాన్ని ఉపమిస్తూ ఏనుగు అరటి చెట్లను విదిలించి వేసినట్లు మన్మథుడు తన మన్మథ బాణాలతో దితి మనస్సుని గజిబిజి చేసినట్లుగా చెప్పారు. ఏనుగు అరటి చెట్లను విదిలించివేస్తే బలహీనంగా ఉన్న కారణంగా అరటి చెట్టు పడిపోతుంది. అప్పటి వరకూ పండిన ఆ అరటి పండ్లు నేలపాలౌతాయి. ప్రస్తుత సందర్భంలో బలవంతుడైన మన్మథుడు బలహీనమైన దితి మనస్సుని చిందరవందర చేస్తున్నాడని అప్పటి వరకూ దితి మనస్సులో ఉన్న సుగుణాలన్నీ తొలగి పోతున్నాయని దీన్ని బట్టి తెలిసింది. మన్మథ బాణాలతో కలచిన మనస్సును ఏనుగుచే విదలింపబడుతున్న అరటి చెట్లతో పోల్చడం ఇక్కడ చక్కగా ఉంది. ఇది రాక్షస జనన కారణం కదా.

## వ్యతిరేకార్థంలో - ఉపమ

సనకాదులతో పృథు చక్రవర్తి భాగవతుల మహిమ ఎలాంటిదో తెలుపుతూ ఇలా అంటాడు.

*వరమతులార! యెవ్వని నివాసముఁ దీర్థపదాంతరంగులై*

*పరఁగిన యట్టి భాగవత పాదజలంబులు సోకవేని త*

*త్పురుషుడు భూరి సంపదలఁ బొంపిరి పోయిననైన వాని మం*

*దిరమురగ ప్రకీర్ణ జగతీజముఁ బోలు నటంచ్రు కోవిదుల్* (భాగ. 4 -612)

సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాతాది ఋషులు తీర్థక్షేత్రములు సేవించినవారు, పుణ్యతీర్థక్షేత్రములకే పావనత్వాన్ని ప్రసాదించు వారు, అన్నిటికి మించి వైకుంఠలోక వాసులు. వారు అడుగు పెట్టని ఇల్లు ఎటువంటిదో చెప్తూ సందర్భంలో పోతన చక్కని ఉపమానం వాడారు.

ఎన్ని సంపదలతో ఇల్లు తులతూగినా గాని తీర్థపాదులు, హృదయమున భగవంతుని నిలుపుకొన్నవారు అడుగుపెట్టకపోతే అది సర్పములతో నిండిన వృక్షమువంటిదని చెప్పాడు. వృక్షము వలన ఎన్నో ప్రయోజనములు ఉన్నాయి కాని సర్పములతో నిండిన వృక్షము వలన ఎవరూ ఎలాంటి ప్రయోజనాన్ని పొందరు. ఆ చెట్టు నిండా ఫలములు ఉంటాయి కాని ఎవరూ తినడానికి సాహసించరు. ఆ చెట్టు నీడనిస్తుంది కాని ఎవరూ ఆ చెట్టు కిందకు రారు. పక్షులు సహితం ఆ చెట్టును ఆశ్రయించవు. అట్లే - సమస్త సంపదలతో తులతూగుతున్నా సరే భాగవతులు అడుగు పెట్టనిచో ఆ ఇల్లు ఎవరూ ఆశ్రయించుటకు పనికిరాదని చెబుతున్నాడు.

భాగవతుని పాదజలములు సోకని ఇల్లు, పాములతో నిండిన వృక్షము వంటిదని చెప్పెను. భాగవతుని పాదజలములు సోకని ఇల్లు అనేది వ్యతిరేకార్థంలో ఉన్న వాక్యం. కావున ఇది వ్యతిరేకార్థంలో ఉన్న ఉపమ.

భక్తుడు పాదం మోపగానే ఇంటిదోషాలన్ని తొలగి సర్వులకు ఆశ్రయయోగ్యం అవుతుందట. భక్తుని మహిమ అలాంటిది.

### పూర్ణోపమ - ఆర్థి

*హరినామ స్తుతి సేయు కావ్యము సువర్ణాంభోజ హంసావళీ*
*సురుచి భ్రాజితమైన మానస సరస్స్ఫూర్తిన్ వెలుంగొందు శ్రీ*
*హరినామ స్తుతిలేని కావ్యము విచిత్రార్థాన్వితంబయ్యు శ్రీ*
*కరమై యుండదయోగ్య దుర్మదనదత్ కాకోల గర్తాకృతిన్* (భాగ. 1 - 94)

పూర్ణోపమలోని ఆర్థిలో ఉపమావాచకాలు సదృశ, నీకాశ, సంకాశ, స్ఫూర్తిన్ వంటివి ఉంటూ, ఉపమానం ద్వారా ఉపమేయ స్వభావం తెలియడం ఉంటుంది.

కావ్యంలో - శ్లేషార్థాలు, గుణములు, అలంకారాలు, ధ్వని వంటివి ఎన్ని ఉన్నా, శ్రీహరి నామ సంకీర్తనము, హరికథా ప్రపంచము లేనప్పుడు, ఆ కావ్యము ఎలాంటి శుభాలను ఇవ్వదు కాగా అది కంపుగొట్టే విషయపు మడుగువంటిదని ఉపమిస్తున్నారు పోతనగారు. ముందుగా 'దుర్మదనదత్ కాకోల గర్తము' ఎంత దుర్భరమైనదో, ఏకొంచెము ఆనందాన్ని కూడా ఇవ్వలేనిదో తెలుస్తుంది. తర్వాత ఆ లక్షణాలే విచిత్రార్థాలున్నా సరే హరినామ స్తుతి లేని కావ్యానికి ఉంటాయని అవగతమవుతుంది. హరినామ స్తుతి లేని కావ్యలక్షణాలు చెప్పకుండా, కాకోల గర్తము యొక్క స్వభావం చెప్పడం ద్వారా ఉపమానమైన కాకోలగర్తము ద్వారా ఉపమేయమైన హరినామ స్తుతిలేని కావ్య లక్షణాలు స్ఫురిస్తాయి. ఉపమా వాచకం కూడా 'ఆకృతిన్' అని ఉంది.

అదే విధంగా ఏ ఇతర కావ్య లక్షణాలు అంతగా లేకున్నాసరే, హరినామ స్తుతి చేసే కావ్యం 'సువర్ణాంభోజ హంసావళీ సురుచి భ్రాజితమైన మానస సరస్స్ఫూర్తిన్ వెలుగొందు' అంటారు పోతనగారు. బంగారు పద్మాలతో, హంసలతో అత్యంత ప్రకాశమానమైన మానస సరోవరం వంటిది - హరినామ స్తుతి చేయు కావ్యమని చెప్పున్నాడు. ఇతర కావ్యలక్షణాలన్నీ హరినామ స్తుతి ఉన్నప్పుడే సార్థకమవుతాయని, కావ్యఫలమైన రసానందానుభవాన్నిస్తాయని తెలుస్తుంది. మానస సరోవరం ఎంత పవిత్రము, ప్రశాంతము, ఆనందదాయకమో ముందు తెలిసిన తరువాత హరినామ స్తుతి సేయు కావ్యలక్షణాలు మనకు స్ఫురిస్తాయి. ఉపమానం ద్వారా ఉపమేయ లక్షణాలు తెలుస్తాయి. కాబట్టి ఇది పూర్ణోపమలోని 'ఆర్థి'కి చెందుతుంది. ఉపమ వాచకం 'స్ఫూర్తిన్' - కూడా ఈ విషయాన్నే స్పష్టపరుస్తుంది.

కావ్యలక్షణాలను చిన్న చూపు చూడడం పోతనగారి ఉద్దేశ్యం కాదు గాని శ్రీహరి లీలలతో మిశ్రితం కానప్పుడు అవి భౌద్ధిక ఆనందాన్నివ్వగలవే గాని, బ్రహ్మానందాన్నివ్వలేవనేది పోతనగారి భావం. వేదవ్యాస భగవానుడు వేదాలను విభజించి, అనేక పురాణాలను రచించి, పంచమ వేదమనదగిన భారతాన్ని వ్రాసి కూడా మనస్తాపాన్ని చల్లార్చుకోలేనప్పుడు నారదుని సూచన మేరకు శ్రీకృష్ణుని లీలార్ణవమైన భాగవతాన్ని చెప్పి బ్రహ్మానందాన్ని పొందాడు. సాక్షాత్తు శ్రీరాముడే ప్రత్యక్షమై పోతన గారితో 'మన్నామాంకితంబుగా శ్రీమహాభాగవతంబుఁ దెనుఁగు సేయుము నీకు భవబంధంబులు దెగునని ' (భాగ. 1 - 15) చెప్పాడు. భవబంధములు త్రెంపునంతటి శక్తిమంతమైనది భాగవతం. కారణం అది హరిలీలావర్ణన భరితమగుటయే.

ఆంధ్రభాగవతం అందరికీ రుచించాడానికి కారణం, ఇతర కావ్య లక్షణాలకన్నా 'హరికథ' యే ముఖ్యమని పోతనగారు తానెంతగా చెప్పుకొన్నా, అనితర సాధ్యమైన అలంకార ధ్వన్యాది కావ్యలక్షణాలతో వెలుగొందడమే.

*.... గోవిందుఁడి*
*ప్పించెన్‌రాజ్యము ధర్మపుత్రునకుఁ గల్పించెన్ మహాఖ్యాతిఁ జే*

*యించెన్ మూఁడు తురంగమేధములు దేవేంద్రప్రభావంబునన్* (భాగ. 1-175)

ఉపమానమైన దేవేంద్రుని వైభవమేమిటో పాఠకుడు ఊహించుకున్న తరువాతనే ఉపమేయమైన ధర్మరాజు వైభవం తెలుస్తుంది. కావున ఇది పూర్ణోపమలోని ఆర్థికి చెందును.

అత్రి మహాముని తపస్సుకు బ్రహ్మవిష్ణుమహేశ్వరులు ప్రత్యక్షమైరి.

*...అమ్మువ్వురు విబుధశ్రేష్ఠులు నతనిం గనుంగొని సుధామాధుర్య సమయంబులైన వాక్యంబుల నిట్లనిరి.* (భాగ. 4 - 19 )

త్రిమూర్తుల మాటల స్వభావము చెప్పకుండా, అవి 'సుధామాధుర్య సమంబులు' అని చెప్పడం ద్వారా ఉపమానమైన అమృత మాధుర్యాన్ని ముందు తెలుసుకున్న తరువాతనే ఉపమేయమైన త్రిమూర్తుల మాటలు అలాంటివని ఊహించుకోవలసి ఉంది. ఉపమానం వలన ఉపమేయ లక్షణం బోధపడుతుంది. కావున ఇది పూర్ణోపమలోని ఆర్థి. త్రిమూర్తుల మాటలు ఎంత తీయగా ఉన్నాయన్నది ఇప్పుడు తెస్తుంది.

## సర్వవస్తు విషయోపమ

ఉపమేయోపమానాల అవయవి, అవయవముల కన్నింటికీ సామ్యము నిరూపింపబడినచో అది సర్వవస్తువిషయోపమ.

*రాజీవాక్షునిచే నొక*
*రాజీవము భంగి శైలరాజము మెఱసెన్*
*రాజేంద్ర! మీఁద మధుకర*
*రాజిక్రియ మేఘరాజి రాజిల్లెఁ గడున్* (భాగ. 10. పూర్వ - 921)

ప్రతిసంవత్సరము నందాదులు ఇంద్రునికి పూజ చేస్తుండగా కృష్ణుడు దానిని మాన్పించి వారిచేత గోవర్ధన పర్వతానికి పూజ చేయించగా కోపించిన ఇంద్రుడు మేఘాలను ఆజ్ఞాపించగా అవి భయంకరంగా కురవసాగాయి. అప్పుడు కృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని పైకెత్తి ఒంటి చేతిపై నిలిపి గోపాలురను, గోవులను కొండక్రిందికి రప్పించుకొన్న సందర్భమిది.

కృష్ణుడు పైకెత్తిన పర్వతం పైన నల్లని మేఘాలు గుంపులు గుంపులుగా అలుముకున్నాయి. దానిని ఉపమిస్తూ పోతన గారు పద్మముపై తుమ్మెదలు వ్రాలినట్లుగా ఉందని వర్ణించెను. పర్వతము, దానిని ఆవహించిన మేఘాలు ఉపమేయం కాగా పద్మము తుమ్మెదలు ఉపమానం ఇక్కడ ఉపమేయ ఉపమానాల రెండింటిలోని అంశాలు అవయవి, అవయవసంబంధాన్ని కలిగి ఉన్నాయి. కావున ఇది సర్వవస్తు విషయోపమ మేఘాలు ఆవహించిన పద్మాన్ని ఊహించుకున్న పోతన హృదయంలో మరొక దృశ్యం సాక్షాత్కరించింది. అదే తుమ్మెదలు వాలిన పద్మం. ఒక పెద్ద దృశ్యం చిన్న దృశ్యాన్ని దర్శించేలా చేసింది.

*మక్కువ వికసిత వదనలు*
*చక్కఁగఁ దనుఁ గొల్వహాసచంద్రిక తోడన్*
*మిక్కిలి మెఱసెను గృష్ణుడు*
*చుక్కల గమి నడిమి పూర్ణసోముని భంగిన్* (భాగ. 10. పూర్వ - 1002 )

శరద్రాత్రి గోపికలు తన వద్దకు రాగా కృష్ణుడు వారలతో కూడి రాసక్రీడలాడిన సందర్భంలో పోతనగారు ఈ అలంకారాన్ని వాడారు. అది రాత్రి. అందునా శరద్రాత్రి. పైన ఆకాశంలో చంద్రుడు, చుక్కలు ప్రకాశిస్తున్నాయి. పండువెన్నెల కాస్తున్నది. క్రింద శ్రీకృష్ణుడు, గోపికలు పరమానందంతో వివశులై రాసక్రీడలో మునిగి ఉన్నారు. పోతన ఉపమానం సందర్భోచితంగా ఉంది. ఇక్కడ పోతన అలంకార శిల్పదృష్టి తెలుస్తుంది. ఉపమానం ఏదో భయంకరమైనది కాకుండా ఆహ్లాదకరమైనది ఎన్నుకున్నాడు. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. కృష్ణుడు, గోపికలు ఆహ్లాదకరంగా ఉన్నారు. ఉపమానం కూడా చల్లని, ఆహ్లాదకరమైనదై ఉంది.

గోపికా సమూహం మధ్యలో కృష్ణుడు చుక్కల సమూహం మధ్య పూర్ణచంద్రునివలె మిక్కిలిగా మెఱిసెనట. ఇక్కడ కృష్ణుని నవ్వు వెన్నెల వలె ఉందట.

ఉపమేయం - గోపికలు, కృష్ణుడు, నవ్వు

ఉపమానం - చుక్కలు, పూర్ణచంద్రుడు, వెన్నెల

ఉపమేయోపమానాల అవయవి, అవయావాల మధ్య సామ్యం చక్కగా నిరూపింపబడింది గావున ఇది సర్వవస్తు విషయోపమ. అట్లే-

*జలజాంతస్థిత కర్ణికం దిరిగిరా సంఘంబులై యున్న రే*

*కుల చందంబునఁ గృష్ణునిం దిరిగిరాఁ గూర్చుండి వీక్షింపుచున్ ....*

*... భుజించరచటన్ గోపార్భకుల్ భూవరా!* (భాగ. 10. పూర్వ - 493)

మధ్యలో కృష్ణుడు, అతని చుట్టూ గోపాలురు కూర్చొని చల్దులారగించునపుడు వారు పద్మము కర్ణిక చుట్టూ ఉన్న రేకులవలె ఉన్నారట. ఎంత చక్కని ఉపమానం. గోపాలురందరికీ ఆధారం కృష్ణుడే అని దీని వలన తెలుస్తుంది.

*మిక్కిలి విజ్ఞానంబునఁ*

*జక్కగ దిగవిడచి వైరి షడ్వర్గంబున్*

*రెక్కలు వచ్చిన విహగము*

*గ్రక్కున నీడంబు విడచు కరణినుదితుడై* (భాగ. 9-587)

యయాతి, దేవయాని, శర్మిష్ఠలతో సుఖాలనుభవిస్తూ శుక్రాచార్యుని శాపవశమున వృద్ధాప్యాన్ని పొంది, మరల కొడుకు ద్వారా యవ్వనాన్ని పొంది అనేక సంవత్సరాలు భోగాలు అనుభవించిన మీదట ఆ సుఖాలపై విరక్తి చెంది, యవ్వనాన్ని కొడుక్కిచ్చి తాను వృద్ధాప్యాన్ని గైకొని, రాజ్యాన్ని పంచిఇచ్చి, తాను అడవులకు వెళ్ళు సందర్భంలో తన వైరాగ్యాన్ని తెలిపే పద్యమిది. విజ్ఞానమేర్పడగానే కామ, క్రోధాది అరిషడ్వర్గాలను విడచిన యయాతి, రెక్కలు రాగానే గూటిని విడచి ఎగిరిపోయే పక్షితో ఉపమించడం అద్భుతంగా ఉంది. అవయవి, అవయవ సంబంధముండుటచే ఇది సర్వవస్తు విషయోపమ.

వామనుడు బలిచక్రవర్తితో పలికిన పలుకు -

*......... మీకులంబు నందు మెఱయు బ్రహ్లాదుండు*

*మింటి చంద్రుమాడ్కి మేలి రుచుల*

*బ్రథిత కీర్తితోడ భవదీయ వంశంబు*

*నీరరాశి భంగినెగడుచుండు* (భాగ. 8-554)

ఆకాశంలో చంద్రుడి లాగా ప్రహ్లాదుడు మెరుస్తున్నాడు. కావున మీ వంశము సముద్రము వలె కీర్తిని పొందుతుందని వామనుడు అంటున్నాడు.

ప్రహ్లాదుడు చంద్రుడు లాంటి వాడు కాబట్టి, అతడు పుట్టిన రాక్షస వంశం సముద్రమువంటిదైంది. ఎందుకంటే చంద్రుడు పుట్టింది సముద్రం నుండే. సముద్రము నుండి చంద్రుడు పుట్టినట్లు, రాక్షస వంశం నుండి ప్రహ్లాదుడు పుట్టాడని పోతనగారు ఉపమించారు.

అట్లే క్రింది పద్యం సర్వవస్తువిషయోపమకు చెందిందే -

*తన్నుం జంపెదనంచు వచ్చు విజయుం దర్శించి తద్ద్రౌణి యా*

*పన్నుండై శిశుహంత గావున నిజప్రాణేచ్ఛఁ బాఱెన్ వడిన్*

*మున్నా బ్రహ్మమృగాకృతిం దనయకున్ మోహించి క్రీడింప నా*

*సన్నుండౌ హరుఁజూచి పాఱు పగిదిన్ సర్వేంద్రియ భ్రాంతితోన్* (భాగ. 1 - 144)

ఉపమేయం - శిశువులను చంపిన అశ్వత్థామ, అర్జునుని జూచి పారిపోవుట. ఉపమానము - తనయను మోహించిన బ్రహ్మ శివుని చూచి పారిపోవుట. అవయవి, అవయవ సంబంధముండుటచే ఇది సర్వవస్తు విషయోపమ.

## ఏకదేశవివర్తి ఉపమ

ఉపమేయోపమానాల అవయవి, అవయములలోని ఏదైనా ఒక అంశం చెప్పబడి, మరియొక అంశము చెప్పబడకుండా గమ్యముగా ఉండెనేని అది ఏకదేశవివర్తి ఉపమగా చెప్పవచ్చు.

కురుక్షేత్ర యుద్ధానంతరం పాండవుల వంశాన్ని నిర్మూలించదలచి అశ్వత్థామ, బాలురైన ఉపపాండవులను నిద్రలో ఉండగా చంపుతాడు, తరువాత ఉత్తర గర్భమున పెరుగుతున్న శిశువును చంపగోరి బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగిస్తాడు. దానికి ప్రతిగా అర్జునుడు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగిస్తాడు. శ్రీకృష్ణుని సలహా మేరకు అర్జునుడు రెండింటిని ఉపసంహరించి, అశ్వత్థామను పట్టుకొనిపోయే సందర్భంలో-

*ఇట్లస్త్రద్వయంబు నుపసంహరించి ధనంజయుడు ద్రోణనందనుంగూడ నరిగి తఱిమి పట్టుకొని రోషారుణిత లోచనుండై*

*యాజ్ఞికుండు రజ్జువునంబశువుం గట్టిన చందంబున బంధించి శిబిరంబు కడకుం గొని చని హింసింతునని తిగిచినన్ ...*
(భాగ. 1-152)

అర్జునుడు, అశ్వత్థామను బంధించి, శిబిరం దగ్గరకు లాగుకొనిపోయడు, యాజ్ఞికుడు పశువును రజ్జువుతో బంధించినట్లు.

ఉపమేయం - 1. అర్జునుడు, 2. అశ్వత్థామ, 3............... 4. బంధించుట, 5. శిబిరంబుకడకు, 6. హింసించుటకు,

ఉపమానం - 1. యాజ్ఞినికుడు, 2. పశువు, 3. రజ్జువు, 4. కట్టుట. 5. ..................... 6. ..................

ప్రకృతానికి సంబంధించిన కొన్ని అంశాలను చెప్పి మరికొన్ని చెప్పకుండా, వాటిని అప్రకృతంలోని అంశాల ద్వారా గమ్యమానమగునట్లుగా చేయుట, అట్లే ప్రకృతానికి సంబంధించిన కొన్ని అంశాల ద్వారా, అప్రకృతానికి చెందిన కొన్ని గమ్యమానం అగుట ఈ లక్ష్యంలో చూస్తాం. ఉపమేయంలో - అర్జునుడు, అశ్వత్థామను దేనితో బంధించాడో చెప్పబడలేదు. కాని ఉపమానంలో పశువును రజ్జువుతో కట్టినట్లు చెప్పబడెను. కాబట్టి అశ్వత్థామను కూడా రజ్జువుతో బంధించిన విషయం ఉపమానం ద్వారా గమ్యమానం అవుతుంది.

ఉపమేయంలోని - అశ్వత్థామను శిబిరము కడకు, హింసించుటకు తీసుకొని పోతున్నట్లుగా చెప్పి, ఉపమానం లోని పశువును ఎక్కడికి? ఎందుకు? తీసుకొని వెళ్తున్నాడో చెప్పలేదు. వీటిని ఉపమేయంలోని - 'శిబిరము కడకు', 'హింసించుటకు' అని మాటలను బట్టి ఉపమానంలోని పశువును యాజ్ఞికుడు, యజ్ఞశాల కడకు, వధించుటకు అనే విషయాలు ప్రతీయ మానమవుతున్నాయి.

ఉపమేయంలోని కొన్నింటిని వాచ్యంగాను, కొన్నింటిని ప్రతీయమానంగాను, అట్లే ఉపమానంలోని కొన్నిటిని వాచ్యంగాను, కొన్నిటిని ప్రతీయమానంగాను చెప్పడం ఏకదేశవివర్తి ఉపమలో చూస్తాం.

## మాలోపమ

ఒక ఉపమేయానికి, రెండుగాని, అంతకంటే ఎక్కువగాని ఉపమానాలు ప్రయోగించుట మాలోపమ.

శ్రీనరసింహస్వామి నఖములు హిరణ్యకశపుని చంపునపుడు ఎన్నివిధములుగా ప్రకాశించినవో చెప్పు సందర్భంలో పోతనగారు మాలోపమును కల్పించారు.

*వక్షః కవాటంబు వ్రక్కలు సేయుచో*
*ఘనకుఠారంబుల కరణినొప్పు*
*గంభీర హృదయ పంకజము భేదించుచోఁ*
*గుద్దాలముల భంగి కొమరు మిగులు*
*ధమనీవితానంబుఁ దగిలి ఖండించుచోఁ*
*బటులవిత్రంబుల పగది మెఱయు*
*జఠర విశాలాంత్రజాలంబుఁ ద్రెంచుచోఁ*
*గ్రకచ సంఘంబుల గరిమఁ జూపు*
*నంక గతుడైన దైత్యుని ఆగ్రహమున*
*శస్త్ర చయములనొంపక సంహరించి*
*యమరు నరసింహ నఖరంబు లతివిచిత్ర*
*సమరముఖంబులైయుండె జనవరేణ్య* (భాగ. 7 - 297)

హిరణ్యకశపుడు బ్రహ్మదేవుని వలన అనేక వరాలు పొందాడు. వాటిలో ఒకటి ఆయుధము వలన తన ప్రాణము పోకుండుట. నరసింహస్వామి, హిరణ్యకశిపుని చంపునపుడు బ్రహ్మ ఇచ్చిన వరాలకు భంగం కలగకుండా జాగ్రత్త పడ్డాడు. ఆయుధములు వాడకూడదు కాబట్టి, తన నఖములతోనే ఆ రాక్షసుని చంపాడు. అయితే ఒక్కొక్క ఆయుధం ఒక్కొక్క పనికి ఉపయోగ పడుతుంది. కావున నరసింహస్వామి నఖములు, హిరణ్యకశిపుని ఒక్కొక్క శరీర అవయవ భాగాన్నిచీల్చునపుడు ఒక్కొక్క ఆయుధము వలె పనిచేశాయి.

శ్రీనరసింహస్వామి -

1. హిరణ్యకశిపుని వక్షస్థలాన్ని బ్రద్దలు చేయునపుడు గొడ్డళ్ళవలె,

2. గుండెను భేదించునపుడు గునపం వలె,

3. రక్తనాళములను త్రెంచునపుడు కొడవళ్ళవలె,

4. జీర్ణాశయాన్ని త్రెంచునపుడు క్రకచముల (అంపముల) వలె పనిచేశాయని చెప్పడంలో ఉపమేయం శ్రీనరసింహస్వామి నఖములు ఉపమానాలు - 1. గొడ్డళ్ళు, 2. గునపములు, 3. కొడవళ్ళు, 4. క్రకచములు. కావున ఇది మాలోపమ. ఈ సందర్భంలో మాలోప ప్రయోగించుట పోతన శిల్పదృష్టికి తార్కాణం. తద్వారానే నరసింహస్వామి ఆగ్రహం, వారి నఖముల తీక్షణత అవగతమవుతాయి.

*ఇట్లు మేఘమధ్యంబు వెలువడి విలసించు క్రొక్కారు మెఱుంగు తెఱంగున, మృగ ధరమండలంబు నిర్గమించి చరించు మృగంబు చందంబునఁ గమలభవ నర్తకుండెత్తిన జవనిక మఱుఁగు దెరలి పొడసూపిన మోహినీ దేవత కైవడి దేవ దానవ సంఘాత కరతల సవ్యాపసవ్య సమాకృష్యమాణ పన్నగేంద్రపాశ పరివిలయిత పర్యాయ పరిభ్రాంత మందరాచల మంథాన మథ్యమాన ఘూర్ణిత ఘుమఘుమాయిత మహార్ణవ మధ్యంబున నుండి చనుదెంచు నిందిరాసుందరి వైభవంబున బహువిధ ప్రభాభాసమాన యై, యిందు ధర సుందరీ మందిరంబు వెడలి.* (భాగ. 10. పూర్వ - 1744)

పెళ్ళికూతురుగా తయారైన రుక్మిణి గౌరీదేవి ఆలయము నుండి బయటకు వస్తున్నపుడు మేఘాల మధ్యనుండి వెలువడుతున్న మెరుపుతీగ వలె, మృగధర మండలము నుంచి బయటకు వస్తున్న లేడి వలె, బ్రహ్మనర్తకుడు ఎత్తిన తెరచాటు నుండి వస్తున్న మోహినీ దేవతవలె, పాలసముద్రము నుండి బయటికి వస్తున్నలక్ష్మీదేవి వలె ఉన్నదని చెప్పడం ద్వారా ఇది మాలోపమ. దీనిని బట్టి రుక్మిణీదేవి ఎంత సౌందర్యవతియో చెప్పకనే చెప్పినట్లయినది.

భీమజరాసంధుల యుద్ధాన్ని వర్ణిస్తూ పోతన గారు ఇలా అన్నారు -

*పర్వత ద్వంద్వంబు పాథోదధియుగళంబు*
*మృగపతి ద్వితయంబు వృషభయుగము*
*పావక ద్వయము దంతావళ యుగళంబు*
*దలపడు వీఁకనుద్దండలీల* (భాగ. 10. ఉత్తర - 729)

భీముడు జరాసంధుడు యుద్ధం చేస్తున్నప్పుడు రెండు పర్వతాలు, రెండు సముద్రాలు, రెండు సింహాలు, రెండు వృషభాలు, రెండు అగ్ని జ్వాలలు, రెండు ఏనుగులు భయంకరంగా పోరాడుతున్నట్లు ఉందని చెప్పడం పోతన గారి శిల్పదృష్టికి తార్కాణం. మహాయోధులైన ఇద్దరు పోరాడటాన్ని ఆరు ఉపమానాలతో చెప్పడం, అదీ రెండు పర్వతాలు, రెండు సముద్రాలు అంటూ జంటలు జంటలుగా చెప్పడం వారిద్దరు సమబలం కలిగిన వారని ఎవరికీ ఎవరు తీసిపోరని తెలుస్తుంది. ఏ కథా సందర్భంలో ఏ అలంకారం వాడాలో, వాడే అలంకారంలో ఏ ఉపమానాన్ని ఎన్నుకోవాలో అనేది శిల్పంగా పరిగణింపబడుతుంది. ఈ పద్యంలోని అలంకారం, ఉపమానాలు పోతనగారి శిల్పదృష్టిని ఆవిష్కరిస్తున్నాయి. భీమ జరాసంధులు ఇద్దరు పోరాడు తున్న దృశ్యం ఊహించుకోగానే పోతన మదిలో రెండు పర్వతాలు, రెండు సింహాలు, రెండు వృషభాలు ....రెండు ఏనుగులు, ... పోట్లాడుతున్న విషయాలు ఒక్కొక్కటిగా పోతన గారి మదిలో స్ఫురించాయన్నమాట.

## ఉపమా పరంపర

ఉపమాలంకారాలను వరుసగా అనేకం వాడడాన్ని ఉపమ పరంపర అంటారు.

*మెఱుఁగు చెంగట నున్న మేఘంబు కైవడి*
*నువిద చెంగట నుండనొప్పువాఁడు*
*చంద్రమండల సుధాసారంబు పోలిక*
*ముఖమునఁ జిఱునవ్వు మొలచువాఁడు*
*వల్లీయుతతమాల వసుమతీజము భంగి*
*బలు విల్లు మూఁపునఁ బరఁగువాఁడు*
*నీలనగాగ్రసన్నిహిత భానుని భంగి*
*ఘన కిరీటము దలఁగల్గువాఁడు*
*పుండరీక యుగముఁబోలు కన్నులవాఁడు*
*వెడఁద యురము వాఁడు విపుల భద్ర*

*మూర్తివాఁడు రాజముఖ్యుఁడొక్కరుఁడునా*
*కన్నుఁగవకు నెదురఁగానఁబడియె* (భాగ. 1-14)

పై పద్యంలో నాలుగు ఉపమాలంకారాలతో ఒక రూపాన్ని వర్ణించడం జరిగింది. కావున దానిని ఉపమా పరంపర అంటారు.

పోతనగారు మహేశ్వర ధ్యానం చేయునపుడు ఒక రాజ శ్రేష్ఠుడు తన కళ్ళకు కనిపించాడు. అతడే శ్రీరాముడు. ఆ శ్రీరాముడు మెరుపు తీగ ప్రక్క మేఘము ఉన్నట్లుగా సీతాదేవి ప్రక్క నిలుచొని ఉన్నాడు. చంద్రమండలంలోని అమృత సారం వలె చిరునవ్వులు చిందిస్తున్నాడు. వృక్షానికి చుట్టుకొన్న తమాల వల్లరి వలె మూపున కోదండు కలవాడు. నల్లని పర్వత శిఖరం మీద సూర్యుడున్నట్లు తన తలపై కిరీటం కలవాడు అంటూ శ్రీరాముని రూపాన్ని వరుసగా నాలుగు ఉపమలతో తనివితీరా వర్ణించాడు.

## హీనోపమ/నీచోపమ

సాధారణంగా ఉపమేయం కన్నా ఉపమానం గొప్పదై, విశిష్టమైనదై ఉంటుంది. దీనిని ప్రశంసోపమ అంటారు. ఉపమాలంకారాలలో చాలా ప్రశంసోపమలే. కాని అరుదుగా ఉపమేయం కన్నా ఉపమానం హీనంగా ఉంటుంది. దీనినే హీనోపమ లేదా నీచోపమ లేదా నిందోపమ అని అంటారు.

బదరికాశ్రమంలో నరనారాయణులు తపస్సు చేయునపుడు, ఇంద్రుడు తన ఇంద్రపదవికి ముప్పురానున్నదని పొరపాటుగా భావించుకొని, వారికి తపోభంగము కావింపుమని అప్సరసలను పంపగా ఆ అప్సరసలు తపో భంగము చేయుటకు సర్వ ప్రయత్నములు చేయుచుండగా నారాయణుడు తన ఊరువు నుండి అత్యంత సౌందర్యవతి యైన స్త్రీని (ఊర్వశిని) ఉద్భవింప జేయగా, ఆమె అందము ముందు మిగిలిన అప్సరసల అందం స్వల్పమని భావించుకొని, వారంతా ఊర్వశిని తమ నాయకురాలిగా చేసుకొని తిరిగి వెళ్ళారు.

*అంతం దాము నరనారాయణుల తపోవిఘ్నంబు గావింప బూనిసేయు విలాసంబులు (మానసిక సంకల్ప మాత్రంబున సృష్టి స్థితి సంహారంబు లొనర్పంజాలు) నమ్మహాత్ముల దెసం బనికి రాక కృతఘ్నునకుం జేయు నుపకృతులు బోలె నిష్ఫలంబులైన సిగ్గునం గందుచు నూర్వశిం తమకు ముఖ్యురాలిగాఁ గైకొని తమ వచ్చిన జాడనే మఱలిరంత.* (భాగ. 2-133)

నరనారాయణుల తపస్సు భంగపరచాలనే అప్సరసల ప్రయత్నాలు కృతఘ్నునకు చేసిన ఉపకారముల వలె నిష్ఫలములైనవి.

ఉపమేయం సాక్షాత్తు భగవత్స్వరూపులైననరనారాయణులు, అప్సరసలు తపోభంగ ప్రయత్నాలు.

ఉపమానం - కృతఘ్నునికి (చేసిన ఉపకారము మరిచే వానికి) చేసే ఉపకారములు

సాక్షాత్తు నరనారాయణుల విషయంలో అప్సరసలు చేసిన ప్రయత్నాలను ఒక స్వల్పమైన కృతఘ్నుని విషయంలో చేసిన ఉపకారాలతో పోల్చడం చూస్తే ఉపమేయం కన్నా ఉపమానం హీనంగా ఉంది. కావున ఇది హీనోపమ/ నీచోపమ.

*సురాసుర యూథంబు............ అమందగతిఁ బెరుగుఁ ద్రచ్చుమందగొల్లల చందంబున మహార్ణవ మధ్యంబున మంథాయ మాన మందర మహీధర విలగ్న భోగిభోగాద్యంతంబులందెమల్పుచుఁ బెనుబొబ్బలం బ్రహ్మాండ కటాహంబు నిర్భరంబై గుబ్బ గుబ్బని యురల .....* (భాగ. 8-208)

అతి విస్తారము, లోతుగల పాల సముద్రాన్ని మంథర పర్వతంతో, వాసుకి సర్పాధారంతో, విష్ణువే తాబేలుగా మరి పర్వతాన్ని ఎత్తిపట్టగా, వేలు, లక్షల సంఖ్యలో అతి బలవంతులు అనంత శక్తులు గల దేవదానవులు మధించుచుండగా దాన్ని కేవలం మందగొల్లలు పెరగు చిలకడంతో పోల్చడం హీనోపమ అవుతుంది. ఉపమేయం కన్నా ఉపమానం హీనంగా/ నీచంగా ఉండడమే కారణం.

## కల్పితోపమ

ఒక వస్తువుకు సహజంగా లేని ఒక లక్షణాన్ని కల్పించి, (ఉన్నట్లుగా ఊహించుకొని) ఆ వస్తువును ఉపమానంగా గ్రహిస్తే అటువంటి ఉపమను కల్పితోపమ అంటారు.

బలిచక్రవర్తి యజ్ఞవాటికకు వచ్చిన బాలబ్రాహ్మణుడు, మెడలో తులసి మాలలు, ఒకచేత కమండలం, ఒకచేత తాటాకు

గొడుగు ధరించి చిట్టిపొట్టి అడుగులు వేస్తూవచ్చిన వామనుని పోతనగారు ఉపమిస్తూ -

*... కరచరణాద్యవయవంబులు ధరించిన వేదరాశియునుంబోలె ....* (భాగ. 8-546)

వామనుడు ఉన్నాడనటం పోతన గారి ప్రబల ఊహాశక్తికి నిదర్శనం.

వేదమంత్రాలతో మారుమ్రోగుతున్న యజ్ఞవాటికకు, వేదాలు పరమ లక్ష్యంగా చెప్పే శ్రీమన్నారాయణుడే వామనుని రూపంలో వచ్చాడు. అతడు ఎలా ఉన్నాడు?'వేదరాశి' కి చేతులు, కాళ్ళు వంటి అవయవాలన్నీ వస్తే ఎలా ఉంటుందో అలా ఉన్నాడట. పోతనగారి అనల్ప కల్పనాశక్తి ఎంతటిదో? వేదమనేది ఒక పుస్తకం కాదు. తపోనిష్ఠులు 'సమాధి' స్థితిలో అనుభవంలోనికి తెచ్చుకొన్న, దర్శించిన సత్యజ్ఞాన భావజాలం. ఆ జ్ఞానం నిరాకారం, నిర్గుణం, నిరుపాధికం. అటువంటి జ్ఞానాన్ని సాకారుడైన వామనునితో పోల్చుటకు పొసగదు. ఆ వేదజ్ఞానం ఒక రూపాన్ని ధరించదు. ధరించడం దానికి అసహజం, ధరించే అవకాశం కూడా లేదు. కాని ఒక వేళ ధరిస్తే (ధరించిందని ఊహించుకొంటే) దానిలాగ బాలుడైన వామనుడు ఉన్నాడట. వామనుడు వేదస్వరూడని, వేదాలకు లక్ష్యప్రాయమైన పరమాత్మ అని పరోక్షంగా పోతనగారు చెప్పినట్లయింది.

*శ్రీకృష్ణుడు ఉద్ధవునితో కలిసి కుబ్జగృహానికి వెళ్ళినపుడు కుబ్జ -*

*'మెలగి యాడనేర్పు మెఱుగువోలె'* (భాగ. 10. పూర్వ -1486) ఉందంటాడు పోతన.

మెరుపు తీగ చక్కగా అటుఇటు కదలాడు తుంటే, చక్కగా నృత్యం చేస్తుంటే ఎలా ఉంటుందో కుబ్జ అలా ఉన్నదట. మెరుపుతీగకు అసహజమైన ఒక లక్షణాన్ని కల్పించి, ఉపమానంగా స్వీకరించబడడం వలన ఇది కల్పితోపమ.

*.... అవిద్యయనంబడుచున్న మాయయెప్పుడు విద్యారూపంబునం బరిణత యగు నప్పుడు జీవోపాధియైన స్థూల సూక్ష్మ రూపము దహించి, కాష్ఠంబు లేక తేజరిల్లు వహ్ని చందంబునఁ దాన యుపరతయగు అపుడు జీవుండు బ్రహ్మస్వరూపుండై పరమానందంబున విరాజమానుండగు.* (భాగ. 1-65)

మాయ అవిద్యారూపం నుండి, విద్యారూపానికి పరిణమిస్తే జీవుని సూక్ష్మ స్థూల శరీరాలు కాష్ఠంబులేక తేజరిల్లు. అగ్నిలాగ తమంత తామే దహించుకుపోతాయట. కాష్ఠము లేకుండా మంట మండదు. కాష్ఠం లేకుండా మంటమండడం లాంటిది మాయాతత్త్వం. ఈ అసహజ లక్షణంచే ఇది కల్పితోపమ.

కుమారుడైన కపిలాచార్యుని వలన జ్ఞానోపదేశం పొందినవాడై కర్దముడు మనస్సులోని వికారములన్నీ తొలగించుకొంటాడు. అప్పుడతడు

*విస్తరంగంబగు వార్ధి చందంబున ధీరుండై....* (భాగ. 3-857)

దేహత్యాగం చేస్తాడు. తరంగాలు లేకపోవడం సముద్రానికి అసహజం. లేని లక్షణం కల్పించడం వలన ఇది కల్పితోపమ.

## సదృశోపమ

ఒక వస్తువు (ఉపమేయం)ను పోల్చడానికి నిర్దిష్టమైన ఒక వస్తువు (ఉపమానం) మాత్రమే తగును. ఏ ఇతర వస్తువు తగదు అని చెప్తే అది సదృశోపమ అవుతుంది.

గమనిక: పోతన భాగవతంలో 'సదృశోపమ'కు తగిన ఉదాహరణలు లేని కారణంగా వివరించడం లేదు.

## కించిత్ సదృశోపమ

సాదృశ్యము సమాసంలో ఇముడ్చబడితే కించిత్ సదృశోపమ. దీనిలో ఉపమా వాచకం లోపిస్తుంది. (సమాసగత ం అవుతుంది.)

***జోజో కమలదళేక్షణ!***
***జోజో మృగరాజమధ్య! జోజో కృష్ణా!***
***జోజో పల్లవ కరపద!***
***జోజో పూర్ణేందువదన జోజో యనుచున్*** (భాగ. 10. పూర్వ - 189)

అప్పుడే పుట్టిన శ్రీకృష్ణుని స్నానం చేయించి, ఊయలలో పరుండబెట్టి, చతుర్దశ భువన మోహనమైన సౌందర్యాన్ని

తిలకిస్తూ వ్రేపల్లెగోపికలు ఆనందంతో జోలపాట పాడుతున్నారు.

కృష్ణున్ని, కమలదళేక్షణ! మృగరాజమధ్య!పల్లవ కరపద! పూర్ణేందువదన అంటూ పాడుతున్నారు.

కమలదళముల వంటి కన్నులు (చూపులు), సింహము నడుము వంటి నడుము, లేత చిగుళ్ళవంటి చేతులు, పాదాలు పున్నమి నాటి చంద్రుని వంటి ముఖం కృష్ణునికి కలదని వర్ణిస్తున్నారు. అయితే ఈ పద్యంలో ఉపమా వాచకము సమాస గతమై లోపించింది. కావున ఇది కించిత్ సదృశోపమ.

### *రశనోపమ*

పూర్వవాక్యంలో ఉపమేయంగా ఉన్నది తరువాత వాక్యంలో ఉపమానంగా (లేదా) పూర్వవాక్యంలో ఉపమానంగా ఉన్నది తరువాత వాక్యంలో ఉపమేయంగా ఉంటే అది రశనోపమ.

పోతన గారు శరదృతువును వర్ణిస్తూ

**.... *జీవనంబుల విడచి విమల జ్ఞాన వంశంబున ముక్తులగు పురుష రత్నంబుల చెన్నున జన్ను వదలి మిన్ను విడచి వాయు వశంబులై, వెల్లి విరిసి చనుమేఘంబులును, మేఘపటల రహితంబును, కలశభవముని సహితంబునునై, విజ్ఞానదీప విలసితంబగు యోగి హృదయంబు చందంబున శుభ్రంబైన అభ్రంబును, నభ్రంబున నీలదుకూల వితాన సంయుక్త ముక్తాఫలంబుల వడుపున నెగడు నుడు గణంబులును, నుడుగణమయూఖంబు క్రొవ్వులువ్వెత్తుగొని నివ్వటిల్లుచు బ్రహ్మాండ కరండ కర్పూర కండాయ మానంబులగు చంద్రకిరణంబులును, చంద్రకిరణ సంస్పర్శనంబున....*** (భాగ. 10. పూర్వ - 763)

పై ఉదాహరణలో ఒక వాక్యంలో ఉపమానంగా ఉన్న పదం, తరువాత వాక్యంలో ఉపమేయంగా ఉంది. కావున ఇది రశనోపమ. పై లక్ష్యములతో పూర్ణోపమ పూర్తి అయినది. ఇక లుప్తోపమ చూద్దాం.

### లుప్తోపమ

ఉపమేయం, ఉపమానం, సమానధర్మం, ఉపమావాచకములలో ఏదేని ఒకటి గాని, ఏవైనా రెండుగాని, మూడు గాని లోపించుట లుప్తోపమలో ఉంటుంది.

**ఉపమానలుప్త - ఉపమ**

భాగవతంలో లక్ష్యం అలభ్యం

**ధర్మలుప్త - ఉపమ**

భాగవతంలో లక్ష్యం అలభ్యం

**వాచకలుప్త - ఉపమ**

బలిచక్రవర్తిని గూర్చి చెబుతూ -

**.... *వెలిగెన్ దానవ భర్త శైల శిఖరోద్వేలద్దవాగ్ని ప్రభన్.*** (భాగ. 8-442) అంటాడు పోతన.

బలి చక్రవర్తి పర్వతశిఖరం పై గల దావాగ్ని కాంతులతో వెలిగాడని చెప్పాడు. ఇక్కడ ఉపమేయం దానవ భర్త, ఉపమానం - శైలశిఖరోద్వేల ద్దవాగ్నిప్రభలు సమాన ధర్మం - వెలుగుట. కాని ఉపమా వాచకం లోపించింది.

ఉపమాన - ధర్మలుప్తోమ, ఉపమాన - వాచక - లుప్తోపమ, ధర్మ - వాచక - లుప్తోపమ మరియు ఉపమాన - ధర్మ - వాచక లుప్తోపమ. భాగవతంలో లక్ష్యాలు అలభ్యం.

## 2. అసమ

### నిర్వచనాలు

జగన్నాథ పండితుడు "అన్నితీరుల నుపమాన నిషేధం అసమమను నలంకారం" (జగన్నాథ పండితుడు:187) అనెను. గణపతిశాస్త్రి "సాక్షాత్తుగా గాని పరంపరగాగాని అన్ని విధములు గానే ఉపమానం లేదని నిషేధించుటయే యసమాలంకారం"

అని చెప్పెను.

**అసమ - భాగవతంతో అన్వయం**

ఒకదానితో సమానమైనది మరొకటి లేదనడం ద్వారా ప్రకృతవస్తువు / వ్యక్తి/ కార్యము యొక్క సర్వోత్కృష్టత వెల్లడవుతుంది. ఈ అలంకారంలో ఉపమానం ఉండదు.

*......... యజ్ఞ దానాది పుణ్య*

*ఫలము వేదంబు చదివిన ఫలము నార్త*

*జనుల గాచిన ఫలముతో సమము గావు* (భాగ. 3-260)

విదురుని సందేహానికి మైత్రేయుడు సమాధానం చెబుతూ ఎన్ని యజ్ఞాలు, దానాల పుణ్యఫలము, వేదం చదివిన ఫలము వంటి ఎన్నయినా సరే - ఆపదలో ఉన్నవారికి చేతనైనంత సేవ చేయడం వలన కలిగేపుణ్య ఫలానికి సమానం కాదని, దానితో పోల్చదగినది ఏదీ లేదని చెప్పడం ద్వారా 'దీనజన సేవ' ఎంతటి ఉత్తమ గతులను ప్రసాదిస్తుందో తెలుస్తుంది. ఎన్ని తపస్సులు చేసినా అది పేదవారికి సేవ చేయడం వలన కలిగిన పుణ్యఫలానికి సమానం కాదు. ఈ విషయం మదర్ థెరిస్సావంటి వారు తమ జీవితాల ద్వారా నిరూపించారు. అందుకే వివేకానందుడు 'మానవ సేవయే మాధవ సేవ' అన్నాడు.

శ్రీహరి నామ సంకీర్తన ఎంత మహిమ కలదో బ్రహ్మ తపస్సుకు ప్రత్యక్షమైన మహావిష్ణువు, బ్రహ్మదేవునితో ఇలా అంటాడు.

*వనతటాకోపనయన వివాహ దేవ*

*భవన నిర్మాణ భూమ్యాది వివిధ దాన*

*జన తపోవ్రత యోగ యజ్ఞముల ఫలము*

*మామకస్తవ ఫలము సమంబుగాదు.* (భాగ. 3 - 328)

శ్రీవిష్ణు లీలా స్తవమునకు సాటియైనది లేదనటం 'అసమ' అలంకారం.

పద్మలోచన! కృష్ణ! భక్తాభయప్రద!

వినుము సంసారాగ్ని వేగుచున్న

జనుల సంసారంబు సంహరింపగనీవు

దక్కనన్యులు లేరు తలచి చూడ... (భాగ. 1-146)

అశ్వత్థామ బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించినపుడు దానినుండి రక్షంపమని అర్జునుడు శ్రీకృష్ణునితో అంటున్నమాటలివి.

'పునరపి జననం పునరపి మరణం' అన్నట్లు పుట్టుతూ చస్తూ ఎంతకు ఈ వలయం నుండి బయట పడక పోవడాన్ని సంసారం అంటాం. ఈ సంసారంలో వేగుతున్నవారిని రక్షించే శక్తి నాకు తప్ప ఎవరికి లేదనడం 'కృష్ణస్తు భగవాన్ స్వయం' అనే భాగవత తత్త్వాన్ని ధ్రువపరుస్తుంది.

శ్రీకృష్ణునితో సమానమైన ఇతరులు లేరనడం వల్ల ఇది అసమాలంకారం.

## 3. ఉత్ప్రేక్ష

కవుల కావ్య ప్రయోగాలలో తరచుగా కనిపించు మరొక అర్థాలంకారము ఉత్ప్రేక్షాలంకారము.

**స్థానము**

ఉత్ప్రేక్షను రుయ్యకుడు - సాదృశ్యమూలక - అభేద ప్రధానమనీ, విద్యానాథుడు, అధ్యవసాయమూలకమనీ చెప్పారు.

**వ్యుత్పత్తి**

**ఉత్** = పైపైకి పోయిన

ప్రేక్ష = ప్రతిభతో చూచుట అని వ్యుత్పత్తి (గణపతిశాస్త్రి : 556)

ఉపమేయాన్ని, ఉపమానస్థాయికి తీసుకొనిపోవుట కలదు కావున దీనికి ఉత్ప్రేక్ష అని పేరొచ్చింది.

## నిర్వచనాలు

**భామహుడు** ఉత్ప్రేక్షను "వివక్షితము కాని సాదృశ్యము కలదియు, కొంచెము ఉపమాన సంబంధము కలదియు, ఏ గుణక్రియలు ఉన్నట్లు వర్ణింపబడునో అట్టి గుణక్రియలు లేనిదియు, అతిశయముతో కూడినదియు అగునది ఉత్ప్రేక్ష" (భామహుడు:68) అని నిర్వచించెను. ఈ నిర్వచనము ఉపమతో, ఉత్ప్రేక్షకు గల సామ్యభేదాలను దృష్టిలో పెట్టుకొని చెప్పినట్లున్నది. దీనిలో ఉత్ప్రేక్షలో ఉపమాన ధర్మములేవీ ఉపమేయములో ఉండవని చెప్పాడు.

**దండి** ఉత్ప్రేక్షను ఇలా నిర్వచించెను.

'స్వభావసిద్ధముగా ఒక రీతిలో ఉన్న ప్రవృత్తి ఎచ్చట ఉత్ప్రేక్షింప (ఊహింప)బడునో దానిని ఉత్ప్రేక్షాలంకారమంటారు.' (దండి:147)

ఉత్ప్రేక్షలో అప్రకృతమువైపు మొగ్గు చూపుట, లేదా ప్రకృతమును పూర్తిగా కప్పివేయుట ఉంటుందని వీరి అభిప్రాయము.

**వామనుడు** "అతిశయము కొరకై ఆరూపము లేని దానిని ఆరూపము కలదానినిగా నిరూపించుట ఉత్ప్రేక్ష" (వామనుడు:134) అని ఉత్ప్రేక్షను నిర్వచించెను.

**భోజుడు** "ఒక విధముగానున్న వస్తువు మరొక విధముగా పరికల్పితమైన యెడల అది ఉత్ప్రేక్ష..." (భోజుడు. 1984:538)

**కుంతకుడు** "వర్ణనీయమగు వస్తువుకు అతిశయోద్రేకమును సంపాదింపవలెననెడు అభిలాషచే ప్రస్తుత వాక్యార్థముకంటె భిన్నమగు వాక్యార్థమును కూర్చుట ఉత్ప్రేక్ష" (కుంతకుడు:342) అని చెప్పాడు.

**మమ్మటుడు** 'ప్రకృతమైన ఉపమేయ, ఉపమానముల ఏకరూపత్వ సంభావనం ఉత్ప్రేక్ష' (మమ్మటుడు: 608) అని, ఇది వ్యంగ్యమైన సాధర్మ్యం గల అలంకారమనీ చెప్పెను.

**రుయ్యకుడు** "అధ్యవసాయే వ్యాపారప్రాధాన్యే ఉత్ప్రేక్షా" (రుయ్యకుడు:16) అనెను. వ్యాపార ప్రాధాన్యమును అధ్యవసాయమున్నపుడు ఉత్ప్రేక్షాలంకారమంటారు.

**జయదేవుడు** "వసువును బట్టి, హేతువును బట్టి, ఫలమును బట్టి యూహించుట ఉత్ప్రేక్షాలంకారం" (జయదేవుడు:54) అని చెప్పాడు.

**విద్యానాథుడు** "ఉపమాన ధర్మ సంబంధము వలన ఉపమేయము, ఉపమానము గానే సంభావింపబడిన యెడల ఉత్ప్రేక్షాలంకారము" (విద్యానాథుడు: 447) అని నిర్వచించెను.

**విద్యాధరుడు** "అప్రకృత గుణక్రియాభిసంబంధము వలన ప్రకృతము అప్రకృతముగా సంభవించుట ఉత్ప్రేక్షాలంకారమని అర్థము" (విద్యాధరుడు: 306) అని చెప్పెను.

**జగన్నాథ పండితుడు** "తద్భిన్నముగాగాని, తదభావవత్తుగాగాని ప్రమితమగు పదార్థమునకు రమణీయమగు దాని యందుండు ధర్మము, లేక దానితో సమానాధికరణమైన ధర్మము, వానిలో నేదో నొకదాని సంబంధము నిమిత్తముగా నదిగా గానీ, అది గల్గి యున్నట్టిదిగా గానీ సంభావనముత్ప్రేక్ష" (జగన్నాథ పండితుడు: 322) అని నుడివెను.

విన్నకోట పెద్దయ

"అలవడి శబ్దార్థములకుఁ
జెలువంబగునన్యక్లుప్తి సృజియించి సము
జ్జ్వల దుత్ప్రేక్షావ్యంజన
ములచే నుత్ప్రేక్ష యనగ మొనయుం గృతులన్" (విన్నకోట పెద్దయ: 93) అనెను.

**రామరాజభూషణుడు**

"యత్రాఽన్యధర్మసంబంధాదన్యత్వేనోప తర్కితం
ప్రకృతంహి భవేత్ప్రాజ్ఞాస్తాముత్ప్రేక్షాం ప్రచక్షతే" (రామరాజభూషణుడు: 602)

"ఉపమేయమునకు కలిగిన / యుపమాన గుణక్రియాది యోగముచేనా
యుపమానమెయని తలచిన / నపుడది యుత్ప్రేక్షయయ్యె.." (రామరాజభూషణుడు: 602)

పైన పేర్కొన్న ప్రముఖుల నిర్వచనాలను బట్టి ఉత్ప్రేక్షలక్షణాలను ఈ క్రింది విధంగా క్రోడీకరించవచ్చు.

1. ఉపమేయము, ఉపమానముగా ఊహించబడుతుంది.
2. ఉపమానము లోకప్రసిద్ధమైనది కాకుండా ఉంటుంది. లేదా కేవల కవి కల్పితమై ఉంటుంది.

3. ఉపమేయ ఉపమానములకు గల సామ్యధర్మము కేవలము ఊహాకల్పితము.

4. ఇది వస్తు, హేతు, ఫలముల నాశ్రయించి ఉంటుంది.

**పారిభాషిక పదము**

ఉత్ప్రేక్ష అధ్యవసాయ గర్భము కావున అధ్యవ సాయము అంటే ఏమిటో తెలుసుకొందాం.

అధ్యవసాయము:- 'ఉపమేయమును మఱుగు పరచి, ఉపమేయోపమానములకు అభేదము నాపాదించుట అధ్యవసాయము.' (రుయ్యకుడు:16), దీనినే తాదాత్మ్యము అని కూడా అంటారు. ఇది రెండు రకాలు. 1. సాధ్యము (ఉదా: అతిశయోక్తి), 2. సిద్ధము (ఉదా: ఉత్ప్రేక్ష).

**వర్గీకరణ**

ఉత్ప్రేక్ష సాదృశ్యమూలక - అభేద ప్రధానమని, సామ్యధర్మము అధ్యవసాయముగా కలిగినదని మమ్మట రుయ్యక, విద్యానాథ, విద్యాధర, రామరాజభూషణాదులు పేర్కొనిరి. ఉత్ప్రేక్ష వ్యంగ్యమైన సాధర్మము కలదని మమ్మటుడు (మమ్మటుడు :608), విన్నకోట పెద్దయ (విన్నకోట పెద్దయ: 93) చెప్పిరి.

**దండి** ఉత్ప్రేక్షను 1. చేతనోత్ప్రేక్ష, 2. అచేతనోత్ప్రేక్ష అని రెండు రకాలుగా చెప్పెను. (దండి: 148)

**భోజుడు** 1. ద్రవ్యోత్ప్రేక్ష, 2. గుణోత్ప్రేక్ష, 3. క్రియోత్ప్రేక్ష (భోజుడు2: 358), 4. ఉత్ప్రేక్షావయవము, 5. ఉత్ప్రేక్షోపమ, 6. మతము (భోజుడు. 1984:361) అని ఆరు రకాలుగా విశదీకరించెను.

**రుయ్యకుడు** 1. జాతి, 2. క్రియ, 3. గుణ, 4. ద్రవ్య ఉత్ప్రేక్షలు అని నాలుగు రకాలుగా చెప్పెను. (రుయ్యకుడు:16)

**జయదేవుడు** ఉత్ప్రేక్షను 3 × 2 = 6 రకాలుగా చెప్పెను. అతని వర్గీకరణ క్రింది విధంగా ఉంది. (జయదేవుడు: 54)

1. వస్తూత్ప్రేక్ష. మరల ఇది రెండు రకాలు. 1. ఉక్తవిషయము, 2. అనుక్త విషయము.
2. హేతూత్ప్రేక్ష. ఇది రెండు రకాలు. 1. సిద్ధము, 2. అసిద్ధము.
3. ఫలోత్ప్రేక్ష. ఇది రెండు రకాలు. 1. సిద్ధము, 2. అసిద్ధము.

విద్యానాథుడు, విద్యాధరుడు, రుయ్యకుడు మొదలగు వారు చేసిన ఉత్ప్రేక్ష వర్గీకరణ స్థూలంగా ఒకేరకంగా ఉంది. దీనినే సన్నిధానం సూర్యనారాయణశాస్త్రి గారి మాటల్లో ఈ క్రింది విధంగా చెప్పవచ్చు. (రామరాజ భూషణుడు:603-605)

ఉత్ప్రేక్ష. 1. వాచ్యోత్ప్రేక్ష, 2. ప్రతీయమానోత్ప్రేక్ష (లేదా) గమ్యోత్ప్రేక్ష అని రెండు రకాలు.

1. వాచ్యోత్ప్రేక్ష. 'ఊహను ప్రతిపాదించే నూనము, ధ్రువము, ప్రాయము, అనన్, శంకించు, కాబోలు, ఊహించు, భావించు, అనుమానించు మొదలగు పదములు ప్రయోగింపబడితే అది వాచ్యోత్ప్రేక్ష.' (రామరాజ భూషణుడు:603)

2. ప్రతీయమానోత్ప్రేక్ష (లేదా) గమ్యోత్ప్రేక్ష. 'ఊహను ప్రతిపాదించే పదములు వాచ్యంగా లేకుండా ప్రతీయమానమైనచో అది ప్రతీయమానోత్ప్రేక్ష (లేదా) గమ్యోత్ప్రేక్ష ' (రామరాజ భూషణుడు:603).

వాచ్యోత్ప్రేక్షలో ఉపమాన జాతి, క్రియ, గుణ, ద్రవ్య వాచకములు అనే భేదములు వహించి నాలుగు భేదములు అగును. ఈ నాలుగు రకమలు భావ, అభావ భేదములచే 8 విధములగును. అది హేతు, ఫల స్వరూపములనే భేదములచే 8 × 3 = 24 రకములగును. వాటిలో హేతు, ఫలోత్ప్రేక్షలు రెండు గుణ, క్రియా భేదములచే 8 × 2 + 8 × 2 = 32 విధములగును. స్వరూపోత్ప్రేక్షలో ఉపాత్తనిమిత్తము, అనుపాత్త నిమిత్తము అను భేదమలు (8 × 2 = 16) ఏర్పడును. దీనిలో ఉపాత్త - స్వరూపోత్ప్రేక్ష గుణక్రియాభేదములచే విభజింపబడును. అనుపాత్త నిమిత్తములో ఇట్టి భేదములేర్పడవు. ఈ విధంగా వాచ్యోత్ప్రేక్ష 56 రకములగును. గమ్యోత్ప్రేక్ష కూడా వాచ్యోత్ప్రేక్షవలెనే విభజింపబడును. కాకపోతే ఉపాత్త నిమిత్త, అనుపాత్త నిమిత్త భేదములు స్వరూపోత్ప్రేక్షలో ఉండవు. కావున గమ్యోత్ప్రేక్ష 48 రకాలగును. (రామరాజ భూషణుడు:603-605).

ఉత్ప్రేక్ష మొత్తం (56 + 48) 104 రకములగును.

**ఉత్ప్రేక్ష - ఇతర అలంకారాలతో సామ్యభేదాలు**

ఉత్ప్రేక్ష - ఉపమ (చూ. ఉపమ)

ఉత్ప్రేక్ష - రూపకము (చూ. రూపకము.)

ఉత్ప్రేక్ష - అతిశయోక్తి. ఉత్ప్రేక్ష, అతిశయోక్తి రెంటిలో అతిశయము ఉంటుంది. ఉత్ప్రేక్షలో ఊహను సూచించే పదాలు ఉంటాయి, కాని అతిశయోక్తిలో ఉండవు.

## ఉత్ప్రేక్ష - పోతన భాగవతంతో అన్వయం.

ఉత్ప్రేక్షలోని ప్రధాన విభాగాలకు లక్ష్యలక్షణ సమన్వయం చేయబడుతుంది. భాగవతంలో ప్రయోగింపబడ్డ లక్ష్యాల దృష్ట్యా ఇలా చేయడం జరుగుతుంది.

ఉత్ప్రేక్ష 1. వాచ్యోత్ప్రేక్ష, 2. ప్రతీయమానోత్ప్రేక్ష అని రెండు రకాలు.

### I. వాచ్యోత్ప్రేక్ష.

వాచ్యోత్ప్రేక్షలో - ఊహను తెలిపే ప్రాయము, అనన్, శంకించు మొదలగు పదాలు ప్రయోగింపబడతాయి. వాచ్యోత్ప్రేక్షలో 1. వస్తు (లేదా) స్వరూపోత్ప్రేక్ష, 2. హేతూత్ప్రేక్ష, 3. ఫలోత్ప్రేక్ష అనే మూడు ప్రధాన విభాగాలను చెప్పవచ్చు.

### 1. వస్తు (లేదా) స్వరూపోత్ప్రేక్ష

స్వరూపోత్ప్రేక్షలో ఉపమేయం ఉపమానంగా ఊహించబడుతుంది.

*గగనారణ్యా చరాంధకార గజమున్ గాలాహ్వయ వ్యాధుఁడ*
*చ్చుగఁ గట్టం గమకించి మచ్చిడుటకై చూతాంకుర శ్రేణిచే*
*నొగిఁ గల్పించిన కందుకం బనఁగఁ సూర్యుండంత వీక్షింపఁగాఁ*
*దగె మంద ప్రభతోడఁ బశ్చిమ మహాధాత్రీ ధరేంద్రంబునన్* (భాగ. 10. పూర్వ - 1287)

ఆకాశమనే అరణ్యంలో అంధకారమనే ఏనుగుని పట్టడానికి కాలమనే బోయవాడు ఎరగా పెట్టిన ఎర్రని లేతమామిడి చిగుర్ల ముద్ద ఏమో అన్నట్లుగా అస్తమిస్తున్న సూర్యుడు ఉన్నాడని ఉత్ప్రేక్షించారు.

ఎర్రగా గుండ్రంగా ఉన్న సూర్యబింబాన్ని ఎర్రని లేత మావిచిగుర్ల ముద్దలాగా ఉందనడం స్వరూపోత్ప్రేక్షగా చెప్పవచ్చు. కారణం ఉపమేయమైన సూర్యుడు, ఉపమానమైన చూతాంకుర శ్రేణిగా ఊహింపబడటం.

మందప్రభతో ఉన్న సూర్యుడు కృష్ణుని చేతిలో చావబోయే కంసునికి ప్రతీక. ఎండపోయి చల్లని వెన్నెల రాబోతుంది. దుష్టుడైన కంసుని పాలనపోయి శ్రీకృష్ణుని కనుసన్నలలో అందరు ఆనందంగా ఉండే సమయం రాబోతుంది. ఈ సందర్భంలో ఈ పద్యం కథకు రమణీయకతను చేకూర్చుతుంది.

*భూమినిండ మింటఁ బూర్ణమై కర్కట*
*మకర మీనరాశి మహితమైన*
*హరయశస్సుధాబ్ధి యందుల తుంపురు*
*లనఁగఁ జుక్కలొప్పె నాకసమున* (భాగ. 10. పూర్వ - 1291)

భూమి, ఆకాశంలో నిండిన, కర్కట, మకర, మీనరాశి యుతమైన శివుని యశస్సు అనే సుధాసాగరంలోని తుంపరులేమో అన్నట్లుగా చుక్కలు ప్రకాశించాయనే ఊహ చక్కగా ఉంది.

ఉపమలో కన్నా ఉత్ప్రేక్షలో కవి కల్పితం ఎక్కువగా ఉంటుంది.

భూమి పైన (నీటిలోను) కర్కట (ఎండ్రకాయ), మకర (మొసలి), మీనము (చేప) లు ఉంటాయి. ఆకాశంలో ఉన్న నక్షత్రాల గుంపులను అవి మనుషులకు కన్పించే ఆకృతిని బట్టి కర్కటరాశి, మకరరాశి, మీన రాశి అని పిలుస్తుంటాం. రాత్రి చీకటి పడింది ఆకాశంలో చుక్కలు కనిపించాయి. అయితే ఆ చుక్కలు శివుని యశస్సుధాబ్ధిలోని తుంపరలనడం, శివుని ఔన్నత్యానికి, పోతన కల్పనాశక్తికి అద్దం పడుతున్నాయి.

*ధరణిని రాజనామమునఁ దాఁ దగు రెండువ చంద్రుఁడో! యనన్* (భాగ. 4-646)

పృథుచక్రవర్తి పరిపాలనను చెబుతూ సుభిక్షంగా ఉందంటూ అతన్ని రెండవ చంద్రుడేమో అన్నట్లు ఉన్నాడని ఉత్ప్రేక్షిస్తాడు

పోతన.

చంద్రుడు ఒకడే ఉంటాడు. చంద్రుని లక్షణాలను పృథు చక్రవర్తి లక్షణాలతో అధ్యవసాయం చేస్తూ చెప్పబడింది. కాబట్టి ఇది స్వరూపోత్ప్రేక్ష.

### స్వరూప - మాలోత్ప్రేక్ష

స్వరూపోత్ప్రేక్ష మాలారూపంలో కూడ ఉంటుంది.

*ప్రాచీదిశాంగనా ఫాల తలంబున*
*దీపించు సింధూర తిలకమనఁగ*
*దర్పించి విరహుల ధైర్యవల్లులు ద్రెంప*
*దర్పకుండెత్తిన దాత్రమనఁగ*
*నలిగి కాలకిరాతుఁ డంధకార మృగంబు*
*ఖండింప మెఱయించు ఖడ్గమనఁగ*
*గగన తమాల వృక్షము తూర్పు కొమ్మను*
*లలితమై మెఱయు పల్లవ మనంగఁ*
*దొగలు సంతసిల్ల దొంగలు భీతిల్లఁ*
*గడలి మిన్ను ముట్టి కడలు కొనఁగఁ*
*బొడిచె శీతకరుఁడు భూరి చకోరక*
*ప్రీతికరుఁడు జార భీతికరుడు* (భాగ. 10. పూర్వ - 1295)

ఉపమేయమైన చంద్రుణ్ణి ఉపమానములైన సింధూర తిలకం, దాత్రం, ఖడ్గం, పల్లవములుగా ఊహించడం జరిగింది. కావున ఇది మాలాస్వరూపోత్ప్రేక్ష. ఈ క్రింది పద్యం కూడా స్వరూప - మాలోత్ప్రేక్షకే ఉదాహరణ.

*పౌలోమి తన బాలు పాన్పుపైఁ గనుపట్టఁ*
*బన్నిన పవడంపు బంతి యనఁగ*
*నాయురర్థముల వ్యయంబు లొత్తిలి చాటు*
*కాల జాంఘికు చేతిఘంట యనఁగ*
*ఘన జంతు జీవిత కాలరాసుల విధి*
*కొల్వనెత్తిన హేమకుంభ మనఁగ*
*బశ్చిమ దిక్కాంత బరఁగఁగై సేయుచో*
*ముందర నిడుకొన్న ముకురమనఁగఁ*
*గోపతాపోపశమ దివ్యఘుటిక యనఁగఁ*
*బద్మినీ కాంత నోముల ఫలమనంగ*
*మూఁడు మూర్తుల సారంపు ముద్ద యనఁగ*
*మిహిర మండల ముదయాద్రి మీఁద నొప్పె* (భాగ. 10. పూర్వ - 1303)

## 2. హేతూత్ప్రేక్ష

హేతువు కాని దానిని హేతువుగా చెప్తే అది హేతూత్ప్రేక్ష.

*ఈ హేమంతము రాకకు*
*శ్రీహరి యొక్కింత వణఁకి చింతింపంగా*
*నోహో వెఱవకు మనుచు*
*న్నా హరికిని శ్రీకుచంబు లభయంబిచ్చెన్* (భాగ. 10. పూర్వ - 804)

హేమంత ఋతువులోని చలి తీవ్రతను వర్ణిస్తూ -

హేమంతము వచ్చినందుకు శ్రీమహా విష్ణువు వణుకుతూ ఈ చలి తీవ్రతకు బ్రతకడమెలా అని భయపడుతుండగా లక్ష్మీదేవి యొక్క పాలిండ్లు 'ఓహో భయపడకు భయపడకు మేమున్నాము కదా' అని అభయమిచ్చాయట.

ఎంత చక్కని ఊహ ఇది హాలుని గాథా సప్తశతిని తలపింప చేసే శృంగార రసగుళిక వంటి పద్యం. మహాభక్తకవీశ్వరుడు, సీతారామ దర్శనం పొందినవాడు అయి ఉండికూడా శృంగార రసపోషకమైన ఇటువంటి పద్యం వ్రాయటం తెలుగు వారి అదృష్టం.

పాలిండ్లు ఎదుటి వారి బాధను తెలుసుకోలేవు. దానికి తగినట్లు స్పందించడం గాని ఎదుటి వారితో మాట్లాడటం గాని చేయలేవు కాని అవి మాట్లాడినట్లుగా ఇక్కడ చెప్పబడింది. హేతువు కానిది హేతువుగా ఊహింపబడింది కావున ఇది హేతూత్ప్రేక్ష.

*కళలు గలుగుఁగాక కమల తోడగుఁ గాక*

*శివుని మౌళి మీఁదఁ జేరుఁగాక*

*నన్యునొల్లఁ దపనుఁడైన మత్పతి యని*

*సాధ్వీభంగి కమల జాతి మొగిడె* (భాగ. 10. పూర్వ - 1289)

సూర్యాస్తమయ, చంద్రోదయ సమయాన్ని వర్ణిస్తున్న సందర్భంలో చెప్పిన పద్యం ఇది. ఉదయం సూర్యకిరణాలు తాకగానే వికసించి, సూర్యాస్తమయం కాగానే ముకుళించుకుపోవడం తామర పూవుల సహజలక్షణం. ఈ లక్షణాన్ని ఆధారంగా చేసుకొని భర్తపై తప్ప, ఎన్ని శుభలక్షణాలున్నా పరపురుషునికై మనస్సు పోనివ్వని పతివ్రత యొక్క లక్షణాలతో తామరపూల లక్షణాలని అధ్యవసాయం చేస్తున్నాడిక్కడ కవి.

చంద్రుడికి పదిహేను అందమైన కళలు ఉంటే ఉండవచ్చు. అతడు లక్ష్మీదేవికి తోబుట్టువు అయితే కావొచ్చుగాక. సాక్షాత్తు పరమశివుని తలపైకెక్కిన ఎక్కుగాక. యౌవనుడు, అందగాడు అయితే అగుగాక మా భర్త అయిన సూర్యున్ని తప్ప ఇతరులను ఇష్టపడము అనుకొని సాయంకాలం వేళ తామర పూలన్ని ముకుళించుకు పోయాయట. రాత్రి ముకుళించుకు పోవడం తామర పూలకు సహజమే అయినా, హేతువు కాని పై దాన్ని ముకుళించుకుపోవడానికి హేతువుగా చెప్పడం వల్ల ఇది హేతూత్ప్రేక్ష.

### 3. ఫలోత్ప్రేక్ష

ఫలము కాని దానిని ఫలముగా ఊహించుట ఫలోత్ప్రేక్ష. శ్రీకృష్ణుడు గోపికలు ఒక సరస్సులోనికి దిగి అనేక విధాలుగా సరస సల్లాపాలాడుతూ జలక్రీడలాడు సందర్భంలో -

*..... సారసంబులకుం గరంబులు సాచుచు మరాళంబుల జోఁపుచుఁ జన్నుఁ మిగిలిన చన్నులు యెత్తువత్తుమను నెపంబుల దపంబులు నీట గావించు మాడ్కిని సంచరించు చక్రవాకంబులఁ దోలుచు ...* (భాగ. 10. పూర్వ - 1098)

చక్రవాకములను స్త్రీ వక్షోజాలతో పోల్చడం కవి సంప్రదాయం. ఇక్కడ చక్రవాక పక్షులు గోపికల పాలిండ్లకన్నా ఎత్తుగా లావుగా కావడానికి నీళ్ళలో తపస్సు చేస్తున్నట్లు ఊహింపబడింది. చక్రవాకములు నీళ్ళల్లో ఉండడం సహజం అవి ఏఫలాన్నీ పొందడానికి తపస్సు చేయవు కానీ ఇక్కడ గోపికల స్తనముల వలే ఎత్తుగా లావుగా ఉండడానికి తపస్సు చేస్తున్నట్లుగా ఊహింపబడింది. అంటే ఒక ఫలితాన్ని ఆశిస్తూ తపస్సు చేస్తున్నట్లుగా చెప్పబడింది. కాని నిజానికి అవి ఏ ఫలితాన్నీ ఆశించడం లేదు. అసలు తపస్సే చేయడం లేదు. కోరని ఫలితాన్ని కోరినట్లుగా ఊహించబడింది కాబట్టి ఇది ఫలోత్ప్రేక్ష.

## II. గమ్య/ ప్రతీయమానోత్ప్రేక్ష

ఊహను సూచించే పదాలు లేని ఉత్ప్రేక్షను గమ్య/ప్రతీయమానోత్ప్రేక్ష అంటారు.

### 1. ప్రతీయమాన - స్వరూపోత్ప్రేక్ష

*పాలమున్నీటిలోపలిమీఁది మీఁగడ*

*మిసిమి జిడ్డునఁ జేసి మేను వడసి*

*క్రొక్కారు మెఱుఁగుల కొనల తళుక్కుల*

*మేనిచే గల సిగ్గు మెఱుఁగు చేసి*

*నాఁడు నాఁటికిఁ బ్రోది నవకంపుఁ దీఁగెల*

*నునుఁబోద నెయ్యంబు నూలుకొలిపి*
*క్రొవ్వారు కెందమ్మి కొలఁకులఁ బ్రొద్దునఁ*
*బొలసిన వలపులఁ బ్రోదివెట్టి*
*పసిఁడి చంపకదామంబు బాగుఁ గూర్చి*
*వ్రాలు క్రొన్నెల చెలువున వాఁడిదీర్చి*
*జాణతనమునఁ జేతుల జిడ్డు విడిచి*
*నలువ యీ కొమ్మ నొగిఁ జేసినాఁడు నేఁడు* (భాగ. 8 - 266)

పాల సముద్రము నుంచి ఆవిర్భవించిన లక్ష్మీదేవి యొక్క సౌందర్యాన్ని పాల సముద్రంలోని మీగడ నుండి మెరుపు తీగల తళుకుల నుండి, ఎర్రతామర పూలనుండి, బంగారు చంపక పుష్పాలనుండి బ్రహ్మ రూపొందించినట్లుగా చెప్పబడింది. లక్ష్మీదేవి సౌందర్య కారకాన్ని మరో విధంగా చెప్పడం జరిగింది. ఈ పద్యంలో ఈ ఊహను తెలియజేసే పదాలు లేకపోవడం వల్ల ఇది ప్రతీయమాన స్వరూపోత్ప్రేక్ష.

2. ప్రతీయమాన - హేతూత్ప్రేక్ష

*కోదండ భంగ నిర్గత*
*నాదము వీనులకు భీషణంబై యాశా*
*రోదోంతరములు నిండుచు*
*భేదించెన్ భోజవిభుని బింకము నధిపా!* (భాగ. 10. పూర్వ -1283)

కంసుడు ఏర్పాటు చేసిన ధనుస్సును కృష్ణుడు ఎక్కుపెట్ట విరిచెన్. ఆ శబ్దం విశ్వమంతా నిండి కంసుడి బింకాన్ని అణచినట్లుగా చెప్పబడింది. దీంట్లో ఊహ ప్రతిపాదించే పదాలు లేవు. కావున ఇది ప్రతీయమాన హేతుత్ప్రేక్ష.

3. ప్రతీయమాన - ఫలోత్ప్రేక్ష

భాగవతంలో ప్రతీయమాన ఫలోత్ప్రేక్షకు లక్ష్యములు లేవు.

## 4. సందేహ

సందేహాలంకారమును 'సందేహ', 'సంశయాలంకారము'లని కూడా వ్యవహరిస్తారు.

### స్థానము

సందేహాలంకారము సాదృశ్య మూలక అభేద ప్రధానాలంకారమగు ఆరోప్యగర్భాలంకారము. సందేహాలంకార నిర్వచనాలలో ఆలంకారికులలో ఏకాభిప్రాయం ఉంది. అయితే దీన్ని భోజుడు ఉభయాలంకారంగా చెప్పాడు.

### నిర్వచనాలు

**భామహుడు** "(ఉపమేయమును) స్తుతించుటకై (ఉపమేయమునకు) ఉపమానముతో అభేదమును, మరల భేదము చెప్పువానియొక్క సందేహముతో కూడిన వచనమును సందేహము అంటారు." (భామహుడు : 88) అని నిర్వచించెను.

**వామనుడు** "ఉపమానోపమేయ సంశయ సందేహః" (వామనుడు: 136) అనెను.

**కుంతకుడు** "యస్మిన్నుత్ప్రేక్షితం రూపం సందేహమేతి వస్తునః
ఉత్ప్రేక్షాంతర సద్భావాత్ విచ్ఛిత్త్యైతత్ ...." (కుంతకుడు : 385)

ఎచట మరియొక ఉత్ప్రేక్ష కూడా ఉండుట వలన, వస్తువు యొక్క ఉత్ప్రేక్షితమగు ఒక రూపము విచ్ఛిత్తి విశేషమునకై సందేహాస్పదముగా నున్నట్లు వర్ణింపబడునో అచట ససందేహాలంకారము.

దీనిలో ఉత్ప్రేక్షలో వలే ఊహ ఉన్ననూ, అది సందేహాస్పదముగా నున్నట్లు ఉండవలెనని చెప్పెను.

**మమ్మటుడు** "స సందేహస్తు భేదోక్తౌ తదనుక్తౌ చ సంశయః" (మమ్మటుడు : 610) అన్నాడు.

ప్రకృతమైన ఉపమేయాన్ని సమానమైన ఉపమానంగా గ్రహించడం వల్ల ఏ సంశయమున్నదో అది ససందేహాలంకారము.

**రుయ్యకుడు** "విషయస్య సందిహ్యా మానత్వే సందేహః" (రుయ్యకుడు : 13) అన్నాడు.

**విద్యానాథుడు** "ఉపమానోపమేయములు కవి సమ్మతమగు సాదృశ్యము వలన నెచట సందేహ విషయములగునో యది సందేహాలంకారము." (విద్యానాథుడు: 471) అన్నాడు.

**విద్యాధరుడు** కూడా విద్యానాథుని వలెనే నిర్వచించెను. (విద్యాధరుడు: 296)

ఏదో ఒక గుణ, రూపసామ్యము వలన ఉపమేయోపమానములకు దాదాపుగా భేదము లేనట్లుగా చెప్పుతూ, వాటి మధ్య సామ్యలక్షణాల వలన ఏది ఉపమేయమో, ఏది ఉపమానమో తేల్చుకోలేనంతగా సందేహాన్ని కలిగిస్తున్నట్లుగా వర్ణింపబడితే అది సందేహాలంకారంగా చెప్పవచ్చు.

మమ్మటుడు (పేజి. 610) విద్యానాథుడు (పేజి. 472), విద్యాధరుడు (పేజి. 296), జగన్నాథ పండితుడు (పేజి. 273) సందేహాలంకారాన్ని మూడు రకాలుగా వర్గీకరించిరి. అవి 1. శుద్ధము, 2. నిశ్చయ గర్భము, 3. నిశ్చయాంతము.

### పారిభాషిక పదం

ఆరోపగర్భం - చూ. ఇదే. రూపకం.

### సందేహం : భాగవతంతో అన్వయం

#### 1. శుద్ధ సందేహం

ఉపమానోపమానాలకు గల సామ్య లక్షణాల వలన అదియా? లేదా ఇదియా? అని సందేహించుట శుద్ధసందేహము.

*శంభుండో, హరియో, పయోజభవుడో, చండాంశుడో, వహ్నియో,*
*దంభాకారత వచ్చెఁగాక ధరణిన్ ధాత్రీసురుండెవ్వఁడీ*
*శుంభద్ద్యోతనుఁడీ మనోజ్ఞతనుఁడంచున్ విస్మయభ్రాంతులై*
*సంభాషించిరి బ్రహ్మచారిఁ గని తత్సభ్యుల్ రహస్యంబునన్* (భాగ. 8 - 533)

బలి చక్రవర్తి యజ్ఞవాటికకు వస్తున్న వామనుని చూచి, అక్కడ ఉన్నవారు రహస్యంగా ఇతడు శివుడా? విష్ణువా? బ్రహ్మ? సూర్యుడా? అగ్నియా? అని సంభాషించుకొంటున్నారు. వామనుడి లక్షణాలు శివ విష్ణు బ్రహ్మ సూర్యాగ్నుల లక్షణాలతో చాలా దగ్గర పోలికలు ఉండటం వల్ల ఇలా సంభాషించుకొంటున్నారు. వామనుడు అంతగా వెలిగిపోతున్నాడన్నమాట.

వామనుడు ప్రకాశించడాన్ని బట్టి శివుడో, విష్ణువో, బ్రహ్మో, సూర్యుడో, అగ్నియో అని సందేహించడం వల్ల ఇది శుద్ధ సందేహం.

తపశ్శక్తితో వృద్ధాప్యాన్ని పోగొట్టుకొని యౌవనంగా మారిన మాంధాతను రాజకన్యలు వరించే సందర్భంలోని పద్యంలో సందేహాలంకారమే ఉంది చూడండి.

*కోమలులార! వీఁడు నల కూబరుఁడో మరుఁడో జయంతుఁడో*
*యేమఱి వచ్చెవీనిఁ దడవేల వరింపుము, నేమ నేమ యం*
*చాముని నాథుఁ జూచి చలితాత్మకలై సొరిదిన్ వరించిరా*
*భామినులందఱున్ గుసుమబాణుఁడు గీయని ఘంటవ్రేయఁగన్* (భాగ. 9-176)

భామినులు మాంధాతను చూచి ఇతడు నలకూబరుడో, మన్మథుడో, జయంతుడో అని సందేహించారు. దీన్ని బట్టి మాంధాత అందం ఎంత గొప్పగా ఉందో అర్థమవుతుంది.

#### 2. నిశ్చయ గర్భసందేహం

సామ్యలక్షణాలవల్ల ఉపమేయోపమానాలలో అదియా? ఇదియా? అని సందేహిస్తూ చివరకు ఉపమేయమేమిటనే ఒక

నిశ్చయానికి రాలేకపోతే అది నిశ్చయ గర్భ సందేహం.

*కొందఱు హరియగు నందురు*
*కొందరు చిహ్నములు గొన్నికొన్ని హరికిలే*
*వందురు మెల్లనె తెలియుద*
*మందురు మఱఁజూచి కొందఱబలలు గముల్లై* (భాగ, 10. ఉత్తర - 27)

రతీదేవి ప్రద్యుమ్నునితో కలసి ద్వారకకు వస్తున్నపుడు ప్రద్యుమ్నుని చూచి అక్కడి స్త్రీలు అతడు కొన్ని లక్షణాలను బట్టి శ్రీకృష్ణుడని, మరికొన్ని లక్షణాలను బట్టి శ్రీకృష్ణుడు కాదని భావించి చివరకు అతడెవరన్నది ఒక నిర్ణయానికి రాలేకపోయారు. కాబట్టి ఇది నిశ్చయగర్భ సందేహాలంకారము.

### 3. నిశ్చయాంత సందేహం

సామ్యలక్షణాల వల్ల ఉపమానోపమేయాలలో అదియా? ఇదియా? అని సందేహిస్తూ చివరకు ఉపమేయమేమిటనే ఒక నిశ్చయానికి వస్తే (ప్రకృత వస్తువుగా గుర్తిస్తే) అది నిశ్చయార్థ సందేహాలంకారము.

దక్షుని అవమానాన్ని భరించలేక సతీదేవి దక్షయజ్ఞవాటికి వద్దనే అగ్నిని కల్పించుకొని, దానిలో కాలిపోతుంది. ఆగ్రహించిన శివుడు తన జటనుండి వీరభద్రుని సృష్టించి ప్రమథ గణాలతో సహా దక్షుని చంపి యజ్ఞానికి వచ్చిన వారిని అవమానించమని పంపిస్తాడు. అప్పుడు దక్షుని పాదధూళి, భూమి ఆకాశాలు నిండుతుంది.

*సరభస వృత్తినట్లురుగు సైన్య పదాహత ధూత ధూళి ధూ*
*సరిత కుబేర దిక్తటము సభ్యులు దక్షుఁడుఁ జూచి యెట్టి భీ*
*కర తమ మంచనం దమము గాదు రజః పటలంబటంచు ని*
*వ్వెఱపడి పల్కిరాత్మల వివేక విహీనతఁ బొంది వెండియున్* (భాగ. 4-113)

కుబేరాది అష్టదిక్పాలకులు దక్షుడు మొదలగువారు వీరభద్ర, ప్రమథ గణాల పాదధూళిని చూచి భయంకరమైన చీకటి (తమము) గా సందేహించి, ఆలోచించి చివరకు ఇది చీకటి కాదు పాదధూళి అనే నిశ్చయానికి వచ్చారు. కావున ఇది నిశ్చయాంత సందేహాలంకారము. ఈ అలంకారము వలన వీరభద్రాది శివగణాల లోకభీకర రౌద్ర, ఆగ్రహాలు వెల్లడి అవుతున్నాయి.

సూర్యుణ్ణి మెప్పించి స్యమంతక మణిని పొంది, ద్వారకకు వస్తున్న సత్రాజిత్తును చూచి -

**.. రవియో నీరజ గర్భుఁడో యొకఁడు చేరన్ వచ్చె మార్గంబునన్**

**అని యిట్లు పలికిన మూఢ జనులన్ జూచి గోవిందుండు నగి, మణి సమేతుండైన సత్రాజిత్తుండుగాని, సూర్యుండు గాఁడని పలికె.** (భాగ. 10. ఉత్తర - 50-51)

మూఢ జనులు సత్రాజిత్తును సూర్యుడో, బ్రహ్మయో అని సందేహిస్తుంటే 'కాదు ఇతడు సత్రాజి'త్తని శ్రీకృష్ణుడు చెప్పడం వల్ల ఇది నిశ్చయాంత సందేహం.

## 5. భ్రాంతిమత్

### స్థానము

భ్రాంతిమదలంకారము - సాదృశ్యమూలక అభేదప్రధాన అలంకారము. ఇది ఆరోపగర్భము.

### వ్యుత్పత్తి

"అతస్మిన్ తదితి ప్రత్యయః" (విద్యాధరుడు : 299)

అది కాని దానియందు అది యగు నన్న బుద్ధి ప్రత్యయము భ్రాంతి.

"భ్రాంతిర్విపర్యయ జ్ఞానం." (భోజుడు. 1984:123)

విపర్యయ జ్ఞానం భ్రాంతి.

ఉన్నది లేనట్లు లేనిది ఉన్నట్లు స్ఫురించుట భ్రాంతి. అది కవి కల్పనాశక్తిచే అలంకారత్వాన్ని పొందుతుంది.

## నిర్వచనాలు

**మమ్మటుడు** "భ్రాంతిమానన్య సంవిత్తత్తుల్య దర్శనే" (మమ్మటుడు: 748) అన్నాడు.

అనగా అప్రకృతమైన దానితో సమానమైన ప్రకృత వస్తువును చూచినపుడు కలిగే అప్రకృత వస్తుజ్ఞానం భ్రాంతిమదలంకారం.

**రుయ్యకుడు** "సాదృశ్యాత్ వస్త్వంతర ప్రతీతిః భ్రాంతిమాన్" (రుయ్యకుడు:14) అన్నాడు.

సాదృశ్యం వలన ఒక వస్తువు మరొక వస్తువుగా ప్రతీతమగుట భ్రాంతిమత్ అలంకారమని చెప్పెను.

**జయదేవుడు** 'ఉపమేయోపమానములందలి సాధారణ ధర్మమును బట్టి ఉపమేయము నుపమానముగా భ్రమించినట్లు వర్ణించుట భ్రాంతిమదాలంకారం.' (జయదేవుడు : 43) అన్నాడు.

**విద్యానాథుడు** " 'కవి సమయ సిద్ధమగు సాదృశము వలన ఉపమేయం ఉపమానముచే మరుగునపడి ఉపమానధర్మానుభవము గలిగిన యెడల భ్రాంతిమదలంకారము.' " (విద్యానాథుడు:473) అన్నాడు.

సాదృశ్యమనేది కవిసమయము వలన అలంకారత్వాన్ని సిద్ధింపజేస్తుందన్నమాట.

**విద్యాధరుడు** "వస్త్వంతర ప్రతీతి సాదృశ్య హేతుకమై విలసిల్లునేని భ్రాంతిమదలంకారము" (విద్యాధరుడు :299) అన్నాడు.

**జగన్నాథ పండితుడు** "సమానమగు ధర్మియందు తాదాత్మ్యమున ధర్మ్యంతరము ప్రకారము గాగల అనాహార్యమగు నిశ్చయమే సాదృశ్య ప్రయోజ్యమై చమత్కారమొనరించినచో ప్రకృతమున భ్రాంతి" (జగన్నాథ పండితుడ :289) అన్నాడు.

### భ్రాంతిమత్ - భాగవతంతో అన్వయం

*నిటలాలకములంటి నివుర జుంజుమ్మని*
*ముఖ సరోజము నిండ ముసురఁ దేంట్లు*
*నళుల జోపఁగఁ జిల్క లల్లనల్లనఁ జేరి*
*యోష్ఠబింబద్యుతులొడియ నుఱుకు*
*శుకములఁ దోలఁ జక్షుర్మీనములకు మం*
*దాకినీ పాఠీన లోకమెగుచు*
*మీన పంక్తులు దాఁట మెయిదీగతో రాయ*
*శంపాలతలు మింట సరణిగట్టు*
*శంపలను జయింపఁ జక్రవాకంబులు*
*కుచయుగంబుఁ దాఁకి క్రొవ్వుచూపు*
*మెలఁత మొగులు పిఱిది మెఱుఁగుఁ దీగయుఁబోలె*
*జలదవర్ణువెనుక జరుగునపుడు* (భాగ. 8-104)

అలవైకుంఠపురములో నగరిలో నామూల సౌధంబుదాపల మందార వనాంతరామృత సరస్సువద్ద లక్ష్మీదేవితో సరసాలాడుతున్న శ్రీమహావిష్ణువు మొసలి బారిన పడ్డ గజేంద్రుని ఆర్తనాదంతో ఆకస్మికంగా ఏకాగ్రమనస్కుడై లక్ష్మీదేవి పైటకొంగైనా విడవకుండా వస్తున్నాడు కావున విష్ణువు వెంట లక్ష్మీదేవి, లక్ష్మీదేవి వెంట వైకుంఠంలోని అందరూ కదలి వస్తున్నారు. లక్ష్మీదేవి పరిస్థితి ఎలా ఉందో ఈ పద్యంలో రమణీయంగా చెప్పారు పోతనగారు.

లక్ష్మీదేవి ముఖ కమలము నిండా తుమ్మెదలు ముసురుతున్నాయి. తుమ్మెదలను పారద్రోలితే, చిలుకలు ఓష్ఠబింబాన్ని (పెదవులనే దొండపండ్లను) కొరుకుటకు వెళ్తున్నాయి. చిలుకలను తోలితే, నేత్ర మీనములు గల లక్ష్మీదేవి మందాకినియై ఒప్పిన కారణంగా మీనములు వస్తున్నాయి. మీనములను తొలగిస్తే, మెరుపు తీగలు లక్ష్మీదేవి మెయి తీగతో రాయడానికి వస్తున్నాయి. వాటిని జయిస్తే చక్రవాక పక్షులు కుచములను తాకుతున్నాయి.

లక్ష్మీదేవి ముఖాన్ని కమలము అనుకొని భ్రమపడి తుమ్మెదలు ముసురుతున్నాయి. చిలుకలు లక్ష్మీదేవి పెదాలను దొండ పండ్లనుకొని కొరుకుటకు వస్తున్నాయి. నేత్రమీనములను చూసి లక్ష్మీదేవిని గంగానది అనుకొని చేపలు ఆమె వద్దకు వస్తున్నాయి. మెరుపులను జయిస్తే, లక్ష్మీదేవి స్తనములను చక్రవాకములనుకొని, చక్రవాకములు తాకుతున్నాయి.

ఈ పద్యంలో తుమ్మెదలు, చిలుకలు, మీనములు, మెరుపుతీగలు, చక్రవాకాలు, లక్ష్మీదేవి అవయములను చూచి భ్రమపడుతున్నాయి. కావున ఇది భ్రాంతిమత్ అలంకారము.

ఉపమేయము, ఉపమానముగా భ్రమింప బడిందంటే ఉపమేయానికి, దాన్ని ఉపమానంగా భ్రమించేటంత పోలిక ఉన్నదన్నమాట. ఈ సందర్భంలో లక్ష్మీదేవి అమాయక సౌందర్యం తెలియబడుతుంది.

వనితా! కృష్ణుడు నల్లని
ఘనమనియున్ వేణురవము గర్జనమనియున్
మనమున దలంచి రొప్పుచు
ననవరతము నెమలి తుటుము లాడెడి గంటే (భాగ. 10. పూర్వ - 782)

శ్రీకృష్ణున్ని మేఘంగా, వేణు రవాన్ని గర్జనగా భ్రమించి నెమలి సలమూహాలు ఆనందంగా, అవిచ్ఛిన్నంగా రొప్పుతూ నాట్యం చేస్తున్నాయట. అంటే కృష్ణుడు మేఘం కాదనే ఆలోచన కూడా రానంతగా మేఘం వలె ఉన్నాడన్నమాట. భ్రమించడం చెప్పబడింది కాబట్టి ఇది భ్రాంతిమత్ అలంకారం.

## 6. రూపకం (Metaphor)

### స్థానము

రూపకాలంకారము - సాదృశ్యమూలక - అభేద ప్రధానమున - ఆరోపగర్భాలంకారం. ఆలంకారికులందరు రూపకాన్ని అర్థాలంకారాలలో చేరిస్తే భోజుడు మాత్రం ఉభయాలంకారాలలో చేర్చాడు.

### వ్యుత్పత్తి

'రూపఏవరూపకం' - రూపము యొక్క ఆరోపణమే రూపకము. (రామరాజభూషణుడు: 590)
'రూపయతి' అనునట్లు ఉపమానోపమేయములకు ఏకరూపత్వమును కల్పించునదిగాన - రూపకము. (దండి: 83)
"ఉపమేయము ఆరోపముచే ఉపమానమున కనబడును గావున ఈ అలంకారమునకు రూపకమనునది యన్వర్థనామము." (విద్యానాథుడు: 461) "విషయిచే విషయము రూపము కలదగును గాన రూపకము" (రుయ్యకుడు: 11)

### నిర్వచనాలు.

**భరతుడు** "స్వవికల్పముచే ఉపమేయమునకు రూపాంతర కల్పనము 'రూపక' మనబడును" (భరతుడు: 452)
"ఔపమ్యమును అప్రధానమును చేసి పరస్పర భిన్నములగు ఉపమమానోపమేయాలలో ఉపమానము యొక్క అనురంజక శక్తిచే ఉపమేయము యొక్క రూపమును ఉపమాన రూపముగా నిర్ణయించి వర్ణించుట 'రూపక' మనబడును."(భరతుడు: 542)
**భామహుడు** 'గుణ సామ్యాన్ని బట్టి ఉపమేయోపమానములకు అభేదము చెప్పుట రూపకము'(భామహుడు:39)
**దండి** "ఉపమైవ తిరోభూత భేదా రూపకముచ్యతే" (దండి: 83)
కప్పివేయబడిన ఉపమాలంకారమే రూపకము.
**వామనుడు** "ఉపమానోపమేయస్య గుణ సామ్యాత్ తత్త్వారోపోరూపకమ్" (వామనుడు: 128)
గుణ సామ్యము ఉండుట వలన ఉపమేయమునకు ఉపమానముతో అభేదారోపము రూపకము.

రూపకమునకు ఉపమ మూలభూతము. (వామనుడు: 128) అని ఇతని అభిప్రాయము.

**కుంతకుడు** "ఉపచారైక సర్వస్వం యత్రతత్ సామ్యముద్వహత యదర్పయతి రూపం స్వం వస్తు తద్రూపకం మతమ్" (కుంతకుడు: 330)

ఎచట ఉపచారమునకు ప్రధాన జీవితమగు ఆ (లోకప్రసిద్ధమగు) సామ్యమును వహించుచున్నదై ఏ వస్తువు తన స్వరూపమును అర్పించునో అది రూపకమని చెప్పుదురు.

**మమ్మటుడు**"తద్రూపకమభేదోయ ఉపమానోపమేయయోః" (మమ్మటుడు: 613)
ఉపమేయోపమానములకు అభేదము చెప్పుట రూపకము.
**రుయ్యకుడు** "అభేదప్రాధాన్యే ఆరోపే ఆరోప విషయానపహ్నవే రూపకం" (రుయ్యకుడు: 11)

అభేద ప్రధానముగానున్న యారోపముండుట, యారోపవిషయమపహ్నూతం కాకుండుట రూపకాలంకారము.

**జయదేవుడు** "విషయ్యభేద తాద్రూప్య రంజనం విషయస్య యద్రూపకం" (జయదేవుడు: 32)

ఉపమేయమునకు ఉపమానము తోడి యభేదమును గాని, తాద్రూప్యమును గాని వర్ణించిన యెడల రూపకాలంకారము.

**విద్యానాథుడు** " 'ఆరోపమునకు విషయమయ్యు, మఱుగుపడకుండినట్టి ఉపమేయమునకు (ఆరోప్యమానము) ఉపమానము ఉపరంజకమైన యెడల రూపకమగును' " (విద్యానాథుడు: 416)

**జగన్నాథపండితుడు** "ఉపమేయతా నిర్ణాయకమును పురస్కరించుకొని యుపమేయమునందు శబ్దము వలన నిశ్చయింపబడుచున్న ఉపమాన తాదాత్మ్యము రూపకము" (జగన్నాథ పండితుడు: 214)

'రూపకంలో ఆరోపము రంజనమాత్రమే. రంజనమంటే రంగు వేయడం. రంగు వేసినపుడు పూర్వపు రంగు కప్పివేయబడుతుందే తప్ప వస్తువు కప్పివేయబడదు. దీనిలో ఉపమానముచే ఉపమేయము తిరోహితముకాదు' (రామరాజ భూషణుడు: 590) 'రూపకమునకు ఉపమమూలభూతము' (వామనుడు: 128) అంటే ఏదో ఒక సమాన ధర్మాన్ని పురస్కరించుకొని ఉపమేయోపమానాలకు అభేదం చెప్పబడాలి.

## వర్గీకరణ

రూపకమును పలువురు ఆలంకారికులు పలువిధాలుగా చెప్పిరి. వాటిలో మమ్మట (మమ్మట: 614-621), విద్యానాథుల (విద్యానాథుడు: 463-469) ననుసరించి రూపకవర్గీకరణను క్రింది విధంగా సూచించవచ్చు.

రూపకమును 3 రకాలుగా వర్గీకరించవచ్చు.

అవి. 1. సావయవ రూపకం, 2. నిరవయవ రూపకం, 3. పరంపరిత రూపకం.

### 1. సావయవ రూపకం

ఒకటికి మించిన వస్తువులు అవయవ, అవయవి విభావమున ఉండును. అవయవి, అవయవములకు రెండింటికి నిరూపణము ఉండుట. అంటే ఎన్ని ఉపమేయములున్నవో, అన్నింటికి తగినన్ని ఉపమానములుండును. ఇది 2 రకాలు.

1 ఎ. సమస్త వస్తువిషయము:- ఉపమేయ, ఉపమానములన్నీ కంఠోక్తిగా, వాచ్యంగా చెప్పబడాలి.

1 బి. ఏకదేశవర్తి:- ఉపమేయోపమానములలో కొన్ని వాచ్యంగా చెప్పబడి, కొన్ని చెప్పబడక ప్రతీయమానమైతే అది ఏకదేశవర్తి అవుతుంది. ఉపమేయానికి సంబంధించిన కొన్ని అవయములకే అభేదం వాచ్యంగా చెప్పబడుతుంది. కొన్నింటికి చెప్పబడదు. అవి ప్రతీయమానమగును.

### 2. నిరవయవ రూపకము

దీనిలో ఉపమేయము ఒకటే ఉంటుంది. ఇది 2 రకాలు.

2 ఎ. కేవల/శుద్ధరూపకము:- ఒక ఉపమేయము, ఒక ఉపమానము ఉండుట.

2 బి. మాలారూపరూపకము:- ఒక ఉపమేయము, అనేక ఉపమానము ఉండుట.

3. పరంపరితరూపకము:- ఒక రూపకము, మరొక రూపకమునకు హేతువగుట (లేదా) రూపకపరంపరగలది పరంపరిత రూపకము. ఇది 2 రకాలు.

3 ఎ. శ్లిష్టశబ్దమూలకము:- రూపకము శ్లేషయుక్తమగుట.

3 బి. అశ్లిష్టశబ్దమూలకము:- రూపకము శ్లేషరహితమగుట.

పైన చెప్పిన రకములు 1. వాక్యగత, 2. సమాసగతములనే భేదములతో మరల రెండు రెండు రకముల చొప ్పన విభజింపబడును.

## పారిభాషికపదం

ఆరోపము:- 'ఒకానొక వస్తువునందు తదన్యవస్తువు యొక్క ధర్మమున్నదని చెప్పుట ఆరోపము' (విద్యానాథుడు. 461)

## రూపకము - ఇతర అలంకారాలతో సామ్యభేదాలు

రూపకము - ఉపమ:- చూ. ఉపమ.

రూపకము - ఉత్ప్రేక్ష:- రూపకములో ఉపమేయోపమానాలకు అభేదం ఉండగా ఉత్ప్రేక్షలో ఉపమేయాన్ని, ఉపమానంగా ఊహించడం ఉంటుంది.

రూపకము - అతిశయోక్తి:- రూపకములో ఉపమానోపమేయాలకు అభేదము ప్రధానము. అతిశయోక్తిలో అతిశయము ప్రధానము, కాగా అభేదము, అనుషంగికము.

## రూపకం - భాగవతంతో అన్వయం

### 1. సావయవ రూపకం

ఉపమేయ, ఉపమానాల అవయవి, అవయవములకు అన్నింటికీ అభేదము నిరూపింపబడినచో సావయవరూపకం. ఇది 2 రకాలు. 1. సమస్తవస్తు విషయరూపకం, 2. ఏకదేశవర్తి రూపకం.

### 1.ఎ. సమస్తవస్తు విషయరూపకం

సమస్త వస్తువిషయ రూపకంలో - అవయవి, దాని అవయవములు సమగ్రంగా వాచ్యంగా చెప్పబడతాయి. ఇది శ్లేష మూలకంగా గానీ, శ్లేషలేకుండా గాని ఉండవచ్చు.

*లలిత స్కంధము కృష్ణమూలము శుకాలాపాభిరామంబు మం*
*జులతా శోభితమున్ సువర్ణ సుమనస్సుజ్ఞేయమున్ సుందరో*
*జ్జ్వల వృత్తంబు మహాఫలంబు విమల వ్యాసాల వాలంబునై*
*వెలయున్ భాగవతాఖ్యకల్పతరువుర్వీన్ సద్ద్విజశ్రేయమై.* (భాగ. 1-20)

మహా మహిమోపేతమైన శ్రీమహాభాగవతస్వరూప, స్వభావాలను సమస్తవస్తువిషయరూపకంలో శ్లేషద్వారా నిబంధించారు. ఈ పద్యంలో

| | | | | | |
|---|---|---|---|---|---|
| | | ఉపమేయయము | | - | ఉపమానము |
| అవయవి | - | భాగవతం | అవయవి | - | కల్పతరువు |
| అవయవములు | - | చక్కని ప్రధానకథాభాగం | అవయవములు | - | మృదువైన కాండము |
| | - | శ్రీకృష్ణుడు మూలాధారంగా గలది | | - | నల్లనని వేర్లుగలది |
| | - | శుకమహర్షిగానం చేసింది | | - | చిలుకలు పలుకుతుండేవి. |
| | | మృదైన శోభించునది | | | అందమైన లతలతో శోభించునది |
| | - | మంచి వర్ణములు (అక్షరములు)కలది | | - | బంగారుమయమైనది |
| | - | మంచి మనస్సుకల భక్తులచే తెలియబడునది. | | - | దేవతలు ఎరుగునది |
| | - | అందమైన కథ కలది | | - | విపులమైన పరిధి గలది |
| | - | మోక్షఫలాన్ని ఇచ్చునది | | - | తీయని పండ్లునిచ్చునది |
| | - | పవిత్రుడైన వ్యాస విరచితమైనది | | - | పవిత్రపాదు కలది |
| | - | బ్రాహ్మణులకు భక్తులకు శ్రేయసు కలిగించునిది | | - | దేవ, బ్రాహ్మణులకు శ్రేయుస్సుకలిగించునది. |

ఉపమేయసంబంధి అవయవి, అవయవములన్నిటికి, ఉపమాన సంబంధి అవయవి, అవయవములతో అభేదం కల్పించబడింది. కావున ఇది సమస్త వస్తు విషయరూపకం. ఇది శ్లేషమూలకమున నిర్వహించబడినది.

'కొందఱికిని సంస్కృతంబు గుణమగు'నని చెప్పిన పోతనగారు, చక్కగా అర్థమయ్యే సంస్కృత పదాలతో మోక్షదాయకమైన భాగవతస్వరూప స్వభావాల్ని శ్లేషమూలమున సంక్షిప్తీకరించి చెప్పారు.

భాగవతానికి, పారిజాత వృక్షానికి అభేదాన్ని కల్పిస్తూ చెప్పిన పద్యమిది. రెండూ కోరిన కోర్కెలు తీర్చేవే అయినా భాగవతం పరమాత్మ అయిన శ్రీకృష్ణుడు మూలాధారముగా గలది కావున శాశ్వతమోక్షఫలాన్ని ఇచ్చేది. ఆ విధంగా భాగవతం ఆశ్రిత జనుల పాలిటి పారిజాతమే. అంతకన్నా ఎక్కువే.

*విశ్వమోహనమైన వేణునినాదంబు*
*సరసగంభీరగర్జనముగాఁగ*
*మహనీయ నిర్మల మందహాసద్యుతి*
*లలిత సౌదామినీ లతికగాఁగఁ*
*దలచుట్టు బాగునఁ దనరు పింఛపు దండ*
*శైలభేదను శరాసనము గాఁగఁ*
*గరుణా కటాక్ష వీక్షణ సుధావర్షంబు*
*సలిలధారా ప్రవర్షంబు గాఁగ*
*జాడనేతెంచు గోపాల జనమునీంద్ర*
*చాతకంబుల దురవస్థఁ జక్కఁ జేసి*
*కృష్ణమేఘంబు బహుతరకీర్తి నొప్పె*
*విమల బృందావనాకాశ వీథియందు* (భాగ. 10. పూర్వ - 759)

రెండు మనోహరమైన దృశ్యాలకు అభేదం కల్పించబడిందిక్కడ. పోతనగారి భావుకతకు ఇదొక చక్కని ఉదాహరణ. ఉలాంటివి భాగవతంలో కొల్లలుగా కన్పిస్తాయి. ఈ పద్యంలో

| | | ఉపమేయము | | - | ఉపమానము |
|---|---|---|---|---|---|
| అవయవి | - | శ్రీకృష్ణుడు | అవయవి | - | మేఘం |
| అవయములు | - | 1. వేణునినాదం | అవయవములు | - | 1. గంభీరగర్జనం |
| | | 2. మందాహాసద్యుతి | | | 2. సౌదామినీలతిక |
| | | 3. తలచుట్టూ గల పింఛపు దండ | | | 3. ఇంద్రధనుస్సు |
| | | 4. కరుణాకటాక్షవీక్షణ సుధావర్షం | | | 4. వర్షం |
| | | 5. గోపాలురు, మునీంద్రులు | | | 5. చాతకములు |
| | | 6. బృందావనం | | | 6. ఆకాశం |

శ్రీకృష్ణుడు, తనరూపం, తనచుట్టూ గల వ్యక్తులకు, మేఘం, దాని చుట్టూ గల సుందరమైనవాటికి అవయవి, అవయవములతోటి అభేదం కల్పించబడింది. కావున ఇది సమస్తవస్తువిషయరూపకం.

బృందావనంలో గోవులు కాస్తున్న శ్రీకృష్ణుని ఈ వర్ణన కథా సందర్భానికి ఎంత అందాన్ని చేకూర్చిందో మాటలతో చెప్పలేం.

ఘన యమునానదీ కల్లో ఘోషంబు సరసమృదంగ ఘోషంబు గాఁగ (భాగ. 10. పూర్వ - 662)

అనే పద్యం సమస్తవస్తువిషయరూపకానికి రమ్యమైన ఉదాహరణ. మరొక ఉదాహరణ -

తనువున నంటిన ధరణీ పరాగంబు
పూసిన నెఱి భూతి పూఁత గాఁగ
ముందట వెలుఁగొందు ముక్తాలలామంబు
తొగల సంగడి కాని తునుక గాఁగ
ఫాలభాగంబుపైఁబరగు గావలి బొట్టు
కాముని గెల్చిన కన్నుగాఁగ
కంఠమాలికలోని ఘన నీలరత్నంబు
కమనీయమగు మెడకప్పుగాఁగ
హారవల్లులురగ హార వల్లులు గాఁగ
బాలులీల ప్రౌఢబాలకుండు
శివుని పగిది నొప్పె శివునికిందనకును
వేఱులేమిఁ దెలుప వెలయునట్లు (భాగ. 10. పూర్వ - 296)

చిన్ని కృష్ణునికి, శివునికి అభేదాన్ని చెప్పే ఈ పద్యం సమస్తవస్తు విషయరూపకానికి మంచి ఉదాహరణ. (చివరగా - శివున పగిది అనే చోట - పగిది అనే ఉపమావాచకం ఉన్నా ప్రాధాన్య వివక్షచేదాన్ని రూపకంగానే చెప్పాలి)

1.బి. ఏకదేశవర్తి రూపకం

సమస్తవస్తువిషయక రూపకంలో - అవయవి గాని, అవయవముగాని వాచ్యంగా చెప్పబడకపోతే (ప్రతీయమానమైతే) అది ఏకదేశవర్తి రూపకం.

ఏకదేశవర్తి రూపకానికి చక్కని ఉదాహరణలు భాగవతంలో లేవని చెప్పాలి. ఈ క్రింది పద్యాన్ని (కేవలం పద్యం వరకే గ్రహిస్తే) ఏకదేశవర్తి రూపకంగా చెప్పవచ్చు.

*విషయ శత్రులెల్ల విశ్రాంతి తోడ సా*
*రథిసమేతుఁడైన రథికుఁబట్టి*
*యుగ్ర తిమిర మృత్యు యుతమగు సంసార*
*కూపమధ్యమందుఁ గూల్తురధిప* (భాగ. 7-466)

| | | ఉపమేయము | | | - | ఉపమానము |
|---|---|---|---|---|---|---|
| అవయవి | - | .................. | | అవయవి | - | రథికుడు |
| అవయవములు | - | విషయములు | - | అవయము | - | శత్రువులు |
| | - | .................. | | | - | సారథి |
| | - | సంసారము | | | - | కూపం |

ఉపమాన సంబంధి అవయవమైన సారథి, అనువాటికి - ఉపమేయ సంబంధి అవయవము చెప్పబడలేదు. అల్లే ఉపమాన సంబంధి అవయవి అయిన రథికుడు అనుదానికి ఉపమేయ సంబంధి అవయవి చెప్పబడలేదు. కావున ఇది ఏకదశ వివర్తిరూపకం. పై పద్యంలో జీవుడే రథికుడు, బుద్ధిసారథి. ఈ జీవుడు, బుద్ధి అనేవి ప్రతీయమానమౌతున్నాయి.

*దేహము కారాగారము*
*మోహము నిగళంబు రాగముఖరములు రిపు*
*వ్యూహములు భక్తితో ని*
*న్నూహింపని యంత తడవు నో కమలాక్షా!* (భాగ. 10. పూర్వ-572)

దేహానికి కారాగారానికి, మోహానికి సంకెళ్ళకు, రాగాదులకు శత్రువ్యూహాలకు అభేదం చెప్పబడింది. ఉపమేయసంబంధి కమలాక్షునకు (విష్ణువుకు) ఎవరితోనూ అభేదం చెప్పబడలేదు. కమలాక్షుడు, రాగాదులనే శత్రు వ్యూహాలను భేదించి, మోహ సంకెళ్ళు వ్రక్కలు చేసి, దేహ కారాగారం నుండి విడిపించే - యోధుడు, అని ప్రతీయమాన మౌతుంది. ఈ 'యోధుడు' అనే మాట వాచ్యం చేయలేదు. కాబట్టి ఇది ఏక దేశవర్తి రూపకం.

**అరవిందాక్ష పదారవింద మకరందాసక్తులైయున్న స**
**త్పురుష శ్రేష్ఠుల వృత్తముల్ .....** (భాగ. 1-390)

విష్ణువు పాదాలకు, అరవిందములకు అభేదం చెప్పబడింది. ఏ అవయవానికి, మకరందంతో అభేదం కలదో చెప్పబడలేదు. అది 'భక్తి' అని ప్రతీయమానమవుతుంది. కావున ఇది ఏకదేశవర్తి రూపకం.

2. నిరవయవ రూపకం

అవయవ నిరూపణము లేకుండా, కేవలము అవయవి నిరూపణము చేయడాన్ని నిరవయవ రూపకం అంటారు.

2.ఎ. కేవల / శుద్ధ నిరవయవ రూపకం

నిరవయవరూపకం ఒకటే ఉండుటను కేవల / శుద్ధ నిరవయవ రూపకం అంటారు.

*శ్రీకైవల్య పదంబుఁ జేరుటకునై చింతించెదన్*
*... మహానందాంగనా డింభకున్* (భాగ. 1-1)

భక్త కవీశ్వరుడైన పోతనగారు, భాగవతాన్ని ప్రారంభిస్తూ 'నాంది'ప్రాయమైన మొదటి పద్యంలో - ఆశీర్నమస్క్రియావస్తు నిర్దేశం గావిస్తూ భాగవతానికి కేంద్రబిందువైన శ్రీకృష్ణున్ని శ్రీకైవల్యపదం చేరడానికై చింతిస్తున్నట్లు చెప్తూ కృష్ణున్ని - 'మహానందాంగనా

డింభకున్' అంటాడు. దీని ఒక అర్థం - మహా - నందాంగనా - డింభకుడు గొప్పదైన నందుని భార్య (యశోదాదేవి) యొక్క కుమారుడు (శ్రీకృష్ణుడు). ఇంకొక అర్థం - మహా - ఆనంద - అంగనా - డింభకుడు భాగవతం ద్వైతులనే కాక, అద్వైతులను కూడా సంతృప్తి పరిచే గ్రంథం. అందుకే సాకారుడు, సగుణుడు - అయిన శ్రీకృష్ణున్ని మరియు అదే సమయంలో అతని నిరాకార, నిర్గుణత్వాన్ని కూడా స్ఫురింపజేయదలచి పోతనగారు శ్లేషతో కలిపి 'మహానందంగనాడింభకున్' అని రూపకంలో నిబంధించారు. బ్రహ్మానందాన్నే పోతనగారిక్కడ మహానందం అంటున్నారు. మహానందం అనే అంగన యొక్క డింభకుడు. మహానందానికి అంగనకు అభేదం చెప్పాడు. అనేక దృక్పథాలలో విశ్లేషించుకో వడానికి వీలైన భాగవతంలోని మొదటి పద్యంలో ఇలా శ్లేషపూర్వక రూపకం ద్వారా రమణీయార్థాన్ని రప్పించారు. అందుకే పోతన గారు 'శ్రీవైకుంఠపురంబు' అనకుండా, 'శ్రీ కైవల్యపదంబు' అన్నాడు.

దేవతలను రాక్షసుల వలన రక్షించే ఉపాయం చెప్పమని అదితి, కశ్యప ప్రజాపతిని ప్రార్థిస్తూ -

*"కరుణాలోక సుధాఝురిం దనుపవే కళ్యాణ సంధాయకా"* (భాగ. 8-473) అంటుంది. భర్త అనుగ్రహాన్ని పొందుటకై ప్రార్థిస్తుంది. ఇచట కరుణావలోకమునకు, సుధాఝురికి అభేదం చెప్పబడింది. ఇదే సందర్భంలో అదితికి విష్ణువు ప్రత్యక్షమైనపుడు పోతనగారు -

*"దరహసిత వదనుండయి, యాశ్రిత కామధేనువైన యప్పరమేశ్వరుండు .. "* (భాగ. 8-485)

శ్రీమన్నారాయణునికి, కామధేనువుకి అభేదం చెప్పబడింది. కోర్కెలు తీర్చడంలో ఇద్దరిదీ ఒకే లక్షణం. అవయవములు ఏమీ లేకపోవుటచే ఇది నిరవయవ రూపకం. ఒకే ఉపమేయం, ఒకే ఉపమానం ఉండుటచే ఇది కేవల / శుద్ధ నిరవయవరూపకం.

2.బి. మాలా నిరవయవరూపకం

ఇంద్రుడు, బలిచక్రవర్తి పోరాడునపుడు, బలిచక్రవర్తి ఇంద్రునితో అంటున్నమాటలు -

*జయములపజయములు సంపదలాపద*

*లనిలచలిత దీపికాంచలములు*

*మెఱుగులమరవర్య! మిట్టిపడకు* (భాగ. 8-354)

జయాపజయములు, సంపదలు ఆపదలు - అనేవి గాలిలో కదలాడే జ్యోతులు, చంద్రకళలు, మేఘాలు, తరంగాలు, మెఱుగులు.

ఉపమేయము - జయాపజయాలు, సంపదలాపదలు

ఉపమానము - జ్యోతులు, చంద్రకళలు, మేఘాలు, తరంగాలు, మెఱుపులు.

జయాపజయాలు, సంపదలాపదలు - అనే ఉపమేయాలకు, వరుసగా - జ్యోతులతో అభేదము, చంద్రకళలతో అభేదము, మేఘాలతో అభేదము, తరంగాలతో అభేదము, మెరుపులతో అభేదము చెప్పబడింది.

జయాపజయాలు, సంపదలాపదలు - అనే ఉపమేయలకు 5 ఉపమానాలతో అభేదం చెప్పబడింది. అవయవి, అవయవ సంబంధం లేనిది కావున ఇది మాలానిరవయవ రూపకం.

గాలిలో పెట్టిన దీపం ఏక్షణంలో పెద్దగా వెలుగుతుందో ఎప్పుడు ఆరిపోతుందో తెలియదు. చంద్రకళలు 15 రోజులు క్రమంగా పెరుగుతూ 'పున్నమి'ని సంతరించుకొంటాయి. 15 రోజులు క్రమంగా తరుగుతూ అమావాస్యగా మారుతాయి. మేఘాలు వివిధ ఆకారాలను మార్చుకొంటూ ఉంటాయి. గాలిచే వేర్వేరు ప్రదేశాలకు కొనిపోబడతాయి. తరంగాలు కూడా గాలిని బట్టి పెద్దగా బలంగా మారడంగాని, చిన్నగా బలహీనంగా మారడం కాని ఉంటుంది. మెరుపుతీగలు క్షణకాలం ఎక్కువ వెలుగును ప్రసరింపజేసి, మరల వెంటనే మరుగైపోతాయి. అట్లే జయంగాని, అపజయంగాని, సంపదలు కలగటం గాని, ఆపదలు రావడం గాని కాలానుగుణంగా జరుగుతాయని, జయం, సంపదలు కలిగినపుడు పొంగిపోవటం గాని, వచ్చినవి శాశ్వతంగా ఉంటాయనుకోవడం పొరపాటు. అవి వచ్చినపుడు మిడిసిపడకూడదు. అపజయం, ఆపదలు వచ్చినపుడు క్రుంగిపోగూడదు. అనే హితవు చెప్పినట్లైనది. జయాపజయాలు, సంపదలు, ఆపదల చంచల స్వభావం చక్కని ఉపమానాల ద్వారా నిరూపింపబడింది.

3. పరంపరిత రూపకం

ఒక రూపకం మరో రూపకానికి కారణం అయితే అది పరంపరితరూపకం. ఇది శ్లిష్టం (శ్లేషయుక్తం)గా గాని, అశ్లిష్టంగా గాని ఉండవచ్చు. మరల ఇవి కేవల / శుద్ధంగా గాని, మాలా రూపకంగా గాని ఉండవచ్చు.

### 3.ఎ. కేవల శ్లిష్ట పరంపరిత రూపకం

అంపశయ్య పై పరుండిన భీష్ముడు, దేహత్యాగం చేయదలచి, తనకడకు వచ్చిన శ్రీకృష్ణుని నుతించాడు.

*"...... భీష్ముండు సం*

*శీలంబొప్ప నుతించెఁ గల్మష గజ శ్రేణీహరిన్ "* (భాగ. 1 - 215)

కల్మషములనే గజశ్రేణికి హరి. భీష్మ నిర్యాణ సమయంలో భీష్ముని పాపాలన్నీ హరించి, తనలో లీనం చేసుకోదలచాడు శ్రీకృష్ణుడు. కల్మషములకు గజశ్రేణికి అభేదం చెప్పబడింది. కల్మషములనేవి 'గజములు' కాబట్టి కృష్ణుడు 'హరి' అయినాడు. కృష్ణుడు / విష్ణువు అనే అర్థంలో చాలా పర్యాయ పదాలు ఉన్నాయి. అట్లే 'సింహం' అనే అర్థంలో చాలా పర్యాయ పదాలు ఉన్నాయి. అయితే ఇతరమైన వాటిని ప్రయోగించకుండా హరి అనే పదాన్ని ప్రయోగించడంలో ఒక విశిష్టత ఉంది. అది - 'హరి' అనేమాటకు - కృష్ణుడు/విష్ణువు అనీ, సింహం అనీ అర్థాలు ఉన్నాయి. ఇంకా 'హరించే' వాడు/హరించేది అనే అర్థం వస్తుంది.

కల్మష గజ శ్రేణి అనే రూపకం, హరికి (సింహానికి) శ్రీహరికి అభేదం కల్పించడానికి (మరో రూపకానికి) కారణమైంది. కావున ఇది పరంపరిత రూపకం. శ్లేషవలన ఏర్పడింది. కావున శ్లిష్టము, మాల రూపంలో లేకుండా ఒక రూపకం, మరొక రూపకానికి మాత్రమే కారణమైంది కాబట్టి కేవలము. కావున ఇది - కేవల - శ్లిష్ట - పరంపరితరూపకం.

### 3.ఎ. మాలా - శ్లిష్ట - పరంపరిత రూపకం

భాగవతంలో లక్ష్యములు అలభ్యం.

### 3.బి. కేవల - అశ్లిష్ట - పరంపరిత రూపకం

గాంధారీ ధృతరాష్ట్రులు హిమాలయానికి తపస్సుకు వెళ్ళినపుడు, అది తెలియని సంజయ, ధర్మరాజులు బాధపడుతుంటే అక్కడికి తుంబుర సహితంగా నారదుడు వస్తాడు. వారితో ధర్మరాజు -

*అక్కట! తల్లిదండ్రులు గృహంబున లేరు మహాత్మ!*

*... విపదంబురాశికిన్*

*నిక్కము గర్ణధారుడవు నీవు జగజ్జన పారదర్శనా !* (భాగ. 1-322)

'విపదంబు రాశి' అనే రూపకం 'నారదుడు కర్ణధారుడు' అనే రూపకానికి కారణమైంది. కావున ఇది పరంపరిత రూపకం. అవయవములు లేవు. శ్లేష లేదు కావున ఇది - కేవల - అశ్లిష్ట - పరంపరితరూపకం.

హిరణ్యకశిపునితో, ప్రహ్లాదునికి విద్యలు నేర్పిన చండమార్కులు ఇలా అంటున్నారు.

*మిత్రులము పురోహితులము*

*పాత్రులమే మదియు గాక భార్గవులము నీ*

*పుత్రుని నిటువలె జేయఁగ*

*శత్రులమే? దైత్యజలధి చంద్రమ వింటే?* (భాగ. 7-177)

రాక్షస వంశమనే సముద్రానికి చంద్రుడు హిరణ్యకశిపుడు 'దైత్యజలధి' అనే రూపకం హిరణ్యకశిపునికి చంద్రునికి అభేదం చెప్పడానికి కారణమైంది. ఇది కేవల - అశ్లిష్ట - పరంపరిత రూపకం.

### 3.బి. మాల - అశ్లిష్ట - పరంపరిత రూపకం

**సంసార జీమూత సంఘంబు విచ్చునే?**

**చక్రిదాస్య ప్రభంజనము లేక**

తాపత్రయాభీల దావాగ్నులాఱునే?
విష్ణుసేవామృత వృష్టిలేక
సర్వంకషాఘమౌజలరాసులింకునే?
హరిమనీషా బడబాగ్ని లేక
ఘన విపద్గాఢాంధకారంబు లణఁగునే?
పద్మాక్షునుతిరవి ప్రభలు లేక
నిరుపమ పునరావృత్తి నిష్కళంక
ముక్తినిధిఁ గానవచ్చునే? ముఖ్యమైన
శార్ఙ్గకోదండ చింతనాంజనములేక
తామర సగర్భునకునైన దానవేంద్ర (భాగ. 7-171)

సంసారమనే మేఘసమూహము చక్రిదాస్యమనే ప్రభంజనము లేకుండా చెదిరిపోవునా? తాపత్రయమనే దావాగ్ని విష్ణుసేవామృతమనే వర్షం లేకుండా చల్లారునా? పాపమనే సముద్రాలు హరిమనీషమనే బడబాగ్ని లేకుండా ఇంకునా? ఆపదలనే అంధకారం విష్ణుస్తుతి అనే సూర్యకాంతులు లేకుండా అణగవు. పునరావృత్తి లేని మోక్షాన్ని విష్ణు చింతన అనే కాటుక లేకుండా చూడలేము. దీనిలో 5 జంటల రూపకములు మాల రూపంలో, శ్లేష లేకుండా చెప్పబడ్డాయి. మరియు ప్రతివాక్యంలో మొదటి రూపకం, తరువాత రూపకానికి కారణమైంది. కావున ఇది మాల - అశ్లిష్ట - పరంపరిత రూపకం.

సంసారం అనేది మేఘసమూహం అని చెప్పడింది. ఆ మేఘాన్ని చెదరగొట్టేందుకు చక్రిదాస్యం అనే ప్రభంజనం తప్పకుండా కావాలి. అంటే ఈ వాక్యంలో మొదటి రూపకం తరువాత రూపకానికి కారణమైంది. ఇదే పరంపరిత రూపక లక్షణం. ఇలాగే మిగిలిన 4 జంటల రూపకములు చెప్పబడ్డాయి.

జ్ఞానదృష్టితో చూస్తే సంసారమెంత భయంకరమైనదో తెలుస్తుంది. అంత భయంకరమైనదాని నుండి తప్పించుకొనుటకు ఎంత శక్తివంతమైనదాన్ని ఆశ్రయించవలెనో పై పద్యం ద్వారా తెలుస్తుంది.

జీవుడు మాయకు లోనై అనేక పాప, పుణ్యకర్మల నాచరిస్తూ వాటి ఫలితంగా మరల మరల ఉచ్ఛ, నీచ జన్మల నెత్తుతూ అలా కొన్ని కోట్ల కోట్ల జన్మలనెత్తుతూ ఏదో ఒక జన్మలో దేవానుగ్రహంతో సమస్త కర్మలను భస్మమొనర్చి జ్ఞానియై పరమాత్మలో లీనమౌతాడు. (దీన్నే మోక్షం అంటారు.) పరమాత్మనుండి విడివడ్డది మొదలు తిరిగి పరమాత్మలో లీనమయ్యేంతవరకూ గల ఈ వ్యాపారమునంతటినీ 'సంసారం' అని భారతీయ వేదాంత పరిభాషలో అంటారు. భగవద్భక్తి భగవదనుగ్రహం లేకుండా సంసారంలో ఉన్న వ్యక్తి పునరావృత్తి లేని స్థితికి చేరడం అసాధ్యం. భగవద్భక్తి, ఎంతశక్తిమంతమైనదో దీన్ని బట్టి ఊహించవచ్చు.

సంసారం, తాపత్రయం, పాపాలు, ఆపదలు, పునరావృత్తి జీవనం అనేవి ఎంత బలమైన వ్యతిరేక శక్తులో వాటిని తొలగించడానికి చక్రిదాస్యం, విష్ణుదాస్యం, హరిమనీష, హరిస్తుతి, శార్ఙ్గ చింతనాంజనం ఎలా తప్పని సరియో, మాల - అశ్లిష్ట - పరంపరిత రూపకం ద్వారా పోతన గారు చక్కగా తెలియజేశారు.

*హరినామ కథన దావానల జ్వాలలఁ*
*గాలవేఘోరాఘ కాననములు*
*వైకంఠ దర్శన వాయు సంఘంబు చేఁ*
*దొలఁగవే బహుదుఃఖ తోయదములు*
*కమలనాభధ్యాన కంఠీరవంబు చేఁ*
*గూలవే సంతాప కుంజరములు*
*నారాయణస్మరణ ప్రభాకర దీప్తిఁ*
*దీఱవే షడ్వర్గ తిమిరతతులు*
*నళిన నయన భక్తి నావచేఁగాక సం*
*సార జలధి దాఁటి చనఁగరాదు*
*వేయునేల మాకు విష్ణుప్రభావంబు*

***దెలుపవయ్యా సూత! ధీసమేత!*** (భాగ. 1-48)

పై పద్యంలో ఐదు జంటల రూపకములు చెప్పబడ్డాయి. ప్రతివాక్యంలోని మొదటి రూపకం తరువత రూపకానికి కారణమవుతుంది. ఇది మాల - అశ్లిష్ట - పరంపరిత రూపకం.

హరినామ కథనం అనే దావానల జ్వాలలతో ఘోరమైన పాపములనే అరణ్యాలు కాల్చబడతాయి. వైకుంఠుని దర్శనం అనే వాయు సమూహంతో దుఃఖములు అనే మేఘాలు తొలగిపోతాయి. కమలనాభుని ధ్యానం అనే పెద్దపులిచే సంతాపములనే ఏనుగులు నేల కూలుతాయి. నారాయణుని స్మరణ అనే సూర్యకాంతితో కామక్రోధాదులు అనే చీకట్లు తొలగిపోతాయి. సంసారమనే సముద్రాన్ని విష్ణుభక్తి అనే నావతో తప్ప మరి దేనితోను దాటుటకు వీలుకాదు అని విష్ణుభక్తి మహిమను మాల - అశ్లిష్ట - పరంపరిత రూపకంలో వ్యక్తీకరించారు పోతనగారు.

## 7. పరిణామ

### 1. స్థానము

పరిణామాలంకారం సాదృశ్యమూలక - అభేదప్రధాన - ఆరోపగర్భాలంకారము.

### 2. వ్యుత్పత్తి

ఉపమానం, ఉపమేయంగా పరిణమించి అన్వయింపబడుతుంది కావున దీనికి పరిణామాంలకారమని అన్వర్థము.

### 3. నిర్వచనాలు

**విద్యానాథుడు** "ప్రకృతవస్తువునందు ఆరోపింపబడిన అప్రకృతము ఆ ప్రకృత తాదాత్మ్యము నొంది, ప్రకృతార్థమునకుపకపకరించెనేని అది పరిణామమగును" అని (విద్యానాథుడు: 470) అని వాక్రుచ్చెను.

**రుయ్యకుడు** "ఆరోప్యమానస్య ప్రకృతోపయోగిత్వే పరిణామః" (రుయ్యకుడు : 12) అనెను.

ఆరోప్యమానము ప్రకృతోపయోగి అయినచో పరిణామము.

**జయదేవుడు** "పరిణామః క్రియార్థశ్చేద్విషయీ విషయాత్మనా" (జయదేవుడు:38) ఉపమానము ఉపమేయరూపమున క్రియాసాధకమైన యెడల పరిణామము.

క్రియ ఆధారంగా ఉపమేయము గమ్యమానమగును. అంటే ఉపమేయము చెప్పబడక పోయినను. క్రియ ఆధారంగా పాఠకునికి స్ఫురిస్తుంది. ఉపమానము, ఉపమేయముగా పరిణమిస్తుంది కావున పరిణామము. దీనినే విద్యాధరుని మాటల్లో చూడవచ్చు.

**విద్యాధరుడు** "ప్రకృతం అప్రకృతయా పరిణామతీతి పరిణామః" (విద్యాధరుడు: 293) అన్నాడు.

**రామరాజభూషణుడు** 'ఉపమేయమందారోపింపబడిన ఉపమానము ఉపమేయ రూపంగానే పరిణమించి అన్వయించుచో పరిణామం' (రామరాజభూషణుడు:595) అనెను. అయితే ఉపమేయమందారోపింప బడిన ఉపమాన ధర్మం వలన ఉపమేయం ఉపమానంగా పరిణమించుట కూడా పరిణామమే.

**జగన్నాథపండితుడు** "విషయీ యత్ర విషయాత్మతయైవ ప్రకృతోపయోగీన స్వాతంత్ర్యేణ సపరిణామః" (జగన్నాథ పండతుడు:256) విషయి (ఉపమానము) ఎక్కడ విషయాత్మతతోనే ప్రకృతమున ఉపయోగియో, స్వతంత్రముగ గాదో అది పరిణామము.

వర్గీకరణ

పరిణామమును రుయ్యకుడు (రుయ్యకుడు: 13), విద్యానాథుడు (విద్యానాథుడు : 470), విద్యాధరుడు (విద్యాధరుడు: 295), జగన్నాథ పండితుడు (జగన్నాథ పండితుడు:256) 2 రకాలుగా వర్గీకరించిరి.

1. సమానాధికరణము (సమాన విభక్తులు గలది.) 2. వ్యధికరణము (భిన్నవిభక్తులు కలది)

**పరిణామము - ఇతర అలంకారాలతో సామ్యభేదాలు**

1. పరిణామము - రూపకము

పరిణామ రూపకములు రెంటిలో ఉపమేయ, ఉపమానములకు తాదాత్మ్యము ఉంటుంది. రూపకములో ఉపమానము

వాచ్యంగా స్పష్టంగా చెప్పబడుతుంది. పరిణామంలో ఉపమానము చెప్పబడదు. కానీ క్రియ ద్వారా పరోక్షంగా సూచ్యము చేయబడుతుంది.

2. పరిణామము - సమాసోక్తి

పరిణామ, సమాసోక్తులు రెంటిలో అప్రస్తుతము గమ్యమానమౌతుంది. సమాసోక్తిలోని క్రియ ప్రస్తుత, అప్రస్తుతములు రెంటిని అన్వయించేలాగా ఉంటుంది. పరిణామములోని క్రియ కేవలము అప్రస్తుతమునకే వర్తిస్తుంది. కాని ప్రస్తుతమునకు వర్తించదు.

**పరిణామ - భాగవతంతో అన్వయం**

ఉపమానం, ఉపమేయంగా పరిణమించుటకు భాగవతంలో ఉదాహరణలు అలభ్యం. ఉపమేయం, ఉపమానంగా పరిణమించుటకు ఉదాహరణలివ్వబడును.

ధ్రువుని తపస్సుకు శ్రీమహావిష్ణువు ప్రత్యక్షమవుతాడు. అప్పుడు ధ్రువుడు

**'నయనముల విభు మూర్తిఁ బానంబు సేయు'** (భాగ. 4-279)

శ్రీవిష్ణువు యొక్క మూర్తి (రూపం) (ఆకారం) ఘనరూపం (solid state)లో ఉంది. పానం చేయదగినది ద్రవరూప (liquid state) పదార్థం మాత్రమే. కాని ఇక్కడ విష్ణువు రూపాన్ని పానము చేస్తున్నట్లుగా / త్రాగుచున్నట్లుగా చెప్పబడింది, కావున ఘనరూపానికి, త్రాగడానికి పొసగదు. కావున శ్రీవిష్ణువు రూపం మకరందంగానో, అమృతంగానో పరిణమించాలి. అప్పుడే ఇది పొసగుతుంది. అయితే పద్యంలో ఉపమేయమైన విష్ణువు రూపాన్ని చెప్పాడు తప్ప, ఉపమానం కాదగిన అమృతం/ మకరందాన్ని చెప్పలేదు పోతనగారు. అంటే ఉపమేయమైన శ్రీమహావిష్ణురూపం అమృతం / మకరందంగా పరిణమించిందన్నమాట, అప్పుడే పానం చేయుట (త్రాగుట) పొసగుతుంది. కావున ఇది పరిణామము.

త్రాగేది నోటితో గాని, కళ్ళతో గాదు. పోతన గారి కల్పనాశక్తికి ఇదొక మచ్చుతునక. అనంత దివ్య సుందరమైన విష్ణువు రూపాన్ని కళ్ళతో చూస్తూ ఆనందాన్ని భజిస్తున్నాడన్నమాట.

ఒకసారి నారదుడు **'విశ్వప్రకారంబు వినిపింపుమనిన వికసిత ముఖుండై విరించి యిట్లనియె'** (భాగ. 2-79)

ముఖం వికసించదు. పుష్పం వికసిస్తుంది. ఉపమానమైన పుష్పాన్ని చెప్పకుండా దాని ధర్మాన్ని మాత్రం ఉపమేయమైన విరించి ముఖానికి అన్వయించి చెప్పారు పోతనగారు.

ముఖం పుష్పంగా పరిణమించినపుడే వికసించడం అనే ధర్మం అన్వయిస్తుంది. కాబట్టి ముఖం పుష్పంగా పరిణమించిందనుకోవాలి. కావున ఇది పరిణామాలంకారము.

## 8. అపహ్నుతి

**1. స్థానము**

అపహ్నుతి అలంకారము సాదృశ్యమూలక - అభేద ప్రధాన - ఆరోప గర్భాలంకారం (రుయ్యకుడు: 16) భోజుడొక్కడు దీనిని ఉభయాలంకారంగా చెప్పెను. మిగిలినవారు అర్థాలంకారంగా చెప్పారు.

**2. వ్యుత్పత్తి**

'అపహ్నుతి అంటే దాచబడినది అని అర్థం' (దండి:190)

దీనిలో ఉపమేయం దాచబడుతుంది, కావున దీనికీపేరు వచ్చింది.

**3. నిర్వచనాలు**

**మమ్మటుడు** 'ప్రకృతమైన ఉపమేయాన్ని నిషేధించి అప్రకృతమైన ఉపమానం సాధించబడితే అది అపహ్నుతి' (మమ్మటుడు: 625)

**రుయ్యకుడు** "విషయాపహ్నవే అపహ్నుతిః" (రుయ్యకుడు:15) విషయమును కప్పిపుచ్చగా వస్త్వంతర ప్రతీతియుండుట, ఆరోపవిషయము అపహ్నుతమగుట, ఆరోప్యమానం గోచరించుట ఈ అలంకార స్వరూపము.

**విద్యానాథుడు** "ఉపమేయమును కాదని నిషేధించి సామ్యము వలన ఉపమానారోపము కలిగినచో అపహ్నవమనబడును" (విద్యానాథుడు: 474)

**జగన్నాథ పండితుడు** "ఉపమేయతా నిర్ణాయకమును నిషేధించి ఆ నిషేధమునకు సమానాధికరణముగా నారోపింపబడు నుపమాన తాదాత్మ్యము అపహ్నుతి" (జగన్నాథ పండితుడు:310)

దీనిలో ఉపమేయమును నిషేధించడం, ఉపమానమును నిశ్చయించడం దీనిలో ముఖ్యం. దీనిలో ప్రయోగించబడే ఉపమేయ నిషేధ శబ్దములు మిష, చల, ఛద్మ, కపట, వ్యాజ, వపుః, ఆత్మ మొదలగునవి.

## 4. వర్గీకరణ

రుయ్యకుడు (రుయ్యకుడు:15), విద్యానాథుడు (విద్యానాథుడు:474), విద్యాధరుడు (విద్యాధరుడు : 305) దీనిని మూడు రకాలుగా వర్గీకరించిరి.

1. అపహ్నవించి ఆరోపించుట.
2. ఆరోపించి అపహ్నవించుట.
3. ఛలాది శబ్దములతో ఉపమేయము అసత్యమని చెప్పుట.

జయదేవుడు అపహ్నుతిని 6 రకాలుగా వర్గీకరించెను.

1. శుద్ధాపహ్నుతి, 2. హేత్వపహ్నుతి, 3. పర్యస్తాపహ్నుతి, 4. భ్రాంతాపహ్నుతి, 5. ఛేకాపహ్నుతి, 6. కైతవాపహ్నుతి (జయదేవుడు: 45-53)

### అపహ్నుతి - భాగవతంతో అన్వయం

వీరభద్రుడు చంపిన దక్షుణ్ణి తిరిగి శివుడు బ్రతికించినపుడు దక్షుడు శివునితో ఇలా అంటాడు.

*వినునీకపరాధుఁడనగు*
*నను దండించుటది దండనము గాదు మదిన్*
*నను రక్షించుటగా మన*
*మునఁ దలఁతును దేవ! యభవ! పురహర! రుద్రా!* (భాగ. 4 - 159)

ప్రకృత కార్యమైన దండించడాన్ని, ఇది దండన కాదు, రక్షించుట అనడాన్ని బట్టి ఇది అపహ్నుతి.

వీరభద్రుని పాదధూళిని చూచి, వివిధ లక్షణాలను బట్టి ఇది కల్పావసానం అనుకుంటున్న సందర్భంలోని పద్యం అపహ్నుతికి చక్కని ఉదాహరణ.

*ఈ ధూళి పుట్టుటకెయ్యది హేతువో?*
*విలయ సమీరమా? పొలయదిపుడు?*
*ప్రాచీన బర్హి ధరాపతి మహితోగ్ర*
*శాసనుండిపుడు రాజ్యంబు సేయఁ*
*జోర సంఘములకో రారాదు మఱిగోగ*
*ణాళి రాకకు సమయంబు గాదు*
*కావున నిప్పుడు గల్పావసానంబు*
*గాఁబోలుఁ గా కటుగాక యున్న*
*నిట్టి యౌత్పాతిక రజమెందేని గలదె?*
*యనుచు మనమున భయమందిరచటి జనులు.* (భాగ. 4-114)

భూమి, ఆకాశము నిండి, వీరభద్ర ప్రమథగణాలు పాదధూళిని చూచి, ఒక్కొక్కటిగా, పాదధూళికి ఉండవలసిన లక్షణాలు, సమయసందర్భాలు విశ్లేషించుకొని అవి ధూళికుండవలసిన లక్షణాలు కావని, అది కల్పాంత సమయమని, అనుకోవడం, ప్రకృతమైన

ధూళి కాదని అది అప్రకృతమైన కల్పావసానమనుకోవడం అపహ్నుతి.

## 9. మీలిత

### స్థానము

మీలితము లోకన్యాయ మూలాలంకారము.

### వ్యుత్పత్తి

'మీలితము అంటే కప్పువడుట అని అర్థం' (జయదేవుడు: 211) ఉపమేయోపమానములకు గల భేదలక్షణము ఇక్కడ కప్పువడుతుంది. కాబట్టి దీనిని మీలితము అంటారు.

### నిర్వచనాలు

భోజుడు

'సదృశత్వ సామర్థ్యము వల్ల భేదక లక్షణము కప్పువడిన యెడల మీలితాలంకారమగును' (భోజుడు:1984:146)

మమ్మటుడు

'సమానలక్షణం (చిహ్నం) గల రెండు వస్తువులలో అధిక బలం గల ఒకటి మరొక దాన్ని కప్పివేసినట్లు వర్తిస్తే అది మీలితము' (మమ్మటుడు:742)

జయదేవుడు

"మీలితం యది సాదృశ్యాద్భేద ఏవ నదృశ్యతే" (జయదేవుడు:211)

ఉపమానోపమేయములకు సాదృశ్యము వలన భేదము కనిపించకపోతే అది మీలితము.

విద్యానాథుడు

'ఒక వస్తువుచే మరియొక వస్తువు ఆచ్ఛాదితమగుట మీలనము' (విద్యానాథుడు: 500)

### వర్గీకరణ

మీలితాలంకారమును విద్యానాథుడు 2 రకాలుగా వర్గీకరించెను.

1. సహజ వస్తువుతో ఆగంతుక వస్తు మీలనము, 2. ఆగంతుక వస్తువుతో సహజ వస్తు మీలనం.

ఇతర అలంకారాలతో సామ్య భేదాలు

మీలితము - సామాన్యము

మీలితములో వస్తువులు వేరు, గుణములు సమానము. సామాన్యములో వస్తువులు వేరు, గుణములు వేరు, మీలితములో రెండు వస్తువులకు సమాన లక్షణాల వలన భేదం కనిపించదు. సామాన్యములో రెండు వస్తువులు సామ్య లక్షణాలు వలన ఏకాకారంగా భాసిస్తాయి.

**మీలితం - భాగవతంతో అన్వయం**

***కటపట రత్న కంబళ నికాయ కుటీరములుల్లసిల్ల ను***
***త్కటతర చామర ధ్వజపతాక కిరీట సితాత పత్ర వి***
***స్ఫుట ఘనహేతి దీధితి నభోమణిఁ గప్పఁగఁ దూర్యఘోషముల్***
***చటుల తిమింగిలోర్మిరవ సాగర ఘోషము నాక్రమింపఁగన్*** (భాగ. 10. ఉత్తర - 678)

శ్రీకృష్ణుడు భార్యలతో, బంధుమిత్ర పరివార సమేతంగా వైభవంగా హస్తినకు వస్తున్నాడు. చామర, ధ్వజ, పతాక, కిరీట, ఆతపత్రాల కాంతి ఆకాశాన్ని కప్పివేసింది. మంగళవాద్య ఘోష, సముద్రఘోషను ఆక్రమించింది.

చామరాదుల కాంతిలో ఆకాశం మీలితమై (లీనమైపోయి) ఆకాశం ప్రత్యేకంగా కనిపించడం లేదు. మంగళవాద్యఘోష, సముద్రఘోషలో మీలిత (కలిసి) పోయి, ఏ ఘోష ఎక్కడ నుండి వస్తుందో ప్రత్యేకంగా కనిపించడానికి వీలు లేకుండా ఉన్నాయి.

ఇక్కడ ఉపమేయ, ఉపమానాలైన చామరాదుల కాంతి, ఆకాశం మరియు తూర్యఘోష, సముద్రఘోష పరస్పరం మీలితమైనాయి (కలిసిపోయాయి) కావున ఇది మీలితాలంకారము.

## 10. ఉల్లేఖము

**స్థానము**

సాదృశ్యమూలక - అభేదప్రధానమున ఆరోపగర్భాలంకారము

**వ్యుత్పత్తి**

**'ఉల్లేఖమనగా వర్ణనమని యర్థము'** (జయదేవుడు:39)

**నిర్వచనాలు**

**రుయ్యకుడు** "ఏకస్యాపి నిమిత్తవశాదనే కధా గ్రహణముల్లేఖః" (రుయ్యకుడు:15)

ఒకే వస్తువు ఆయా కారణాల వల్ల అనేక విధాలుగా సంగృహీతమైతే ఉల్లేఖము.

**విద్యానాథుడు** "ఒక యుపమేయమే ఒకానొక ప్రయోజనాపేక్షతో గాని, అభిరుచితోగాని, శ్లేషతోగాని అనేక విధములుగా నుగ్గడింపబడెనేని ఉల్లేఖము" (విద్యానాథుడు:475)

**రామరాజభూషణుడు** "గ్రహీతృభేదముచే నొకే వస్తువు పెక్కు రూపములతో గ్రహింపబడినచో నుల్లేఖము" (రామరాజభూషణుడు:601) అయితే వీరు దీనికి సవరణ కూడా చెప్పిరి. అది -

"గ్రహీతృభేదము లేకున్నను విషయ భేదమును బట్టి యొక వస్తువనేక విధములుగా వర్ణింపబడినను నుల్లేఖమే" అని చెప్పెను. (రామరాజభూషణుడు:602)

**వర్గీకరణ**

జగన్నాథ పండితుడు ఉల్లేఖమును 1. శుద్ధము, 2. సంకీర్ణము అని రెండు రకాలుగా చెప్పెను.

1. శుద్ధ ఉల్లేఖము - కేవల ఉల్లేఖముండుట.
2. సంకీర్ణ ఉల్లేఖము - ఇతర అలంకారాలతో కూడిన ఉల్లేఖము.

**ఉల్లేఖము - భాగవతంతో అన్వయం**

*రవిబింబంబుపమింపఁ బాత్రమగు ఛత్రం బై శిరోరత్నమై*
*శ్రవణాలంకృతమై గళాభరణమై సౌవర్ణ కేయూరమై*
*చెవిమత్కంకణమై కటిస్థలి నుదంచ ద్వస్త్రమై నూపుర*
*ప్రవరంబై పదపీఠమై వటుఁడు దా బ్రహ్మాండము న్నిండుచోన్* (భాగ. 8-621)

బలి చక్రవర్తి మూడు అడుగుల నేలను దానం చేయగానే చిన్ని బాలుని రూపంలో ఉన్న వామనుడు త్రివిక్రముడై విరాడ్ రూపాన్ని ధరిస్తూ విశ్వమంతా నిండునపుడు అతని పెరుగుదలను సూచించే విధంగా సూర్యుడు తనకు ఏవిధంగా ఒక్కొక్క అవయవానికి ఆభరణమై నిలిచాడో చెప్పాడు.

వామనుడు క్రమంగా పెరుగుతూ విశ్వాంతరాళాన్ని నిండునపుడు సూర్యుడు వామనునికి మొదట గొడుగు వలె తరువాత శిరోరత్నమై తరువాత చెవి ఆభరణంమై, ఆపై కంఠమునకు ఆభరణమై, భుజమునకు కేయూరమై, చేతికి కంకణమై, నడుముకు వస్త్రమై, క్రమంగా కాలికి అందెయై, పాదం కింద పీఠమై ప్రకాశించాడు.

ఒకే సూర్యుడు వివిధ ఆభరణాలుగా వర్ణింపబడటం వల్ల ఇది ఉల్లేఖము. తెలుగు వారి నాల్కలపై చిరస్థాయిగా నిలిచిపోయే అసంఖ్యాక భాగవత పద్యాలలో ఇది ఒకటి.

వామనుడు విశ్వరూపాన్ని ధరించే ఈ కథా సందర్భములో ఉల్లేఖాలంకారం కాక ఏ ఇతర అలంకారమూ, ఇంత రమణీయంగా ఉండదు. అదే పోతన గారి అలంకారశిల్పం.

*చెయువుల్ సేయుతఱిన్ విధాతకరణిం జెన్నొందు సంతోషదృ*
*ష్టియుతుండై నగుచున్ జనార్దనుని మాఢ్కిన్ బొల్చు రోషించి యు*
*న్న యెడన్ రుద్రుని భంగి నొప్పును సుఖానందంబునుం బొంది త*
*న్మయుఁడై బ్రహ్మము భాతి బాలుఁడమరున్ బాహుళ్య బాల్యంబునన్* (భాగ. 10. పూర్వ-194)

చిన్ని కృష్ణుడు వివిధ చేష్టలు చేయునపుడు బ్రహ్మదేవుని వలె, సంతోష దృష్టితో ఉన్నపుడు విష్ణువుగాను, కోపము వచ్చినపుడు శివునిగాను, సుఖానందాన్ని పొందునపుడు పరబ్రహ్మం లాగా కనిపిస్తాడు. ఒకే కృష్ణున్ని వివిధ చేష్టలను బట్టి త్రిమూర్తులుగా మరియు పరబ్రహ్మంగా ఉంటాడని చెప్పడం వలన ఇది ఉల్లేఖం.

శ్రీకృష్ణ తత్వాన్ని స్ఫురింపజేసేందుకు భక్త కవీశ్వరుడైన పోతన గారు ఇలాంటి అలంకారాలను సందర్భోచితంగా వాడారు.

బలరామకృష్ణుల బాల క్రీడలను వర్ణిస్తూ పోతన గారు -

*తలలెత్తి మెల్లనఁ దడవి యాడెడు వేళ*
*పన్నగాధీశుల పగిదిఁ దాల్తు*
*రంగ సంమృష్ట పంకాంగరాగంబుల*
*నేనుగు గున్నల యెత్తువత్తు*
*రసమంబులైన జవాతిరేకంబుల*
*సింగపుఁ గొదమల సిరి వహింతు*
*రాననంబుల కాంతులంతంత కెక్కంగ*
*బాలార్క చంద్రుల పగిదిఁ దోఁతు*
*రెలమి తల్లుల చన్నుఁ బాలెల్లఁ ద్రావి*
*పరమయోగోద్భవామృత పాన లీల*
*సోలి యోగుల విధమున సొంపు గందు*
*రాకుమారులు జనమనోహారులగుచు* (భాగ. 10. పూర్వ - 290) అంటారు.

బలరామ కృష్ణులు పన్నగాధీశుల వలె, ఏనుగు గున్నల వలె, కొదమ సింహాల వలె, బాల సూర్య చంద్రుల వలె, యోగుల వలె యున్నారని చెప్పడం ఉల్లేఖం.

*విందులకును బ్రహ్మసుఖా*
*నందంబై, భక్త గణములకు దైవతమై*
*నందునికి బాలుఁ డగు హరి*
*పొందు గనిరి గొల్లలిట్టి పుణ్యులు గలరే* (భాగ. 10. పూర్వ - 460)

జ్ఞానులకు పరబ్రహ్మస్వరూపమై, భక్తులకు దైవమైన శ్రీకృష్ణుడు నందునికి మాత్రం బాలుడి లాగా కనిపించాడు. వారి వారి దృష్టిని బట్టి వారి హృదయ పరిపక్వతను బట్టి ఒకే కృష్ణుడు వేర్వేరు విధాలుగా కన్పిస్తాడు.

## 11. వ్యతిరేక

స్థానము

వ్యతిరేకాలంకారం సాదృశ్యమూలక - భేద ప్రధానమని రుయ్యకుడు, గమ్యోపమ్యమూలక భేదప్రధానమని విద్యానాథుడు (విద్యానాథుడు:521), విద్యాధరుడు (విద్యాధరుడు:333) చెప్పిరి.

### నిర్వచనాలు

**వామనుడు** "ఉపమేయస్య గుణాతిరేకిత్వం వ్యతిరేకః" (వామనుడు:147) ఉపమేయమునకు గుణాతిరేకత్వము వ్యతిరేకము.
**మమ్మటుడు** "ఉపమానాద్యదన్యస్య వ్యతిరేకః స ఏవ సః" (మమ్మటుడు: 658) ఉపమానం కంటే ఉపమేయానికి అధిక్యం చెప్పుట వ్యతిరేకము.
**రుయ్యకుడు** "భేదప్రాధాన్యే ఉపమానా దుపమేయసః

ఆధిక్యే విపర్యయేవావ్యతిరేకః" (రుయ్యకుడు: 22)

భేదప్రాధాన్యమున ఉపమానము కన్న ఉపమేయానికి ఆధిక్యము కాని న్యూనత్వము కాని వర్ణింపబడుట వ్యతిరేకాలంకారమని ఇతని అభిప్రాయం. అంటే ఉపమానము కన్న ఉపమేయాన్ని అధికంగాగాని, న్యూనంగాగాని ఎలా వర్ణించిననూ అది వ్యతిరేకంగానే పరిగణింపబడుతుందనుట గమనార్హం. ఈ అభిప్రాయాన్నే విద్యానాథుడు వెలిబుచ్చాడు.

**విద్యానాథుడు** "ఉపమానము కంటె ఉపమేయమునకు ఆధిక్యము గాని న్యూనతనుగాని ప్రతిపాదించుట వలన భేదప్రధానమగు సాధర్మ్యము గమ్యమానమగుచో వ్యతిరేకాలంకారము" (విద్యానాథుడు:521)

**వ్యతిరేకం - భాగవతముతో అన్వయము**

*గిరిచరమిథునములోలిన్*
*బరికింపగఁ గృష్ణపాద పద్మాంకితమై*
*సురరాజు నగరి కంటెను*
*దరుణీ! బృందావనంబు తద్దయు నొప్పెన్* (భాగ. 10. పూర్వ - 783)

శ్రీకృష్ణుడు, గోపికలతో కలిసి శరత్కాలంలో వేణువునూదునపుడు, అది సకలైశ్వర్యములతో తులతూగే స్వర్గలోకం కన్నా గొప్పగా ఉందట.

ఉపమేయమైన బృందావనాన్ని, ఉపమానమైన స్వర్గంలోకం కన్నా ఎక్కువ జేసి చెప్పడం వలన ఇది వ్యతిరేక అలంకారం. ఆ ఔన్నత్యం ఎక్కడ నుండ వచ్చిందంటారా? చతుర్దశ భువన మోహనుడైన శ్రీకృష్ణుని నుండి.

*అంక రహితేందు వదనలు*
*పంకజ లోచనునిఁ గూడి పరఁగ నటింపన్*
*గింకిణుల నూపురంబుల*
*కంకణముల మ్రోత లెసఁగెఁగర్ణోత్సవమై* (భాగ. 10. పూర్వ - 1083)

శ్రీకృష్ణుడు గోపికలతో కలిసి రాసక్రీడలాడుచున్నాడు. గోపికల ముఖాలు మచ్చలేని చంద్రుని వలె ఉన్నాయట. ఉపమేయము గోపికల ముఖాలు. ఉపమానం చంద్రుడు. అయితే ఇక్కడ చంద్రునికి మచ్చ ఉంటుంది. అప్పుడు గోపికల ముఖాలతో పోల్పదగదు. ఒకవేళ చంద్రునికి మచ్చ లేకుంటే ఎలా ఉంటాడో, గోపికల ముఖాలు అలా ఉంటాయట. ఉపమానములో ఒక తప్పుని వ్యక్తీకరించి, ఆ తప్పు ఉపమేయంలో లేదనడం ద్వారా ఉపమానం కన్నా ఉపమేయమే గొప్పదని చెప్పినట్లయినది. కావున ఇది వ్యతిరేక అలంకారము.

*కణఁకన్ వారలు వెండి మోక్షనిరపేక్ష స్వాంతులై యుండియు*
*న్నణి మాద్యష్ట విభూతి సేవితము నిత్యానంద సంధాయియున్*
*గణనాతీతము నప్రమేయము సమగ్ర శ్రీకమున్ సర్వల*
*క్షణ సంయుక్త వికుంఠలోక పదవిన్ గైకొందు రత్యున్నతిన్* (భాగ. 3-872)

కపిలాచార్యుడు, వైకుంఠలోకము గురించి చెబుతూ, నిరాకార, నిర్గుణ, పరబ్రహ్మమైన, మోక్షాన్ని కోరని వారు కూడా శ్రీవిష్ణువుతో సాంగత్యమునపేక్షించి, వైకుంఠలోక పదవిని కోరుకుంటారని చెప్పడం ద్వారా అప్రకృతమైన మోక్షపదవి కన్న, ప్రకృతవైకుంఠ పదవి గొప్పదని చెప్పినట్లయినది. కావున ఇది వ్యతిరేకాలంకారము.

## 12. ప్రతీప

**స్థానము**

ప్రతీపము గమ్యౌపమ్యాలంకారము.

**వ్యుత్పత్తి**

'ప్రతీపమంటే విపరీతము' ఉపమకు విపరీతముగా ఉండటం వలన దీనికి 'ప్రతీపము' అని పేరు వచ్చింది. (రామరాజ భూషణుడు:675)

'ఉపమేయం, ఉపమానానికి ప్రతికూలంగా ఉండటం వలన దీనికి ప్రతీపము' అని పేరు వచ్చింది. (మమ్మటుడు:750)

"ప్రతి గచ్ఛంతి అపః యస్మిన్ ప్రతీపః
నిమ్నోన్నత స్థలం తత్సదృశాలంకారే లక్షణ" (గణపతిశాస్త్రి: 741)

ఎదురుగా, మెరకకు (ఎత్తైన ప్రదేశానికి) నీరుపోవుట వంటిది ఈ ప్రతీపము.

## నిర్వచనాలు

**రామరాజభూషణుడు**

"ఉపమానము యొక్క పని యుపమేయమే చేయు చుండుటచే
ఉపమానమేల? అని వర్ణింపబడినచో బ్రతీపము" (రామరాజభూషణుడు: 675)

**మమ్మటుడు** 'అసాధారణగుణం ఉండటం వలన పూర్వం ఎన్నడూ ఉపమానంగా కల్పించబడని వస్తువు ఉపమానంగా చెప్పబడినా కూడా అది ప్రతీపమే' (మమ్మటుడ:752)

**జగన్నాథ పండితుడు** ప్రసిద్ధౌపమ్యమునకు విపరీతముగ వర్ణించబడిన ప్రతీపము. (జగన్నాథ పండితుడు:730)

## వర్గీకరణ

**విద్యాధరుడు** ప్రతీపమును 2 రకాలుగా వర్గీకరించెను. (విద్యాధరుడు: 436)

1. ఉపమానమునకు ఆక్షేపము నిరూపించుట ప్రతీపము.
2. ఉపమానమునకు ఉపమేయత్వము కల్పించిన ప్రతీపము.

**జగన్నాథ పండితుడు** 5 రకాలుగా వర్గీకరించెను. (జగన్నాథ పండితుడు: 730)

1. ప్రసిద్ధౌపమ్యమునకు విపరీతముగా వర్ణించుట.
2. ఉపమానమునకు ఉపమేయత్వ కల్పన.
3. ఉపమేయమునకు ఉపమానత్వ కల్పన.
4. ఉపమాన కైమర్థ్యము.
5. సాదృశ విఘటనము.

## ప్రతీపం - భాగవతంతో అన్వయం.

సాధారణంగా ప్రతీపము 2 రకాలుగా ఉంటుంది.

1. ఉపమానం లక్షణాలు ఉపమేయంలోనే ఉండగా, ఉపమానమెందుకు? అనడం.
2. కవి ప్రసిద్ధమైన ఉపమానాన్ని ఉపమేయంగాను, ఉపమేయాన్ని ఉపమానంగాను చేసి చెప్పుట.

*ఈ రెండు రకాలకు ఉదాహరణలు.*

*ఏ వర్తనంబున నింతకాలము మీరు*
*సంచరించితిరయ్య జగతిలోన*
*నేతీర్థములు గంటి రెక్కడనుంటిరి*
*భావింపమీవంటి భాగవతులు*
*దీర్థసంఘంబుల ధిక్కరింతురు గదా!*
*మీయందు విష్ణుండు మెఱయు కతన*
*మీరె తీర్థంబులు మీకంటె మిక్కిలి*
*తీర్థంబులు ఉన్నవే? తెలిసి చూడ*
*వేరె తీర్థంబులవనిపై వెదకనేల*
*మిమ్ముఁ బొడగని భావించు మేలె చాలు.....* (భాగ. 1-299)

తీర్థాటనం చేసి హస్తినాపురానికి తిరిగి వచ్చి విదురునితో ధర్మరాజు సంభాషిస్తుంటాడు. భక్తులలో విష్ణువు ఉండటం వలన పుణ్యనదుల లక్షణాలు (ఇతరుల పాపాన్ని క్షాళనం చేయటం వంటివి) వారికి ఉంటాయి. మీ యందు విష్ణుండు మెఱయుకతన మీరె తీర్థంబులు, మీకంటె మిక్కిలి తీర్థంబులున్నవే? వేరే తీర్థంబులవనిపై వెదకనేల? పుణ్యతీర్థాల లక్షణాలన్నీ విదురుని లోనే ఉండటం వలన ఇతరమైన తీర్థాల కోసం వెదకవలసిన పనిలేదని అంటాడు ధర్మరాజు.

ఉపమానమైన తీర్థముల లక్షణాలు, ఉపమేయమైన విదురునిలో ఉన్నవని చెప్పడం ఉపమానమైన తీర్థములతో పనిలేదనడం వలన ఇది ప్రతీపాలంకారం.

ప్రచేతసులకు కన్పించిన ఒక సరస్సును గురించి వర్ణిస్తూ - అది

*..... సజ్జనుని హృదయముఁ బోలి స్వచ్ఛమగుచు*
*హరిపదాకృతి దివిజ విహారమగుచు*
*ఘనుని సిరిభంగి నర్థ జీవనము నగుచు*
*మానవతి వృత్తి గతిని నిమ్నంబునగుచు*
*ఒప్పునట్టి సరోవరంబుఁ బొడగని ....* (భాగ. 4-691, 692)

సరోవరాన్ని ఉపమానంగాను, సజ్జనుని హృదయము, హరి పాదము, ఘనుని సిరి, మానవతి వృత్తులను ఉపమేయంగా చెప్పడం కవి సంప్రదాయం. దానికి వ్యతిరేకంగా పోతన ఇచ్చట సరోవరాన్ని ఉపమేయంగాను, సజ్జనుని హృదయము హరిపాదము, ఘనుని సిరి, మానవతి వృత్తిని ఉపమానంగాను చిత్రీకరించడం జరిగింది కావున ఇది ప్రతీపము.

ప్రచేతసుల తపస్సుకు అనుకూలంగా ఉండాలి కాబట్టి సరస్సు అంత నిర్మలమైందిగా వర్ణింపవలసి వచ్చింది.

*నిర్మలంబు సమము నిష్కంటకంబునై*
*పుణ్యపురుషమనము బోలి కంస*
*సైన్య తుంగమగుచు సంతుష్టలోకాంత*
*రంగమైన మల్లరంగమొప్పె* (భాగ. 10. పూర్వ - 1307)

బలరామకృష్ణులను మల్లయుద్ధానికి పిలిచాడు కంసుడు. ఆ మల్లయుద్ధ రంగం నిర్మలము, సమము, నిష్కంటకమై, పుణ్యపురుషుని మనస్సులాగా ఉందట.

ప్రసిద్ధోపమేయ, ఉపమానవ్యత్యయం ఉంది. కావున ఇది ప్రతీపము.

## 13. అర్థాంతరన్యాస

### స్థానం

అర్థాంతరన్యాసాలంకారమును రుయ్యకుడు విశేషణ విచ్ఛిత్తి మూలకాలంకారముగాను, విద్యానాథుడు (విద్యానాథుడు:539) గమ్యౌపమ్యాలంకారంగాను చెప్పిరి.

### వ్యుత్పత్తి

అర్థాంతరమును న్యాసము (సమర్థన) చేయుట చేత దీనికీపేరు వచ్చింది. (జయదేవుడు:179)

### నిర్వచనాలు

దండి "ఒక వాక్యముచే ప్రతిపాదితమగు విషయమును సమర్థించుటకై మరియొక వాక్యమును ప్రయోగించినచో అది అర్థాంతర న్యాసాలంకారము" (దండి:124) అనెను.

ఈ అలంకారములో రెండు వాక్యాలు ఉంటాయి. ఒకదానిని సమర్థించుటకై మరొక వాక్యము చెప్పబడును. వాటిలో ఒకటి 'సామాన్యము' అయితే రెండవది 'విశేషము' అవుతుంది. ఒకటి కారణమైతే మరొకటి కార్యమౌతుంది.

**మమ్మటుడు** "సామాన్యం వా విశేషోవా తదన్యేవ సమర్థ్యతే
యత్తు సోఽర్థాంతరన్యాసః సాధర్మ్యేణేతరేణవా" (మమ్మటుడు:673)

సాధర్మ్యం చేతగాని వైధర్మ్యం చేతగాని సామాన్యం విశేషం చేత సమర్థించబడటం, లేదా విశేషం సామాన్యం చేత సమర్థించబడటం అర్థాంతరన్యాసాలంకారం.

**రుయ్యకుడు** "సామాన్య విశేష భావమునగాని, కార్యకారణభావమునగాని నిర్దిష్టమైన ప్రకృతమును సమిర్థించుట యర్థాంతరన్యాసం" అని చెప్పెను. (రుయ్యకుడు:30)

**భోజుడు** "ఒకానొక వస్తువును ప్రస్తుతించి, దానిని సమర్థించుటకు, సమర్థమైన మరొక వస్తువును వ్యాసము గావించిన యెడల అది అర్థాంతర న్యాసముగా గ్రాహ్యమగును." (భోజుడు. 1984:434)

## పారిభాషిక పదాలు

ఈ అలంకారానికి కొన్ని పారిభాషిక పదాల భావాలను చూద్దాం.

సాధర్మ్యం - సమానమైన ధర్మాలు కలిగి యుండడం.

వైధర్మ్యం - విరుద్ధ ధర్మాలు కలిగి ఉండడం.

సామాన్యం - ఒక జాతి, ఒక వర్ణం మొత్తానికి వర్తించే నామవాచకాన్ని సామాన్యం (General) అంటారు.

విశేషం - ప్రత్యేకమైన ఒక వ్యక్తి, ఒక వస్తువు, ఒక ప్రాణికి వర్తించే నామవాచకాన్నివిశేష్యం (Specific) అంటారు.

## వర్గీకరణ

**జయదేవుడు** - అర్థాంతరన్యాసము 2 రకాలని చెప్పెను. అవి

1. విశేషాన్ని సామాన్యముతో సమర్థించటం, 2. సామాన్యాన్ని విశేష్యంతో సమర్థించడం. (జయదేవుడు:179)

**మమ్మటుడు** పై రెండు భేదాలు సాధర్మ్య వైధర్మ్య భేదాలతో 4 రకాలగునని చెప్పెను. (మమ్మటుడు:673-674)

**విద్యానాథుడు** అర్థాంతరన్యాసమును 3 రకాలుగా చెప్పెను. అవి

1. కార్యకారణ భావ అర్థాంతరన్యాసం
2. సామాన్యముచే సమర్థింపబడిన విశేషము గలది.
3. విశేషముచే సమర్థింపబడిన సామాన్యము గలది. (విద్యానాథుడు:539-540)

## అర్థాంతరన్యాసం - భాగవతంతో అన్వయం

***ముదితా! యేటికి గ్రుంకి తీవు మనలో మోహంబు చింతింపవే***
***వదనాంభోజము సూపవే మృదువు నీ వాక్యంబు విన్పింపవే***
***తుది సేయందగ దంచు నీశ్వరుడునై దుఃఖించె భూపాలుఁడా***
***పద గాదే ప్రియురాలిఁ బాసిన యెడన్ భావింపనెవ్వారికిన్*** (భాగ. 9-356)

సీతాదేవి లవకుశులను వాల్మీకికి ఒప్పగించి భూగర్భంలోకి వెళ్ళిపోగా శ్రీరాముడు దుఃఖిస్తున్న సందర్భంలోని పద్యమిది.

సీతా వియోగంతో శ్రీరాముడు దుఃఖించడం అనేది విశేషం, (నిర్దిష్టమైన వ్యక్తులకు చెందింది). ప్రియురాలు / భార్య తనను విడిచి వెళ్తే ఎంతటి మగవారికైనా ఆపదే కదా? అనేది సామాన్యం (అందరికీ వర్తించేది). శ్రీరాముని బాధను ప్రపంచంలోని అందరి బాధతో సమర్థిస్తున్నాడు కావున ఇది అర్థాంతరన్యాస అలంకారము. ఇది విశేష్యాన్ని సామాన్యంతో సమర్థించడం అనే రకానికి చెందింది.

స్వయంగా భగవంతుడై కూడా భార్యా వియోగానికి శ్రీరాముడు ఏడ్చాడంటే ఇక సామాన్యుల సంగతి ఎంత దుర్భరంగా ఉంటుందో కదా.

***హరుఁడు గళము నందు హాలాహలము వెట్టఁ***
***గప్పుగలిగి తొడవు కరణినొప్పె***
***సాధు రక్షణంబు సజ్జనునకు నెన్న***
***భూషణంబు గాదె భూవరేంద్ర*** (భాగ. 8-247)

క్షీరసాగరాన్ని మథించినపుడు విషము ఏర్పడగా అందరినీ రక్షించడం కోసం పరమశివుడు ఆ హాలాహలాన్ని తన కంఠంలో దాచాడు. అది తనకు కంఠాభరణమై ఒప్పింది.

అందరినీ రక్షించుటకు తన క్షేమాన్ని కూడా లక్ష్యపెట్టకుండా శివుడు హాలాహలాన్ని మ్రింగడం విశేషం. సజ్జనుడైన వానికి, సాధువులను రక్షించడమనేది భూషణం కాదా? అనడం సామాన్యం. ఇక్కడ విశేషాన్ని సామాన్యంతో సమర్థించడం జరిగింది. కావున ఇది అర్థాంతరన్యాస అలంకారము.

శివుని ప్రేమ ఎంతగా పరిమితి లేనిదో ఈ పద్యము ద్వారా తెలుస్తుంది.

***పురసతుల విలోకనములు***

***సరసాలాపములు నర్మ సంభోగములున్***

***మరగి హరిమనల నొల్లడు***

***నరవరులోయమ్మ నూతనప్రియులుగదే*** (భాగ. 10. పూర్వ - 1216)

కంసుని పంపున అక్రూరుడు, బలరామకృష్ణుల తీసికొని పోవుటకు బృందావనానికి వస్తాడు.

శ్రీకృష్ణుడు మధురాపట్టణానికి వెళ్తే, అక్కడ సమస్త ఐశ్వర్యాలతో తులతూగే పట్టణ స్త్రీలను మరగి, పల్లెటూరి స్త్రీలైన తమను మరచిపోతాడని గోపికలు తమలో అనుకొంటుంటారు.

శ్రీకృష్ణుడు మధురాపట్టణ స్త్రీలను మరగి, బృందావన స్త్రీలను మరచిపోవడం విశేషం. నరవరులు నూతన ప్రియులు గదా! అనడం సామాన్యం. ఇక్కడ విశేషాన్ని సామాన్యంతో సమర్థించడం జరిగింది. కావున ఇది అర్థాంతరన్యాసాలంకారం. పైవన్నీ సాధర్మ్యమునకు ఉదాహరణలు. ఇపుడు వైధర్మ్యమునకు ఉదాహరణను చూద్దాం.

***అయ్యవగకు రాముఁడలయక రాజుల***

***నిరువదొక్కమారు లరసి చంపె***

***జగతి మీద రాజశబ్దంబు లేకుండ***

***సూడు దీర్పలేని సుతుఁడు సుతుఁడె*** (భాగ. 9-486)

కార్తవీర్యార్జునుని కుమారులు, జమదగ్ని మహర్షిని చంపి వెళ్తారు. అప్పుడు వీరినందరినీ చంపి, ఇక భూమిపై రాజులు లేకుండా ఇరవైయొక్కమారులు తిరిగి తిరిగి చంపేస్తాడు పరశురాముడు. తండ్రికి అపకారము చేసిన వారిని చంపాడు పరశురాముడు. సూడు దీర్పలేని సుతుడు సుతుడే? తల్లిదండ్రులకు అపకారము చేసిన వారిపై ప్రతీకారము తీర్చుకోవడం 'సూడు దీర్పడం'. ఈ సూడు దీర్పలేని వాడు అనడం వైధర్మ్యం.

భాగవతంలో సామాన్య విషయాన్ని, విశేష విషయంతో సమర్థించడానికి లక్ష్యరూప పద్యాలు అలభ్యం.

## 14. ఉభయన్యాస

ఉభయన్యాస అలంకారమును రుద్రటుడు, వాగ్భటుడు-1 మాత్రమే చెప్పారు. అర్థాంతర న్యాసము వంటిదే ఉభయన్యాసము. కానీ చిన్న భేదము కలదు.

**వాగ్భటుడు-1**

వాగ్భటుడు చెప్పినట్లు "సామాన్యం సామాన్యేన యత్సమర్థ్యతే స ఉభయన్యాస" (చూ. అలంకార్‌కోశ్)

సామాన్యమును సామాన్యము చేత సమర్థించడం ఉభయన్యాసం, అర్థాంతర న్యాసము నందు - సామాన్యమును విశేషము చేత, విశేషమును సామాన్యము చేత సమర్థించడం ఉంటుంది. పరిశేషన్యాయమున సామాన్యమును సామాన్యము చేత సమర్థించడం, విశేషమును విశేషము చేత సమర్థించడం చెప్పవలసి ఉంది. ఉభయన్యాసమున సామాన్యమును సామాన్యము చేత సమర్థించడం ఉంటుంది. మిగిలిన విశేషాన్ని విశేషంతో సమర్థించడానికి కూడా (సౌలభ్యం కోసం) ఇక్కడే ఉదాహరణలిస్తున్నాను.

**ఉభయన్యాస - భాగవతంతో అన్వయం**

1. సామాన్యాన్ని సామాన్యంతో సమర్థించడం

***అక్క తల్లి చెల్లెలాత్మజ యెక్కిన***

*పాను పెక్కఁ జనదు పద్మనయన*

*పరమయోగికైన బలిమిని నింద్రియ*

*గ్రామమధిక పీడఁ గలుగఁ జేయు*  (భాగ. 9-582)

యయాతికి అనేక సంవత్సరాలు సుఖభోగాలనుభవించి, చివరకు వాటిపై విరక్తి పొంది, వాటి అనర్థాల గూర్చి భావించుకొనే సందర్భంలోని పద్యమిది.

అక్క, తల్లి, చెల్లెలు, కూతురుతో కలసి ఎటువంటి మగవాడైనా ఒకే పాన్పుపై పడుకోకూడదు. ఎందుకంటే మనస్సు చలించే అవకాశం ఉంది. ఇది అందరికీ వర్తించే విషయం కాబట్టి సామాన్యం. ఎలాంటి యోగికైనా ఇంద్రియములు బలీయమైనవై నిరోధించుటకు కష్టసాధ్యమగును. ఇది అందరు యోగులకు వర్తించే విషయం కావున ఇది కూడా సామాన్యమే. అంటే ఒక సామాన్య విషయాన్ని, మరొక సామాన్య విషయంతో సమర్థించడం వలన ఇది ఉభయన్యాసాలంకారం.

2. విశేషాన్ని విశేషంతో సమర్థించడం

*తజ్జనిని లోగిటంగల*

*రజ్జు పరంపరలఁ గ్రమ్మఱన్ సుతుఁగట్టన్*

*బొజ్జ దిరిగి రాదయ్యె జ*

*గజ్జాలములున్న బొజ్జఁ గట్టన్ వశమే*  (భాగ. 10. పూర్వ - 383)

యశోదా దేవి శ్రీకృష్ణుని తాళ్ళతో కట్టడం, అవి చాలకపోవడం, నిర్దిష్ట వ్యక్తులకు చెందిన విషయం కాబట్టి ఇది విశేషం. జగజ్జాలములున్న బొజ్జ గలవాడు కృష్ణుడే. కావున ఇది కూడా విశేష విషయమే.

ఈ పద్యంలో ఒక విశేష విషయాన్ని మరొక విశేష విషయంతో సమర్థించడం జరిగింది.

*లౌకికమెల్లక నన్నా*

*లోకించు ప్రపన్నులకును లోబడి కరుణా*

*లోకముల బోషింతును*

*నాకాశ్రిత రక్షణములు నైసర్గికముల్*  (భాగ. 10. పూర్వ - 1434)

ప్రసన్నులను, కరుణాలోకములతో పోషించేది శ్రీకృష్ణపరమాత్మ ఇది విశేషం. ఆశ్రిత రక్షణములు శ్రీకృష్ణునికే నైసర్గికములు. ఇది విశేష్యమే. ఇక్కడ ఒక విశేష విషయాన్ని, మరొ విశేష విషయంతో సమర్థించడం జరిగింది.

## 15. అర్థాపత్తి

### స్థానము

అర్థాపత్తి అలంకారాన్ని రుయ్యకుడు - వాక్యాన్యాయమూలాలంకారమనీ, విద్యానాథుడు గమ్యోపమ్యాలంకారమనీ చెప్పారు. జయదేవుడు దీనిని 'కావ్యార్థాపత్తి' అని పేర్కొనెను.

### వ్యుత్పత్తి

'అర్థాంతరమాపాదయతి' అన్న వ్యుత్పత్తిని బట్టి క్రొత్త అర్థమును స్ఫురింపజేయుట వలన దీనికి 'అర్థాపత్తి' అనేది అన్వర్థనామధేయం.

### నిర్వచనాలు

**రుయ్యకుడు** "దండాపూపికాన్యాయమున అర్థాంతర సిద్ధి అర్థాపత్తి" (రుయ్యకుడు:52)

దండా పూపికా న్యాయము - ఎలుక కర్రను కొరికిందంటే దానికున్న అపూపము (భక్ష్యము)ను కూడా భక్షించిందని అర్థం. దీనిని దండాపూపికా న్యాయము అంటారు. అంత పెద్దదే జరిగిందంటే చిన్నదైన ఇదెంత? అనే అర్థం స్ఫురిస్తే దాన్ని అర్థాపత్తి అంటారు.

**జయదేవుడు** "కైముత్యేనార్థ సంసిద్ధిః కావ్యార్థాపత్తి రిష్యతే" (జయదేవుడు:175)

కైముతికన్యాయము చేత ఇష్టార్థ సిద్ధి వర్ణితమైన యెడల అది కావ్యార్థాపత్తి.

కైముతిక న్యాయము 'కిముత' అంటే వేరేమాట చెప్పడమెందుకు? అని అర్థం. అత్యంత కష్టసాధ్యమైన పనిని తెలిపి సులభమైన పని ఇదెంత అనడం కైముతిక న్యాయం.

విద్యానాథుడు, విశ్వనాథుడు మొదలగు వారందరూ జయదేవుని అభిప్రాయాన్నే వెలిబుచ్చారు.

**వర్గీకరణ**

**జగన్నాథపండితుడు** అర్థాపత్తి 4 రకాలని చెప్పెను. (జగన్నాథ పండితుడు:707)

1. ప్రకృతం వల్ల ప్రకృతం సిద్ధించుట.
2. అప్రకృతం వల్ల అప్రకృతం సిద్ధించుట.
3. ప్రకృతం వల్ల అప్రకృతం సిద్ధించుట.
4. అప్రకృతం వల్ల ప్రకృతం సిద్ధించుట.

**అర్థాపత్తి - భాగవతంతో అన్వయం**

*గర్భమందుఁ గమల గర్భాండ శతములు*
*నిముడు కొన నటించు నీశ్వరేశ!*
*నీకు నొక్క మానినీ గర్భరక్షణ*
*మెంత బరువు నిర్వహింతు గాక* (భాగ. 1-180)

అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మాస్త్రము ఉత్తర గర్భంలోని శిశువును దహిస్తుంటే ఉత్తర శ్రీకృష్ణునిలా ప్రార్థిస్తుంది. వందల కొలది బ్రహ్మాండములను తన గర్భంలో ఉంచుకొని రక్షిస్తూ ఉండి అనంత శక్తిమంతుడైన శ్రీకృష్ణునికి, ఒక్క స్త్రీగర్భంలోని శిశువును బ్రహ్మాస్త్ర ప్రభావం నుండి రక్షించడమెంత? అంటూ కైముతిక న్యాయమున చెప్పబడింది. కావున ఇది అర్థాపత్తి.

*ఆ మధురోక్తులానయములాదరహాసము లా దయారసం*
*బామురిపెంబు లా తగవు లాగమన క్రియలా మనోహర*
*ప్రేమకరావలోకనము ప్రీతిఁ గనుంగొనలేమి మాధవున్*
*గామినులేల? నిర్దళిత కర్ములు యోగులు వాయనేర్తురే* (భాగ. 1-406)

శ్రీకృష్ణుని మధురాతి మధురమైన ఉక్తులు, నయములు, దరహాసములు, దయ, చేష్టలు, చూపులు మొదలగు వానిని సమస్త వ్యామోహాలను, బంధాలను, ఆశలను తొలగించుకొన్న మగవారైన యోగులే చూడకుండా ఉండలేరు. అటువంటిది ఎన్నో కోరికలు గలవారు, అందునా స్త్రీలు అయినా గోపికలెలా చూడకుండా ఉండగలరు అని చెప్పడం అర్థాపత్తి.

*అమ్మహాత్ము షోడశాబ్ద వయోరూప*
*గమన గుణ విలాస కౌశలములు*
*ముక్తి కాంత సూచి మోహిత యగునన*
*నితర కాంతలెల్ల నేమి చెప్ప* (భాగ. 1-515)

పదహారేళ్ళ వయస్సులో ఉన్న శ్రీకృష్ణుని చూస్తే మోక్షమనే కాంతయే మోహింపబడుతుండగా, ఇక సాధారణ కాంతల సంగతి వేరే చెప్పాలా? అనడం అర్థాపత్తి.

ఈ అర్థాపత్తి అలంకారం ద్వారా శ్రీకృష్ణుడు ఎంతటి అందాన్ని కలిగి ఉండేవాడో ఊహించుకోవచ్చు.

ఎంత కష్టమైన పనినైనా చేయవచ్చు కాని దీన్ని మాత్రం చేయలేము అనే అర్థం సిద్ధించేలాగా చెప్పినా కూడా దాన్ని అర్థపత్తిగా గ్రహించడం ముక్తం. దీనికి భాగవతంలో చక్కని ఉదాహరణలున్నాయి.

*ఖరదంష్ట్రాభ్రుకుటీ సటా నఖయు నుగ్రధ్వానమున్ రక్తకే*
*సరయుం దీర్ఘ తరాంత్ర మాలికయు భాస్వన్నేత్రయున్నైన నీ*
*నరసింహాకృతిఁ జూచి నే వెఱవఁ బూర్ణ క్రూర దుర్వార దు*
*ర్భర సంసార దవాగ్నికిన్ వెఱతున్ నీ పాదాశ్రయుం జేయవే* (భాగ. 7-355)

హిరణ్యాకశిపుణ్ని చంపిన తరువాత కూడా నరసింహస్వామి కోపం శమించలేదు. మహోగ్రరూపంతో విశ్వం కంపించి పోయేలాగా గర్జిస్తున్నపుడు, స్వామి కోపాగ్ని తగ్గింపజేయ నెంచి సమస్త దేవతలు, ఋషులు, బ్రహ్మ, శివుడు, లక్ష్మీదేవి వంటివారు అంతా ప్రార్థిస్తారు. కానీ కోపం తగ్గదు. బ్రహ్మ, రుద్ర, లక్ష్మీ దేవి వంటి వారే దగ్గరకు పోవడానికి భయపడతారు. అప్పుడు ప్రహ్లాదుడు ఉగ్రనరసింహస్వామి దగ్గరకు భయం లేకుండా వెళ్ళి ఇలా అంటాడు. విశ్వాన్నంతా భయభ్రాంతులు చేసే నీ రూపానికి నేను భయపడను. నేనొక్క సంసారానికే భయపడతాను అంటాడు.

బ్రహ్మ రుద్రాదులు భయపడే నరసింహ రూపానికి భయపడనని, ఒక్క సంసారానికి భయపడతాననడం ద్వారా సంసారం ఇంకెంత భయంకరమో తెలుస్తుంది.

సంసారమంటే ఏమిటో చూద్దాం. తమిళంలో 'సంసార' అంటే కొందరు ఒకచోట చేరి కాసేపు మాట్లాడుకోవడం. ఇది చాలా సంకుచితార్థం. తెలుగులో సంసారమంటే తల్లిదండ్రులు, భార్యాపిల్లలతో కలసి జీవనం చేయడం. ఇది కొంత విస్తృతార్థం కలది. హిందీలో సంసారమంటే ప్రపంచమని అర్థం. ఇది మరికొంచెం విస్తృతార్థం కలది. సంస్కృతంలో ప్రత్యేకించి వేదాంత పరిభాషలో 'సంసార'మనే మాటకు చాలా విస్తృతార్థమున్నది. జీవుడు పూర్వజన్మలలో చేసిన పుణ్య, పాపకర్మల ననుసరించి, ఉత్తమ, నీచ జన్మలనెత్తుతు, మరల మరల కర్మలనాచరిస్తూ పునరపి జననం, పునరపి మరణం అన్నట్లుగా మాయావశమున ఎన్నో యుగాలు, యెన్నో కోట్ల కోట్ల జన్మల నెత్తుతూ ఉంటారు. దీన్నే 'సంసారం' అంటారు. ఎప్పుడు నిజమైన దైవభక్తి ఏర్పడుతుందో అది పరిపక్వమైనపుడు ఈ సంసార వలయాన్ని ఛేదించుకొని భగవంతునిలో చేరతాడు (మోక్షాన్ని పొందుతాడు). కావున ప్రహ్లాదుడు ఆ సంసారానికి భయపడతానంటున్నాడు.

చిన్న పనికే ఎక్కువ ఫలితం లభిస్తుండగా పెద్దపనికి ఇంకెంత లభస్తుందో కదా అనే అర్థం సిద్ధించినా కూడా దాన్ని అర్థాపత్తిలో చేర్చడం యుక్తం.

***పరమేశ్వరార్పణంబుగఁ***
***బరజనులకు భిక్షమిడినఁ బరమ పదమునన్***
***బరఁ గెదరఁట తుది సాక్షా***
***త్పరమేశ్వరు భిక్షసేయు ఫలమెట్టిదియో*** (భాగ. 10. పూర్వ-868)

'కృష్ణార్పణ' మంటూ ఇతరులకు భిక్షవేస్తేనే మోక్షం లభిస్తుందట. అటువంటిది సాక్షాత్తు ఆ శ్రీకృష్ణునికి భోజనం పెడితే దాని ఫలితం ఇంకెటువంటిదో కదా! అనడం అర్థాపత్తి.

## 16. తుల్యయోగిత

### స్థానము

తుల్యయోగితాలంకారము - సాదృశ్యమూలక గమ్యౌపమ్యాలంకారము

### వ్యుత్పత్తి

"తుల్యములగు వానికి (సమాన ధర్మము గలవానికి) యోగము (సంబంధము) గలిగినది. కావున ఈ యంలంకారము తుల్యయోగిత యని సార్థకం" (విద్యానాథుడు:515)

"తుల్యధర్మేణ యోగః జాతః అస్యాం" (విద్యాధరుడు:321)

తుల్యధర్మం కలదానితో యోగం కలది తుల్యయోగిత.

### నిర్వచనాలు

**భామహుడు** "తక్కువదానికి కూడా విశిష్టమైన దానితో గుణ సామ్యమున్నదని చెప్పవలె ననెడు ఇచ్ఛతో అది విశిష్టమైన దానితో సమానమగు కార్యమును చేసినట్లు చెప్పుట తుల్యయోగితాలంకారము" (భామహుడు:82)

**దండి** 'చెప్పదలచిన గుణములచే ప్రసిద్ధులైన వారితో సమముగా చేసి స్తోత్రము కొరకు గాని, నిందకొరకు గాని ఒకానొకని

యొక్క ఏ కీర్తనం కలదో అది తుల్యయోగితగా అంగీకరింపబడినది. (దండి:204)
**వామనుడు** "విశిష్టమైనదానితో సామ్యము కొరకై ఏక కాలము నందు క్రియతో సంబంధము తుల్యయోగిత" (వామనుడు:150)
**మమ్మటుడు** "నియతానాం సకృద్ధర్మః సా పునస్తుల్యయోగితా"(మమ్మటుడు:657) కేవల ప్రకృతముల యొక్కగాని, కేవల అప్రకృతముల యొక్క గాని ధర్మం ఒక్కమారు గ్రహింపబడినట్లయితే అది తుల్యయోగితాలంకారము.
రుయ్యకుడు (రుయ్యకుడు:18), జయదేవుడు (జయదేవుడు:73), విద్యానాథుడు (విద్యానాథుడు: 514), రామరాజభూషణుడు (రామరాజభూషణుడు: 651-652), జగన్నాథ పండితుడు (జగన్నాథ పండితుడు: 376), విద్యాధరుడు (విద్యాధరుడు: 320), మొదలగువారు మమ్మటుని అభిప్రాయాన్నే వెలిబుచ్చారు.

" 'ప్రస్తుతములలో ఒకదానిని ఉపమానము చేసి (కల్పించి) తక్కిన దానిని ఉపమేయములు చేయుట వలనను అట్లే యప్రస్తుత ములలోను ఒకదానిని ఉమేయము చేసి, తక్కిన వానిని ఉపమానములుగా కలిగించుట వలననూ ఔపమ్యము సిద్ధించును.' " (విద్యానాథుడు: 515)

తుల్యయోగిత లోని ఔపమ్యము వాస్తవము కాదు కల్పితము. (విద్యానాథుడు:515)
తుల్యయోగితలో ధర్మైక్యం ఏకపదం ద్వారా తెలుపబపడును.

## వర్గీకరణ

గమ్యౌపమ్యము - 1. పదార్థ గతము, 2. వాక్యగతము అని రెండు రకాలు. పదార్థగతమగు అలంకారములు తుల్యయోగిత, దీపకములు.

'తుల్యయోగితలో ధర్మైక్యం అనునది కేవల ప్రకృతములకు గాని, కేవల అప్రకృతములకు గాని ఉండును. ఈ రెండు విధములు గుణ, క్రియలనే భేదములతో 4 రకములగును.' (విద్యానాథుడు:514)
**జయదేవుడు** మాత్రము దీనిని మూడు రకాలుగా వర్గీకరించెను. 1. కేవల ప్రకృతములకు ధర్మైక్యం, 2. కేవల అప్రకృతములకు ధర్మైక్యం. (జయదేవుడు: 73). 2. మిత్రుని యందును, శత్రువుల యందును తుల్యవర్తనము వర్ణింపబడుట. (జయదేవుడు:75)
3. ఉత్తమ గుణ గరిష్టులతో సమీకరించి వర్ణించుట. (జయదేవుడు: 77)

## తుల్యయోగిత - ఇతర అలంకారములతో సామ్యభేదాలు

తుల్యయోగిత - ఉపమ

ఉపమాలంకారములో సామ్యం శబ్దం చేత స్పష్టముగ చెప్పబడుతున్నది. తుల్య యోగితలో సామ్యం అర్థం చేత సిద్ధించును.

తుల్య యోగిత - దీపకం

తుల్యయోగిత దీపకములు రెండు పదార్థగతగమ్యౌపమ్య మూలకములే. కాని తుల్య యోగితలో ధర్మైక్యం కేవల ప్రకృతములకు, కేవల అప్రకృతములకు ఉండగా దీపకములో ప్రకృత, అప్రకృతములకు ఉంటుది.

తుల్యయోగిత - ప్రతివస్తూపమ, దృష్టాంత, నిదర్శన, అర్థాంతర న్యాసములు

తుల్యయోగిత, ప్రతివస్తూపమ, దృష్టాంత, నిదర్శిన అలంకారములు అన్ని గమ్యౌపమ్య మూలకములే అయినా తుల్యయోగితలో ధర్మైక్యము పదార్థగతము కాగా, ప్రతివస్తూపమ, దృష్టాంత, నిదర్శన, అర్థాంతరన్యాయములలో వాక్యగతము.

## తుల్యయోగిత - భాగవతంతో అన్వయం

1. కేవల ప్రకృతములకు ధర్మైక్యం

*శుద్ధసాధులందు సురలందు శ్రుతులందు*
*గోవులందు విప్రకోటియందు*
*ధర్మపదవి యందుఁ దలఁగి నాయందు వాఁ*
*డెన్నఁడలుగు నాఁడె హింసఁ జెందు* (భాగ. 7-111)

హిరణ్యకశిపుని బాధలు భరించలేక దేవతలు శ్రీమన్నారాయణుని ప్రార్థించగా విష్ణుడు దృశ్యమానుడు కాక వారితో

ఇట్లనెను. సాధువులందు, దేవతలందు, వేదాలందు, గోవులందు, బ్రాహ్మణులందు, ధర్మపదవి యందు, తనతో ఎప్పుడైతే అలుగుతాడో (కోపగించుకొంటాడో/హానితలపెడతాడో) అప్పుడే హిరణ్య కశిపుడు మరణిస్తాడని అభయమిస్తాడు విష్ణువు.

ఈ పద్యంలోహిరణ్యకశిపుడు సాధువులకు, సురులకు, శత్రువులకు, గోవులకు, బ్రాహ్మణులకు, ధర్మానికి, విష్ణువుకు అన్నింటికి హాని తలపెట్టడం ఉంది. కావున ఇవన్నీ ప్రకృతములే. అంటే ఈ పద్యంలో ప్రకృత విషయానికి ప్రకృత విషయముతోనే ధర్మైక్యం చెప్పబడింది. కావున ఇది తుల్యయోగిత.

*బ్రతుక వచ్చుఁ గాక బహుబంధనములైన*
*వచ్చుఁగాక లేమి వచ్చుఁగాక*
*జీవధనములైనఁ జెడుఁ గాక పడుఁగాక*
*మాటదిరుగలేరు మానధనులు* (భాగ. 8-597)

బలి చక్రవర్తి ఎన్ని కష్టాలు వచ్చినా సరే మాన ధనులు మాటతప్పరని చెప్తున్నాడు. బ్రతుకవచ్చు గాక (వామనుడు పాదముతో త్రొక్కిన తరువాత కూడా బలి బ్రతుకుతాడు.) బహు బంధనములైన వచ్చుగాక, (బలికి అనేక ఇబ్బందులు ఎదురైతాయి.) లేమి వచ్చుగాక. (స్వర్గలోకాన్ని కోల్పోయి లేమి రావడం బలి విషయంలో జరిగింది.) చెడుగాక, పడుగాక అనే విషయాలన్నీ ప్రకృతమైన బలిజీవితానికి కూడా వర్తిస్తాయి. బలి మాట తప్పని వ్యక్తే. కావున ఇవన్నీ ప్రకృతానికి, ప్రకృతంతో ధర్మైక్యం కాబట్టి ఇది తుల్యయోగిత.

2. కేవల అప్రకృతములకు ధర్మైక్యం

*సకల భూలోక భోగంబులు భోగించియు, దిగ్విజయంబు సేసియు, బుభుక్షాపిపాసల వలన కామ పారంబును, హింసవలన క్రోధ పారంబును జేరుట దుర్లభంబు.* (భాగ. 7- 457)

ఎన్ని భూలోక భోగాలు అనుభవించినా, ఎన్ని విజయాలు లభించినా బుభుక్ష, పిపాస వలన కామము, అంతాన్నిచూడడం, హింసవలన క్రోధం అంతాన్ని చూడడం దుర్లభం. కామం అంతుచూడడం, క్రోధం అంతు చూడడం అప్రకృతములే. ఆ రెంటికి దుర్లభం అనే ఒక ఒకే ఒక ధర్మం చెప్పబడింది కావున ఇది తుల్యయోగిత.

..... *సమాధి బలంబున దైనిక వ్యథయును, ప్రాణాయామాదికంబున మన్మథవ్యథయును, సాత్త్వికాహారంబుల నిద్రయు, సత్వగుణంబున రజస్తమంబులును, నుపశమనంబున సత్త్వంబును, గురుభజన కుశలుండై (శీలంబున) జయింపవలయు...* (భాగ. 7-457)

'జయింపవలయు' అనేది పై వాక్యములన్నింటికి ధర్మైక్యం. వాక్యములన్నీ అప్రకృతమునకు చెందినవే.

## 17. దీపక

### స్థానము

గమ్యౌపమ్యమగు సాదృశ్యమూలక అర్థాలంకారము దీపకము.

### వ్యుత్పత్తి

దీపనము అనగా ప్రకాశము అని అర్థం. ప్రకృత, అప్రకృతాలకు (ఉపమేయ ఉపమానాలకు) సంబంధించిన క్రియా ధర్మం ఒక్కమారే చెప్పినపుడు ఆ ధర్మం సమస్త వాక్యాన్ని ప్రకాశింపజేస్తుంది. కాబట్టి 'దీపకం' అనేది అన్వర్థనామము. (మమ్మటుడు:654) "దీప ఇవ దీపకమ్" (జగన్నాథ పండితుడు:386) దీపింపజేయునది దీపకం.

### నిర్వచనాలు

**భరతుడు** "ఒక అవాంతర వాక్యమున కూర్పబడిన జాతి - గుణ - క్రియా వాచక శబ్దం సాకాంక్షములగు అనేక పదముల ఆకాంక్షను పూరించుచు అన్వయించుట దీపకమనబడును." (భరతుడు:452)

**మమ్మటుడు** "సకృద్వృత్తిస్తు ధర్మస్యప్రకృతా ప్రకృతాత్మనామ్
సైవ క్రియాసు బహ్వీషు కారక స్యేతి దీపకమ్" (మమ్మటుడు: 654)

ప్రకృత, అప్రకృత ధర్మములు రెండింటిని ఒకే క్రియ ప్రకాంపజేస్తే అది దీపకము.

**విద్యానాథుడు** "ఏకవాక్యతతోఁ గూడి యున్న ప్రకృతాప్రకృతములకు ధర్మసామ్యము వలన నౌపమ్యము స్ఫురించినచో దీపకము" (విద్యానాథుడు:516) ఈ అభిప్రాయమునే పలువురు పండితులు వెలిబుచ్చారు చూడండి.

**జగన్నాథుడు** "ప్రకృతానామ ప్రకృతానాం చైక సాధారణ ధర్మాన్వయోదీపకమ్" (జగన్నాథుడు:386)

**జయదేవుడు** "వదంతి వర్ణ్యానాం ధర్మైక్యం దీపకం బుధా" (జయదేవుడు:78)

**రుయ్యకుడు** "ప్రస్తుతానామప్రస్తుతానాం చదీపకమ్" (రుయ్యకుడు:19)

**వామనుడు** "ఉపమానోపమేయ వాక్యములందు ఒక క్రియ అన్వయించుట దీపకము" (వామనుడు:141)

## వర్గీకరణ :

భామహ (భామహుడు:41), దండి (దండి:105), వామన (వామన:142), విద్యానాథ (విద్యానాథుడు: 516-517), విద్యాధరుడు (విద్యాధరుడు: 324) మొదలగువారు వాక్యంలో ప్రకృత, అప్రకృతముల ధర్మమును సూచించు క్రియ యొక్క స్థానమును బట్టి దీపకము 1. ఆది, 2. మధ్య, 3. అంత్య దీపకములుగా వర్గీకరించారు.

'అర్థాలంకారమున ఆది, మధ్యాంతాది స్థాన నియమములను పరిగణలోనికి తీసుకోరాదు. ఎందుకంటే తదర్థ చమత్కార హేతువగు పదము ఏ స్థానమందున్నను అర్థ చమత్కారములో భేదమేమియు ఉండదు. కావున అట్టి ఆది, మధ్య, అంత్య దీపకము అనే వర్గీకరణ అనావశ్యకము.' (జగన్నాథపండితుడు:396)

దండి (దండి:105-106), జయదేవుడు (జయదేవుడు:80) దీపకమును 1. పదావృత్తి, 2. అర్థావృత్తి, 3. శబ్దావృత్తి అని మూడు రకాలు వర్గీకరించిరి. అయితే వీటిలో శబ్ద, అర్థాలు రెంటి వలన చారుత్వము ఏర్పడుతుంది. కావున ఇవి శబ్దార్థ (ఉభయ) అలంకారాలుగా చెప్పవచ్చు. కాని, అర్థాలంకారాలుగా పరిగణించరాదు.

దీపకమును క్రింది విధంగా వర్గీకరించవచ్చు. దీపకము సందర్భాన్ని బట్టి 2 రకాలు. 1. క్రియా దీపకము, 2. గుణదీపకము.

1. క్రియా దీపకము 3 రకాలు. (ఎ). ఒక క్రియతో పెక్కు కారకములు అన్వయించుట, (బి). అనేక క్రియలతో ఏక కారకము అన్వయించుట, (సి) అనేక క్రియలతో అనేక కారకములు అన్వయించుట.

## దీపకము - ఇతర అలంకారములతో సామ్యభేదాలు

దీపకము - తుల్యయోగిత (చూ. తుల్యయోగిత)

దీపకము - ప్రతివస్తుపమ, దృష్టాంత, అర్థాంతరన్యాసములు

దీపకములోని ఔపమ్యము పదార్థగతము కాగా ప్రతివస్తూపమ, దృష్టాంత, అర్థాంతర న్యాసములలో వాక్యగతం.

## దీపకం - భాగవతంతో అన్వయం

*వారిజాక్షులందు వైవాహికములందుఁ*
*బ్రాణవిత్తమాన భంగమందుఁ*
*జకిత గోకులాగ్ర జన్మరక్షణమందు*
*బొంకవచ్చు నఘము పొంద దధిప!* (భాగ. 8-584)

మూడడుగుల నేలను వామనునికి ఇస్తానన్నాడు బలిచక్రవర్తి. వచ్చినవాడు మాధవుడు వద్దని శుక్రుడు చెప్పజూడగా! ఇచ్చిన మాట తప్పనని దృఢంగా చెబుతాడు బలి. విష్ణువు మూడడుగుల నేలనే కోరినా విశ్వాన్నంతా ఆక్రమిస్తాడని చెబుతాడు. అయినా మాట తప్పనంటాడు బలి. అప్పుడు శుక్రాచార్యుడు స్త్రీల విషయంలో, పెళ్ళి విషయంలో, ప్రాణము, ధనము, పోయే సందర్భంలో, జన్మరక్షణ విషయంలో అబద్ధమాడవచ్చని, దాని వలన పాపం పొందరని చెప్తాడు.

వామనుడు విశ్వాన్నంతా ఆక్రమిస్తే పోయేది ప్రధానంగా బలి కొల్లగొట్టిన స్వర్గలోకం, ఐశ్వర్యం, విత్తము, భంగం కావడం ప్రకృత విషయం. వారిజాక్షులు, వైవాహికములు, ప్రాణ, జన్మరక్షణలు అన్నీ అప్రకృతములు. ఇక్కడ ప్రకృతమునకు, అప్రకృతమునకు ధర్మైక్యం చెప్పబడటం వలన ఇది దీపకం.

*........సమరమందడ్గు దిరుగక చచ్చుకంటెఁ*

*బలికి బొంకక నిజమున బరఁగు కంటె*

*మానధనులకు భద్రంబు మఱియుఁ గలదె* (భాగ. 8-587)

బలి చక్రవర్తి వామనునికి దానమిస్తున్న సందర్భంలోని పద్యమిది.

పలికి బొంకకుండ ఉండడం ప్రస్తుత సందర్భం. యుద్ధరంగంలో అడుగు వెనుకకు త్రిప్పకుండా చావడం అప్రకృతం. అప్రకృతానికి, ప్రకృతానికి ధర్మైక్యం చెప్పబడింది. ఆ ధర్మైక్యమే - 'మానధనులకు భద్రంబు' అని చెప్పబడింది. కావున ఇది దీపకం.

*గోవితతిన్ ధరాదివిజ కోటిని నన్నును దీన వర్గమున్*

*వావిరి భేదబుద్ధిఁగను వారలధోగతిఁ బొంద ..............* (భాగ. 3-558)

శ్రీమన్నారాయణ దర్శనార్థులై వైకుంఠంలోపలికి బాలుర రూపంలో వెళ్తున్న సనకాది ఋషులు తమను అడ్డగించిన ద్వారపాలకులైన జయవిజయులను రాక్షసులుగా పుట్టండని శపిస్తాడు. ఈ సందర్భంలో విష్ణువు గోవులకు, బ్రాహ్మణులకు, దీనులకు, నాకు - భేదాన్ని భావించువారు అధోగతి చెందుతారని అంటాడు.

సనకుడు, సనందనుడు, సనత్సుజాతుడు, సనత్కుమారుడనే నలుగురు బ్రాహ్మణులను - జయవిజయులు చిన్న చిన్నచూపు చూడడం / విష్ణువుకు వేరని భావించడం - ప్రకృతం.

గోవులను, దీన వర్గాన్ని చిన్నచూపు చూడడం అప్రకృతం. ప్రకృతానికి, అప్రకృతానికి ధర్మైక్యం చెప్పడం (అధోగతి చెందడం) వలన ఇది దీపకం.

## 18. దృష్టాంత

**స్థానము**

గమ్యౌపమ్యమగు సాదృశ్యమూలక అర్థాలంకారము దృష్టాంతము.

**వ్యుత్పత్తి**

"దృష్టః అంతః యస్మిన్ ఇతి దృష్టాంతః" అని వ్యుత్పత్తి. (చూడు. మమ్మటుడు:653)

ఒక విషయం చెప్పి అదిఅంతే అని ధృవీకరించడానికి మరొక విషయం ఉదాహరణగా చెప్పబడేది దృష్టాంతం. మొదటి విషయం దార్ష్టాంతికం. 'అంత' శబ్దానికి నిశ్చయం అని అర్థం. దేనిని బట్టి దార్ష్టాంతికం నిశ్చయింపబడుతుందో అది దృష్టాంతం అని అర్థం.

**పారిభాషికపదము**

బింబ-ప్రతిబింబ భావము 'ఉపమానోపమేయ ధర్మములు భిన్నములైనను, పరస్పర సాదృశ్యమున అభిన్నముగా ఉండునట్లు నిరూపించుట' (రుయ్యకుడు:20)

నిర్వచనాలు

**మమ్మటుడు** "దృష్టాంతః పునరేతేషాం సర్వేషాం ప్రతిబింబనమ్" (మమ్మటుడు:651)

ఉపమేయోపమానాల సమాన ధర్మాలు ప్రతిబింబించడం దృష్టాంతం.

**రుయ్యకుడు**

"తస్యాపి బింబ ప్రతిబింబ తయా నిర్దేశేద్దృష్టాంతః" (రుయ్యకుడు: 20)

సమాన ధర్మము బింబ ప్రతిబింబ భావమున నిర్దేశించినచో దృష్టాంతము.

**జయదేవుడు** (జయదేవుడు:84), విద్యానాథుడు (విద్యానాథుడు:518), విద్యాధరుడు (విద్యాధరుడు:528), జగన్నాథపండితుడు (జగన్నాథపండితుడు:414), రామరాజభూషణుడు (రామరాజభూషణుడు:655) మొదలగువారు దృష్టాంతమునకు పై అభిప్రాయమునే వెలిబుచ్చిరి.

దృష్టాంతములో రెండు వాక్యములుండును. ఒక వాక్యములో ప్రకృతవిషయము చెప్పబడును. రెండవ వాక్యములో మరొక విషయము చెప్పబడును. రెండూ విభిన్నమైన సమానధర్మాలు. కాని ఆ సమాన ధర్మాలు రెండు బింబ ప్రతిబింబ భావముతో ఉంటాయి.

**వర్గీకరణ**

దృష్టాంతము ఉపమా గర్భమని మమ్మటుని అభిప్రాయము (మమ్మటుడు:655)

మమ్మటుడు (మమ్మటుడు:653), విద్యానాథుడు (విద్యానాథుడు:518), విద్యాధరుడు (విద్యాధరుడు:528), రామరాజభూషణుడు (రామరాజభూషణుడు:655) - దృష్టాంతమును 2 రకాలుగా విభజించిరి.

1. సాదర్మ్యదృష్టాంతము 2. వైధర్మ్యదృష్టాంతము.

**దృష్టాంతము - ఇతర అలంకారాలతో సామ్యభేదాలు**

దృష్టాంతము - ప్రతివస్తూపమ

'ప్రతివస్తూపమ, దృష్టాంతములు రెంటి యందు రెండేసి వాక్యములుండును. ప్రతివస్తూపములో ఒకే సమానధర్మమును భిన్న శబ్దములు తెలుపును. దృష్టాంతంలో భిన్న ధర్మాలను భిన్న శబ్దాలు తెలుపును' (రామకృష్ణమాచార్య:124)

**నిదర్శనము**

దృష్టాంత, నిదర్శనములు రెండింటి యందు ఉపమానోపమేయ వాక్యములకు బింబ ప్రతిబింబ భావముండును. కాని, నిదర్శనములో రెండువాక్యాలు సాపేక్షములు ఒకదానికి రెండవ దానితో అన్వయముండును. దృష్టాంతంలో నిరపేక్షములు.

**దృష్టాంతం - భాగవతంతో అన్వయం**

*మందార మకరంద మాధుర్యమున దేలు*
*మధుపంబు వోవునే మదనములకు*
*నిర్మల మందాకినీ వీచికలఁదూఁగు*
*రాయంచ సనునె తరంగిణులకు*
*లలిత రసాల పల్లవ ఖాదియై చొక్కు*
*కోయిల సేరునే కుటజములకుఁ*
*బూర్ణేందు చంద్రికా స్ఫురిత చకోరక*
*మరుగునే సాంద్ర నీహారములకు*
*అంబుజోదర దివ్య పాదారవింద*
*చింతనామృత పాన విశేషమత్త*
*చిత్తమేరీతి నితరంబుఁ జేరనేర్చు*
*వినుత గుణశీల! మాటలు వేయు నేల?* (భాగ. 7 - 150)

దృష్టాంతంలో ఒక ప్రకృత వాక్యముండును. మరొకటి (లేదా అంతకంటే ఎక్కువ) అప్రకృత వాక్యముండును. రెండింటి ధర్మాలు భిన్నంగా ఉంటాయి. వాటికి ఏదో ఒక సమాన ధర్మం ఉంటుంది. ఈ రెండు వాక్యాలు నిరపేక్షాలు.

'అంబుజోదర దివ్యపాదారవింద చింతనామృత పాన విశేషమత్త చిత్తమేరీతి నితరంబుఁ జేరనేర్చు' అనేది ప్రకృత వాక్యం. ప్రహ్లాదుడు విష్ణుభక్తుడు కావున ఎన్ని ఇబ్బందులు కలిగించినా, అతని చిత్తము ఇతరము వైపువెళ్ళదు.

ఒక పనిలో ఆనందాన్ని అనుభవించడం మరగి, ఇతరమును కోరకపోవడం - అనే సమాన ధర్మం గల, విభిన్న - అప్రకృత విషయాలు కొన్ని ఉన్నాయి. అవి - 1. మందార మకరంద మాధుర్యాన్ని మరగిన మధుపము, ఉమ్మెత్త పూల కోసం వెళ్ళదు 2. నిర్మల గంగానదీ తరంగాలలో తూగాడే హంస, స్వల్పమైన కాలువలకు రాదు 3. లేతమావిచిగురు తినమరిగిన కోకిల,

కొండ గోగుచెట్ల ఆకులుతినదు 4. పున్నమి వెన్నెలను త్రాగుటకు అలవాటు పడ్డ చకోరకము మంచు ముక్కలు తినదు.

ఈ నాలుగు విషయములు దేనికవే నిరపేక్షాలు మరియు బింబ ప్రతిబింబ భావంతో ఉన్నాయి.

మందార మకరందానికి అలవాటుపడ్డ మధుపం ఇతరాన్ని కోరదు - విష్ణు పాదభక్తికి అలవాటుపడ్డ వ్యక్తి ఇతరాన్నికోరడు.

ఇలా ప్రకృత, అప్రకృత విషయాలు - బింబ ప్రతిబింబ భావంతో ఉంటూ - విభిన్నంగా ఉంటూనే, ఒక సమాన ధర్మం కలిగి ఉన్నాయి కావున ఇది దృష్టాంతము.

తెలుగు వారి చిత్తములో ప్రహ్లాదుని భక్తిని, తెలుగు వారి నాల్కలపై భాగవత మాధుర్యాన్ని నింపే ఈ పద్యం అజరామరం.

ఈ పద్యంలాంటి పద్యమే మరొకటి భాగవతంలో ఉంది. (చూడు. భాగ. 10. ఉత్తర - 257)

*సిరికి నుదార చిహ్నములఁ జేయు భవచ్చరణార విందముల్*

*సరసిజ నేత్ర! మా తపము సంపదఁ జేరితి మెట్ట కేలకున్*

*మరలఁగలేము మామగల మాటలు నొల్లము పద్మ గంధముల్*

*మరఁగిన తేటు లన్య కుసుమంబుల చెంతలఁ జేరనేర్చునే* (భాగ. 10. పూర్వ-989)

శరద్రాత్రి గోపికలు శ్రీకృష్ణుని చేర రాగా, వారిని తిరిగి పొమ్మంటాడు కృష్ణుడు. గోపికలంటారు కృష్ణునితో మా తపమువలన నీపాదాలను చేరాము, మాభర్తలమాటలనొల్లము. పద్మగంధముల మరగిన తేనెటీగలు ఇతర కుసుమంబులకు వెళ్తాయా?

ఇక్కడ - గోపికలు కృష్ణుని విడిచి వెళ్ళలేకపోవడం - ప్రకృతవాక్యం.

తేనెటీగలు - పద్మములను విడిచి వెళ్ళలేకపోవడం - అప్రకృతవాక్యం.

రెండింటి ధర్మాలు - బింబప్రతిబింబాలుగా ఉండటం, రెండూ నిరపేక్షాలు కావడం వలన ఇది దృష్టాంతం.

## 19.నిదర్శనము

### స్థానము

గమ్యౌపమ్యమగు సాదృశ్యమూలక అర్థాలంకారము, నిదర్శనము.

నిదర్శనము - వ్యుత్పత్తి :- "నిదర్శనము" అనగా దృష్టాంతంగా చూపడం అది దీనిలో ఉంటుంది కాబట్టి దీనికి నిదర్శనము అని పేరు" (మమ్మటుడు ఆ 631)

### పారిభాషిక పదము

బింబ ప్రతిబింబ భావము చూడు. దృష్టాంతము.

### నిర్వచనాలు

**దండి** 'ఏదో ఒక కార్యము చేయుటకై ఉద్యమించిన వానిచేత ఆ కార్యమునకు సమానమైన ఫలము బోధింపబడినచో అది నిదర్శనము' (దండి:212)

**వామనుడు** "క్రియయైన స్వతదర్థాన్వయఖ్యాపనం నిదర్శనమ్" (వామనుడు:142)

క్రియ చేతనే తనయొక్క, తన హేతువు యొక్క అన్వయము యొక్క బోధనము నిదర్శనము.

**మమ్మటుడు** "నిదర్శనా అభవన్ వస్తు సంబంధ ఉపమా పరికల్పకః" (మమ్మటుడు:631)

సంభవించని/కుదరని పదార్థముల లేదా వాక్యార్థముల సంబంధం ఉపమను కల్పించినట్లైతే అది నిదర్శనాలంకారం

**రుయ్యకుడు** "సంభవత్ వస్తు సంబంధమున, అసంభవత్ వస్తు సంబంధమునను సాదృశ్యమవభాసింప నిదర్శన యగును" (రుయ్యకుడు:20)

**విద్యానాథుడు** "ఉపమాన ధరము నుపమేయమునకు జెపుటవలన అనయముకుదరక పోగా తదనయ సిదికొఅకెచట

బింబప్రతిబింబ రూపమున నేపథ్యము గమ్యమాన మగునోయట నిదర్శనమగును" (విద్యానాథుడు:519)

**రామరాజభూషణుడు** "ఉపమాన ధర్మముపమేయగతముగా, నుపమేయ ధర్మముపమాన గతముగా వర్ణింపబడి సరియైన యన్వయము సంభవింపక పోవుటచే నెచట బింబప్రతిబింబ భావమాక్షేప్యమగు నోయది నిదర్శన" (రామరాజభూషణుడు:656)

## నిదర్శనము - వర్గీకరణ

మమ్మట (మమ్మటుడు:632), జయదేవ (జయదేవుడు: 86), విద్యానాథ (విద్యానాథుడు:520), రామరాజభూషణు (రామరాజభూషణుడు:657-658)లను అనుసరించి నిదర్శనను ఈవిధంగా వర్గీకరించవచ్చు - నిదర్శనము 4 రకములు.

1. పదార్థ నిదర్శన - 'కేవలముపమానోపమేయ ధర్మములొక దాని యందొకటి యారోపింపబడినచో పదార్థ నిదర్శన' (రామరాజభూషణుడు:657)

2. వాక్యార్థ నిదర్శన - 'బింబ ప్రతిబింబ భావాపన్న ధర్మములకు ఏక్యారోపము చేసినచో వాక్యార్థ నిదర్శన' (రామరాజభూషణుడు :657)

3. సదసదర్థ బోధనరూప నిదర్శన - 'ఒకానొక వస్తువు తన క్రియచే పరుల కసదర్థమును గానీ, సదర్థమునుగానీ బోధించిన యెడల అది సదసదర్థ బోధనరూప నిదర్శన'. (రామరాజభూషణుడు:657)

4. మాలారూప నిదర్శనము - నిదర్శనము మాలారూపమున ఉండుట.

## నిదర్శనము - ఇతర అలంకారాలతో సామ్య భేదాలు

నిదర్శనము - దృష్టాంతము :- 'నిదర్శన, దృష్టాంతములు రెంటిలో ఉపమేయోపమానాలు బింబ ప్రతిబింబ భావముతో ఉంటాయి. కాని దృష్టాంతములో రెండు వాక్యములు పరస్పర నిరపేక్షములు కాగా, నిదర్శనములో - రెండు వాక్యములు పరస్పర సాపేక్షములు. అంటే - ఒక వాక్యానికి, మరొక వాక్యముతో అన్వయము ఉండును. (రామకృష్ణమాచార్య: 657)

## నిదర్శనము - భాగవతముతో అన్వయము

నిదర్శనం - భాగవతంతో అన్వయం

*అంధేందూదయముల్ మహాబధిర శంఖారావముల్ మూక స*
*ద్గ్రంథాఖ్యాపనముల్ నపుంసక వధూకాంక్షల్ కృతఘ్నావళీ*
*బంధుత్వంబులు భస్మహవ్యములు లుబ్ధ ద్రవ్యముల్ క్రోడ స*
*ద్గంధంబుల్ హరిభక్తి వర్జితుల రిక్త వ్యర్థ సంసారముల్* (భాగ. 7 - 168)

శ్రీహరి భక్తి లేని వ్యర్థ సంసారములు, ఇది ప్రకృతము. దీనికి బింబ ప్రతిబింబ భావంతో చెప్పే అప్రకృత విషయాలు -

1. గ్రుడ్డి వాని ముందు ఉదయం.
2. చెవిటివాని ముందు శంఖారావం.
3. మూగవాడుచేసే - గ్రంథవ్యాఖ్యానం.
4. నపుంసకుడు స్త్రీనికోరడం.
5. చేసినమేలు మరిచే వానితో బంధుత్వం.
6. బూడిదలో వ్రేల్చే హవ్యములు.
7. పిసినారి ధనసముపార్జన.
8. క్రోడ సద్గంధములు.

ఈ వాక్యాలు ఎనిమిది, హరిభక్తిలేని వ్యర్థ సంసారాలు అనే వాక్యాపేక్షకలవి. కావున ఇది నిదర్శనము. ఒకటికి మించి అప్రకృత విషయములు చెప్పబడ్డాయి కావున ఇది మాలా నిదర్శన.

**మన్నించి దేవ శత్రుల**

*కెన్నడు నిటువంటి వరము లీకుము పాపో*

*త్పన్నులకు వరములిచ్చుట*

*పన్నగముల కమృతమిడుట పంకజగర్భా !* (భాగ - 7 - 383)

శ్రీ నరసింహస్వామి హిరణ్యకశిపుని చంపిన తరువాత బ్రహ్మతో ఇలా అంటున్నాడు. - రాక్షసుల కెప్పుడూ ఇటువంటి వరాలు ఈయకు, పాపోత్పన్నులకు వరములిచ్చుట పాములకు పాలు పోసినట్లే. ఇక్కడ రెండు వాక్యాలు - బింబ ప్రతిబింబ భావంతో సాపేక్షాలై ఉన్నవి.

*మహిమ వతులైన భూసుర*

*మహిళల విత్తంబులు పెఱమగువల కగునే*

*మహిఁ బసిఁడి గొలుసులిడినన్*

*విహితములే కుక్కలకు హవిర్భాగంబుల్* (భాగ. 9 - 518)

బ్రాహ్మణ స్త్రీల సంపదలు ఇతరుల స్త్రీలకు చెందుతాయా, బంగారు గొలుసులు ధరించిన కుక్కలకు హవిర్భాగములు తగునా?

దేవయాని, తనకు చెందినవి శర్మిష్ఠకు చెందవని, చెప్పే సందర్భంలోని పద్యమిది. ఇక్కడ రెండు వాక్యాలు పరస్పర సాపేక్షములు. కావున ఇది - నిదర్శనం.

అసదర్థ బోధన రూప నిదర్శనకు ఈ క్రింది పద్యం ఉదాహరణ -

*అనుసంభూతుడు పాండు భూవిభుడు నిర్యాణమునుం బొంద నా*

*తని పుత్రుల్ దనుఁ జేర వచ్చినను మధ్యస్థంబు వోదట్టి యె*

*గ్గొన రించెన్ ధృతరాష్ట్ర భూమివిభుఁ డట్లూహింపగా నెగ్గు సే*

*సిన వాడేయగుగాక మేలుగలదే చింతింపగా నుద్ధవా ?* (భాగ. 3-65)

పాండవులు పాండురాజు మరణించిన తరువాత కౌరవుల వద్దకు రాగా దృతరాష్ట్రుడు అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టాడు. దీనిని బట్టి కీడు చేసిన వాడికి, కీడేగాని మేలు జరగదని తెలుస్తుంది.

ఒక సంఘటన చెప్పి దాని నుండి తెలుసుకోదగ్గ నీతిని చెప్పడం - నిదర్శనంలో ఒక రకం. ధృతరాష్ట్రుని చర్యలను బట్టి - కీడు చేసిన వాడికి, కీడేగాని, మేలు జరగదని తెలుస్తుంది. (కురుక్షేత్ర యుద్ధంలో కౌరవులు నశించారుకదా.) కావున ఇది నిదర్శన.

## 20. ప్రతివస్తూపమ

### స్థానము

గమ్యౌపమ్యమగు - సాదృశ్యమూలక అర్థాలంకార ప్రతివస్తూపమ.

### వ్యుత్పత్తి

'వస్తు, ప్రతివస్తు భావముతో సామాన్యధర్మము ఉపమానోపమేయ వాక్యములలో నుపనిబద్ధ మగుటచే ఔపమ్యము స్ఫురించుట వలన దీనికి ప్రతివస్తూపమాలంకారము అనేపేరు వచ్చింది. (విద్యానాథుడు:517)

'వస్తువు' అంటే - వర్ణ్యాంశమునగల (ఉపమేయ సంబంధిత) వాక్యము.

'ప్రతివస్తువు' అంటే అవర్ణ్యాంశమునగల (ఉపమాన సంబంధిత) వాక్యము. (చూడు. జయదేవుడు:83)

### పారిభాషిక పదము

వస్తు - ప్రతివస్తు భావము - 'ఒకే సమాన ధర్మం భిన్న శబ్దాలచే చెప్పబడితే అది వస్తు ప్రతివస్తు భావం' (విద్యానాథుడు:453)

## నిర్వచనాలు

**వామనుడు** "ఉపమేయమగు ఒక వాక్యార్థమును చెప్పిన పిదప, దానితో సమానమైన వస్తువు యొక్క న్యాసము ప్రతివస్తువు" (వామనుడు:125)

**మమ్మటుడు** కూడా వామనుడి అభిప్రాయాన్నే ఇలా చెప్పాడు.

"సామాన్యస్య ద్విరేకస్య యత్ర వాక్య ద్వయేస్థితిః" (మమ్మటుడు:349)

**జయదేవుడు** "రెండు వాక్యములకొక సామాన్య ధర్మముతో నన్వయమున్న యెడల ప్రతివస్తూపము" (జయదేవుడు:83)

**విద్యానాథుడు** "వస్తు ప్రతివస్తుభావముతో సామాన్య ధర్మము ఉపమానోపమేయ వాక్యములలో నుప నిబద్ధమగుటచే ఔపమ్యము స్ఫురించెనేని ప్రతివస్తూపమాలంకారము" (విద్యానాథుడు: 517)

'ప్రతివస్తూపమతో ఒకే సమానధర్మం భిన్నశబ్దాలచే భిన్నంగా చెప్పటం ఉంటుంది'.(రుయ్యకుడు:20)

'ప్రతివస్తూపమలో ఉపమావాచకం ప్రయోగింపబడదు. కాబట్టి ఔపమ్యం గమ్యమానం (ప్రతీయమానం) అవుతుంది'. (రామరాజభూషణుడు:654)

ప్రతివస్తూపమ - వర్గీకరణ :-

ప్రతివస్తూపమాలంకారము 2 రకాలుగా ఉంటుంది.

1. సాధర్మ్యమూలక ప్రతివస్తూపమ

2. వైధర్మ్యమూలక ప్రతివస్తూపమ

ప్రతివస్తూపమ - ఇతర అలంకారాలతో సామ్యభేదాలు :

ప్రతివస్తూపమ - ఉపమ :- 'ఉపమ, ప్రతివస్తూపమలు రెంటిలో ఉపమానోపమేయములు సాదృశ్యమూలకములే. కాని ఉపమలో ఒక వాక్యం ఉండగా ప్రతివస్తూపమలో రెండు వాక్యాలుంటాయి. ఉపమలో ఉపమావాచకం ఉంటుంది. కాగా ప్రతివస్తూపమలో ఉపమావాచకం ఉండదు, కాబట్టి ఔపమ్యము ప్రతీయమానమౌతుంది'. (రాజరాజభూషణుడు:654)

ప్రతివస్తూపమ - దీపకము, తుల్యయోగితలు :- ప్రతివస్తూపమ, దీపక, తుల్యయోగితలలో సమానధర్మం ప్రతీయ (గమ్య) మానమౌతుంది. అయితే ప్రతివస్తూపమలో సమాన ధర్మము వాక్యగతము, అంటే దీనిలో రెండు వాక్యాలుంటాయి. దీపక, తుల్య యోగితలలో సమానధర్మము పదార్థగతము. అంటే వీటిలో ఒకే వాక్యం చొప్పున ఉండును.

ప్రతివస్తూపమ - దృష్టాంత, నిదర్శనములు :- ప్రతివస్తూపమ, దృష్టాంత, నిదర్శనములలో - సమానధర్మము ప్రతీయమానం కావడం, రెండు వాక్యాల చొప్పున ఉండటం అనే లక్షణాలు వీటిలో సమానమే - కాని - ప్రతివస్తూపమలో ఒకే సమానధర్మాన్ని భిన్న శబ్దాలతో చెప్పడం ఉంటుంది. కాగా దృష్టాంత, నిదర్శనాలలో భిన్నధర్మాలను భిన్న శబ్దాలతో చెప్పడం ఉంటుంది.

## ప్రతివస్తూపమ - భాగవతంతో అన్వయం

*తన ధర్మ పత్ని వలనను*
*మనుకొని తాఁ బుత్రరూపమున నుదయించున్*
*వినుదీపము చే దీపిం*
*చిన దీపము రెండు గాదె? శిఖి యొకటయ్యున్* (భాగ.3-454)

ఉపమానోపమేయములకుగల సమాన ధర్మమును విభిన్న శబ్దములచేత చెప్పుట - ప్రతివస్తూపమ.

పురుషుడు తన ధర్మపత్నిద్వారా పుత్రునిరూపంలో ఉదయిస్తాడు. ఒక దీపము శిఖ కూడా మరొకదీపంగా మారుతుంది.

ఈ పద్యంలో - ఉపమావాచకంలేదు. రెండు వాక్యాలున్నాయి. ప్రకృత వాక్యంలో (పురుషుడు) పుత్రునిరూపంలో ఉదయించడం. అప్రకృతవాక్యంలో మరొక దీపము - దీపించడం. ఒకేవిధమైన ధర్మాలు (క్రొత్తగా ఏర్పడటం) విభిన్న శబ్దాలు

అయిన - ఉదయించడం, దీపించడం వలన సూచించ బడ్డాయి. కావున ఇది - ప్రతివస్తూపమ.

## 21. అతిశయోక్తి

**స్థానము**

అతిశయోక్తి అలంకారము సాదృశ్యమూలక - అభేదప్రధానమున-సిద్ధ-అధ్యవసాయ మూలాలంకారము. (విద్యానాథుడు:488)

**వ్యుత్పత్తి**

అతిశయోక్తి ఉక్తిః అతిశయోక్తి అని వ్యుత్పత్తి (విద్యానాథుడు:315)

ఏదైనా ఒక విషయాన్ని అతిశయము / అధికము చేసి చెప్పే అది అతిశయోక్తి అని భావం.

భీజభూతాలంకారాలలో అతిశయోక్తి ఒకటి. 'అతిశయోక్తి అంతా వక్రోక్తియే' (భామహుడు:66)

**నిర్వచనాలు**

**భామహుడు** 'ఏదియో ఒక నిమిత్తమును పురస్కరించుకొని, లోకోత్తరమగు అర్థమునకు సంబంధించిన ఏ వచనము కలదో అట్టిది అతిశయోక్తి (భామహుడు: 64)

దండి 'లోకోత్తరవర్ణన గలది అతిశయోక్తి' (దండి:144)

**కుంతకుడు** "ఎచట సహృదయాహ్లాదకములగు వర్ణనీయము నందలి ధర్మములకు సంబంధించిన ఒకానొక అతిశయము, విచ్ఛిత్తి విశేషముతో ప్రతిపాదింపబడునో (అచట అతిశయోక్త్యలంకారము)" (కుంతుకుడు:347)

**మమ్మటుడు** "ఉపమానం చేత లోపలికి మ్రింగివేయబడిన ఉపమేయాన్ని అప్రకృత రూపంలో అధ్యవసానం చేయడం ధృడమైన ఆరోపం, అతిశయోక్తి" (మమ్మటుడు:647)

**రుయ్యకుడు** "అధ్యవసిత ప్రాధాన్యేత్వతిశయోక్తిః" (రుయ్యకుడు:17)

**జగన్నాథపండితుడు** "విషయిచే విషయము యొక్క నిగరణము అతిశయము దానిని చెప్పుట అతిశయోక్తి" (జగన్నాథ పండితుడు:362)

విన్నకోట పెద్దయ 'లోకవృత్తమున కతిశయిత ధ్వని గలిగినది అతిశయోక్తి' (విన్నకోట పెద్దయ:92)

**రామరాజభూషణుడు** "ఉపమేయమింత తడవక యుపమానమె నుడువ నతిశయోక్తి....." (రామరాజభూషణుడు: 621)

ఉపమేయమును అధః కరించి, ఉపమానమును మాత్రమే చెప్పుట అతిశయోక్తియని చెప్పెను.

అతిశయోక్తి చాలా అలంకారాలకు సర్వసాధారణము. అందంగా చెప్పిన కొన్ని స్వభావోక్తి వంటి అలంకారాలలో తప్ప మిగిలిన అన్నింటిలో అతిశయం వల్లనే చారుత్వం సిద్ధిస్తుంది. కావున అతిశయోక్తి బీజభూతాలంకారమైనది.

**వర్గీకరణ**

**మమ్మటుడు** అతిశయోక్తిని 4 రకాలుగా వర్గీకరించెను (మమ్మటుడు:646-647)

1. ఉపమేయం చెప్పకుండ ఉపమానం చెప్పడం
2. ప్రకృతాన్ని మరొక విధంగా వర్ణించడం
3. ఇది అవిధంగా ఉంటే అది అవిధంగా ఉండి ఉండేది అని కల్పించడం
4. కార్యకారణాల క్రమంలో తారుమారు చేయడం.

**రుయ్యకుడు** అతిశయోక్తిని 5 రకాలుగా వర్గీంకరిచడం (రుయ్యకుడు:18)

1. భేదమున నభేదము 2. అభేదమున భేదము

3. సంబంధమున నసంబంధము 4. అసంబంధమున సంబంధము

5. కార్యకారణ పౌర్వాపర్య విధ్వంసము

**విద్యానాథుడు** రుయ్యకుడు చెప్పిన ఐదింటికి మరొకటి అదనంగా చేర్చెను.

**6**వది - కార్యకారణములకు యౌగపద్యము చెప్పుట

విద్యాధరుడు, రుయ్యకుడు చెప్పిన ఐదింటిని చెప్పెను (విద్యాధరుడు: **315-316**)

అతిశయోక్తి - ఇతర అలంకారాలతో సామ్యభేదాలు

అతిశయోక్తి - ఉపమ : ఉపమలో కన్న అతిశయోక్తిలో అతిశయత్వము ఎక్కువగా ఉంటుంది.

## అతిశయోక్తి - భాగవతముతో అన్వయము

సాధారణంగా లోకాతిశయ వర్ణననే అతిశయోక్తి అయితే ఇక్కడ ఒక్క విషయం చెప్పాలి. శ్రీవిష్ణు లీలా కదంబమే భాగవతం కాబట్టి, అతని లోకాతిశయ లీలల వర్ణన మనకు అతిశయోక్తులుగా కన్పించినను, భగవంతుని విషయంలో అది స్వభావోక్తియే కావచ్చు. ఇక్కడ అన్ని కావ్యాలలో వలెనే సాధారణ దృష్టితో చూచి, ఎక్కడ లోకాతిశయ వర్ణన కలదో, దాన్ని అతిశయోక్తిగా గ్రహించడం జరిగింది.

చాలా సందర్భాలలో పోతనగారు అతిశయోక్తిని కథాగమనానికి, రమణీయతను చేకూర్చేలాగా తీర్చిదిద్దాడు. మచ్చునకు కొన్నింటిని మీ ముందుంచడం జరుగుతుంది.

*తుదమొదళ్ళకుఁ జిక్కి తునిపారగమోరఁ*

*గులశైలములఁ జిమ్ముఁ గొంత తడవు*

*బ్రహ్మాండ ఖాండంబు పగిలి చిల్లులు వోవఁ*

*గొమ్ముల ఁదాటించు ఁగొంతతడవు*

*జలధు లేడును బంకసంకులంబైయింక*

*ఖురముల మట్టాడు, ఁగొంత తడవు*

*నుడురాజు సూర్యుండు నొక్కమూలకు ఁబోవఁ*

*గుఱుచవాలము ఁద్రిప్పు ఁగొంత తడవు.*

*గునియుఁ గుప్పించు లంఘించు గొప్పరించు,*

*నెగయు ధర ఁద్రవ్వు ఁబొఱియఁగా నేపుమిగిలి.*

*దాన వేంద్రుని గుండెలు దల్ల డిల్లఁ*

*బంది మెల్లన రణ పరిస్పంది యగుచు* ( భాగ. 3 - 632)

హిరణ్యాక్షుని చంపి, భూమి నుద్ధరించుటకు శ్రీ మహా విష్ణువు యజ్ఞ వరాహరూపాన్ని ధరిస్తాడు. అతని లోక భీకర చేష్టలు లోకాతిశయంగా వర్ణింపబడ్డకారణంగా ఇది అతిశయోక్తి.

వరాహస్వామి తన మోరతో కుల శైలములను చిమ్మడం, కొమ్ములతో బ్రహ్మాండభాండంబు చిల్లులుపడేలాగా పొడవడం, సప్తసముద్రాలు ఇంకి, బురదమయం అయ్యేలాగా గిట్టలతో తిరుగాడటం, తోకతో సూర్యుడు ఒక మూలకు పోయేలాగా కొట్టడం వంటి చేష్టలన్నీ లోకోత్తరమైనవే.

*ఖుర పుటాహతి రేఁగు ధరణీపరాగంబు*

*పంకేరుహాప్త బింబంబుఁ బొడువ*

*విపుల వాలాటోప విక్షేప జాత వా*

*తాహతి వారివాహములు విరియఁ*

*గుఱుచ తిన్నన వాఁడి కొమ్ములఁ జిమ్మిన*

*బ్రహ్మాండ ఖాండ కర్పరము వగుల*

*నలవొక ఖణిఖణిల్లని అంకె వేసిన*

*రోదసీ కుహరంబు భేదిలంగ*

*గళ చలద్ఘర్మ ఘంటికా ఘణ ఘణ ప్ర*

*ఘోషమున దిక్తటంబు లాకులత నొంద*

*లీలనడ తెంచు కలధౌత శైలమనఁగ*

*నుక్కు మిగిలిన వృషభేంద్రు నెక్కి వెడలె* (భాగ. 10. ఉత్తర - 399)

బాణాసురునికి సహాయంగా ఉండటానికి వస్తున్న శివుని లోకాతిశయంగా వర్ణించిన కారణంగా ఇది అతిశయోక్తి.

*పులుల మొత్తంబులు పొదరిండ్లలోఁ దూఱు*

*ఘోర భల్లూకముల్ గుహలు సొచ్చు*

*ఘూదారములు నేలబొరియలలో డాఁగు*

*హరిదంతములకేగు హరిణచయము*

*మడుగులఁజొరఁబాఱు మహిష సంఘంబులు*

*గండశైలంబులఁ గపులు ప్రాకు*

*వల్మీకములు సొచ్చు వనభుజంగంబులు*

*నీలకంఠంబులు నింగి కెగయు*

*వెఱచి చమరీమృగంబులు విసరు వాల*

*చామరంబుల విహరణ శ్రమము వాయ*

*భయాదపరిహేళ విహరించు భద్ర కరుల*

*గాలివాఱిన మ్రాతాన జాలిఁబొంది.* (భాగ. 8 - 29)

గజేంద్రములను చూచి శార్దూల, భల్లూకాదులు కూడా భయపడి పారిపోతున్నాయని అద్భుతంగా వర్ణింపబడింది కావున ఇది అతిశయోక్తి అలంకారం. మొసలి బారిన పడ్డ గజేంద్రము పూర్వము అహంకరించు కారణాన్ని దీన్ని తెలుసుకోవచ్చు. ఆ అహంకారం తొలగిన తరువాతనే విష్ణువు రక్షించడం జరిగింది.

బలిచక్రవర్తి స్వర్గాన్ని ముట్ట డించినపుడు -

*దుర్భర దానవ శంఖా*

*విర్భూత ధ్వనులు నిండి విబుధేంద్ర వధూ*

*గర్భములు వగిలి లోపలి*

*యర్భక తతు లావు రనుచు న్నాక్రోశించెన్* (భాగ. 8 - 450)

బలిచక్రవర్తి శంఖారావానికి దేవతాస్త్రీల గర్భాలు పగిలి శిశువులు ఆవురావురన్నారటం చమత్కార పూర్వక అతిశయము.

## 22. అత్యుక్తి

అత్యుక్తిని జయదేవుడు, అప్పయదీక్షితుడు పేర్కొన్నారు.

నిర్వచనం

"అద్భుతము నతథ్యము నైన శౌర్యౌదార్యాది వర్ణనము అత్యుక్తి యగును" (జయదేవుడు : 239)

'అతిశయోక్తి' లో కంటే, 'అత్యుక్తి' లో మిథ్యాత్వ ప్రసక్తి (అసత్యము) ఎక్కువగా ఉంటుంది.

**అత్యుక్తి - భాగవతంతో అన్వయం**

**మెల్లని నగవున నయనము**
**లల్లార్చి శరంము విల్లు నందిన మాత్రం**
**గుల్లలు నాఁచులు ( జిప్పలు (**
**బెల్లలు నైజలధి పెద్ద బీడై యుండెన్** (భాగ. 9 - 280)

శ్రీరాముడు, వానరసైన్యంతో కలిసి లంకకు వెళ్ళునపుడు సముద్రాన్ని తమకు బాట నీయవలసిందిగా రాముడు కోరగా, సముద్రంలో మార్పేమీ కన్పించదు. అప్పుడు రాముడు, ధనుస్సు, బాణము చేపట్టగానే - సముద్రమంతా క్షణకాలంలో ఇంకి పోయి, అడుగుభాగమునగల - గుల్లలు, నాచు, ఆల్చిప్పలు, మట్టి పెల్లలతో బీడు భూమిగా మారిందట.

సముద్రం ఒక్క క్షణంలో పూర్తిగా ఎండి పోయినట్లుగా చెప్పడమంటే - అతిశయోక్తి కన్నా కూడా, మిథ్యాత్వం ఎక్కువగా ఉంది కావున ఇది - అత్యుక్తి.

## 23. ఉదాత్త

స్థానము

గూఢార్థ ప్రతీపరకము - ఉదాత్తాలంకారము. అని రుయ్యకుడు చెప్పెను.

లోకన్యాయమోలకమగు గమ్యోసమ్యాలంకారమని విద్యానాథుడు చెప్పెను.

నిర్వచనం మరియు వర్గీకరణ

ఉదాత్తాలంకారం రెండు రకాలుగా ఉంటుంది.

మమ్మటుడు

1. "ఉదాత్తం వస్తునః సంపత్" (మమ్మటుడు:695)

వస్తువుల అత్యధిక సమృద్ధిని వర్ణించడం ఉదాత్తాలంకారం.

2. "మహతాంచోపలక్షణమ్" (మమ్మటుడు:696)

మహాపురుషుల అంగత్వ వర్ణన కూడా ఉదాత్తమే.

రుయ్యక, జయదేవ, విద్యానాథ, విద్యాధరాదులు మమ్మటుని అభిప్రాయాన్నే వెలిబుచ్చిరి.

**ఉదాత్తం - భాగవతంతో అన్వయం**

***కారేరాజులు రాజ్యముల్ గలుగవే గర్వోన్నతిం బొందరే***
***వారేరీ సిరిమూట గట్టుకొని పోవంజాలిరే భూమిపైఁ***
***బేరైనం గలదే శిబి ప్రముఖులుం బ్రీతిన్ యశః కాములై***
***యీరే కోర్కులు వారలన్ మఱచిరే యిక్కాలమున్ భార్గవా!*** (భాగ. 8 - 589)

వామనునికి మూడడుగులు నేల దానంచేయబోతుండగా శుక్రాచార్యుడు వద్దని, అబద్ధం ఆడినా తప్పులేదని అంటాడు. అప్పుడు బలి చక్రవర్తి తప్పకుండా దానం ఇస్తానని, తన భావాన్ని బలపరచుకోవడానికి కొందరు పూర్వ రాజన్యులను చెబుతున్నాడు.

కేవలం రాజ్యం ఉండటంతో గర్వించినవారు నామ మాత్రంగా కూడా మిగలకుండా కాలగతిలో కలిసిపోయారు. కాని, తన దేహాన్నే త్యాగం చేసిన 'శిబి' చక్రవర్తిలాంటి వారిని ప్రజలు ఎన్ని యుగాలైనా మరచిపోరు. అంటూ తనకు పూర్వంగల 'శిబి చక్రవర్తి' వంటి మహాపురుషుల చరిత వర్ణింప బడింది కాబట్టి ఇది ఉదాత్తాలంకారం.

## 24. సార (Climax)

### స్థానము

శృంఖలామూలకాలంకారము - సారము.

### నిర్వచనాలు

**రుయ్యకుడు** "ఉత్తరోత్తరముత్కర్షసారః" (రుయ్యకుడు:47) అన్నాడు

పూర్వపూర్వమునకన్న ఉత్తరోత్తరమునకు ఉత్కర్షను చెప్పుట సారము.

మమ్మట, జయదేవ, విద్యానాథ, విద్యాధరులు పై అభిప్రాయాన్నే వెలిబుచ్చారు.

**జగన్నాథ పండితుడు** "సైవ సంసర్గస్యోత్కృష్టా ప్రకృష్ట భావ రూపత్వే సారః" (జగన్నాథుడు:659)

శృంఖలరూపములోనే సంసర్గము ఉత్కృష్ట, అపకృష్ట భావ రూపమగు నపుడు సారాలంకారమని చెప్పెను.

అంటే - పూర్వపూర్వమునకన్నా ఉత్తరోత్తరమునకు 1. ఉత్కర్ష గాని 2. అపకర్షగాని ఏది వర్ణించిననూ అది సారమేనని వీరి అభిప్రాయం. ఉత్తరోత్తరమునకు అపకర్ష వర్ణించుటను శోభాకరమిత్రుడు 'అవరోహమని ప్రత్యేక అలంకారంలో చెప్పెను. (చూడు. అలంకార కోశ్)

వర్గీకరణ

సారాలంకారం 2 రకాలు.

1. పూర్వపూర్వమునకన్నా ఉత్తరోత్తరమునకు ఉత్కర్ష వర్ణించుట.
2. పూర్వపూర్వమునకన్నా ఉత్తరోత్తరమునకు అపకర్ష వర్ణించుట.

### సారం - భాగవతంతో అన్వయం

*తలఁప బ్రాహ్మణులుత్తములు వారి కంటెను*
*వేదవేత్తలు, వేదవిదుల కంటె*
*విలసిత వేదార్థ విదులు వారలకంటె*
*సమధిక శాస్త్ర సంశయము మాన్పు*
*మీమాంసకులు, మఱి మీమాంసకుల కంటె*
*నిజధర్మ విజ్ఞాన నిపుణులరయ*
*వారి కంటెను సంగవర్జిత చిత్తులు,*
*దగవారి కంటె సద్ధర్మపరులు*
***ధార్మికుల కంటె నుత్తమోత్తముఁడు వినుము***
***మత్సమర్పిత సకల కర్మములు విడిచి***
***మహిమములుగల్గి యితర కర్మములు విడిచి***
***సమత వర్తించు నప్పుణ్యతముడు ఘనుడు.*** (భాగ. 3 - 960)

బ్రాహ్మణులు, వేదవేత్తలు, మీమాంసకులు, ధర్మవిజ్ఞాన నిపుణులు, సంగవర్జిత చిత్తులు, ధర్మపరులు, విష్ణునకు సమర్పింపబడిన కర్మలుగలవారు - క్రమంగా ఒకరికంటె ఒకరు గొప్పవారు అని చెప్పడం వలన ఇది సారాలంకారం. దీనిలోని అర్థరమణీయత అంతా - అందరికంటే విష్ణువునకు సమర్పింపబడిన కర్మలు గలవారు అధికులు - అనడంలో ఉంది. ఈ

విశ్వంలో సర్వకర్మ ఫలములు ఈశ్వరార్పణం కావించే వారే గొప్పవారని తేలింది.

*కందమూల ఫలాశియై బహుకాలముగ్రతపః పరి*
*స్పందుడై యట మీఁదటం దృణ పర్ణ భక్షణ ఁజేసి యా*
*చంద మేది జలాశియై నృపసత్తముండది మాని తా*
*మంద గంధవహాళి యయ్యె ఁగ్రమంబు నంద్పృథ చిత్తుడై* (భాగ. 4 - 648)

పృథు చక్రవర్తి తపస్సు చేస్తూ తీసుకొనే ఆహారం - కొంతకాలం కందమూలములు, కొంతకాలం ఆకులు, అలములు, ఆ తర్వాత నీటిని, ఆపై కేవలం గాలిని భక్షిస్తూ క్రమంగా ఉగ్రతపం చేశాడట.

క్రమంగా ఆహారాన్ని తగ్గిస్తున్నాడనడం సారాలంకారం ఎందుకంటే - ఆహారం తగ్గిస్తున్నాడంటే - తపస్సు తీవ్రతను క్రమంలో పెంచుతున్నాడన్న మాట.

## 25. మాలాదీపకము

### స్థానము

మాలాదీపకం శృంఖలామూలకాలంకారము

### నిర్వచనం

"పూర్వపూర్వస్యోత్తర గుణావహత్వే మాలాదీపకమ్" (రుయ్యకుడు: 47)
పూర్వపూర్వములు ఉత్తరోత్తరములకు ఉత్కర్షను కలిగిస్తే అది మాలాదీపకం.

**మాలాదీపకం - భాగవతంతో అన్వయం**

*మఖము సేయ వజ్రిమది సంతసించును*
*వజ్రి సంతసింప వానగురియు*
*వాన గురియ ఁగసవు వసుమతి బెరఁగును*
*గసవు మేసి ధేను గణము బ్రతుకు* (భాగ. 10. పూర్వ - 879)

ఇంద్రయాగం చేస్తే ఇంద్రుడు సంతోషిస్తాడు. ఇంద్రుడు సంతోషిస్తే వానకురుస్తుంది. వానకురిస్తే పచ్చిక పెరుగుతుంది. పచ్చిక మేసి గోవులు బ్రతుకుతాయి.

ఇక్కడ క్రమంగా ఒకటి మరొకదాని ఉత్కర్షకు కారణమైంది కావున ఇది మాలాదీపకం.

## 26. వ్యాజస్తుతి

### స్థానము

వ్యాజస్తుతి అలంకారము. గమ్యత్వే విచ్ఛిత్తి మూలక అలంకారం. (అంటే ఉద్దేశితార్థం ప్రతీయమానమైనది). విద్యానాథుడు ఇది వాచ్యాభాసమైనదని చెప్పెను. (విద్యానాథుడు:531)

### వ్యుత్పత్తి

వ్యాజస్తుతి - అనగా - స్తుతివ్యాజము (మిష / మిథ్య) గా కలది అని అర్థము. అంటే పైకి స్తుతించు చున్నట్లు అనిపించినా అంతర్గతంగాస్తుతి ఉండదు.

### నిర్వచనాలు

వ్యాజస్తుతిని నిర్వచించడంలో ఆలంకారికులలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. వీటిని 3 రకాలుగా చెప్పవచ్చు.

1. స్తుతివ్యాజమున నిందించుట వ్యాజస్తుతి అనేవారు-

**భామహుడు** "ఏదియో యొక సామ్యమును ప్రతిపాదింపదలచివాడు చాల అధికములగు గుణములు గల వారిని స్తుతించుట

అనెడు మిషచే నిందించుట వ్యాజస్తుత్యలంకారము" (భామహుడు: 84)
అనగా చదవగానే స్తుతించుచున్నట్లు అనిపించి, లోతుగా ఆలోచిస్తే నింద ప్రతీయమానమైతే అది వ్యాజస్తుతి అని వీరి భావం
2. నిందవ్యాజమున స్తుతించుట వ్యాజస్తుతి అనేవారు-
**దండి** "పైకి నిందవలె కనబడు చున్నను స్తోత్రమే గమ్యమానమగుచో అది వ్యాజస్తుతి" (దండి: 210)
**వామనుడు** "సంభావ్య విశిష్ట కర్మా కరణాన్నిందాస్తోత్రార్థా వ్యాజస్తుతిః" (వామనుడు: 149)
సంభావ్యమైన విశిష్ట కర్మను చేయకపోవుట వలన చేయబడిన స్తోత్రప్రయోజనమగు నింద వ్యాజస్తుతి అన్నాడు వామనుడు.
3. స్తుతివలన నిందగాని, నింద వలన స్తుతిగాని గమ్యమానమైతే అది వ్యాజస్తుతి అనేవారు.
మమ్మట, రుయ్యక, జయదేవ, విద్యానాథ, విద్యాధర, జగన్నాథపండిత, రామరాజభూషణాదులు ఈ విధమైన నిర్వచనాలనిచ్చిరి.
వారి నిర్వచనాలు -
**మమ్మటుడు** "వ్యాజస్తుతిర్ముఖే నిందా స్తుతిర్వారూఢిరన్యథా" (మమ్మటుడు: 682)
పైకి నిందవలె కనపడి లోపలస్తుతి ఉన్ననూ, పైకి స్తుతివలె కనబడి లోపల నింద ఉన్నను వ్యాజస్తుతి అనెను.
**రుయ్యకుడు** "స్తుతినిందాభ్యాం నిందాస్తుత్యోర్గమ్యత్వే వ్యాజస్తుతిః" (రుయ్యకుడు: 32)
**జయదేవుడు** "ఉక్తిర్వ్యాజస్తుతి ర్నిందా స్తుతిభ్యాం స్తుతి నిందయోః" (జయదేవుడు: 110)
**విద్యానాథుడు** "వాచ్యమగు స్తుతిచే నిందకాని, నిందచే స్తుతిగాని, స్ఫురించిన యెడల వ్యాజస్తుతి" అనెను.
(విద్యానాథుడు: 531)
వ్యాజస్తుతి శ్లేషమూలకము కావచ్చు. అంటే శ్లేషద్వారా నిందాస్తుతులు స్ఫురించవచ్చు.

వ్యాజస్తుతిని 'ధ్వని'గా భావించవలెనా? లేక అలంకారంగా భావించవలెనా? అనేది ప్రశ్న. దీనికి జగన్నాథ పండితుని సమాధానము చక్కగా ఉంది.

'వ్యాజస్తుతికి ధ్వనిత్వము లేదు. ధ్వనియందు బాధలేని వాచ్యముయే నాగూరణ మహిమచే అర్థాంతరము స్ఫురించును. (జగన్నాథ పండితుడు: 553)

వర్గీకరణ

జయదేవుడు, విద్యానాథుడు - వ్యాజస్తుతిని 2 రకాలుగా వర్గీకరించిరి. అవి
1. నిందవ్యాజమున స్తుతిచేయుట : అంటే - వినగానే నింద అనిపించినప్పటికీ, అంతర్గతంగా స్తుతి ప్రతీయమానమగుట.
2. స్తుతివ్యాజమున నింద చేయుట : అంటే - వినగానే స్తుతి అనిపించినప్పటికీ అంతర్గతంగా నింద ప్రతీయమానమగుట.

అయితే ఇక్కడొక విషయం ఆలోచించవలసి ఉంది.

వ్యాజస్తుతి - అంటే - స్తుతి వ్యాజము (మిష)గా గలది. అంటే - స్తుతించుచున్నట్లుగా పైకి కన్పిస్తుంది అని అర్థం. కాబట్టి 1. స్తుతివ్యాజమున స్తుతి 2. స్తుతివ్యాజమున నింద అనే రెండు విభాగాలే దీని పరిధిలోకి వస్తాయని తెలుస్తుంది.

నిందావ్యాజమున స్తుతి అనేది దీని పేరు 'వ్యాజస్తుతి'లో ఒదిగిపోని అంశం. కాబట్టి రెండు అంశాలే వ్యాజస్తుతిలో చేర్చుట సమంజసంగా ఉంటుంది. నిందావ్యాజమున స్తుతి అనేదాన్ని 'వ్యాజనింద'లో చేర్చుట సముచితంగా ఉంటుంది. దీనిని బట్టి - వ్యాజస్తుతి 2 రకాలు

1. స్తుతివ్యాజమున స్తుతించుట :- అనగా ఒకరిని స్తుతించుచున్న మిషతో వేరొకరిని స్తుతించుట.
2. స్తుతివ్యాజమున నిందించుట :- అనగా - ఒకరిని స్తుతించుచున్నట్లు పైకి కన్పించినను అంతర్గతంగా నిందించుట.

## వ్యాజస్తుతి - భాగవతంతో అన్వయం

1. ఒకరిని స్తుతించే వ్యాజము (మిష)తో మరొకరిని స్తుతించుట

*సూరులు దొల్లి యేవిభువి శోభిత పాదనఖ ప్రభావళిం*
*జేరి భవాంధకారములఁజిక్కక దాటుదురట్టి దేవునిన్*

*వైరము తోడనైనఁ బిలువన్ ననుఁ బంచి శుభంబు సేసె ని*

*ష్కారణమైన ప్రేమనిదె కంసు నిఁబోలు సఖుండు గల్గనే* (భాగ. 10. పూర్వ-1188)

బలరామకృష్ణులను బృందావనం నుండి తీసుకొని రమ్మని అక్రూరునికి రథమిచ్చి పంపుతాడు కంసుడు. శ్రీకృష్ణుని చూడబోతున్నాననే ఆనందంలో తన్మయుడౌతాడు అక్రూరుడు. కంసుడు పంపింది దురుద్దేశంతోనే అది బలరామకృష్ణులను చంపాలని. అంటే కంసుడు దుష్టుడే, కాని కంసుడు పంపటంవలననే, అక్రూరునికి శ్రీకృష్ణ దర్శనం లభిస్తుంది. కావున అక్రూరుడు 'కంసుని బోలు సఖుండు గల్గనే' అంటాడు. అక్రూరుడు - కంసుని మంచి స్నేహితుడు అని స్తుతిస్తున్నట్లు అనిపిస్తుంది. అయితే ఇక్కడ ఇలా కంసుని స్తుతించడం వలన మరొకరిని స్తుతించడం గమ్యమానమౌతుంది. శ్రీకృష్ణుని చూడడానికి పంపించిన వాడే మంచి స్నేహితుడైతే, మరి శ్రీకృష్ణుడు ఎంతటి మంచివాడో. కంసుని స్తుతి వలన శ్రీకృష్ణుని స్తుతి ప్రతీయమానమౌతుంది. అక్రూరుడు కంసుని స్తుతించే మిషతో శ్రీకృష్ణుని స్తుతిస్తున్నాడు కావున ఇది - వ్యాజస్తుతి.

*తగు నీచక్రికి విదర్భరాజ సుతకున్ దథ్యంము వైధర్భియుం*

*దగు నీ చక్రికి నింతమంచి దగునే దాంపత్య మీ యిద్దఱిం*

*దగులం గట్టిన బ్రహ్మనేర్పరిగదా దర్పాహతారాతి యై*

*మగఁడౌఁ గావుత ఁజక్రి యీరమణికిన్ మాపుణ్యమూలంబునన్* (భాగ. 10. పూ-1737)

'బ్రహ్మ నేర్పరిగదా' అనే మాట ద్వారా బ్రహ్మను స్తుతించు చున్నట్లు పైకి తోచిననూ, శ్రీరుక్మిణీ కృష్ణుల జంట అనంత సౌందర్యయుతమై ఒకరికోసం ఒకరు పుట్టారనే భావం ప్రతీయమానమౌతుంది. అంటే - శ్రీరుక్మిణీ కృష్ణుల స్తుతి ఉంది. కావున ఇది వ్యాజస్తుతి.

2. స్తుతించే వ్యాజముతో నిందించుట :

వ్యాజస్తుతిలోని ఈ విభాగమునకు భాగవతంలో లక్ష్యములు అలభ్యం.

## 27. వ్యాజనింద

**స్థానము**

'వ్యాజనింద' లో స్తుతి, నిందలు ప్రతీయమానమవుతాయి కాబట్టి ఇది 'గమ్యత్వ విచ్ఛిత్తి' మూలక అలంకారము.

**వ్యుత్పత్తి**

నింద వ్యాజము (మిష)గా గలది వ్యాజనింద.

**నిర్వచనాలు**

వ్యాజనిందను పేర్కొన్న అలంకారికుడు - అప్పయదీక్షితుడు ఒక్కరే.

**అప్పయదీక్షితుడు** 'నింద వ్యాజమున నింద ప్రతీయ మానమైతే వ్యాజనింద' (చూడు. అలంకార్ కోశ్)

అంటే - ఒకరిని నిందిస్తున్న మిషతో మరొకరిని నిందించినట్లైతే - అది వ్యాజనింద అని వీరి అభిప్రాయం.

**వర్గీకరణ**

ఆలంకారికులు - నింద వ్యాజమున స్తుతించుటను వ్యాజస్తుతిలోనే చేర్చిరి. (చూడు. ఇదే వ్యాజస్తుతి). నిజానికి నిందవ్యాజముగా గలదాన్ని 'వ్యాజనింద'లో చేర్చడం సముచితం.

కావున వ్యాజనింద - 2 రకాలు

1. నింద వ్యాజమున నిందించుట :- ఒకరిని నిందిస్తున్నమిషతో మరొకరిని నిందించుట.

2. నింద వ్యాజమున స్తుతించుట :- పైకి నిందిస్తున్నట్లు అనిపించినా అంతర్గతంగా స్తుతించుట.

## వ్యాజనింద - భాగవతంతో అన్వయం

1. ఒకరిని నిందించే మిషతో మరొకరిని నిందించుట

*అడవుల మేఁత మేసి మన మన్యుల కెన్నడు నెగ్గు సేయ కి*

*క్కడ విహరింప నేఁడకట! కట్టిడి బ్రహ్మ కిరాతు చేతిలోఁ*

*బడుమనె వ్రాసెనే? నుదుటఁ బాపపు దైవము కంటి కింత యె*

*క్కుడు బరువయ్యెనే బ్రతుకు? కోమలి? యేమననేర్తు ఁజెల్లరే!* (భాగ. 7-61)

వేటగాడు పక్షుల జంటలోని ఆడపక్షిని పంజరంలో పెడతాడు. మగపక్షి బాధ పడుతూ దైవాన్ని దూషిస్తుంది. బ్రహ్మ కిరాతుని చేతిలో బడుమని వ్రాసినాడు. పాపపు దైవానికి ఇంత బరువైనామా ?

ఈ పద్యంలో కోపం - కిరాతునిపైన, దూషించేది బ్రహ్మను. ఇక్కడ బ్రహ్మను నిందించే మిషతో కిరాతుని నిందిస్తుంది. కావున ఇది వ్యాజనింద.

*వినియు వినవు రణ భీరువు*

*మను జాధము నిదుర బోతు మందుని నకటా*

*నినుఁ జక్రవర్తి జేసిన*

*వనజాసను కంటె వెఱ్ఱివాడునుఁ గలడే!* (భాగ-9-408)

పురూరవుని గూర్చి ఊర్వశి పలుకు సందర్భంలోనిదీ పద్యం. నిను చక్రవర్తిని చేసిన బ్రహ్మకంటె వెఱ్ఱివాడు ఉన్నాడా? అనడంలో బ్రహ్మను వెఱ్ఱివాడని తిట్టు మిషతో ఊర్వశి పురూరవున్ని నిందిస్తుంది కావున ఇది వ్యాజనింద.

2. నిందించే మిషతో స్తుతించుట

భగవంతుని ప్రతినాయకులు నిందించే కథా సందర్భాలు వచ్చినపుడు భక్తకవి పోతనగారు హృదయ ఒప్పుకునేది కాదు. ఇలాంటి సందర్భాలలో పోతనగారికి లభించిన మార్గం శ్లేషతో కూడిన వ్యాజనింద. ప్రతినాయకుడు, భగవంతుని నిందిస్తున్నా, శ్లేషద్వారా స్తుతి ప్రతీయమానమౌతుంది. ఎంతైనా పోతనగారు సహజపండితుడు కదా.

*మాసరివాఁడవా మాపాపఁ గొనిపోవ*

*నేపాటి గలవాఁడ వేది వంశ*

*మెందు జన్మించితి వెక్కడఁ బెరిఁగితి*

*వెయ్యది నడవడి యెవ్వఁడెఱుఁగు*

*మానహీనుఁడ వీవు మర్యాద లెఱుఁగవు*

*మాయఁగై కొనికాని మలయరావు*

*నిజరూపమున శత్రునివహంబు పైఁబోవు*

*వసుధేశుఁడవు గావు వావి లేదు*

*కొమ్మ నిమ్ము నీవు గుణరహితుండవు*

*విడువు విడువవేని విలయకాల*

*శిఖిశిఖా సమాన శిత శిలీముఖముల*

*గర్వమెల్లఁ గొందుఁ గలహమందు* (భాగ.10. పూర్వ-1762)

శ్రీకృష్ణుడు పెళ్ళికూతురుగా ముస్తాబైన రుక్మిణీదేవిని రథముపై తీసుకుని పోతూఉంటాడు అది ఇష్టంలేని రుక్మిణి అన్న రుక్మి కృష్ణున్ని నిందిస్తూ ఉంటాడు. ఈ నిందలో స్తుతి గర్భింతగా ఉంటుంది. ఈ పద్యంలోని నింద -

రాజులమైన మాకు నీవు సరివాడవా. యాదవ వంశమెక్కడ ఎక్కడ పుట్టావు, ఎక్కడ పెరిగావు, చిన్నప్పటి నుండి ప్రక్క

ఇండ్లలో దొంగతనం చేసిన నీ ప్రవర్తనలు ఎవరికి తెలియవు. మాన, మర్యాదలు లేనివాడవు. ఏదో ఒక మోసంతోగాని రావు నిజ రూపంతో శత్రువులపైకి పోవు రాజువు కావు వావివరసలు లేవు, నీవు గుణరహితుడవు. అనే నింద పైకి కనిపిస్తున్నా దానిలోని ప్రతిమాటలో కృష్ణుడి దివ్య మానుష లీలను స్తుతించడం కలదు. ఆ స్తుతి -

మాసరివాడవా అన్నప్పుడు భగవంతుడైన కృష్ణుడు కేవలం మానవుడైన రుక్మితో సమానుడు కాదని అంతకన్నా ఎక్కువేనని, ఏది వంశము అన్నప్పుడు భగవంతుడు ఏదో ఒక నిర్దిష్టమైన వంశానికి పరిమితం కాదని, ఎందు జన్మించితివి, ఎందు పెరిగితివి అన్నపుడు భగవంతుడైన కృష్ణుడికి పుట్టటం పెరగటం వంటివి ఉండవని, నడవడి ఎవ్వడెరుగు అంటే - భగవంతుని లీలలోని ఆంతర్యం ఎవ్వరికి తెలియదని, మానహీనుడవన్నప్పుడు ఎలాంటి ప్రమాణానికి అందని వాడని మర్యాదలు ఎరుగవన్నప్పుడు అతని శక్తికి అవధులు లేవని 'మాయఁగ్రై కొనికాని మలయరావు' అన్నప్పుడు భగవంతుడు తన యోగమాయతో లోకాలన్నిటిని నడుపుతున్నాడని, నిజరూపంతో శత్రువులను చంపడని వసుదేశుడవు కావు అన్నప్పుడు కేవలం ఒక్క భూగోళానికే అధిపతి కాడని, పలు విధములుగా కృష్ణుని స్తుతించడం కలదు. ఈ పద్యంలో నిందవ్యాజమున స్తుతి ఉన్నది కాబట్టి ఇది వ్యాజనింద అలంకారం.

## 28. ఆక్షేప

### స్థానము

ఆక్షేపం గమ్యత్వవిచ్ఛిత్తి మూలకము.

### వ్యుత్పత్తి

ఆక్షేపమనగా ఇక్కడ ఆక్షేపించడం అంటే నిషేధించడమని భావం.

### నిర్వచనాలు

ఆక్షేపాలంకార నిర్వచనము విషయంలో ఆలంకారికులలో ఏకాభిప్రాయం ఉంది.

'ఒకానొక విశేషాభిప్రాయమును సూచించుటకై ప్రాకరణికమగు ఉక్త విషయమునుగాని, వక్ష్యమాణ విషయమును గాని కాదని నిషేధించినట్లు తోచురీతిని పలికినచో ఆక్షేపము' (విద్యానాథుడు : 529)

### వర్గీకరణ

రామరాజభూషణుని ప్రకారం - ఆక్షేపాలంకారమును క్రిందివిధంగా వర్గీకరించవచ్చు. ఆక్షేపాలంకారం 2 రకాలు

1. ఇష్ట నిషేధాభాసము 2. అనిష్ట విధ్యాభాసము.

1. ఇష్ట నిషేధాభాసము - ఇష్టమును ఆభాసగా నిషేధించుట. ఇది రెండు విధాలు :-

1. ఉక్త నిషేధాభాసము - ముందు చెప్పిన దాన్ని నిషేధించినట్లు తోచేలాగా చెప్పుట. ఇది 1. కథనరూపం 2. వస్తురూపం అని రెండు రకాలుగా ఉంటుంది.

2. వక్ష్యమాణ నిషేధాభాసం - చెప్పబోయేదాన్ని నిషేధించినట్లు తోచేలాగా చెప్పుట. ఇది 1. కథనరూపం 2. వస్తురూపం అని రెండు రకాలు.

2. అనిష్ట విధ్యాభాసము - నిషేధాభాసము అనిష్ట విధి రూపంలో ఉండుట. (రామరాజభూషణుడు:666-668)

### ఆక్షేపము - భాగవతంతో అన్వయం

1. ఇష్ట నిషేధాభాసము

*బల్లి దుండగు కంసు చేతను బాధ నొందుచునున్న మీ*
*తల్లిఁగాచిన భంగిఁ గాచితి ధార్త రాష్ట్రుల చేత నేఁ*
*దల్లడంబునఁజిక్కకుండగఁదావకీగుణ వ్రజం*

*బెల్ల సంస్తుతి సేసి చెప్ప(గ నెంతదాన జగత్పతీ!* (భాగ. 1-188)

కుంతీదేవి శ్రీకృష్ణుడు స్వయంగా 'పరమాత్మ' అని తెలిసిన వ్యక్తి. భాగవత ప్రథమ స్కంధంలో 185వ పద్యం నుండి 199 పద్యం వరకు మొత్తం 15 గద్యపద్యాలలో అనర్గళంగా కృష్ణున్ని స్తుతిచేస్తూ, మధ్యలో 'తావకీన గుణ వ్రజం బెల్ల సంస్తుతి సేసి చెప్ప(గ నెంతదాన జగత్పతీ' అంటుంది. శ్రీకృష్ణుని హృదయ పూర్వకంగా పొగడడం కుంతికి ఎంతో యిష్టం. పొగడడానికి, నేనెంత? నేనేమి పొగడగలను? అనే నిషేధరూపక వాక్యం ఇక్కడ ప్రయోగింపబడింది. కావున ఇది - ఆక్షేపములోని ఇష్ట నిషేధాభాసమునకు ఉదాహరణ.

2. అనిష్ట నిషేధాభాసము

*మా మా వలువలు ముట్టకు*

*మా మా కొనిపోకుపోకు మన్నింపు తగన్*

*మా మాన మేల కొనియెదు*

*మా మానస హరణమేల మానము కృష్ణా !* (భాగ. 10. పూర్వ -818)

శ్రీకృష్ణుడు తమకు భర్త కావాలని గోపికలు ఒక నెలరోజులు కాత్యాయనీ వ్రతం చేసి, ఒకరోజు వస్త్రములన్నీ విడిచి యమునానదిలో జలక్రీడలాడు చుండగా శ్రీకృష్ణుడు వారి వస్త్రాలను దొంగలించి చెట్టుపైకెక్కాడు.

గోపికలు కృష్ణునితో మా వస్త్రాలు ముట్టకు, తీసికొనిపోకు, మా మానమెందుకు హరిస్తావు? మా మనస్సునెందుకు దొంగిలిస్తావు? ఇవన్నీ మానుము, అంటున్నారు. ఇది నిషేధరూపంలో ఉంది. కాని గోపికలు ఈ మాటలు ఇష్టపూర్తిగా అన్నమాటలుకావు. శ్రీకృష్ణుని భర్తగా పొంద దలిచారు. ఎప్పుడో వారి మనస్సు కృష్ణార్పణమైంది. అదేవారి వ్రతఫలం. జీవిత గమ్యం. శ్రీకృష్ణుడు ఎప్పుడు తమ మనస్సు దోచుకుంటాడా? అని ఎన్నో రోజుల నుండి ఎదురు చూస్తున్నారు. పైకి మాత్రం - మామానమెందుకు హరిస్తావు? మామనస్సెందుకు దోచుకుంటావు? మానుము, అంటున్నారు. 'మానము' అని పైకి నిషేధిస్తున్నట్లు కనబడినా, మనస్సులో నిషేధంలేదు. కావున ఇది అనిష్ట పూర్వక నిషేధాభాసము.

## 29. పర్యాయోక్తి

**స్థానము** 'పర్యాయోక్తి' ని 'పర్యాయోక్తము' అని కూడా వ్యవహరిస్తారు.

పర్యాయోక్తి - గమ్యత్వ విచ్ఛిత్తి మూలకాలంకారము. ఎందుకంటే దీనిలో అర్థము గమ్యమాన (ప్రతీయమాన) మౌతుంది.

**వ్యుత్పత్తి** 'ఒక వచనము నాశ్రయించి ఉక్తము కావలసింది దానికి పర్యాయమైన (మరియొక) వచనము నాశ్రయించి ఉక్తమగుట చేత పర్యాయోక్తమను పేరు తగియున్నది' (జయదేవుడు : 108)

**నిర్వచనాలు** పర్యాయోక్తిని నిర్వచించడంలో ఆలంకారికులలో భిన్నాభిప్రాయాలు లేవు.

**దండి** 'చెప్పదలచిన విషయమును ఆ అర్థమే వచ్చే విధంగా మరియొక రీతిలో చెప్పుటను పర్యాయోక్తి అంటారు' (దండి : 187)

**కుంతకుడు** 'విచ్ఛిత్తి విశేషమును సంపాదించుటకై, ఒక వాక్యముచే ప్రతిపాదింప వలసిన యర్థము మరియొక వాక్యముచే ప్రతిపాదించుట పర్యాయోక్తము' (కుంతకుడు : 340)

**మమ్మటుడు** "ఏ అర్థాన్ని శక్తిచేత వాచ్య వాచక భావాన్ని పురస్కరించుకొని చెప్పవలసి ఉన్నదో ఆ అర్థాన్నే వ్యంగ్యవ్యంజక భావాన్ని పురస్కరించుకొని చెప్పడం పర్యాయోక్తం" (మమ్మటుడు : 693)

**రుయ్యకుడు** "గమ్యస్యాపి భంగ్యంతరేణాభిధానం పర్యాయోక్తం" (రుయ్యకుడు : 31)

గమ్యమునే భంగ్యంతరముగా చెప్పుట పర్యాయోక్తం.

**విద్యానాథుడు** "ప్రకృతమైన కార్యవర్ణనముచేత ప్రకృతమైన కారణము గమ్యమగు నెడల పర్యాయోక్తమగును" (విద్యానాథుడు :

535)

రామరాజభూషణుడు కూడా విద్యానాథుని అభిప్రాయాన్నే వెలిబుచ్చెను. (రామరాజభూషణుడు:673)

### వర్గీకరణ

ఆలంకారికులు పర్యాయోక్తిలో ఏ ఉపవిభాగములూ చెప్పలేదు. కాని ఒక్క జగన్నాథ పండితుడు మాత్రం పర్యాయోక్తిలో 3 రకాలను పేర్కొనెను.

1. కారణముచేత కార్యమునకు గమ్యత్వము గలుగుట.
2. కార్యముచేత కారణమునకు గమ్యత్వము గలుగుట.
3. ఉభయము.

### పర్యాయోక్తి - భాగవతంతో అన్వయం

ప్రస్తుతం వలన ప్రస్తుతం గమ్యమానమగుట పర్యాయోక్తి.

*వినమా యీశ్వరు దృష్టి మార్గమున నావేశింప శంకించి సి*
*గ్గున సంకోచము నొందు మాయ వలనం గుంఠీ భవత్ప్రజ్ఞచే*
*నను లోకేశ్వరుఁడంచు మ్రొక్కు మతిహీన వ్రాతముం జూచినే*
*ననిశంబు న్నగి ధిక్కరింతు హరిమాయా కృత్యమంచున్ సుతా!* (భాగ. 2-83)

నారద మహర్షితో బ్రహ్మదేవుడు చెబుతున్నాడు -

తనను లోకేశ్వరుడని మ్రొక్కే మతిలేని వాళ్ళను చూచి నవ్వి ఇది 'హరిమాయ' అని దాన్ని ధిక్కరిస్తాను. ఇది - ప్రకృత విషయం. దీనిద్వారా శ్రీమహావిష్ణువే లోకేశ్వరుడు, సృష్టి, స్థితి, లయ కారకుడు, తనమాయతో అందరినీ కప్పివేస్తాడనే మరొక ప్రకృత విషయం గమ్యమానమౌతుంది. కావున ఇది పర్యాయోక్తి.

## 30. సమాసోక్తి

### స్థానము

సమాసోక్తి విశేషణ విచ్ఛిత్తి మూలకమని రుయ్యకుడు, అధ్యవసాయ మూలకమని విద్యానాథుడు చెప్పారు.

సమాసోక్తిలో అర్థచారుత్వము విశేషణము వలన కలుగుతుంది. కావున రుయ్యకుడట్లనెను.

### వ్యుత్పత్తి

'సమాసము చే ఉక్తి - సమాసోక్తి. సమాసమనగా సంక్షేపము (సంక్షిప్తం). ఒక విషయమును చెప్పుటతో రెండు విషయాలను బోధించుట సంక్షేపము' (దండి : 140)

### పారిభాషికపదము

అధ్యవసాయము : చూడు. ఇదే. ఉత్ప్రేక్ష.

### నిర్వచనాలు

#### భామహుడు

'ఏది చెప్పినపుడు దానితో సమానమైన విశేషణములు గల మరియొక అర్థం గమ్యమగునో అది సమాసోక్తి' (భామహుడు : 63)

**దండి** 'ఒకానొక విషయమును ఉద్దేశించి తత్తుల్యమైన మరియొక వస్తువును గూర్చి చెప్పుటను సమాసోక్తి అంటారు' (దండి : 140)

**వామనుడు** 'అనుక్తౌసమాసోక్తిః' (వామనుడు : 125)

**మమ్మటుడు** 'పరోక్తిర్భేదకైః శ్లిష్టై సమాసోక్తిః' (మమ్మటుడు : 629)

శ్లిష్టములైన విశేషణాల చేత మరొక అర్థం చెప్పడం సమాసోక్తి.

**రుయ్యకుడు** "విశేషణ సామ్యాద ప్రస్తుతస్య గమ్యత్వే సమాసోక్తిః" (రుయ్యకుడు : 24)

విశేషణముల సామ్యముచే అప్రస్తుతము గమ్యమైనచో సమాసోక్తి.

**జయదేవుడు** "సమాసోక్తిః పరిస్ఫూర్తి ప్రస్తుతఽ ప్రస్తుతస్య చేత్" (జయదేవుడు : 96)

ప్రస్తుతమును వర్ణించుచుండగా అప్రస్తుత స్ఫురణ కలిగినచో సమాసోక్తి.

**విద్యానాథుడు** "వర్ణ్యమైన యొకానొక వస్తువు యొక్క విశేషణాది సామ్యమువలన అప్రకృతమగు మరియొక వస్తువు స్ఫురించెనేని సమాసోక్తి" (విద్యానాథుడు : 492)

సమాసోక్తిలో అప్రస్తుతం స్ఫురించేలాగా, ప్రస్తుతాన్ని వర్ణించడం ఉంటుంది. 'సమాసోక్తిలో ఆరోపవిషయము (ఉపమేయము)నకు ప్రాధాన్యముంటుంది'. (విద్యానాథుడు : 340)

**వర్గీకరణ** విద్యానాథుడు సమాసోక్తిని ఒక కోణంలో 3 రకాలుగా వర్గీకరించెను. (విద్యానాథుడు : 493) అవి -

1. శ్లిష్ట విశేషణ 2. సాధారణ విశేషణ 3. ఔపమ్య గర్భవిశేషణ సమాసోక్తులు.

మరొక కోణంలో 4 రకాలుగా వర్గీకరించెను. (విద్యానాథుడు : 494)

1. లౌకిక వస్తువునందు లౌకిక వస్తువ్యవహార సమారోపము.
2. లౌకిక వస్తువునందు శాస్త్రీయ వస్తువ్యవహార సమారోపము.
3. శాస్త్రీయ వస్తువునందు శాస్త్రీయ వస్తువ్యవహార సమారోపము.
4. శాస్త్రీయ వస్తువునందు లౌకిక వస్తువ్యవహార సమారోపము.

**సమాసోక్తి - ఇతర అలంకారాలతో సామ్యభేదాలు**

సమాసోక్తి - పరికరం: 'సమాసోక్తిలో విచ్ఛిత్తి విశేషణం వలన కలుగగా, పరికరములో విచ్ఛిత్తి సాభిప్రాయం వలన కలుగుతుంది'. (రుయ్యకుడు : 24-25)

సమాసోక్తి - శ్లేష : శ్లేషలో ఒకపదానికి రెండర్థాలుంటాయి. సమాసోక్తిలో రెండర్థాలు లేకపోయినా, ప్రస్తుతాప్రస్తుతాలు రెండింటికి అన్వయించేలాగా భావస్ఫురణ కలుగుతుంది.

సమాసోక్తి - రూపకం : రూపకంలో తరచుగా రూపసమారోపము ఉంటుంది. సమాసోక్తిలో వ్యవహార భావ సమారోపము మాత్రమే ఉంటుంది.

సమాసోక్తి - అప్రస్తుతప్రశంస : అప్రస్తుత ప్రశంసలో అప్రకృత వర్ణన వలన ప్రకృతం ప్రతీయమానమవుతుంది. సమాసోక్తిలో ప్రకృతవర్ణన వలన అప్రకృతం ప్రతీయమాన మవుతుంది.

### సమాసోక్తి - పోతన భాగవతంతో అన్వయం

*సుందర సాయం సంధ్యా*
*వందన విప్రార్ఘ్యతోయ వజ్రహతోద్య*
*న్మందేహాసుర రక్త*
*స్యందము క్రియ (గెంపు సొంపె స(గె నపరదిశన్* (భాగ. 10. పూర్వ - 1290)

సాయం సంధ్యను వర్ణిస్తూ పోతనగారు - ఇలా చెప్పారు. సాయంసంధ్యావందనాలు చేస్తున్న విప్రుల అర్ఘ్యతోయము మనెడి వజ్రాయుధంతో హతమైన మంద - అసుర - రక్తస్యందము వలె సూర్యుడు పశ్చిమ దిశలో వెలిగాడు.

కవి సూర్యున్ని రాక్షసుల ఎఱ్ఱని రథంతో పోల్చాడు. ఇక్కడ విశేషణం గమనింపదగ్గది - అసురుల - రక్త - స్యందము. ఈ పద్యం శ్రీకృష్ణుడు కంసున్ని చంపబోయే ముందు చేసే సూర్యాస్తమయవర్ణన. కృష్ణుడు మధురలోని విశేషాలన్నీ చూశాక, సాయం కాలమైంది. సూర్యున్ని / సాయం సంధ్యను వర్ణించడం ప్రకృత విషయం. ఈ ప్రకృత విషయాన్ని వర్ణించడం మనకు అప్రకృత (సాయం సంధ్యకు సంబంధించని) విషయం ప్రతీయమాన మౌతుంది. అదే కంసాస్తమయం. రక్త-స్యందము అనడం, సంధ్యపరంగా ఎఱ్ఱదనాన్ని సూచిస్తుంది. కాగా అప్రకృతమైన కంసునిపరంగా - రక్తాన్ని సూచిస్తుంది. ఇంకొక విషయమేమంటే - సూర్యుడు - విప్ర - అర్ఘ్యతోయమనే వజ్రాయుధంచే హతం చేయబడ్డ....... అని చెప్పడం ద్వారా కంసుడు త్వరలో హతం చేయబడతాడనే అప్రస్తుత విషయం గమ్యమాన మౌతుంది.

ఇలా ప్రకృతం వలన, అప్రకృతం గమ్యమానమైంది కాబట్టి - ఇది సమాసోక్తి.

## 31. ముద్ర

### నిర్వచనం

ముద్రాలంకారాన్ని ఒక్క అప్పయదీక్షితుడు మాత్రమే చెప్పెను. 'ప్రకృతార్థ పదముల ద్వారా అన్యార్థ సూచన ముద్రాలంకారము' (చూడు. అలంకార్ కోశ్)

### ముద్ర - భాగవతంతో అన్వయం

*గురువులకు నెల్ల గురులై*

*గురులఘు భావములు లేక కొమరారు జగ*

*ద్గురులు త్రిలోకహితార్థము*

*గురుశిష్యన్యాయలీలఁగొల్చిరి వేడ్కన్* (భాగ. 10. పూర్వ - 1410)

బలరామకృష్ణులు, సాందీప మహర్షి వద్ద విద్యాభ్యాసము చేస్తున్నపుడు చెప్పిన పద్యమిది. దీనిలో గురు శిష్యుల గురించి, శ్రీకృష్ణబలరాముల జగద్గురుత్వము గురించి చెబుతూ - 'గురులఘు భావములు లేక' అంటాడు పోతన. 'గురులఘువులు' అనేమాట ఛందశ్శాస్త్ర పారిభాషిక పదాలను జ్ఞప్తికి తెస్తుంది. ఇలా ప్రస్తుతానికి ఎలాంటి సంబంధంలేని, శాస్త్రపారిభాషిక పదాలను సూచిస్తున్నాయి కాబట్టి ఇది - ముద్రాలంకారం.

## 32. లేశ

లేశాలంకారానికి లవాలంకారమని నామాంతరము.

### నిర్వచనాలు

దండి లేశాలంకారానికి ఇచ్చిన నిర్వచనం, వ్యాజోక్తి నిర్వచనం వలెనే ఉంది. (దండి : 173) విన్నకోట పెద్దయ కూడా దండివలెనే నిర్వచించెను. (విన్నకోట పెద్దయ: 94)

జగన్నాథ పండితుడు :

గుణస్యానిష్ట సాధన తయా దోషత్వేన, దోషస్యేష్ట

సాధన తయా గుణత్వేన చవర్ణనం లేశః (జగన్నాథపండితుడు : 767)

గుణమును అనిష్ట సాధనమగుటచేత దోషముగాను, దోషమును ఇష్ట సాధనమగుట చేత గుణముగాను వర్ణించుట లేశము.

### లేశము - భాగవతంతో అన్వయం

1.గుణమును (అనిష్ట సాధనమగుట చేత) దోషముగా వర్ణించుట :

*హరిఁగొల్చు చుండు వారికిఁ*

*బరమేష్ఠి పదంబు మొదలు పదభోగంబుల్*

*నరక సమంబని తలఁపున*

*ధరణీ రాజ్యంబు తోడి తగులము మానెన్* (భాగ. 9-149)

సాధారణ వ్యక్తులు అనేక సత్కార్యాలు, పుణ్య ఫలాన్ని ఆశించి చేస్తారు. వారికి ఫలితం - స్వర్గాదిలోకాలు, తత్సుఖం సృష్టిలోని 14లోకాలలో అత్యున్నతమైనది - సత్యలోకము. అదే బ్రహ్మలోకం. గరిష్ట స్థాయి పుణ్యాలు చేసినవారు స్వర్గలోకాలను కూడా అధిగమించి, బ్రహ్మలోకం చేరతారని ప్రతీతి. అట్టి బ్రహ్మలోకం అందరి దృష్టిలో గొప్పది. విష్ణు భక్తులు ఎలాంటి ఫలాన్ని ఆశించరు. భక్తులు 'భక్తి'ని మాత్రమే కోరుకుంటారు. ఇతరులు గొప్పగా భావించేవి - భక్తుల దృష్టిలో స్వల్పం. పాతాళము లోకం నుండి సత్యలోకం వరకు గల అన్ని లోకాలు - పునరావృత్తి గలవే. అంటే పుణ్యఫలం పూర్తికాగానే తిరిగి జన్మనెత్తుతారు.

అందరిదృష్టిలో ఉత్కృష్టమైన బ్రహ్మలోకం, విష్ణు భక్తుడైన అంబరీషునికి నరకంతో సమానమని చెప్పడం ద్వారా, గుణమును అనిష్ట సాధనమగుట చేత దోషముగా వర్ణింపబడినట్లైనది. కావున ఇది లేశాలంకారం.

2. దోషమును (ఇష్టసాధన మగుట చేత) గుణముగా వర్ణించుట :

*చీర లపహరించి సిగ్గులు విడిపించి*

*పరిహసించి యైన బరఁగ మనకు*

*ఘనుడు నోము కొఱత గాకుండ మ్రొక్కించె*

*ననుచు హరి నుతించి రబలలెల్ల* (భాగ. 10. పూర్వ-843)

స్త్రీలు స్నానం చేస్తుంటే, పురుషుడు చూడడం, చీరలు దొంగిలించడం, వారిని బట్టలు లేకుండానే ఒడ్డుపైకి రమ్మనడం ఇవన్నీ దోషాలే, కాని, ఆదోషకార్యంలో కూడా, నోచిన నోము వృథాకాకుండా చేశాడనే గుణం చెప్పబడింది. కావున ఇది లేశాలంకారం.

## 33. పరికర

### స్థానం

విశేషణ విచ్ఛిత్తి మూలక గమ్యౌపమ్యాలంకారమ. భోజుడొక్కడు దీన్ని ఉభయాలంకారంగా చెప్పడం విచిత్రం.

### నిర్వచనాలు

పరికరాలంకారానికి నిర్వచనాలివ్వడంలో ఆలంకారికులలో ఏకాభిప్రాయం ఉంది.

**రుయ్యకుడు** "విశేషణ సాభిప్రాయత్వం పరికరః" (రుయ్యకుడు : 712)

విశేషణము సాభిప్రాయంగా చెప్పితే అది పరికరం.

**మమ్మటుడు** "విశేషణైర్యత్సా కూతైరుక్తిః పరికరస్తు సః" (మమ్మటుడు : 712)

సాభిప్రాయ విశేషణాల చేత విశేష్యం పరిపుష్టి చేయబడితే అది పరికరాలంకారం.

**విద్యాధరుడు** "విశేషణములు ప్రతీయమానార్థ గర్భములుగా నుండెనేని పరికరము అను అలంకారమగును" (విద్యాధరుడు : 346)

"సాభిప్రాయములగుట యనగా ప్రకృతార్థముల నుపాదానము చేయునట్టి చమత్కారము గల వ్యంగ్యముతో నుండుట" (జగన్నాథపండితుడు : 498)

### పరికర - ఇతర అలంకారాలతో సామ్యభేదాలు

పరికరము - పరికరాంకురము : పరికరములో సాభిప్రాయము విశేషణము నాశ్రయించి ఉంటుంది.

**పరికర - భాగవతంతో అన్వయము**

కాదనడు పొమ్ము లేదీ

రాదనడు జగత్త్రయైక రాజ్యము నిచ్చె

న్నాదయితుఁగట్ట నేటికి

శ్రీ దయితా చిత్త చోర! శ్రిత మందారా! (భాగ. 8-655)

త్రివిక్రముడిగా పెరిగి, విశ్వమంతా నిండిన వామనుడు, బలి చక్రవర్తి తలపై అడుగు పెట్టునపుడు - బలిచక్రవర్తి భార్య వింధ్యావళి తన భర్తను రక్షించమని వామనుని ప్రార్థించే సందర్భంలోని పద్యమిది. 'నా దయితుఁ గట్టనేటికి, శ్రీ దయితా చిత్తచోర! శ్రిత మందారా !' అంటుంది వింధ్యావళి.

ఇక్కడ విష్ణువుకు వాడిన విశేషణాలు -

1. శ్రీ దయితా చిత్తచోరుడు విష్ణువు

2. శ్రిత మందారుడు విష్ణువు.

లక్ష్మీదేవి హృదయాన్ని దోచుకున్నవాడా! అనడం - లక్ష్మీ నారాయణుల దాంపత్యాన్ని గుర్తుకు తెస్తుంది. విష్ణువుకు ఏమైనా జరగ కూడనిది జరిగితే లక్ష్మీదేవి భరించగలదా! ఈ విశేషణం వాడటంవలన - బలి చక్రవర్తికి ఏమైనా జరిగితే వింధ్యావళి భరించలేదనే విషయాన్ని వామనునికి స్ఫురించేలా ఆవిశేషణం వాడబడింది.

భార్యభర్తల సంబంధం - జ్ఞప్తికి తేవడం వలననైనా బలిచక్రవర్తిని చంపకుండా వదిలేస్తాడేమోనని వింధ్యావళి ఆవిశేషణం వాడినట్లు పోతనగారు వ్రాశారు.

ఇది సాభిప్రాయ విశేషణం కావున ఇది పరికరం.

ఇంకొక విశేషణం - విష్ణువు శ్రిత మందారుడు. ఆశ్రయించిన వారి కోర్కెలు తీర్చేవాడు కావున వింధ్యావళి తన భర్తను రక్షించడం అనే కోర్కెను తీరుస్తాడని ఆశిస్తుంది.

## 34. పరికరాంకుర

### నిర్వచనం

పరికరాంకురమును జయదేవుడు, విద్యాధరుడు, అప్పయదీక్షితుడు మాత్రమే నిర్వచించారు. వీరిలో ఏకాభిప్రాయం ఉంది.

**జయదేవుడు** "సాభిప్రాయే విశేష్యేతు భవేత్పరికరాంకురః" (జయదేవుడు : 98)

విశేష్యము సాభిప్రాయంగా చెప్పబడితే అది పరికరాంకురము.

**పరికరాంకుర - భాగవతంతో అన్వయం**

***నీమట్టాలకు నాపదల్ గలుగునే నేమెల్ల నీవార మ***

***న్యాచారంబు లెఱుంగ మీశుఁడవు మా కాఖీల దావాగ్ని నేఁ***

***డే చందంబున నింక దాటుదుము మమ్మీక్షించి రక్షింప వ***

***న్నా! చంద్రాభ! విపన్నులన్ శిఖి వితానచ్ఛన్నులన్ ఖిన్నులన్*** (భాగ.10. పూర్వ-743)

శ్రీకృష్ణుడు, ఇతర గోపాలురు అడవిలో గోవులను మేపుచుండగా, ఆకస్మికంగా చుట్టూ మంటలు అలముకొన్నాయి. వాటినుండి రక్షింపమని గోపాలురు శ్రీకృష్ణుని ప్రార్థిస్తున్నారు. ఈ స్తుతిలో రెండు సాభిప్రాయ విశేష్యాలు (నామవాచకాలు) ఉన్నాయి. అవి 1. ఈశుడవు 2. చంద్రాభుడవు.

**ఈశుడు** - అన్నపుడు గోపాలురకు అధిపతి అనేది సాధారణార్థం. నీవే భగవంతుడవు అనే అర్థం కూడా దీనికుంది. ఇక్కడ '**ఈశుడు**' అంటే '**శివుడు**' అనే అర్థం సాభిప్రాయం. శివుడు పూర్వం లోకాలన్నింటిని దహించి వేసే - విషజ్వాలలను

మింగాడు. కాబట్టి కృష్ణుడు కూడా ఈ జ్వాలలను మింగి కాపాడవలసిందని స్ఫురింపజేయడం జరిగింది. 'ఈశుడు' అనే విశేష్యం సాభిప్రాయంగా వాడబడింది.

అలాగే - మరొక విశేష్యం కూడా సాభిప్రాయంగా ఉంది. అది - 'చంద్రాభ' అనేది - కృష్ణుడు చంద్రునితో సమానమైనవాడు ఎందుకంటే - చంద్రుని వలెనే చల్లదనాన్ని గోపాలురకు ప్రసాదిస్తాడనే భావంతో ఇక్కడ 'చంద్రాభ' అనేమాట వాడబడింది.

ఇలా 'ఈశుడు' 'చంద్రాభ!' అనేవి - సాభిప్రాయ విశేష్యాలు కాబట్టి ఇది పరికరాంకురం.

## 35. కావ్యలింగ

కావ్యాలింగమునకే 'కావ్యహేతువు' అని పేరు.

**స్థానము**

తర్క న్యాయ మూలక - గమ్యౌపమ్య అలంకారం.

**వ్యుత్పత్తి**

'లింగము' అంటే 'రుజువు'. ఒక విషయమును చెప్పి, అది నమ్మశక్యముగానట్లు ఉన్నచో, ఋజువు చేయుటకు దానిని మరొక విషయముచే సమర్థించటం దీనిలో ఉంటుంది. ఇది కావ్యగతమై కావ్యలింగ మవుతుంది. (జయదేవుడు : 177)

**నిర్వచనాలు**

'కావ్యలింగము'నకు 'కావ్యహేతు' వనే పేరు కూడా ఉంది.

**మమ్మటుడు** "కావ్యలింగం హేతోర్వాక్య పదార్థతా" (మమ్మటుడు : 690)

హేతువు యొక్క వాక్యార్థత్వం కాని, పదార్థత్వం కాని కావ్యలింగాలంకారం.

ఏదైనా ఒక విషయం చెప్పి దానికి హేతువును చెప్పడం కావ్యలింగాలంకారం.

**జయదేవుడు** "సమర్థనీయ స్యార్థస్య కావ్యాలింగం సమర్థనమ్" (జయదేవుడు : 177)

సమర్థనీయమైన యర్థమునకు సమర్థనము కావ్యలింగం.

**విద్యానాథుడు** "హేతువు వాక్యగతము గాని, పదగతముగాని నిర్దిష్టమైనచో కావ్యలింగము" (విద్యానాథుడు : 537)

**వర్గీకరణ**

మమ్మటుడు - కావ్యలింగమున 2 రకాలుగా వర్గీకరించెను.

1. వాక్యార్థ కావ్యలింగం : హేతువును వాక్యము చేత చెప్పుట.

2. పదార్థ కావ్యలింగం : హేతువును పదము చేత చెప్పుట.

ఇది 2 రకాలు.

1. ఏక పదార్థ కావ్యలింగం : హేతువును ఏకపదం చేత చెప్పుట.

2. అనేక పదార్థ కావ్యలింగం : హేతువును అనేక పదాలచేత చెప్పుట.

విద్యానాథ, విద్యాధర, రామరాజభూషణాదులు మమ్మటునే అనుసరించిరి.

**కావ్యలింగం - ఇతర అలంకారాలతో సామ్యభేదాలు**

**కావ్యలింగం - అర్థాంతరన్యాసం**

కావ్యలింగంలో కార్యకారణరూప హేతుత్వము సాపేక్షము, అర్థాంతరన్యాసములో నిరపేక్షము.

**కావ్యలింగం - భాగవతంతో అన్వయం**

*అదిదేవుడైన యా రామచంద్రుని*

*కట్టఁగట్టు టెంత యసురకోటిఁ*

*జంపుటెంత కపుల సాహాయ్య మదియెంత*

*సురల కొఱకు క్రీడసూపెగాక* (భాగ. 9-358)

శ్రీరాముడు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే అని చాటి చెప్పే పద్యమిది. ఆ ఆదిదేవుడైన రామునికి - వారధి కట్టడం, రాక్షసులను చంపడం, ఇవన్నీ స్వల్ప కార్యాలు. అయితే వీటికి వానరుల సహాయం ఎందుకు తీసుకున్నాడు? అనే ప్రశ్నకు కారణం ఏమిటనేది - అందంగా చెప్పబడింది. అదే - సురల కొరకు క్రీడ సలిపాడు అంతే. అది శ్రీరాముని లీల.

ఇలా ఒక విషయం చెప్పి, దానికి అందమైన కారణం చెబితే అది కావ్యలింగం.

*పరతత్త్వజ్ఞులు శాంత చిత్తులు తపఃపారీణు లార్యుల్ ఘనుల్*

*పురుష శ్రేష్ఠులు వచ్చితల్లి! భవదంభోగాహమున్ సేయఁగా*

*నరసంఘాఘము నిన్నుఁబొందునె జగన్నాథుండు నానాఘసం*

*హరుడా విష్ణుడు వారిచిత్తముల ఁదానైయుంట మందాకినీ!* (భాగ. 9-225)

భగీరథుడు గంగను ప్రత్యక్షం చేసుకొని, స్వర్గ, భూలోకములద్వారా సగర పుత్రులు భస్మంగా మారిన చోటుకు (నరకానికి) రమ్మంటాడు. శ్రీ గంగాదేవి ఒక సందేహాన్ని వెలిబుచ్చుతుంది - ఎందరో పాపాత్ములు తనలో మునిగితే ఆ పాపమంతా తనను చేరుతుంది కాబట్టి రానంటుంది. భగీరథుడు - పరతత్త్వజ్ఞులు, శాంత చిత్తులు, తపఃపారీణులు, ఆర్యులు, ఘనులు, పురుషశ్రేష్ఠులు - కూడా గంగలో మునుగుతారు కాబట్టి గంగానది పాపాలు పోతాయంటాడు. భక్తులు మునిగితే గంగానదిలోనికి చేరిన పాపాలు ఎందుకుపోతాయి? అనేదానికి భగీరథుడు చక్కని కారణం చెబుతాడు - అది భక్తులలో స్వయంగా శ్రీమహావిష్ణువు ఉంటాడు కదా!

అందమైన హేతువు చెప్పబడటం వలన ఇది కావ్యలింగం.

## 36. విశేషోక్తి

### స్థానము

విరోధి మూలకాలంకారము.

### వ్యుత్పత్తి

'వస్తువులోని 'విశేషము'ను చూపుటకొరకు గుణాదుల వైకల్యము చెప్పబడుతుంది. కాబట్టి దీనిని 'విశేషోక్తి' అనుట సార్థకం. (దండి : 201)

### నిర్వచనాలు

విశేషోక్తి, విభావ నాలంకారానికి వ్యతిరేకము.

విశేషోక్తికి ఆలంకారికులిచ్చిన నిర్వచనాలు 2 రకాలుగా ఉన్నాయి.

భామహుడు (పుట:81), దండి (పుట:201), వామనుడు (పుట:148), విన్నకోట పెద్దయ ఇచ్చిన నిర్వచనాలు ఒకరకంగా ఉన్నాయి. దీనికి మమ్మట (పుట:670), రుయ్యక (పుట:38), జయదేవ (పుట:126), విద్యానాథ (పుట:510), విద్యాధర (పుట:384) జగన్నాథపండితుడు (పుట:597), రామరాజభూషణ (పుట:646) ప్రముఖులు ఇచ్చిన నిర్వచనాలు మరొక రకంగా ఉన్నాయి.

దండి మొదలగువారి అభిప్రాయం ప్రకారం -

"గుణజాతి క్రియాదీనాం యత్తు వైకల్య దర్శనమ్

విశేష దర్శనా యైవ సా విశేషోక్తి రిష్యతే" (దండి : 201)

వస్తువులోని విశేషమును చూపుట కొరకు గుణ, జాతి, క్రియాదుల వైకల్యమును చూపుట విశేషోక్తి.

**మమ్మటుడు** మొదలగు వారి అభిప్రాయం ప్రకారం -

కారణములు కావలసినన్ని ఉన్నప్పటికీ కార్యం జరగకపోవడాన్ని వర్ణిస్తే అది విశేషోక్తి. ఇదే అభిప్రాయాన్ని క్రింద నిర్వచనాలలో చూడవచ్చు.

- "విశేషోక్తి రఖండేషు కారణేషు ఫలావచః" (మమ్మటుడు : 67)
- "కారణ సామగ్ర్యే కార్యానుత్పత్తిః విశేషోక్తిః" (రుయ్యకుడు : 38)
- "కార్యా జని ర్విశేషోక్తి స్సతి పుష్కల కారణే" (జయదేవుడు : 126)

## వర్గీకరణ

విశేషోక్తిని 3 రకాలుగా మమ్మటుడు చెప్పెను.

1. అనుక్త నిమిత్తం : కార్యం కలుగక పోవడానికి నిమిత్తం (హేతువు) చెప్పకపోవడం.
2. ఉక్తనిమిత్తం : కార్యం కలుగక పోవడానికి నిమిత్తం చెప్పడం.
3. అచింత్యనిమిత్తం : కార్యం కలుగక పోవడానికి నిమిత్తం ఊహించరానిది కావటం. (మమ్మటుడు : 670)

## విశేషోక్తి - భాగవతంతో అన్వయం

*ఆకార జన్మ విద్యార్థవరిష్ఠుడై*
*గర్వ సంస్తంభ సంగతుఁడు గాఁడు*
*వివిధ మహానేక విషయ సంపన్నుఁడై,*
*పంచేంద్రియములచే పట్టు వడఁడు*
*భవ్యవయో బల ప్రాభవోపేతుఁడై*
*కామరోషాదుల గ్రందుకొనఁడు*
*కామినీ ప్రముఖ భోగములెన్ని గలిగిన*
*వ్యసన సంసక్తి నా వంక బోఁడు*
*విశ్వమందుఁగన్న విన్న యర్థము లందు*
*వస్తుదృష్టిఁజేసి వాంఛ యిడఁడు*
*ధరణీనాథ! దైత్య తనయుండు హరిపర*
*తంత్రుడై హతాన్య తంత్రుఁడగుచు* (భాగ. 7-117)

ప్రహ్లాదుడు చెడిపోవడానికి అవకాశాలు (కారణాలు) ఎన్ని ఉన్నా తాను మాత్రం చెడిపోడు (కార్యం జరుగదు)

మంచి ఆకారం, జన్మ, విద్య ఉన్నా గర్వితుడు కాడు. అనేక విషయములు తన చుట్టూ ఉన్నా ఇంద్రియలోలుడు కాడు, వయస్సు, బలము ఉన్నా కామము, రోషములకు లోబడడు. కామినులు మొదలగు ఎన్ని భోగవస్తువులున్నా, వ్యసనపరుడు గాడు. అంటూ ఇలా కారణాలు ఉండి కార్యం జరగకపోవడం వలన ఇది - విశేషోక్తి.

*పలువురు దానవుల్ పొడువ బాలుని దేహము లేశమాత్రము*
*న్నొలియదు లోపలన్ రుధిరమబ్బుదు కందదు, శల్యసంఘము*
*న్నలియదు దృష్టవైభవము నష్టముగాదు ముఖేందు కాంతియున్*
*బొలియదు నూతన శ్రమము పుట్టదు పట్టదుదీన భావమున్* (భాగ. 7-192)

రాక్షసులు ప్రహ్లాదుని చిత్రహింసలు పెడుతున్నారు. కాని ప్రహ్లాదులు దేహం మాత్రం - బాధనొందదు, రక్తంతో కందదు, ఎముకలకు ఏమీకాదు. చూపు తగ్గదు, ముఖకాంతి తగ్గదు, శ్రమ కలుగదు. ఇలా కారణం ఉండికూడా కార్యం జరగలేదు కాబట్టి

ఇది - విశేషోక్తి. విష్ణుభక్తుల లక్షణం అటువంటిది.

## 37. విభావన

### స్థానము

విరోధిమూలకాలంకారము - విభావన

### నిర్వచనాలు

విభావన, విశేషోక్తికి వ్యతిరేకము.

### రుయ్యకుడు

"కారణాభావే కార్యస్యోత్పత్తిర్విభావనా" (రుయ్యకుడు:37)

కారణం లేకుండనే కార్యం జరిగినట్లు చెప్పుట విభావన.

మమ్మట (పుట:669), జయదేవ (పుట:119), విద్యాధర (పుట:380), జగన్నాథపండితుడు (పుట:585) మొదలగువారు రుయ్యకుని అభిప్రాయాన్నే వెలిబుచ్చిరి.

- "క్రియాయాః ప్రతిషేధేపి ఫలవ్యక్తిర్విభావనా" (మమ్మటుడు : 669)
- "అనతి ప్రసిద్ధహేతౌ కార్యోత్పత్తి ర్విభావనాభవతి" (విద్యాధరుడు : 380)

### వర్గీకరణ

జయదేవుడు 'విభావన'లో 6 రకాలు పేర్కొనెను. అవి -

1. కారణం లేకుండ కార్యోత్పత్తి జరుగుట.
2. కారణంలు సమగ్రముగా లేకపోయినప్పటికిని కార్యం జరుగుట.
3. ప్రతిబంధకమున్నప్పటికి కార్యం జరుగుట.
4. కారణం కానిదాని చేత కార్యం జరుగుట.
5. విరుద్ధ కారణం చేత కార్యం జరుగుట.
6. కార్యం నుండియే కారణం పుట్టుట. (జయదేవుడు : 119-125)

### విభావ - భాగవతముతో అన్వయం

*సకల మహాద్వీప సహిత విశ్వంభరా*
*స్థలిని దున్నక పండు సస్యచయము*
*కామధేన్వాదుల కరణి నర్థులు గోరు*
*కోర్కులు గగనంబు గురియు చుండు*
*వననిధు లేడును వాహినీ సందోహ*
*ములును వీచుల రత్నములు వహించు*
*నుర్వీరుహంబులు నొక్క కాలంబున*
*నఖిలర్తు గుణముల నతిశయిల్లు*
*నంబు సంపూరిత ద్రోణులగుచు నొప్పు*
*పర్వతంబులు సకల దిక్పాల వివిధ*

గుణములెల్లను దానె కైకొనుచు దైత్య

విభుడు త్రైలోక్య రాజ్య సంవృద్ధి నుండ (భాగ. 7-104)

హిరణ్యకశిపునికి భయపడి - పంచభూతాలు పనిచేస్తుంటాయి. సాధారణంగా భూమిని దున్ని పంటలు పండిస్తుంటారు. కాని ఇచ్చట దున్న కుండానే పంటలు పండుతున్నాయి. అలాగే ఇతరములు కూడా. ఇక్కడ కారణం లేకుండానే కార్యం జరిగింది కావున ఇది - విభావన.

## 38. విషమ

### స్థానము

విరోధ మూలకాలంకారం విషమం.

### వ్యుత్పత్తి

విరుద్ధాంశములు చెప్పబడుటచే దీనికి 'విషమం' అనేపేరు వచ్చింది. సమము కానిది విషమము.

### నిర్వచనాలు మరియు వర్గీకరణ

విషమం సమమునకు విపర్యయం.

'అనురూప్యం లేని రెండింటికి సంబంధము వర్ణింపబడుట విషమం' (జయదేవుడు : 132)

విషమాలంకారం 3 రకాలుగా ఉంటుంది.

'విరూప కార్యానర్థయోరుత్పత్తిః విరూప సంఘటనా చ విషమమ్'' (రుయ్యకుడు : 40)

1. కారణం వలన విరుద్ధ కార్యం పుట్టుట.

2. కారణం వలన కార్యం జరుగకపోగా అనర్థం వాటిల్లుట.

3. విరుద్ధములగు రెండు వస్తువుల నొకచో సమకూర్చుట.

జయదేవ (పుట: 132-135), విద్యానాథ (పుట: 512-513), విద్యాధర (పుట: 392) ప్రముఖులు ఈ అభిప్రాయాన్నే వెలిబుచ్చిరి.

### విషమ - భాగవతంతో అన్వయం

1. కారణ విరుద్ధ కార్యోత్పత్తి

*.........................................................................భీ*

*కరపాషాణ పురీష మూత్ర ఘన దుర్గంధాస్థి రక్తావళుల్*

*గురిసెన్ మేఘము లభ్రవీధిని మహా క్షోభ క్రియాలోలమై.* (భాగ. 3-683)

వరాహస్వామి, హిరణ్యాక్షుఁడు యుద్ధముచేయు సందర్భంలోని పద్యమిది. మేఘములు వర్షాన్ని (నీటిని) కురవడం లోకసహజం. కాని దానికి విరుద్ధంగా - మేఘాలు భయంకరమైన పాషాణాలు, పురీష, మూత్ర, అస్థులు, రక్తాన్ని కురిశాయి.

కారణ విరుద్ధమైన కార్యం జరిగిందిక్కడ. కావున ఇది విషమం. ఇదే సందర్భంలోని మరొక పద్యం -

***దితి తనవిభు వాక్యంబుల***

***గతితప్పద యనుచుఁదలఁపఁగాఁజన్నుల శో***

***ణిత ధారలొలికె రక్షః***

***పతియగు కనకాక్షు పతనభావము దోపన్*** (భాగ. 3-690)

దితి పాలిండ్లు రక్తధారలొలికాయని చెప్పబడింది. పాలిండ్లు పాలు కురవడానికి బదులుగా రక్తాన్ని కురిసినట్లు చెప్పబడుటచే ఇది విషమం.

2. కారణంవలన కార్యం జరుగక పోగా అనర్థం వాటిల్లుట :

ఈ భేదమునకు భాగవతంలో లక్ష్యములు అలభ్యం

3. విరుద్ధములగు రెండు వస్తువుల నొకచో కూర్చుట :

*అగుణుండగు పరమేశుఁడు*

*జగములు గల్పించు కొఱకుఁచతురత మాయా*

*సగుణుండగుఁగావున హరి*

*భగవంతుండనఁగ బరగె భవ్య చరిత్రా!* (భాగ. 2-99)

పరమేశుని 'అగుణుడు' అనిచెప్పి వెంటనే 'సగుణుడు' అనిచెప్పడం - రెండు విరుద్ధ విషయాలను ఒకచోట కూర్చినట్లైనది - కావున ఇది విషమం. భగవంతుని తత్త్వము అలాంటిది.

## 39. సమ

### స్థానము

సమము విరోధి మూలకమని రుయ్యకుడనెను.

### వ్యుత్పత్తి

అనురూప వస్తు సమావేశం దీనిలో వర్ణింపబడుతుంది కాబట్టి దీనికి 'సమము' అనేది సార్థక నామము.

### నిర్వచనాలు

**జగన్నాథపండితుడు** "అనురూప సంసర్గః సమం" (జగన్నాథుడు: 326)

అనురూపములగు వస్తువులకు సమావేశము కలిగిన అది సమాలంకారం.

**రామరాజభూషణుడు**

"పరస్పరానుకూల వస్తువుల సంబంధం వర్ణింపబడుట సమాలంకారం" (**రామరాజభూషణుడు: 650**)

### వర్గీకరణ

జయదేవుడు 'సమము'ను 3 రకాలుగా చెప్పెను.

1. అనురూపములైన రెండింటికి సంబంధం వర్ణించుట.
2. కార్యమునకు కారణముతో అనురూపత్వము వర్ణింపబడుట.
3. దేనికై కర్త ప్రయత్నించునో అది అనిష్టము లేకుండ సిద్ధించుట.

### సమ - భాగవతంతో అన్వయం

*నిలిపెన్ రెప్పల బృందిమన్ విశదిమన్ నేత్రంబులం జూచుకం*

*బుల నాకాళిమ మేఖలన్ ద్రఢిమ, నెమ్మోమున్ సుధా పాండిమన్*

*బలిమిం జన్నుల శ్రోణిపాళి గరిమన్ మధ్యంబునన్ బృంహిమన్*

*లలితాత్మన్ లఘిమన్ మహా మహిమమేన్ గర్భ దుర్వారయై* (భాగ. 8-498)

అదితి గర్భంలో శ్రీమహావిష్ణువు (వామనుడు) ఉండగా, గర్భవతియైన అదితి లక్షణాలు ఎలా ఉన్నాయో వర్ణిస్తున్నాడు పోతనగారు.

రెప్పలలో బృందిమ, నేత్రాలకు వైశాల్యం, చూచుకముల నాకాళిమ, మేఖలకు దృఢత్వం, ముఖంలో తెల్లని కాంతి, చన్నులకు బలము, శ్రోణిపాళికి గరిమ, నడుము బృంహిమ (పెద్దతనం), హృదయం మాత్రం లఘిమ (అణకువ), శరీరానికి

మహిమ - చేకూరాయి. ఏ అవయవానికి ఏ లక్షణం వృద్ధి చెందాలో అదే వృద్ధి చెందింది. ఆయా అవయవాల అనురూప లక్షణాలు చెప్పబడ్డాయి కావున ఇది - సమాలంకారం.

## 40. కారణమాల

**స్థానము**

శృంఖలా మూలకాలంకారమని రుయ్యకుడు, గమ్యోపమ్యాలంకారమని విద్యానాథుడు చెప్పారు.

**వ్యుత్పత్తి**

పూర్వ పూర్వములు, ఉత్తరోత్తములకు కారణము లగును. కావున 'కారణమాల' అనేది సార్థకము.

**నిర్వచనాలు**

**రుయ్యకుడు** "పూర్వపూర్వస్య ఉత్తరోత్తర హేతుత్వే కారణమాలా" (రుయ్యకుడు: 45)

పూర్వము చెప్పిన వస్తువులు, ఒక్కొక్కటిగా తరువాత చెప్పే వస్తువులకు కారణమని వర్ణిస్తే అది కారణమాలాలంకారము.

ఇతర ఆలంకారికులందరూ ఈ అభిప్రాయాన్నే వెలిబుచ్చారు.

**పారిభాషిక పదం**

శృంఖలము :

"పూర్వపూర్వములకు ఉత్తరోత్తరోత్తరము నందుగానీ, ఉత్తరోత్తరములకు పూర్వపూర్వము నందుగానీ సంసృష్టత్వము శృంఖల" (జగన్నాథపండితుడు : 651)

వర్గీకరణ : కారణమాల 2 రకాలు

1. ఉత్తరోత్తరములకు పూర్వపూర్వములు కారణములగుట
2. పూర్వపూర్వములకు ఉత్తరోత్తరములు కారణములగుట

**కారణమాల - భాగవతంతో అన్వయం**

*భూమి నుద్యోగియై భోగియై యుండెడి*
*నరునికైవడి ముని నాథ! నీవు*
*ఘన శరీరము (దాల్చి కదలవు చిత్రము*
*ద్యమయుక్తునకు, గాని ధనము లేదు*
*ధనవంతునకుఁగాని తగుభోగములు లేవు*
*భోగికి (గాని సంపూర్ణమైన*
*తనవులేదుద్యోగ ధన భోగములులేక*
*నేల నూరక పడి నిద్రపోవు*
*నీకు నెట్లు గలిగె నిరుపమ దేహంబు? ...* (భాగ. 7-432)

ఉద్యమయుక్తుని గాని, ధనములేదు, ధనవంతునకుగాని భోగములు లేవు, భోగికి గాని సంపూర్ణ తనువులేదు.

ఉద్యమించడం ధనసంపాదనకు కారణం. ధనం భోగాలకు కారణం, భోగములుంటేనే శరీరానికి సంపూర్ణత. వీటిలో పూర్వపూర్వములు ఉత్తరోత్తరములకు కారణం కాబట్టి - ఇది కారణమాల.

*నెలతఁ విష్ణువునకు నిఖిల దేవాత్మ న*
*కాననంబు శిఖియు నవని సురులు*

*వారు దనియఁ దనియు వనజాత లోచనుఁ*

*డతఁడు దనియ జగములన్ని దనియు* (భాగ. 8-466)

శ్రీవిష్ణువునకు - ఆననము - అగ్ని, బ్రాహ్మణులు

బ్రాహ్మణులు సంతృప్తి చెందితే విష్ణువు సంతృప్తి చెందుతాడు. విష్ణువు సంతృప్తి చెందితే లోకాలన్నీ సంతృప్తి చెందుతాయి. ఇలా పూర్వపూర్వములు ఉత్తరోత్తరములకు కారణం అయినాయి కాబట్టి ఇది కారణమాల.

## 41. అసంభవ

అసంభవాలంకారమును జయదేవుడు, అప్పయదీక్షితుడు చెప్పారు.

### నిర్వచనం

'కార్యోత్పత్తి యొక్క అసంభావ్యత్వాన్ని వర్ణించుట అసంభవాలంకారము' (జయదేవుడు : 128)

కార్యము జరుగుట అసంభవమని వర్ణించుట అసంభవాలంకారము

### అసంభవం - భాగవతంతో అన్వయం

*బాలుండెక్కడ బండి యెక్కడ నభోభాగంబుపైఁ జేడ్పడన్*

*గాలం దన్నుట యెక్కడాటపడుచుల్ గల్లాడి రీ జడ్డుఁ బ*

*ల్కే లోకంబుననైన ఁజెప్పఁబడునే యే చందమో కాక యం*

*చాలా వించుచు వ్రేలు వ్రేతలు ప్రభూతాశ్చర్యలై రంతటన్* (భాగ. 10. పూర్వ-256)

పసివాడైన శ్రీకృష్ణుడు శకటాన్ని (శకటం రూపంలో ఉన్న రాక్షసున్ని) తన్నగా అది ఆకాశంలోనికి ఎగిరి క్రింద బడి ముక్కలైంది. అయితే అక్కడ చూచిన చిన్నపిల్లలు ఆ బండిని శ్రీకృష్ణుడే తన్నినాడంటేనమ్మక, అది శ్రీకృష్ణుడు తన్నడం అసంభవమని చెప్పబడినది. కావున ఇది అసంభవాలంకారం.

అంత చిన్నవాడై ఉండికూడా, బండిని తన్నడం వలన, శ్రీకృష్ణుడు అసంభవాన్ని కూడా సంభవం చేస్తాడని, అతడు లీలామానుష విగ్రహుడని తెలుస్తుంది.

## 42. సముచ్చయ

సముచ్చయమునకు 'తత్కరాలంకార'మనే పేరుకూడా ఉంది.

### స్థానము

సముచ్చయాలంకారాన్ని రుయ్యకుడు వాక్యన్యాయ మూలకమని, విద్యానాధుడు గమ్యోపమ్యాలంకారమని చెప్పారు.

### వ్యుత్పత్తి

ఒక కార్యము సాధింపబడుటకు రెండుగాని, అంతకుమించిగాని గుణములు లేదా క్రియలు సమూహంగా కలిసి వినియోగింప బడును. కావున దీనికి 'సముచ్చయము' అనే పేరు సార్థకము.

### నిర్వచనాలు మరియు వర్గీకరణ

సముచ్చయమును ఆలంకారికులు 2 రకాలుగా చెప్పారు.

1. "గుణక్రియా యౌగపద్యం సముచ్చయః" (రుయ్యకుడు:54)

   అనేక గుణముల, క్రియల కూర్పు సముచ్చయము.

2. "ఏకస్య సిద్ధిహేతుత్వేన్యస్య తత్కరత్వం చ" (రుయ్యకుడు: 55)

ఒక కారణము కార్యసిద్ధికి హేతువుకాగా, వేరొక కారణము స్పర్థతో దానినొనరించునో అది సముచ్చయము.

**విద్యానాథుడు** 1. "గుణములకుగాని, క్రియలకుగాని ఒకచో సమావేశము వర్ణించబడిన సముచ్చయము" (విద్యానాథుడు: 549)

ఇది 4 రకాలు 1. గుణ సముచ్చయం

2. క్రియా సముచ్చయం

3. ఏక విషయ సముచ్చయం

4. గుణ క్రియా సమస్త సముచ్చయం

2. "ఒక కార్యమును సాధించుటకై పలు కారణములు ఖలేకపోత న్యాయమున నుద్యోగించెనేని అదియు సముచ్చయమే యగును" (విద్యానాథుడు: 550)

**పారిభాషికపదము**

ఖలేకపోతన్యాయము : 'ఖలము' అంటే 'కళ్ళము', 'కపోతములు' అంటే పావురములు. వేటగాడు పన్నిన వలలో చిక్కిన పావురాలన్నీ కలిసి, వలను లేపుకొని పోయిన కథ ద్వారా ఏర్పడిన నానుడి ఇది. పదుగురు కలిసి ఒక కార్యమును సాధించుట ఖలేకపోతన్యాయము.

సముచ్చయమును ఆలంకారికులు రెండు రకాలుగా చెప్పిరి.

1. ఒక విషయ స్థితిని తెలుపుటకొక గుణము, ఒక క్రియ సరిపోగా అనేక గుణములు, లేదా అనేక క్రియలు కూర్చుట సముచ్చయము.

2. పలువురు కలిసి ఒక పనిని సాధిస్తే సముచ్చయము. అంటే దీనిని ఏ ఒక్కరు సాధించలేరన్నమాట.

**సముచ్చయం - భాగవతంతో అన్వయం**

*శ్రీకైవల్యపదంబుఁ జేరుటకునై చింతించెదన్ లోక ర*
*క్షైకారంభకు భక్తపాలన కళా సంరంభకున్ దానవో*
*ద్రేక స్తంభకుఁ గేళిలోల విలసద్దృగ్జాల సంభూత నా*
***నా కంజాత భవాండ కుంభకు మహానందాంగనా డింభకున్*** (భాగ. 1-1)

భాగవతంలోని మొట్టమొదటి పద్యమిది. శ్రీకృష్ణుని దివ్యమంగళ గుణములు వర్ణిస్తూ :

1. లోకరక్షైక ఆరంభకుడు
2. భక్తపాలన కళా సంరంభకుడు
3. దానవోద్రేక స్తంభకుడు
4. బ్రహ్మాండములను చేయువాడు అంటాడు.

పోతనగారు కైవల్యపదం చేరుటకు చింతించ వలసిన వ్యక్తికి ఉన్న లక్షణాలు చెబుతాడు. అయితే ఈ నాలుగు లక్షణాలలో ఏ ఒక్క లక్షణం ఉన్నా మిగిలిన లక్షణాలన్నీ ఉన్నట్లే, కావున వీటిలో ఒకటి చెప్పినా సరిపోయేది. అయినా అన్నింటిని చెప్పడం జరిగింది కావున ఇది సముచ్చయం.

పోతనగారు భగవల్లీలలను వర్ణించుటకు అన్నింటిని చెప్పారు.

## 43. విచిత్ర

విచిత్రాలంకారాన్నే జయదేవుడు చిత్రాలంకారమన్నాడు.

**స్థానము**

విచిత్రము విరోధిమూలాకాలంకారం.

**నిర్వచనాలు**

**విద్యాధరుడు** "కారణ విపరీత ఫలొత్పత్తై యత్నో విచిత్ర మిత్యుక్తం" (విద్యాధరుడు: 395)

కారణ విపరీతమైన ఫలమును పొందుటకై ఉద్యమించుట విచిత్రాలంకారం.

రుయ్యక, విద్యానాథ, జయదేవాదులు పై అభిప్రాయాన్నే వెలిబుచ్చారు.

**జగన్నాథపండితుడు** 'ఇష్ట సిద్ధికొరకై ఇష్టమును గోరునతడు ఒనర్చు ఇష్ట విపరీతమగు ఆచరణము విచిత్రము'(632)

**విచిత్రం - భాగవతంతో అన్వయం**

*చతురతనట్టి ఈశ్వరుడు సజ్జనలోక నిరస్త సర్వకా*

*మిత విమలాంతరంగమున మిశ్రిత భావనఁ జేసి సన్నిధా*

*పితుఁడగుచున్ దయాకర గభీర గుణంబుల ఁజాల నొప్పియా*

*శ్రిత జన పారతంత్ర్యమును జేకొని పాయకయుండు నిచ్చలున్* (భాగ. 4-958)

భగవంతుడు - దయాకరమగు గంభీరగుణంబులు ఎన్నో కలిగి, అనంతశక్తి కలిగి ఉండి కూడా, ఆశ్రిత జనుల యెడ పరతంత్రుడై, అణగి, మణిగి ఉంటాడు. అనంత శక్తి కలిగి స్వతంత్రుడైన ఈశ్వరుడు, పరతంత్రుడై ఉండుట - అనగా ఇష్ట విపరీతమగు చర్య కావున ఇది - విచిత్రము.

## 44. అనుకూల

**నిర్వచనం**

అనుకూలాలంకారమును ఒక్క విశ్వనాథుడే పేర్కొన్నాడు. 'ఒక కార్యానికి అనుకూల వర్ణన చేసినచో అది అనుకూలాలంకారము' (చూ. అలంకార్ కోశ్)

**అనుకూలం - భాగవతంతో అన్వయం**

*స్వచ్ఛంబులై పొంగె జలరాసులేడును*
*గల ఘోషణముల మేఘంబులఱిమె*
*గ్రహతారకల తోడ గగనంబు రాజిల్లె*
*దిక్కులు మిక్కిలి తెలివిఁ దాల్చెఁ*
*గమ్మని చల్లని గాలి మెల్లన వీచె*
*హోమానలంబు చెన్నొంది వెలిఁగెఁ*
*గొలఁకులు కమలాళి కులములై సిరినొప్పెఁ*
*బ్రవిమల తోయలై పాఱునదులు*
*వరపుర గ్రామ ఘోషయై వసుధ యొప్పె*
*విహగరవ పుష్ప ఫలముల వెలసె వనము*
*లలరు సోనలు గురిసి రయ్యమరవరులు*
*దేవదేవుని దేవకీదేవి కనఁగ* (భాగ. 10. పూర్వ - 106)

శ్రీకృష్ణుడు పుట్టే సందర్భంలో సమస్త ప్రకృతి అనుకూలంగా మారినట్లు వర్ణింపబడింది. సముద్రాలు, మేఘాలు, తారలు, దిక్కులు, చల్లగాలి, హోమాగ్ని, కమలములు, నదులు అన్నీ అనుకూలంగా ఉన్నట్లు చెప్పబడింది కావున ఇది 'అనుకూల' అలంకారం.

*కర్ణరంధ్రములు వేఁగప్పిన లోపలి*

*ప్రాణఘోషము వినఁబడక డిందెఁ*
*దోయాదికములందుఁ దొంగి చూచుచు నుండ*
*దలగాన రాదయ్యెఁ దనువు మీఁదఁ*
*గరశాఖ నాసికాగ్రంబుపై నిడి చూడ*
*గ్రహతారకలు రెండుగా నగపడె*
*వెలుఁగున నిలుచుండి వీక్షింపగా మేని*
*నీడ సరంధ్రమై నేలఁ దోచె*
*నడుగు జూడ దృష్టి మాటలేదయ్యెను*
*దరువులెల్ల హేమ తరువులగుచు*
*మెఱయుచుండెఁ గాలమృత్యువు డగ్గఱ*
*బుద్ధియెల్ల గలఁగె భోజపతికి* (భాగ. 10. పూర్వ - 1299)

శ్రీకృష్ణుడు కంసుని చంపబోయే ముందు కంసుని పరిస్థితి వర్ణన పోతన కల్పనాశక్తికి మచ్చుతునక.

చెవులు మూసుకుంటే ప్రాణఘోష వినబడకపోవడం, నీళ్ళలో చూస్తే తల కనబడకపోవడం, నక్షత్రాలు రెండుగా కనిపించడం, మేని నీడ రంధ్రాలుగా కనిపించడం, అడుగు జాడ కనిపించకపోవడం, మరణకాల అనుకూల లక్షణాలు వర్ణింపబడుటచే ఇది అనుకూల అలంకారం.

## 45. అనుజ్ఞ

### నిర్వచనం

అనుజ్ఞాలంకారాన్ని అప్పయ్యదీక్షితుడు, జగన్నాథ పండితుడు పేర్కొన్నారు. "ఉత్కంఠమగు గుణవిశేషము నందలి లాలసతచే దోషమని ప్రసిద్ధమైన వస్తువును గూడ ప్రార్థించుట అనుజ్ఞ" (జగన్నాథ పండితుడు:763)

అనుజ్ఞాలంకారము 'తిరస్కారాలంకారము'నకు విపర్యయము.

### అనుజ్ఞ - భాగవతంతో అన్వయం

*పాపవు రక్కసుండు చెఱపట్టినటంచుఁ దలఁచు మెప్పుడున్*
*బాపుడె! వీని ధర్మమునఁ బద్మదళాక్షునిఁ గంటి మమ్మ ము*
*న్నీపురుషోత్తముం గదియనేమి వ్రతంబులు చేసినారమో*
*యా పరమేష్ఠి పుణ్యుడు గదమ్మ! హరిన్ మముఁ గూర్పెనిచ్చటన్* (భాగ. 10. ఉత్తర-209)

శ్రీకృష్ణుడు నరకాసురుని చంపిన తరువాత నరకాసురుడు చెఱలో పెట్టిన పదహారువేలమంది స్త్రీలను పెండ్లి యాడుతాడు. అప్పుడా స్త్రీలు నరకాసురుని నిందించుటకు బదులుగా ప్రశంసిస్తుంటారు. ఎందుకంటే ఆ నరకాసురుడు బంధించాడు కాబట్టే శ్రీకృష్ణుడు వారిని భార్యలుగా స్వీకరించాడు కాబట్టి.

కావున ఒక గుణవిశేషము వలన దోషమును కూడా గుణంగా భావించి ప్రశంసిస్తుంటారు. కావున ఇది అనుజ్ఞాలంకారం.

## 46. పరివృత్తి

### స్థానము

వాక్యన్యాయ మూలకాలంకారము.

### వ్యుత్పత్తి

'పరివృత్తి' అంటే 'పరివర్తనము' అంటే 'వినిమయము'. వస్తువును ఇచ్చిపుచ్చుకొనుట దీనియందుండును. కావున 'పరివృత్తి' అని దీనికి పేరు.

### నిర్వచనాలు

'ఒక వస్తువును ఇచ్చి మరొక వస్తువును గ్రహించినట్లు వర్ణిస్తే అది పరివృత్తి అలంకారం' (దండి:215)

ఇదే భావాన్ని వామన, మమ్మటుడు, రుయ్యకాదులు వ్యక్తం చేశారు.

"సమవిసదృశాభ్యాం పరివర్తనం పరివృత్తిః" (వామనుడు:139)

"పరివృత్తిర్వినిమయో యోఽర్థానాం స్యాత్సమాసమైః" (మమ్మటుడు:687)

"సమన్యూనాధికానాం సమాధిక న్యూనైర్వినిమయః పరివృత్తిః" (రుయ్యకుడు:51)

సమన్యూనాధికములగు వస్తువులకు సమాధిక న్యూన వస్తువులతో వినిమయము గలిగిన పరివృత్తి.

### వర్గీకరణ

పరివృత్తిని 2 రకాలుగా వర్గీకరించవచ్చు. (చూ. మమ్మటుడు:688)

1. సమపరివృత్తి - సమము ఇచ్చి సమము గ్రహించుట.

2. విషమ పరివృత్తి - ఇది రెండు రకాలు. 1. న్యూనము ఇచ్చి అధికము గ్రహించుట, 2. అధికము ఇచ్చి న్యూనము గ్రహించుట.

జయదేవుడు 'ఒకటి ఇచ్చి పెక్కింటిని గ్రహించుట కూడా పరివృత్తి అవుతుంది' అని చెప్పెను. (జయదేవుడు:165)

### పరివృత్తి - భాగవతంతో అన్వయం

*బలినిజమౌళి నవ్వటుని పాదసరోరుహ భవ్యతీర్థము*
*తృలిక ధరించి తన్నును జగత్త్రయమున్ హరికిచ్చి కీర్తులన్*
*నిలిపె వసుంధరా స్థలిని నిర్జరలోక విభుత్వ హానికిన్*
*దలఁకక శుక్రుమాటలకుఁ దారక భూరి వదాన్యశీలుడై* (భాగ. 2-151)

బలి చక్రవర్తి ముల్లోకాలను, తనను శ్రీవిష్ణువుకు ఇచ్చి తాను మాత్రం కీర్తిని స్వీకరించాడు. ఇచ్చిపుచ్చుకోవడం దీనిలో ఉంది. కాబట్టి ఇది పరివృత్తి అలంకారం.

బలిచక్రవర్తి సమస్తాన్ని కోల్పోయినా శాశ్వత కీర్తిని మిగుల్చుకున్నాడు అంటూ పోతనగారు చమత్కరిస్తున్నారు.

## 47. స్వభావోక్తి / జాతి

'స్వభావోక్తి'కే 'జాతి' అని నామాంతరము. విష్ణు ధర్మోత్తర పురాణకర్త దీనినే 'వార్త' అని విన్నకోట పెద్దయ 'స్వభావాఖ్యానము' అని పేర్కొనిరి. కుంతకుడు 'స్వభావోక్తి'ని అలంకారంగా అంగీకరింపలేదు. ఇది 'వక్రోక్తి'కి విరుద్ధమనెను.

### స్థానము

స్వభావోక్తిని విద్యానాథుడు అధ్యవసాయ మూలకమని, రుయ్యకుడు గూడార్థ ప్రతీతి పరకమనీ చెప్పారు.

### వ్యుత్పత్తి

"సూక్ష్మవస్తు స్వభావస్య యథావద్వర్ణనం స్వభావోక్తిః" (రుయ్యకుడు : 62)

వస్తువు యొక్క సూక్ష్మ స్వభావమును యథావిధమున వర్ణించుట స్వభావోక్తి. కావున 'స్వభావోక్తి' అన్వర్థనామము. 'స్వభావమును వర్ణించెడి ఉక్తి యగుట చేత దీనిని స్వభావోక్తి అంటారు.

### నిర్వచనములు

**దండి** నానావస్థం పదార్థానాం రూపం సాక్షా ద్వివృణ్వతీ
స్వభావోక్తిశ్చ జాతిశ్చేత్యాద్యా సాలంకృతిర్యథా (దండి: 53)

అనేక విధములైన అవస్థలు గల పదార్థాల స్వరూపమును ప్రత్యక్షముగ కనబడుచున్నదా అన్న విధమున వివరించు చున్నది 'స్వభావోక్తి'.

**మమ్మటుడు** "స్వభావోక్తిస్తు డింభాదేః స్వక్రియా రూప వర్ణనమ్" (మమ్మటుడు: 681)

శిశువులు మొదలైన వాటికి మాత్రమే సంబంధించిన క్రియల యొక్క రూపం యొక్క వర్ణనము స్వభావోక్తి అలంకారము.

**జయదేవుడు** "స్వభావోక్తి స్స్వభావస్య జాత్యాది స్థస్య వర్ణనమ్" (జయదేవుడు: 234)

జాత్యాదుల స్వభావవర్ణనము - స్వభావోక్తి.

**విద్యానాథుడు** "ఉన్నదున్నట్లుగా కనులకుఁ గట్టినట్లు సుందరము గాఁ జేయు వస్తువర్ణనము స్వభావోక్తి" (విద్యానాథుడు: 499)

**రామరాజభూషణుడు** "సహృదయ హృదయంగమమై

మహినున్నది నున్నయట్లు మాటలు తేటల్

బహుళంబులుగాఁ జెప్పిన

మహితోక్తి యె జాతి యయ్యె ........" (రామరాజభూషణుడు: 631)

## వర్గీకరణ

ఆలంకారికులు స్వభావోక్తిని 4 రకాలుగా వర్గీకరించిరి.

1. జాతి వర్ణనము
2. గుణ వర్ణనము
3. క్రియా వర్ణనము
4. ద్రవ్య వర్ణనము

## స్వభావోక్తి - భాగవతంతో అన్వయం

1. జాతి స్వభావోక్తి

*అతిరోగ పీడితుం డై మంద మగు జఠ*

*రాగ్నిచే మిగుల నల్పాశి యగుచు*

*మెఱసి వాయువుచేత మీఁదికి నెగసిన*

*కన్నులు, కఫమునఁ గప్పబడిన*

*నాళంబులును, గంఠ నాళంబునను ఘుర*

*ఘుర మను శబ్దంబు దొరయ బంధు*

*జనుల మధ్యంబున శయనించు, బహువిధ*

*ములఁ దన్నుఁ బిలువంగఁ బలుకలేక*

*చటులతర కాలపాశ వశంగతాత్ముఁ*

*డగుచు బిడ్డలఁ బెండ్లాము నరసి ప్రోచు*

*చింత వికలములైన హృషీకములును,*

*గలిగి విజ్ఞానమునఁ బాసి కష్టుఁడగుచు* (భాగ. 3-974)

కపిలాచార్యుని చేత వృద్ధుల లక్షణాలు రమణీయంగా వర్ణింప బడ్డాయి కావున ఇది స్వభావోక్తి. వృద్ధులందరికీ వర్తించే లక్షణాలు కాబట్టి - 'జాతి' స్వభావోక్తి.

2. గుణ స్వభావోక్తి

*తనయందు నఖిలభూతములందు నొకభంగి*

*సమహితత్వంబున జరుగువాఁడు*

*పెద్దల బొడగన్న భృత్యునికైవడి*
*చేరి నమస్కృతుల్ సేయువాఁడు*
*కన్నుదోయికి నన్యకాంత లడ్డం బైన*
*మాతృభావన సేసి మరలువాఁడు*
*తల్లిదండ్రులభంగి ధర్మవత్సలతను*
*దీనలఁ గావఁ జింతించువాఁడు*
*సములయెడ సోదరస్థితి జరుపువాఁడు*
*దైవతములంచు గురువులఁ దలఁచువాఁడు*
*లీలలందును బొంకులు లేనివాఁడు*
*లలిత మర్యాదుఁ డైన ప్రహ్లాదుఁ డధిప!* (భాగ. 7-115)

ప్రహ్లాదుని శుభగుణాలు చక్కగా వర్ణింపబడ్డాయి. నారాయణుని అనుగ్రహానికి పాత్రమైన ప్రహ్లాదుని గుణాలు - తనను, అన్ని ప్రాణులను సమభావంతో చూడడం, పెద్దలంటే భృత్యునివలె నమస్కరించడం, స్త్రీలను తల్లితో చూడడం, దీనులను తల్లి దండ్రులవలె రక్షించడం, సములను సోదరులవలె, గురువులను దేవుళ్ళవలె తలచడం, చేష్టలలో బొంకులు లేకపోవడం, లలిత మర్యాదుడు కావడం. కావున ఇది - గుణ స్వభావోక్తి.

3. క్రియా స్వభావోక్తి

*మాటిమాటికి వ్రేట మడిచి యూరించుచు*
*యూరుఁగాయలు దినుచుండు నొక్కఁ*
*డొకని కంచములోని దొడిసి చయ్యన మ్రింగి*
*చూడు లేదని నోరు సూపు నొక్కఁ*
*డేగు రార్గుర చల్దు లెలమిఁ బన్నిదమాడి*
*కూర్కొని కూర్కొని కుడుచు నొక్కఁ*
*డిన్నియుఁ దగఁ బంచి యిడుట నెచ్చెలితన*
*మనుచు బంతెనగుండు లాడు నొకఁడు*
*కృష్ణుఁ జూడు మనుచుఁ గికురించి పరు మ్రోలి*
*మేలి భక్ష్యరాశి మెసఁగు నొకఁడు*
*నవ్వు నొకఁడు సఖుల నవ్వించు నొక్కఁడు*
*ముచ్చటాడు నొకఁడు మురియు నొకఁడు* (భాగ. 10. పూర్వ-494)

చిన్నికృష్ణుడు చల్ది గుడుచు నపుడు సలిపిన బాల్య చేష్టలు మనోహరంగా వర్ణింపబడ్డాయి. మధురాతి మధురమైన లీలలు భాగవతానికే అందాన్ని తెస్తున్నాయి. కృష్ణుని చేష్టలు (క్రియలు) వర్ణింపబడ్డాయి కావున ఇది - క్రియా స్వభావోక్తి.

4. ద్రవ్యస్వభావోక్తి

*నల్లనివాఁడు పద్మనయనంబులవాఁడు కృపారసంబు పైఁ*
*జల్లెడువాఁడు మౌళి పరిసర్పిత పింఛమువాఁడు నవ్వురా*
*జిల్లెడు మోమువాఁ డొకఁడు చెల్వల మానధనంబు దెచ్చె నో*
*మల్లియలారా! మీ పొదలమాటున లేఁడు గదమ్మ! చెప్పరే* (భాగ. 10. పూర్వ-1010)

శ్రీకృష్ణుని దివ్యరూప సౌందర్యం వర్ణింపబడినది కావున ఇది - ద్రవ్య స్వభావోక్తి.

తెలుగు వారినాల్కలపై ఎప్పటికీ నిలిచిపోయే ఎన్నో స్వభావోక్తులు పోతనగారు రచించారు. మచ్చుకు కొన్ని చూపాను.

## 48. సహోక్తి

**స్థానము**

సహోక్తిని రుయ్యకుడు భేదప్రధాన సాదృశ్యమూలకమని చెప్పగా, విద్యానాథుడు అధ్యవసాయ మూలాలంకారముగా చెప్పెను.

**వ్యుత్పత్తి**

రెండు వస్తువుల కార్యములు రెండు ఏక కాలము జరిగినట్లు వర్ణింపబడుటచే దీనికి 'సహోక్తి' అనిపేరు.

**నిర్వచనాలు**

సహోక్తిలోని రెండు వస్తువులు ప్రాకరణికములే. ఆ రెండింటి భావము కల్పితమై ఉంటుంది.

**వామనుడు** "వస్తుద్వయ క్రియ యోస్తుల్య కాల యోరేక పదాభిధానం స్వహోక్తిః" (వామనుడు :152)

ఒకే కాలమున జరిగిన రెండు వస్తువుల క్రియలను ఒకపదంతో చెప్పుట సహోక్తి.

**మమ్మటుడు** "సా సహోక్తిః సహార్థస్య బలాదేకం ద్వివాచకమ్" (మమ్మటుడు: 684)

ఒక అర్థాన్ని మాత్రమే చెప్పేదయినా ఒక పదం ప్రక్కనే ప్రయోగించిన సహ, సాకం, సార్థమ్, సమమ్ ఇత్యాది పదాల అర్థం ప్రభావం వల్ల రెండింటినీ చెప్పినట్లయితే అది సహోక్త్యలంకారము.

**జయదేవుడు** "సహోక్తి స్సహభావశ్చేద్భాసతే జనరంజనః" (జయదేవుడు: 91)

సహృదయ హృదయ రంజకముగా సహభావము చెప్పబడిన యెడల అది సహోక్తి.

**రుయ్యకుడు** "ఉపమానోపమేయయో రేకస్య ప్రాధాన్య నిర్దేశే అపరస్య సహార్థ సంబంధే సహోక్తిః" (23)

ఉపమానోపమేయములలో ఒకదానికి ప్రాధాన్యము, మరొకదానికి సహసంబంధము వర్ణితమైన అది సహోక్తి అలంకారము.

**రామరాజభూషణుడు** "ఉపమేయమునకు (క్రియతో) ముఖ్యాన్వయమును (శబ్దాన్వయము)ఉపమానమునకు సహార్థ సంబంధముతో నముఖ్యాన్వయమును

(అర్థాన్వయము) గలిగిన యెడల సహోక్తి" (రామరాజభూషణుడు: 626)

**వర్గీకరణ**

విద్యానాథుని అభిప్రాయం ప్రకారం -

1. కార్యకారణ విపర్యయాతిశయోక్తి మూలక సహోక్తి
2. భేదాభేదాతిశయోక్తి మూలకమును, శ్లేషభూషితము నగు అభేదాధ్యవసాయ సహోక్తి

**సహోక్తి - భాగవతంతో అన్వయం**

***అతివ కాంచీ గుణం బల్లన బిగియంగ***
***వైరివధూ గుణ వ్రజము వదలె***
***మెల్లన తన్వంగి మెయిదీఁగె మెఱుఁ గెక్క***
***దుష్టాంగనా తనుద్యుతు లణంగె***
***నాతికల్లన భూషణములు పల్లులుకగాఁ***
***బరసతీ భూషణ పంక్తు లెడలెఁ***
***గలకంఠి కొయ్యన గర్భంబు దొడ్డుగాఁ***

బరిపంథిదార గర్భములు పగిలెఁ
బొలతి కంతంత నీళ్ళాడు ప్రొద్దు లెదుగ
నహిత వల్లభ లైదువలై తనర్పు
ప్రొద్దు లన్నియుఁగ్రమమునఁ బోవఁదొణఁగె
నువిద కడుపున నసురారి యుంటఁజేసి (భాగ. 10. పూర్వ-75)

ఈ పద్యంలో జంటపనులు ఏకకాలంలో జరుగుట వర్ణింపబడ్డాయి. దేవకీదేవి కాంచీగుణం (మంగళ సూత్రం) దృఢంకాగా, శత్రువుల భార్యల మంగళసూత్రాలు పటుత్వాన్ని కోల్పోయాయి. దేవకి తనువు ప్రకాశింప మొదలు పెట్టగా, శత్రు స్త్రీల శరీర కాంతులు తగ్గాయి. దేవకికి ఆభరణాలు మెరియగా శత్రుస్త్రీల ఆభరణాలు జారిపోయాయి, దేవకి గర్భం పెద్దది కాగా, శత్రుస్త్రీలకు గర్భ స్రావములయినాయి. దేవకి నీళ్ళాడే ప్రొద్దు దగ్గరబడగా, శత్రుస్త్రీల ఐదవతనం ఉండే ప్రొద్దులు తగ్గిపోయాయి.

ఇలా దేవకీదేవి శరీరంలోని మార్పులు, శత్రుస్త్రీల శరీరంలోని మార్పులు ఏకకాలంలో జరిగినట్లు వర్ణింపబడటం వలన ఇది - సహోక్తి.

శ్రీకృష్ణుని అవతార పరమ లక్ష్యం - శిష్టరక్షణ, దుష్ట శిక్షణ. కాబట్టి శ్రీకృష్ణుడు పుట్టబోతుండగానే సాధుజనులలో ఆనందం, శత్రు జనులలో దుఃఖం ఏకకాలంలో ప్రారంభమైనట్లుగా వర్ణింపబడింది.

దేవకీ సుతు కోర్కె తీఁగెలు వీడంగ
వెలదికి మైదీఁగె వీడఁదొణఁగె
గమల నాథుని చిత్తకమలంబు వికసింపఁ
గాంతి నింతికి ముఖ కమలమొప్పె
మధు విరోధికి లోన మదనాగ్ని పొడచూపఁ
బొలఁతికి ఁజనుదోయి పొడవు సూపె
శౌరికి ధైర్యంబు సన్నమై డయ్యంగ
జలజాక్ష మధ్యంబు సన్నమయ్యె
హరికిఁ బ్రేమబంధ మధికంబు గాఁగేశ
బంధ మధిక మగుచు బాల కమరెఁ
బద్మ నయను వలనఁబ్రమదంబు నిండార
నెలఁత యౌవనంబు నిండి యుండె (భాగ. 10. పూర్వ-1689)

ద్వారకలో శ్రీకృష్ణుడు, విదర్భలో రుక్మిణి పెరుగుతూ ఉన్నారు. శ్రీకృష్ణుని కోర్కెలు తీగెలు వీడగా, రుక్మిణి మైతీగె (శరీరం అనేతీగ), కృష్ణుని హృదయ కమలం వికసింప, రుక్మిణి ముఖ కమలం వికసించింది. కృష్ణునికి మదనాగ్ని పొడచూపగా, రుక్మిణికి చన్నులు పొడచూపాయి. కృష్ణునికి తనను తాను నిగ్రహించుకోగలననే ధైర్యం సన్నగిల్లగా, రుక్మిణి నడుము సన్నమైంది. హరికి ప్రేమ బంధం అధికంగా కాగా, రుక్మిణికి కేశబంధం ఎక్కువైంది.

పై విధంగా వేర్వేరు స్థలాలలో ఉన్న ఇద్దరు వ్యక్తులు లక్షణాలు ఏకకాలంలో వృద్ధి పొందుతున్నట్లుగా వర్ణింపబడుట వలన ఇది సహోక్తి.

## 49. వినోక్తి

**స్థానము** వినోక్తిని రుయ్యకుడు సాదృశ్యమూలక భేద ప్రధానాలంకారము.

**వ్యుత్పత్తి** 'వినా' అంటే 'అది తప్ప' అని అర్థం. 'వినోక్తి' అంటే 'ఏదైనా ఒకటి లేక పోవడం' అనేది దీనిలో ప్రధానం కావున దీనికి

'వినోక్తి' అని సార్థకం.

## నిర్వచనాలు

"వినా కించి దన్యస్య సదసత్వాభావో వినోక్తిః" (రుయ్యకుడు : 24)

ఏదైనా ఒకటి లేకపోవడం వల్ల ఆవస్తువుకు శోభ కలగటం గాని, కలగకపోవటంగాని వర్ణితమైనచో అది వినోక్తి.

ఆలంకారికులందరూ ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

'వినోక్తి', 'సహోక్తి' కి వ్యతిరేకము.

## వర్గీకరణ

వినోక్తి 2 రకాలు

1. హేయ స్వరూప వినోక్తి : 'ఒకానొక గుణము లేకపోవటంచేత ఉపమేయం హీనంగా చెప్పబడుట' (మమ్మటుడు : 93)
2. రమ్య స్వరూప వినోక్తి : 'ఒకానొక వస్తువు లేకుండుట చేత ఉపమేయం మనోహర మగుట' (మమ్మటుడు : 94-95)

వినోక్తి దీపకముతో గాని శ్లేషతో గాని మిశ్రితమై ఉండవచ్చు.

## వినోక్తి - భాగవతంతో అన్వయం

*ప్రాణేశ! నీ మంజు భాషలు వినలేని*
*కర్ణ రంధ్రంబుల కలిమి యేల*
*పురుష రత్నమ! నిన్ను భోగింపగా లేని*
*తనులతవలని సౌందర్యమేల*
*భువన మోహన! నిను (జూడ గాన (గా లేని*
*చక్షు రింద్రియముల సత్త్వమేల*
*దయిత! నీ యధరామృ తంబానగా లేని*
*జిహ్వకు ఫలరస సిద్ధి యేల*
*నీరజాత నయన! నీ వనమాలికా*
*గంధమబ్బ లేని ఘ్రాణమేల*
*ధన్యచరిత! నీకు దాస్యంబు సేయని*
*జన్మమేల యెన్ని జన్మములకు* (భాగ. 10. పూర్వ-1708)

రుక్మిణీదేవి, అగ్నిద్యోతనుడనే బ్రాహ్మణునితో శ్రీకృష్ణునికి సందేశం పంపిస్తూ తన మనోభావాల్ని చెబుతుంది.

శ్రీకృష్ణుని మంజుభాషణలు వినలేనపుడు చెవుల కలిమి ఏముంటుంది. కృష్ణుడు భోగించని శరీర సౌందర్యం, అదొక సౌందర్యం కాదు. కృష్ణున్ని చూడని కన్నుల సత్త్వమేముంటుంది. కృష్ణుని అధరామృతం త్రాగని జిహ్వకు ఫలరస సిద్ధలేదు. శ్రీకృష్ణుని వనమాలికా గంధమబ్బ లేని ముక్కుకు సఫలత లేదు. ఇలా ఒకటి లేకపోతే మరొక దానికి విలువ లేదు అని చెప్పడం వలన ఇది వినోక్తి.

ఈ పద్యం ద్వారా శ్రీకృష్ణుని సౌందర్యం, రుక్మిణీదేవికి కృష్ణుని పైగల ప్రేమ వెల్లడి అవుతుంది.

## 50. అధిక

స్థానము 'అధికము' విరోధ గర్భాలంకారము.

## వ్యుత్పత్తి

ఆధారాధేయములలో ఒకదాన్ని 'అధికం' చేసి చెప్పడం దీని లక్షణం కాబట్టి అధికాలంకారమనేది సార్థక నామధేయము.

## నిర్వచనాలు

'ప్రస్తుత విషయం యొక్క ప్రకర్షను చెప్పడానికి ఆధార, ఆధేయాలలో ఒకదాన్ని అధికం చేసి చెప్పుటను అధికాలంకార మంటారు. (మమ్మటుడు : 738)

రుయ్యక (పుట: 43), జయదేవ (పుట: 141-143), విద్యానాథ (పుట: 509), జగన్నాథపండితులు (పుట: 634) మొదలగు వారంతా మమ్మటుని అభిప్రాయాన్నే వెలిబుచ్చారు.

## వర్గీకరణ

అధికాలంకారము 2 రకాలు

1. ఆధేయం కంటే ఆధారాన్ని గొప్పదిగా వర్ణించుట
2. ఆధారం కంటే ఆధేయాన్ని గొప్పదిగా వర్ణించుట (మమ్మటుడు : 739)

## పారిభాషిక పదాలు

ఆధేయం, ఆధారం : ఒక వస్తువు మరొక వస్తువును ఆశ్రయించినపుడు, ఏవస్తువు ఆశ్రయిస్తుందో అది ఆధేయం, దేన్ని ఆశ్రయిస్తుందో అది ఆధారం.

## అధికం - భాగవతంతో అన్వయం

*విలయ కాలమందు విశ్వంబు నీపెద్ద*
*కడుపులోన దాఁచు కడిమి మేటి*
*నటుఁడ వీవు నేడు నాగర్భజుడవౌట*
*పరమ పురుష! వేడబంబు గాదె* (భాగ. 10. పూర్వ-128)

శ్రీకృష్ణుడు పుట్టగానే, దేవకీదేవి అతన్ని స్తుతిస్తూ - ప్రళయ కాలమందు విశ్వాన్నంతా తన కడుపులో ఇముడ్చుకొనే మేటివి, నాగర్భంలో ఉండటం కేవలం లీల కోసమే.

కృష్ణుడు దేవకి గర్భంలో ఉన్నాడు కావున, దేవకి గర్భం - ఆధారం. కృష్ణుడు ఆధేయం. ఈ పద్యంలో ఆధారం కన్నా ఆధేయం పెద్దగా వర్ణింపబడింది, కావున ఇది అధికాలంకారం.

# 51. ఏకావళి

## స్థానము

'ఏకావళి'ని మమ్మటుడు శృంఖలామూలమని. విద్యానాథుడు గమ్యౌపమ్యాలంకారమని అనిరి.

## వ్యుత్పత్తి

'ఏకావళి' అనగా హారము వలె ఉండునది అని అర్థము.

## నిర్వచనాలు

"పూర్వపూర్వమునకు ఉత్తరోత్తరము క్రమముగా విశేషణ మగునేని ఏకావళి యగును" (విద్యానాథుడు : 562)

ఒక వస్తువును చెప్పి దానికి విశేషణంగా మరొకవస్తువును, దానికి విశేషణంగా ఇంకొక వస్తువును వర్ణిస్తూపోతే అది

ఏకావళి అలంకారము.

గ్రహించిన దానిని విడిచి, క్రొత్త దానిని గ్రహించి, మరల దానిని విడుచుట ఏకావళి యందుండును.

ఏకావళిలో - పూర్వపదము విశేష్యమై, ఉత్తర పదము విశేషణమై ఉండును.

### వర్గీకరణ

ఏకావళి అలంకారము 2 రకాలు.

1. స్థాపనము : విశేషణంగా చెప్పిన దానిని విధించడం.

2. అపోహనము : విశేషణంగా చెప్పిన దానిని నిషేధించడం.

### ఏకావళి - భాగవతంతో అన్వయం

.............. ***ఈశ్వరాధిష్ఠితంబైన ప్రకృతి యంశంబున మహతత్త్వమగు మహతత్త్వాంశంబున సహంకారంబగు అహంకారాంశంబున శబ్ద తన్మాత్రంబగు శబ్ద తన్మాత్రాంశంబున గగనమగు గగనాం శంబున స్పర్శ తన్మాత్రంబగు***............ (భాగ. 2-32)

పై ఉదాహరణలో పూర్వపూర్వమునకు ఉత్తరోత్తము క్రమంగా విశేషణమైన కారణంబున ఇది ఏకావళి అలంకారము.

## 52. యథాసంఖ్య / క్రమ

### స్థానము

యథాసంఖ్యాలంకారమును రుయ్యకుడు వాక్య న్యాయ మూలాలంకారమనీ విద్యానాథుడు గమ్యోపమ్యాలంకారమని చెప్పారు.

### వ్యుత్పత్తి

'యథాసంఖ్యము','క్రమము' అనేపదాలు అన్వర్థములు. (చూడు. నిర్వచనాలు)

### నిర్వచనాలు

'యథాసంఖ్య' అలంకారమునకు 'క్రమము', 'సంఖ్యానము' అని నామాంతరములు.

"యథాసంఖ్యం క్రమేణైవ క్రమికాణాం సమన్వయః" (మమ్మటుడు : 672)

ఒక క్రమంలో ఉన్న వాటికి అదే క్రమంలో ఉన్న మరికొన్ని విషయాలతో సమన్వయం యథాసంఖ్యము.

కొన్ని విషయాలను మొదట ఒక వరుసలో చెప్పి అవి మరికొన్ని విషయాలతో అదే వరుసలో అన్వయించు నట్లు చెప్పుట యథాసంఖ్యము (లేదా) క్రమాలంకారము.

### యథాసంఖ్య - భాగవతంతో అన్వయం

***రాకేందు బింబమై రవిబింబమై యొప్పు***
***నీరజా తేక్షణ నెమ్మొగంబు***
***కందర్ప కేతువై ఘనధూమ కేతువై***
***యలరు బూఁబోఁడి చేలాంచలంబు***
***భావజు పరిధియై ప్రళయార్క పరిధియై***
***మెఱయు నాకృష్టమై మేలఁత చాప***
***మమృత ప్రవాహమై యనల సందోహమై***

*తనరారు నింతి సందర్శనంబు*

*హర్షదాయి యై మహారోషదాయియై*

*పరఁగు ముద్దరాలి బాణవృష్టి*

*హరికి నరికిఁ జూడ నందంద శృంగార*

*వీరరసములొల్లి విస్తరిల్ల* (భాగ. 10. ఉత్తర-183)

సత్యభామ నరకాసురుని చంపునపుడు - ప్రక్కనే ఉన్న శ్రీకృష్ణున్ని, నరకాసురున్ని క్రమంగా చూస్తున్నపుడు సత్యభామలో పరస్పర విరుద్ధమైన భావాలు ఏవిధంగా చోటు చేసుకుంటాయో రమణీయంగా చెప్పారు పోతన.

| | సత్యభామ | శ్రీకృష్ణున్ని చూస్తున్నపుడు | నరకాసురున్ని చూస్తున్నపుడు |
|---|---|---|---|
| 1. | ముఖము | రాకేందు బింబము | రవిబింబము |
| 2. | చేలాంచలము(పైటకొంగు) | కందర్ప కేతువు | ఘనధూమ కేతువు |
| 3. | చాపము | మన్మధుని పరిధి | ప్రళయకాల సూర్యుని పరిధి |
| 4. | సందర్శనం | అమృత ప్రవాహం | అగ్ని సందోహం |
| 5. | బాణ వృష్టి | హర్షదాయకం | రోషదాయకం |
| 6. | విస్తరించునది | శృంగార రసము | వీరరసము |

సత్యభామ - ముఖము, పైటకొంగు, చాపము, సందర్శనం మొదలగునవి - శ్రీకృష్ణుని చూస్తున్నపుడు ఒకవిధంగా (ఆనంద దాయకంగా) ఉండి వెంటనే నరకాసురుణ్ణి చూడగానే మరొక విధంగా (రోషదాయకంగా) మారడం - ఒక క్రమంలో చెప్పబడింది. కావున ఇది - క్రమ / యథా సంఖ్యాలంకారం.

*కిసలయ ఖండేందు బిస కుంద పద్మాబ్జ*

*పదఫాల భుజరదపాణి నేత్రఁ*

*గాహళ కరభ చక్ర వియత్పులిన శంఖ*

*జంఘోరుకుచ మధ్య జఘన కంఠ*

*ముకుర చందన బింబ శుక గజశ్రీకార*

*గండ గంధోష్ఠ వాగ్గమన కర్ణఁ*

*జంప కేందు స్వర్ణ శంపా ధనుర్నీల*

*నాసి కాస్యాంగ దృక్ భ్రూ శిరోజ*

*నలి సుధావర్తకుంతల హాస నాభి*

*కలిత జనకావనీపాల కన్యకా ల*

*లామఁ బరిణయ మయ్యెలలాటనేత్ర*

*కార్ముక కథ్వంస ముంకువ గాఁగ నతడు* (భాగ. 2-158)

శ్రీరాముడు శివధనుస్సును విరిచి సీతాదేవిని కళ్యాణమాడాడు.

ఆ సీతాదేవి అవయవ లక్షణాలు ఎలా ఉన్నాయో క్రమాలంకారంలో నిబంధించారు పోతనగారు.

పై పద్యంలో - సీతాదేవి అవయవాల లక్షణాలు, అవయవాలు క్రమంగా చెప్పబడ్డాయి.

[1]కిసలయ [2]ఖండేందు [3]బిస [4]కుంద [5]పద్మ [6]అబ్జ

[1]పద [2]ఫాల [3]భుజ [4]రద [5]పాణి [6]నేత్రన్

అంటే -

కిసలయముల వంటి పాదాలు, నెలవంకవంటి ఫాలభాగం, బిసముల (తామర తుండుల) వంటి భుజములు, బంగారంలాంటి దంతములు, పద్మములవంటి చేతులు, తెల్ల తామరల వంటి నేత్రములు కల సీతాదేవి రాముడు పెండ్లి యాడాడు.

ఇదేవిధంగా మిగిలిన పద్యపాదాలలోని క్రమాలంకారాలను చూడవచ్చు.

ఈ పద్యంలో అనేకమైన అంశాలను క్రమాలంకారంలో కూర్చడం పోతనగారి విశిష్టత.

## 53. సంభావన

సంభావనాలంకారమును జయదేవుడు, అప్పయదీక్షితుడు మాత్రమే చెప్పారు.

"వివక్షితార్థ సిద్ధి కొరకై యిది యిట్లయిన యెడల నని యూహించుట సంభావనాలంకారము" (జయదేవుడు : 184)

### సంభావన -భాగవతంతో అన్వయం

*హలధరుఁడమర్త్య చరితుం*

*డలఘు భుజాబలుఁడొనర్చు నద్భుత కర్మం*

*బులు పెక్కు నాల్గు మొగములు*

*గల మేటియు లెక్క పెట్టగలడె నరేంద్రా!* (భాగ. 10. ఉత్తర-956)

బలరాముని అద్భుత కృత్యాలు అనంతం - వాటిని - నాల్గు ముఖాలు ఉన్న బ్రహ్మైనా లెక్కపెట్టగలడా? అనడంలో చారుత్వం ఉంది. నాలుగు ముఖాలు / నాలుగు నాలుకలు ఉన్న బ్రహ్మకు వీలుగాదంటే - మామూలు వ్యక్తులు చాలరని తెలుస్తుంది.

బలరాముని కృత్యాల సంఖ్య ఎక్కువ కాబట్టి, ఒక ముఖం ఉన్న వ్యక్తిని కాకుండా నాల్గు ముఖాలున్న బ్రహ్మను చెప్పడం వలన ఇది - సంభావన అలంకారం.

*గుణనిధి యగు ప్రహ్లాదుని*

*గుణము లనేకములు గలవు గురుకాలమునన్*

*గణుతింప నశక్యంబులు,*

*ఫణిపతికి, బృహస్పతికి ని భాషాపతికిన్* (భాగ. 7-120)

ప్రహ్లాదుని గుణాలు అనేకం కాబట్టి వాటిని లెక్కించడం ఆదిశేషునికి, బృహస్పతికి, బ్రహ్మకు వీలుకాదని చెప్తున్నాడు. ఆదిశేషునికి వేయి నాల్కలుండటం, బృహస్పతి సర్వజ్ఞుడు కావడం, బ్రహ్మకు నాలుగు ముఖాలుండటం - ఇక్కడి రమణీయార్థం. వేయి నాల్కలు, నాలుగు ముఖాలున్న వారిని పేర్కొనటం వల్ల ఇది - సంభావన.

## 54. ఆశీస్సు

'ఆశీస్సు' అలంకారమును దండి, విన్నకోట పెద్దయలు మాత్రమే చెప్పారు. విన్నకోట పెద్దయ దీనిని 'ఆశీర్వచనము' అనెను.

### నిర్వచనం

'ఇష్టమైన వస్తువు విషయమున కోరికను ప్రకటించుట ఆశీస్సు అనే అలంకారం' (దండి : 216)

ప్రియముగా ఆశీర్వదించుటయే 'ఆశీస్సు' అనే అలంకారం.

### ఆశీస్సు - భాగవతంతో అన్వయం

*పూర్ణుఁడయ్యును మహాభూత పంచక యోగ*

## 56. విరోధాభాస / విరోధ (Paradox)

విరోధాభాసాలంకారానికే 'విరోధాలంకార'మనే పేరు కూడా ఉంది.

### స్థానము

అధ్యవసాయ మూలంకారం.

### నిర్వచనాలు

"ఆభాసత్వే విరోధస్య విరోధాభాస ఉచ్యతే" (జయదేవుడు : 118)

విరోధమును ఆభాసత్వము కలిగినచో విరోధాభాసము

"తొలుతఁ బొడగట్టు నొక విరోధము (పొసగమి) కడపట పరిహరింపఁ బడుచో విరోధాలంకారము" (విద్యానాథుడు : 503)

పైకి విరోధము కనబడుచు పరమార్థమున విరోధము లేకున్నచో విరోధాభాసాలంకారము.

### పారిభాషిక పదం

విరోధము - అంటే ఒకచోట సంబద్ధములుగా స్థిర పడియున్న రెండు ధర్మాలు సంబద్ధములు కానట్లు తెలుపుట. (లేదా) ఒకచోట సంబద్ధములు కాని రెండు ధర్మాలు పైకి సంబద్ధముల వలె తెలుపుట. (రామరాజభూషణుడు : 638)

ఒక విషయాన్ని చదవగానే విరోధము స్ఫురించి, చక్కగా అర్థం చేసుకున్నతరువాత అసలు విరోధమే లేదని నిర్ధారింపబడితే అది - విరోధాభాసాలంకారం. అంటే కవి - విరోధములేని విషయాలను, విరోధము ఉన్నట్లు అనిపించేలాగా రచించడం అన్నమాట.

### వర్గీకరణ

ఈ విరోధాభాసాలంకారం - జాతి, గుణ, క్రియా, ద్రవ్యములనే భేదాలతో పలువిధములు.

ఈ అలంకారంలో విరోధ ఆభాసము అనేది - శ్లేషవలన కాని, శ్లేష లేకుండా గాని ఏర్పడవచ్చు.

### విరోధాభాస - భాగవతంతో అన్వయం

*ధర్మ సంరక్ష కత్వ ప్రభావుండయ్యు*
*ధర్మ విధ్వంసకత్వమున ఁబొదలి*
*ఖరదండనాభిముఖ్యము పొంద కుండియు*
*ఖర దండ నాభి ముఖ్యమున మెఱసి*
*పుణ్యజనావన స్ఫూర్తిఁ పెంపొందియుఁ*
*బుణ్య జనాంతక స్ఫురణఁదనరి*
*సంతతా శ్రిత విభీషణుడు గాకుండియు*
*సంతతా శ్రిత విభీషణత నొప్పి*
*మించి తనకీర్తి చేత వాసించె దిశలు*
*తరమె? నుతియింప రాము నెవ్వరికినైనఁ*

*జారుతరమూర్తి నవనీశ చక్రవర్తిఁ*

*ప్రకట గుణ సాంద్రు దశరథరామచంద్రు* (భాగ. 2-171)

పోతనగారి శ్లేష చమత్కారానికి ఈ పద్యమొక మచ్చుతునక, ఈ పద్యంలోని మొదటి నాలుగు పాదాలను చదవగానే 'విరోధము' ఉన్నట్లు కన్పించును. వివేచిస్తే - విరోధము లేదని తెలుస్తుంది.

'ధర్మ సంరక్షకత్వ ప్రభావుండయ్యు

ధర్మ విధ్వంసకత్వమున బొదలి -

అనడంలో వెంటనే అనిపించే విరోధము - రాముడు ధర్మ స్వరూపుడు. అయితే ధర్మ విధ్వంసం ఎందుకు చేస్తాడు? చేస్తాడని చెప్పబడింది కదా! అదే విరోధము అనిపించడానికి కారణమైంది. ప్రకృతార్థం వివేచిస్తే - శ్రీరాముడు - ధర్మ సంరక్షకత్వ ప్రభావుడే. అందులో అనుమానం ఇసుమంతయులేదు. 'ధర్మ విధ్వంస కత్వమునఁ' బొదిలి అన్నపుడు - 'ధర్మ విధ్వంస కత్వం' అంటే - ధర్ముని యొక్క విధ్వంసకత్వం. ధర్ముడు - అంటే - యమధర్మరాజు. శ్రీరాముడు, తనను స్మరించే వారి వద్దకు యమధర్మరాజు వెళ్ళకుండా చూసేవాడు. తన భక్తులను నరకానికి వెళ్ళకుండా కాపాడేవాడు. తన భక్తులకుగల, యమధర్మరాజు వలన కలిగే భయాన్ని పోగొట్టేవాడు. ఇపుడు విరోధం తొలగిపోయింది. విరోధంతొలగి పోయింది అనడం కన్న, విరోధం లేదని తెలిసింది అనడం సముచితం.

'ఖరదండ నాభిముఖ్యము పొంద కుండియు

ఖరదండ నాభిముఖ్యమున మెఱసి' -

అనడంలో రెండు వాక్యార్థాలు విరుద్ధంగా ఉన్నట్లు అనిపిస్తుంది. 'ఖరదండనాభిముఖుఁడు కాడు' అనడం - శ్రీరాముడు వాడిమి, వేడిమికల ఉత్సాహవంతులను దండించడంలో అభిముఖుడు (ఇష్టం చూపువాడు) కాడు అని తెలుస్తుంది. మరి 'ఖరదండనాభిముఖ్యమున మెఱసి' అన్నపుడు - శ్రీరాముడు. 'ఖరుడు' అనే పేరుగల రాక్షసుణ్ని చంపినవాడు అనే అర్థం సందర్భోచితం. ఈ అర్థాలు భావించు కున్నట్లయితే ముందు స్ఫురించిన విరోధము తరువాత లేదని తెలుస్తుంది.

'పుణ్యజనావన స్ఫూర్తిఁ బెంపొందియుఁ

బుణ్యజనాంతక స్ఫురణఁ దనరి'

అంటే పుణ్యజనులను రక్షించే రాముడు పుణ్యజనులను చంపుతాడు. అనగానే రాముడు ఈ విరుద్ధ కార్యాలెలా చేస్తాడు? అని వెంటనే అనిపిస్తుంది.

పుణ్యజన + అవన స్ఫూర్తి = పుణ్యజనులను రక్షించేస్ఫూర్తి కలవాడు రాముడు. ఇంత వరకు బాగానే ఉంది.

పుణ్యజన + అంతక స్ఫురణన్ + తనరి = అన్నపుడు 'పుణ్యజనుడు' అనే పేరుగల రాక్షసుణ్ని అంతం చేసినవాడు. పుణ్యజనులను రక్షించడానికే రాముడు రాక్షసులను చంపాడు. ఇపుడు విరోధము అనిపించదు.

'సంతతాశ్రిత విభీషణుడు గాకుండియు

సంతతాశ్రిత విభీషణత నొప్పి' -

అన్నపుడు శ్రీరాముడు - (విభీషణం) రౌద్రం ఆశ్రయించినవాడు కాకుండియు, తాను విభీషణుడు (రావణుని తమ్ముడు) ఆశ్రయించినవాడు, అనివివేచిస్తే - విరోధం లేదని తెలుస్తుంది. ఇట్లాంటి పోతన చమత్కారాలు పాఠకులను 'ఓహో' అనిపించును. శ్రీరాముని గుణాలు పాఠకులను 'ఆహా' అనిపించును.

ఎంతో మధురమైన అర్థాలంకారాలను భాగవతంలో సమర్థవంతంగా నిర్వచించిన తీరు నభూతో నభవిష్యత్ అని ఈ అధ్యాయం ద్వారా తెలుస్తుంది.

# 6

# మిశ్రాలంకార శిల్పం

## 6.1 మిశ్రాలంకారాలు : స్థానము

మిశ్రాలంకారాలను విన్నకోట పెద్దయ శబ్దాలంకారాలలో చెప్పగా, భోజుడు శబ్దార్థ (ఉభయ) అలంకారాలలో చేర్చాడు. మిశ్రాలంకారాలను - అర్థాలంకారాలతో పాటుగా (చివరిగా) సాధారణంగా చర్చించిన వారు భామహుడు, దండి, ఉద్భటుడు, వామనుడు, కుంతకుడు, విద్యాధరుడు, విశ్వనాథుడు, అప్పయదీక్షితులు. మిశ్రాలంకారాలను ఒక విభాగంలో చేర్చి చర్చించినవారు. రుయ్యకుడు, విద్యానాథుడు, రామరాజభూషణుడు.

## 6.2 మిశ్రాలంకారాలు : సంఖ్య

అలంకారికులలో చాలామంది - సంసృష్టి, సంకరములనే రెండు రకాల మిశ్రాలంకారాలను పేర్కొనగా, భామహుడు, దండి, వామనుడు, భోజుడు - కేవలం సంసృష్టి అలంకారాన్నే పేర్కొన్నారు. ఉద్భటుడు కేవలం సంకరాలంకారాన్నే పేర్కొన్నాడు.

## 6.3 మిశ్రాలంకారాలు : నిర్వచనం

మిశ్రాలంకారాలకు నిర్వచనాలివ్వడంలో అలంకారికులలో ఏకాభిప్రాయం ఉంది.

'శబ్దాలంకారములు, అర్థాలంకారములు, వానిలోనవి పరస్పరము మిశ్రమములై, కావ్యమునకు విలక్షణమైన యొకానొక శోభాతిశయమును కలిగిస్తే అవి మిశ్రాలంకారములు' (విశ్వనాథుడు:573)

## 6.4 మిశ్రాలంకారాలు : వర్గీకరణ

అలంకారాలు పరస్పరం మిళితమయ్యే పద్ధతులు రెండు రకాలు. 1. సంయోగ సంబంధం, 2. సమవాయ సంబంధం.

1. సంయోగ సంబంధం - అలంకారాలు తిలతండుల న్యాయమున మిళితమైనచో అది సంయోగ సంబంధం.

తిలతండుల న్యాయం- నూవులు, బియ్యము గలిసినట్లుగా కలియుట. ఇందులో భేదము స్పష్టంగా తెలుస్తుంది. వాటిని విడదీసి చూడవచ్చు.

2. సమవాయ సంబంధం - అలంకారాలు క్షీర, నీర న్యాయమున మిళితమైనచో అది సమవాయ సంబంధం.

క్షీరనీరన్యాయం - పాలు, నీళ్ళు కలిసినట్లు కలియుట. దీనిలో భేదము తెలియదు. వీటిని విడదీయుట వీలుకాదు.

ఈ రెండు రకాల పద్ధతులలో అలంకారాలు మిళితమగుట వల్ల రెండు రకాల అలంకారాలు ఏర్పడును. అవి. 1. సంసృష్టి, 2. సంకర.

1. సంసృష్టి - 'తిలతండుల న్యాయమునఁ గలిగిన యలంకారముల పరస్పర సమావేశము సంసృష్టి.' (విద్యానాథుడు:574)

ఈ సంసృష్టి మూడు రకాలు.

1. శబ్దాలంకారములతో శబ్దాలంకారములకు కలుగు సమావేశము (శబ్దాలంకార సంసృష్టి)
2. అర్థాలంకారములతో అర్థాలంకారములకు కలుగు సమావేశము (అర్థాలంకార సంసృష్టి)
3. శబ్దాలంకారములకు అర్థాలంకారములకు కలుగు సమావేశము (ఉభయ సంసృష్టి)

2. సంకరము "క్షీరనీర న్యాయముతో అలంకారములకు పరస్పర సమావేశము గలిగినచో సంకరము" (విద్యానాథుడు:576)

## 6.5 మిశ్రాలంకారాలు : విశ్లేషణ

సంసృష్టి, సంకరాలను సర్వులు మిశ్రాలంకారాలుగా అంగీకరించిరి. అయితే సంసృష్టిలో ఉన్న అలంకారాలను విడదీసి చూడవచ్చు. అంటే, ఉదాహరణకు ఒక లక్ష్యంలో (ఒక పద్యంలో) ఉపమ మరియు వృత్త్యనుప్రాసలు ఉంటే ఆ రెంటిని విడివిడిగా గుర్తించవచ్చు. కాబట్టి దాన్ని ఒక మిశ్రాలంకారంగా చెప్పడం కన్న, వాటిని రెండు విడివిడి అలంకారాలుగా చెప్పడమే సముచితం. ఆ రెండు అలంకారాలు కలసి ప్రస్తుత కథా సందర్భానికి శోభను కూర్చుతున్నాయి అనడం కన్న రెండు విడివిడిగా శోభను కూర్చుతున్నాయనడం సముచితం. లక్ష్యం ఒకటే కావచ్చు. లక్షణాలు (అలంకారాలు) రెండు.

కావున 'సంసృష్టి'ని మిశ్రాలంకారంగా కాకుండా రెండు విడివిడి అలంకారాలు కలదిగా చెప్పవచ్చు. విడదీయుటకు

వీలు లేనప్పుడే అవి మిశ్రితమైనట్లు. విడదీయుటకు వీలుంటే అవి విడివిడి అలంకారాలే.

## 6.6 మిశ్రాలంకారాల నిర్మాణం

కొన్ని లక్షణాలకు నూటికి నూరు పాళ్ళు కట్టుబడి కవి కావ్య నిర్మాణం చేయడం జరగదు. లక్షణం లేనంత మాత్రాన లక్ష్యం నిర్మాణం చేయకూడదని కవి భావించడు. ఒక్కొక్క మారు కవి రచించిన లక్ష్యానికి సరైన లక్షణం లాక్షణికులు ఏర్పరచలేక పోవచ్చు. ఒక్కొక్క మారు కవినిర్మించిన లక్ష్యం - అప్పటికే ఏర్పడిన రెండు, మూడు లక్షణాలలో పూర్తిగా గాని పాక్షికంగా గాని ఒదిగి పోవడం జరగవచ్చు. ఇలా రెండు, మూడు లక్షణాలు పట్టిన లక్ష్యాన్ని ఏ ఒక్క లక్షణానికి పరిమితం చేయడానికి శక్యం కానప్పుడు, ఆ రెండు, మూడు లక్షణాలకు విడివిడిగా లక్ష్యాన్ని ఏర్పాటు చేయడానికి వీలుకానపుడు, ఆ లక్ష్యంలోనిది మిశ్రాలంకారమని చెప్పవచ్చు.

## 6.7 మిశ్రాలంకారాలు - పోతన భాగవతంతో అన్వయం

'సంకర' మొకటే మిశ్రాలంకారము. దీనిలో రెండు గాని అంతకంటే ఎక్కువగాని అలంకారాలు కలియుటచే కథకు శోభ కలుగుట చూడవచ్చు.

పోతన గారు భాగవతంలో ప్రయోగించిన మిశ్రాలంకారాలు స్వల్పమనే చెప్పాలి.

### 1. ఉపమ - రూపక మిశ్రాలంకారం

*గోపాల సింహంబు కోపించి వెల్వడి*
*నిను గజేంద్రుని భంగి నేఁడు గూల్చు*
*యాదవేంద్రానిల మాభీల జవమున*
*నిను మహీజము మాడ్కి నేల వ్రాల్చు*
*వాసుదేవాంభోధి వారి యుద్వేలమై*
*నిను దీవి కైవడి నేఁడు ముంచె*
*దేవకీ సుత వజ్రి దేవతలలరంగ*
*నినుఁ గొండక్రియ నేఁడు నిహతుఁజేసె* ..... (భాగ. 10. పూర్వ - 1383)

శ్రీకృష్ణుడు కంసుని చంపినప్పటి సందర్భంలో పద్యమిది. ఈ పద్యంలో గోపాల సింహంబు, యాదవేంద్రానిలము, వాసుదేవాంబోధి, దేవకీ సుత వజ్రి - అనేచోట్లలో ప్రతి వాక్యపూర్వార్థంలో రూపకం నిర్వహింపబడింది. గజేంద్రుని భంగి, మహీజము మాడ్కి, దీవికైవడి, కొండక్రియ - అనే చోట్లలో ప్రతి వాక్యఉత్తరార్థంలో (ఉపమావాచక సహితంగా) ఉపమ నిర్వహింప బడింది. ఈ రూపక, ఉపమలను విడదీసి చూచుటకు వీలుకావు. కావున ఇది మిశ్రాలంకారం.

శ్రీకృష్ణుడు కంసుని చంపడాన్ని నాలుగు ఉపమా రూపకాలలో ప్రయోగించడాన్ని బట్టి - శ్రీకృష్ణునికి కంసునిపై గల ఆక్రోశం, శ్రీకృష్ణుడు, కంసుని భయంకరంగా చంపిన తీరు వెల్లడి అవుతుంది.

### 2. ఉపమ - ఉత్ప్రేక్ష మిశ్రాలంకారం

*...నల్లని తెగగలనడగొండ చాడ్పున*
*నాభీల నీల దేహంబు మెఱయ* .....
*శౌరి దెసకు నడచెఁ జాణూర మల్లుండు* ...... (భాగ. 10. పూర్వ - 1344)

ఈ పద్యంలో కంసుని పంపున కృష్ణునిపై ముష్టియుద్ధం చేయుటకు వస్తున్న 'చాణూరు' ని వర్ణించడం జరిగింది.

చాణూరుడు నల్లని నడయాడెడి కొండవలె నీలదేహం మెరయగా వచ్చాడట. దేహాన్ని నడయాడెడి కొండ అనడం (కవి సమయ ప్రసిద్ధం కాని ఉపమానం వాడడం) ఉత్ప్రేక్ష. 'చాడ్పున' అనే ఉపమావాచకం వాడడం వలన అది ఉపమ.

చాణూరుని శరీరాన్ని మరింత పెద్దదిగా చెప్పడం వలననే, తరువాత అతన్ని చంపిన శ్రీకృష్ణుని బలమేమిటో తెలుస్తుంది.

3. ఉపమ - సార

*.... కాష్ఠంబు కంటె ధూమంబు, ధూమంబు కంటెఁ ద్రయీమయంబైన వహ్ని యెట్లు విశేషంబగు తమోగుణంబు కంటె రజో గుణంబు, రజో గుణంబు కంటె బ్రహ్మప్రకాశకంబగు సత్త్వగుణంబు విశిష్టంబగు.* (భాగ. 1 - 59)

దీనిలో ఉపమేయం ఒక సారాలంకారం, ఉపమానం మరొక సారాలంకారం. మొత్తం కలిపి ఒక ఉపమాలంకారం. వీటిని విడదీసి చూచుటకు వీలుకాదు.

ఒక విషయం కన్నమరొకటి శ్రేష్ఠతరము గాని, నీచతరముగాని అగుట సారాలంకారం. కాష్ఠంబుకంటె ధూమంబు, ధూమంబు కంటె వహ్ని విశేషంబు - అనడం సారాలంకారం. అట్లే తమోగుణం కంటె రజోగుణం, రజోగుణం కంటె సాత్త్విక గుణం విశిష్టం అనడం సారాలంకారం.

కాష్ఠం కంటే ధూమం, ధూమం కంటె అగ్ని - అనేది ఉపమేయం. తమోగుణం కంటే రజోగుణం, రజోగుణం కంటే సత్త్వగుణం - అనేది ఉపమానం. అగునట్లు అనేది ఉపమావాచకం. విశేషం/విశిష్టం అనేది సమానధర్మం.

ఈ విధంగా సార, ఉపమాలంకారాలను చక్కగా మిళితం చేశారు పోతనగారు.

4. ఉపమ - క్రమ

*జలజాతాక్షుఁడు సూడనొప్పె ధవళ చ్ఛత్రంబుతోఁ జామరం*
*బులతోఁ బుష్పపిశంగ చేలములతో భూషామణి స్ఫీతుడై*
*నలినీ బాంధవుతో శశిద్వయముతో నక్షత్ర సంఘంబుతో*
*బలభిచ్చాపముతోఁ దటిల్లతికతో భాసిల్లు మేఘాకృతిన్* (భాగ. 1-256)

1. సూర్యునితో, 2. చంద్రుల జంటతో, 3. నక్షత్రసమూహంతో, 4. ఇంద్రధనుస్సు, 5. మెరుపుతీగతో మేఘం వలె శ్రీకృష్ణుడు 1. ధవళచ్ఛత్రముతో, 2. చామరములతో, 3. పుష్పపిశంగ చేలములతో 4. వివిధ ఆభరణాలు, 5. మణులతో ప్రకాశించెను.

సమస్తవస్తు విషయోపమలోని ఉపమేయ అవయవి శ్రీకృష్ణుడు, ఉపమాన అవయవి మేఘం. అవయవాలైన ఉపమానాలు 1. సూర్యుడు, 2. చంద్రులు, 3. నక్షత్రసమూహం, 4. ఇంద్రధనుస్సు, 5. మెరుపుతీగ అవయవాలైన ఉపమేయాలు 1. ధవళచ్ఛత్రం, 2. చామరములు, 3. పుష్పపిశంగ చేలములు, 4. ఆభరణాలు, 5. మణులు.

ఉపమేయాలు ఉపమానాలు, ఉపమావాచకం, సమానధర్మం ఉండటం ఉపమ. కాగా ఉపమేయాలు, ఉపమానాలు ఒక క్రమంలో చెప్పడం సారాలంకారం. కావున ఈ పద్యం సార, ఉపమల మిశ్రాలంకారంగా చెప్పవచ్చు.

మేఘం - జలదము - అంటే జలములను ధరించినది కృష్ణుడు జలజాక్షుడు - జలము నుండి పుట్టినది అయిన కమలము వంటి కన్నులు కలవాడు. కాబట్టే ఈ రమ్యమైన పోలిక.

5. ఉపమ - వినోక్తి - కాకువు - అభావ

*ఆతేరారథికుడు నాహయములాయస్త్రాసనం బాశర*
*వ్రాతం బన్యులఁదొల్లిఁ జంపును దుదిన్ వ్యర్థంబు లై పోయెమ*
*చ్చేతోదీశుడు చక్రిలేమి, భసితక్షిప్తాజ్య మాయావి మా*
*యాతంత్రోషర భూమి బీజముల మర్యాదన్నిమేషంబునన్.* (భాగ. 1-373)

1. పూర్వం ఉండి తరువాత లేకపోతే అది అభావం. అర్జునుని అస్త్రాలు పూర్వం కురుక్షేత్రంలో అసంఖ్యాక శత్రు సైన్యాన్ని చంపి, ఇప్పుడు బోయవారిని ఎదిర్చి నిలువలేకపోయినవి. కావున దీనిలో అభావాలంకారం ఉంది.

2. ఆ తేరు, ఆ రథికుడు, ఆ హయములు ఆ యస్త్రాసనశరంబులు - అనడం 'ఆ...' అనేచోట కాకువు ఉంది. 'ఆ...' అనడం ఒకప్పుడు అత్యంత శక్తివంతమైనవని స్ఫురింపజేస్తుంది.

3. ఒకటి లేకపోతే మరొకదానికి ఉత్కర్ష లేదా అపకర్ష వర్ణించుట వినోక్తి. చక్రి లేకపోయేసరికి అర్జునుని శక్తియుక్తులన్నీ మాయమైనాయి. చక్రి లేకపోవడం చేత అర్జునుని శక్తులకు అపకర్ష వర్ణింపబడింది కాబట్టి వినోక్తి.

4. మంత్రగాని మంత్రాలకు వస్తువులు మాయం అయినట్లు శ్రీకృష్ణుడు లేకపోయేసరికి తన శక్తులన్నీ క్షణకాలంలో మాయమైనాయి - అని చెప్పడం ఉపమ.

ఈ విధంగా అభావ, కాకువు, వినోక్తి, ఉపమ అనే నాలుగు అలంకారాలు - కలిసి కృష్ణుడు లేకపోతే పరిస్థితి ఎలా మారుతుందో పోతనగారు చక్కగా వ్యక్తీకరించారు.

### 6. ఉపమ - శ్లేష - ప్రతీప - ముక్తపదగ్రస్తము

***.... రత్నాకరంబునుం బోలె ననిమిష కౌశిక వాహినీ విశ్రుతంబై, శ్రుతి వాక్యంబు నుంబోలె నకల్మష సువర్ణ ప్రభూతంబై, భూత పతి కంఠంబునుంబోలె భోగిరాజ కాంతంబై, కాంతాకుచంబునుంబోలె సువృత్తంబై, వృత్తజాలంబునుం బోలె సదా గురులఘు నియమాభిరామంబై, రామచంద్రుని తేజంబునుంబోలె ఖరదూషణాది దోషాచరానుపలబ్ధంబై, లబ్ధవర్ణచరిత్రంబు నుంబోలె విమలాంతరంగ ద్యోతమానంబై, మానధనుని నడవడియునుంబోలె సన్మార్గభాతి సుందరంబై ..... కృతార్థంబైన యమరావతి నగరంబు చేరంజని.*** (భాగ. 8-447)

1. అమరావతి నగరం - ఉపమేయం, ముందు చెప్పిన వాక్యాలన్నీ ఉపమానాలు - కావున ఇది మాలోపమ.
2. సమానధర్మాలన్నీ శ్లేషవలన అటు ఉపమేయానికి, ఇటు ఉపమానాలకు వర్తిస్తాయి. కావున ప్రతివాక్యంలో శ్లేష ఉంది.
3. ప్రసిద్ధ ఉపమేయాన్ని ఉపమానంగాను, ఉపమానాన్ని ఉపమేయంగాను వర్ణించుట ప్రతీపము.

రామచంద్రుని తేజంబునుంబోలె ఖరదూషణాది దోషా చరానుపలబ్ధంబై అమరావతి నగరం ఉందనడం, ప్రతీపం. ప్రసిద్ధ ఉపమేయమైన రాముని తేజాన్ని ఇక్కడ ఉపమానంగా చెప్పబడింది.

మాలోపమలోని సమాన ధర్మాలన్నీ శ్లేషపూర్వకంగా ఉన్నాయి. రత్నాకరంబునుంబోలె ననిమిష కౌశిక వాహినీ విశ్రుతంబై అమరావతి ఉందన్నపుడు.

రత్నాకరము - రత్నాకరములకు నిలయమైనది సముద్రం మరియు స్వర్గం.

అనిమిషం - రెప్పపాటు లేని మత్స్యములు, దేవతలు.

కౌశికవాహిని - కౌశిక అనేపేరు గల నది (సముద్రం పరంగా)

కౌశిక ప్రముఖదేవతా సమూహం. (స్వర్గంపరంగా)

అకల్మష సువర్ణ ప్రభూతంబై - పవిత్రమగు అక్షరములతో కూడిన (వేదంపరంగా)

- కల్మషం లేని బంగారంతో కూడిన (స్వర్గం పరంగా)

ఇదే విధంగా అన్ని వాక్యాలలో శ్లేష ఉంది. అన్ని వాక్యాలు కలిపి ఒక మాలోపమగా చెప్పవచ్చు.

4. వాక్యాంతమున విడిచిన పదము, తరువాతి వాక్యమున గ్రహింపబడింది. (ఇది శ్లేష వలన ఏకపదంగా భాసిస్తుంది.) కావున ఇది ముక్తపదగ్రస్తము.

### 7. రూపక - ఉత్ప్రేక్ష

శాఖాపుష్పఫల ప్రభారనతలై చర్చించి యోదేవ! మా
శాఖిత్వంబు హరింపుమంచు శుకభాషన్ నీకెఱింగింపుచున్
శాఖాహస్తములం బ్రసూన ఫలముల్ సక్కన్ సమర్పించుచున్
శాఖిశ్రేణులు నీ పదాబ్జము లకోజన్ మ్రొక్కెడిన్ జూచితే (భాగ. 10. పూర్వ - 595)

శాఖా హస్తములనడం రూపకాలంకారం. వృక్షములపై చిలుకలు శబ్దాలుచేయడం, వృక్షములు పూలు, పండ్లు రాల్చడం సాధారణం. కాని ఇక్కడ శ్రీకృష్ణునితో - వృక్షములు తమ వృక్షత్వాన్ని తొలగించమని చిలుక పలుకుల మిషతో చెప్పుతున్నాయని, పూలు, పండ్లు కృష్ణునికి సమర్పిస్తూ మ్రొక్కుతున్నాయని ఊహింపబడింది. కావున ఇది ఉత్ప్రేక్ష. దీనిలో రూపకం, ఉత్ప్రేక్ష కలిసిపోయి ఉన్నాయి.

ప్రకృతి అంతా శ్రీకృష్ణునికి మ్రొక్కుతుందనడం ఇక్కడి చారుత్వం.

### 8. రూపక - శ్లేష

*వేదకల్పవృక్ష విగళితమై శుక*
*ముఖా సుధాద్రవమున మొనసియున్న*
*భాగవతపురాణ ఫలరసాస్వాదన*
*పదవిఁ గనుడు రసిక భావవిదులు* (భాగ. 1-35)

రసహృదయం కలవారిని భాగవతపురాణం అనే ఫలాన్ని ఆరగించమని చెప్పుతూ పోతనగారు చెప్పిన పద్యమిది.

వేదకల్పవృక్షము, భాగవత పురాణఫలము అనునవి రూపకములు అతివిస్తారమైన వేదాన్ని కల్పవృక్షంగా భావించి, దాని యొక్క ఫలముగా భాగవతాన్ని చెప్పడం వలన భాగవతమెంతగా వేదసారమో తెలుస్తుంది. ఇంకా భాగవతం ఎంత మధురాతిమధురమైనదో, రసనిష్యందమైనదో తెలుస్తుంది. ఇక్కడ 'శుక' శబ్దము చిలుక అనీ, శుకయోగీంద్రుడు అని శ్లేష వలన రెంటికి వర్తించింది. ఆస్వాదించడం అటు ఫలాన్ని, ఇటు భాగవతాన్ని.

ఇలా రూపక, శ్లేష యుక్తంగా ఈ పద్యం ఉంది.

### 9. రూపక - అర్థాంతర

*జనవర! పాండుభూపతనుజాతుఁడు దుస్తర తన్మనోరథా*
*బ్ధిని సరసీరుహాక్షుఁడను తెప్పకతంబున దాఁటి భూరి శో*
*భన యుతుడై మనోరుజఁబాసి ముదాత్మకుడై వెలింగె న*
*వ్వనరుహనాభదాస జన వర్గము కుంగలవేయసాధ్యముల్* (భాగ. 10. పూర్వ - 810)

అర్జునుడు తన మనోరథమనే సముద్రాన్ని, శ్రీకృష్ణుడనే తెప్పవలన దాటాడు కృష్ణభక్తులకు అసాధ్యములు కలవా?

ఈ పద్యంలో అర్జునుని మనోరథానికి సముద్రానికి, శ్రీకృష్ణునికి తెప్పకు అభేదం చెప్పబడడం వలన రూపకం. అర్జునుడు తనమనోరథాన్ని తీర్చుకోవడం - విశేషం. దీన్ని 'వనరుహనాభదాస జనవర్గముకుంగలవే యసాధ్యముల్' అనే సామాన్యం చేత సమర్థింపబడింది. కావున ఇది అర్థాంతరన్యాసం. కావున ఇది రూపకం, అర్థాంతరన్యాసాల మిశ్రాలంకారం.

ఇలా భాగవతానికి, మిశ్రాలంకారాలతో శోభను కూర్చారు పోతనగారు.

# 7

## గంగన భాగవత భాగం

# అలంకార శిల్పం

**7.0** బొప్పరాజు గంగనగారు పంచమస్కంధాన్ని రచించారు. దానిలో రెండు ఆశ్వాసాలలో 349 గద్యపద్యాలు వ్రాశారు. గంగన గారు లభించిన కొద్ది అవకాశంలో అలంకారాలను సమర్థవంతగానే నిర్వహించారు. వ్రాసిన గద్యపద్యాలే 349 కాబట్టి ప్రయోగించిన అలంకారాల సంఖ్య స్వల్పమే అయినా ప్రయోగించినంతలో చక్కని అలంకారాలే వాడారు.

(గమనిక - అలంకార లక్షణాలను శబ్దాలంకార శిల్పం, అర్థాలంకార శిల్పం అనే ఈ వ్యాసంలోని అధ్యాయాలలో చూడగలరు.)

### 7.1 శబ్దాలంకారాలు

**1. అక్షరావృత్తి (అంత్యప్రాస)**

***శ్రీకర! కరుణాసాగర!***
***ప్రాకట లక్ష్మీకళత్ర! భవ్యచరిత్రా!***
***లోకాతీత గుణాశ్రయ!***
***గోకుల విస్తార! నందగోపకుమారా!*** (భాగ. 5 - ప్ర-1)

శ్రీకృష్ణుని ప్రార్థిస్తు గంగన గారు చెప్పిన పంచమ స్కంధ ప్రారంభపద్యమిది. అంత్యప్రాసలో ఉన్న మహిమ ఏమిటో గాని పాఠకుని ఇట్టే ఆకర్షిస్తుంది. శ్రీకృష్ణున్ని సంబోధిస్తు చెప్పిన లక్షణాలు శ్రవణ పేయంగా ఉండుటకు ఈ పద్యంలో అంత్య ప్రాసాలంకారము చెప్పబడింది. దీనిలో శ్రీకర! కరుణా సాగరా! అన్నపుడు, గోకుల విస్తార! నందగోపకుమారా! అన్నపుడు 'ర' అనే అక్షరం వాక్యాంతంలో ఆవృత్తమైంది. అట్లే లక్ష్మీ కళత్ర భవ్యచరిత్ర! అన్నపుడు 'త్ర' అనే అక్షరం వాక్యాంతంలో ఆవృతమైనది. అలా ఆవృతమవడంలో ఒక శ్రవణ సుభగత ఉంది.

**2. యమకం**

అక్షరగుచ్ఛం ఆవృతం కావడం యమకం.

***.... స్వాయంభువ మనువు భూపరిపాలనంబునకుఁ బ్రియవ్రతునిఁ బట్టంబు గట్టి విషమంబులగు విషయంబులను విషసముద్రాశ వలన విముక్తుండై వనంబునకుం జనియె ....*** (భాగ. 5-ప్ర-14)

స్వాయంభువ మనువు విషయ సుఖాలపై విరక్తి చెంది తపస్సుకు వనానికి వెళ్ళాడు. విషమంబులగు విషయంబులను విషసముద్రాశవలన విముక్తుండై వనంబునకు జనియెనంటాడు. 'విష' అనే అక్షరద్వయం మూడు మార్లు చెప్పుటవల్ల బాహ్యసుఖాలు ఎంత విషప్రాయమో నొక్కిచెప్పినట్లయింది.

### 7.2 అర్థాలంకారాలు

**1. ఉపమ**

గంగనగారు భాగవతం పంచమ స్కంధంలో 42 ఉపమలు ప్రయోగించారు.

***.... రహూగణుండను నారాజుపాసిత వృద్ధజనుండైనను బలాత్కారంబునం బుట్టిన కోపంబునం గోపించి విమర్శదప్పి, నీఱు గప్పిన నిప్పునుంబోలె నెఱుంగరాని బ్రహ్మతేజంబు గల బ్రాహ్మణునికిం గంటకంబుగా నిష్ఠుర వాక్యంబుల నిట్లనియె.*** (భాగ. 5. ప్ర-142)

రహూగణుడు అనే సింధు దేశ రాజు కపిల మహా ముని వలన ఆత్మజ్ఞానం పొందగోరి పల్లకిలో వెళ్తుండగా, చేను దగ్గర జడుని వలె నున్న భరతుని చేత పల్లకి మోయిస్తాడు. అనుభవం లేని కారణంగా మిగిలిన వారితో లయాత్మకంగా కలిసి నడువలేడు భరతుడు. అందుకని దూషిస్తాడు రాజు. అప్పుడు వాడిన ఉపమ వలన భరతుని అంతస్స్వరూపం ఎటువంటిదో తెలుస్తుంది. 'నీఱు గప్పిన నిప్పునుం బోలె నెఱుంగరాని బ్రహ్మ తేజంబు గల బ్రాహ్మణుడు.' భరతుడు బ్రహ్మజ్ఞాని. ఆవిషయం బాహ్యస్వరూపాన్ని బట్టి తెలియదు. పైకి చూడడానికి సామాన్యుని వలె ఉంటాడు భరతుడు. అతన్ని బూడిదచే కప్పబడిన నిప్పుతో పోల్చడం రమ్యంగా ఉంది. నిప్పు ఉంది కాని అది బూడిదతో కప్పబడి ఉంది. నిగూఢమైన వేదాంత విషయాన్ని

చక్కని పోలిక ద్వారా బొప్పరాజు గంగన ఆవిష్కరించారు.

*పొలుపగుచున్న విలాసం*
*బుల నంగజు బాణములను బోలెడి నీ చం*
*చల సత్కటాక్షవీక్షణ*
*ముల నెవ్వని నింతి! చిత్తమునఁ గలఁచెదవే?* (భాగ. 5. ప్ర-29)

ఆగ్నీధ్రుండు అనే రాజు పూర్వచిత్తి అనే అప్సరసను చూచినపుడు ఆమెతో అంటున్న మాటలివి. మన్మథ బాణములను బోలెడి చంచల సత్కటాక్ష వీక్షణములు ఆమెవి. బ్రహ్మదేవుడు పంపించగా ఆగ్నీధ్రుని వద్దకు వస్తుంది పూర్వచిత్తి. ఆ రాజు మోహంలో పడతాడు. ఆమె చూపులు ఎంత నిశితమైనవో ఎంతగా ఆరాజు హృదాయాన్ని చీల్చు సమర్థత గలవో మన్మథ బాణములతో పోల్చడాన్ని బట్టి తెలుస్తుంది.

**2. ఉత్ప్రేక్ష**

*................................... మన్మథ సామగానముల్*
*చదివెడు శిష్యులో? యనఁగ షట్పద పంక్తులు చేరి మ్రోయగా....* (భాగ. 5. ప్ర-30)

ఆగ్నీధ్రుని వద్దకు పూర్వచిత్తి అను అప్సరస వచ్చినపుడు తుమ్మెదలు ఝుంకారము చేయుచున్నవి. అది మన్మథ సామగానాలు చదువుతున్న శిష్యులేమో అన్నట్లుగ ఉందట. తుమ్మెదలు గానం చేయడం సర్వసాధారణం కాని ఆగ్నీధ్రుడు పూర్వచిత్తి మరులు గొను సందర్భంలో దాన్ని మన్మథ సామగానం చేస్తున్న శిష్యులేమో అన్నట్లుగా ఉందనడం సందర్భోచిత ఉత్ప్రేక్ష.

**3. రూపకం**

*అరయఁ గర్మరూపమగు నవిద్యాజన్మ*
*మైన హృదయ బంధనాది లతల*
*నప్రమత్త యోగమను మహాఛురికచేఁ*
*దెంపవలయునంతఁ దెంపుతోడ* (భాగ. 5. ప్ర-70)

గహనమగు వేదాంత విషయాలను చక్కని ఉపమానాలతో వివరించిన పద్యాలలో ఇది ఒకటి. అవిద్య/అజ్ఞానం వలన కలిగిన కర్మరూపంలో ఉన్న హృదయబంధనాది లతలను యోగమనే ఛురికతో ఖండించవలెనని చెప్పబడింది. కర్మలను యోగముచే తొలగించుకోవాలనే విషయాన్ని అందరికీ తెలిసిన ఛురికతో తీగలను కోయడం అనే విషయంతో అభేదం చెప్పడం వలన విషయం సులభతరమవుతుంది.

**4. అర్థాంతరన్యాసం**

వృషలరాజు బ్రాహ్మణుడైన భరతుని కాళీమాతకు బలి ఇవ్వబోగా కాళీమాత రాజును, భృత్యులను సంహరించి భరతుని కాపాడుతుంది. ఆ సందర్భంలో గంగన ఇలా అంటాడు.

*ధరలోన నెవ్వరేనియు*
*ధరణీసురవరులకెగ్గుదగఁ దలఁచిన వా*
*రరయగఁ జెడుదురు నిక్కము ...* (భాగ. 5. ప్ర-135)

భరతునివృషలరాజు చంపాలనుకొని తానే చనిపోవడం విశేషం. దీన్ని బ్రాహ్మణులకు హానిచేయదలచినవారు చనిపోతారనే విషయంతో సమర్థించడం జరిగింది. కావున ఇది అర్థాంతరన్యాసం. నిజమైనభక్తులను దైవం ఎప్పుడూ రక్షిస్తుందనే విషయానికి ఇది నిదర్శనం.

**5. అర్థాపత్తి**

*హరిసేవనాప్రియవ్రతుఁ*

*డరయఁగఁ గైవల్య పదవినందుట యరుదే?*

*ధరఁజండాలుండైనను*

*హరినామస్మరణఁ జెందు నవ్యయపదమున్* (భాగ. 5. ప్ర-23)

ఒక కష్టమైన పనే జరిగిందంటే చిన్నపనెంత? అనే భావన రావడం అర్థాపత్తిలో ఉంటుంది. అంతే గాక చిన్న ప్రయత్నంతోనే పెద్దకార్యం సాధిస్తే, పెద్ద ప్రయత్నంతో సాధించడం ఎంత? అనే భావం రావడం కూడా అర్థాపత్తియే.

చండాలుడైనా సరే కొంత హరినామ స్మరణ చేస్తే మోక్షం వస్తుండగా నిత్య శ్రీహరి సేవావ్రతునికి మోక్షం రావడం విశేషమేముంది అనడం అర్థాపత్తి.

ఈ అలంకారం వలన శ్రీహరి నామస్మరణ ఎంత మహిమ కలదో తెలుస్తుంది.

6. స్వభావోక్తి

'నాభి' అనే రాజు, అతని భార్య విష్ణువు గూర్చి పూజలు చేయగా వారికి ప్రత్యక్షమైన విష్ణువు స్వరూపం స్వభావోక్తికి చక్కని ఉదాహరణ.

*అంతరావిష్కృత కాంత చతుర్భుజం*
*బులును పీతాంబరంబును వెలుంగ*
*శ్రీవత్సకౌస్తుభ శ్రీరమాచిహ్నంబు*
*లురమందు రమ్యమై యిరవు వడఁగ*
*శంకచక్రగదాంబుజాత ఖడ్గాది ది*
*వ్యాయుధంబులు చేతులందు మెఱయ*
*నతులిత నవరత్న హాటకాంకిత నూత్న*
*ఘనకిరీట ద్యుతుల్ గడలు కొనఁ గ*
*గర్ణకుండల కటి సూత్ర కనకరత్న*
*హారకేయూర వరనూపురాది భూష*
*ణముల భూషితుఁ డైన శ్రీనాయకుండు*
*దంపతులకప్పుడెదురఁ బ్రత్యక్షమయ్యె* (భాగ. 5. ప్ర-43)

శ్రీమహావిష్ణువు దివ్యమంగళరూపం వివిధ ఆభరణాల దివ్యసౌందర్యం మనోహరంగా వర్ణింపబడింది కావున ఇది స్వభావోక్తి.

7. దీపకం

*... తప్పుసైరింపు నే యమ దండమునకు*
*హరుని శూలంబునకును వజ్రాయుధమున*
*కనల చంద్రార్క ధనద శస్త్రాస్త్రములకు*
*వెఱవ విప్రునకేమది వెఱచినట్లు* (భాగ. 5. ప్ర-147)

ప్రకృత, అప్రకృతానికి ధర్మాన్వయం చేయుట దీపకం.

రహూగణుండు అను సింధుదేశరాజు తెలియక భరతునితో పల్లకి మోయించినందుకు భరతుడు శపిస్తాడేమో నని భయపడి అంటున్నమాటలివి.

బ్రాహ్మణునికి భయపడడం ప్రకృతం. యమదండం, శివుని త్రిశూలం, వజ్రాయుధం, అగ్ని, చంద్ర, సూర్య, కుబేరుల శస్త్రాస్త్రాలు అప్రకృతం. ఇక్కడ ప్రకృతానికి అప్రకృత విషయాలతో ఏకాన్వయం చెప్పబడింది కావున ఇది దీపకం. ఈ దీపకాలంకారం వలన విప్రుడు కోపగిస్తే ఎలాంటి ఉపద్రవం చెలరేగుతుందో అర్థమవుతుంది.

8. సార

*భూతజాలములందు భూజముల్ వర్యముల్*
*భూ రుహంబుల కంటె భోగి కులము*
*భోగి సంతతి కన్నబోధ నిష్ఠులు బోధ*
*మాన్యుల కన్నను మనుజ వరులు*
*వీరికన్నను సిద్ధ విబుధ గంధర్వులు*
*వారికన్న నసురుల్ వారికన్న*
*నింద్రాది దేవతలిందఱికన్నను*
*దక్షాది సన్మునుల్ దలప నెక్కు*
*డంతకన్నను భర్గుఁడాయభవు కన్నఁ*
*గమల భవుఁడెక్కుఁ డాతని కంటె విష్ణుఁ*
*డధికుఁడాతఁడు విప్రులనాదరించుఁ*
*గానవిప్రుండు దైవంబు మానవులకు* (భాగ. 5. ప్ర-74)

ఒక వస్తువు కన్న మరొకటి శ్రేష్ఠతరమని చెప్పుట సారాలంకారము.

వృక్షములనుండి శ్రీ విష్ణువు వరకు ఒకరికంటే ఒకరు శ్రేష్ఠమని చెప్పడం వలన ఇది సారాలంకారము.

అందరికంటే శ్రేష్ఠతమమైన శ్రీవిష్ణువు బ్రాహ్మణుని ఆదరించుట చేత బ్రాహ్మణుడు అందరికంటే గొప్పవాడని చెప్పటం పద్యతాత్పర్యం.

9. క్రమ/యథాసంఖ్య

*వనరనిట్లు యోగయుక్తుండు గురుఁడైన*
*భూపుఁడైన శిష్యపుత్రవరుల*
*యోగమతులఁ జేయ నొప్పుగా వలయును*
*గర్మపరులఁ జేయఁ గాదు కాదు* (భాగ.5. ప్ర-71)

గురువైన, రాజైన శిష్యపుత్రవరుల యోగమతుల చేయవలెను. అన్నపుడు గురువు - శిష్యులను, రాజు - పుత్రులను యోగయుక్తులుగా చేయవలెనని చెప్పడం జరిగింది. గురువు, రాజులను మరియు శిష్యులను, పుత్రులను ఒక క్రమంలో చెప్పడం వలన ఇది క్రమాలంకారం.

10. విభావన

కారణం లేకుండా కార్యం జరుగుట విభావన.

*ఇపుడు మేము నీకు నిష్టంబులగు పూజ*
*లాచరింపకున్ననైన నధిక*
*మైన నీకృపాకటాక్షవీక్షణములఁ*
*జక్కఁజూచి తగ బ్రసన్నుఁడగుచు* (భాగ. 5. ప్ర-49)

పూజచేయకున్నా విష్ణువు కృపాకటాక్షవీక్షణాలు లభించాయనడం విభావన. దీన్ని బట్టి విష్ణువు ఎంత భక్త సులభుడో తెలుస్తుంది.

11. అపహ్నుతి

ఇది ఉపమేయం కాదు ఉపమానమే అంటూ ఉపమేయాన్ని నిషేధించి ఉపమానాన్ని ప్రతిపాదించడం అపహ్నుతి.

గయుడు అనే రాజును ఉద్దేశించి చెప్పినది క్రింది పద్యం.

*...... సత్యమందు మిగుల సత్సేవయందును*

***ధర్మమందు యజ్ఞకర్మమందు***
***గయుఁడు వసుధలోనఁ గంజాక్షుఁడే కాని***
***మానవుండు గాఁడు మానవేంద్ర*** (భాగ. 5. ద్వి-9)

గయుడు అనే రాజు లక్షణాలు పేర్కొంటూ ఆ లక్షణాల ఆధారంగా ఇతడు కంజాక్షుడే (విష్ణువే) కాని మానవుడు కాడు. అని ఉపమేయమైన గయుణ్ణి మానవుడు కాదు అని నిషేధించి ఇతడు విష్ణువే అని ఉపమానాన్ని ప్రతిపాదించడం జరిగింది కావున ఇది అపహ్నుతి.

దీనిని బట్టి గయుడు ఎంత శుభలక్షణుడై ప్రసిద్ధి వహించాడో తెలుస్తుంది.

గంగనగారు భాగవత పంచమ స్కంధంలో అలంకారాలను మనోహరంగా ప్రయోగించారు.

# ౪

# సింగన భాగవత భాగం

# అలంకార శిల్పం

**8.0** ఏర్చూరి సింగన గారు శ్రీమహాభాగవతంలోని షష్ఠస్కంధాన్ని రచించారు. 529 గద్యపద్యాలలో వీలైనంత వరకూ తరచుగానే అలంకారాలను ప్రయోగించడం జరిగింది. సంఖ్యలో తక్కువైనా అత్యంత చక్కని అలంకారాలను సృజించడం చూడవచ్చు.

(గమనిక - అలంకారాల లక్షణాలను శబ్దాలంకార శిల్పం, శబ్దార్థాలంకారశిల్పం, అర్థాలంకార శిల్పమనే పూర్వ అధ్యాయాలలో చూడగలరు.)

**8.1 శబ్దాలంకారాలు**

**1. వృత్త్యనుప్రాస**

*దండిం గోదండ కాండోద్ధతరథహయ వేదండ తండంబు తోడన్*
*దండెత్తెన్ మెండుగా నద్దనుజనికరముల్ దైవవర్గంబు మీదం*
*జండ బ్రహ్మాండ భేద్యోచ్ఛ్రయ జయరవముల్ సర్వదిక్షోభగాను*
*ద్దండ ప్రఖ్యాత లీలన్ దలపడిరి సురల్ దర్పులై వారితోడన్* (భాగ. 6-272)

దేవదానవ యుద్ధాన్ని వర్ణించే పద్యమిది. యుద్ధమెంత భయంకరంగా జరిగిందన్న విషయం, రణధ్వనులు బిందుపూర్వక 'డ' కారావృత్తి వలన సూచింపబడ్డాయి. దీనిలో గల పరుషాక్షర, సంయుక్తాక్షర ప్రయోగం (ద్ధ, ర్గ, బ్ర, హ్మా, భే, ద్యో, చ్ఛ, క్షో, ఖ్యా) యుద్ధసంక్లిష్టతను స్ఫురింపజేస్తుంది.

బిందుపూర్వక 'డ' అనే అక్షరం పలుమార్లు ఆవృత్తి అయింది కావున ఇది వృత్త్యనుప్రాస.

**8.2 శబ్దార్థాలంకారాలు**

**1. పదాంశ - పదావృత్తి (యమకం)**

*రాముఁడు రాజకులైక వి*
*రాముఁడు భృగు సత్కులాభిరాముఁడు సుగుణ*
*స్తోముఁడు నను రక్షించున్*
*శ్రీమహితోన్నతుఁడు నద్రిశిఖరములందున్* (భాగ. 6-305)

సింగన గారు విష్ణువు దశావతారాలను వర్ణిస్తూ వాటిలో పరశురామావతారాన్ని గూర్చి వర్ణించే పద్యమిది.

అక్షర గుచ్ఛం ఆవృత్తి కావడాన్ని యమకం అంటారు. రాముడు, విరాముడు, అభిరాముడు అనే మాటల్లో రాముడు అనే అక్షరగుచ్ఛం ఆవృతమైంది కావున ఇది యమకం. యమకంలో ఆవృత్త అక్షర గుచ్ఛం సమానార్థకం కాకూడదు. ఈ పద్యంలో రాముడు = పరశురాముడు, విరాముడు = చంపేవాడు, అభిరాముడు = ఒప్పువాడు అని భిన్నార్థకంగా ఉన్నాయి. కావున ఇది యమకమే. 'రాముడు' పదం కాగా 'విరాముడు' 'అభిరాముడు'లలో 'రాముడు' అనేది పదాంశంగా ఉంది.

**2. వ్యవధాన - సమానార్థక - పదావృత్తి**

*దండంబు యోగీంద్ర మండలనుతునకు*
*దండంబు శార్ఙ్గ కోదండునకును*
*దండంబు మండిత కుండల ద్వయునకు*
*దండంబు నిష్ఠుర ఖండనునకు*
*దండంబు మత్త వేదండ రక్షకునకు*
*దండంబు రాక్షస ఖండనునకు*
*దండంబు పూర్ణేందు మండల ముఖునకు*
*దండంబు తేజ ప్రచండునకును*
*దండమద్భుత పుణ్యప్రధానునకును*
*దండముత్తమ వైకుంఠధామునకును*
*దండమాశ్రిత రక్షణ తత్పరునకు*
*దండమురుభోగి నాయక తల్పునకును* (భాగ. 6-336)

శ్రీమహావిష్ణువు వృత్రాసురుని చంపుతానని దేవతలకు అభయమిచ్చిన తరువాత దేవతలు ఆనందంతో విష్ణువును స్తుతించే పద్యమిది.

ఈ పద్యంలో 'దండము' అనే పదం పలుమార్లు ఆవృతమైంది. ఆవృతమైన అన్ని పదాలు సమానార్థకాలే. పలుమార్లు దండము, దండము అనడం వల్ల శ్రీమహావిష్ణువును ఎన్ని మార్లు కీర్తించినా తనివి తీరదు, ఎన్నిమార్లు నమస్కరించినా ఇంకొక్కమారు నమస్కరించాలనిపించే సుందరుడు విష్ణువు. కావున వృత్రాసురుని చంపుతాననే అభయం ఇచ్చిన తరువాత వారి ఆనందానికి హద్దులు లేక హరిని స్తుతించుచున్నారని తెలుస్తుంది.

3. వ్యవధాన - భిన్నార్థక - పదావృత్తి

*ఉత్తర కొడుకిట్లడిగిన*
*యుత్తరమును నమ్మునీంద్రుఁడుత్తమ చేతో*
*వృత్తిముదమంది పలికెను ....* (భాగ. 6-194)

ఈ పద్యంలో 'ఉత్తర' అనే పదం భిన్నార్థకంగా ప్రయోగింపబడింది.

ఉత్తర కొడుకు అన్నపుడు ఉత్తర అభిమన్యుని భార్య. ఉత్తరము అన్నపుడు సమాధానం అని అర్థం. ఈ రెండు పదాలు వ్యవధానంతో వచ్చాయి. శబ్దచమత్కారాల్లో ఇది ఒక పద్ధతి.

4. అవ్యవధాన - భిన్నార్థక - పదావృత్తి

వారని వేడ్కతో దుహితృవత్స దక్షుఁడు దక్షుఁడాత్మచే
గోరి సృజించె ... (భాగ. 6-206)

ఈ పద్యంలో దక్షుడు అనే పదం అవ్యవధానంతో అర్థభేదంతో ఆవృతమైంది.

'దుహితృ వత్సల దక్షుడు' అన్నపుడు దక్షుడు అంటే సమర్థుడని అర్థం. తరువాత పదం దక్షుడు అనేది పేరు.

5. అవ్యవధాన - సమానార్థక - పదావృత్తి (ముక్తపదగ్రస్తం)

*అఖిల భూతముల దేహాంతస్థమగు నాత్మ*
*యీశుఁడచ్యుతుఁడని యెఱుగవలయు*
*నెఱిఁగి సర్వంబైన ఇందిరా రమణు*
*లోచూపునఁ దనివిగాఁ జూడవలయుఁ*
*జూచిన చిద్రూప శుద్ధాత్ములగు మిమ్ము*
*నెనసిన వేడ్కతో నిచ్చమెచ్చు*
*మెచ్చిన సర్వాత్మ మీరెఱింగిన చోటఁ*
*గోపగుణంబులఁ బాపవలయుఁ*
*బాపి దగ్ధశేష పాదపజాలంబుఁ*
*దీయమెసఁగ బ్రతుక నీయవలయు*
*ననఘులార! మీరలస్మదీయ ప్రార్థ*
*నంబు పరఁగ జేకొనంగవలయు* (భాగ. 6-201)

ఈ పద్యంలో వాక్యాంతమున విడచిన పదం అవ్యవధాంగా వాక్యాదిలో గ్రహింపబడింది. ఇలా అన్ని పాదాలలో ఆవృతమైంది. కావున ఇది ముక్తపదగ్రస్తము.

భగవంతుని మనం చూడవలసిన తీరు భావించవలసిన పద్ధతి ఈ పద్యంలో చెప్పబడ్డాయి.

## 8.3 అర్థాలంకారాలు

1. ఉపమ

*అరయ వీర్యవంతమగు నౌషధమెట్లు యదృచ్ఛఁ గొన్నఁద*
*చ్చారు గుణంబు రోగములఁ జయ్యనఁ బాపిన మాడ్కి బుణ్య వి*
*స్ఫారుని నంబుజోదరునిఁ బామరుఁ డజ్ఞుఁడవజ్ఞఁ బల్కి నన్*
*వారక తత్ప్రభావము ధ్రువంబుగ నాత్మ గుణంబుఁ జూపదే!* (భాగ. 6-125)

శక్తివంతమైన ఔషధమును తెలిసి త్రాగినా, తెలియక త్రాగినా అది తత్సంబంధమైన రోగమును మాన్పినట్లు శ్రీమన్నారాయణుని స్మరణను తెలిసి చేసినా తెలియక చేసినా దాని ప్రభావాన్ని చూపుతుంది. (పాపాలను తొలగిస్తుంది.)

అజామిళుడు జీవితాంతం అసంఖ్యాక పాపకృత్యములు ఆచరించినా మరణ సమయంలో చిన్నకొడుకు మీది ప్రేమతో 'నారాయణ' నామాన్ని మూడు మార్లు పలికినంతనే జీవితంలో చేసిన పాపాలన్నీ తొలగి వైకుంఠానికి తీసుకుపోబడునంతటి పుణ్యాన్ని సంపాదించినట్లయ్యెను. ఈ నారాయణ నామ స్మరణ ప్రభావాన్ని ఔషధ ప్రభావంతో పోల్చి చెప్పడం రమణీయంగా ఉంది. ఔషధం గూర్చి వివరాలు తెలియక పోయినా అది దాని ప్రభావాన్నిచూపినట్లు నారాయణ నామ మహిమ తెలియక పోయినా ఉచ్చరిస్తే అది చేయాల్సిన పని చేస్తుంది.

చక్కని ఉపమానం ద్వారా విషయాన్ని అందంగా సులభంగా అర్థం చేసుకొనేలాగా చెప్పారు సింగనగారు.

సదృశోపమ

ఉపమేయాన్ని ఒక ప్రత్యేక ఉపమానంతోనే పోల్చదగును అని చెప్పబడితే అది సదృశోపమ.

సింగన గారు వారి తల్లిని గూర్చి చెబుతూ

*అడదు భర్తమాటకెదురాడదు వచ్చినవారి వీడగా*
*నాడదు పెక్కుభాషలెడనాడదు వాకిలి వెళ్ళి కల్లమా*
*టడదు మిన్నకేని సుగుణావళికిందిరగాక సాటి యే*
*చేడియ లేదు చూరికుల శేఖరుకస్వయ ముమ్మడమ్మకున్* (భాగ. 6-27)

ముమ్మడమ్మకు ఇందిరగాక సాటి యే చేడియ లేదని ఆమెను ఒక్క లక్ష్మీ దేవితోనే పోల్చాలి. ఎంకెవ్వరితోను పోల్చకూడదు అనడం సదృశోపమ.

ముమ్మడమ్మ (తల్లి) లక్షణాలని చెప్పకుండానే సింగన తల్లిని లక్ష్మీదేవితో పోల్చడం వల్ల లక్ష్మీదేవికున్న శుభలక్షణాలన్నీ తన తల్లికున్నట్లు చెప్పినట్లయినది.

మాలోపమ

*మెఱయ యంత్రమయంబైన మృగము భంగి*
*దారు నిర్మితమైనట్టి తరుణి పోల్కి*
*శక్ర! యెఱుఁగుమ ఈ భూతజాలమెల్ల*
*దళిత పంకేరుహాక్షు తంత్రంబు గాఁగ* (భాగ. 6-415)

వృత్రాసురుడు తనతో యుద్ధం చేస్తున్న ఇంద్రునితో అంటున్న మాటలివి.

యంత్రం దాన్ని నడిపే వ్యక్తి ఎలా పని చేయిస్తే అలాగే పని చేస్తుంది. చెక్కతో చేసిన బొమ్మ ఎలా కదిపితే అలా కదులుతుంది. అలాగే శ్రీమహావిష్ణువు ఎలా నడిపిస్తే ఈ ప్రాణులన్నీ అలా నడుస్తాయి. విష్ణువు సంకల్పం మేరకు ప్రాణులన్నీ పనిచేయడం ఉపమేయం. దీనికి యంత్రం, చెక్కబొమ్మ అనే రెండు ఉపమానాలు చెప్పబడ్డాయి కావున ఇది మాలోపమ.

2. ఉత్ప్రేక్ష

*ధర్మాచలేంద్రప్రపాత ద్వయంబునఁ*
*గలిగిన నీలంపుఁ గనులనంగ*
*మొనసి తార్క్ష్యుని యిరు మూపుపై నిడినట్టి*
*పదముల కాంతులు పరిఢవింప .... ...* (భాగ. 6-218)

శ్రీమహావిష్ణువు పాదాలు నీలంపు గనులేమో అనునట్లుగా ఉన్నాయనడం ఉత్ప్రేక్ష. శ్రీహరి పాదాలు మరింత నీలంగా ఉన్నాయని దీని ద్వారా తెలుస్తుంది.

3. రూపకం

*వరయోగి మానసాంతః*
*కరణ సుధాంభోధి భావ కల్లోల లస*
*త్పరతత్త్వ శేషశాయికిఁ*
*జిరదాయికి సకలభక్త చింతామణికిన్* (భాగ. 6-36)

శ్రీకృష్ణునికి ఏర్చూరి సింగన తన భాగవత షష్ఠస్కంధ భాగాన్ని అంకితమిస్తూ చెప్పిన పద్యమిది.

కృష్ణుడు యోగి హృదయమనే పాల కడలిలో పరతత్త్వభావములనే ఆది శేషునిపై శయనించే వాడని అంటాడు. ఇక్కడ యోగి హృదయానికి, పాల సముద్రానికి మరియు పరతత్త్వభావాలకు ఆదిశేషునికి అభేదం చెప్పబడింది కనుక ఇది రూపకం. శ్రీకృష్ణుడు వైకుంఠంలో కన్నా భక్తుల హృదయాలలోనే ఉంటాడనడానికి ఇది ప్రబల తార్కాణం.

మాలారూపకం

*బ్రహ్మహత్యానేక పాపాటవులకగ్ని*
*కీలలు హరినామ కీర్తనములు*
*గురుతల్ప కల్మష క్రూర సర్పములకుఁ*
*గేకులు హరినామ కీర్తనములు*
*తపనీయ చౌర్య సంతమసంబునకు సూర్య*
*కిరణముల్ హరినామ కీర్తనములు*
*మధుపాన కిల్బిష మదనాగ సమితికిఁ*
*గేసరుల్ హరినామ కీర్తనములు*
*మహిత యోగోగ్ర నిత్య సమాధి విధుల*
*నలరు బ్రహ్మాది సురులకు నందరాని*
*భూరి నిర్వాణ సామ్రాజ్య భోగభాగ్య*
*ఖేలనంబులు హరినామ కీర్తనములు* (భాగ. 6- )

శ్రీహరి నామకీర్తనములు ఎంత మహిమ కలవో ఈ మాలారూపకాలంకారం ద్వారా తెలుస్తుంది. హరినామ కీర్తనములు అనేవి బ్రహ్మ హత్యాది పాపాలు అనే అడవులకు అగ్ని జ్వాలలు కల్మషములనే క్రూరసర్పములకు నెమళ్ళు, చౌర్యమనే చీకటికి సూర్యకిరణాలు, మధుపానమనే ఏనుగులకు సింహాలు అని చెప్పబడింది కాబట్టి ఇది మాలా రూపకం.

4. స్వభావోక్తి

*కుంకుమ రాగ రమ్యకుచ కుంభములన్ గడు కజ్జలంబుతోఁ*
*బంకిలమైన బాష్పములఁ బల్పడ మజ్జనమాచరింపుచున్*
*కంకణ పాణి పల్లవ యుగంబున వక్షము మోదికొంచు నా*
*పంకరుహాక్షి యేడ్చెఁ బరిభావిత పంచమ సుస్వరంబునన్* (భాగ. 6-451)

చిత్రకేతుని భార్య అయిన కృతద్యుతి తన కొడుకు మరణించినపుడు ఏడుస్తున్న దృశ్యాన్ని వర్ణించిన పద్యమిది.

కన్నీరు కంటి కాటుకతోకలసి, కుంకుమ రాగ శోభితమైన పాలిండ్లను తడుపుచుండగా, కంకణములు మ్రోయుచుండగా చేతులతో వక్షస్థలాన్ని బాదుకొంటూ ఆమె పంచమ స్వరంలో ఏడ్చిందని వర్ణించడం సింగనగారి ఊహా శక్తికి చక్కని నిదర్శనం. కృతద్యుతి సహజస్థితిని మనోహరంగా వర్ణించడం చేత ఇది స్వభావోక్తి.

అల్లసాని వారి వరూధిని, తిమ్మనగారి సత్యభామ, రామరాజ భూషణుని గిరిక, ఏర్చూరి సింగన గారి కృతద్యుతి ఏడ్పును

అనుకరించారేమో అనిపిస్తుంది.

**5. అతిశయోక్తి**

*కూడె జగంబులన్నియును గ్రుంకిరి సూర్య సుధాంశులద్రులూ*
*టాడె నభస్థలం బగిలె నంబుధులింకె నుడుగ్రహాళి వ*
*ట్వాడె వడిం దిశల్పగిలె నుర్వర గ్రుంగె నజాండ భాండ మ*
*ల్లాడె విధాత బెగ్గడిలె నార్పుచు వృత్రుడు బొబ్బ వెట్టినన్* (భాగ. 6-384)

దేవదానవ యుద్ధం జరిగే టప్పుడు వృత్రాసురుడు కేకపెడితే లోకాలన్నీ కలిశాయి, సూర్యచంద్రులు క్రుంకిరి, ఆకాశం పగిలింది, సముద్రాలు ఇంకిపోయాయి, గ్రహరాశులు స్థితి తప్పాయి, దిక్కులు పగిలాయి, భూమి క్రుంగింది, బ్రహ్మాండము అల్లాడింది, బ్రహ్మ భయపడ్డాడు. అనే వర్ణన వృత్రుని శక్తిని అతిశయించి చెప్పినట్లుంది కావున ఇది అతిశయోక్తి.

**6. అర్థాంతరన్యాస**

*అఖిలమెఱిగిన కశ్యపునంతవాని*
*హితవు తలకెక్కు రతుల సంగతుల చేత*
*నవశుఁ గావించె వ్రేల్మిడి నబ్జవదన*
*పతుల భ్రమియింప నేరని సతులు గలరె?* (భాగ. 6-511)

నిత్యం తపమాచరించు కశ్యప ప్రజాపతిని గూడా తన భార్య దితి మోహింపజేసి హిరణ్యాక్ష, హిరణ్యకశిపులను పుత్రులుగా పొందినది. ఇది విశేషం. దీనిని భర్తలను భ్రమింపచేయనేరని భార్యలుంటారా అనే సామాన్య విషయంతో సమర్థించడం జరిగింది కావున ఇది అర్థాంతర న్యాసం.

7. దీపక

*కూలినచోటఁ గొట్టువడి కుందినచోట, మహాజ్వరాదులం*
*బ్రేలిన చోట, సర్పముఖ పీడల నందినచోట, నార్తులై*
*తూలిన చోట విష్ణు భవదూరునిఁ బేర్కొనిరేని మీఁద న*
*క్కాలునియాతనా వితతిఁ గానరు పూనరు దుఃఖభావముల్* (భాగ. 6-122)

అజామిళుడు నారాయణ నామాన్ని మరణ సమయంలో స్మరించాడు. నారాయణ నామస్మరణ ముందు యముడు కూడా తలవంచక తప్పలేదు. ఇది ప్రకృత కథా సందర్భం. నారాయణ నామ స్మరణ మహిమను ధ్రువ పరచుటకు మరికొన్ని అప్రకృత విషయాలు చెప్పబడ్డాయి. అవి కూలిన చోట, కొట్టుపడి కుందిన చోట, మహాజ్వరాలతో ప్రేలినచోట, సర్పముఖ పీడల నందినచోట కూడా నారాయణ నామ స్మరణ వలన యమ బాధలు ఎవరూ పడరు. ప్రకృతానికి అప్రకృతానికి ఏకాన్వయం చేయబడింది కావున ఇది దీపకం. ఈ దీపకం ద్వారా ఒక్క అజామిళుడి సమస్యకే కాదు నారాయణ నామ స్మరణ అనేక సమస్యలకు ఔషధం అని తెలుస్తుంది.

8. నిదర్శనం

*...... ....... ....... కృపాస్పదుని గురుని*
*మాని యన్యుని సేవింపఁ బూనునట్టి*
*కపటశీలుని నతి పాపకర్మబుద్ధి*
*శునక వాలంబు పట్టుక ఘనతరాబ్ధిఁ*
*దరియఁ జూచుట గాదె! తాఁ దామసమున* (భాగ. 6-327)

వృత్రాసురునికి భయపడి దేవతలు వైకుంఠానికి వెళ్ళి విష్ణుని ప్రార్థించే పద్యమిది.

భగవంతుని మాని అన్యుని సేవించడం కుక్కతోక పట్టుకొని సముద్రాన్ని దాటటం వంటిది. నిదర్శనంలో రెండు వాక్యాలు పరస్పరం సాపేక్షములై బింబప్రతిబింబ భావంతో ఉంటాయి. కావున ఈ పద్యములో ఉన్నది నిదర్శనం. భగంతునిపై నమ్మకం లేకుండా ఇతరుల్ని ఆశ్రయించడం వలన లక్ష్యాన్ని చేరలేక ప్రమాదంలో పడతారనడానికి ఈ పద్యం చక్కని ఉదాహరణ.

9. సహోక్తి

*అరయమాతేజములతోడ నాయుధములు*
*మ్రింగి భువనత్రయంబును మ్రింగుచున్న*
*భీకరాకారు వృత్రునిఁ బీఁచమణఁచి*
*యెల్లభంగుల మాభంగ మీఁగు మఘవ*     (భాగ. 6-341)

దేవతలు వృత్రాసురుని గూర్చి చెబుతూ అతడు దేవతల తేజాలతో పాటు ఆయుధములను మరియు త్రిభువనములను మ్రింగుచున్నాడని చెప్పబడింది. రెండుగాని అంతకంటే ఎక్కువగాని ప్రకృత విషయాలు ఏక కాలంలో జరగడం సహోక్తి. కావున ఈ పద్యంలో ఉన్నది సహోక్తి.

10. సార

*ఉర్వరఁ గల రేణువుల కన్న దట్టమై*
*కడునొప్పు జీవ సంఘములు గలవు*
*ఆ జీవములలోన నరయ ధర్మాయత*
*మతివసించిన వారు మనుజ జాతి*
*యా మనుష్యులలోనఁ గామంబు లెడబాసి*
*మోక్షార్థులగువారు మొదల నరిది*
*మోక్షమార్గంబాత్మమూలంబుగానుండు*
*వారిలో ముక్తులు లేరు తఱచు*
*ముక్తులైనట్టి వారిలో యుక్తిఁ దలఁపఁ*
*జాల దుర్లభుఁడమిత ప్రశాంతిపరుఁడు*
*పరమ సుజ్ఞాననిరతుండు భద్రగుణుఁడు*
*రమణ శ్రీవాసుదేవ పరాయణుండు*     (భాగ. 6-441)

మట్టి రేణువులకన్న జీవులు, జీవులలో మనుష్యులు, మనుష్యులలో మోక్షార్థులు, వీరందరికన్నా విష్ణుభక్తులు గొప్పవారని ఒకరికంటే ఒకరికి ఉత్కర్ష చెప్పబడింది. కావున ఇది సారాలంకారము. అందరికన్న విష్ణుభక్తుడు గొప్పవాడనేది సారాంశం.

ఇలా ఏర్చూరి సింగన గారు చక్కని అలంకారాలతో భాగవత షష్ఠస్కంధాన్ని రచించారు.

# 9

# నారయ భాగవత భాగం

# అలంకార శిల్పం

**9.0** వెలిగందుల నారయగారు శ్రీమహా భాగవతం లోని ఏకాదశ, ద్వాదశ స్కంధములను రచించారు. జ్ఞాన ప్రధానమై అతి విస్తారమై వేదవ్యాస మహర్షి సంస్కృత భాగవత ఏకాదశ, ద్వాదశ స్కంధములుండగా, అతి సంక్షిప్తంగా వెలిగందల నారయగారు గారు ఆంధ్రమున రచించిరి. ఏకాదశ స్కంధమున 125 గద్య పద్యాలను, ద్వాదశ స్కంధమున 53 గద్య పద్యాలను రచించారు. నారయ గారు ప్రయోగించిన అలంకారాల సంఖ్య అత్యల్పం ఇవి అనుశీలింపబడతాయి.

**9.1 శబ్దాలంకారాలు**

**1. వృత్త్యనుప్రాస (అంత్యప్రాస)**

*జదవన విహారీ! శత్రులోకప్రహారీ!*
*సుగుణవన విహారీ! సుందరీ మానహారీ!*
*విగత కలుషపోషీ! వీరవర్యాభిలాషీ!*
*స్వగురుహృదయ పోషీ! సర్వదా సత్యభాషీ!* (భాగ. 12-53)

శ్రీరాముని వర్ణిస్తూ భాగవతంలో చెప్పబడ్డ చివరి పద్యమిది. ఈ పద్యంలో నాలుగు వాక్యాల చివర 'రీ' అనే అక్షరం, నాలుగు వాక్యాల చివర 'షీ' అనే అక్షరాలు ఆవృతమైనాయి. అక్షరావృత్తి కాబట్టి వృత్త్యనుప్రాస వాక్యాంతమున ఆవృతమగుటచే అంత్యప్రాసగా చెప్పవచ్చు.

భగంతుని కీర్తించునపుడు అది ఒక పాటగా లయాత్మకంగా చెప్పడం శ్రవణ సుభగంగా ఉంటుంది. అంత్యప్రాస వలన ఇది పాటగా శ్రవణపేయంగా ఉంది.

**2. పదాంశావృత్తి (యమకం)**

*తరణంబులు భవజలధికి*
*హరణంబులు దురితలతల కాగమములకా*
*భరణంబు లార్తజనులకు*
*శరణంబులు నీపదాబ్జ సంస్మరణంబుల్* (భాగ. 11-15)

శ్రీహరి దివ్య శ్రీపాద స్మరణ మహిమ ఈ పద్యంలో శ్రవణపేయంగా చెప్పబడింది.

తరణంబు - హరణంబులు - ఆభరణంబులు - శరణంబులు అనే పదాలలో 'రణంబులు' అనే అక్షర గుచ్ఛం ఆవృతమైంది. కావున ఇది యమకము. ఆవృత్త అక్షరగుచ్ఛములకు అర్థం లేదు. పదాలకు మాత్రం భిన్నార్థాలు ఉన్నాయి.

**9.2 శబ్దార్థాలంకారాలు**

**1. వ్యవధాన - భిన్నార్థక - పదావృత్తి**

*ఇట్లు వర్షశతంబు వర్షశూన్యంబగును.* (భాగ. 12-24)

కలియుగ ధర్మాలను గూర్చి చెబుతూ వంద సంవత్సరాలు వర్షాలు పడవు అని చెబుతున్న సందర్భంలోనిది ఈ వాక్యం.

'వర్షం' అనే పదం భిన్నార్థకంగా వ్యవధానంతో ప్రయోగింపబడింది. 'వర్షశతంబు' అనునపుడు వందసంవత్సరాలు అని అర్థం. 'వర్షశూన్యంబు' అన్నపుడు వానలు పడవని అర్థం. ఇలా 'వర్షం' అనే పదం భిన్నార్థకంగా ప్రయోగింపబడడం ఒక విధమైన చమత్కారాభివ్యక్తీకరణ.

**9.3 అర్థాలంకారాలు**

**1. ఉపమ**

*మృణ్మయంబైన ఘటంబున జలంబులు జాలుగొను తెఱంగున దినదినంబునకు నాయువు క్షయంబై, మృత్యువు సన్నిహితంబై వచ్చు.* (భాగ. 11-109)

మట్టి కుండలోని నీళ్ళు క్రమంగా తగ్గిపోయినట్లు రోజురోజుకు ఆయువు క్షీణిస్తుంది.

వేదాంత విషయాన్ని మనము ఎప్పుడూ చూసే ఉపమానం ద్వారా సులభతరం చేసి, రమ్యంగా చెప్పడం దీనిలో చూడవచ్చు.

మాలోపమ

*ఈ పదునెనిమిది పురాణంబుల మధ్యంబున నదులయందు భాగీరథి విధంబున, దేవతల యందుఁ బద్మగర్భుని మాడ్కిఁ, దారకలందు గళానిధి గరిమ, సాగరంబులందు దుగ్ధార్ణవంబు చందనంబున, నగంబులందు హేమనగంబు భాతి ...... తేజరిల్లు అట్టి భాగవత పురాణంబు పఠియించి విష్ణుసాయుజ్యంబుఁ జెందుదురు.* (భాగ. 12-48)

శ్రీమద్భాగవత పురాణ శ్రేష్ఠత ఇక్కడ వివరింపబడింది. దీనిలో ఉపమేయం భాగవత పురాణం ఉపమానాలు చాలా చెప్పబడ్డాయి. కావున ఇది మాలోపమ.

నదులలో గంగ, దేవతలలో బ్రహ్మ, తారకలలో చంద్రుడు, సాగరాలలో క్షీరాబ్ధి, పర్వతాలలో మేరు నగం వలె .... భాగవత పురాణం తేజరిల్లుతోందట.

దీని ద్వారా అన్ని గ్రంథరాజములకన్న శ్రీకృష్ణహృదయమనదగిన భాగవతం శ్రేష్ఠతమైనదని తెలియుచున్నది.

2. రూపకం

*శ్రీనాయక నీనామం*
*నానా భవరోగ దుఃఖనాశమునకు వి*
*న్నాణంబగు నౌషధమిది*
*గానరు దుష్టాత్ములకట! కంజదళాక్షా!* (భాగ. 11-17)

భవరోగమునకు హరినామము ఔషధము అని సంసారమునకు రోగమునకు, హరినామానికీ, ఔషధానికీ అభేదం చెప్పబడింది. కావున ఇది రూపకం. అనేక పాపపుణ్యకర్మలతో అవిచ్ఛిన్నంగా సాగే సంసారాన్ని మాన్పగలది ఒక్క హరినామమే.

3. స్వభావోక్తి

*ఘనుని శ్రీకృష్ణునిఁ గౌస్తుభాభరణునిఁ*
*గర్ణకుండల యుగ్మఘనకపోలుఁ*
*బుండరీకాక్షు నంభోధరశ్యామునిఁ*
*గలిత నానారత్న ఘనకిరీటు*
*నాజానుబాహు నిరర్గళాయుధహస్తు*
*శ్రీవక్షుఁ బీతకౌశేయవాసు*
*రుక్మిణీ నయన సరోజ దివాకరు*
*బ్రహ్మాది సురసేవ్య పాదపద్ము*
*దుష్టనిగ్రహ శిష్టసంతోష కరణుఁ*
*గోటి మన్మథ లావణ్య కోమలాంగు*
*నార్త జనరక్షణైక విఖ్యాత చరితుఁ*
*గనిరి కరుణా సముద్రుని ఘనులు మునులు* (భాగ. 11-12)

నారద, వశిష్ఠ, విశ్వామిత్ర, కాశ్యపాది మహర్షులు ద్వారకా నగరానికి వెళ్ళి అక్కడ ఉన్న శ్రీకృష్ణుని దివ్యరూపాన్ని సందర్శించారు. ఆ శ్రీకృష్ణుని అందం ఉన్నది ఉన్నట్లుగా వర్ణింపబడింది కావున ఇది స్వభావోక్తి.

4. సార

*.... జీవ జాలంబులలోన ద్విపాదంబులు గల మనుష్యులు మేలు. వారలలోన నిరంతర ధ్యాన గరిష్ఠులైన యోగీంద్రు లుత్తములు.*

ప్రాణులలో మనుష్యులు, మనుష్యులలో యోగీంద్రులు ఉత్తములంటూ ఒకరికంటే ఒకరిని ఉత్కర్ష వర్ణింపబడింది కావున ఇది సారాలంకారము. అంటే మానవ జన్మకు సార్థకత ధ్యానం చేసి యోగీంద్ర పదవికి ఎదగడమే అని తెలుస్తుంది.

5. సంభావన

నరపతులు మహిమనంతను
సురగాధిపుఁడైన నొడువనోపఁడు ధాత్రిం
జిరకాల మేలి యిందే
పరువడి నణఁగుదురు వారు భ్రాంతులు నగుచున్ (భాగ. 12-6)

కలియుగంలో రాజుల దుష్కృత్యాలను వర్ణించడం ఆదిశేషునికైనా వీలుగాదు అని భావం.

రాజుల దుష్కృత్యాలు అనేకం ఉంటాయి. కాబట్టి వేయి నాల్కల ఆదిశేషునికైనా వీలుగాదనడం. అయితే ఇక్కడ వేయి నాలుకలున్న విషయం చెప్పకుండా, దాన్ని స్ఫురింప జేసే లాగా ఆది శేషుని పేర్కొనడం జరిగింది. కావునా ఇది సంభావన అలంకారం.

6. అర్థాపత్తి

*బలభిన్ముఖ్యదిశాధి నాథ వరులున్ ఫాలాక్ష బ్రహ్మాదులున్*
*జలజాతాక్ష పురందరాది సురలున్ జర్చించి నీమాయలన్*
*దెలియన్ లేరఁట నా వశంబె తెలియన్ దీనార్తి నిర్మూల! యు*
*జ్జ్వల తేజోవిభవాది సన్నుత! గదా చక్రాంబు జాద్యంకితా!* (భాగ. 12-36)

మార్కండేయుడు శ్రీమన్నారాయణుని ప్రార్థిస్తూ చెప్పిన పద్యమిది. ఇంద్రుడు, బ్రహ్మ, శివుడు వంటి వారే విష్ణువు మహా మాయను తెలుసుకోనపుడు నేనెంత? అంటాడు మార్కండేయుడు. గొప్పవ్యక్తులను పేర్కొని వారికే తెలియనపుడు చిన్నవాడిని నేనెంత? అనేభావం ఉండడం చేత ఇది అర్థాపత్తి.

భగవంతుని మహా మాయను తెలుసుకోవడం ఎవరికీ వీలు కాదని తెలుస్తుంది.

నారయ గారు చక్కని అలంకారాలతో వేదాంతవిజ్ఞాన ప్రధానమైన ఏకాదశ, ద్వాదశ స్కంధాలను చక్కగా అలంకరించారు.

'పోతనభాగవతం - అలంకార శిల్పం' అనే నా పిహెచ్.డి. సిద్ధాంత వ్యాసంలో కూలంకషంగా ఈ క్రింది అంశాలను విశ్లేషించడం జరిగింది.

1. ఈ సిద్ధాంత వ్యాస ఉపోద్ఘాతంలో పోతన గారి గూర్చి, 'పోతన భాగవతం - అలంకారాల శిల్పం' అనే అంశాన్ని తీసుకొని పరిశోధన చేయడానికి గల కారణాలు, భాగవత పరిచయం, పరిశోధనా పరిధి, పరిశోధన లక్ష్యం చర్చించడం జరిగింది.

2. భారతీయ ఆలంకారికు అలంకార గ్రంథాలు, అలంకార లక్షణాలు, ఇతర కవితా ద్రవ్యాలకు అలంకారాలకు ఉన్న సంబంధం, అలంకారాల పరిధి, అలంకారాల ప్రయోజనం, అలంకారాల ద్వారా రసనిష్పన్నమగు విధానము, భారతీయాలంకారికులు చెప్పిన అలంకారాలు, వాటి వర్గీకరణ అనే అంశాలను 'భారతీయ అలంకారదర్శనం' అనే రెండవ అధ్యాయంలో సూక్ష్మంగా వివేచించడం జరిగింది.

3. శబ్దాలంకార లక్షణ చర్చ, పరిధి ప్రయోజనాలు, అతివ్యాప్తి, అవ్యాప్తులు, వర్గీకరణ మొదలగునవి చర్చించి, శబ్దాలంకారాలను పోతన భాగవతానికి అన్వయిస్తూ పోతన ఎంత మధురంగా శబ్దాలంకారాలను తీర్చిదిద్దారో 'శబ్దాలంకార శిల్పం' అనేమూడవ అధ్యాయంలో చర్చించడమైంది.

4. శబ్దార్థ (ఉభయ) అలంకారాల లక్షణ చర్చ, పరిధి, ప్రయోజనాలు, అతివ్యాప్తి, అవ్యాప్తులు, వర్గీకరణ మొదలగునవి చర్చించి, శబ్దాలంకారాలను పోతన భాగవతానికి అన్వయిస్తూ, పోతన ఎంత రమ్యంగా శబ్దాలంకారాలను తీర్చి దిద్దారో 'శబ్దాలంకార శిల్పం' అనే నాలుగవ అధ్యాయంలో వివరించడమైనది.

5. అర్థాలంకార విపుల లక్షణ చర్చ, పరిధి, ప్రయోజనాలు, వర్గీకరణ మొదలగునవి చర్చించి అర్థాలంకారాలను పోతన భాగవతానికి అన్వయిస్తూ పోతన ఎంత మధురాతి మధురంగా అర్థాలంకారాలను భక్తిరస నిష్పన్న కారకంగా దిద్దితీర్చారో 'అలంకార శిల్పం' ఐదవ అధ్యాయంలో విశదీకరించడమైంది.

6. మిశ్రాలంకారలను పోతన భాగవతానికి అన్వయించడాన్ని 'మిశ్రాలంకార శిల్పం' అనే ఆరవ అధ్యాయంగా వ్రాయడమైంది.

7. బొప్పరాజు గంగనగారి శ్రీమహాభాగవత పంచమ స్కంధానికి శబ్ద, అర్థాలంకారాలను సమన్వయిస్తూ చేసిన సమీక్ష 'గంగన భాగవత భాగం - అలంకారశిల్పం' అనే పేరుతో ఏడవ అధ్యాయంగా పొందుపరిచాను.

8. ఏర్చూరి సింగనగారి శ్రీమహాభాగవత షష్ఠస్కంధానికి శబ్ద, శబ్దార్థ, అర్థాలంకారాలను సమన్వయిస్తూ చేసిన పరిశీలన 'సింగన భాగవతభాగం - అలంకారశిల్పం' అనే పేరుతో ఎనిమిదవ అధ్యాయంగా పొందుపరిచాను.

9. వెలిగందుల నారయ గారి శ్రీమహాభాగవత ఏకాదశ, ద్వాదశ స్కంధాలకు శబ్ద, శబ్దార్థ అర్థాలంకారాలను అన్వయిస్తూ చేసిన అనుశీలన 'నారయ భాగవత భాగం - అలంకారశిల్పం' అనే పేరుతో తొమ్మిదవ అధ్యాయంగా పొందుపరిచాను.

'నభూతో నభవిష్యతి' అన్నట్లుగా మోక్ష్యం లక్ష్యంగా భక్తి మార్గంగా రచించారు పోతనగారు.

ఈ విధంగా శతాబ్దాలు గడిచినా వన్నె తగ్గకుండా, ఆంధ్రులను భక్తి రసామృత వాహినిలో ముంచెత్తుతుంది పోతన గారి కవితాశ్రీ.

# సింహావలోకనం

'పోతనభాగవతం - అలంకార శిల్పం' అనే నా పిహెచ్.డి. సిద్ధాంత వ్యాసంలో కూలంకషంగా ఈ క్రింది అంశాలను విశ్లేషించడం జరిగింది.

1. ఈ సిద్ధాంత వ్యాస ఉపోద్ఘాతంలో పోతన గారి గూర్చి, 'పోతన భాగవతం - అలంకారాల శిల్పం' అనే అంశాన్ని తీసుకొని పరిశోధన చేయడానికి గల కారణాలు, భాగవత పరిచయం, పరిశోధనా పరిధి, పరిశోధన లక్ష్యం చర్చించడం జరిగింది.

2. భారతీయ ఆలంకారికు అలంకార గ్రంథాలు, అలంకార లక్షణాలు, ఇతర కవితా ద్రవ్యాలకు అలంకారాలకు ఉన్న సంబంధం, అలంకారాల పరిధి, అలంకారాల ప్రయోజనం, అలంకారాల ద్వారా రసనిష్పన్నమగు విధానము, భారతీయాలంకారికులు చెప్పిన అలంకారాలు, వాటి వర్గీకరణ అనే అంశాలను 'భారతీయ అలంకారదర్శనం' అనే రెండవ అధ్యాయంలో సూక్ష్మంగా వివేచించడం జరిగింది.

3. శబ్దాలంకార లక్షణ చర్చ, పరిధి ప్రయోజనాలు, అతివ్యాప్తి, అవ్యాప్తులు, వర్గీకరణ మొదలగునవి చర్చించి, శబ్దాలంకారాలను పోతన భాగవతానికి అన్వయిస్తూ పోతన ఎంత మధురంగా శబ్దాలంకారాలను తీర్చిదిద్దారో 'శబ్దాలంకార శిల్పం' అనేమూడవ అధ్యాయంలో చర్చించడమైంది.

4. శబ్దార్థ (ఉభయ) అలంకారాల లక్షణ చర్చ, పరిధి, ప్రయోజనాలు, అతివ్యాప్తి, అవ్యాప్తులు, వర్గీకరణ మొదలగునవి చర్చించి, శబ్దాలంకారాలను పోతన భాగవతానికి అన్వయిస్తూ, పోతన ఎంత రమ్యంగా శబ్దాలంకారాలను తీర్చి దిద్దారో 'శబ్దాలంకార శిల్పం' అనే నాలుగవ అధ్యాయంలో వివరించడమైనది.

5. అర్థాలంకార విపుల లక్షణ చర్చ, పరిధి, ప్రయోజనాలు, వర్గీకరణ మొదలగునవి చర్చించి అర్థాలంకారాలను పోతన భాగవతానికి అన్వయిస్తూ పోతన ఎంత మధురాతి మధురంగా అర్థాలంకారాలను భక్తిరస నిష్పన్న కారకంగా దిద్దితీర్చారో 'అలంకార శిల్పం' ఐదవ అధ్యాయంలో విశదీకరించడమైంది.

6. మిశ్రాలంకారలను పోతన భాగవతానికి అన్వయించడాన్ని 'మిశ్రాలంకార శిల్పం' అనే ఆరవ అధ్యాయంగా వ్రాయడమైంది.

7. బొప్పరాజు గంగనగారి శ్రీమహాభాగవత పంచమ స్కంధానికి శబ్ద, అర్థాలంకారాలను సమన్వయిస్తూ చేసిన సమీక్ష 'గంగన భాగవత భాగం - అలంకారశిల్పం' అనే పేరుతో ఏడవ అధ్యాయంగా పొందుపరిచాను.

8. ఏర్చూరి సింగనగారి శ్రీమహాభాగవత షష్ఠస్కంధానికి శబ్ద, శబ్దార్థ, అర్థాలంకారాలను సమన్వయిస్తూ చేసిన పరిశీలన 'సింగన భాగవతభాగం - అలంకారశిల్పం' అనే పేరుతో ఎనిమిదవ అధ్యాయంగా పొందుపరిచాను.

9. వెలిగందుల నారయ గారి శ్రీమహాభాగవత ఏకాదశ, ద్వాదశ స్కంధాలకు శబ్ద, శబ్దార్థ అర్థాలంకారాలను అన్వయిస్తూ చేసిన అనుశీలన 'నారయ భాగవత భాగం - అలంకారశిల్పం' అనే పేరుతో తొమ్మిదవ అధ్యాయంగా పొందుపరిచాను.

'నభూతో నభవిష్యతి' అన్నట్లుగా మోక్ష్యం లక్ష్యంగా భక్తి మార్గంగా రచించారు పోతనగారు.

ఈ విధంగా శతాబ్దాలు గడిచినా వన్నె తగ్గకుండా, ఆంధ్రులను భక్తి రసామృత వాహినిలో ముంచెత్తుతుంది పోతన గారి కవితాశ్రీ.

# ఉపయుక్త గ్రంథసూచి

1. కరుణశ్రీ (సం.) 1983. **భాగవత వైజయంతిక.** (వ్యాససంకలనం). హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

2. కుంతకుడు. 1977. **వక్రోక్తిజీవితము.** (వ్యా. పుల్లెల శ్రీరామచంద్రుడు). న్యూఢిల్లీ: సాహిత్య అకాడెమి.

3. క్షేమేంద్రుడు 1983. **ఔచిత్య విచార చర్చా.** (వ్యా. పుల్లెల శ్రీరామచంద్రుడు). హైదరాబాదు: సురభారతీ సమితి.

4. గణపతిశాస్త్రి, చర్ల. 1972. **సాహిత్య సౌందర్య దర్శనము.** హైదరాబాదు: రచయిత.

5. జగన్నాథ పండితుడు. 1973. **ఆంధ్రరసగంగాధరము.** (ఆంధ్రానువాదము, వేదాల తిరువెంగళాచార్యులు). హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

6. జయకృష్ణ బాపూజీ, జంధ్యాల. 1977. **శ్రీనాథుని సాహిత్య ప్రస్థానము.** గుంటూరు: రచయిత.

7. జయదేవుడు. 1994. **చంద్రాలోక సముస్మేషము.** (వ్యా. స్ఫూర్తిశ్రీ). గుంటూరు: వ్యాఖ్యాత. (ఆరవ ముద్రణ)

8. జయరామశాస్త్రి, చెదలువాడ. (వ్యాఖ్యాత). 1971. **శ్రీమద్భాగవతము.** నెల్లూరు: వ్యాఖ్యాత.

9. దండి. 1981. **కావ్యాదర్శః.** (వ్యా. పుల్లెల శ్రీరామచంద్రుడు). హైదరాబాదు : ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

10. నరసింహరావు, ఎస్.ఎల్. 1981. **ఆంధ్రమహాభారతము అలంకార సమీక్ష.** హిందూపురం: రచయిత.

11. నరేశ్ బాబు, దోనెపూడి. 1998. **తిక్కన భారతంలో ఉపమ.** హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయం. పిహెచ్.డి. సిద్ధాంత వ్యాసం. (అముద్రితం)

12. నాగయ్య, జి. 1999. **తెలుగు సాహిత్య సమీక్ష.** (మొదటి సంపుటం). తిరుపతి: నవ్యపరిశోధక ప్రచురణలు. (తృతీయ ముద్రణ). (ప్రథమ ముద్రణ. 1983)

13. నారాయణరెడ్డి, సి. 1973. **మందార మకరందాలు.** సికిందరాబాదు: యువభారతి.

14. పెద్దయ, విన్నకోట. 1972. **కావ్యాలంకార చూడామణి.** మదరాసు: వేదము వేంకటరాయశాస్త్రి అండ్ బ్రదర్స్. ఏడవ ముద్రణ. (ప్రథమ ముద్రణ. 1892).

15. భరతుడు. 1983. **నాట్యశాస్త్రము.** (వ్యా. పోణంగి శ్రీరామ అప్పారావు.) హైదరాబాదు: నాట్యమాలా ప్రచురణము.

16. భామహుడు. 1979. **కావ్యాలఙ్కారః.** (వ్యా. పుల్లెల శ్రీరామచంద్రుడు). హైదరాబాదు: సురభారతీ సమితి.

17. భోజుడు. 1982. **సరస్వతీ కంఠాభరణం.** (ప్రథమ సంపుటి.) (వ్యా. స్ఫూర్తిశ్రీ). హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

18. ............ 1984.**సరస్వతీ కంఠాభరణము.**(ద్వితీయ సంపుటి). (వ్యా. స్ఫూర్తిశ్రీ) హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

19. మందేశ్వరరావు, వడలి. 1993. **సాహిత్య తత్త్వవివేచన.** హైదరాబాదు: రచయిత.

20. మమ్మటుడు. 1995. **కావ్యప్రకాశము.** (వ్యా. పుల్లెల శ్రీరామచంద్రుడు). హైదరాబాదు: సంస్కృతభాషా ప్రచార సమితి.

21. రామకృష్ణమాచార్య, నండూరి. 1991. **కావ్యాలోకము.** హైదరాబాదు: తెలుగు అకాడమి. ద్వితీయముద్రణ. (ప్రథమ ముద్రణ. 1972).

22. రామకోటి శాస్త్రి, కే.వి. 1987. **పోతన్నగారి వైచిత్రి.** విజయవాడ: గంగాధర పబ్లికేషన్స్.

23. రామరాజభూషణుడు. 1976. **కావ్యాలంకార సంగ్రహము.** (నరసభూపాలీయము). (వ్యా. సన్నిధానం సూర్యనారాయణశాస్త్రి). మచిలీపట్నం, మద్రాసు, సికింద్రాబాదు: ఎమ్. శేషాచలం అండ్ కంపెనీ. 5వ ముద్రణ. (ప్రథమ ముద్రణ. 1945).

24. రుక్మిణి, బి. 1984.**నన్నయ భారతములో ఉపమ.** హైదరాబాదు: రచయిత్రి.

25. వామనుడు. 1981. **కావ్యాలంకార సూత్రాణి.** (వ్యా. పుల్లెల శ్రీరామచంద్రుడు). హైదరాబాదు: వ్యాఖ్యాత.

26. విద్యాధరుడు. 1974. **ఏకావలి.** (వ్యా. జమ్ముల మడక మాధవరామశర్మ). గుంటూరు: అభినవ భారతి.

27. విద్యానాథుడు. 1972.**ఆంధ్రప్రతాపరుద్రయశోభూషణము** (ఆంధ్రానువాదము, చెలమచర్ల రంగాచార్యులు). హైదరాబాదు: శ్రీనివాస పబ్లికేషన్స్. చతుర్థ ముద్రణ. (ప్రథమ ముద్రణ. 1944).

28. విష్ణుధర్మోత్తర పురాణకర్త 1988. **విష్ణుధర్మోత్తర పురాణము.** (అనువాదకులు. 1. కల్లూరి వేంకట సుబ్రమణ్యదీక్షితులు. 2. దేవరకొండ శేషగిరిరావు). హైదరాబాదు: శ్రీవేంకటేశ్వర ఆర్షభారత ట్రస్ట్.

29. వెంకటరామిరెడ్డి, అట్లా. 1981. **నన్నయ అలంకార శిల్పము.** హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయం. ఎం.ఫిల్. సిద్ధాంత వ్యాసం (అముద్రితం).

30. ............................ 1986. **ఆంధ్ర ప్రబంధయుగము అలంకార ప్రస్థాన ప్రయోగము.** హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయం. పిహెచ్.డి. సిద్ధాంత వ్యాసం (అముద్రితం).

31. వేంకటశాస్త్రి, చెళ్ళపిళ్ళ. 1983. 'బమ్మెర పోతన్నగారు'. **భాగవత వైజయంతిక.** (వ్యాస సంకలనం). (సం. కరుశ్రీ). హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

32. వేంకటావధాని, దివాకర్ల. 1992. **సాహిత్య సోపానములు.** హైదరాబాదు: ఆంధ్రసారస్వత పరిషత్తు. ఎనిమిదవ ముద్రణ. (ప్రథమ ముద్రణ. 1966)

33. శ్రీరామమూర్తి, కొర్లపాటి. 1984. 'ఆంధ్రభాగవతావతరణము-చారిత్రక నేపథ్యం.' **పోతన సాహిత్య గోష్ఠి.** (వ్యాస సంకలనం). (సం. కొర్లపాటి, శ్రీరామమూర్తి). విశాఖపట్నం: ఆంధ్రాయూనివర్సిటీ.

34. సంపత్కుమారాచార్య, కోవెల. 1982. 'పోతనగారి కావ్య భావన.' **మహాకవి పోతన.** (వ్యాససంకలనం). (సం. అమరేశం రాజేశ్వర శర్మ, కోవెల సంపత్కుమారాచార్య). హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌరసంబంధశాఖ.

35. సుబ్రమణ్యము, జి.వి. 1973.**ప్రథమాంధ్ర మహాపురాణము, ప్రబంధకథా మూలము.** హైదరాబాదు: శ్రీవాణీ ప్రచురణము.

## పత్రికలు

1. ***భారతి*** మాస పత్రిక. (జనవరి - ఫిబ్రవరి) 1989.

## నిఘంటువులు

1. ***శ్రీసూర్యరాయాంధ్ర నిఘంటువు.*** (ఆరవ సంపుటం) 1988. హైదరాబాదు: తెలుగు విశ్వవిద్యాలయము. తృతీయ ముద్రణ

2. ***బ్రహ్మమిత్ర అవస్థీ.*** 1989. అలంకార కోష్. దిల్లీ: ఇందూ ప్రకాశన్.

3. ***సాహిత్య పదకోశము.*** (అలంకార విభాగం) 1978. హైదరాబాదు: తెలుగు అకాడమి.